# శ్రీ విష్ణు సహస్రనామము

( ప్రథమ భాగము 1-100 నామ వివరణ )




మాస్టర్ కె. పార్వతికుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్రీ విష్ణు సహస్రనామము

( ప్రథమ భాగము 1-100 నామ వివరణ )




## మాస్టర్ పార్వతీకుమార్



ధనిష్ఠ

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపంలో, 1992 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణములో ప్రారంభించారు. ఇది కొన్ని సంవత్సరాలు కొనసాగింది. ఆ ప్రవచనములలో వారు విశదపరచిన విషయములు అమూల్యములు, సాధకునిగా మన జీవితములలో ఆచరించవలసిన సూచనలు కోకొల్లలు.

వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో లేని వివరణలను సేకరించే ప్రయత్నము ఒక ప్రక్క కొనసాగిస్తూ, అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపం లో అందజేయాలన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించడము జరిగింది. వారు ముందుగా మన మాస పత్రిక 'నా వాణి' లో నామాల వివరణ ప్రచురించమనగా, అది శుభకృత్ ఉగాది సంచికతో ముద్రణ రూపం దాల్చుట మొదలైనది. అది ఒక ప్రక్క కొనసాగుతుండగా, అందుబాటులో ఉన్న నామాలన్నింటిని 11 భాగాలుగా e-Book రూపంలో అందజేద్దామన్న ఉద్దేశ్యాన్ని కూడా వారికి తెలియపరచడం జరిగింది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Book రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకొని రావటము జరుగుతున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ ప్రథమ భాగము .

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు యథాతథంగా, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు.

ఈ ప్రయత్నంలో పాల్గొంటున్న వారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్నవారందరికి మాస్టరుగారి ఆశీస్సులు బాగా అందాలని మాస్టరు గారికి మా ప్రార్థన.

ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై ఆనందము కలగజేయగలవని, గురుదేవుల సాన్నిధ్యములో ఉంచగలవని మా నమ్మకము.

శ్రీ శోభకృత్ గురుపూర్ణిమకు శ్రీ విష్ణు సహస్రనామ వివరణ ప్రథమ భాగము- 1 నుండి 100 నామాలకు శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ట

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకొనేటపుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకొంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము లేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకొనేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళి తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధనగా లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన

తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు నేత్రములు, శ్రవణేంద్రియములు, ఘ్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్ఠాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకొనేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు చూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, ఆదిశేషువు వెనకాల పడగ పట్టి వుంటే, చతుర్భుజుడై, ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలిసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 108 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది, కొత్త అభ్యాసంగా మొదలు పెట్టాలి. ఏదైనా అభ్యాసం వలన మాత్రమే వశమవుతుంది కాబట్టి అభ్యాసవశమున మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు.

సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. "సహస్ర" అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూటిని వ్యాపించినది ఒకే ఒక తత్వము- 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే

ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో,( Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్ని భగవంతుని కీర్తించడమే! భగవంతుడిని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏది లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది. అది తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి

వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు . అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా ' స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్త్వానికి సంబంధించినదనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోటం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలాసమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు

చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం ౨౦ నిముషాలు పడుతుంది. ౨౦ నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే ౨౦ నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకం లో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ

ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని "విశ్వం విష్ణుర్వషట్కారో" అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, "విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు" అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్ర నామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకం లో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం

మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా  సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction కింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటి? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా  కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పొరపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకొనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ fresh గా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకం లో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం  అంటే. వైకుంఠం

అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పుకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పుకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరం గా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పుకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పుకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పుకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పుకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు

రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం, అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచి రోజు వచ్చినప్పుడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచి రోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారం గా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశృతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశృతి ఉన్నది. అందులో

భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

కంభంపాటి పార్వతి కుమార్

# విషయ సూచిక


1. విశ్వం ..................... 5

2. విష్ణుః ..................... 20

3. వషట్కారః ..................... 29

4. భూత భవ్య భవత్ ..................... 39

5. ప్రభుః ..................... 50

6. భూతకృత్ ..................... 57

7. భూతభృత్ భావః ..................... 63

8. భూతాత్మా. ..................... 66

9. భూతభావనః ..................... 76

10, 11- పూతాత్మా, పరమాత్మా చ ..................... 77

12. ముక్తానాం పరమాగతిః ..................... 95

13. అవ్యయః ..................... 102

14. పురుషః ..................... 110

15. సాక్షి ..................... 114

16. క్షేత్రజ్ఞః ..................... 119

17, 18 అక్షర, ఏవ చ ..................... 123

19. యోగః ..................... 127

20. యోగవిదాం నేత ..................... 135

21. ప్రధానః ..................... 136

22. పురుషేశ్వరః.......................................................141

23. నారసింహావపుః...................................................144

24. శ్రీమాన్...............................................................163

25. కేశవః ...............................................................175

26. పురుషోత్తమః ......................................................180

27. సర్వః...................................................................188

28. శర్వః...................................................................198

29, 30. శివః, స్థాణుః................................................ 202

31. భూతాదిః ............................................................ 204

32. నిధిః ................................................................211

33. అవ్యయః ............................................................214

34, 35, 36, 37, 38. సంభవః, భావనః, భర్తా, ప్రభవ, ప్రభు............216

39. ఈశ్వరః ............................................................. 228

40. స్వయంభూః.........................................................242

41. శంభు:...............................................................251

42. ఆదిత్య: ............................................................. 265

43. పుష్కరాక్షః........................................................... 282

44. మహాస్వనః .......................................................... 287

45. అనాది నిధనః ......................................................307

46, 47. ధాత, విధాత ...............................................312

48. ధాతుః+ఉత్తమః ...................................................315

49. అప్రమేయః ....................................................................316
50, 51. హృషీకేశః, పద్మనాభః ........................................................ 326
52. అమరప్రభుః ....................................................................330
53. విశ్వకర్మ ....................................................................333
54. మనుః ....................................................................335
55. త్వష్ట.................................................................... 345
56. స్థవిష్ఠ .................................................................... 349
57. స్థవిరః....................................................................350
58. ధ్రువః....................................................................351
59. అగ్రాహ్యః 60. శాశ్వతః ....................................................................367
61, 62, 63 కృష్ణః, లోహితాక్షః, 63. ప్రతర్దనః....................................368
64. ప్రభూతః....................................................................369
65. త్రికకుత్....................................................................376
66. ధామ ....................................................................386
67. పవిత్రమ్....................................................................387
68, 69, 70. మంగళం, పరమ్, ఈశానః....................................388
71, 72, 73, 74. ప్రాణదః, ప్రాణః, జ్యేష్ఠః, శ్రేష్ఠః ....................................389
75, 76, 77.ప్రజాపతిః, హిరణ్యగర్భః, భూగర్భః....................................390
78, 79. మాధవః, మధుసూదనః ....................................................................391
80. ఈశ్వరః .................................................................... 392
81. విక్రమి....................................................................397

82. ధన్వీ ........ 404
83. మేధావి ........ 413
84. విక్రమః ........ 419
85. క్రమః ........ 426
86. అనుత్తమః ........ 432
87. దురాధర్షః ........ 445
88, 89, 90. కృతజ్ఞ్య, కృతిః, ఆత్మవాన్ ........ 446
91. సురేశః ........ 447
92. శరణం ........ 448
93. శర్మ ........ 450
94. విశ్వరేతః ........ 455
95. ప్రజాభవః ........ 456
96. అహః ........ 457
97. సంవత్సరః ........ 458
98. వ్యాలః ........ 459
99, 100. ప్రత్యయః, సర్వదర్శనః ........ 460

# 1. విశ్వం

విష్ణు సహస్రనామంలో భగవంతుని మొదటి నామము 'విశ్వము'! విశ్వం విష్ణుః; 'విశ్వం'అనేది ఒక నామం. 'విష్ణుః' అనేది ఇంకో నామం. 'విశ్వం' అంటే ఈ మొత్తం సృష్టి. నీవు సృష్టిని దైవము యొక్క రూపంగా చూడాలి. సృష్టిని దైవము యొక్క రూపముగా చూడని వాడు ఎవ్వడూ ఈ సృష్టిని దాటి పోలేడు, సృష్టి మాయలో పడిపోతాడు. ఇది మొట్టమొదటి తాళం చెవి. ఇది దొరికిన వాడికి అన్నీ దొరికినట్టే! నామాలలో తలమానికమైన నామంతో భీష్ముడు స్తోత్రం చేసాడు శ్రీకృష్ణుడ్ని! ఎందుకంటే అంతటా నిండి ఉన్న ప్రజ్ఞ, అందరి యందు ఉన్న ప్రజ్ఞ, మళ్ళీ తనకు తానుగా ఒక రూపం కట్టుకొని వచ్చింది. అలా వచ్చిన ఏకైక సన్నివేశమే కృష్ణావతారం, పూర్ణావతారం, అందుకనే దశావతారాలలో శ్రీకృష్ణుడిని చెప్పరు.

"మత్స్య కూర్మ వరాహస్య నారసింహస్య వామనః
రామో రామస్య రామస్య బుద్ధ కల్కి ఏవచ"

అని చెప్తారు 10 అవతారాలను. కృష్ణుడు లేడు అందులో. ఎందుకంటే కృష్ణుడు అవతారం కాదు, 'అదే'! అవతారం అంటే అందులోంచి దిగి వచ్చేది. రాముడంతటివాడు అందులో అర్ధ రూపాయి. మిగతా అర్ధ రూపాయిలో ఒక పావలా భరతుడు, ఓ బేడ లక్ష్మణుడు, ఓ బేడ శత్రుఘ్నుడు అలా వచ్చారు. కలిపితే ముగ్గురన్నదమ్ములు ఒక అర్ధ రూపాయి, ఆయన ఒక అర్ధ రూపాయి, అన్నీ కలిపితే రూపాయి. ఆ మొత్తం రూపాయి కలిపితే కృష్ణుడు అవుతాడు. కృష్ణుడు అలా దిగి వచ్చిన వాడు. "సమస్తము వ్యాపించిన వాడు రూపము కూడా తీసుకు వచ్చాడు" అని తెలిసిన బహు కొద్దిమందిలో భీష్ముడు ఒకడు. మహాయోగి, మహాజ్ఞాని, మహావిరాగి, సత్య పరాక్రముడు, దైవ శక్తి సంపన్నుడు, అస్త్ర సంపన్నుడు. అటువంటి భీష్ముడు విష్ణు 'సహస్రనామం చేసుకో' అని ధర్మరాజుకి చెప్తాడు. సకల శుభాలకి అదే మూల కారణం అని చెప్తాడు. ఆ విష్ణువు ఎవరో కాదూ, మన మధ్య మనతో మెసలుతూ ఉంటె మనం గుర్తించలేకపోతున్నాం, అని చెప్తాడు. అది అంతకు ముందే రాజసూయంలో చెప్తాడు. అందరూ కలసి పరిపూర్ణమైన మానవునిగా అగ్రపూజ భీష్ముడికి చేయాలని నిర్ణయించుకుంటే, భీష్ముడు నవ్వి

"నేను కాను ఇక్కడ అగ్రజుడిని. ఇక్కడ అందరికంటే గొప్పవాడూ అక్కడ కూర్చున్న వాడు" అని చూపిస్తాడు. "ఎవరిచేతా గుర్తింపబడక, గుర్తింపు పొందాలన్న ఆసక్తి లేక, గుర్తించే వారిని కూడా భ్రమలో పడేసే ఒక దివ్యమైన లీలమానుష మూర్తి అక్కడ ఉన్నాడు, అతడే భగవంతుడు! మన యందు మెలుగుతున్నాడు, అతడికి చేయండి" అని భీష్ముడు చెప్తేనే కదా ధర్మరాజంతటివాడు అగ్రపూజ చేసాడు శ్రీకృష్ణుడికి. ధర్మరాజుకి కూడా తెలీదు. భీష్ముడికి తెలుసు, మైత్రేయుడికి తెలుసు, వేదవ్యాసుడికి నారదుడు చెప్పటం వలన చిట్ట చివరికి తెలిసింది. తెలిసిన వాళ్ళు చాల తక్కువ. దిగివస్తే తెలుసుకోగలిగిన వాళ్ళు చాల తక్కువ మంది ఉంటారు. పండితులు ఎప్పటికీ తెలుసుకోలేరు. ఋషులు, యోగులు, సిద్ధులే మోసపోయారు శ్రీకృష్ణుడి విషయములో. ఎవరికైనా వారివారి అంతఃకరణ శుద్ధి, దాని నిర్మల తేజో తత్త్వమున బట్టి తెలియాలి తప్ప మిగతా వారికి తెలీదు. దాన్ని బట్టి భీష్ముడు ఎంతటి వాడో మనకి తెలియాలి. దైవమును చూడగలిగనవాడు, గుర్తించ గలిగినవాడు, దైవము అనుగ్రహము పరిపూర్ణముగా కలిగిన వాడు భీష్ముడు. ఎందుచేతనంటే శ్రీకృష్ణుడు నేను ఆయుధం పట్టనంటే, భీష్ముడు నేను పట్టిస్తానంటాడు. భీష్ముడు ఆయుధాన్ని పట్టిస్తానన్నాడయ్యా అంటే, నవ్వుతాడు కృష్ణుడు. ఆయుధం పడతాడు కూడానూ! ఇది కేవలం భీష్ముడు విషయం లోనే! ఎందుకలా పడతాడు? తన భక్తుడి మాట చెల్లాలి. అది భగవంతుడికి భక్తుని మీదున్న అపారమైన ప్రేమ. భక్తుడి నోట ఒక మాట వస్తే దాన్ని నిర్వర్తించడానికి భగవంతుడు ఏమైనా చేస్తాడు. ఆయనతో యుద్ధంలో నేను ఆయుధం పట్టిస్తాను చూడు అని అంటే, భీష్ముడు అన్నాడు కాబట్టి, అతడు భీష్ముడు కాబట్టి అతడి కోసం ఆయుధం పట్టాడు. ఆయుధం పట్టి అతడి మాటే నెగ్గేట్టు చేసాడు. అలా ఎవరు చేయగలరు? దైవము ఒక్కడే చేయగలడు. ఎవరి విషయములో చేస్తాడు? భక్తుల విషయములో చేస్తాడు. అటువంటి భీష్ముడి దగ్గరకు ధర్మరాజుని శ్రీకృష్ణుడు తీసుకువచ్చి " ఆయన వెళ్ళిపోతున్నాడయ్యా! మీకెవ్వరికి తెలీదు ఆయన గురించి, ఆయనలో లేనిది లేదు. సమస్తము ఆయనకి తెలిసి ఉన్నది. అటువంటి మహాజ్ఞాని వెళ్ళిపోతే ఎలా? అన్నీ తెలుసుకో, భూమికి ఇలాంటి వెలుగు మళ్ళీ మళ్ళీ రాదు." అని చెప్తాడు. ధర్మరాజు భీష్ముని తెలిజేయమని అడుగుతాడు. "నీ పక్కన ఉన్న ఆయనకి తెలియనిది ఏమి లేదు, ఆయన ఎదో ఒక లీలగా మీ అందరినీ నా దగ్గరకి తీసుకు వచ్చాడు. నన్ను, నా యొక్క వైభవము అందరికి తెలియాలని నన్ను పెద్దవాడిని చేయాలనీ"

అంటాడు. ఎప్పుడూ భక్తుడ్ని పెద్దవాడిని చేయాలని భగవంతుడు తాపత్రయ పడుతుంటాడుట. వాడు చిన్నవాడిగా ఉండిపోతే భగవంతుడికి ఇష్టం ఉండదుట. అందుచేత సద్భక్తుడ్ని భగవంతుడే సంఘంలో పెద్దవాడిని చేస్తాడట. తానుగా పెద్దవాడైపోదాము అనుకొనే వాడు చిన్నవాడైపోతాడు. నీవు భగవంతుని భక్తుడిగా, పరిపూర్ణముగా, త్రికరణశుద్ధిగా, ఆత్మపరంగా, బుద్ధిబలంగా, మనోబలంగా అయన యందే జీవిస్తూ ఉంటె నీకు ఎటువంటి వైభవం కలగాలో దైవమె చూసుకుంటాడు. భీష్ముడు విషయములో శ్రీకృష్ణుడు ఆ విధముగా చేస్తాడు. భీష్ముడు అంటాడు "శ్రీకృష్ణుడి దగ్గర తెలియనిది ఏముంది? నా దగ్గర నీవు తెలుసుకోవలసినది ఏముందంటాడు". 'అలా కాదు ఆయనే నీ దగ్గరకి తీసుకు వచ్చాడు. నిన్ను అడిగి తెలుసుకోమన్నాడు', అని చెప్తాడు. భీష్ముడు శ్రీకృష్ణుడి వైపు చూస్తాడు. చూస్తే కృష్ణుడు నవ్వుతాడు. "నేనేమి చెప్తాను నాకు ఎక్కడా ఈషన్ మాత్రం, అంటే వెంట్రుకు వాసి తేడా లేకుండా అన్ని బాణాలు గుచ్చుకుపోయి, రక్తం కారుతూ, తేజోవిహీనమై, బుద్ధి చలిస్తూ, నీ అనుజ్ఞ కోసం వేచి ఉన్నవాడిని నాకు ఇంత పెద్ద కార్య భారం పెట్టావా" అంటాడు కృష్ణుడుతో భీష్ముడు. అసలు భీష్ముడి దగ్గరకి ఎట్లా తీసుకు వస్తాడు ధర్మరాజుని, మిగిలిన పాండవులనీ? ధర్మరాజు పట్టాభిషిక్తుడై కూర్చుని, ఆ పరవశంలో పడిఉండి, ఒక రోజు పొద్దున్నే కృష్ణుడ్ని దర్శించుకోడానికి కృష్ణుడికి కేటాయించిన అంతఃపురానికి వస్తే, శ్రీకృష్ణుడు ధ్యానంలో ఉంటాడు. చాల తీవ్రమైన ధ్యానంలో ఉంటాడు. ధర్మరాజు వచ్చినా పట్టించుకోడు. చాలా తీవ్రమైన నిష్టతో, ఎక్కడో ఉన్నట్టుగా ఉంటాడు. తర్వాత ధర్మరాజు "ఏంటి నువ్వు ఎందుకలా ఉన్నావు? కారణమేమిటి? నీ మొహం చూస్తే నాకే భయం వేసేటట్టుగా ఉంది." అని అడుగుతాడు. "ఈ భూమి మీదకి ఒక పెద్ద వెలుగు దిగి వచ్చింది, ఆ వెలుగు నిష్క్రమించడానికి నా అనుమతి కోరుతోంది. మీ అందరు మీ విజయ సంబరాల్లో పడిపోయి ఒక మహాత్ముడిని మర్చిపోయారు. అతను ఆ యుద్ధ భూమిలో ఇంకా ప్రాణాలతో ఉన్నాడు. ఉత్తరాయణం రావాలి, వచ్చింది. స్వచ్చంద మరణం వరంగా పొందినవాడు. వెళ్ళడానికి నా అనుమతి కోరుతున్నాడు. అందుకని అతని గూర్చి నేను తాపత్రయ పడుతున్నాను" అని శ్రీకృష్ణుడు చెప్తే, ధర్మరాజుకి ఒక చురక పెట్టినట్లు అవుతుంది. మనకి ఏముందీ, కష్టాల్లో ఉన్నప్పుడు దైవం, కష్టం లేకపోతె మనమే అంతా కదా! కాబట్టి ధర్మరాజుకి భీష్ముడు ఇక్కడ అంపశయ్య మీద పడుకొని, కొన ఊపిరితో ఉన్నాడు అనే భావన

మరచేపోయాడు. అంత తాతనీ మర్చిపోయాడు ఇంత ధర్మరాజూనూ. భగవంతుడికి అలా మరపు ఉండదు కదా. అందుచేత తీసుకు వెళ్తాడు. భారతం ఒక సారి చదువుకుంటే మనకి స్ఫూర్తి కలుగుతుంది. మనం మనసు కలిగి సరాసరి బుద్ధి లోకాలలోకి వెళ్తాము భారతం చదువుకుంటే. భాగవతం చదువుకున్నా, రామాయణం చదువుకున్నా అంతే! ఎప్పటికైనా అవే గతి! ఎందుకంటే మనసు కరగాలంటే ఈ గ్రంధాలే! అందులో ఉండే కరుణా రసము ఎంత కాఠిన్యమైన మనసు గలిగినవాడినైనా సరే కరిగించి వేయగలదు. ఆ విధంగా భీష్ముడు దగ్గరకి చేరిన పాండవాదులకు కృష్ణుడు భీష్మడ్ని చూపిస్తూ ఉంటె, భీష్ముడు కృష్ణుడ్ని చూపిస్తూ ఉంటాడు. భగవంతునకు భక్తునకు అది ఒక విచిత్రమైన అనుబంధం. అపుడు కృష్ణుడు నవ్వుతూ "నీకు తేజస్సు లేకపోటం ఏమిటి? ఉన్నది. నువ్వు వీర్యవంతుడివి కాకపోటం ఏంటి? నా తేజస్సు అంత నీదే, నా వీర్యమంతా నీదే, నా బుద్ధి నీదే. నేనే నువ్వుగా, నువ్వే నేనుగా నిండి ఉన్నాం కాబట్టి నువ్వు చెప్పు వాళ్ళు వింటారు, నువ్వు చెప్తేనే బావుంటుంది" అంటాడు. నేను మొన్న చెప్పానొకడికి, అతడు అప్పుడే మర్చిపోయాడు. ( యుద్ధం ముందు అర్జునుడికి మొత్తం అంతా చెప్తాడు కదా) అంటాడు. భీష్ముడికి సంఘంలో స్థితిగతులున్నాయి. కృష్ణుడు ఏర్పాటు చేసుకోలేదు స్థితిగతులు. అవి అక్కర్లేదనుకున్నాడు. ఎందుకంటే అవి ఉంటె ఇబ్బంది. భగవంతుడికి భక్తుడు నోటిలోంచి ఏమైనా వస్తే సరదా. నలకూబర, మణిగ్రీవ అనే కుబేరుని కొడుకులు ధన సంపన్నులై, మదమత్తులై సూక్ష్మ లోకాలలో వికారంగా ప్రవర్తిస్తూ ఉంటె, నారదుడు చూస్తాడు. ఇదేవిఁటి ఇంత కుబేరుడి కొడుకులూ, వీళ్ళు యేవిఁటి భ్రష్టు పట్టిపోయారు. వీరిని బాగుచేసేది ఎట్లా? అని ఒక శాపం పెడతాడు. మహాత్ముల శాపం వరమే! 'మీఇద్దరు తాటి చెట్లై పుట్టండిరా' అంటాడు. 'అమ్మమ్మా! అలా అనేసారు ఇప్పుడు మాకు ఎలా' అంటే, "మీరు తాటి చెట్లు రూపంలో ఉన్నప్పటికీ మీ స్ఫూర్తి మీకు ఉంటుంది. భగవన్నామం చేసుకుంటూ ఉండండి, భగవంతుడు భూమి మీదకి ఎప్పుడో దిగి వచ్చినప్పుడు, ఓ రోలు కట్టుకుని మీ ఇద్దరి మధ్య నుంచి పరుగెత్తుకుని వెళ్తాడు, అప్పుడు మీ ఇద్దరికీ మోక్షం కలుగుతుంది. అప్పుడు మీ ఇద్దరు మళ్ళీ మీ యధా స్థితికి వస్తారు, సహజమైన చైతన్యాన్ని పొందుతారు. అప్పుడు బుద్ధిమంతులుగా మీరు ప్రవర్తిస్తారు." అని తెలియపరిస్తే, నారదుడి కోసం కృష్ణుడు నానా అల్లరులు చేసి, అమ్మని విసిగించి రోలు కట్టించుకొని, ఆ కట్టిన రోలు పట్టుకొని గబగబా ఇంటి

లోనుంచి బయటకి పరుగెత్తి, అక్కడ నుంచి ఆ చెట్ల దగ్గరకి వెళ్లి, వాటిని కూల్చి, తద్వారా వారికి పరిష్కారం ఇస్తాడు. ఎందుకు ఇవన్నీ చేయాల్సి వచ్చింది? నారదుడు అన్నాడు కాబట్టి! ఇదేమిటి ఇట్లా చెప్పావు ఇంకో రకముగా చెప్పవచ్చు కదా అని కూడా అనడుట, ఎందుకంటే భక్తుడు నోటి నుంచి వచ్చిన వాక్యాన్ని శిరసా వహించి, దాన్ని నిర్వర్తించడమే భగవంతుడి యొక్క ఏకైక కర్తవ్యముగా కనిపిస్తుంది, మనకి భగవంతుని భక్తుల కథలు చదువుతుంటే. అందుకనే భగవంతుడు 'నన్ను కీర్తించితే నేను ఎక్కువ ఆనందించను, నా భక్తుడ్ని కీర్తిస్తే నేను ఎక్కువ ఆనందిస్తాను' అంటాడు. హనుమంతుడిని ఆరాధిస్తే రాముడు మెచ్చుకుంటాడు. అందుచేత మహాత్ముల రూపంలో దైవం ప్రకటితమై ఉంటాడు. ఆ కారణము చేతనే భీష్ముడు చేత ఈ విష్ణు సహస్రనామం చెప్పించడం జరుగుతుంది. అయన మొదలు పెట్టటమే 'విశ్వం' అన్నాడు. "దేని వల్ల సమస్తమైన దుఃఖాలు పోయి సుఖాలు  కలుగుతాయో, అశుభాలు పోతాయో, దేని వల్ల కష్టాలు లేకుండా ఈ ప్రపంచంలో ఉండే  అశుభం తాకకుండా ఉంటుందో, అటువంటిది ఒకటి చెప్పవయ్యా నాకు" అని ధర్మరాజు అడిగితే. 'విశ్వం' అంటాడు.  మనం దేన్ని చూచినా  'అదే' చూడాలి. అలా చూసిన వాళ్లలో మొట్టమొదటి వాడు ప్రహ్లాదుడు! అందుకనే భాగవత మూర్తులలో అత్యుత్తమమైన భాగవత మూర్తిగా ప్రహ్లాదుడ్ని కొనియాడుతారు. తరవాతే నారదుడు! ఎందుకంటే అది నారదుడికి సంతోషం. తన శిష్యుడు తన కన్నా పెద్దవాడుగా ఉంటే గురువుకి సంతోషంగా ఉంటుంది. తన కన్నా తన శిష్యుడు పెరగ కూడదు అనుకొనే  వాడు గురువు కాడు, వాడు లఘువే! అందుచేత ప్రహ్లాద, అంబరీష, నారద, శుక, వ్యాస ఇట్లా వస్తుంది పరంపర. అందుచేత, ప్రహ్లాదుడు అంబరీషుడు ఎట్టి పరిస్థితులలోను  కనబడుతున్నది  దైవమే తప్ప ఇంకొకటి లేదు అని చెప్పి గుర్తించిన వాళ్ళు. అంబరీషుడు ఏడు ద్వీపాలను పరిపాలించిన వాడు. అంటే మొత్తం భూమిని పరిపాలించిన వాడు. సప్త ఖండాలు తో ఉన్న మొత్తం భూమి పరిపాలించే చక్రవర్తికి ఏ క్షణములోనూ దైవము యొక్క మరపు లేదుటండీ! కళ్ళు తెరచినా అదే, కళ్ళు మూసినా అదే! కళ్ళు మూసుకుంటే దైవాన్ని ధ్యానం చేసుకుంటాడు. కళ్ళు తెరచి ఏడు ద్వీపాలని పరిపాలించటం అంటే ఎంత బాధ్యత! ఒక్క కుటుంబాన్ని నిర్వర్తించడానికి నానా బాధ పడిపోతున్నాం. ఇంత సంసారాన్ని, మొత్తం భూ ప్రపంచాన్ని అంతా కూడా అయన పరిపాలిస్తూ, ఏ క్షణమూ కనబడుతున్నవన్నీ దైవమే తప్పా మరొకటిగా భావించక ఉన్నాడు, అతను.

అలా ఉండగలమా? అలా ఉంటె అంత అయిపోయినట్టే! ఎందుకంటే అది ముఖ ద్వారం. అది తెరుచుకొని, లోపలకి ఎన్నెన్ని విషయాలైనా తెలుసుకుంటూ వెళ్లిపోవచ్చు. ప్రహ్లాదుడు అలాగే చూచాడు. అంబరీషుడు అలాగే చూచాడు. అంబరీషుడు తనను సంహరించుతున్న మహాకృత్యలో కానీ, తనని దూషిస్తూ ఉన్న దుర్వాసుడి యందు కానీ, నీళ్లు తాగితే దీక్ష చెడిపోదని చెప్పిన బ్రాహ్మణులలో కానీ, అందరిలోనూ దైవాన్నే చూచాడు, ఇంకేమి చూడలేదు. కాబట్టి అంబరీషుడు విశ్వమును విష్ణువుగ ఆరాధన చేసిన వాళ్ళల్లో ఒక ఉత్తమోత్తమ భక్తుడిగా మనకి కనిపిస్తాడు. అలాగే ప్రహ్లాదుడు. ఎట్టి సమయములోను వారికి తమ గురించిన భావన లేదు, దైవము గురించే భావన! కనబడుతున్నదంతా దైవమే అన్న భావన!
కనబడుతున్న విశ్వమే దైవము! ఇలా ఉండగా, ఇదంతా మాయ అని చెప్పేవాళ్లు ఉన్నారు. ఉన్నారా? ఉన్నారు, నువ్వు మాయలో పడదామనుకుంటే ఆ సిద్ధాంతం అంగీకరించు. మాయా సిద్ధాంతమే మాయ! అద్వైతము ఏమిటయ్యా అంటే ఉన్నది ఒకటే దైవము. నేను, నా పరిసరములు మొత్తం అంత అతడే ఉన్నాడనేది అద్వైతం! విశిష్ట అద్వైతం ఏమిటంటే ఇక దాన్ని తప్ప ఇంకేమి చూడం. అంటే ఈ కనపడుతున్నది, కనపడేదాని ఆధారంగా ఉండేది అంతా 'అదే'! అలా చూస్తే ఇంక మాయ గురించి మనం బాధ పడక్కర్లే. మాయ ఒకటి ఉందని, ఆ మాయ దాటితే కానీ దైవం కనబడదు అని నువ్వు రెండుగా ఏర్పరచుకుంటే, నువ్వు ఏర్పరచుకున్న మాయ వల్ల నువ్వు దాట లేవు. అది నువ్వు ఏర్పరచుకున్నావు. అక్కడ తాడు ఉంటే పాము అని నువ్వు అనుకుంటే, నిన్ను ఎవ్వరూ ఆ భావన నుంచి రక్షించ లేరు. పాము కాదు తాడే కదా. పాము అయినా అది పాము కాదు దైవమే కదా! అది దైవము అనుకుంటే దైవము, పాము అనుకుంటే పాము. అది తేలు అనుకుంటే తేలు, దైవం అనుకుంటే దైవము. 'యద్భావం తద్భవతి.' అందుచేత తేలు అనుకుంటే నీ ప్రవర్తన దాని యందు వికారంగా ఉంటుంది. అదీ దైవ స్వరూపమే అనుకుంటే నీ భావన దివ్యంగా ఉంటుంది. దైవీ స్వభావంతో కూడి ఉంటుంది. అందుచేత, ఆ మాయా సిద్ధాంతాన్ని సమగ్రమైన జ్ఞానులు అంగీకరించరు. ఎవరికీ మాయ? సృష్టిని ప్రకృతిగాను, పురుషునిగాను విడదీసి చూసేవారికి మాయ. పదార్థం వేరు, పరమార్థం వేరు అనుకొనే వారికి మాయ. అంతా ఒకటే! ఒకటే ఇన్ని రకాలుగా కనిపిస్తూ ఉంటుంది. ఇప్పుడు నీ ఒంట్లో ఏ భాగం నీవు కాదు? నీ నుదురు, నీ ముక్కు, నీ కళ్ళు, నీ నోరు, నీ చెవులు, ఇందులో ఏ భాగం నువ్వు కాదు? ఏ

భాగం మీద కత్తి వేసి కోస్తే, నిన్ను కోసినట్టు అనిపించదూ? మొత్తం నీవే కదా ఉన్నావు? మొత్తం నీ శరీరం అంతా నీవు ఎలా వ్యాపించి ఉన్నావో, అలాగే ఈ సృష్టి అనే శరీరం మొత్తాన్ని దైవం వ్యాపించి ఉన్నాడు. అలా వ్యాపించి ఉన్నందు చేత, ఆ విధంగా సమస్తాన్ని దైవంగా దర్శించిన వాడికి, అంతా దైవము యొక్క లీల లాగే కనిపిస్తుంది. దీనిలో మాయ అని కొంత భాగం వేరు చేసి చూద్దాం అనుకొనే వాడికి, కేవలం మెట్ట వేదాంతం కలుగుతుంది. ఏ అనుభూతి ఉండదు. కంది పచ్చడి కనబడగానే మాయ అనుకుంటే ఏం తినగలవు? ఇది మాయ, నే తినటం మాయ, నా కడుపు మాయ అని అనుకుంటే ఏముంది ఆ జీవికి ? కంది పచ్చడి విష్ణువే! తినే వాడు విష్ణువే! తినటం విష్ణు కార్యమే! ఇట్లా అనుకుంటే దాని అనుభూతి వేరు. అందుచేత సమస్తాన్ని దైవ పరముగా చూడవయ్యా, ఆనందం కలుగుతుంది. సమస్తాన్ని నిశితమైన దృష్టితో, వైజ్ఞానిక దృష్టితో చూసావనుకో నీకు ఊరికే పాండిత్యమే మిగిలిపోతుంది తప్ప, అనుభూతి ఉండదు. భగవంతుడు రసస్వరూపుడు. 'రసో వైసః' అని చెప్పారు. ఏది కాదు భగవంతుడు? మనం ఎక్కడ చూడమో మన ప్రవర్తన అక్కడ వికారంగా ఉంటుంది. మనకి కొంతమంది మనుషులు Non - God గ కనిపిస్తారు. అంటే వాళ్లలో దైవం లేడని మనము అనుకోవడంవల్ల ఉండడు. అంతే! అలా అనుకోపోతే అంతటా ఉన్నాడు. నువ్వు దైవాన్నే దర్శిస్తే ప్రతికూలురు కూడా అనుకూలురు అవుతారు. నువ్వు దైవాన్ని చూడక ప్రతివారి స్వభావాన్ని చూస్తూ ఉంటె, అనుకూలురు కూడా ప్రతికూలురు అవుతారు. రాముడు జీవితంలో ప్రతికూల సన్నివేశాలు కూడా అనుకూలమైనాయి. భగవత్ భక్తులందరికీ కూడా ప్రతికూల విషయాలు అనుకూలమౌతూ ఉంటాయి. ఎందుకనీ? ప్రతికూలంగా చూడరు, దైవము యొక్క లీలగా చూస్తారు. దైవమె తనతో ఈ విధంగా ప్రవర్తిస్తున్నాడు అనుకుంటారు. అందుకే ప్రతికూలత పోయి అనుకూలత వస్తుంది. దైవం మరచిన వాడు స్వంత బుద్ధితో తను ఏదో చేయబోయి ఒకదానికి ఒకటి చేసుకుంటాడు. మన జీవితంలో పోగొట్టుకున్న స్నేహితులు ఉంటారేమో కానీ, గెలుచుకున్న శత్రువులుండరు. స్నేహితులుగా మలచుకున్న శత్రువులు మనకి ఉండరు. ఉంటె గొప్ప విషయము. అటువంటి వారికి మనం దణ్ణం పెట్టుకోవాలి. పోగొట్టుకున్న శత్రువులను, ప్రాణ మిత్రులుగా మార్చుకున్న వారు ఎవరైనా ఉన్నారా? ఉన్న ప్రాణ స్నేహితులను శత్రువులుగా చేసుకున్న వాళ్ళం ఉంటాం. ఉన్న స్నేహితులు పోవచ్చు. స్నేహితులు శత్రువులు

కావచ్చు. కానీ శత్రువులు స్నేహితులు కారే! భగవత్ భక్తుల విషయములో అది జరుగుతుంది. అతనికి శత్రువు కూడా మిత్రుడు అయిపోతాడు. అది భక్తి! అందుకే ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడికి "శత్రువు ఎక్కడ ఉన్నాడు నాన్నా ? చూపించు చంపేస్తాను అన్నావు. శత్రువులు అన్నది నీ లోపల అరిషడ్ వర్గాలే!" అని చెప్తాడు. భాగవతంలోని ఈ చక్కటి పద్యాలు రోజూ చదువుకోవచ్చు. కంఠస్తం చేయవచ్చు. తెలుగువాడై పుట్టి పోతన భాగవతంలో పద్యాలు నోటికి రావట అంటే ఆ జన్మ వృధా! వ్యర్థం అయిపోయినట్టే. కోప్పడుతున్నాను అనుకోవద్దు. అందులో ఉండే రుచి చేత చెప్తున్నాను. చదువుకుంటే మీకు తెలీకుండానే you will get into a kind of Divine Romance and Divine Ecstasy. ఆ ecstasy, భాగవతంలో ఉండే ఆ దివ్య అనుభూతి ఇంక ఏమి చదువుకున్నా రాదు. వచనం చదువుకుంటే రాదు. భగవంతుని గురించి పోతనామాత్యుడు రాసిన పద్యాలలో ఆ ఆర్థత, ఆ భక్తి, ఆ రసము మనం తెలుసుకోవాలి. ఆ విషయములో వేద వ్యాసుడిని మించిన వాడు పోతనామాత్యుడు. అది భగవత్ అనుగ్రహం. ప్రతివాడికి జీవితంలో అనుకూలమైన సన్నివేశాలుంటాయి, ప్రతికూలమైన సన్నివేశాలుంటాయి. నువ్వు దైవాన్ని చూడటం మొదలు పెడితే నీలో సమస్తమునందు తటస్థ వైఖరి ఏర్పడుతుంది. తటస్థ వైఖరి నీలో రజస్సును, తమస్సును హరిస్తాయి. హరించి నిన్ను సత్వము నందు నిలబెడతాయి. సత్వము యందు నిలబెడితే నీకు దైవము అందుబాటులో ఉంటాడు. సత్వగుణ సంపన్నుడికే దైవము. ఇతరులకు దైవము అందీ అందని స్వప్నమే! ఎందుకంటే రజస్సు చేత ఆరాధన చేసి భగవంతుని వరాలు పొందిన వారు, తమస్సుతో ఆరాధన చేసి తద్వారా వరాలు పొందినవారంతా కూడా తమను తాము పాడు చేసుకున్నారు. కేవలం సత్వమున నిలబడి భగవంతుని ఆరాధన చేసిన వారే భగవంతుని యొక్క అనుగ్రహము పొంది, భగవంతునితో శాశ్వతముగా జీవిస్తూ ఉన్నారు. అందుచేత మనం ఆశ్రయించవలసినది సత్వగుణం. సత్వగుణమునకు తటస్థ వైఖరి ఉంటుంది. పక్షపాత బుద్ధి ఉండదు. మనవాడు, ఇంకొకడు ఇది కదా మనకి. వాడు మన వాడేనా! అంటాడు. అంటే కొంచం extra favors చేయమనీ. పక్షపాత బుద్ధి! పక్షపాత బుద్ధి ఉన్న చోట దైవము ఉండడు. ఎందుకంటే దైవమునకు పక్షపాత బుద్ధి లేదు కనుక. పక్షపాత బుద్ధి లేని వారే దైవమునకు దగ్గర. నారదుడు ఇంద్రుడి దగ్గరకి ఎంత హాయిగా వెళ్తాడో, హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, రావణుడు,

కుంభకర్ణుడు దగ్గరకి కూడా అంత హాయిగా వెళ్తాడు. ఎలా వెళ్లగలిగాడండీ? అతనిది ఇదే సాధన. భాగవతమూర్తి! సమస్తమూ దైవమే! ఇందులో దైవము కొంచెం గెంతులేస్తున్నాడు, అందులో దైవం కొంచెం వినయంగా ఉన్నాడు. ఇట్లా చూస్తుంటాడు.

"నర్తకునిభంగిఁ బెక్కగు మూర్తులతో నెవ్వ డాడు? మునులు దివిజులుం గీర్తింప నేర? రెవ్వని వర్తన మొరు లెఱుఁగ? రట్టివాని నుతింతున్." అంటాడు గజేంద్ర మోక్షంలో. తటస్థ వైఖరి మనకి రావాలి. ఏది రాకపోతే భగవంతుని సామ్రాజ్యంలోకి మొదటి అడుగు కూడా వేయలేమో అది మొదటి నామంగా మనకి 'విశ్వం' అని ఇచ్చారు. విష్ణు సహస్రనామాలో ఆ ఒక్క పదం చాలు. భాగవతం కూడా అలాగే మొదలు అవుతుంది. ఇక్కడ 'విశ్వం విష్ణుః' అని మొదలైతే, అక్కడ 'విశ్వంబు విష్ణుండు, విష్ణుండు గంటెయుం వేరేమియు లేదు', అని మొదలవుతుంది. విశ్వరూపమే విష్ణువు. అది మర్చిపోతే నువ్వు గోడ కట్టేసినట్టే. ఇహ అక్కడ నుంచి ఏవో నువ్వు అనుకున్న రూపాలు, నువ్వు అనుకున్న నామాలు exclusive గ చేసుకొని, మిగతావన్నీ NON - GOD గ చూడటం మొదలు పెట్టారనుకోండి. వెంకటేశ్వర స్వామి అంటే తిరుపతిలో, అక్కడ ఉన్న ఆ విగ్రహమే ఆ స్వామి అనుకుంటే, మాటి మాటికీ అక్కడే కూర్చోలేము కదా! కుర్చోనివ్వరు కదా! తోసేస్తూ ఉంటారు. నీలాగే అందరూ చూద్దాం అనుకుంటారుకదా. అంతటా చూడవయ్యా నన్ను! అంటాడు. అంతటా ఉండేవాడు ఇక్కడా ఉన్నాడు. తిరుపతికి వచ్చి అది బలపరచుకు వెళ్ళాలి. అందుకని సంవత్సరానికి ఒకసారి రావాలని సంప్రదాయం వచ్చింది అందరికి. ఒక సారి వచ్చి చూచి వెళ్లి, సంవత్సరం అంతా కూడా ఆ స్పూర్తితో అంతటా ఆయననే చూట్టం. అన్నిట్లోనూ చూట్టం. అట్లా చూట్టం మొదలు పెడితేనే సాధన మొదలండీ. ఇదీ 'విష్ణూపాసనము'. భగవంతుడి యొక్క రూపం విష్ణు అని, ఆ రూపము నుండి ప్రవర్తించే నర్తకుడు ఎవడైతే ఉంటాడో వాడు వాసుదేవుడని, ఈ నర్తించేవాడు, వాడి రూపము ఆ ఇద్దరి మూలం నారాయణుడు అని మూడు సోపానాలలో భగవంతుడిని చెప్తారు. మొత్తం అంతా కూడా విద్యుత్ వలె ఉన్నవాడు అన్నమాట! విద్యుత్ కనపడదు కదా! కనపడని విద్యుత్ అంతా వ్యాపించి ఉన్నది. తీసుకొనే పద్ధతి మనకి తెలియాలి. మన వరకు తెచ్చుకొనే పద్ధతి మనకి తెలియాలి. మొత్తం వ్యాపించిన నారాయణ తత్త్వము, శక్తిగా దిగి వచ్చిందనుకోండి, అంటే విద్యుత్ ని మనం current గ పట్టామనుకోండి, పడితే

అది ఝుమ్మని వస్తూ ఉంటుంది wire ల ద్వారా. ముట్టుకుంటే పేలిపోతాము. అదీ వాసుదేవ తత్త్వం! అదే మొత్తం అంత నిర్వర్తింపజేస్తూ ఉంటుంది. "వాసుదేవ సర్వమితి" అని భగవద్గీతలో ఒక వాక్యము ఉన్నది. అంటే ఈ మొత్తం అంతా, ఈ రూపాల్లోనూ, నివసించి ఉన్న వాడిని 'వాసుదేవుడు' అంటారు అని. రూపంగా ఉన్న వాడిని 'విష్ణువు' అంటారు. ఈ రూపానికి, రూపంలో వసియించి ఉండే వాడికి అందరికీ సమాహార ప్రజ్ఞగా మరి ఒకటి ఉన్నది. అదే 'నారాయణుడు'! కాబట్టి ఆ నారాయణుడే వాసుదేవుడై, విష్ణువై ఈ విధంగా ఏర్పడి ఉంటాడు మూడుగా. Three tier system. నీవు ఇటు నుండి చూచే వాడివి. అందుకూ ముందు రూపాన్ని భగవంతుడిగా ఆరాధన చేయాలి. అది ఏ రూపమైన కావచ్చు. మన చుట్టూ కనిపిస్తున్న రూపాలన్నీ కూడా దైవము యొక్క రూపములే అన్న భావన నీలో కలిగినప్పుడు, నీవు సహజముగా సత్వ స్థితిలో ఉంటావు. సత్వ స్థితిలో ఉండటం చేత, బుద్ధి లోకం లోకి పెరుగుతావు. దివ్యానుభూతులకి నువ్వు అర్హుడవై ఉంటావు. ఈ ప్రాపంచిక విషయాలకి కొంత తటస్థంగా ఉంటావు. అవి యాంత్రికంగా నిర్వర్తింప బడుతూ ఉంటాయి. పోతనామాత్యుడు అలా ఉండటం వలనే అతను నాగలికి ఎద్దులు కట్టకపోయినా నాగలి నడిచింది. యాంత్రికంగా జరిగే విషయాలకి భగవత్ భక్తులు ప్రయత్నం చేయరు. భగవత్ భక్తులకి ధనార్జన ముఖ్యముగా ఉండదు. ఎందుకంటే అది యాంత్రికంగా అయిపోతుంది దైవ కార్యక్రమాల్లో ఉంటే. ఆలా కాని వారికి అదొక మహా ప్రయత్నం. భగవత్ భక్తులకి కుటుంబాన్ని ఎట్లా నిర్వర్తించుకోవాలి, నడిపించుకోవాలి అనేది ప్రయత్నంగా ఉండదు. అప్రయత్నంగా సాగిపోతుంది. ఎందుకంటే అతడు భగవంతుడి యందు ఉంటాడు కాబట్టి. దేనికీ ప్రయత్నము ఉండదు. ఒకటే ప్రయత్నము ఉంటుంది. అదే దైవముతో అనుసంధానం చెందడానికి చేసే ప్రయత్నం. మిగతా వన్నీ చేయడా? అంటే, చేస్తాడు కానీ అవన్నీ యాంత్రికం. చూడండి మనం మంత్రం యాంత్రికంగా చేస్తామే అలాగన్నమాట. మనం దైవం విషయంలో యాంత్రికం, స్వంతం విషయంలో చాల ప్రయత్నం చేస్తూ ఉంటాం. ముండకోపనిషత్తు ఏం చెప్తుందంటే దైవం విషయంలో ప్రయత్నం చేయరా, ఇవన్నీ అప్రయత్నంగా జరుగుతాయి. నువ్వు వేటి కోసం ఆరాట పడుతున్నావో, తాపత్రయపడుతున్నావో అవన్నీ యాంత్రికమైపోతాయి. అప్రయత్నముగా అయిపోయే వాటికి ప్రయత్నము చేస్తావేమిటి? ప్రయత్నం చేయవలసిన దానికి అప్రయత్నం చేసుకుంటావేమిటి అని

చెప్తుంది. మీసాలు పెరగడానికి, జుట్టు పెరగడానికి ప్రయత్నం కావాలా? గోళ్ళు పెరగడానికి ప్రయత్నం కావాలా? అలాగే ఈ ప్రాపంచిక జీవనంలో ప్రయత్నమనేది అంటుంది ముండకోపనిషత్తు. దమ్ముంటే నమ్మండి. లేకపోతే పక్కన పడేయండి, ప్రయత్నం చేసుకుంటూ వుండండి. నీవు భగవదారాధనలో వుండి, యజ్ఞార్ధం జీవిస్తుంటే ఈ జీవితమంతా యాంత్రికమే. మరి నీకు ఏమి మిగిలింది? దివ్యం! ఇది యాంత్రికమైనప్పుడు ఇక దివ్యలోకాల్లో జీవిస్తుంటావు, దివ్యానుభూతులు పొందుతూ ఉంటావు. దేవకీదేవి గర్భంలోకి శ్రీకృష్ణుడు పడ్డప్పుడు ఆమెకి పదినెలలూ యాంత్రికంగా జరిగిపోయినాయి. స్నానం చేస్తున్నట్టు ఆమెకి తెలియదు కానీ స్నానం చేస్తూ వుండేది. కానీ భావం అంతా దైవం మీద వుండేది. బట్ట కట్టుకుంటున్నట్టు తెలీదు. కానీ బట్ట కట్టుకునేది. 'దైవధ్యానంలో బట్ట కట్టుకోవడం మర్చిపోయిందండీ' అంటే కుదరదు.' దైవధ్యానంలో నీళ్ళు పోసుకోవడం మర్చిపోయాను' అంటే కుదరదు. గుర్తుపెట్టుకోండి. దైవధ్యానంలో నిజంగా నీవుంటే, నీవు ఏడు లోకములయందూ అప్రమత్తమై ఉంటావు. ఏదీ మర్చిపోవడం వుండదు. మర్చిపోవడమే చావు, మర్చిపోవడమే మందబుద్ధి, మర్చిపోవడమే అజ్ఞానం. ఈరోజుల్లో ఏది అడిగినా 'మర్చిపోయాను' అంటారు. ఏదైనా అడగండి, ఎవరినైనా అడగండి, ఏరా! అంటే, 'మర్చిపోయాను', ఏవమ్మా! అంటే 'మర్చిపోయాను, మర్చిపోయాను'. మర్చిపోతారు ఎందుకంటే కలియుగం, సహజం. 'ఓహో! మర్చిపోయే రూపంలో వున్నాడు దేవుడు' అనుకోవాలి. కోపం రాకూడదు, కానీ మనకి వస్తూ వుంటుంది. సమస్తమూ దైవమే అని దర్శిస్తున్న సందర్భంలో, వసుదేవుడికి ఆ కారాగారం దైవమండీ! మనని jail లో పెడితే కుళ్ళికుళ్ళి ఏడుస్తూవుంటాం, ఈసురోమంటూ, కదా! నిష్కారణంగా jail లో పెట్టారు ఆయన్ని. నందుడూ వాళ్ళందరూ అంతకు ముందు వరకూ ఏవో ఆ jail అధికారులకి లంచాలూ అవీ ఇచ్చి, కృష్ణుణ్ణి బయటకి తెచ్చుకోవడానికి చాలా రకాలుగా ఏర్పాట్లు చేస్తారు. చేసి వసుదేవుడికి చెప్తారు, "నీకేం ఫర్వాలేదు, మనం వాళ్లకి లంచాలు ఇచ్చేసాం. వాళ్ళు తాళాలు తీసేస్తారు. అష్టమ గర్భంలో ఉన్న ఆ శిశువు బయటకి రాగానే, నువ్వు తీసుకొచ్చి మా ఇంట్లో పెట్టేసేయి" అని. వసుదేవుడు నవ్వి, ' 'మనని రక్షించేవాడు దిగొస్తున్నాడు, వస్తుంటే వాణ్ని రక్షిస్తానంటావేంటిరా? వాడు వాడి రక్షణ చూసుకోగలడు. మన రక్షణ కూడా చూస్తాడు' అంటే, 'అలా కాదులే మన ప్రయత్నం మనం చెయ్యాలి కదా!

పురుషప్రయత్నం' అంటాడు. సరే నవ్వుతాడు. 'నీ ఇష్టం ఎదో కానీ' అని అనుకుంటాడు. అంతే! రేపు కృష్ణుడు పుడతాడు అనగా ఆరోజు సాయంత్రం కంసుడికి తెలిసిపోతుంది. మొత్తం jail లో ఉన్నవాళ్ళంతా లంచగొండులు అయిపోయి ఏదో కుట్రపన్నుతున్నారని. అందుకని రాత్రికి రాత్రి మనుష్యులందర్నీ మార్చేసి, గట్టిగా కొత్త తాళాలు తెచ్చి వేయించేసి ఆ తాళం చెవులు దొరక్కుండా చేసేస్తాడు. మరిప్పుడు ఎలా? వసుదేవుడికి ఎలా అని ఏమీ లేదు. దైవమే! మనకి అలా ఉంటుందా? వెధవది train లో berth దొరక్కపోతే దైవం మర్చిపోతాం. కాస్త మనం వేసుకున్న ప్రణాళికకి తేడా వచ్చినా, ఇక అక్కణ్ణుంచీ మన చిరాకు, మన పాశవికత బయటకి వస్తుంది తప్ప, ఒక్క క్షణం ఆగే ఓపిక మనకి ఎక్కడుంది? లేదు. ఓపిక వుంటే అసాధ్యము సుసాధ్యమవుతుంది. ఇది సత్యం! ఓపికలేదు, ఓర్పులేదు. భగవంతుడియందు విశ్వాసం లేదు. మనం చిరాకులూ, ఆవేశాలూ, కోపాలూ, తాపాలూ అన్నీ పడిపోతూ వుండాలి, దైవం కూడా వుండాలి. ఆ రెండూ, they are incompatible. కారాగారంలో దైవం ఇక పుడతాడనంగా, ముందు వసుదేవుడికి కనిపిస్తాడు చతుర్భుజాలతోనూ. "నేనిప్పుడు గర్భంలో పెరుగుతున్న శిశువు మీద ఆపాదిస్తాను, నువ్వు నన్ను సరాసరి తీసుకుని వెళ్లి నందుని ఇంట్లో ఏర్పాటు చేసేయ్, అక్కడ ఒక శక్తి పెరుగుతోంది, మాయ అది. నా మాయ! దాన్ని పట్టుకొచ్చి ఇక్కడ పెట్టుకో" అని చెప్పాడు. చెప్తే 'అలాగే స్వామీ' అన్నాడు గానీ, మరి ఈ జైలుకి తాళాలు వేసేసారు. నేను ఎలా వెళ్తాను? మధ్యలో యమునా నది వుంది కదా! మరి అది ఎలా దాట్తాను? రాత్రికి రాత్రి దాటేసి అక్కడికి చేరవేసి తిరిగొచ్చేసరికీ నన్ను ఎవరూ పట్టుకోరా? ఇవన్నీ ఏం లేవు. మనకైతే అన్నీ ప్రశ్నలే. మధ్యలో రాత్రిపూట నాకు ఎవరైనా కాఫీ ఇస్తారా? నిద్ర వస్తుందేమో! టీ ఇస్తారా? ఏవన్నా vehicle ఏర్పాటు చేస్తావా? ఇవన్నీ వుంటాయి మనకి, వెధవది చెప్పాగా! మధ్యాహ్నం పుణ్యక్షేత్రానికి బయలుదేరి వస్తుంటే ఎన్ని సుంఠనాలు మనసునిండా. అరె! దైవమే చూసుకుంటాడు. నేనొకసారి మా ఆవిడ సాక్షిగా అటువంటి ప్రయత్నం చేసాను తిరుపతిలో ఎవ్వరినీ అడగొద్దు, ఏమీ అడగొద్దు, దైవమునందు మనసుపెట్టు, పద, బయలుదేరు, అని వచ్చాం. అప్పుడు జరిగినంత బాగా మాకు దర్శనాలు ఎప్పుడూ జరగలేదు. ఎవ్వరూ లేరు తిరుపతిలో అప్పుడు. చాలా ఆశ్చర్యం వేసింది. నమ్మకం వుండాలి. మనకి ఎంతసేపూ ఎవరిని పట్టుకుందామా అనే. ఒక్కళ్ళం వచ్చినప్పుడు దైవమే! దైవం నిన్ను అనుగ్రహించాలి

అనుకుంటే అనుగ్రహించ లేడా ఇంత system లోనూ? ఇక్కడ (హృదయంలో) వుండాలి. ఇక్కడ (హృదయంలో) వుంటే అన్నీ వుంటాయి. ఇక్కడ లేకపోతే ఏ మీలేదు. దైవం మీద అయినా విశ్వాసం వుండాలి. నీ మీద అయినా నీకు విశ్వాసం వుండాలి. నీ మీద నీకు విశ్వాసం లేనప్పుడు, దైవం మీద విశ్వాసం వుండదు. రెండూ ఒకటే. ఆత్మవిశ్వాసం అన్నా, దైవం మీద విశ్వాసం వున్నా ఒక్కటే. అందుచేత వసుదేవుడికి ప్రశ్నలు లేవు. 'అలాగే స్వామీ' అన్నాడు. పుట్టాడు. పుట్టిన బిడ్డకి పాలిచ్చింది దేవకి. ఒక్కసారి కనులారా చూసుకుంది, మళ్ళీ ఎప్పుడు చూస్తుందో తెలియదు కదా. ఆ తల్లి ఎంతటి తల్లి? అలా ఇచ్చేయగలదండీ ఏడవకుండా? సరే ఎత్తుకుంటాడు తట్టలోకి, అంతే అలా జైలు తలుపుల వరకూ వెళ్తాడు. అదే తెరుచుకుంది. ఎలా తెరుచుకుంది? అనే ప్రశ్నలేదు. ఎలా తెరుచుకుంది అనే discussion లేదు. వెతుకులాట లేదు. అసలు తెరుచుకున్నట్లే ఆయనకి తెలీదు. మామూలుగా అక్కడ ఉన్నట్లే కనపడలేదు ఆయనకి. అలా వెళ్ళిపోయాడు ఆయన. బుద్ధిలోకంలో వున్నాడు ఆయన, అందుకని భౌతికమైన విషయాలు కనపడవు. గుర్తుపెట్టుకోండి. బుద్ధిలోకంలో పరాకాష్టలో వుంటే రూపమే మాయం అయిపోతూవుంటుంది. ఈ రూపాలేవీ వుండవు. అందుకే పరమగురువులు అందరూ కూడా గోడలలోంచి నడిచి వచ్చేస్తూ వుంటారు, కిటికీలలోంచి నడిచి వచ్చేస్తూ వుంటారు, విమానంలో నువ్వు వెళ్తూ వుంటే వాళ్ళు విమానంలోకి వస్తారు. వాళ్లేమీ ticketలు కొనుక్కోరు, security checkలు లేవూ, ఏవీలేవు. ఎలా వచ్చాడు, ఎలా వెళ్ళాడు? మళ్ళీ ఇంత విమానంలోంచి వెళ్ళిపోతాడు. మరి ఆ లోకాలు అవి. అందుచేత ఆ లోకాల్లో ఉండే వసుదేవుడు అలా వెళ్లిపోతాడు. వెళ్ళిపోతే అది కారాగారమూ, తలుపూ, తాళం ఇలాంటి స్మృతే లేదు, ఉన్నదల్లా దైవమే! వెళ్ళిపోయాడు. అక్కడేదో వర్షం పడుతోంది అనే స్ఫూర్తి ఆయనకి లేదు. పిల్లవాణ్ణి ఎలా కాపాడుకోవాలి వర్షం నుంచి, జలుబు చేస్తుందేమో! పొద్దున్నే pneumonia వచ్చేస్తుందేమో! అనే బాధలేదు, వెళ్ళిపోయాడు. భోరున వర్షం పడుతూంటే ఆదిశేషుడు వచ్చి గొడుగులాగ నిలబడ్డాడు. అంతేకాదు యమున విపరీతంగా పొంగింది. ఏం సామాన్యమా? పుట్టిన సమయంలో ప్రకృతి పులకిస్తే బాగానే వుండేది. పులకించి ఆవేశపడిపోయింది కృష్ణుడు వచ్చాడని. ఈ ఆవేశంతో మొత్తం పంచభూతాలూ పొంగినాయి. అన్నీ పొంగేస్తే నది పొంగింది. నది పొంగితే, నది పొంగిందని

తెలియదు వసుదేవుడికి. మామూలుగానే నడిచి వెళ్ళిపోతున్నాడు. నది పొంగిందన్న భావన కూడా లేదు వసుదేవుడికి. నది ఉందన్న భావన లేదు. నడిచి వెళ్లిపోతుంటే యమున దారి ఇస్తుంది. ఇస్తుందా మనకి? ఎందుకు ఇది చెప్తున్నానంటే 'విశ్వం'. విశ్వమే విష్ణుః. కంసుడు అప్పటికప్పుడు వాణ్ని చంపేస్తానంటే, కంసుడిలో దైవాన్ని చూస్తాడు వసుదేవుడు. మనం చూస్తామా? అలా చూడలేము. వాళ్ళ గురించి ఇస్తుంది భాగవతం. విశ్వమే దైవముగా గుర్తించిన వారి కథలే భాగవతంలో ఇచ్చారు. అన్ని కథలూ ఇవ్వలేదు. చాలా మంది భక్తులున్నారు. భక్తులలో బాగా నిగ్గుతేరిన వాళ్ళు వుంటారు చూసారా? ఎట్టి పరిస్థితుల్లోనూ దైవమును మరవనివారు, వారి కథలు వుంటాయి అందులో. అవి చదువుకుంటే మనకి ఆ స్ఫూర్తి వస్తుంది. ఆ విధంగా నిర్వర్తించుకొని నది దాటుతాడు. పిల్లవాడికి అక్కడ నందుడి ఇంట్లో ఏర్పాటు చేస్తాడు. అక్కడ ఉండే మహామాయని తీసుకుంటాడు, మళ్ళీ వచ్చేస్తాడు. మళ్ళీ కారాగారంలోకి వచ్చిన తరువాత మామూలు స్ఫూర్తిలోకి వచ్చి 'అసలు తనేనా ఇదంతా చేసింది?' అని అనుకుంటాడు. ఇదంతా ఎలా జరిగిందో తెలియదు. అంత అద్భుతంగా నిర్వర్తిస్తాడు, కారణం? అతను భాగవతోత్తముడు కనుక. ఇటువంటి కథలు మనకి కోకొల్లలుగా కనిపిస్తాయి. రూపాన్ని గనుక దైవంగా ఆరాధన చేస్తే ముందు రూపం దారిస్తుందండీ. లేకపోతే ఏదీ దారివ్వదు. అలా మీరు కావాలంటే దైవంతో ఇది ఒక ప్రయోగాత్మకంగా చేసి చూడవచ్చు. ఎక్కువ చేయకండి ఎందుకంటే దైవానికి పరీక్షలు పెట్టకూడదు. మీ నమ్మకంకోసం ఒకటోసారో, రెండోసారో, మూడోసారో చేసి చూడండి. ఖచ్చితంగా result వస్తుంది. అదీ విశ్వం! విశ్వం రూపంలో మన చుట్టూ ఆయనే వున్నాడు. ఆయన్ని దర్శనం చేస్తూంటే వుండే ఆనందం ఇంతా అంతా కాదు. అందుచేత విశ్వరూపాన్ని ఇది సృష్టి, ఇది ప్రకృతి, ఇలా పెట్టుకుని చూసారనుకోండి. వైభవం వుండదు. వైభవం ఉండకపోవటమే కాకుండా తికమక పెట్టేస్తుంది. ఇది దైవము, అనుకుంటే అసలు దృక్పథమే మారిపోతుంది అన్ని విషయాలలో కూడా. ఇప్పుడు సక్కుబాయిలూ వీళ్ళందరూ అత్తగార్లు ఇబ్బంది పెడుతూంటే ఏంచేసారూ? అత్తగారి రూపంలో కృష్ణుణ్ణి చూడబట్టే సక్కుబాయికి మోక్షం వచ్చింది. మనకి ఇబ్బంది పెట్టేవాడి రూపంలో వాడు వస్తూ ఉంటాడు. ఏ రూపం చూసినా వాడే గుర్తు రావాలి. ఇంకొకటి గుర్తు రాకూడదు, అది సాధన. అన్ని రూపాలూ ఆయనే, ఎందుకంటే తానే దిగివచ్చి రూపంగా ఏర్పడ్డాడు. అలా దర్శనం చేసేవాడు భక్తుడు.

అలా సాధన చేయవలసినది మన కర్తవ్యం. ప్రతీ నామంలోనూ ఆ నామం మనకి సత్యం కావాలంటే ఆ నామానికి సంబంధించిన తత్వం ఏమిటి? ఆ తత్వాన్ని భగవద్భక్తులు ఏ విధంగా సాధన చేసి సిద్ధి పొందారు? నువ్వెలా సాధన చెయ్యాలి? ఇంతే. మూడు భాగాలుగా నామాన్ని అర్థంచేసుకోవాలి. అందుచేత కనపడుతున్నదంతా, విశ్వం అంతా భగవంతుడే అని చెప్పిన సాంప్రదాయం కేవలం ఈ భరతభూమియందే వుంది. దీనినే Christ మళ్ళీ పాశ్చాత్యదేశాలకి ఇవ్వడానికి ప్రయత్నం చేసాడు. అంతేగానీ దైవాన్నీ, ప్రకృతినీ వేరుచేయడం ఏమీ లేదు. ప్రకృతీ పురుషుడూ ఎప్పుడూ వేరుగా లేరు. నీ దృష్టిలో వేరుగా వున్నారేమో తప్ప, వారు వేరుగా లేరు. పరతత్వము అది పురుషుడూ కాదు, ప్రకృతీ కాదు. రెండూ కలిపిన తత్వం అది. అది దిగివస్తే రెండుగానే దిగివస్తుంది. రెండుగా దిగివచ్చినా ప్రకృతి వేరుగానూ, పురుషుడు వేరుగానూ వుండడు. ప్రజ్ఞ వేరుగానూ, పదార్థం వేరుగానూ వుండదు. సూక్ష్మలోకాల్లో ప్రజ్ఞ ఎక్కువగా గోచరిస్తుంటుంది, పదార్థం తక్కువగా గోచరిస్తుంది. స్థూల లోకాల్లో పదార్థం ఎక్కువగా గోచరిస్తుంటుంది, ప్రజ్ఞ తక్కువగా గోచరిస్తుంది. ఎక్కువ తక్కువలు లోకాలు ఏర్పరచడానికి భగవంతుడు చూపించే క్రీడ తప్ప, వారిద్దరూ వేరయిపోయినట్టి సన్నివేశం వుండదు. AC, DC లేకుండా current లేదు. అలాగే ప్రజ్ఞ, పదార్థం రెండూ ఎప్పుడూ కలిసే వున్నాయి. మనం చూసే వెలుగులో కూడా పదార్థం వున్నది. Light is matter అని science చెప్తోంది. మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. అది పదార్థమే! కాకపోతే అక్కడ పదార్థం అతి సూక్ష్మంగా వుంది. అసలు భగవత్తత్వం నీకు గోచరించడం అంటే అమ్మవారే! ఎందుకంటే పదార్థం లేకుండా భగవంతుడు గోచరించడు. విద్యుత్తు గోచరిస్తుందా? గోచరించదు, వెలుగుగా గోచరిస్తుంది. అందుకని రూపం తీసుకుంటే ప్రకృతి రూపం తీసుకున్నట్టే. అందుకని పురుషుడు-ప్రకృతి వారు అభేదమూ, వారి మధ్య వేరుచేసుకునే దృష్టి మనకి వుండకూడదు. అవగాహన కోసం వేరుచేసి చెప్పుకుంటూ వుంటాం తప్ప, అంతమాత్రంచేత అవి వేరు కాదు. అందుచేత ఈ కనపడుతున్నదంతా అదే అనుకున్నవాడికి ఇది అనుభూతినిస్తుంది, ఇది ఆనూకూల్యతని ఇస్తుంది. లేకపోతే ప్రతికూలత వస్తూ వుంటుంది. ఇది ఒక సుళువు. ఇది 'విశ్వం'.

## ౨. విష్ణుః

విష్ణువు అంటే మనం చూస్తున్నట్టుగా చతుర్భుజాలూ పెట్టుకుని అలా నిలబడి ఎప్పుడూ beat constable వలె నిలబడేవాడు అనుకోకూడదు. మనందరికీ విష్ణువు అంటే beat constable. కాకపోతే రెండు చేతులు extra వుంటాయి. ఏవో పట్టుకు, ఎప్పుడూ నిలబడే ఉంటాడు పాపం. కదా! ఎందుకు నిలబడి వుంటాడంటే, మనం ఎప్పుడు పిలుస్తామో అని. అది ఒక సంకేతం. ఆరాధనకి తప్పకుండా ఆ రూపమే లోపల ధ్యానం చేసి, వెలుగుగా దర్శనం చెయ్యాలి. విష్ణురూపం షడ్భుజాలు. తల నుండీ ఒకరేఖ తీసుకోండి. ఈ పక్కనుంచి ఒక రేఖ తీసుకోండి. ఒక చెయ్యి, ఒక కాలు. కదా. ఒక చెయ్యి, ఇంకొక చెయ్యి. అంటే చక్రం పట్టుకున్న చెయ్యి, పద్మం పట్టుకున్న చెయ్యి. శంఖం పట్టుకున్న చెయ్యి, గద పట్టుకున్న చెయ్యి. ఇలా ఒక 'X' మార్కుగా చతుర్భుజాలూ కనిపిస్తాయి. 'X' మార్కులో 'X' cross చేసిన చోటునుంచీ నాలుగు, ఆ నాలుగూ నాలుగు భుజాలు. మధ్యలో వుండేది దేహము, ఒక భుజము. మూడు రేఖలు ఒకదాన్ని ఒకటి కత్తరించుకుంటూ వెళ్తే మీకు ఆరు భుజాలు వస్తాయి. ఆ షడ్భుజాలే ఈ రోజున మనకి atom గా చూపిస్తాము. Atom యొక్క రూపం అది ఎలా ప్రవర్తిస్తుందంటే అనుస్యూతంగా  movements లో తిరుగుతూ ఉన్నట్టుగా చూపిస్తూ వుంటారు. Electronic బొమ్మ చూసినవాళ్లకి తెలుస్తుంది atom యొక్క రూపం. అదే విష్ణురూపం. నిలువుగా విష్ణు శరీరం. ఒక కత్తిరింపు రేఖగా రెండు భుజాలు. ఇంకొక కత్తిరింపు రేఖగా రెండు భుజాలు. చతుర్భుజుడు, నాలుగు భుజములుకలవాడు, అతడు మొత్తం ఆరుభుజాలుగా వుండే atom గాకనిపిస్తాడు. That is Man. From atom to man. From man to atom. Atom turned man, Man turned Atom. Master CVV మంత్రం ఇచ్చారు. MTA అన్నారు. Man turned Atom. అందుకని మానవుడి రూపం కూడా సూక్ష్మలోకాల్లో అలాగే వుంటుంది. అది దర్శనం చేసుకోవడమే యోగంలో అంతర్దర్శనం అని చెప్తారు. అందుకని ఆ రూపాన్నిచ్చారు. వైభవోపేతమైన విష్ణురూపం! వజ్రాలు, వైడూర్యాలు, మణులూ, కాంతులతో కూడి వున్నట్టి కిరీటం అని చెప్తారు. ఎందుకంటే, సహస్రారం అంత దేదీప్యమైన వెలుగుతో

కూడివుంటుంది. తరువాత శరీరం అంతా రకరకముల ఆభరణములు చెప్తారు, ఎందుకంటే హిరణ్యం అంటే బంగారపు కాంతితో ఉండే శరీరం ఒకటి వుంది. ఈ రక్తమంసాదులతో కూడిన శరీరం లోపల, బంగారు వర్ణముగల శరీరం వున్నది. దాన్నే 'బంగారూ! బంగారూ!' అని పిలుస్తారు, బాబాగారు. ఎందుకంటే ఆయన చూసేది అదే! ఈ మృణ్మయ శరీరంలో (ఆడ అయినా మగ అయినా) ఉండే బంగారు రూపాన్ని ఆయన చూస్తారు. సర్వాలంకరణ భూషణుడైన, పీతాంబరం కట్టుకున్నవాడైన విష్ణువు. పీతాంబరం ఎందుకు కట్టుకున్నాడూ, దాని రంగు బంగారు వర్ణం. గులాబీలు, ఆకుపచ్చలూ అలా కట్టుకున్నట్టు చూపించరేం? కారణం ఏమిటంటే దాని రంగే అది. నీలమైన కాంతి, పచ్చటి పసుపు వలువ కట్టుకున్నట్టుగా మణిమయాది వజ్ర వైడూర్యాది కాంతులతో విరజిల్లుతున్న ఒక షడ్భుజిగా మిమ్మల్ని మీరు దర్శనం చేసుకోవాలి. దీన్నే three dimensional cross అంటారు. అదలా వుండగా, విష్ణు అనే పదానికి అర్థం ఏమిటంటే 'వ్యాపక తత్త్వము కలిగి నది' అని అర్థం. వ్యాపకం అంటే ఎక్కడికైనా వ్యాపిస్తుంది. అదిలేని చోటు లేదు. అదిలేని చోటు లేదు అని అన్నప్పుడు భగవంతుడు ఇక్కడ వున్నాడు, అక్కడలేడు అని అనుకోవడం అవివేకం కదా! వంటగదిలో మనం పెట్టుకున్న గూళ్లోనే దేవుడు వున్నాడు అనుకోవడం అవివేకమేగా! మనం పెట్టుకున్న పూజామందిరం మనకొక సౌకర్యం. అంతమాత్రంచేత అక్కడికే పరిమితుడా దైవమూ? కాదు. వంటగదే కాదు, పడకగదిలోనూ ఉంటాడు. స్నానాలగదిలోనూ ఉంటాడు. లేని చోటు లేదు. అన్నిటా వ్యాపించి ఉంటాడు. అన్నిటా వ్యాపించి వున్నవాడిని ఎక్కడ ఆరాధన చేసుకోకూడదు? అన్నిచోట్లా ఆరాధన చేసుకోవచ్చు. అంతేకాదు ఆయన అన్ని ప్రదేశాల్లో ఉండడమే కాదు, అన్ని సమయాలలోనూ ఉంటాడు, అందుకని దైవారాధనకి ఇది సమయం, ఇది సమయంకాదు అని ఏమీలేదు, అంతర్ముఖంగా మీరు ఆరాధన చేసుకోవాలంటే! క్రతుపద్ధతిగా కొన్ని క్రతువిద్యలు, కొన్ని ప్రత్యేకమైన విద్యలు వున్నాయి. ఆ విద్యలు నిర్వర్తించుకోవాలంటే, వాటికి మళ్ళీ సంబంధించిన శాస్త్రం వుంది. వేదవిద్య, క్రతువిద్య, మంత్రవిద్య ఇవన్నీకూడా ప్రత్యేకమైన నిష్టతో నిర్వర్తించవలసిన విషయాలు. స్మరణకి నిష్ఠ ఏంలేదు, దానికి నియమాలు లేవు. భగవద్ స్మరణ అది భావపరమైనది. అది సర్వకాలములయందు, సర్వఅవస్థలయందు, సర్వదేశములయందు చేసుకోవచ్చు. ఈ కాలంలో చేసుకుంటాం, ఈ కాలంలో చేసుకోకూడదు అని లేదు దానికి. ఎందుకంటే అది

ఎప్పుడూ వున్నది కాబట్టి. అందుకని అన్ని కాలముల యందు చేసుకోవచ్చు, అన్ని చోట్లా చేసుకోవచ్చు ఎందుకంటే అన్ని కాలములందు, అన్ని ప్రదేశములందు ఏకకాలమున వున్నవాడు దైవము. అలా ఉన్నవాడు కాబట్టే ఎక్కడో సాళ్వుడితో యుద్ధం చేస్తుంటే, అక్కడ ద్రౌపది ప్రార్థన చేస్తే, అక్కడే యుద్ధంలో వుండి, భగవంతుడు ద్రౌపదీదేవికి రక్షణ కల్పించి వలువలిస్తాడు. అలా చేయగలరా? అక్కడ నేను పనుల్లో వుండిపోయాను, I am Sorry, అని చెప్తూంటాం కదా మనం! లేకపోతే ఏదో చేసేటట్లు! పనిలో వుండిపోవడమే మంచిదేమో! వస్తే ఇంకా తొందరగా పాడైపోతుంది మనలాంటి వాళ్ళవల్ల.

'ఇందుగలడందులేడని సందేహంబు వలదు, చక్రి సర్వోపగతుండు,యొందెందు వెదకిచూచిన అందందేగలడు దానవాగ్రణీ కంటే'-- చూస్తే అన్నారు.

నువ్వు చూస్తే ఎక్కడైనా వున్నాడురా, నువ్వు చూడకపోతే ఏం చేస్తా? అన్ని చోట్లా నిండివున్నాడు. ఏవో కొన్ని రహస్యంగా ఎవరికీ తెలియకుండా చేద్దాం అనుకుంటాం చూసారా, అంతకన్నా అవివేకం ఏమీ లేదు. ఎవ్వరూ చూడకుండా ఏంచేస్తావు? ఏంచేయలేవు. ఒకడు చూస్తూనే ఉంటాడు ఎప్పుడూ. వాడు నీలోనే వున్నాడు పైగా, చుట్టూ వున్నాడు. నీ లోపల్నుంచీ చూస్తాడు. నీ చుట్టుపక్కలనుంచీ చూస్తాడు. ఇంకొకడు లేని పరిస్థితి ఏముంది? నువ్వొక్కడివే ఎవరికీ తెలియకుండా ఏమీ చెయ్యడానికి లేదు. Spirituality does not accept clandestine activity అంటారు. అంటే 'ఇంకొకడికి చెప్పుకోకూడని పని ఏదైనా చేసి వుంటే వాడు ఆధ్యాత్మికతకి పనికిరాడు', అని చెప్పారు. అంతేకాదు ఇంకా బాగా మనం ముందుకు పోతే సాధనలో ఇంకొకడికి చెప్పుకోకూడని భావము కూడా రాకూడదుట. చేతేకాదు, భావమే రాకూడదు. అంటే అతి స్వచ్ఛత, త్రికరణశుద్ధి అలా వున్నచోట, అటువంటి గర్భగుడిలోకి దేవుడు దిగివస్తాడు. గుడి కట్టకుండా దేవుణ్ణి పెట్టలేము కదా! గుడికట్టాలి, ముందు ఈ దేహాన్ని దేవాలయంగా తయారుచేస్తే, ఆ దేవాలయంలోకి దేవుడు దిగి రావడానికి అవకాశం వుంటుంది. అందుచేత విష్ణుతత్వము వేరు, శివతత్వము వేరు ఇవన్నీ పిచ్చి. ఇలా అనుకొనే వాళ్ళు తెలిసీతెలియని మూర్ఖులు. వారితో మాట్లాడడం కూడా waste. వారినిచూసి 'ఓహో! భగంతుడు ఇలా ఈ రూపంలో వున్నాడు' అనుకోవడం, అంతే! దండంపెట్టి వూరుకోవడమే, no discussions, no arguments, no discourses. మౌనంగా ఉండడమే! అంగీకారం కాదు ఆ మౌనం. తటస్థ వైఖరి!

‘ఏవిటి స్వామీ ఇలా దర్శనం ఇచ్చావు?’ అనుకోవడమే. అందుచేత ఇదివేరు, అదివేరు, ఇంకొకటి వేరు అనుకునేవారికి దైవమేలేడు. అంతర్యామి దైవము ఒకడు వున్నాడు, వాడికి లక్ష పేర్లు వున్నాయి అని చెప్పడానికే ఇన్నిపేర్లు. సహస్రనామం అంటే ఆ 1008 అనేకాదు. అందులో లేనిదంటూ ఏం లేదు, మొత్తం అంతా ‘అదే’ అని చెప్తాయి, నామాలు. అది మనకిచ్చే సందేశం! అందుచేత అంతా ‘అదే’ అయివున్నప్పుడు దేన్ని చూసినా దాని భావనే రావాలి, ఎక్కడైనా దాని ఆరాధనే జరుగుతూ వుండాలి, అది కాలము, దేశమును బట్టి మారే విషయంకాదు. అందుచేత ‘విష్ణు’ అనే నామానికి అర్థం మనం అలా అవగాహన చేసుకోవాలి. మా చిన్నప్పుడు కథ ఇచ్చేవారు తెలుగు పుస్తకంలో. అది నిజంగా భాగవతంలో లేదు, అయినప్పటికీ మంచి స్ఫూర్తినిచ్చే కథ. ప్రహ్లాదుడు చిన్నప్పుడు school ల్లో చదువుకుంటూ వుంటే, వాళ్ళ గురువుగారు అందరికీ తలో కొబ్బరికాయ ఇచ్చాడుట. ఈ కొబ్బరికాయ ఎవరూ లేనిచోట కొట్టి రమ్మన్నాడుట. అంటే అందరూ వెళ్లి కొట్టేసి వచ్చారుట, గభాలున. విద్యాలయమే ఎక్కడో ఊరుబయట అరణ్యంలో వుంటుంది. అక్కడ ఎవరూ లేకపోవడం అనేది చాలా ఎక్కువగా వుంటుంది కదా, కొట్టేసి వచ్చేసారు. ఈ ప్రహ్లాదుడు వెళ్ళాడు వెళ్ళాడు వెళ్ళాడు, ఎక్కడికి వెళ్ళినా ఎక్కడా కొబ్బరికాయ కొట్టలేక పోయాడు. సరే సాయంత్రం అయ్యింది, ఇంకా తిరిగి రాలేదు. తిరిగి రాకపోతే అప్పుడు ఖంగారు పడిపోయి ఉపాధ్యాయుడే పిల్లలతో కలిసి వెతకడానికి వెళ్తాడు. వెళ్తే, ప్రహ్లాదుడు అలా కొబ్బరికాయ పట్టుకుని తిరుగుతూనే ఉంటాడు అడవుల్లో. ‘ఏవిరా కొట్టలేదు ఇంకా కొబ్బరికాయ?’ అంటే, ‘అదే ఎవ్వరూ లేనిచోట కొట్టమన్నారు కదా, మరి ఇక్కడ  ప్రతీచోటా ఒక చెట్టు కనిపిస్తోంది, ఒక గడ్డిపోచ కనిపిస్తోంది, రాయిబెడ్డ కనిపిస్తోంది, ఇవన్నీ వున్నాయికదా?’ అంటాడు. ‘అవికాదురా’ అంటే, ‘ఆహా అలాకాదు, మీరు ఎవరూ లేనిచోట కొట్టమన్నారు. ఎవరూ లేనిచోటు లేదు’ అని చెప్తాడు. అని చెప్పి మాకు నీతి ఏమిస్తాడంటే అలా ఉంటాడు దైవము అని ఇస్తాడు. ఇదిమాకు ఏడవ క్లాసులో కథ. ఈరోజుల్లో అటువంటి కథలు చెప్పకూడదు ఎందుకంటే secular మనం. Secular పేరున మొత్తం దైవాన్ని, ధర్మాన్ని ఎత్తి అవతల పారేసాం. అందుచేత మనకి స్ఫూర్తి చిన్నతనంలో రాదు, పెద్దయ్యాక రావడం కష్టం. సరే ఆ విధంగా మనకి ప్రహ్లాదుడు చేసి చూపిస్తాడు. దేవుడు లేని చోటు లేదనీ, కదా! దేవుడు లేనిచోటు ఒకటుందా? ఎవరూ లేనిచోటు ఎదో గుప్తంగా చెయ్యడానికి మనం-

తప్పదు స్వభావం- ఏదో చేస్తాం.  చూడనీలే దైవమే కదా చూస్తాడు అనుకుంటే సుఖం. చూసేది దైవమే కదా! దైవం సమస్తమూ వ్యాపించి ఉన్నాడని గుర్తుండాలి. అందుచేత అతను సర్వసాక్షి. లోకచక్షుసు ఇవన్నీ పేర్లు వున్నాయి కదా! అవలోకతేశ్వరుడూ! ఎలా చూస్తూ ఉంటాడు?  అంటే చుట్టూ వుండే రూపాల్లోంచే చూస్తూ ఉంటాడు. అందుచేత మనం విష్ణువు ఆరాధన చేస్తున్నామంటే అది నిరంతరం అవ్వాలి. విష్ణువు ఆరాధన చేస్తున్నాం, అని అన్నాం అనుకోండి. ఇక్కడ విష్ణువు అంటే మనం ఎన్నుకున్న మూర్తికాదు నేను చెప్పేది. సర్వమూ సర్వకాలములయందూ వ్యాపించివున్న తత్వము. దాన్ని ఆరాధన చేస్తున్నాం. అది నిద్రలోనూ, మెలుకువ లోనూ అన్నిటిలోనూ జరగవలసిన సాధన. నిరంతరమైన సాధన. సాధన నిరంతరమైతేనే నీ యందు భక్తి స్థిరపడేది. అలా కాకపోతే స్థిరపడేది ఏమీ వుండదు. ఏదైనా నిరంతరం కాకపోతే నిలబడదు. అనుస్యూతంగా జరుగుతూ వుండాలి. అందుచేత మనం ఇప్పుడు విశాఖపట్టణం నుంచి బయలుదేరి కొంతమంది, హైదరాబాదు నుంచి బయలుదేరి కొంతమంది, బెంగుళూరు నుంచి బయలుదేరి కొంతమంది ఇలా పడి వచ్చాం కదా! ఈ వస్తుంటే దారిలో ఎంతసేపు మనకి దైవం గుర్తున్నాడు, రైలు రూపంలోనూ, రైల్లోవాళ్ళ రూపంలోనూ, తోటి ప్రయాణీకుల రూపంలోనూ? అదీ యాత్రకి లెఖ్ఖ! తీర్థయాత్రకి బయలుదేరిన వాడు, బయలుదేరిన క్షణం నుంచీ దైవదర్శనమై మళ్ళీ ఇంటికి వెళ్ళేంతవరకూ కూడా అదే దైవాన్ని, అంతటా, అన్ని సమయాల్లోనూ చూడటం తీర్థయాత్ర అవుతుంది, వాడు యాత్రీకుడు అవుతాడు. లేకపోతే visitor అవుతాడు, just a visitor. చూడండి మనకి visitors and pilgrims అని వుంటారు. చుట్టం చూపుగా వచ్చి పోయేవాడు యాత్రీకుడు. దేవుణ్ణి చుట్టపుచూపుగా చూసి పోయేవాళ్ళు వుంటారండీ, వాళ్ళకి ఏంటంటే ఆ గుళ్ళోకెళ్ళి అదేదో చూసేస్తే అయిపోతుంది. ఊరికే మనసుకి తృప్తి. మిగిలిందా, పెట్టిందా, అతుక్కుందా ఏవన్నానా? ఏమి అతుక్కుంటుంది? అక్కణ్నుంచి ఇక్కడికి వచ్చేవరకూ లేని దేవుడు ఆ క్షణం మెరుపు మెరిసినట్టు కనపడ్డట్టు, మనసుకి భ్రమ కల్పించడమే తప్ప, అటుపైన చూసామన్న భ్రమ తప్ప నీలో అతుక్కున్నదేముందీ? నిలబడ్డదేముందీ? స్థిరబడ్డదేముంది? అందుచేత యాత్ర అంటే ఎక్కడ మొదలౌతుంది? నీవు బయలుదేరిన దగ్గర్నుంచీ నీ మనసులో ఆయనే గోచరిస్తూ వుండాలి, కనపడుతున్న వాళ్ళ రూపంలో ఆయనే గోచరిస్తూ వుండేవాడు. అడుక్కునే వాళ్ళ రూపంలోనూ, అమ్ముకునే వాళ్ళ రూపంలోనూ వాడే

కనపడుతూ వుండాలి. ఇలా కనబడుతుంది అనుకోండి, అప్పుడు యాత్ర అవుతుంది అది, లేకపోతే విహారయాత్ర అవుతుంది. విహారయాత్రలో ఏమి చూసుకుంటాం అంటే తిండీ, బట్టా, పడకా! యాత్రలో వున్నాం అనుకోండీ, దైవాన్ని చూసుకుంటూ వుంటాం. వచ్చి తిరిగి వెళ్ళేంతవరకూ దైవాన్ని చూసుకుంటూ యాత్ర చేసుకుంటూ వచ్చాం అనుకోండి, అప్పుడు అది విష్ణు ఆరాధన అవుతుంది. అలా కాకపోతే విష్ణు ఆరాధన చేసాము అనే ఒక భ్రమ వుంటుంది. అది మనకి లోపల అతుక్కోవాలిగా! దేనికోసం ఇంత ప్రయత్నం చేసామో అది సఫలీకృతం కావాలిగా! అరగాలిగా! ఆకళింపు అవ్వాలిగా! తదనుభూతి ఉండాలిగా! అలా ఉండాలంటే ఆ స్ఫూర్తి ఎప్పుడూ ఆ బుద్ధిలోకంలోకి చేర్చి ఉంచాలి. యాత్ర మొదలయ్యిందగ్గర నుంచీ యాత్ర అయ్యేంతవరకూ. అసలు జీవితమే యాత్ర అన్నారు. యాత్రేగా! అందరం యాత్రికులమేగా! అంటే యాత్రలో ఉండేవాడు ఏంచేస్తాడు? నిరంతరం దైవాన్ని దర్శనం చేస్తూ ఉంటాడు, దైవాన్ని స్మరణ చేస్తూ ఉంటాడు, దైవాన్ని వింటూ ఉంటాడు, చూస్తూ ఉంటాడు, లౌకికమైన విషయములు తగుమాత్రంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటాడు. అటువంటివాడికి జీవన యాత్ర అది. అందరికీ జీవన యాత్ర వుండదు. మునగానాం తేలానాం అంటూ వుంటాం చూడండి మనం తెలుగులో, కొంతేదో సంస్కృతం కలిపినట్టుగా. అలా మనకి ఎదో కాసేపు బతుకుతూ వుంటాం, చచ్చిపోతూ వుంటాం, కాసేపు బతుకుతూ వుంటాం చచ్చిపోతూ వుంటాం. అలా ఉంటూ ఉంటూ వుంటాం. ఆ ఉండడం మన ఇంట్లో విష్ణుమూర్తి పటం వున్నా పెద్ద ఉపయోగం లేదు దానికి. చూస్తూ వుంటాడు మన తిప్పలు. "ఏమిరా! నన్ను పెట్టుకున్నా ఇన్ని తిప్పలు పడుతున్నావు నువ్వు? నన్ను పెట్టుకుని నువ్వు తిప్పలు పడాల్సిన అవసరం లేదుగా! నేనేగా అంతాను." అని. ఆ ప్రహ్లాదుడ్ని తీసుకెళ్ళి సముద్రంలో ముంచేస్తూ వుంటే, అతడు అంటాడు సముద్రం చూసి, ఇది మా అమ్మ పుట్టిల్లు కదా! అని. ఎందుకనీ? ఆయనకి నాన్న విష్ణుమూర్తి కాబట్టి. మనకి అలా వుండదు. అంత దూరం అఖ్ఖర్లేదు మనకి. ఎలాగో మనని సముద్రంలో ముంచే అంత విపత్కర పరిస్థితులు మనకి లేవు. మనకున్న చిన్న చిన్న పరిస్థితుల్లోనే మనం చూడలేక పోతున్నాం కదా! ఆ చూడడం, ఈ విశ్వమూ, ఈ విష్ణువూ కలిపి నామ సాధన చెయ్యాలి. ఇది 'విశ్వం విష్ణుః'.

అందుచేత ఈ విశ్వమూ ఈ విష్ణువూ ఈ రెండునామాలనీ మనం ఆకళింపు చేసుకుని, అనుభూతిపరంగా వాటిని తయారుచేసుకోవాలి, దానికి

సాధన చేయాలి, అదీ దీక్షగా చేసుకోవాలి. సహస్రనామాలు చేసేవాళ్ళకి, ఏదో ఒక దీక్ష వుండాలి జీవితంలో. ఏ దీక్షా లేకుండా వుంటే రక్షణ వుండదు. దీక్ష వున్న వాళ్లకి రక్షణ వుంటుంది. అది ఏ దీక్ష అయినా కావచ్చు. ఒక్క దీక్ష పట్టండి! నాకు తెలిసిన ఒకాయనకి, వచ్చినన్ని కష్టాలు ఈ ప్రపంచంలో ఎవరికీ రాలేదు. ముప్ఫైరెండు సంవత్సరాల నుంచీ చూస్తున్నాను ఆయన్ని. ఆయనకి చిన్నతనంలో వాళ్ళ అమ్మ ఒక దీక్ష నేర్పింది. ఏమిటంటే 'నాన్నా! ప్రతీ సోమవారం తప్పకుండా శివాలయానికి వెళ్ళు' అంతే! ఈ రోజున ఆయనకి డబ్బైరెండు సంవత్సరాలు. ఆయన పన్నెండు సంవత్సరాల వయసులో మొదలు పెట్టాడు. నాకు ఆయన పరిచయమైంది ముప్ఫైరెండు సంవత్సరాల క్రితం. అంటే ఆయనకి నలభై సంవత్సరాలు అప్పటికి. నలభైయ్యో, ముప్ఫై తొమ్మిదో! సోమవారం వచ్చిందంటే పొద్దున్నగానీ, సాయంత్రంగానీ ఏదో ఒక సమయంలో శివాలయానికి వెళ్ళడం, అక్కడ దైవాన్ని దర్శనం చేసుకోవడం, తనకి తోచిన ఆరాధన చేయించడం, అది తప్పలేదు ఇవాల్టి వరకూ, ఆయనకి వచ్చినన్ని ఉపద్రవాలు ఎవ్వరికీ రానూలేదూ, అలా ఎవరికీ తప్పిపోనూలేదు. మీరందరూ పరమానందయ్య శిష్యుల కథ సినిమా చూసేవుంటారు. పుస్తకాలు ఎవరూ చదవరనుకోండి. కనీసం సినిమాల రూపంలో అయినా కొంచెం కొంచెం తెలుస్తూ వుంటాయి. ఆ సినిమాలో మహారాజు ప్రతీ ప్రదోషకాలంలో కూడా శివారాధన చెయ్యాలి, ప్రతీ ప్రాతఃకాలంలోనూ శివారాధన చెయ్యాలి. అతడు వేశ్యాగృహంలో వున్నప్పుడు, అతడు శివారాధన చెయ్యడానికి ఆ రోజు ఆలస్యం అయిపోతూ వుంటే, ఆమె వక్షస్థలంలో ఉండే వక్షోజాలని చూసి అదే శివలింగంగా భావించి ఆరాధన చేస్తాడే తప్ప, శివారాధనను మన ఇంగ్లీషు తెలుగులో చెప్పాలంటే 'miss కొట్టడు'. అంటే అంతరాయం కలుగకుండా నిర్వర్తిస్తాడు. అందుచేత అతనిలో ఎన్ని అశుభమైన స్వభావములు వున్నా అన్నీ తొలగిపోయి చివరికి శివానుగ్రహానికి పాత్రుడయినట్లుగా ఆ కథ చూపిస్తారు. అందుచేత, మనం ఏదైనా ఒక్క దీక్ష పెట్టుకోవాలి. ఎందుకంటే దీక్ష మనిషిని ఒక ధర్మానికి కట్టివేస్తుంది. నువ్వు పెట్టుకున్న దీక్షవల్ల, నీ అంతట నీవుగా ఒక ధర్మానికి బద్ధుడవౌతావు. అది నువ్వు నిర్వర్తిస్తున్నంతకాలం నీకు రక్షణ వస్తూ వుంటుంది. మనం ప్రతీరోజూ ఇది చేస్తాం అని ఒకటి పెట్టుకోండి. ఏది దైవపరంగా! అంతేగాని అన్నంతింటా, నిద్రపోతా అవికాదు. దైవపరంగా, ధర్మపరంగా ప్రతీరోజూ నేను ఇది చేస్తాను, అని అనుకోండి ఒకటి. అది నిర్వర్తిస్తూ వుండండి. పన్నెండు

సంవత్సరములు అలా నిర్వర్తిస్తే మీ చుట్టూ కవచం వచ్చేస్తుంది. అదీ దీక్షాయుత జీవితాల్లో వుండే సత్యం. ఇప్పుడు సహస్రనామాలు చదువుకోవడానికి దీక్ష ఏమిటో చెప్పాను నేను. అంత దీక్ష అఖ్ఖర్లేదు, చిన్నదీక్ష మనకి వీలుపడే దీక్ష ఒకటి చేయండి. ప్రతీరోజూ ఒక రూపాయి నేను బిక్షగాడికి ఇస్తానని పెట్టుకోండి. లేకపోతే ప్రతీరోజూ ఒక ఆవుకి నేను అరటిపండు ఇస్తానని పెట్టుకోండి. ప్రతీరోజూ గుప్పెడు గింజలు పక్షికి వేస్తానని పెట్టుకోండి. ప్రతీరోజూ క్రమం తప్పకుండా ఒక మొక్కకి నీరు పోస్తానని పెట్టుకోండి. ఇవన్నీ ధర్మ కార్యాలే! ఒక్క కార్యం! దానిలోంచి మీకు చాలా పుడుతుంది. ఏం పుడుతుందో తెలుసా? క్రమతః అది మనలో స్ఫూర్తిని పెంచి, మనని బుద్ధి లోకాల్లోకి దారి తీస్తూ వుంటుంది. అందుకనే దీక్షలు. అవి కఠినమైన దీక్షలుగా వుండకూడదు. శరీరాన్ని శుష్కింపచేసే దీక్షలుగా వుండకూడదు. గుర్తుపెట్టుకోండి. 'శరీరాన్ని కష్టపెడితే నన్ను కష్టపెట్టినట్టే కదా' అంటాడు భగవంతుడు పదిహేడవ అధ్యాయంలో. ఉపవాసాదులు చేసి శరీరాన్ని శుష్కింపజేసే వారందరూ కూడా రజోగుణ దోషంచేత ఆ విధంగా చేస్తున్నారు. అది ఆసురీ స్వభావం కానీ, దైవీ స్వభావం కాదు అని చెప్తున్నాడు. ఎందుకనీ? శరీరమూ, ఇంద్రియముల రూపంలో ఎవరు వున్నారు? నేనే ఉన్నాను. అంతేకాదు, వాటన్నిటి లోపల నేనొకడిని ఉన్నాను కదా? అన్నం తినటం నీకోసమా? నాకోసం కదా! బ్రహ్మార్పణం బ్రహ్మహవిస్, కదా! బ్రహ్మార్పణంగా భోజనం చెయ్యమన్నాడు కదండీ భగవద్గీతలో భగవంతుడు? మరి ముద్ద వెయ్యకపోతే లోపల దేవుడికి అన్నం పెట్టలేదన్నమాట ఇవాళ నువ్వు. అందుకని, శ్రీకృష్ణుడుగానీ, యోగంగానీ ఉపవాసాలు ఒప్పుకోరు. ఆరోగ్యపరంగా ఉపవాసాలు చెయ్యమని ఆయుర్వేదం చెబుతుంది ఎందుకంటే, తిండిపోతు ఒకరోజు మానేస్తే బావుంటుంది, ఒకపూట మానేస్తే బావుంటుంది. ఉపవాసం ఆరోగ్యపరంగా తప్ప, దైవపరంగా కానేకాదు. భారతీయ వాఙ్మయ ప్రకారం. ఉపవాసం ఆరోగ్యపరంగా కావాలంటే చేసుకోండి, కాదనరు ఎవరూ. ఎందుకంటే, వారం రోజుల్లో ఎప్పుడూ ఎదో ఒకటి ఎక్కువ తింటాం, తక్కువ తింటాం, అడ్డగోలగా తింటాం, ఇవన్నీ క్షాళణ అయిపోవాలంటే లంఖణం పరమౌషధం, అన్నారు. ఒకపూట లంఖణం చేస్తే అవన్నీ సర్దుబాటు చేసేస్తుంది శరీరం. అందుచేత దైవంకోసం ఉపవాసం అనేది భ్రమ, అజ్ఞానము, మూఢత్వము. యోగము, భగవద్గీత తెలిసివారెవరూ అలా చేయరు. దైవం కోసం చేయరు ఉపవాసాలు. ఆరోగ్యం కోసం చేస్తే చేసుకోవచ్చు. ఆరోగ్యం కోసం చేసే

ఉపవాసాల్లో లంఖణమే తప్ప, తత్తుల్యంగా ఇంకొకటి పుచ్చుకోవడం ఉండదు. తత్తుల్యంగా ఇంకొకటి పుచ్చుకుంటే అది ఉపవాసం కానేకాదు. తత్తుల్యంగా మామూలుగా తినేదానికన్నా బాగా చేసుకుని తింటే? శనివారం రాత్రి వచ్చిందంటే feast చాలామందికి, ఉపవాసం పేరున, కదా! దీక్ష పట్టేటప్పుడు, శరీరాన్ని ఇబ్బందిపెట్టే దీక్ష పెట్టక, పనికొచ్చే పని చేయండి. ఒక మొక్కకో, ఒక జంతువుకో, ఓ పక్షికో, ఓ మనిషికో, లేకపోతే ఒక దేవతకో నేను రోజూ ఇది చేస్తాను అని పెట్టుకోండి, అది దీక్ష అయి కూర్చుని, అందులోంచి మీకు బుద్ధిలోకాల్లోకి ప్రవేశం వచ్చి, మీలో ధర్మాన్ని అనుసరించే బుద్ధి బలపడుతుంది. ధర్మాన్ని మీరు ఎంత అనుసరిస్తుంటారో, మీకు బుద్ధి లోకంలోకి ప్రవేశం అంత ఎక్కువ కలుగుతుంది. బుద్ధి లోకంలోకి ఎంత ప్రవేశం కలిగితే అంత దివ్యలోకము యొక్క అనుభూతి కలుగుతుంది. అందుచేత దీక్ష కావాలి. Consecration అంటారు. కొన్ని దేవాలయాలని పాడుబడిపోయాయి అంటూంటాం, పాడుబడిపోయాయి అంటే ఏమిటి? అక్కడ దైవం ఇక సాన్నిధ్యం ఇవ్వడంలేదు అనేకదా? అలాగే ఏ దీక్షా లేని ఈ దేహములో దైవము నిద్రాణమై ఉంటాడు. అందుకే ఒక దీక్ష! భగవద్భక్తుడు అనుకునేవాడుగానీ, ఒక గురువు యొక్క శిష్యుడు అనుకునేవాడు గానీ ఏదో ఒక దీక్షను, తను అనుసరించగలిగినదీ, తనకు సాధ్యమైనదే, ఒకటి ఎన్నుకుని నిర్వర్తించండి. అలా నిర్వర్తిస్తే, అందులోంచి మనకి వచ్చే పెరుగుదలను గమనించండి. అదిచాలా అత్యద్భుతంగా వుంటుంది. ఒక పన్నెండు సంవత్సరములు ఆ దీక్ష నిరంతరముగా, నిరాటంకముగా జరిగిందంటే, మీలో చాలా స్ఫూర్తి విచ్చుకుంటుంది, సమర్థత విచ్చుకుంటుంది, శక్తి విచ్చుకుంటుంది, ధర్మము విచ్చుకుంటుంది. మీరు చాలా వినియోగ పడే ఒక సభ్యుడిగా సంఘంలో తయారవుతారు.

## 3. వషట్కారః

అవ్యక్తమైన తత్త్వాన్ని వ్యక్త రూపంలోకి ఆహ్వానం చేయటం, లేక పిలుపునివ్వటం. The first call, The first stir, మొదటి ప్రేరణ, అంటారు. అవ్యక్తము, అతీతము, అచింత్యము, అప్రతర్క్యము, అలక్ష్యము, అవిజ్ఞేయము అయిన తత్త్వము నుండి ఒక ప్రేరణ కలుగుతుంది. ఆ ప్రేరణ కారణంగా ఒక మహా వెలుగు ఏర్పడుతుంది. ఆ వెలుగు ఏర్పడినప్పుడు, కాలం కూడా ఏర్పడుతుంది. ఆ వెలుగే త్రిమూర్త్యాత్మకంగా, త్రిశక్త్యాత్మకంగా తనను తాను వివరణ చేసుకుంటుంది. వీటన్నిటికీ కారణం వెలుగు. వెలుగుకు కారణం ప్రేరణ. అలా ప్రేరణ గా తనను తాను వ్యక్తం చేసుకునే తత్త్వమును, 'వషట్కారము' అంటారు. ఎప్పుడూ ఉండే వాడు ఒక రూపం కట్టుకుని, రూపంలో నివసించడం కోసం చేసే మొదటి ప్రయత్నాన్ని 'వషట్' అంటారు. 'వషట్' అనేది మంత్రము. భగవంతుని ధ్యానం చేద్దాం అనుకునే వారందరూ కూడా తమ యందు భగవంతుని యొక్క అస్తిత్వం మరింత మేల్కాంచటానికి, మరింత వ్యాపన చెందటానికి, మరింత స్థిరంగా అనుభూతి చెందటానికి, 'వషట్కారము' చేసుకుంటారు. స్వాహా అనే శబ్దం వషట్కారము లోకే వస్తుంది. స్వాహా అనే శబ్దం, సోహం అనే శబ్దానికి సంబంధించిన శబ్దమే! వసించి ఉండటానికి 'స్వాహా, స్వాహా' అని చెప్తూ ఉంటాం. మనం హోమం చేసేటప్పుడు కూడా ప్రతీ దేవతని స్వాహాకారాలతో పిలుస్తాం. స్వాహాకారం చేసినప్పుడు అవతరించటం జరుగుతుంది. ఆ విధంగా భగవంతుడు అవ్యక్తమైన తత్త్వం లోనుంచి తానే ఒక ప్రేరణగా దిగి వస్తాడు. దిగివచ్చినప్పుడు వెలుగౌతాడు. వెలుగు అవ్యక్తం నుంచి వచ్చింది కాబట్టి స్త్రీ మూర్తిగా చెప్తారు. లేక విష్ణు మూర్తిగా చెప్తారు. శ్రీ మహా విష్ణువు అన్నా, అమ్మ వారన్నా ఒకటే. నారాయణుడు అంటే అంతకు ముందు ఉన్న తత్త్వం. ఎప్పుడూ ఉండే తత్త్వము. అది వ్యక్తమౌతుంది. అలా వ్యక్తమైనప్పుడు ఒక మహత్తరమైన వెలుగుగా వ్యక్తమౌతుంది. అదే మహా చైతన్యము. ఆ మహా చైతన్యం ఇంకా త్రిగుణాత్మకం కాలేదు. ఈ చైతన్యం పుట్టినప్పుడే కాలం కూడా పుడుతుంది. కాలం దారి చూపిస్తూ ఉంటే, చైతన్యము లోకాలు ఏర్పరచుకుంటూ వస్తుంది. ఈ మొట్ట మొదటగా తనను తానుగా మేలుకొలుపుకుని, తద్వారా వ్యక్తం అవటం అనే తత్త్వం

ఒకటి మనకి గోచరిస్తుంది. అది మనలో  కూడా ప్రతీ నిత్యం జరుగుతుంది. ప్రతి ఉదయం మనం  నిదుర లేచే ముందు అవ్యక్తమైన తత్త్వం లో ఇమిడి ఉంటాం. ఈ అవ్యక్తమైన తత్త్వం లో నుంచి ప్రేరణ కలిగిన తరువాత మనం ఉన్నాం అని మనకు తెలుస్తుంది, కదా! ఈ ప్రేరణ కలుగక ముందు మనం ఉన్నాం అని మనకు తెలియదు. మనం ఉన్నాం అనేది మనకు తెలియటం అన్నది జరిగినప్పుడు తెలివి వచ్చింది అంటాము. తెలివి వస్తే మనం ఉన్నాం, అని  తెలుస్తుంది. తెలివి లేకపోతే మనం ఉన్నాం కానీ ఉన్నామని మనకు తెలియదు. తెలివి లేనప్పుడు కూడా మనం ఉన్నాం. అంటే మేల్కొంచని స్థితిలో కూడా మనం ఉన్నాం. ఈ ఉండే స్థితి ఎప్పుడూ ఉంటుంది. అది సృష్టి ఉన్నప్పుడూ ఉంటుంది, సృష్టిలేనప్పుడూ ఉంటుంది. సృష్టి ఉన్నప్పుడు సృష్టిలో అన్ని స్థితులలోను ఉంటుంది. ఏడు లోకాలలోనూ ఉంటుంది. అందుకని, 'పిపీలికాది బ్రహ్మ పర్యంతం' అంటే  చీమ దోమ నుంచి బ్రహ్మ వరకు అన్నీ ఉన్నాయి. ఉండటం అనేది అసలు తత్త్వం. ఈ ఉండటం అనే తత్త్వం శాశ్వతమైనది. అది సృష్టి ఉన్నా ఉంటుంది సృష్టి లేకపోయినా ఉంటుంది. సృష్టి లేకపోతే అది ఎట్లా ఉందో మనకు తెలియదు. సృష్టి ఉంటే అది ఉన్నది కానీ, అందులో మనం ఎట్లా ఉన్నాం అనేది ఇప్పుడు ప్రశ్న. మనం అసలు ఉండటం అంటే ఏమిటి ? నేనెవరు? నేనెట్లా ఉన్నాను? ఈ ప్రశ్నలు కదా వేసుకుంటారు ధ్యానం చేయటానికి. ఈ ప్రశ్న వేసుకున్నప్పుడు, అది కనుక సిద్ధిస్తే అందులోకి వెళ్ళిపోవడమే ఉంటుంది తప్ప,  ఎట్లా ఉన్నామో తెలిసేది ఏమీ లేదు. నిద్రలోకి వెళ్లిపోతే, ఉన్నామని తప్ప ఇట్లా ఉన్నాను అనుకోవటానికి ఏమీ లేదు. మళ్ళీ అందులోంచి బయటికి వచ్చిన తరువాత ఉన్నట్టు తెలుస్తుంది. అలా మనకు తెలియటం అనేది చైతన్య స్థితి. ఈ తెలియటం అనేది జరగటానికి ముందున్న స్థితి — సత్యమైన స్థితి, నిత్యమైన స్థితి, శాశ్వతమైన స్థితి. దానినే 'సమాధి' అంటారు. అందుకని, ఆ స్థితి నుంచి మేల్కొంచిన స్థితిలో మనకి ఈ చైతన్యం యొక్క విలాసం ఉంటుంది. సృష్టి మొత్తం అంతా కూడా చైతన్యం యొక్క విలాసమే ! చైతన్యం యొక్క విలాసాన్నే  అమ్మవారి క్రీడగా చెప్తారు. "ఇదంతా నా నుంచి వ్యక్తమైన మూల ప్రకృతి నుండి, వ్యక్తమైన త్రిగుణములచే అల్లబడిన అల్లిక," అని భగవంతుడు భగవద్గీత లో రెండవ అధ్యాయం లో చెప్తాడు. నా నుంచి వ్యక్తమైన  మూల ప్రకృతి అన్నా, మహా చైతన్యం అన్నా, అదితి అన్నా, మహా విష్ణువు అన్నా అన్నీ ఒకటే ! మనకి రకరకాల పేర్లు చెప్పినప్పుడు వాటి భావం ఏమిటో, ఆ భావం ఏ తత్త్వాన్ని

నిర్దేశించిందో, తెలుసుకోవటం అనేది చేస్తే మనకు కొంత స్పష్టత వస్తుంది. లేకపోతే ఇవన్నీ వేరు వేరుగా అనుకుంటూ ఉంటాం. మనకు గాయత్రి వేరు, సావిత్రి వేరు, సరస్వతి వేరు, శ్రీ వేరు, ఛందర్శి వేరు ఇట్లా ఉంటుంది. అలా ఉండదు. ఒకే ఒక తత్త్వానికి రకరకాల కర్తవ్యాలను నిర్వర్తిస్తున్నప్పుడు , రకరకాల పేర్లు వాటికి పెట్టారు. చైతన్యం ప్రవహిస్తే 'సరస్వతి'. చైతన్యం సంకల్ప బలంగా ఉంటే 'పార్వతి'. చైతన్యం వైభవోపేతంగా వికసించి ఆనందం కలిగిస్తుంటే 'లక్ష్మి'. ఇట్లా ఉంటాయి మనకి పేర్లు. అందుచేత ప్రతీ నామము భగవంతుని యొక్క ఒక్కో లక్షణాన్ని మనకి ఆవిష్కరిస్తూ ఉంటుంది. అందుచేత ఒక్కొక్క నామం ఈ విధంగా తెలుసుకుంటున్నప్పుడు, ఒకే తత్త్వం ఇన్ని రకాలుగా ఎంత వైభవోపేతంగా ఉన్నదీ, అనే భావనలోకి ప్రవేశించి తద్వారా దైవీ భావంలో మనం స్థిరపడటానికి వీలుంటుంది. అందుచేత ఇన్ని నామాలు. ఇప్పుడు ఈ 'వషట్కారము' అంటే 'నాలో వసించు' అని మనం కోరటం. అది మేల్కొల్పటం చేత మనం మేల్కొన్నాం తప్ప, మనకిగా మనం మేల్కొగలిగిన వాళ్ళం కాదు, మనకిగా మనం నిద్రలోకి వెళ్ళగలిగిన వాళ్ళం కాదు. నిద్ర రాకపోతే జుట్టు పీక్కోవాలి తప్ప నిద్ర రానే రాదు. నిద్రపోతే గిల్లినా నిద్రలేవని వాళ్ళున్నారు. కనుక నిద్రలోకి వెళ్ళటానికి గానీ, నిద్రలోంచి బయటికి రావటానికి గానీ నీవు అశక్తుడవే! ఇటు పొర్లుతాడు, అటు పొర్లుతాడు, ఎటెటో పొర్లుతాడు, ఏవేవో చేస్తాడు. నిద్ర పట్టదు. ఎందుచేత అంటే నిద్ర పుచ్చాలన్నా , నిద్రలోంచి మేలు కొలపాలన్నా ప్రేరణ ఒకటి ఉన్నదే, ఆ మొదటి ప్రేరణ 'దైవము'. ఆ మొదటి ప్రేరణ మహా విష్ణువు. ఆ మొదటి ప్రేరణనే వేదం లో 'అగ్ని' అంటారు. అగ్ని అంటే, 'అగ్నే నియతి ఇతి అగ్నిః' అన్నారు. అన్నిటికన్నా ముందు ఉండేది, అంటే ఏమీ లేని స్థితి నుంచి మొట్ట మొదట వచ్చిన స్థితి, అగ్ని! అందుకని ఆయన మొదటి వాడు. జ్యేష్ఠుడు! అగ్రజుడు! అందరికన్నా ముందు ఉండేవాడు! అందరినీ నడిపించేవాడు! అందుచేతే అగ్నిని ఆవాహన చేస్తే అందరు దేవతలు ఆయనతో పాటు వచ్చేస్తారు. అగ్నికి అందిస్తే అందరు దేవతలకి ఆయనే అందిస్తాడు. 'అగ్నేనయ సుపథారాయే, నన్ను సరైన దారిలో, సుపథ లో నడిపించవయ్యా', అని అగ్నిని కోరటం అది. కర్మ క్షాళనం కావాలి, భృక్తం రహితం కావాలి, ప్రారబ్ధ కర్మ నశించాలి అని అనుకునే వాళ్ళు ఈ శ్లోకాన్ని రోజూ దీపం వెలిగించుకునేటప్పుడు గానీ, అగ్నిహోత్రం అప్పుడు గానీ పఠించాలి.

❖ అగ్నేనయ- అంటే ఓ అగ్ని దేవా !.

- ❖ సుపథారాయే- అంటే సరైన దారిలో నడిపించు. ఎవర్ని? అస్మాన్- మమ్మల్ని
- ❖ విశ్వాని దేవ వయునాని విద్వాన్- అంటే ఈ దేవతలు, వీళ్ళందరూ దిగివచ్చిన దారులు,
- ❖ యుయోధ్యస్మత్ జూహురాణామేనో భూయిష్టాంతే నమయుక్తిమ్ విధేమా

సమస్త సృష్టి ఏర్పరచిన దారులన్నీ తెలిసినది ఎవరికి అంటే అది అగ్నికి ఒక్కడికే! దైవానికి ఒక్కడికే! ఎందుకంటే, ఆయన్నుంచి ఏర్పడినవి ఇవన్నీ. అందుకని, అగ్నికి తెలియని దారి లేదు. చీకటి దారులూ తెలుసు, వెలుగు దారులూ తెలుసు. కుడి దారులు తెలుసు, ఎడమ దారులూ తెలుసు. సదాచారం తెలుసు, వామాచారం తెలుసు. ఆయనకు తెలియని శాస్త్రం లేదు, ఆయనకు తెలియని విద్య లేదు, ఆయనకు తెలియని మంత్రం లేదు. అన్నీ ఆయన లోనుంచే పుట్టుకొచ్చాయి. అతడూ అగ్ని అంటే ! వేదంలో 'అగ్ని' అంటారు. అగ్ని అన్నిటికన్నా ముందు ఉండేవాడు. అతడు ఉద్భవిస్తేనే అందులోంచి అన్నీ దిగి వస్తాయి. అందుకే లలితా సహస్రనామం లో కూడా -ఉద్భవించావు తల్లీ నువ్వు ! అని చెప్తాం. చిదగ్ని కుండసంభూత- నువ్వు అగ్నికుండం లో నుంచి పుట్టావు అని చెప్తాము. సంభూత- -సమ్యక్ భూతం, అంటే అప్పుడు పుట్టింది అని కాదు ఎప్పుడూ ఉన్నది అప్పుడు వ్యక్తమైంది అని అర్థం. సృష్టిలో ఇంకొక రహస్యం ఉంది. ఉన్నవన్నీ ఎప్పుడూ ఉన్నాయి. ఒక్కొక్కప్పుడు కనిపిస్తుంటాయి ఒక్కోసారి కనిపించకుండా ఉంటాయి కాని, అన్నీ ఉంటాయి. కొత్తగా పుట్టేది ఏమీ లేదు, చచ్చిపోయేదీ ఏం లేదు. అదీ భగవద్గీత చెప్పే పెద్ద రహస్యం. ఏదీ పోదు. కొత్తగా ఏదీ రాదు. లేనిది లేనే లేదు. ఉన్నది పోదు. చీమా దోమా, రాయి రప్పా నుండి మనుషులు దేవతలు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు అందరూ కూడా ఎప్పుడూ ఉన్నారు. ఒక్కొక్కప్పుడు దృశ్యంగా ఉంటారు, ఒక్కొక్కప్పుడు అదృశ్యంగా ఉంటారు. ఇప్పుడు ఈ అగ్ని ప్రేరణ కలిగితే, అందులోంచి అందరూ బయటికి తోసుకు వచ్చేస్తారు. ఆ ప్రేరణ కలగకపోతే అందరూ నిద్రాణంగా ఉంటారు, నిద్రపోతూ. కాబట్టి నిద్రాణంగా ఉండే స్థితి నుంచి మేలు కొలిపే స్థితి లోకి పట్టుకు వచ్చే ఏకైక నామం 'వషట్'. అందుకని ' వషట్కారో ' అన్నారు. వషట్కారముల చేత దేవతలు నిన్ను ఆవాహనం చేసి, నీ ద్వారా సమస్త రూపాలు ఏర్పాటు చేసి, ఆ రూపాలలో నువ్వు వసించేటట్లుగా చేస్తే,

ఇదంతా ఇలా ఉన్నట్టుగా ఉంది. లేకపోతే ఏమీ లేదు. ఒకే తత్త్వాన్ని పిండారండి. అదే పురుష మేథం అంటే!

'దేవా యద్యజ్ఞం తన్వానాః, అబధ్నన్పురుషం పశుమ్ '

ఆ దిగివచ్చే తత్త్వం పురుషుడు అంటే! పురుషుడు అంటే దిగివచ్చి వసించి ఉండేవాడని, పురముల యందు నివసించేవాడు పురుషుడు. ఎవరీ పురుషుడు? పురాణ పురుషుడే! మొట్ట మొదటగా దిగి రావటానికి ప్రేరణగా దిగి వచ్చిన వాడే! అతడు అగ్ని స్వరూపుడు! అగ్ని గా దిగి వస్తాడు. అందుకని, అతనికి తెలియని దారులు లేవు. దేవతలకు తెలిసి, అతనికి తెలియనవి లేవు. దేవతలు సైతం అతను ఆధారంగా దిగివస్తారు. అందుచేత అన్నిటికన్నా ప్రప్రథమమైన ఆరాధన — అగ్ని ఆరాధన. ఏం సందేహం లేదు. 'తస్మాద్యజ్ఞాత్సర్వహుతః' కదా! సర్వహుతం అనే యజ్ఞం చేస్తారు దేవతలు. ఆ తత్త్వాన్ని మొత్తం వండేస్తారట. అయన లోనుంచి వచ్చిన దేవతలు ఆయన్ని వండితే, వివిధమైన లోకాలు, లోకస్థులు, లోకపాలకులు పుట్టుకొచ్చారండి. కాబట్టి దిగి రావాలంటే ముందు ప్రేరణ ఉండాలి కదా! ప్రేరణ లేకపోతే ఎంత కార్యక్రమం ఉంటే మాత్రం ఏముంది? తిరుమలలో మనం పెట్టుకున్న విష్ణు సహస్రనామం సదస్సు మనం ఎవ్వరం నిద్ర లేవకపోతే ఉందా? ఎవ్వరికీ మెలకువ రాలేదు అనుకోండి పొద్దున, ఏముంది? ఏమీ లేదు. హోమం లేదు, ధ్యానం లేదు, ఉపన్యాసాలు లేవు, దైవ దర్శనాలు లేవు, భోజనాలు లేవు, ఉపాహారాలు లేవు, టీలు లేవు, కాఫీలు లేవు. ఏమీ లేదు అంతే ! ఆ ఏమీ లేని స్థితి నుంచి మేలు కొలిపే వాడు ఎవడో వాడు వషట్కారుడు, అగ్ని.

'విశ్వాని దేవ వయునాని విద్వాన్' అంటే నువ్వేనయ్యా, నీకన్నా విద్వాంసులు ఎవరూ లేరు ఈ ప్రపంచంలో అని. అందుకే దీపం పెట్టుకోవటం కూడా. లేచి లేవగానే దీపాన్ని చూడటమో, దీపం పెట్టుకోవటమో! ఎందుకంటే ఆయనే ముఖ్యుడు, మొదటి వాడు. ఆయన తరువాతే మిగతావన్నీ. ప్రేరణ తరువాత కదా అన్నీనూ. మనలో ప్రేరణ కలగటానికి కారణం ఏమిటి? దాన్ని ఆలోచించావా ఎప్పుడన్నా? అది ఆధారంగా రకరకాల తైతక్కలూ ఆడతావు కానీ, అది లేకపోతే ఏమీ లేదే, అదే సృష్టికి మూలం! సృష్టి కార్యక్రమం అంతా కూడా, సమస్త విలాసము, వైభవము అంతటికీ కూడా ఆధారమైన వెండి తెర! వెలిగించబడిన వెండి తెర! అలా వెలిగించింది ఏమిటి? వెలగక ముందు కూడా తెర ఉంది, దానిమీద బొమ్మ పడదు. మీరంతా సినిమాలకి వెళ్ళిన వాళ్ళే కదా. ముందు తెర

ఎత్తిన తరువాత screen ఉంటుంది. Screen వెలిగిన తరువాత కదా బొమ్మలు పడతాయి. వెలగక పోతే బొమ్మలేమున్నాయి? Screen వెలిగిన తరువాత బొమ్మలు పడితే బొమ్మలు చూస్తాము కానీ, వెలిగిన screen దీనికి ఆధారమని ఎంత మందికి గుర్తుంటుంది. Television screen ఉంది. Switch on అయిన తరువాత కదా బొమ్మలు. Television on చేయటం అన్నా, సినిమా screen on చేయటం అన్నా, నీ బతుకును ప్రతీ రోజూ on చేయటం అన్నా, చేసేది ఒకటుంది. అది వషట్. అది అగ్ని. అతనికి తెలియనిది ఏమీ లేదు. అంత విద్వాంసులు ఎవ్వరూ లేరు. అందుకనే వేదంలో ముఖ్యమైన దేవత ఎవరూ? అగ్ని. సమస్తమూ అగ్నే! అందుచేత మొట్ట మొదటగా మానవుడు నేర్చుకున్న ఆరాధన - అగ్ని ఆరాధన! అదే నెమ్మది నెమ్మదిగా దీపాలు పెట్టుకోవటం గానూ, candles పెట్టుకోవటం గానూ అయ్యింది. ఎవరు ఎన్ని రకాల ఆరాధనలు చేసినా దీపం లేని ఆరాధన లేదు కదా! సూర్యుడు లేని సృష్టి లేదు కదా! అంతా దీపంతోనే! ఉన్నది వెలుగు! ఆ వెలుగుకు వచ్చే ప్రేరణ ఉన్నదే, ఆ ప్రేరణ వషట్. అతనికి అన్ని దారులూ తెలుసు కాబట్టి చీకటి దారిలో పడకుండా చూడు నాయనా అని కోరుకోవటం, ఆ శ్లోకం చాలా ముఖ్యం.

అగ్నేనయ సుపధారాయే అస్మాన్ విశ్వాని దేవవయునాని విద్వాన్
యుయోధ్యస్మజ్జుహురాణామేనో భూయిష్టాంతే నమఉక్తిం విధేమ

నా ప్రారబ్ధ కర్మ వున్నదే, దేనిచేత అయితే నేను బంధింపబడి అదే విధంగా ప్రవర్తిస్తూ, అలాగే అనంతంగా జన్మలెత్తుతూ, ముందుకు సాగనివ్వని రంగుల రాట్నం లాంటి జీవితం ఏదైతే ఉన్నదో, దాన్ని భస్మం చేసెయ్యి అని అడగటం, అగ్నిని కోరుకోవటం, అగ్ని ప్రార్థన! నాలో ఉండే సమస్తమైన కర్మ వాసనలను నువ్వు దగ్ధం చేసేసి, నన్ను సరైన వెలుగు దారుల్లో నడిపించు. అందుకు నేను నీకు నమస్కరిస్తున్నాను. మనకు ఈ శ్లోకము ఈశావాస్యోపనిషత్తు లో ఇచ్చారు. ఈ ప్రేరణే సమస్తానికి కారణం. మనం నిద్ర లేవక పోతే, జీవితంలో కొన్ని ఇబ్బందులు కలిగించుకునేవాళ్ళం కాదు. లేవటం బట్టి కదా మంచి పనులూ చేశాం, చేతగాని పనులూ చేశాం. చేతగాని పనుల వల్ల కదా ఇబ్బంది పడుతున్నాం. ఈ చేతగాని పనుల వల్ల ఇబ్బంది పడకుండా ఉండాలంటే అసలు లేవకుండా ఉంటే పోతుంది అనుకుంటే, అది కుదరదు. సృష్టించిన తరువాత, సృష్టే లేచిన తరువాత, నువ్వు నిద్ర లేవకుండా ఉండటానికి వీలు లేదు. లేచిన తరువాత చేసే పనుల లోంచి నిన్ను

బంధించేట్లుగా కాకుండా నీకు అనుభూతి నిచ్చేట్లుగా, సరైన స్ఫూర్తి నీకు కలిగేటట్లుగా చేయమని ప్రార్ధన. అందుచేత ఈ 'వషట్కారం' అనే నామం చాలా ముఖ్యమైన నామం. భగవంతుడు ప్రేరణగా మన యందు ప్రతి నిత్యం లేస్తూనే ఉన్నాడు. అతను లేస్తే మనం లేస్తాం.

'ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికం'

అందుకని దైవమునకు అనుసంధానం చెందటానికి, లేచి లేవగానే నన్ను లేపినది శ్రీ మహా విష్ణువు, నన్ను లేపినది ఆ మహా చైతన్యమే! కాబట్టి ఆ చైతన్యం లో నేనుంటూ, సమస్తాన్ని నిర్వర్తించుకుంటా. ఆ చైతన్యాన్ని మరచి కాదు. ఒకటి పక్కన ఎన్ని సున్నాలు చేరితే అంత విలువ. సున్నాలు ఉండిపోయి, ఒకటి లేదనుకోండి! ఆ సున్నాలకి విలువ లేదు. అట్లాగే ఎవరైతే నిన్ను ప్రేరణతో లేపారో, అతన్ని నువ్వు మరచినప్పుడు నువ్వు చేసే పనులన్నీ కూడా నిన్ను బంధించే పనులుగా ఉంటాయి. ఎందుకంటే దైవాన్ని మరచినప్పుడు ధర్మాన్ని మరుస్తావు. ధర్మాన్ని మరిస్తే బంధమే ఉంది సృష్టిలో. సృష్టి క్రీడంతా కూడా ధర్మాన్ని అనుసరిస్తూ ఆడవలసిన క్రీడే! ఏ ఆట ఆడినాసరే ఆ ఆటకు కొన్ని నియమాలు ఉంటాయి. ఆ నియమాలు పాటించక పోతే దానికి సంబంధించిన బంధం ఒకటి వస్తుంది. No ball అంటాడు, wide అంటాడు ఏవేవో చాలా చెప్తారు కదా cricket లో. ప్రతి ఆటకి కొన్ని నియమాలు ఉంటాయి. నియమాలు తప్పితే points పోతాయి. అలాగే సృష్టికి ధర్మం ఉన్నది. ధర్మం నీకు గుర్తుండాలంటే, దైవం గుర్తుండాలి. దైవం నీకు గుర్తుండాలంటే, నువ్వు లేచీ లేవగానే నిన్ను లేపిన వాడిని గుర్తు పెట్టుకో! నిన్ను లేపి నీలో ప్రాణ స్పందనగా ఉండి, నీలో చైతన్యంగా ఉండి, నీలో బుద్ధిగా ఉంటే, అవన్నీ పెట్టుబడిగా పెట్టుకుని మనం ఏవేవో పనులు చేస్తుంటే ఎలా? ఆయనకి సంబంధించిన పనులే అంటే సృష్టికి సంబంధించిన పనులే, సృష్టికి చేదోడు వాదోడుగా ఉండే పనులే చేసే వాళ్లే సాధువులు, సజ్జనులు, దేవతలు, సిద్ధులు సాధ్యులు, విద్యాధరులు లాంటి వాళ్ళు. సృష్టికి అనుగుణంగా జీవిస్తుంటారు. సృష్టికి అనుగుణంగా జీవించాలి అంటే మొట్ట మొదట లేవగానే, ఎవరు మనల్ని లేపారో మనం గుర్తు తెచ్చుకోవాలి. అది కృతజ్ఞత. మనల్ని లేపిన వాడిని మనం గుర్తు తెచ్చుకోకుండా, మనం ముందుకు వెళ్లిపోతే ఉపయోగం ఏముంది? వాడు మళ్ళీ పడుకోబెట్టేస్తాడు. ఈ పడుకోబెట్టే లోపల మనల్ని ఈ తెలివి యందు ఏ ప్రేరణ ఉంచిందో ఆ నామాన్ని 'వషట్కారము' అంటారు అని గుర్తు పెట్టుకోవాలి.

ఎందుకంటే మనం మొత్తం కథంతా కూడా నిద్ర లేవటంలో ఉందండి. నిద్ర లేవకముందు మనం సత్య స్వరూపులం. నిద్ర లేచి, భావన రాకముందు చైతన్య స్వరూపులం. ఆ భావన ధర్మ పరంగా ఉంటే, ఆ భావన నిర్వర్తించుకోవటం ద్వారా ఆనంద స్వరూపులం. అదీ సత్యము, చైతన్యము, ఆనందము. మూడూ కలిపితే, సచ్చిదానంద అయింది. ఇక అంతగాక మిగిలినవి ఎన్ని చేసినా కూడా, దుఃఖ హేతువులే! సత్యము చైతన్యము ఆనందము — మూడే ఉన్నాయి. ఈ సత్యము నుంచి వచ్చే ప్రేరణ ఏదైతే ఉన్నదో, చైతన్యం- చిత్ - ఆ చైతన్యం ఏర్పరచే ప్రేరణ వున్నదే, ఆ ప్రేరణ గురించి ఇక్కడ మాట్లాడుతున్నారు. మనకు కూడా మనయందు ఆ ప్రేరణ జరుగుతూ ఉంటుంది. గుర్తు పెట్టుకోండి. ఈ వెయ్యి నామాలు మనలో కూడా జరుగుతాయి. ఎందుకనీ? మన రూపము విష్ణు రూపమే! మరచి పోవటం చేత ఏదో వేరే రూపంగా నువ్వు భావిస్తున్నావే తప్ప, నిన్ను భగవంతుడు తనంతటి వాడిగా చేశాడు. God made man in His own image and likeness. తానెంత స్వతంత్రుడో, మానవుని అంత స్వతంత్రుడిగా సృష్టించాడు. తనయందు ఎన్ని శక్తులు ఉన్నాయో, మానవుని యందు అన్ని శక్తులూ ఉన్నాయి. తానెంతటి వాడో, తనంతటి వాడిగా తీర్చిదిద్దాడు. అందుకే ప్రతీ సద్గురువు కూడా ప్రతీ శిష్యుడిని తనంతతటి వాడిగా తీర్చి దిద్దుతానని వాగ్దానం చేస్తాడు.

'ప్రణత నిజ జనాన్ స్వాత్మతుల్యాన్ కరోతి ' అన్నారు మాస్టర్ CVV .
నాకు దండం పెట్టిన వాడినల్లా నా అంతటి వాడిని చేస్తాను అన్నారు. మీరెవరు అంటే, 'నేను బ్రహ్మన్ని రా!' అన్నారు. కాబట్టి ప్రతివాడూ బ్రహ్మమే! కాకపోతే ఏంటంటే మనకి తెలియదు. తెలిసినవారు బ్రహ్మమై కూర్చుని ఉన్నారు. వశిష్టాదులూ, అగస్త్యాదులూ ఆ విధంగా బ్రహ్మ తత్త్వం లో జీవిస్తూ, బ్రహ్మకు ప్రతి రూపంగా ఉన్నారు. మనలో మొట్ట మొదట జరిగే ప్రేరణని మనం గుర్తు పెట్టుకోవాలి. దానిని వెంటనే కూర్చుని ఆరాధన చేయాలి. పళ్ళు తోముకుని, కాఫీ తాగి, స్నానం చేసి అనేసరికి, ఈ లోపు చాలా చిల్లర భావాలు బోలెడు వచ్చేస్తాయి మనలో. అందుకని లేచీ లేవంగానే ఏదీ మనల్ని లేపిందో, దాని గురించి మనం ధ్యానం చేసుకోవాలి. మంచం మీదే చేసుకోమంటారు. మంచం మీద చేసుకోవటం ఏంటండీ, అపచారం కదండీ! అంటే చేసుకోకు, అది నీ దురదృష్టం. అంతకన్నా ఏమీ లేదు. నువ్వు ఆచారాలు పెట్టుకున్న కొద్దీ ఉంటాయి. దైవమును మనం సరాసరి పొందటానికి అది చాలా చక్కని సమయం. ఎందుకంటే, ఇంకా

వెర్రి మొర్రి ఆలోచనలు మనసులో పుట్టకముందు. లేచీ లేవంగానే ఎలా ఉంటుంది అంటే, నువ్వు పూర్తిగా అవ్యక్తంలో లేవు. వ్యక్తంలోకి చాలా తాజాగా వచ్చావు. తాజాగా వచ్చావు కాబట్టి ఆ తాజా తాజాగా వుండగానే, నువ్వు దాని గురించే ఆలోచిస్తే సులభంగా అందుతుంది. అందుకని దాన్ని మరువు మహర్షి ఏమన్నారంటే 'వజ్ర చైతన్యము' అన్నారు. పొద్దున్నే అంటే, నువ్వు లేచినప్పుడే నీకు పొద్దున, కదా! ఎవరికి సూర్యోదయం? మొత్తం ప్రాంతానికి ఒక సూర్యోదయం ఉంటుంది. ప్రతి మనిషికీ, వాడికొక సూర్యోదయం ఉంటుంది. వాడు లేచినప్పుడు వాడికి సూర్యుడు ఉదయించాడు. ఎవరు సూర్యుడు అంటే? చైతన్యం- మెలకువ కలిగించే వాడు. వాడిలో సూర్యుడు ఉదయించినప్పుడు వెంటనే కూర్చుని ఎవరు మనల్ని మేలుకొలిపారో వాడిని మనం ఆరాధన చేయాలి. అప్పుడు కొంచెం బలపడుతుంది. లేకపోతే మనం అంతా సర్దుబాటు చేసుకుని, prayer చేసుకునే లోపల ఎన్ని చిరాకులైనా వచ్చేయచ్చు మన మనసుకి. బ్రాహ్మీ ముహూర్తం అంటే, నువ్వు ఎప్పుడు లేచావో అప్పుడే నీకు, అన్నాడు బుద్ధుడు. నాలుగింటికే లేవాలి అని పెట్టారు అనుకోండి, అందరూ లేవలేరు కదా. నాలుగింటికే లేవాలి అనేవాడ్ని పొద్దునే తిట్టుకోవడం అవుతుంది ఈ లేచిన వాడు. ఈయన పొద్దున్నే నాలుగింటికి పెట్టాడు, ఆరింటికి పెడితేనే చస్తున్నాం కదా అనుకుంటాం. ఈ CVV గారు ఆరింటికి పెట్టారు, ఏడింటికి పెడితే బాగుండేది అనుకునే వాడిని చాలా కాలం. ఇప్పుడు నాలుగింటికి లేచి, బ్రాహ్మీ ముహూర్తం లో బ్రహ్మ గురించి ఆలోచించమంటే, బ్రహన్నా అదే వస్తుంది, ఎందుకంటే బృహ్మణము చేసేది బ్రహ్మము. అందుచేత మనం లేచినప్పుడే-- లేడికి లేచిందే వేళ కదా-- ఎక్కడినుంచి లేచాము? నన్ను లేపింది ఎవరు? అలారమా? అలారం పెట్టుకోక పోతే? అందుకని దానిమీద నువ్వు నిజంగా ఆరాధన చేస్తే, అది తెలిస్తే ఇక అన్నీ తెలుస్తాయి. ఏది తెలిస్తే అన్నీ తెలుస్తాయో అది, అదంటే! మనం చిల్లర చిల్లరగా చాలా చేస్తాం కానీ, పునాదుల్ని పట్టుకోం. మనకి చిల్లర విషయాల్లో చాలా ఆసక్తి ఎక్కువ. ఇక అక్కడి నుండి దిగివచ్చినవే కదా రకరకాల దేవతా స్వరూపాలు అన్నీ కూడా. కాని లేచీ లేవంగానే నిన్ను లేపింది ఉందే, అది చాలా ముఖ్యం. దాని గురించి చెప్తున్నారు. మూడవ నామం'వషట్కారము',' స్వాహాకారం'. దేవతలు ఆయన్నే పిలుచుకుని ఈ మొత్తం అంతా వండి పెట్టారు సృష్టిగా. ఎట్లా వండారు అనేది పురుష సూక్తం నిండా ఉంది. 27శ్లోకాలు. అందులో 15 శ్లోకాలలో మొత్తం

ఉంటుంది. మిగతా 12 శ్లోకాలు ఇంకొక ఛందస్సులో ఉంటాయి. ఈ నామం వరకూ మనబోటి పామరులం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే — నిన్ను లేపినది, నువ్వు ఉన్నట్లు నీకు తెలియపరుస్తున్నది ( అంతకు ముందు నువ్వు ఉన్నావని నీకు తెలియదు.), నీ అస్తిత్వాన్ని నీకు గుర్తు తెస్తూ ఉన్నది. గుర్తు తెచ్చే వాడేగా గురువు. అటువంటి తత్త్వము ఈ ‘ వషట్కారము ‘ అనే నామంలో మనకు గోచరిస్తుంది. అది మొదటి ప్రేరణ.

# 4. భూత భవ్య భవత్

భూతము, భవ్యమూ , భవత్తు . అంటే the past, the present and the future. జరిగిపోయిన కాలం, జరుగుతున్న కాలం, జరగబోయే కాలం. మూడూ దైవమే. శుద్ధ చైతన్యంగా వున్నప్పుడు అన్నీ వచ్చిపోయేవి, అని తెలుస్తుంది. ఒక నది వుందనుకోండి. అట్లా మనం ఒడ్డున వుండి చూస్తున్నామనుకోండి. ఎన్నో అటు నుంచి వస్తూ వుంటాయి ఇటు వెళ్ళిపోతూ వుంటాయి. ఇటు నుంచి వస్తూ వుంటాయి అటు వెళ్ళి పోతూ వుంటాయి. అంతేనా! నువ్వు వున్న చోటుకి వచ్చి, వెళ్ళిపోతూ వుంటుంది ప్రతీది. అంతకుముందు అది రావాల్సింది. అది వస్తుంది. వెళ్ళిపోతుంది. వెళ్ళిపోతే భూతం. రాకముందు భవిష్యత్తు. వస్తే ప్రస్తుతం. 'చైతన్యం అనే స్థితిలో వున్నవాళ్ళకి అన్నీ ఇలా జరిగి వెళ్ళిపోతూ వుంటాయి. ప్రతీదీ నడిచి వెళ్ళిపోతుంది అబ్బాయ్', అని చెప్తారు. ఎన్నో వచ్చి వెళ్ళిపోతూ వుంటాయి నదిమీద. నది అట్లాగే వుంటుంది కదా! నదేకాదు, నదిలో నీరు చూడండి. కొంత నీరు అలా ప్రవహిస్తూ వెళ్ళిపోతూ వుంటే, నీవు కూర్చున్న స్థానం దగ్గర, ఆ స్థలం దగ్గర, వచ్చే నీరుంటుంది, వెళ్ళిపోయే నీరుంటుంది. ఎప్పుడూ అదే నది పారుతూ వున్నట్టుగా వుంటుంది. అంతేగా! కానీ అదే నీరా? అవే నీటి బిందువులా? వచ్చి వెళ్ళిపోతున్నా ఒకే నదిగా కనిపిస్తుంది. అందుచేతనే, ఒక నదిలో నువ్వు ఒక కాలు పెట్టి తీసి, మళ్ళీ రెండోసారి కాలు పెడితే ఆ నది కాదది అంటారు. కానీ అదే నది! అదే, అది కాదు. అంటే ఆ జలము కాదు గానీ, ఆ నదే! ఆ ప్రవాహమే! కాబట్టి ప్రవాహానికి భూత భవిష్యత్ వర్తమానాలు లేవు. అలాగే చైతన్యానికి భూత భవిష్యత్ వర్తమానాలు లేవు. ఇందాకటి ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవలసిందే నీవు శుద్ధ చైతన్య స్వరూపుడుగా భావాతీతమైన స్థితిలో వున్నట్లయితే. అది ఎవరికి సాధ్యం? ధ్యానములో ఉత్తమ స్థితిని పొందిన వారికి సాధ్యం. అలా వున్నవాడికి ఏం జరుగుతుంది? అలా భావాలు వస్తూనే వుంటాయి, వెళ్ళిపోతూనే వుంటాయి. భావాలు వచ్చి వెళ్ళిపోతున్నా నువ్వున్నావు శాశ్వతంగా. ఏవేవో వచ్చినాయి, వెళ్ళిపోయినాయి. ఎన్నో సన్నివేశాలు వచ్చినాయి, వెళ్ళిపోయినాయి. ఎంతోమంది మనుషులు వచ్చారు, కలిసారు, వెళ్ళిపోయారు. కదా! ఎంతోమంది పుట్టారు మన కళ్ళముందు. ఎంతోమంది వెళ్ళిపోయారు మన కళ్ళముందు. ఎంతోమంది

వున్నారు మన కళ్ళముందు. అది అంతవరకు బానేవుంది. శుద్ధ చైతన్యస్థితిలో వున్నప్పుడు నీ శరీరంలో కూడా వచ్చే మార్పులన్నీ నీకు తెలుస్తాయి. ఓహో! ఇది పుట్టుకొస్తోంది, ఇది వెళ్ళిపోతోంది. అంతేకాదు ఇంకొంచెం ముందుకెళితే, ఈ శరీరం పుట్టుకొచ్చింది, వెళ్ళిపోతోంది. ఇది వస్తోంది, పోతోంది నేనున్నాను. 'నేను' ఎప్పుడూ వున్నాను. శరీరానికి భూతమున్నది. భవిష్యత్ వున్నది. వర్తమానం వున్నది. నీకు లేదు. అదెలా? వెండితెరలాంటిది. వెండితెర మీద బొమ్మలొస్తూ వుంటాయి, వెళ్ళిపోతూ వుంటాయి. బొమ్మలొస్తూ వుంటాయి, వెళ్ళిపోతూ వుంటాయి. బొమ్మ రాకముందు సినిమా వస్తుంది దానిమీదకి అంటాం. తర్వాత సినిమా వచ్చినప్పుడు వెండితెరే కనిపించదు. సినిమా అంతా అయిపోతుంది. మిగిలిందేమిటి? వెండితెర! మళ్ళీ సినిమా వేసారు. అంతేకాదు ఆ సినిమాయే కాదు,ఇంకో సినిమా వస్తుంది. కదా! ఆ వెండితెర మీద ఎన్ని సినిమాలు జరగలేదు? వెండితెర అలాగే వుందిగా! ఉందా? వెండి తెరకేమైంది? వచ్చిపోయే వాటికి భూతము, వర్తమానము, భవిష్యత్తు కానీ శాశ్వతత్వానికి భూతమేమిటి? వర్తమానమేమిటి? భవిష్యత్తేమిటి? లేదు! ఈ ఉదాహరణలు ఆలోచించండి. నదిమీద ప్రయాణం చేస్తున్నవి ఆలోచించండి. నదీజలముల యొక్క ప్రయాణం ఆలోచించండి. వెండితెర మీద వస్తున్న సినిమాలని ఆలోచించండి. మీరు వెండితెర. మీరు నదీప్రవాహము. ఎప్పుడూ వుంటుంది. దానిమీద అన్నీ వచ్చిపోయేవేరా! ఏమిలేదు నువ్వుంటావు. అందరూ వుంటారు. అన్నీ వచ్చిపోతూ వుంటాయి. నీలో శాశ్వతముగా యుండే భాగము కొంత ఉన్నది. కొంత మార్పు చెందే భాగమున్నది. నీలో కొంతభాగం అక్షరుడు. కొంతభాగం క్షరుడు. క్షరభాగం ఎప్పుడూ మారిపోతూనే వుంటుంది. మారిపోయేవాటి గురించి నువ్వు ఏడుస్తావేమిటి? మారని వాడివిగా నువ్వున్నావు కదా! మనకి ఘంటసాల గారు చదివిన "వాసాంసి జీర్ణాని యధావిహాయ" వుంది కదా . మనకి భగవద్గీత శ్లోకాలు తెలియకపోయినా, కొన్ని శ్లోకాలు ఘంటసాల గారు చదివినవైనా చివరికి వినబడుతూ వుంటాయి కదా. శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఏమన్నాడు? ఇదంతా "ఆగమాపాయన:" అన్నాడు. అన్నీ వచ్చిపోయేవే. నువ్వూ వుంటావు. వాళ్ళు వుంటారు. ఎవ్వరూ పోరు. మనకి భూతము, భవిష్యత్తు, వర్తమానం లేదు. మనకి ఎప్పుడు వుంటుందంటే, మనం మార్పులో పడిపోయి వుంటే, మనకి వుంటుంది. There is no past, there is no future and there is no present. It is

eternal present. ఒకే ఒక శాశ్వతత్వము వుంటుంది. కాబట్టి అతడు భవిష్యత్తు అనుకుంటే భవిష్యత్తు. భూతము అనుకుంటే భూతము. వర్తమానం అనుకుంటే వర్తమానం. ఎందుకనీ? ఈ సృష్టి మొదలైన దగ్గర్నుంచి, సృష్టి అంతం అయ్యేంతవరకు అతడున్నాడు కదా! అంతేనా సృష్టి లేనప్పుడు కూడా వున్నాడు. అతడే కాదు మనం కూడా వున్నాం. 'దేహో దేవాలయ ప్రోక్త: జీవో దేవస్సనాతన:' అన్నారు కదా! ఈ దేవాలయం దేహం. అందులో వుండే జీవుడు సనాతనుడు. సనాతనుడంటే ఎప్పటివాడో? వాడికి వయస్సు లేదు. ఒక మహాత్ముణ్ణి పాశ్చాత్య దేశాల్లో ఒకాయన అడిగాడట. మా Christ ఎప్పుడు పుట్టాడో మాకు తెలుసు. మీ కృష్ణుడు ఎప్పుడు పుట్టాడో మీకు తెలుసా? Date, time. అంటే ఆయన మా కృష్ణుడు పుట్టడని చెప్పాడు. కృష్ణుడు పుట్టడయ్యా. పుట్టడు కాబట్టి చావడు. ఎప్పుడూ వుంటాడు. ఎప్పుడూ వుండేవాడికి పుట్టుక date ఏమిటి? అని అడుగుతాడు. మీ Christ కూడా అదే! మీరు మూర్ఖులు. అందుకని ఆయన పుట్టాడంటారు మీరు. అంతకన్నా ఏమీలేదు అంటాడు. ఎంత గొప్ప విషయం. ఎంత తెలిసినవాడు. దైవానికి పుట్టుకేమిటి? శరీరం ధరించినా, శరీరం వదిలేసినా ఎప్పుడూ వుండేవాళ్ళకి ఇప్పుడు పుట్టాడని ఏముంది? వశిష్టుడు, అగస్త్యుడు ఇటువంటివారు అన్ని యుగాల్లోనూ, అన్ని పురాణాల్లోనూ, అన్ని సమయాల్లోనూ ఎప్పుడూ వున్నవాళ్ళు. వాళ్ళు ఇప్పుడు పుట్టారని చెప్పండి. చెప్తారా? అత్రి మహర్షి ఎప్పుడు పుట్టాడు? Date, time వుంటుందా? ఉండదే. శాశ్వతులకు date ఏమిటి? Time ఏమిటి? ఇప్పుడు పుట్టామని నువ్వు నీ గురించి అనుకోవడానికి వీల్లేదు. నువ్వు అప్పుడు బయటకి వచ్చావు. అంతకుముందు కూడా వున్నావు నువ్వు. నీ పుట్టిన తేదీకి ముందు నువ్వు లేవా? ఉన్నావుగా. తల్లి కడుపులో వున్నావుగా. ఉండబట్టే కదా బయటకి వచ్చావు. బయటకి వస్తే పుట్టినట్టా? ఎప్పుడు పుట్టినట్టు? తల్లి కడుపులో పడితే పుట్టినట్టా? కాదే. తల్లి కడుపులోకి రావాలంటే, నువ్వు వుండాలిగా. తల్లి కడుపులో పడ్డాడంటే? ఎక్కడి నుంచి పడ్డాడు? తండ్రి బుర్రలోంచి, తండ్రి శుక్రధాతువు లాగ వచ్చి తల్లి గర్భంలో పడతాడు. తండ్రి తలలోకి ఎప్పుడు వచ్చాడు? రాకపోతే ఏమీ రాదుగా. జీవులకి పురుషుని తలకాయ runway. దానిమీద land అవుతూ వుంటారు వాళ్ళు వచ్చి. Land అయితే అక్కడ నించి ఈ ఏడు ప్రజ్ఞల ద్వారా శుక్రధాతువుగా దిగివచ్చి, వీర్యంగా తల్లి గర్భంలో ప్రవేశిస్తాడు. అక్కడ పెరుగుతాడు. అక్కడ నుంచి బయటకు వస్తాడు. బావుంది.

కాబట్టి ఎప్పుడు పుట్టాడండి వీడు? ఈ బయటకు వచ్చినప్పుడు పుట్టాడా? కడుపులో వున్నప్పుడు పుట్టాడా? తండ్రి దగ్గర వున్నప్పుడు పుట్టాడా? తండ్రి దగ్గరకు ఎప్పుడు వచ్చాడు? నీకు తెలుస్తుందా? జ్యోతిష్యంలో తెలుస్తుంది. ఏం తెలుస్తుంది? తల మీద ఎప్పుడు వాలాడో తెలుస్తుంది. ఇక్కడ వాలినది కూడా పుట్టినరోజు కాదే. అంతకుముందు కూడా వున్నావుగా నువ్వు. అంతకుముందు వుండబట్టి కదా వాలావు. లేకపోతే ఏం వాలుతుంది? ఆకాశంలో తిరగని విమానం landing ఎట్లా అవుతుంది? అవదుగా! ఈ గాల్లో తిరిగే ఈగ గుండు మీద వాలిందనుకోండి. అసలు వుండాలిగా వాలడానికి. కాబట్టి అది వుంది అంతకుముందు. అంతకుముందు వుంది. అట్లా ఎప్పటి నుంచి వుందో? ఎప్పటి నుంచి వుందో చెప్పనా, అన్నాడు ఒక ఋషి. చెప్పమంటే ఎప్పుడూ వుంది, అని చెప్పాడు. ఏది? జీవుడు. దేముడే కాదు, జీవుడు కూడా. గుర్తు పెట్టుకోండి. ఇవన్నీ మనకు తెలియకుండా ఏదో పుట్టామని, చచ్చిపోయామని రకరకాల గొడవలు. కృష్ణుడు పాపం మొట్టమొదట ఇచ్చిన సందేశం చావు గురించే! నన్ను చంపకురా. నేను చావలేదు అంటాడు. అట్లా ఏడుస్తూ, ఏడుస్తూ నన్ను చంపేయకు నువ్విప్పుడు. నాకూ చావులేదు, నీకూ చావులేదు. నీ ఎదురుగుండా పోరాడే వాళ్లకీ చావులేదు. ఎవ్వరికీ చావులేదయ్యా! ఏదో పాతబట్టలు తీసి కొత్త బట్టలు వేసుకున్నట్లు వస్తూ వుంటాం, పోతూ వుంటాం. బట్టలు మారుస్తూ వుంటాం గానీ, మనుషులు అదే కదా! నిన్న వేసుకున్న బట్టలు ఇవాళ వేసుకోకపోయినంత మాత్రాన మనం ఒకళ్ళ నొకళ్ళు గుర్తించట్లేదా? గుర్తిస్తున్నాంగా! నిన్న పైజమా, లాల్చీ వేసుకున్న ఆయన ఇవాళ pant, shirt వేసుకుంటే ఆయన వేరు, ఈయన వేరా? అంతే మన బతుకులు. అట్లాగే వున్నాయి. ఎందుకంటే క్రిందటి జన్మలో వుండే జీవుడు ఈ జన్మలో ఇంకొక చొక్కా, లాగు వేసుకొచ్చాడనుకోండి. అంటే క్రిందటి జన్మలో pant, shirt వేసుకొని వుండవచ్చు. ఈ జన్మలో చీర, జాకట్టు వేసుకొని వుండవచ్చు. మనకి తెలియదుగా! అంటే మనం దేన్నిబట్టి పోతున్నాం? చొక్కా, లాగుని బట్టి గుర్తిస్తున్నాం తప్ప, జీవుడి బట్టి గుర్తించట్లా. మహాత్ముల్లో? వాడు ఎటు పోయినా వాడే వీడు అని తెలిసి వుంటుంది వాళ్ళకి. కదా! ఎందుకలా తెలుస్తోంది? వాళ్ళు మార్పు చెందని విషయములందు స్థిరమైన వాసం కొనివున్నారు. మనం మార్పు చెందే విషయములలో బాగా స్థిరమైన వాసం ఏర్పాటు చేసుకోవడానికి నానాతిప్పలు పడిపోతున్నాం. మరువు మహర్షి ఈ

జీవులు చేసే ప్రయత్నాలన్నీ ఎట్లా వుంటాయో చెప్పమంటావా? అంటారు. చెప్పమంటే, "నదీప్రవాహంలో ఒక పడవ వేసుకొని అక్కడ నిలబడదాం అన్నట్లుగా వుంటాయిట. నదీప్రవాహంలో నువ్వు స్థిరంగా వుండటానికి చేసే ప్రయత్నంగా వుంటుంది. ఆ ప్రవాహం ఏమో వెళ్ళిపోతూ వుంటుంది. అందుకని అస్థిరత వుండే భాగంలో స్థిరత్వం కోసం ప్రయత్నం చేసే ఈ మానవుల తెలివి గురించి నేనేం మాట్లాడను. మహత్తరమైన ప్రవాహంలో పునాదులు తీసి, భవనాలు కట్టేసి శాశ్వతంగా వుండిపోదామనుకుంటారే! మీ గురించి నేనేం చెప్పను? మీకు నేనేం చెప్తే అర్ధమవుతుంది?" అని అంటారు మరువు మహర్షి. మనలో శాశ్వత భాగం వుంది. అశాశ్వత భాగం వుంది. There is something mutable and there is something immutable. నీ immutability లో నువ్వున్నావనుకో, నీకు మార్పు అంతా కూడా సినిమాలాగ కనిపిస్తుంది. నువ్వు mutability లో వున్నావనుకో, నీకేం కనిపిస్తుంది? కొట్టుకుపోతావు. భయంకరమైన వరదలు వస్తూ వుంటే, నువ్వు ఒడ్డు మీద కూర్చుంటే, ఒహో ఏమి వేగంగా వస్తోంది, ఎంత అద్భుతంగా ప్రచండంగా వస్తోంది, ఎంత భీకరంగా వుంది, ఎన్ని పెద్ద పెద్ద వృక్షాలు ఇందులో కొట్టుకుపోతున్నాయి, ఎన్ని జంతువులు శవాలై తేలుతూ వెళ్ళిపోతున్నాయి, ఎన్ని ఇళ్ళు కూలిపోయి దూలాలు వెళ్ళిపోతున్నాయి, ఎంతమంది శవాలు తేలుతున్నాయి, అన్నీ చూడచ్చు. నువ్వు అందులో వుంటే? ప్రవాహంలో వున్నవాడికి, ప్రవాహంలో లేనివాడికి ఏమిటి తేడా? ప్రవాహంలో లేనివాడికి ప్రవాహం యొక్క వైభవం అంతా కనిపిస్తుంది. ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికేం కనిపిస్తుంది? అందుచేతనే ఈ జీవనము ఒక మహత్తరమైన భగవంతుని వైభవము అని చెప్తే, ఏడిశావులే అంటారు చాలామంది. కదా! ఎందుకంటారు? ప్రవాహంలో కొట్టుకుపోతూ వుంటారు కాబట్టి. ఒడ్డున నిలబడి స్థిరంగా వున్న వాడికి అంతా చూస్తూ వుంటాడు. ఇదంతా భగవంతుడి లీల అని. మహోత్తరమైన వైభవం. అందుకని ఈ జీవన ప్రవాహము ఒకటి వున్నది. ఆ ప్రవాహాన్ని చూడాలంటే నువ్వు చైతన్యంలో స్థిరపడి వుండాలి. అలా స్థిరపడి వుండటమే చైతన్యము నందు స్థిరపడటము. అలాంటి వాడే దైవము కూడా! ఎందుకంటే నీవూ దైవాంశవే! అందుచేత భగవంతుడి విషయంలో past , present, future లేదంటే పెద్ద కష్టం కాదనిపిస్తుంది. ఆయన గురించి ఏం చెప్పినా ఆస్తికులు ఒప్పుకుంటారు తెలియకపోయినా! అది నీకు కూడా అన్వయం చేసుకోవాలి. అలా ఇచ్చారు మన

పెద్దలు అన్నీకూడా. నీయందు దర్శనం కాని దేముడు, బయట దర్శనం కాడు. ఏం సందేహం లేదు. నీ మనోభ్రమలు, భ్రాంతులుగా రకరకాలు దర్శనాలు కావాలి తప్ప, నీయందు నీకు దర్శనం కానిది, నీకు బయట దర్శనం కాదు. అంత:కరణలో ముందు దర్శనం అయితే తర్వాత బాహ్యంలో కూడా అదే కనిపిస్తుంది. రామకృష్ణుల యొక్క దర్శనాలన్నీ అవే! ముందు అంత:కరణలో దర్శించిన తర్వాత, అది బయట నిజమని తెలిసింది. అలా మనకి ప్రతీది అంతర్ముఖంగానే దర్శనం అవుతుంది. నీవే దైవస్వరూపముగా నీకు తెలుస్తుంది. అందుకనే కదా పెద్దవాళ్ళు ''దివ్యాత్మ స్వరుపులారా'' అంటారు. మన బొంద మనం దివ్యాత్మ స్వరూపులేమిటి? అని అనిపించకూడదు. ఎందుకంటే సత్యమదే కదా! అందరం దివ్యాత్మ స్వరూపులమే! అందుచేత అతనికే లక్షణములు వున్నాయో మనకీ ఆ లక్షణములు వున్నాయి. ఉన్నాయంటే ఎలా తెలుస్తాయంటే, అంత:కరణలో ప్రవేశిస్తే తెలుస్తాయి. అంత:కరణలో ప్రవేశించాలంటే, బహి:కరణలు కొంచెం ముడుచుకొని లోపలకి వెళ్ళాలి. అంతర్ముఖం అవ్వాలి. అంత:కరణ శుద్ధిలో, నీవు అక్కడ వున్నప్పుడు, నీకు భూత భవిష్యత్ వర్తమానాలన్నీ కూడా ఇదొక ప్రవాహం, అన్నీ వచ్చిపోయేవే అని తెలుస్తూ వుంటుంది. అంటే ప్రతి నామంలో కూడా భగవంతుని యొక్క అస్తిత్వము, భగవంతుని యొక్క లక్షణము, తత్వము తెలుసుకోవటమే కాకుండా అది మనయందు ఎట్లా సత్యం? అని చూసుకోవటం మనకి ముఖ్యం, మనం సత్సాధకులం అయినట్లయితే. లేకపోతే అలా కీర్తనలు చేసుకుంటూ ఓహో, ఆహా అనుకుంటూ వుండటమే. ఎందుచేతనంటే నీకు నిజమవ్వాలి కదా! ఆ నామము నీకు నిజమవ్వాలంటే నీవు దానికి సంబంధించిన సాధన చేయాలి. ఈ భూత భవిష్యత్ వర్తమానాలేవైతే వున్నాయో, ఈ మూడూ కూడా భగవంతుని యందు తేలిపోతున్న సన్నివేశములు. భగవంతుడంటే ఎవరు ఇక్కడ? మహాచైతన్యం! ఆ చైతన్యంలో గోళాలు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. మనుషుల మాటేమిటి? ఒక గోళము వచ్చి వెళ్ళిపోయే లోపల ఇంకో గోళము అక్కడ తయారై వుంటుంది. 'Globe Chains' అని మహోత్తరమైన విషయాన్ని Madam Blavatsky, Secret doctrine లో అందించింది. మన వేదాల్లో వుండే విషయం మన వాళ్ళెవరూ కూడా చెప్పకోను కూడా చెప్పకోరు. ప్రతి గోళానికి మూడు గోళాలు వెళ్ళిపోయేవి వుండగా మూడు గోళాలు వచ్చేవి వుంటాయి. ఏడు గోళాలు ఒక chain గా వస్తూ వుంటాయి. మనకు కూడా ఏడు తరాలు చెప్తారు. మనం కనక మహోత్తరమైన

పుణ్యకార్యాలు చేస్తే, మన ముందు మూడు తరాలు, మన తర్వాత మూడు తరాలు కూడా ఉద్ధరింపబడతాయి అంటారు కదా! మనం పిచ్చిపనులు చేస్తే, మన ముందు మూడు తరాలు, మన తర్వాత మూడు తరాలు దెబ్బతింటాయి. గుర్తుపెట్టుకోండి. మంచిపని చేస్తే ఉద్ధరింపబడినపుడు, పిచ్చిపనులు చేసినపుడు దెబ్బలు కూడా తగులుతాయి వాళ్ళకి. అందుకనే ఒక గురువు, ఒక శిష్యుడు వున్నారనుకోండి. శిష్యుడు చేసే పనుల వల్ల, గురువుకి కూడా వుంటుందిట. శిష్యుని వలన గురువు ఉద్ధరింపబడవచ్చు. శిష్యుని వలన గురువు దెబ్బతినవచ్చు. అందుకనే శిష్యునికి బాధ్యత వున్నది గురువు విషయంలో. పిచ్చిపిచ్చిగా వుండటానికి వీల్లేదు.

"ఋతం వదిష్యామి సత్యం వదిష్యామి
తన్మామవతు తద్వక్తారమవతు అవతుమాం అవతు వక్తారం",

'నేను సత్యాన్నే పలుకుతాను. నేను నిజాన్నే పలుకుతాను. త్రికరణశుద్ధిగా వుంటాను. సత్యమంటే దైవము. దాన్నే పలుకుతాను. దాన్నే వ్యాప్తి చేస్తాను. దాని ధర్మంలోనే జీవిస్తాను. నేనలా వుండటం వల్ల నన్ను నేను రక్షించుకోబడతాను. అంతేకాదు దానివల్ల నా గురువు రక్షింపబడుగాక!' అంటే, నువ్వు అధర్మంలో వుంటే? అందుకనే అంత తొందరగా గురువులెవరూ వీడు నా శిష్యుడని అంగీకరించరు. అంగీకరిస్తే ఇబ్బంది. తొందరపడి వ్యామోహపడిపోయి నా శిష్యుడు, నా శిష్యుడంటే, వాడు చేసేవన్నీ ఆయనకి తగులుతూ వుంటాయి, మంచీచెడూనూ. కొడుకు చేసేవి తండ్రికి తగులుతూ వుంటాయి. అందుకని కదా రాముడు, మా నాన్న కోసం నేను అరణ్యానికి వెడతాను. నాకోసం కాదని చెప్తాడు. రాముడు తనకోసం అరణ్యానికి వెళ్ళాల్సిందేమీ లేదు. తండ్రి కోసం అరణ్యానికి వెళ్ళాడు. ఎందుకనీ? తాను అరణ్యవాసం చేయకపోతే, తన తండ్రి తన తల్లికి ఇచ్చిన మాట వ్యర్థమైపోతుంది కాబట్టి, వ్యర్థమైతే అసత్య దోషము తండ్రికి తగులుతుంది కాబట్టి, తత్కారణంగా అతని ముందు మూడు తరాలు దెబ్బతింటాయి కాబట్టి, తత్కారణంగా అతని తర్వాత మూడు తరాలు దెబ్బతింటాయి, ఇన్నిరకాల బాధలు వున్నాయి కాబట్టి నేను అరణ్యానికి పోతేనే సుఖం అనుకున్నాడు రాముడు. ఎంత ఆలోచించాడు? నిజానికి ఎన్నో రకాల ధర్మాలు రాముడికి చెప్తారు. నిజమే! సత్యమే! అతడు మొదటివాడు. అతడే రాజ్యాభిషేకం చేసుకొని పరిపాలించవలసిన వాడు. ఎవరికైతే రాజ్యం ఇవ్వాలని తల్లి కోరిందో, అతడే వచ్చి ప్రాధేయపడ్డాడు. కోరిన తల్లి ప్రాధేయపడ్డది. అందరూ ప్రాధేయపడ్డారు. 'మేమే కదా ఆయన్ని

కోరాము. మేమిప్పుడు withdraw చేసుకుంటున్నాము. నువ్వు వచ్చేయరా నాయనా', అని కోరింది తల్లి. 'నువ్వు వచ్చేసెయ్ అన్నయ్యా లేకపోతే నేను రాజ్యం చేయను. నేను చచ్చిపోతాను', అంటాడు కదా భరతుడు. భరతుడు ప్రాయోపవేశం చేయడానికి కూడా సిద్ధపడతాడు. అవన్నీ అలా వుంచండయ్యా నాన్న సంగతి ఏమిటి? అని అడుగుతాడు. ఇపుడు నేను రాజ్యాభిషేకం చేసుకొని రాజునై వుండటం కాదు ముఖ్యం. నాన్న సంగతి ఏమిటి చెప్పండి? నాన్న సంగతి ఏమిటి ఎవరూ చెప్పలేరా? అంటాడు. నాన్న కోసం కదా! నాన్న దెబ్బతింటే నేను దెబ్బ తిననా? నాన్న దెబ్బతింటే తాత దెబ్బతింటాడు. ముత్తాత దెబ్బతింటాడు. ఆయన తండ్రి దెబ్బతింటాడు. నాన్న దెబ్బతింటే నేను దెబ్బతింటాను. రేప్రొద్దున్న నాకు పుట్టే సంతతి దెబ్బతింటుంది. వాళ్ళ సంతతి దెబ్బతింటుంది. ఇంత ఆలోచించాడు రాముడు. అదీ మన ధర్మం. ఎవరు చెప్పారండి రామాయణం? ఊరికే కబుర్లు చెప్పటం తప్ప, రామాయణం చదువుకుంటే రాముడు ఈ మాట అంటాడు. ముందు మూడు తరాలు, తర్వాత మూడు తరాలు ఏమైపోతాయి? అని. ధర్మాలు తెలుసుకోవాలి. మనం చేసే పనుల వల్ల మన పూర్వీకులు తరిస్తారు. మనం చేసే చెత్తపనుల వల్ల మన పూర్వీకులు దు:ఖపడి క్రిందకొస్తారు. ధర్మరాజంతటి వాడికి నారదుడు చెప్తాడు, నువ్వు రాజసూయం చేస్తే, మీ నాన్న వెళ్ళి ఇంద్రసభలో కూర్చుంటాడయ్యా! ప్రస్తుతం యమసభలో వున్నాడని. కొడుకులు మరి మీరేదైనా చేస్తే కదా వాళ్ళకి కలిసొచ్చేది? అనిచెప్తే, చేస్తాడు పాపం. ఆయన ఇంద్రసభలోకి వెళ్తాడు. ఈయన అరణ్యానికి వెడతాడు. అది వేరే సంగతి. భూత భవిష్యత్ వర్తమానాలు అన్నీ తెలిసినవాళ్ళు ఇలా వుంటారు. ఆ విధంగా జీవిస్తూ వుంటారు. అందుచేత ఏదో ప్రస్తుతానికి, తాత్కాలికంగా కొంత ఏదో లాభిస్తుందని మనం చేసే చెత్తపనులుంటాయి చూసారా, అవన్నీ ధర్మానికి వ్యతిరేకమే! అంతా ఇప్పటికిప్పుడు చూస్తూంటాం. ప్రస్తుతానికి బానేవుంటుంది. ఎప్పుడూ కూడా అశుభమైన వాసన ప్రస్తుతానికి ఆనందం కలిగించి, తర్వాత దీర్ఘకాల దు:ఖాన్నిస్తుంది. శుభవాసన ప్రస్తుతానికి కొంచెం చేదుగా వున్నా, తర్వాత చాలా సుఖాన్నిస్తుంది. శుభవాసనెప్పుడూ శొంఠీకొమ్ము లాంటిది. అది కంట్లో పెట్టుకున్నప్పుడు మండుతుంది. తర్వాత చల్లగా వుంటుంది. ముందు చేదు, తర్వాత తీపి వుండేది ముఖ్యం తప్ప, కొంచెం తీపిగా వుండి తర్వాత చాలాకాలం చేదుగా వుండేది మనకేల? ఆ విధంగా నీవు శాశ్వతుడవు కాబట్టి ఈ సృష్టిలో వుండే విషయముల

యందు నువ్వు ప్రతిస్పందిస్తున్నప్పుడు అవేవీ నిన్ను పట్టి పీకకూడదు. అందుకని భూత భవిష్యత్ వర్తమానాలు మూడింటిని మనసులో పెట్టుకొని నిర్వర్తించుకుంటూ వుండాలి. అలా నిర్వర్తించుకుంటూ వుంటే నీవు క్రమశ: తామరాకల్లే వుంటావు. తామరాకు మీద నీటిబొట్టల్లే అనబోకండి. తామరాకు మీద నీటిబొట్టు అశాశ్వతం. తామరాకు శాశ్వతం, నీటిబొట్టుతో పోల్చి చూస్తే. తామరాకు మీద నీటిబొట్టు అంటే దేనికి మనకది సూచిస్తున్నారు? తామరాకుని సూచిస్తున్నారు. నీటిబొట్టుని కాదు. ఎన్ని మంచుబిందువులు పడ్డా, తామరాకు వాటిని అంటించుకోదు. బిందువు వస్తుంది. జారి వెళ్ళిపోతుంది. తామరాకు అట్లాగే వుంటుంది. ఎక్కడా దానికి తడి అంటదు. కదా! ఇంకో బిందువు వస్తుంది రేపు. రోజూ పది బిందువులు పడుతూ వుంటాయి. పోతూ వుంటాయి. తామరాకుకేమీ అంటదు! మనకి రోజూ పది సన్నివేశాలు వస్తూ వుంటాయి. పోతూ వుంటాయి. పది సన్నివేశాలు వస్తూ వుంటాయి. పోతూ వుంటాయి. నువ్వు తామరాకు లాగ వుండాలి. నీటిబొట్టు లాగ కాదు. నీటిబొట్టు లాగ అంటే క్షణికం అది. గట్టిగా సూర్యుడి కాంతి రాగానే, బుడుక్కు అయిపోతుంది దాని సంగతి. ఆలోచించండి. తామరాకు మీద నీటిబొట్టల్లే కాదు. నీటిబొట్టు పడ్డ తామరాకల్లే అనుకోవాలి. అట్లాగే అన్నీ వచ్చిపోతాయి. ప్రతీ విషయం వచ్చిపోతుంది. నేను పుట్టంగానే వచ్చారా నాకు పెళ్ళాం, పిల్లలు? లేదుగా! దారిలో వచ్చారు. దారిలో వచ్చినవన్నీ దారిలోనే వెళ్ళిపోతాయి. అట్లా పెళ్ళాం, పిల్లల విషయంలో వైరాగ్యం చూపించచ్చు. ఈ శరీరం కూడా దారిలో వచ్చి, దారిలో వెళ్ళిపోయేదే! అది తెలియాలి కదా! నీకు దారిలో వచ్చింది శరీరం, దారిలో వెళ్ళిపోతుంది. దారిలో వచ్చిన సంపద దారిలో వెళ్ళిపోతుంది. లేకపోతే అదుంటుంది. నువ్వెళ్ళిపోతావు. ఏదైతే ఏమిటి? నువ్వు మాత్రం ఎప్పుడూ అట్లాగే వుంటావా? నీకివన్నీ వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. శత్రువులు వస్తారు, పోతారు. మిత్రులు వస్తారు, పోతారు. అందరూ వస్తారు, పోతారు. అన్నీ పోతాయి. నువ్వు మాత్రం చైతన్యవంతంగా అట్లా వుంటూ వుండు. ఉంటే భూతము లేదు, భవిష్యత్తు లేదు, వర్తమానం లేదు ఇదంతా హుళక్కి, అని నీకు తెలుస్తుంది. ఇదంతా ఒక సినిమా. ఇదంతా ఒక నాటకం అని ఎవరికి తెలుస్తుంది? చైతన్య స్వరూపుడుగా తన్ను తాను అనుసంధానం చెందినవాడికి తెలుస్తుంది. కాబట్టి నువ్వేం చేయాలి? నేను చైతన్యస్వరూపుడను, అని ధ్యానం చేసుకోవాలి. నేనెవరిని? అంటే, నేను శుద్ధ

చైతన్య స్వరూపుడను. 'అయమాత్మా' అంటాం కదా! నేను ఆత్మ స్వరూపుడను. నేను చైతన్య స్వరూపుడను. నేను శాశ్వతుడను. 'ఆత్మగీత' అని ఒకటి వున్నది. అది చదువుకోండి. అది మన నిజస్వరూపము గురించి మనకి గుర్తుచేసే గీత. మా తాతగారు చదువుతూ వుండేవారు. ఎంత బావుండేదో. ఇది చాలా బావుంది కదా తాతయ్యా, అంటే అవున్నాన్నా ఇదే చివరికి మిగిలేది అన్నారాయన. మూడుకోట్ల రామనామం రాసి ఆయన చిట్టచివరకి 'ఆత్మగీత' చదువుకునేవారు. ఎందుకంటే 'ఆత్మగీత' చదువుకుంటే మనం ఎంత శాశ్వతులమో మనకి తెలుస్తుంది. ఆయనా చాలా వ్యాపారం చేసారు. చాలా కుటుంబాన్ని ఈదారు. చాలామందిని పోషించారు. చాలా ధర్మకార్యాలు చేసారు. అన్నీ వచ్చిపోయేవే. ఈ వచ్చిపోయేవి జన్మజన్మలు వుంటాయి. యుగయుగాలు వుంటాయి. నువ్వు అంతకన్నా మించినవాడివి. ఎందుకంటే సృష్టి మొదలుకాక నుంచీ వున్నావు. సృష్టి అయిపోయిన తర్వాత కూడా వుంటావు. అంతటివాడివి నువ్వు. అందుకనే నా అంతటివాడిని నేను, అంటాడు బుడుగు. అది పెద్ద మహావాక్యం! చిన్నపిల్లల చేత అనిపించిన గొప్ప విషయం అది. అలా 'నేను' శాశ్వతుడు. నేను అనే ప్రజ్ఞ, మనలో వున్నది. అది మనమే! అది శాశ్వతంగా వుంటుంది. ఆ శాశ్వతత్వం నందు మనం వున్నప్పుడు ఈ జరిగిపోయే కాలం కనిపిస్తుంది. లేకపోతే కనిపించదు మనకి. కాలం ఎక్కడ కనిపిస్తుంది? కనిపిస్తోందా? వాచీ చూసుకోవడం తప్ప. మనకి కాలం ఏం తెలుసు? వాచీ పోతే కాలమే లేదు, కదా! నిద్రలో కాలం లేదు. అందుచేత ఈ triplycity వుందే, దాన్ని మనకి భగవంతుడు నీకు అయిపోయినవాడు గానూ, ప్రస్తుతం వున్నవాడు గానూ, ముందు వచ్చేవాడు గానూ కనిపిస్తాడు. అందుకని ఆయనకు మూడు తలలు, అని పెట్టారు. అదీ ఇవాళ వున్న ప్రత్యేకత. ఈ రోజున మార్గశీర్ష పౌర్ణమి నాడు దత్తపౌర్ణమి చేసుకుంటాం కదా! ఆయన త్రిశిరుడు. త్రిశిరుడు అంటే మూడు తలకాయలు. ఏమిటండి ఆయన మూడు తలకాయలంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులంటారు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులంటారు. అంతేకాదు భూతము, వర్తమానము, భవిష్యత్తు నేనేరా, అని చెప్పే విగ్రహమది. దత్తాత్రేయుని యొక్క సంకేతము చాలా అత్యద్భుతమైన సంకేతము. దాన్నిండా చాలా శాస్త్రమున్నది. రహస్య మున్నది. చదువుకోండి. చాలా బావుంటుంది. అందుకని ఇవాళ ఇది ఒక గురుపూర్ణిమ. ఎందుకంటే భూమి జీవుల కోసం గురుతత్వం మొట్టమొదటిసారిగా దిగివచ్చిన సన్నివేశమే 'దత్తాత్రేయుడు'.

అందుకని 'భూత భవ్య భవత్ప్రభు:' అన్నప్పుడు దత్తాత్రేయుడి రూపం ఆలోచించుకోవటమే! 'వషట్కారం' అంటే రూపం ఎట్లా ఆలోచించుకుంటావంటే, అగ్నిశిఖగా, పెద్ద జ్వాలగా గుర్తుపెట్టుకోవటమే! ఇట్లా ప్రతి నామానికి రూపం వుంటుంది. ముందు రూపం వచ్చి తర్వాత నామం వచ్చింది కదా! రూపం లేకపోతే నామాలేవి? మనం ఏ నామం పెట్టాలన్నా రూపం వుండాలిగా! అందుచేత నామం తర్వాతది, రూపం ముందుది. రూపం తయారుచేసి, నామం వచ్చింది. అందుకనే నామరూపాత్మక జగత్తు అన్నప్పుడు ఈ రూపము, నామము లేకపోతే మిగిలేదేమిటి? చైతన్యమే!

## 5. ప్రభు:

అంటే రక్షకుడు. ప్రభువే రక్షకుడు. రక్షకుడు శిక్షకుడు కూడా! రక్షించడానికి భగవంతుడు నియమాలు పెడతాడు. అందుచేత రక్షకుడు శిక్షకుడు. ప్రభువు పరిపాలనకు యంత్రాంగానికి కొన్ని నియమాలు పెడతాడు. ప్రభుత్వ పాలనలో కొన్ని చట్టాలు వుంటాయి. చట్టాలు అతిక్రమిస్తే శిక్ష పడుతూ వుంటుంది కదా! భగవంతుడి చట్టం ఏమిటంటే ధర్మం! నీవు ధర్మాన్ని అనుసరించినంతసేపూ, నిన్ను ఆయన కాపాడుతూ వుంటాడు. ధర్మాన్ని నువ్వు అనుసరించకపోతే, శిక్షణ ఇస్తాడు. ఆ శిక్ష వలన ప్రాయశ్చిత్తం కలిగి, మళ్ళీ ధర్మంలో నిలబడతావు. అదీ శిక్షలో వుండే గొప్పతనం. గుర్తుపెట్టుకోండి. ప్రభువుల చేత శిక్షింపబడితే అంతవరకూ వుండే కర్మంతా కూడా పోతుందిటండి. మహాభారతం చదువుకుంటే తెలుస్తాయి ఇటువంటి సత్యాలు. Government మనకేదైనా punishment ఇచ్చిందనుకోండి. ఏడవకూడదు. అంతవరకూ వుండిన కర్మ అంతా కూడా చాలామటుకు క్షాళనమైందన్నమాట. నేను చూశా నా వృత్తిలో. Income tax raid అయిపోయిన తర్వాత చాలామటుకు మనుషులు బాగుపడతారు. ఎందుచేతనంటే కొంత పాపం హరిస్తుంది. భగవంతుడు ప్రభువు రూపంలో శిక్షిస్తాడు. ప్రభువంటే ప్రభుత్వమే ప్రస్తుతం. 'నా విష్ణుః పృథ్వీ పతిః' అన్నారు. విష్ణుతత్వం లేనివాడు పృధివిని పరిపాలించే అంశలో పుట్టడట. అంటే IAS ఆఫీసర్లు, IPS ఆఫీసర్లు, IRS ఆఫీసర్లు, ICS ఆఫీసర్లు వాళ్ళలో విష్ణ్వాంశ వుండటం చేత, వారా పదవులలో వుంటారు. వాడెటువంటి వాడైనా సరే, వాడు లంచగొండి అయినా సరే మనం వాడిలో విష్ణ్వాంశ చూడాలి. ఎందుకంటే ''విశ్వం విష్ణు:'' అని చెప్పుకున్నాం కదా! లంచగొండిని చూస్తే నువ్వు దెబ్బతింటావు. విష్ణువుని చూస్తే నీ వరకు అందులో విష్ణువే పనిచేస్తాడు. అందుచేత ప్రభువు రక్షిస్తాడు. ఎప్పుడు? ధర్మాన్ని నువ్వు అనుసరిస్తే! ధర్మాన్ని అనుసరించకపోతే శిక్షించి, రక్షిస్తాడు. అదీ గొప్పతనం! నీకు శిక్ష వేసి, నిన్ను రక్షించుకుంటాడయ్యా, అంతకన్నా ధర్మం ఏముందండి? ధర్మం అంటే ఏమిటి? నీవు దేన్ని ధరిస్తే, నిన్ను అది రక్షిస్తుందో దానిని 'ధర్మము' అన్నారు. ధర్మము అంటే ధరించుట వలన నిన్ను రక్షించేది. అది 'ధర్మము'. ధర్మానికి అర్థం అది. అది తప్ప ఇంకేం ధరించినా అది నిన్ను రక్షించదు. అందుచేత ధర్మాన్ని నీవు

అనుసరిస్తూ వుండు. నువ్వు రక్షించక్కర్లేదు ధర్మాన్ని. ధర్మాన్ని రక్షించేటంతటి వాడివి కాదు. 'ధర్మో రక్షతి రక్షితః' అని అంటూ వుంటామే! ధర్మరక్షణ ప్రభువుల కర్తవ్యం. ధర్మానుసరణ జీవుని కర్తవ్యం. జీవులలో విష్ణ్వాంశలో పుట్టినవాళ్ళు కూడా ధర్మరక్షణ చేయాలి. అలా రక్షణ చేస్తే, అది నిన్ను రక్షిస్తుంది. మిగతావారు ధర్మాన్ని అనుసరించాలి. ధర్మాన్ని అనుసరించాలంటే ధర్మమేమిటో తెలియాలిగా. ధర్మమేమిటో తెలియాలంటే ఏం చేయాలి? శ్రద్ధగా రామాయణం చదువుకుంటే ధర్మం తెలుస్తుంది. రాముని ప్రవర్తన పరిపూర్ణమైన ధర్మానికి ప్రతీక. 'రామో విగ్రహవాన్ ధర్మః' విగ్రహమే ధర్మ విగ్రహం అది. ధర్మానికి ఒక రూపం మీరు ఊహించుకుందామనుకుంటే, మీరు ఊహించుకోలేరయా, రాముని కథ చదువుకోండయా తెలుస్తుంది. అదీ ధర్మం! తల్లిదండ్రుల ఎడల, సోదరుల ఎడల, ప్రజల ఎడల, స్నేహితుల ఎడల, తనకన్నా తక్కువ జాతివారి ఎడల, తనకన్నా ఎక్కువ జాతివారి ఎడల, బ్రాహ్మణుల ఎడల, ఋషుల ఎడల, శత్రువుల ఎడల ఎట్లా ప్రవర్తించాడు రాముడు చూసుకోండి. ఏదో English చదువులు చదివి, America వెళ్ళి ఆ మధ్య ఒక Computer engineer నాతో అన్నాడూ, 'రామాయణం మనకి ఇపుడు relevant కాదు కదండీ' అని. ఓహో! మానవాకృతీ--! అనుకున్నాను. కానీ మానవుడు కాదు. పశువులు. డబ్బులు సంపాదించేసినంత మాత్రాన మానవ చైతన్యం వృద్ధిలోకి వస్తుందా? రాదు. చెప్పా. రోజంతా చెప్పాల్సి వచ్చింది. అది ఆగష్టు 4 మాస్టరు సివివి గారి పుట్టినరోజు. ఏదో శుభమా అని నేను California లో ఒకళ్ళ ఇంట్లో పూజ చేస్తున్నా. మన మూర్తిగారి అమ్మాయి ఇంట్లోనే. చేస్తుంటే ఆ అమ్మాయి ఊరుకోకుండా ఒక computer Engineer ని పిలిచింది. వాడొచ్చి ఈ మాటన్నాడు పుసుక్కుని. అంతే రోజంతా రామాయణం చెప్పా. చెప్తే, అతడు కరిగి కాళ్ళకి దండం పెట్టి, క్షమించండి పొరపాటై పోయింది, అన్నాడు. "నేను క్షమించడం కాదు. ఇవి చదువుకోకుండా మనం అట్లా మాట్లాడకూడదు. నువ్వు రాముడి గురించి, రామాయణం గురించి మాట్లాడాలంటే చదువుకోవాలి. Computer Engineering గురించి, computer గురించి ఏమీ తెలియకుండా నేను ఒక comment pass చేసేననుకో. నీకెట్లా వుంటుంది?" అని అడిగాను. నీకు తెలియదుగా. నీకు రాముడి గురించి తెలియదుగా. నీకు రామాయణం తెలియదుగా. ప్రతివాడు రాముడి ప్రవర్తన గురించి ప్రశ్నించేవాడే, చదువుకోకుండా. చదువుకొని ప్రశ్నిస్తే అర్థం వుంది. చదువుకోకుండా ప్రశ్నిస్తారు. రామాయణానికి

మించిన గ్రంథం లేదు. ధర్మాన్ని నిర్వచించడానికి ప్రపంచంలో ఎక్కడా లేదు అటువంటి గ్రంథం. గుర్తుపెట్టుకోండి రామాయణం గానీ, మహాభారతం గానీ, భగవద్గీత గానీ, భాగవతం లాంటి గ్రంథాలు కలియుగంలో మళ్ళీ రావు. కలియుగంలో మానవులంతా చచ్చిపోతారేమో, చీకట్లో పడిపోయి ఉద్ధరింపబడరేమో అన్న భయంచేత, వేదవ్యాసుడు మనకు అందించిన గ్రంథాలవి. అందులో వున్న వెలుగు పరిపూర్ణం. అందుచేత మనం రామాయణం చదువుకోలేదుట అంటే భారతీయుడుగా పుట్టటం వ్యర్థము, వ్యర్థము, వ్యర్థము. ఏం సందేహం లేదు. మరి భారతం చదువుకున్నా ధర్మాలు వున్నాయి. భారతంలో ధర్మం గురించి, రక్షణ ధర్మం గురించి, ధర్మంలో నిలబడటం గురించి, ప్రభు తత్వం గురించి మీకు ఒక కథ చెప్పేసి నేను ఈ నామాన్ని పూర్తిచేసేస్తా. అన్నదమ్ములిద్దరు అరణ్యంలో తపస్సు చేసుకుంటున్నారుటండి. తపస్సు చేసుకునేవాళ్ళు కోసుకొని తినకూడదు ఏదీను. గుర్తుపెట్టుకోండి. కోసేవాళ్ళకి తపస్సు లేదు. మొక్క నుండి వంకాయ కోసినా తపస్సు లేదు. పడ్డది తినాలి. పండు నేలమీద పడితే తినాలి. ఆకు నేలమీద రాలితే తీసుకోవాలి. నీళ్ళు పారుతుంటే తాగాలి అంతే. నీళ్ళకోసం భూమికి బొక్క పెట్టి, అందులోంచి తీసుకునే పద్ధతి తపస్వి జనులకు ధర్మం కాదు. వాళ్ళు సాధుజీవనం కలిగివుండాలి. దేనినీ హింసించకూడదు. భూమి మీద గట్టిగా నడవను కూడా నడవకూడదు. భూమి మీద గట్టిగా తన్నుకుంటూ, చప్పుడు చేస్తూ నడిచేవాళ్ళు భూమికి భారంట. ఇద్దరు అన్నదమ్ములు ఏదో ఆకులు అలములు తింటూ, అక్కడా అక్కడా రాలిన పళ్ళు తింటున్నారట. తపస్సు చేసుకుంటున్నారట. సెలయేరులో నీళ్ళు త్రాగుతున్నారుట. వచ్చి కూర్చున్నారుట. బాగా తపస్సు చేసుకుంటున్నారుట బ్రహ్మాండంగా. ఆకలి వేస్తే లోపలకి వెళ్ళి ఏదో తినివస్తూ వుంటారు. ఒకరోజు తమ్ముడికి ఆకలి వేసిందిట. సరే తన నివాసంలోకి వెళ్ళి చూస్తే అక్కడ ఏంలేవుట తినటానికి. అన్నయ్య నివాసంలో కనబడితే రెండు రావిపళ్ళు నోట్లో వేసుకున్నాడట. వచ్చి కూర్చున్నాడట. తపస్సు చేస్తున్నాడట. తపస్సు చేస్తూంటే, అన్నయ్య ఇంట్లో వుండే రావిపళ్ళు తిన్నాం కదా! అనేది గుర్తొస్తోందిట. అంటే ఎంత సంస్కారవంతుడు? మనకి గుర్తే వుండదు. వాడిదీ వీడిదీ విపరీతంగా తినేసి, బ్రహ్మాండంగా వాడిని మోసం చేసి తినేసాం అనుకొంటూ వుంటాం. ఈ తమ్ముడికి తపస్సు చేస్తూంటే అన్నయ్య పళ్ళు తినేసాం, అని గుర్తొస్తోంది. ఇట్లా గుర్తొస్తుంటే వాడు బాధ భరించలేక, వాళ్ళ అన్నయ్య తపస్సు ఆపినపుడు అన్నయ్య

కాళ్ళ మీద పడిపోయి "నీ ఇంట్లో పళ్ళు నేను రెండు తినేసాను. నేను నీకు చెప్పలేదు. అడిగి తినాల్సింది. అడగకుండా తినేసానురా అన్నయ్యా" అంటే ఆహా అలాగా! అంటాడు అన్నయ్య. మరి నాకిపుడు ప్రాయశ్చిత్తం ఎంటి? అంటాడు. ఏదైనా శిక్ష వేసేయ్ నాకు, అన్నాడు. ఆయన మహా సాధువు. అన్నయ్య కదా! "శిక్ష నేను వేయకూడదురా. తపస్సు చేసుకుంటున్న వాడిని. అందుచేత శిక్షించాల్సినవాడు ప్రభువే. ప్రభువు దగ్గరకి వెళ్ళు. ఆయన ఏ శిక్ష వేస్తే ఆ శిక్ష అనుభవించేస్తే ప్రాయశ్చిత్తం అయిపోతుంది. అయిపోతే మళ్ళీ వచ్చి తపస్సు చేసుకోవచ్చు నువ్వు. లేకపోతే ఇదే గుర్తొస్తుంది" అంటాడు. గుర్తుపెట్టుకోండి సంస్కారము మనలో బాగా పెరుగుతున్నకొద్దీ, మనం చేసే తప్పులు మనకే లోపలనుంచి దైవం remind చేస్తూ వుంటాడు. 'వాచస్సత్య మసీమహి' శ్రీసూక్తంలో వుంది. లోపల్నుంచే గుర్తొస్తాయి మనం చేసే వెధవ పనులన్నీ. ఎవరూ చెప్పక్కర్లే! అందుచేత అన్నయ్య అట్లా చెప్పాడని, రాజు దగ్గరకి వెళ్ళాడు. రాజు విన్నాడు కధ. రెండు పళ్ళు తింటే దీనికి శిక్ష ఏమిటయ్యా? పో అవతలకి, అన్నాడట. అమ్మమ్మో అలా కాదన్నాడట. ఏదో వుంటుంది. తప్పు తప్పే కదా! సరిగా ధర్మశాస్త్రం చూసి నిర్ణయం చేయండి, అని చెప్పాడు. ఇదెక్కడి గోల, రెండు రావిపళ్ళు ప్రక్కవాడివి తింటే వీడికి శిక్ష ఎక్కడ వెయ్యాలని, అక్కడ శాస్త్రకారులు, ధర్మానికి ప్రమాణంగా వుండేవాళ్ళు ఉంటారు. వాళ్ళకి ఇచ్చాడు case రాజుగారు. కాస్త చూసి చెప్పండయ్యా! శిక్ష వేద్దామని. వాళ్ళు మొత్తం శాస్త్రం అంతా పగలూ రాత్రీ పూర్తిగా వెతికి, మర్నాడు ప్రొద్దున్న వచ్చి, శిక్ష వుంది మహాప్రభో, అన్నారు. ఏంటి చెప్పండంటే, వాళ్ళు రెండు చేతులు cut చేసేయమని చెప్పారు. అదీ శిక్ష! అంటే మరీ బొత్తిగా Gulf Country అల్లే వుందన్నమాట ధర్మం! అదా శిక్ష అంటే? మరి అదే వుంది, అన్నారట. అంటే ఇదిగో ఇలా వుంది శిక్ష, అని చెప్పారట శిక్ష వేయించుకోవడానికి వచ్చిన తమ్ముడికి. అంటే, వేసేయ్ తొందరగా, అన్నాడట. సరే, రెండు చేతులు cut చేసేసారు. సంతోషంగా వెళ్ళిపోయాడటండి. వెళ్ళిపోయి అన్నయ్యకి చూపించాడట. "అన్నయ్యా! నాకు ఇలా శిక్ష వేసారు. నాకు ప్రాయశ్చిత్తం అయిపోయింది. నేను మళ్ళీ తపస్సు చేసుకుంటాను" అన్నాడట. ఊహించగలమా ఇటువంటివి అసలు? ఊహించలేమే! అంటే అన్నయ్య ఒక్కసారి కళ్ళు మూసుకొని దైవాన్ని ప్రార్ధన చేసి, "నాన్నా వెళ్ళి అక్కడ నది వుంది. ఆ నదిలో స్నానం చేసి తపస్సు చేసుకో" అన్నాడు. అతడు నదిలో వెళ్ళి స్నానం చేసి మునిగి,

బయటకు రాంగానే రెండు చేతులు వచ్చేస్తాయి. అదీ అన్నయ్య గొప్పతనం! అన్నయ్యా చేతులు వచ్చేసినాయి అంటే, వస్తాయిరా ధర్మాన్ని నువ్వు ఆచరిస్తే వస్తాయి. చేతులేమిటి? ఏమైనా వస్తాయి. హాయిగా తపస్సు చేసుకో అని చెప్పాడు. ఇటువంటి కథలు ఇచ్చారు భారతంలో. అంటే మనం చదువుకుంటే మనకి ఒళ్ళు గగుర్పొడుస్తుంది, అట్లా వుంటాయా ధర్మాలన్నీ! పంచమవేదం మహాభారతం. అందుచేత ప్రభువు శిక్షించడం అంటే అలా వుంటుంది. శిక్ష పొందటం వలన ప్రాయశ్చిత్తం అవుతుందిట. అందుచేత ప్రభువులు శిక్షించారుట అంటే ధర్మ మెరిగిన ప్రజలెవరూ కూడా డు:ఖపడేవారు కాదు. ఇది కలియుగం. ఇపుడు కథ వేరు. కానీ మీరు భగవద్ మార్గంలో నడవాలంటే ఈ రకమైన ధర్మాన్ని అవగాహన చేసుకోవాలి. కష్టానికి, అసౌకర్యానికి, అపజయానికి వెరచి ధర్మాన్ని ఆశ్రయించుకోవాలి. కాళిదాసు ఒకమాట చెప్తారు. జీవితం అంతా కూడా ధర్మాన్ని నేను ఒక చేతికర్రగా పట్టుకొని నడిచాను. ముసలితనంలో నాకు ఇపుడు అదే ఆసరాగా మిగిలింది, అంటాడు. చూడండి చేతికర్ర పట్టుకొని నడుస్తారు కదా ముసలితనంలో. మసలితనంలో కష్టాలు పడకుండా వుండాలంటే జీవితంలో, మంచి పదునైన వయస్సులో వున్నప్పుడు పిచ్చి పనులు చేయకూడదు. అందుకనే జీవితంలో మొదట్లోను, మధ్య భాగంలోనూ రకరకాల అధర్మాలు ఆచరించిన వారు, వృద్ధాప్యంలో రకరకాల కష్టాలు పడతారు. అపుడెవరూ వినేవాళ్ళు కూడా వుండరు. కదా! కొడుకులేమో మమ్మల్ని ఏమాత్రం చూసారని వీళ్ళని ఇప్పుడు చూడాలని వెళ్ళిపోతారు. చుట్టాలు ఎన్నడైనా పిలిచి భోజనం పెట్టాడా? వీడినేంటి పిలిచేది, అనుకుంటారు. స్నేహితులు, బంధువులు ఎవ్వరూ ''ఒక్కండు నీ మొరాలకించడు'' అన్నట్లుగా వుంటుంది. అందుకని కాళిదాసు అంటాడు ధర్మాన్ని మనం ఎంత చక్కగా నిర్వర్తించుకుంటూ ఉంటే అది మనని చివరికి అంత రక్షిస్తుంది. మనతో వచ్చేది ధర్మం ఒక్కటే! అని. మనం వెళ్ళిపోయేటప్పుడు ఏదీ మనతో రాదు కదా. ఏదీ రాదనేది సత్యమే కానీ నువ్వు చేసిన ధర్మాధర్మాల యొక్క సమ్మిశ్రమం ఏదైతే ఉంటుందో అది మాత్రం నీ వెంటే వస్తుంది. అందుచేత భగవంతుడు ప్రభువు. మనకు ఎవరివల్ల అయినా నష్టం కలిగింది అనుకోండి, భగవంతుడే శిక్షించాడు అనుకోవాలి. ఎవరివల్ల అయినా మనకు అపకారం జరిగింది అనుకోండి, భగవంతుడే శిక్షించాడు అనుకోవాలి. ఈ విధంగా ఆరాధన చేసుకునే వాళ్ళకి ఏది జరిగినా, భగవంతుడు ఇచ్చే శిక్షగా తన కష్టాలు

తీసుకునేటట్లు అయితే ప్రాయశ్చిత్తం అయిపోతుంది. అంతేగానీ, ఆ కష్టం లో మనం ఇంకొంచెం ఉక్రోష పడిపోయి, పౌరుష పడిపోయి, అహంకార పడిపోయి, ఇంకా ఏవేవో చేసేస్తే అది ఇంకా పెరుగుతూ ఉంటుంది. ఇది కాదు భాగవత మార్గం. భాగవత మార్గం లో అంది వచ్చింది పుచ్చుకుని, తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, అది భగవద్ ప్రసాదంగా తీసుకోవడమే! చేదైనా తీపైనా సరే! అందుకే భగవంతుడు ప్రభువు వలె మనకు శిక్షలు వేస్తుంటాడు. శిక్షలు వేయటం అంటే ఒకటే. మనకు ఆ రోజు దుఃఖం కలిగించేది, బాధ కలిగించేవి, మరొకటి, మరొకటి ఏవేవో ఉంటాయి. ఎవరో మాటంటాడు చాలు. రోజంతా పీక్కుంటాం, మర్నాడు కూడా పీక్కుంటాము. Memory ఎక్కువ ఉంటే ఎక్కువ పీక్కుంటాం. లేకపోతే ఎక్కడో పడ్డాం, దెబ్బ తగిలింది. ఏదో వేసేశాడు అయిపోయింది. ఇంతటితో సరిపోయింది అనుకోవడమే! ఒక్కోసారి భోజనం మనకు సమయానికి దొరకదు. భగవంతుడే! మనకు రోజువారీ జీవితంలో కలిగే అసౌకర్యం, ప్రభువు వలె భగవంతుడు మనకు అందించాడు అని గుర్తు పెట్టుకోవాలి. ఇదీ సాధన! అప్పుడు భగవంతుని ప్రభుత్వాన్ని మనం అంగీకరించినట్లు అవుతుంది. ప్రతి చిన్న విషయానికి Complaints లు చేయద్దు. ఒక్కోసారి మనం train ల్లో ప్రయాణం చేస్తుంటే berth మనకు toilet దగ్గర వస్తుంది. ముఖ్యంగా AC లో వెళ్తుంటే తలుపు వేసేచోట - తీసే చోట వస్తుంది. వెంటనే మనసులో, ఛీ అనిపిస్తుంది కదా! అనిపించ కూడదట. విష్ణు సహస్రనామం పారాయణము చేసేవాళ్ళు 'ఓహో ! విష్ణువు నాకివాళ ఇది ఇచ్చాడు' అనుకోవాలిట, తెలుసా? మీరలా చేస్తుండండి, తమాషాగా మారిపోతుంటాయి. మీరు ఉన్నది కనుక అంగీకరించటం మొదలు పెడితే మీకు ఉన్నదాని కన్నా బాగుండేట్టుగా దైవం చూస్తాడట. అదీ! మనకు కాస్త కూడా ఓపిక లేదు. బొత్తిగా we cannot wait. వేచిఉండటం అస్సలు మనవల్ల కాదండీ. అందులో ఇప్పుడు మహా speed గా ఉంటున్నామేమో, అస్సలు కష్టంగా ఉంటోంది. కాలం రూపంలో, మనుషుల రూపంలో, సన్నివేశాల రూపంలో భగవంతుని యొక్క ప్రభుత్వమే మనల్ని ప్రతి రోజూ పరిపాలిస్తూ ఉంటుంది. అదీ మన జీవితం వరకూ భగవంతుని ప్రభుత్వం యొక్క అస్తిత్వం. అతడే నడిపిస్తున్నాడు పొద్దున నుండి సాయంత్రం వరకూ. మనం ఒక రకంగా అనుకోవచ్చు, అది ఇంకో రకంగా నడవచ్చు. ఉదాహరణకి ఇవాళ అందరూ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళారు. ఒక నలుగురు వెనుక బడ్డారు. వాళ్ళు రాలేదు. మిగిలిన వారికి ఆలస్యం

అయింది. భగవంతుడే! అలా అనుకోకపోతే ఈ వెళ్ళిన పాతిక మంది, రోజంతా ఆ నలుగురిని తిట్టుకోవడమే సరిపోతుంది. అలా తిట్టుకోవడం వలన వాళ్ళకి కర్మ క్షాళనం - వీళ్ళకి కర్మ సముపార్జనం అవుతుంది. ఇది కర్మ సిద్ధాంతం. ఏమీ సందేహం లేదు. నలుగురు మనుషులు ఆలస్యంగా వచ్చి, ముందుగా వెళ్లాల్సిన మన బృందాన్ని నాలుగు వందల మంది వెనకాల పంపించారు అనుకోండి! ఆ నలుగురి గురించి ఒక సహస్రనామం ప్రతీ వారు చదువుతాం కదా! అలా అంతమంది చదవటం వలన ఈ నలుగురికి కర్మ క్షాళన అయిపోతుంది. మీ మూలంగా late అయిందని అందరూ అంకుంటుంటే విని వాళ్ళు బాధపడుతుంటారు. అయిపోతుంది. అన్నవాళ్ళు పోగేసుకుంటారు. సత్యం! శిరిడీ సాయిబాబా ఒకమాట చెప్పారు. 'వాడిని వీడిని దూషించకు'. దూషిస్తే ఏమి జరుగుతుంది చెప్పండి? వాడి కర్మ నీకొస్తుంది. అందుచేత, ఎంత దూషణ చేస్తే అంత కర్మ అటు నుంచి ఇటు వచ్చేస్తూ వుంటుంది. కీర్తించు! మా ఊరిలో అప్పలాచార్యులు వారు అని ఒకరు ఉండేవారు. ఆయన ఎవరినైనా కీర్తించేవారు. మహానుభావుడు! ఎదుటి వారిలో ఉండే ఏ కొంచెం మంచిని చూసి పొగుడుతూ ఉంటే, ఇక అక్కడి నుంచి ఊరికే మనమీద పోసుకోవడం ఉండదు. 'నీరు పల్లమెరుగు' అన్నట్లు, ఎటు దూషణ జరుగుతూ ఉంటే, పాపం అటు పక్కకి వచ్చేస్తూ వుంటుంది. ఎటు కీర్తన జరుగుతూ ఉంటే పాపం ఇటు నుంచి అటు వెళ్ళిపోతూ ఉంటుంది. మరి ఈ సులువు తెలిసి కూడా మనం మన స్వభావాన్ని ఆపుకోలేమే! భగవంతుని ప్రభుత్వం చాలా తమాషాగా ఉంటుంది.

## 6. భూతకృత్

అంటే భూతములను సృష్టి చేయువాడు అని అర్థం. భూతములను సృష్టిలోనికి విడుదల చేయువాడు అని అర్థం. భగవంతునికి ప్రేరణ కలిగి, ఆ ప్రేరణ వషట్కార రూపమై, అటు పైన మహాచైతన్యంగా ఏర్పడి, ఆ మహాచైతన్యం ఆధారంగా ఏర్పడే త్రిగుణములద్వారా జీవులను ఏర్పాటు చేస్తూ వుంటాడు. ఇది భగవంతుడి యొక్క కరుణ అని చెప్తూ వుంటారు. భగవంతుడికి జీవుని యందు కల అపారమైన కరుణ కారణంగా ఈ జీవులందరిని అవ్యక్తం నుంచి విడుదల చేస్తాడు. విడుదల చేసి సృష్టి లో వారు ప్రవేశించి పరిణామం చెందే అవకాశం కలిగిస్తాడు. మాటిమాటికి ఇలా ఎందుకండీ సృష్టి చేయడం అంటే మన కోసమే. ఎందుచేతనంటే భగవత్ తత్వంనుండి వెలువడిన జీవులందరు సృష్టిలో ప్రవేశించి పతనం చెందడం చేత, సృష్టి లయమైనపుడు ఎక్కడున్న వారు అక్కడే, ఎలా వున్నవారు అలాగే అవ్యక్తంలోకి మళ్ళీ చేరిపోతారు. అంటే ఈ రోజు రాత్రి మనం నిద్రలోకి ఒకొక్కళ్ళం ఒకొక్క స్ఫూర్తితో వెళ్ళిపోతాం లోపలికి. కొంతమంది దైవీ స్ఫూర్తితో వెళ్తారు, కొంతమంది ఇతరములైన స్ఫూర్తితో వెళ్తారు, మరి కొంతమంది చిల్లర స్ఫూర్తితో వెళ్తూ వుంటారు, రకరకాల భావాలు. నువ్వు ఏ భావంతో లోపలికి వెళ్ళావో ఆ భావం నుంచి పై భావం లోకి నువ్వు వుద్ధరింపబడి, పూర్తిగా పరిణామం చెంది, సిద్ధ స్వరూపం అయ్యేవరకు కుడా మళ్ళీ మళ్ళీ పుడుతూ వుండాలి. జీవులు, దైవమయ్యేంత వరకు దైవం జీవుల కోసం సృష్టి చేస్తూ వుంటాడట, ఇది ఒక అవగాహన. సృష్టి ఎందుకు అంటే పెద్దలు ఇచ్చిన ఒక అవగాహన ఏమిటంటే జీవులంతా సనాతనులూ, వారందరూ కూడా పరిణామం చెందాలీ అని. పరిణామం చెందడానికి ఒకొక్కళ్ళకి ఒక సృష్టి కాలం చాలదు, సృష్టి లయమయ్యే సమయానికి వారు ఏయే స్థితులలో వుంటే ఆయా స్థితులలోనే లయమైపోతారు. అందుచేత వాళ్ళు మిగతా పరిణామం చెందకపోతే వ్యధ చెందుతూ వుంటారు. అందుచేత వారికి మళ్ళా పరిణామం చెందడానికి కావలిసిన అవకాశాన్ని ఏర్పరచడం కోసం భగవంతుడు సృష్టి చేస్తున్నాడు అని చెప్తారు పెద్దలు. అందుచేత సృష్టి ఎవరి కోసం అంటే జీవుల కోసమే! జీవుల కోసం దైవము దయ కలిగిన వాడై, కరుణామయుడై ఇంత కార్యక్రమం మళ్ళీ ఏర్పరుస్తూ వుంటాడు. తప్పిన

పిల్లల కోసం తల్లిదండ్రులు పడే ఆరాటం లాగా వుంటుంది అది. పిల్లలు తప్పుతూ వుంటే మళ్ళీ చదివించి, మళ్ళీ చదివించి, తరువాత tuitions పెట్టించి, వాడి చుట్టూ తిరిగి, వీడి చుట్టూ తిరిగి, మాస్టర్ల చుట్టూ తిరిగి, ఇన్ని రకాలుగా చేసి, వాడు ఎట్లాగో అట్లా బతికి బట్ట కట్టాలనే కదా తల్లిదండ్రుల ఆరాటం. అదే ఆరాటం దైవమునకు జీవుని యందు వుండటం చేత, తానీ విధంగా మళ్ళీ మళ్ళీ జీవుల కోసం ఈ మహత్తరమైన సృష్టిని ఏర్పాటు చేస్తున్నాడు. అందుచేత ఇన్ని సార్లు సృష్టి చెయ్యవలసిన అవసరం వస్తోంది కానీ, లేకపోతే అవసరం లేదు అని కొంతమంది ఋషులు సిద్ధాంతీకరించారు. ఏది ఏమైనప్పటికీ భగవంతుడు ప్రేరణ లోంచి మొట్టమొదట పుట్టినవాడు బృహ్మణము చేయబడిన వాడు బ్రహ్మ. అతడు బృహ్మణము చేయబడ్డ వాడు కాబట్టి అతను కూడా బృహ్మణము చేస్తూ వుంటాడు. అతడు బృహ్మణము చేస్తే మనం అంతా వచ్చాం. మనమూ బృహ్మణము చేస్తూ వుంటాం, మన నుండి మన కార్యక్రమాలు బయటకి వస్తూ వుంటాయి. అందరం బ్రహ్మలమే కదా! ఎవరి జీవితానికి వాడు బ్రహ్మ! కొంతమంది బాగా సృష్టి చేసుకుంటారు, కొంతమంది ఏడ్చినట్టు సృష్టి చేసుకుంటూ వుంటారు. ఏది ఏమయినప్పటికి, సృష్టి చేయడం తప్పదు కదా! ఎవరు వారి జీవితాన్ని వారి వారి ఆలోచనల ప్రకారం అల్లకుండా వున్నారు? ఆసురీ సంపత్తి కలవారు ఆసురీ సంపత్తితో అల్లారు. దైవీ సంపత్తి కలవారు దైవీ సంపత్తితో అల్లారు. తమస్సు కలవారు తమో గుణం చేత అల్లితే, రజో గుణం కలవారు రజో గుణం చేత అల్లితే, సత్వ గుణం వాళ్ళు సత్వ గుణం తో ఇలా అల్లుకుంటూ పోతూనే వుంటారు. ఈ బృహ్మణం చేసే శక్తి దైవములో వుండటం చేత అది బ్రహ్మకు వచ్చింది. బ్రహ్మలో వుండటం చేత అది మనకి వచ్చింది. ఇట్లా వస్తూనే వుంటుంది ఎందుకంటే అన్ని తత్వములు మానవులలో పరిపూర్ణంగా వుంటాయి కాబట్టి. ఆ విధంగా మొట్టమొదట బృహ్మణం చేయబడ్డ జీవుడు చతుర్ముఖ బ్రహ్మ, అని చెప్తారు. "భూతకృత్" అని చెప్పినప్పుడు మొట్టమొదట బయటకు వచ్చిన వాడు చతుర్ముఖ బ్రహ్మ. అతను తపస్సు చేయటం ఎందుచేతనంటే తాను బయటకి రాంగానే ఏం చేయాలి అని ప్రశ్న వచ్చింది. మనం బయటకి రాంగానే మనం ఏమి చేయాలి అని ఆలోచించమూ? ఆలోచిస్తాం. పొద్దున్నే నిద్ర లేచి బయటకి వస్తాం. నిద్ర లేవటమే బయటకి రావటం మనకి. నిద్ర లేచి మాములుగా కొన్ని తలుపులు తీసుకుని బయటకి రావాలి. కానీ అవన్నీ తెలియకుండా అయిపోతాయి. మనం లేవంగానే

మనసు అప్పటికే veranda లోనో, road మీదో వుంటుంది. ఆ విధంగా మనం లేచి బయటకి రాంగానే ఏమి చెయ్యాలనే ప్రశ్న వస్తుంది. బ్రహ్మదేవుడికి కుడా అట్లా ఏమి చెయ్యాలి ఈ రోజు మనం? అనే ప్రశ్న వచ్చింది. ఏమి చెయ్యాలో తెలీలేదు. ఎందుకంటే అప్పుడే చాలా కాలం తరవాత నిద్ర లేచాడు కదా! మధ్యాహ్నం పూట బాగా భోజనం చేసి, చలి వేస్తోంది అని బాగా దుప్పటి కప్పుకుని గట్టిగా ఓ మూడు గంటలో, నాలుగు గంటలో నిద్ర పోయామనుకోండి... సాయంత్రం వెలుగు వెళ్ళి చీకటి వచ్చే సమయంలో నిద్ర లేచామనుకోండి. అప్పుడు అది పగలో, రాత్రో తెలీదు. అంటే ఇప్పుడు తెల్లవారుతోందా? అనిపిస్తుంది. ఎందుకని? వెలుగు తగ్గి చీకటి వస్తుంటే, చీకటి వెళ్ళి వెలుగు వస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఆ తరువాత కాసేపటికి ఓహో! ఇది సాయంత్రం కదా అనిపిస్తుంది. మంచి గాఢ నిద్రలో నుంచి నిద్ర లేచినప్పుడు కాస్త సమయం పడుతుంది ఎక్కడ వున్నామో తెలుసుకోవడానికి. ఎక్కడ వున్నా ఏమి చెయ్యాలి? బ్రహ్మ తాను నిద్ర లేవంగానే కమలంలో కూర్చుని వున్నాడట. చుట్టూ అంతా ఎటు చూసినా నీరే! నీరు అంటే నారము, జీవము. ఆ జీవాన్నే 'నర' అంటారు సంస్కృతంలో, నారము అంటారు, నీరము అంటారు. ఆ జీవతత్త్వమే కింద మీదులు అవుతూ వుంటుంది. అంటే అవరోహణ క్రమంలో ఇదంతా ఏర్పరుస్తుంది, ఆరోహణ క్రమంలో మళ్ళీ ఆ స్థితికి వెళ్ళిపోతుంది. ఇట్లా అవరోహణ, ఆరోహణ క్రమములలో ఈ జీవమే మొత్తం సృష్టి అంతా నడిపించేస్తోంది, అలా నడిపించే దానికి అధిపతిగా ఉన్నాడు కాబట్టి, ఆయనని నారాయణుడు అన్నారు. అయనము అంటే మార్గము. మార్గము, అవరోహణ క్రమంలో ఉంది, ఆరోహణ క్రమంలో ఉన్నది. ఈ రెండు అయనములకు, నారమే కారణము. కాబట్టి దానిని నడిపించే వాడిని 'నారాయణుడు' అంటారు. ఆ జీవము ఆధారంగా బతికే వాళ్ళం కాబట్టి 'నరులం' అన్నారు. నరుడంటే 'నశించని వాడు' అని అర్థం. 'ర' అంటే నశించుట. 'నర' అంటే నశించనివాడు అని అర్థం. అందుకని, నశించని వాళ్లందరినీ, బృహ్మణం చేయటం కోసం ముందు బ్రహ్మ బయటకి వస్తే, బ్రహ్మ చుట్టుపక్కల అంతా చూసేసి ఏం చేయాలని తెలియక, చాలా సేపు ఆలోచించి, తపన చెందుతాడు. కళ్ళు మూసుకుంటాడు. అసలు మనం ఇక్కడికి ఎట్లా వచ్చాము చూద్దామని ప్రయత్నం చేద్దామనుకుంటాడు. ఆ కళ్ళు మూసుకుని, ఎక్కడ నుంచి వచ్చామని చూస్తే కమలం కనిపిస్తే, ఈ కమలం ఎక్కడనుంచి వచ్చిందో చూద్దామని, కమలం తూడులోకి వెళ్ళి, అక్కడ నించి కిందకి అట్లా వెళ్తూ

ఉంటే ఎంత దూరం వెళ్ళినా అట్లా చీకటిగా ఉంది తప్ప ఏమీ కనపడలేదుట, దానికి మట్టం కనపడలేదుట, నేల కనపడలేదుట, అంచు కనపడలేదుట! అట్లా వెళ్తూ ఉంటే వచ్చిన దారి మళ్లీ పోతుందేమో అని భయమేసి మళ్లీ వచ్చి కమలంలో కూర్చున్నాడట. ఇలా చెప్పటంలో ఉద్దేశం ఏమిటంటే, అవ్యక్తమైన తత్త్వము చాలా అనంతమైనదని. మనకి శివపురాణంలో కూడా శివలింగం యొక్క మొదలు చూద్దామని ఒకళ్ళు, పైన అంతు చూద్దామని ఒకళ్ళు, బ్రహ్మ, విష్ణువు బయలుదేరారని, దానికి మొదలు, అంతము, కనపడక భయమేసి మళ్లీ వచ్చి వారి స్థానాల్లో కూర్చున్నారని చెప్తారు. ఆ అనంతమైన తత్త్వంలో, ఎంత దూరం వెళ్ళినా, ఏదో ఒక గమ్యం చేరటంగా ఉండదు. కమలంలో కూర్చుని, సరే ఎక్కడున్నామో తెలియట్లేదు, ఏం చేయాలి పోనీ ఈ ఉన్నచోట అని చూస్తే, ఎటు చూసినా నీరు. ఆ నీరు అట్లా చూస్తూ తపన చెందాడట. తపన చెందితే, "తప" అని వినిపించిందిట. తపస్సు చేసుకో, అని వినిపిస్తే, తపస్సు చేయటం మొదలు పెట్టాడు. తపస్సు చేయటం అంటే కన్నులు మూసుకుని అంతరంగంలో ప్రవేశించి, అంతఃకరణ శుద్ధి కోసం తపస్సు. అంతఃకరణ శుద్ధి జరిగితే, లోపల సుషుమ్నలో దైవం ఉంటాడు బ్రహ్మకైనా, మీకైనా, నాకైనాను. అక్కడినుంచి వాక్యం వినిపిస్తుంది. సృష్టి చెయ్యి, అని. అప్పుడు అతను సృష్టి చేద్దామనుకుంటే, అంతకు ముందు జరిగిన సృష్టి అంతా గుర్తు వస్తుంది. గుర్తు వచ్చి, అయ్య బాబోయ్ ఇంత కార్యక్రమమా! అనుకుంటాడు. అప్పుడు దైవము 'నువ్వేమీ చేయక్కర్లేదు, అంతా ready గానే ఉంది, నువ్వు ఊర్కే ఒక వాహికగా నిలబడితేచాలు, నీ ద్వారా నేను నిర్వర్తించేస్తాను అంతా' అని చెప్తాడు. ఎందుకంటే అంతా ready గానే ఉంది. తలుపు తీస్తే, బిలబిలబిలా వచ్చేస్తారు జీవులందరూను. తలుపేసేసి ఉంచాడు, ఆ తలుపు తీయటమే బ్రహ్మ రావడం! కమలం లోంచి బ్రహ్మ పుట్టటం అంటే ఏంటంటే, మొత్తం అంతా పిండివంటలన్నీ ready చేసేసి, ఇక ఊరికే ఆ వంటశాల తలుపు తీస్తే, పదార్థాలన్నీ నడిచెళ్ళి పోతాయి బయటికి. అట్లా తయారు చేయబడి ఉంటాయి. ఇదివరకు ఉన్నవే! అదే మనకి చెప్తుంది పురుషసూక్తం. అంతకు ముందు ఉన్నవే మళ్లీ అదే పద్ధతుల్లో బయటికి వస్తాయి. అంతకు ముందు ఏ విధంగా నిర్వర్తించారో అదే విధంగా మనకు దేవతలొచ్చేస్తారుట. సనకసనందనాదులొచ్చేస్తారు. సప్తర్షులొచ్చేస్తారు. సిద్ధులొస్తారు, సాధ్యులొస్తారు. వాళ్ళందరికీ ఏం చేయాలో తెలుసు. ఎందుకంటే, వాళ్ళు బ్రహ్మకన్నా తెలిసినవాళ్లుగా ఉంటారు. సనక

సనందనాదులు బ్రహ్మ నుండి వచ్చిన వారే తప్ప, ఏం చేయాలో తెలిసినవాళ్ళు వాళ్ళు. రావటం రావటం అట్లా వస్తారు వాళ్ళు. చూడండి మనకి గురుపూజలు నిర్వర్తిస్తున్నప్పుడు ఎవరెవరు ఏం చేయాలో వాళ్ళకి తెలుసు కాబట్టి గబగబా అందరూ అన్ని ఊళ్లనించి వచ్చి, వారివారి పనులు వాళ్ళు మొదలు పెట్టేస్తారు, ఎవరూ చెప్పఖర్లేదు. గురుపూజలు అని announce చేస్తే చాలు. వంటవాళ్లు వంట, వడ్డన వాళ్ళు వడ్డన, ఉపన్యాసాల వాళ్ళు ఉపన్యాసాలు, కుర్చీలు వేసేవాళ్లు, దీపాలు పెట్టేవాళ్ళు అలా చేసుకుపోతారు. దీపాలు పెట్టేవాళ్ళు ఎట్లా దీపాలు పెట్టాలో అంతకుముందే నేర్చుకున్నారు కాబట్టి మళ్లీ పెడుతూ ఉంటారు. ఇట్లా కొంతమంది, సృష్టిలోకి తెలిసి దిగి వచ్చిన వాళ్ళుంటారు. వారే సనకసనందనాదులు, సప్తర్షులు, మనువులు, ప్రజాపతులు. అలా దిగి వచ్చేసి ఒక యజ్ఞం మొదలు పెడతారు. మొదలు పెట్టి ఆ పురుషుడిని వండేస్తారు. ఎవరిని? పరమాత్మ తత్త్వాన్ని! అలా వండేస్తే, అందులోంచి సృష్టి అంతా ఒక్కొక్కటి ఒక్కొక్కటి వస్తుందని పూరుషసూక్తం చెప్తుంది. ఈ విధంగా ఈ మొత్తం అంతా కూడా సంకల్పం రూపంలో ఇంతమందిలోనూ పని చేస్తున్నవాడు ఒకడే. అతడే భూతకృత్. అంటే ఈ సృష్టి, భూతసృష్టి చేసేవాడు. అతని అనుజ్ఞగా ఈ జీవులందరూ బయటికి వస్తారు. వచ్చి, ఒక సృష్టి కాలంలో కొంతమంది పరిణామం చెందుతూ ఉంటారు. ఈ భూమి మీద పూర్తిగా పరిణామం చెందినవారు శుక్ర గ్రహంలోకి, అక్కడ నుండి పరిణామం చెందిన వారు బుధ గ్రహంలోకి, అక్కడ పరిణామం చెందిన వాళ్ళు సూర్య గ్రహంలోకి, అక్కడ పరిణామం చెందిన వాళ్ళు సవితృ మండలంలోకి, అక్కడ పరిణామం చెందిన వాళ్ళు భర్గోదేవ మండలం లోనికి, అట్లా అంచెలంచెలుగా వెళ్తూ ఉంటారు. వైకుంఠపాళి లాగా. వెళ్తూ ఉంటారు, తప్పులు చేస్తూ ఉంటే, పాము నోట్లో పడతారు, క్రింద కొచ్చేస్తుంటారు. ఇటువంటి కథలు జరుగుతూ ఉంటాయి. ఇలా జరుగుతూ ఉండగా, సృష్టి అయ్యే లోపల కొంతమంది పరమపదమును చేరుకుంటారు. అలా కొంతమంది చేరుకుంటే, కొంతమంది మిగిలిపోతారు. ఈ మిగిలిపోయిన వాళ్లందరినీ మళ్లీ boat లో వేసుకొని, మళ్లీ తీసుకెళ్ళి, ఇంకోచోట మళ్లీ ఏర్పాటు చేస్తారు. అదే వైవస్వత మనువు కథ. అదే Noah's Arc అని చెప్తారు పాశ్చాత్య దేశాల్లో. ఒక school లో చదువుకుంటున్నామండీ అందరం, చదువు పూర్తి కాకముందే building పడిపోయిందనుకోండీ దాని life అయిపోయి, అంటే వంద ఏళ్లు school building ఉంటుందనుకోండీ, ఈ వంద ఏళ్ళల్లో ఎన్ని batch

లు అవుతాయి? పది క్లాసులు ఉంటే, పది batchలు అవుతాయి. ఆ building ఆయుర్దాయం అయ్యే సమయానికి అందులో పిల్లలుంటారు L.K.G నించి పదో class వరకు. Building పడిపోతే ఏం చేస్తాం? ఆపేస్తారా వాళ్ళ చదువు? ఆపేయకూడదు కదా. అందుకని ఏం చేస్తాం, ఇంకో స్కూలు కడతాం. కట్టి ఈ పిల్లల్ని ఇక్కడ ఏ class లో కూర్చున్నారో అక్కడ ఆ class లో కూర్చోపెడతారు. ఇక్కడ L.K.G వాడు అక్కడ పదో class లో కూర్చోవాలని లేదు కదా. అక్కడ L.K.G లోనే చేరాలి. ఒకటో class వాడు ఒకటో class లోనే చేరతాడు. పదో class వాడు పదో class లో చేరతాడు. ఆ building పడిపోయే లోపల ఎంత మంది, ఆ school లో pass అయితే, అంతమంది pass అయినట్టు. మళ్ళీ building పడిపోయే సమయానికి, మళ్ళీ కొంతమంది మిగిలిపోతారు. ఈ మిగిలిపోయిన వాళ్లందరినీ మళ్ళీ ఏం చేస్తారు, మళ్ళీ వాళ్ళందరి కోసం ఒక school కడతారు. పాపం ఆయన schools అట్లా కడుతూనే ఉన్నాడటండీ. ఈ సృష్టి అనే schools ఎన్నిసార్లు కట్టాడో? ఇంకా మిగిలిపోయారు జీవులు. మరి సామాన్యమైన వాళ్ళమేంటి మనం? ఎప్పుడూ మనమే గెలుస్తున్నాం. ఆయన ఓడిపోతున్నాడు. అందుచేత మళ్ళీ సృష్టి నిర్మాణం చేస్తున్నాడు. ఇది భగవంతుని కరుణ, అని చెప్తారు. ఆ విధంగా ఈ జీవులలనందరూ ఒక్కొక్కళ్లూ మళ్ళీ వారి వారి స్థానాలకి వాళ్ళు చేర్తారు. తెలిసిన వాళ్ళేమో మాస్టర్లుగా వస్తారు. తెలియని వాళ్లంతా విద్యార్థులుగా వస్తారు. ఇంత కథ నడుస్తూ ఉంటుంది, ఈ కథంతా నడిపే వాడుగా దైవము మహాచైతన్యంగా ఉంటాడు, సృష్టిలో. సృష్టికవతల దాని గురించి చెప్పడానికి ఏం లేదు. నిర్వచించడానికి ఏం లేదు. అది నిర్వచనానికి అతీతంగా ఉంటుంది. అతను భూతకృత్ అంటే.

## ౭. భూతభ్రుత్ భావః

అంటే జీవులను పుట్టించటమే కాకుండా వాళ్ళని పెంచాలిగా! Maintaining them. Maintaining అంటే, శుభ్రంగా భోజనం పెట్టాలి, మంచి మంచి బట్టలు వేయాలి, పోషణ చేయాలి, విద్యాభ్యాసం చేయించాలి, మంచి నేర్పాలి, మంచి దారిలో నడిచేట్టుగా చూడాలి. వాళ్ళు సంఘానికి పనికొచ్చేట్టుగా తయారుచేయాలి. ఎంతపని? క్లుప్తంగా చెప్పాలంటే జీవుల పరిణామం యొక్క బాధ్యత కూడా భగవంతుడే తీసుకున్నాడు. ఎలా తల్లిదండ్రులు పిల్లల యొక్క వృద్ధి గురించి తపన చెందుతారో, తాపత్రయ పడతారో, అలాగే భగవత్ తత్వం కూడా, మన లోపల ఉండి, మన చేత పరిణామం చెందటానికి కావలసిన సత్కార్యములన్నీ, మనకి రుచి కలిగేట్టుగా తానే నిర్వర్తించుకుంటాడట. మహా కరుణ! పుట్టించటం కరుణ అయితే, ఇది మహా కరుణ! అంటే మన లోపల నుండి మనకి సద్బుద్ధి కలిగేట్టుగా ప్రేరేపించి, మనని ధర్మకార్యంలో నిలబెట్టి, అవి మనం నిర్వర్తించేట్టుగా ఉంచి, దీర్ఘకాలం అదే పద్ధతుల్లో జీవిస్తూ, త్యాగమూర్తులుగాను, యోగమూర్తులుగాను మనని తీర్చిదిద్దటానికి భగవంతుడు, లోపల నుండే మన అందరికీ ప్రేరణ ఇస్తుంటే, మనం ఎదో నిర్ణయం చేసుకుని అవీ ఇవీ చేసేస్తున్నాం అనుకుంటూ ఉంటాం. కొంతమందికి స్వభావం లోపల నుండే తొలిచేస్తూ ఉంటుంది. అది మంచికైనా తొలిచేస్తూ ఉంటుంది, చెడుకైనా తొలిచేస్తూ ఉంటుంది. కాబట్టి ప్రేరణ మనకి కలిగించి, మనని వృద్ధి పొందించటానికి కావలసిన సమస్తమైన భారము దైవమే వహించి ఉన్నాడు, అందుకనే అతనిని భూతభ్రుత్ అన్నారు. ఆ విధంగానే రకరకములైన ఋషిమార్గములు, రకరకములైన ఆరాధనా మార్గములు, నవవిధములైన భక్తులు, వాటి దారి చూపించే సద్గురువులు, ఋషులు, వారందరి రూపంలో కూడా తానే నిర్వర్తించుకుంటూ, వీరందరికీ కావలసిన పోషణ చేస్తూనే ఉంటాడు. ఎన్ని చెప్పినా మానవ జాతి పురోగతికే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. శతాబ్దానికి శతాబ్దానికి పురోగతి సాగుతూ ఉంటుంది. పురోగతి పదార్థమయంగా సాగుతూ ఉండవచ్చు, పరమార్థమయంగా సాగుతూ ఉండవచ్చు, ఏదైనా పురోగతికే ప్రయత్నం లోపలనించి జరుగుతూ ఉంటుంది. అటువంటి పురోగతి, మనందరికీ ఏర్పరచటం కోసం, దైవము చేసే ప్రయత్నము

అనిర్వచనీయము, అపారము. అందుచేత భగవంతుడిని భూతభృత్ అనే నామం ద్వారా భీష్ముడు ప్రశంసించాడు.

భావః అంటే ఉండటము అని. Be- ness, existence! మనందరి యందు, అతనట్లా ఉన్నాడు. అతనుండటమే, మనం ఉండటంగా సాగుతూ ఉంటుంది. అతను లేకపోతే, మనం ఎవ్వరం లేము. దైవం యొక్క అస్థిత్వమే మన అస్థిత్వము. దైవం మనయందు ఉండటం చేత ప్రాణస్పందనం జరుగుతూ ఉంటుంది. ఊపిరితిత్తులు గాలి పీలుస్తూ ఉంటాయి, వదులుతూ ఉంటాయి. మనం చెప్తే చేస్తున్నాయేంటి ఊపిరితిత్తులు? గాలి పీల్చండి, వదలండి, నేను చెప్పేంతవరకు అని మనం ఎప్పుడన్నా చెప్పామా? లేదు కదా! అవి గాలి పీలుస్తున్నాయి, వదులుతున్నాయి. మన ఆలోచనలతో సంబంధం లేకుండా. గుండె కొట్టుకుంటూనే ఉంది, రక్త ప్రసారం జరుగుతూనే ఉంది. తిన్నదంతా లోపల ఒక chemical laboratory ఏర్పాటుచేసి, తద్వారా మనకి అరిగేట్టుగా చూసి, మనకి శక్తి నిచ్చేట్టుగా చూసే పరికరములు చాలా పెట్టడం జరిగింది. ఇవన్నీ కూడా 'తను' లోపల ఉండటం చేత పని చేస్తున్నాయి. అవన్నీ పని చేయటం భూతభృత్! అవన్నీ, పనిచేయటానికి కారణం? అతనుండటమే! అందుకనే 'ఎట్లా ఉన్నాను' అనే ప్రశ్నకి సమాధానం దొరకదు. నీవున్నావని నీకు తెలుసు తప్ప, ఎట్లా ఉన్నావు? ఉండటమంటే ఏమిటి? ఉన్నానుగా అంటావు తప్ప, అంటే ఏంటి? నేనుండటం అంటే ఏమిటి? నిద్రలో ఎట్లా ఉన్నావు? మెళకువలో మాత్రం ఇవన్నీ ఎట్లా నిర్వర్తింపబడుతున్నాయి? దైవము ఉండటం చేత ఇవన్నీ నిర్వర్తింపబడుతున్నాయి. ఇంతకన్నా miracle ఏం కావాలి? మహత్తరమైన, అద్భుతమైన విషయం, నీయందే ఉన్నది. అది ఎందుకట్లా పని చేస్తోంది? గాలివంటిది వచ్చి ఎదో దుమ్ము వస్తూ ఉంటే కన్నురెప్పలు automatic గా మూసుకుపోతాయా? అసంకల్ప ప్రతీకార చర్య అని చెప్తూ ఉంటాం కదా. ఎందుకలా జరుగుతూ ఉంటుంది? కింద పడుతూ ఉంటే మనం ఆలోచించి చేతులు అడ్డం పెట్టుకుందాం అని అనుకునే లోపలే చేతులు ముందు నేలమీద పడి, ఛాతిని కాపాడుతూ ఉంటాయి. నువ్వు ఆలోచిస్తావా అప్పుడు? ఏదో దెబ్బ తగలబోతుంటే, చెయ్యి అడ్డు వస్తుంది, తలకాయ పక్కకి తిప్పేస్తావు, ఆలోచన లేకుండా అపాయం నించి ఆ క్షణంలో తప్పించేసుకుంటూ ఉంటావు. ఇదంతా నీ లోపల నించి నిర్వర్తిస్తున్నవాడు ఒకడు ఉన్నాడు. వాడు ఉండటమే నువ్వు ఉండటం, వాడు ఉన్నాడని నీకెప్పుడూ

అనిపించదు. అట్లా ఉంటాడు. అందుచేత నేనెట్లా ఉన్నాను? అన్న ప్రశ్నకి సమాధానం దొరకదు. అదంతే! అదే మహత్తరమైన రహస్యం. ఇంక అంతకు మించిన రహస్యం ఎదీ లేదుట. ఈ ఉండటం అనేది ఎప్పుడూ ఉంది. సృష్టి ఉన్నప్పుడూ ఉన్నది, సృష్టి లేనప్పుడూ ఉన్నది. దాన్నే 'సత్యం' అన్నారు. నువ్వు నిద్రలో ఉన్నప్పుడు ఉన్నది, నువ్వు నిద్రలోంచి లేచినప్పుడూ ఉన్నది. మరి ఈ సత్యం ఎంత అద్భుతమైన విషయం! అది ఉండబట్టి కదా మనం ఇన్ని రకాలుగా ఇన్నిన్ని వేషాలు వేస్తున్నాం. దానియందు మనకి ఎంత కృతజ్ఞత ఉండాలి? నన్ను ఉండనిచ్చావయ్యా, చాలా సంతోషం అనే కృతజ్ఞతలు చెప్పాలి. మనకి తిరుపతిలో చలికాలములో ఎవరన్నా ఒక గది ఇస్తే చాలా సంతోషిస్తాం. చలి కాలం, గది లేదంటే ఎక్కడ పడుకుంటాం? గదిలో ఉండనిచ్చారని. ఇక్కడ ఉండనిచ్చారు, అక్కడ ఉండనిచ్చారు అని సంతోష పడిపోతూ ఉంటాం కదా. Thanks అంటూ ఉంటాం కదా. ఈ ఉండటం మాటేమిటి? ఈ ఉండటం ఇప్పుడున్నామా, ఎప్పుడూ ఉన్నాం. ఎట్లా ఉన్నాం? అసలు ఈ ప్రశ్న ఎవరికీ రాదు. ఎందుకు రాదంటే దాని ఉపకారం ఎప్పటికీ గుర్తించలేనంత లోతుల్లో ఉంటుంది. అంతకన్నా మహాత్ముడెవడున్నాడు? ఉపకారం చేసి, ఇతని వలన నాకు ఈ ఉపకారం జరిగింది అని మనం గుర్తు కూడా చేసుకోలేనంత ఉపకారం చేస్తున్నాడండీ! చిన్న చిన్న ఉపకారాలకే మనం ఒకళ్లకొకళ్ళం కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉంటాం కదా. అవన్నీ ఆయన చూసి ఏమనుకుంటాడు? నాకన్నానా వీళ్లంతా అని అనుకోడూ! ఉపకారం ఒకరికొకరు చేస్తే ఇద్దరిలోనూ వాడే ఉన్నాడు కదా. మరి ఆ ఉన్నవాడి మాటేమిటి? వాడి గురించి మనం ఎంత కృతజ్ఞతగా ఉండాలి? ఇంకా ఏదో అది చేయలేదు, ఇది చేయలేదు వాడు మనకి అంటూ ఉంటాం కదా. ఒరేయ్ నిన్ను ఉండనిచ్చానురా సంతోషించు, అని చెప్పాలి. ఎట్లా ఉన్నాడు మనలో? ప్రణవం రూపంలో ఉంటాడు. లోపల నాదస్వరూపుడై ఈ తనువులన్నీ అహర్నిశలూ ధరించి ఉంటాడు. అతనితో మనం అనుసంధానం చెందటం కోసమే ప్రణవారాధన! ప్రణవము ప్రాణమునకే ఆధారము. అందుచేత మన ఉనికి అంటే ప్రణవము యొక్క ఉనికే మనలో. ప్రణవ స్వరూపపుడుగా దైవం మనలో ఉన్నాడు కాబట్టి, అలా నిత్యం మనయందు ఉంటూ స్పందనాత్మకుడై ఉన్నాడు కాబట్టే, అలా ఉండటం. మనలో ఉండటం అనేదాన్ని 'భావ' అని చెప్పి అన్నారు. అది ఒక నామం. అంటే 'భవ' అని.

## ౮. భూతాత్మా.

అంటే పుట్టిన వాటన్నిటియొక్క మూల తత్త్వం లేక ఆత్మ తత్త్వంగా అతను ఉన్నాడు. జీవులలో ఉండే ప్రజ్ఞగా ఉన్నాడంటారు. The spirit is the central theme of the soul. The soul is the vehicle of the spirit; the body is the vehicle of the soul. అని చెప్తూ ఉంటాం ఆంగ్లంలో. అంటే జీవుడికి శరీరం ఏ విధంగా ఒక వాహికో, అలాగే జీవుడు దైవమునకు వాహిక. దివ్యప్రజ్ఞకు వాహిక. ఆ ప్రజ్ఞను 'పరమాత్మ' అంటారు. దాని లోంచి ఏర్పడిన జీవులను 'జీవాత్మ' అంటారు. జీవాత్మలో కేంద్రముగా, మూలముగా, జీవాత్మ యొక్క ఆధారముగా దైవం మనయందు, సమస్త జీవులయందు ఉన్నాడు. అట్లా తాను కేంద్రంలో ఉండటం చేత, సమస్త భూతముల యందు అతడే ఆత్మగా ఉన్నాడు. అది చెప్పేనామం 'భూతాత్మ'. అందుచేత ఎవరిని చూచినా ఆ కేంద్రమును చూచినట్లయితే నారాయణ లోకమును చూచినట్లు. ఆ కేంద్రము చుట్టూ అల్లుకుని ఉన్న ఆ రూపంలో ఉన్న చైతన్యాన్ని చూసినట్లయితే, అది ఆ నారాయణుని యొక్క తేజస్సును చూచినట్లు. ఆ తేజమనే ఆ ప్రజ్ఞాబిందువు, ఆ రూపంలో పనిచేసే తీరుచూస్తే వాసుదేవుడిని చూచినట్టు. అంటే ప్రవర్తనలు ఎన్నైనా ఉండచ్చు కానీ ప్రవర్తకుడు ఒకడే! వంటకాలు చాలా ఉండచ్చు కానీ, వంట ఒకటే! ఒక్కొక్కటీ ఒక్కొక్క రుచి. అట్లా రకరకముల ప్రవర్తనలతో, రకరకముల నర్తనములతో, మనకి ఎన్నో రకాల జీవులు కోటానుకోట్లు కనిపిస్తున్నప్పటికీ, వాటి క్రింద 'ప్రవర్తన' అనే సూత్రమున్నదే, అది ఒకటే! వివిధత్వం చెందుతూ ఉంటుంది ప్రవర్తన. ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ప్రవర్తిస్తున్నాడు. అలా గమనిస్తే వాసుదేవోపాసన అవుతుంది. మనం అలా చూడం. ఏదో మనకున్న లౌకికమైన సంబంధాలు మనం నిర్వర్తించుకుని, తద్వారా చూస్తూ ఉంటాం. అందుచేత మనకి కనిపించే సృష్టి వేరు, జ్ఞానుల దృష్టి వేరు. వారు చూసేది, వాసుదేవుని యొక్క నర్తనము. మనం మంచిచెడు, ఇష్టాఇష్టాలు, రాగద్వేషాలు, కామక్రోధాలు ఆధారంగా చూస్తూ ఉంటాం. భగవంతుని యొక్క అస్థిత్వము ప్రతిజీవుని యందు కేంద్రమై ఉంది. అలా కేంద్ర స్వరూపుడు భూతాత్మ! దానిని దర్శనం చేసేవాడు నారాయణ లోకాన్ని దర్శనం చేస్తున్నట్టు. అతడు ఈ భూమి మీదే ఉన్నప్పటికీ కూడా నారాయణ

లోకంలో ఉన్నట్టు. అలా దర్శనం చేస్తూ ఉంటారుట శుకాది మహర్షులందరూ కూడా. శుక మహర్షి సమస్తమునందు ఉండే నారాయణునే దర్శనం చేయటం మొదలుపెట్టాడు, ఇంకేమీ లేదతనికి. ఎంత అద్భుతమైన విషయం! అంటే, ఇక దాని చుట్టూ పరిధులున్నాయి. ఆ నారాయణ తత్త్వం అనే ఆ బిందువు చుట్టూ మొదటి ఆవరణ జీవుడు. ఆ జీవుల యొక్క గుణములు మరియొక ఆవరణ. ఆ జీవులయొక్క ప్రవర్తన మరియొక ఆవరణ. అట్లా రకరకాల ఆవరణలతో ఒక్కొక్క జీవి ప్రవర్తిస్తూ ఉంటుంది. ఇన్ని రూపాల్లోనూ ఉన్న, ఇన్ని ప్రవర్తనల లోపల ఉన్న, వెలుగులకు లోపల ఉన్న కేంద్రమేదైతే ఉందో, దానినే దర్శిస్తూ ఉండే వాడికి, ఇక అది తప్ప ఏం కనిపించదు. అది ఋషి దృష్టి! శుకుడు అట్లా సమస్తములో ఉండే అతన్నే చూస్తూ ఉండేవాడుట. అతన్నే చూస్తూ ఉంటే, అక్కడ ఏదో కడ్డీ అడ్డు వచ్చిందని ఉండదు. నీళ్లున్నాయని ఉండదు. నీళ్ళు ఎవరికి కనిపిస్తాయి? రూపము, నామము, ప్రవర్తనము ఇవన్నీ ఎవరికి కనిపిస్తాయంటే బహిరావరణలలో ఉండే వారికి. అసలీ ఆవరణలకన్నీ ఆధారమైన బిందువుందే, ఆ బిందువునందుఉన్నవాడికి, అది తప్ప ఇంకోటి కనిపించదు. అది శుకుని యొక్క స్థితి. అందుకని శుకుడు, నగ్న స్వరూపుడు అన్నారు. మనకి, మన బుద్ధి మేరకు నగ్నత్వం అంటే బట్టలు వేసుకోకపోవటం. గ్రంథాల్లో చెప్పిన నగ్నత్వం అన్నీ బట్టలే! ఆ నారాయణ ప్రజ్ఞ చుట్టూ ఏర్పడినవన్నీ ఒక్కొక్క బట్ట. ఏదో లోపల బనీను, బయట బనీను, పైన ఓ లాల్చీ, దాని పైన ఓ sweater, దానిమీద ఇంకో కోటు, ఏవేవో రకరకాలు వేసుకున్నామనుకోండి. ఏడు రకాల దుస్తులు వేసేసుకున్నాము. ఒకదాని మీద ఒకటి, ఒకదాని మీద ఒకటి, ఒకదాని మీద ఒకటి. శుకుడు ఏం వేసుకోలేదు. అంటే ఏమిటి? జీవుడు గోచరించడు, జీవుల ప్రవర్తన గోచరించదు. జీవుల యొక్క అందము, ఆకారము ఏమీ గోచరించదు. నారాయణుడే గోచరిస్తాడు. అది నారాయణుని స్థితి. అది గోవిందుని స్థితి. అందులో ఉంటూ, తన్మయం చెందుతూ సమస్తమూ నారాయణుడే, తానూ నారాయణుడే అనే స్థితి పొందినవాడి నామము కూడా, దైవ నామముతో సమానమైన ప్రచోదనం కలిగిస్తుంది. శుకుడు అటువంటి వాడు. భాగవతం చెప్పాడుట అంటే శుకుడే చెప్పాలి. శుకుడు భాగవతం చెప్తున్నాడట అంటే నారాయణుడే భాగవతం చెప్తున్నట్టు. కారణం ఏమిటి? అతడు నారాయణుని యొక్క తత్త్వమునందే సర్వకాలసర్వావస్థలయందు జీవిస్తూ వచ్చాడు. ఉపదేశం పొందిందేమో తండ్రి దగ్గర నుండి. కానీ సాధనేమో తండ్రిని మించి

చేసేస్తాడు. అంతా నారాయణుడే! నారాయణుని చుట్టూ ఏర్పడిన ఆవరణములు కూడా దర్శించనటువంటి స్థితిలో ఉన్నవాడు కాబట్టి అతనిని 'నగ్నుడు' అన్నారు. బట్టలు వేసుకోడు అన్నారు. బట్టలంటే ఆవరణలే! నేననే అహంకారం మనకి ఉంటుంది కదా! నేననే దివ్యప్రజ్ఞకి ఆవరణ అహంకారం. అది లేదు. అష్ఠ ప్రకృతులు అహంకారము, బుద్ధి, చిత్తము, పంచేంద్రియములు. ఐదో అధ్యాయంలో చెప్తారు, అష్ఠ ప్రకృతులు. అందుచేత శుకుడు ఈ అష్ఠప్రకృతులు అనే ఎనిమిది ఆవరణలు లేనివాడు. కనకనే అతడు మాట్లాడితే నారాయణుడు మాట్లాడినట్టే! అటువంటివాడు అరణ్యంలో పడి నడిచి వెళ్ళిపోతూ ఉంటే, ఈ పిల్లవాడు ఎటు వెళ్లిపోయాడో చూద్దామని తండ్రి వెతుక్కుంటూ బయలుదేరతాడు. ఎక్కడా కనపడకపోతే, శుకా! అని పిలుస్తాడు. శుకా అని పిలిస్తే, మామూలుగా శుకుడు అక్కడ ఉంటే ఓయ్ అనాలి కదా. 'శుకా' అని వ్యాసుడు పిలిస్తే, చెట్టు, పుట్ట, రాయి, రప్ప అన్నీ కూడా 'ఓయ్'! అన్నాయి. గుండె పగిలిపోయేంత పని అయ్యింది వేదవ్యాసుడికి. ఇదేమిటండీ? అతన్ని 'నాయనా శుకా' అని పిలిస్తే, రాయి ఓయ్! అంది, చెట్టు ఓయ్! అంది, పిట్ట ఓయ్! అంది. జంతువు ఓయ్! అంది, ఆకాశం, పంచభూతాలు, అన్నీ ఒక్కసారి ఓయ్! అన్నాయి. అప్పుడు వేద వ్యాసుడికి ఒళ్ళు పులకరించింది. ఇదేమిటి వీడిని పిలిస్తే మొత్తం సృష్టి అంతా పలుకుతోందే! అంటే ఏంటి? ఈ సమస్తమూ 'అంతర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః'. కదా! ఆ తత్త్వమే శుక తత్త్వము, శుక తత్త్వమే ఆ తత్త్వమైపోయింది. అందుచేత అవన్నీ పలికినాయి. పలికేసరికి గుండె పొంగి, పేలిపోయినంత పని అయిపోయింది వేదవ్యాసుడికి, అమ్మో! నా కొడుకు ఇంతటివాడా! కొడుకేమిటి? ఇక నా కొడుకు అనుకోవటానికి ఏం లేదక్కడ. అంతటివాడు శుకుడు. అది నగ్నత్వం. ఆ నగ్నత్వమే గోపికలకి ప్రసాదించటానికి శ్రీ కృష్ణుడు చీరలెత్తుకుపోవటం. ఆ స్త్రీలందరూ కూడా, మాకు శ్రీకృష్ణుడు పతిగా కావాలి అని ఒక వ్రతం పడతారు. స్త్రీలంటే వయసులో ఉన్న పిల్లలు. మాకు కృష్ణుడిని మొగుడు చెయ్యి తల్లీ, అని చెప్పి కాత్యాయనీ దేవిని కోరుకుంటారు వాళ్ళు. ఎందుకని? వాళ్లకప్పటికే పడుకున్నా కృష్ణుడు, లేచినా కృష్ణుడు! ఎప్పుడూ నిద్రపోయింది కూడా లేదు వాళ్లు. ఈయన ఊరు బయటకెళ్ళి ఆ యమునా తీరంలో కూర్చుని వేణు నాదం చేస్తూ ఉంటే, ఆ వేణునాదానికి వీళ్లంతా ఇంట్లోంచి పరిగెత్తుకుంటూ వచ్చేసేవాళ్లు. ఎప్పుడూ నిద్దర్లు పోలా. పగలు కృష్ణుడే, రాత్రీ కృష్ణుడే, ఆవును చూస్తే కృష్ణుడే, దూడను చూస్తే

కృష్ణుడే. అమ్మని చూస్తే కృష్ణుడే, నాన్నని చూస్తే కృష్ణుడే. ఏం చూసినా కృష్ణుడే! ఇట్లా అయిపోయారు వాళ్ళు. అటువంటి వాళ్ళకే కృష్ణుడు పతినిగా కోరే హక్కు ఉంటుంది. ప్రతి వాళ్ళూ కృష్ణుని పతిగా కోరితే కుదరదు. వాళ్ళకి సమస్తమూ కృష్ణుడుగా అనిపిస్తుంది. అనిపిస్తూ ఉంటే వాళ్ళు కాత్యాయనీ గుడికి వెళ్ళి వ్రతం పడతారు. కృష్ణుని మేము పతిగా పొందే వరం ఇవ్వు, మేం వ్రతం ఆచరిస్తామని. ప్రతిరోజూ యమునలో స్నానం చేయటం, గుళ్ళో పూజ చేసుకోవటం, దణ్ణం పెట్టుకోవటం. అది చూస్తాడు కృష్ణుడు. ఆయన చిన్న పిల్లవాడు. ఆయన కన్నా వీళ్ళు పెద్దవాళ్ళు. ఇదంతా ఆధ్యాత్మిక తత్త్వం. మనం అనుకునే మొగుడు, పెళ్ళాలు కాదది. వ్రత సమాప్తి అయ్యే రోజున వాళ్లందరూ నీళ్ళల్లో స్నానం చేస్తూ ఉంటే ఈయన వలువలు ఎత్తుకుపోతాడు. చెట్టు మీద దాచేస్తాడు. దాచేస్తే, వీళ్ళు స్నానం చేసి వస్తే వీళ్ళకి కనపడవు. ఎవరు తీశారా అంటే ఆయన పైనించి వేణువూదుతాడు. ఊదితే, వీళ్లేమో నీళ్ళల్లోకి పారిపోతారు. దాక్కుంటారు. మా బట్టలిమ్మంటారు. అదేమిటది, మీరు చేసిన వ్రతం అది కాదు కదా! అంటాడు. అక్కడ బట్టలిమ్మంటే ఏంటంటే, వాళ్ళకి తమ యొక్క అస్థిత్వము ఒకటి ఉన్నది. కృష్ణుడొకడు ఉన్నాడు. తామొకరు, కృష్ణుడొకడు! అంటే తాము తాముగా ఉంటూ, కృష్ణుడు కావాలి అనుకుంటున్నారు. అట్లా దొరకడు కృష్ణుడు! తనని తాను కోల్పోయిన వాడికి కృష్ణుడు దొరుకుతాడు. అదీ కృష్ణతత్త్వం! అన్నీ ఒలిచేసుకుంటే తప్ప కృష్ణుడు రాడు దగ్గరకి. నువ్వు అన్నీ ఒలిచేసుకుంటే, నీలో మిగిలేది కృష్ణుడు. ఒలిచేసుకోవటం అంటే నిన్ను కూడా నువ్వు ఒలిచేసుకోవాలి. అంటే నీ అస్థిత్వము కూడా ఒలిచేయాలి. ఇక్కడ ఈ గోపికలకి, వాళ్ళ అస్థిత్వము వాళ్ళకి మిగిలిపోయింది, ఇక మిగతాదంతా కృష్ణుడు. అంటే మొత్తం కృష్ణుడు, వాళ్ళు ఒకళ్ళు వేరుగా ఉన్నారు. శుకుడో? తాను వేరుగా లేడు. శుకుడికి తనయొక్క identity లేదు. తన వ్యక్తిత్వము లేదు. నేను అనుగ్రహించడం అంటే ఏంలేదురా, నువ్వు అన్నీ వలిచేసుకోవడమే, పూర్తిగా వలిచేసుకుని అలా మొండి మొలగా అనగా భావమైన మొండిమొలగా నిలబడాలి. భావంలో కూడా 'నేను' అనేది కూడా మర్చిపోయి 'దైవమే, ఇక నేనెక్కడ వున్నాను?' అనేలా కరిగిపోవాలి అహంకారం. అలా కరిగిపోతే మిగిలేది ఆయనండీ. ఆ ఉపదేశం గోపికలకి ఇవ్వడానికే 'ఇంకా మీకు మీరుగా మిగిలి ఉంటే ఇక నన్నేం పొందుతారు?' అని చెప్తున్నాడు. గోపికావస్త్రాపహరణం యొక్క సందేశం ఏమిటంటే 'మిమ్మల్ని మీకుగా జాగ్రత్తగా

సంరక్షించుకుంటూ ఉన్న కొద్దీ నేను మీకు దూరంగానే వుంటాను'. మీరాబాయి అలా కృష్ణుడు పాటలు పాడుకుంటూ రోడ్డుమీదకి వెళ్లిపోతూ వుండేది. ఏవేవో చేసేస్తూ వుండేది. తను మీరాబాయి అని, రాణా భార్య అని, జైపూర్ మహారాణి అని, అవేవీ గుర్తుండవు. గుర్తుంటే ఈ తత్వం రాదు. ఆత్మతత్వంలోకి వెళ్లిపోయేవాడికి తానేలేడు. అదే వుంటుంది. అదే వీడినుంచి పనిచేస్తూ వుంటుంది. అక్కడ వున్నది నారాయణుడే! మీరా అలా నిర్వర్తించింది. కృష్ణ భక్తులంతా అలాగే నిర్వర్తించారు. తమను తాము కోల్పోవడంచేత అక్కడ కృష్ణుడు అవతరిస్తాడు. అదీ సమర్పణ అంటే! సమర్పణ, సమర్పణ, సమర్పణ, అంటూ వుంటామే, సమర్పణ చేసుకున్నవాడికి ఇక తానుండడు. వాడే ఉంటాడు! అతని గురించి గుర్తుచేస్తే తప్ప గుర్తురాదు. 'ఒరేయ్! నువ్వు హనుమంతుడివి రా' అని చెప్తే తప్ప హనుమంతుడికి తాను హనుమంతుడినని గుర్తే వుండదు. తాను హనుమంతుడనే గుర్తులేకపోతే, తను ఎప్పుడో చిన్నప్పుడు సూర్యుణ్ణి మింగాడని, అది చేసానని, ఇది చేసానని, తాను ఇంత బలపరాక్రమవంతుడని, ఇంత వరప్రసాది అని హనుమంతుడికి గుర్తు వుండదు. అది హనుమంతుడు గొప్పదనం. రాముని యొక్క కీర్తన చేస్తుంటే, తాను రాముని కీర్తన చేస్తున్నాననే భావన హనుమంతుడులో వుండదు. ఇది హనుమంతుని భక్తి. అది ఎంత భక్తి? మనం భజన చేస్తూ వుంటే 'చాలా బాగా చేస్తున్నాం', అని మనమే అనుకుంటాం. పూజలు చేస్తూవుంటే చాలా బాగా చేస్తున్నాం, మన పక్కవాళ్ళు బాగా చదవడంలేదు, ఇలా ఆలోచించుకుంటూ మనం మనంగా వుండిపోతాం కదా? గుండ్రాళ్ళలాగ ఏమాత్రం కరగకుండా. అంత పూజా చేస్తాం ఏమీ కరగము కదా, అటువంటిది హనుమంతుడు గానం చేస్తూవుంటే అతను వుండడు, రాముడు ఉంటాడు అక్కడ. హనుమంతుడు కీర్తన చేస్తే రాముడు ఉంటాడు అక్కడనేది అందుకనే! మరి అలా వుంటారండీ, భక్తి అంటే అదండీ. వాడు వుండడు, దైవం ఉంటాడు అక్కడ! కాసేపట్లో వీడు కరిగిపోతాడు, వాడౌతాడు. నరుడు కరిగితే నారాయణుడు ఉంటాడు అక్కడ! మళ్ళీ గడ్డకడితే, మనం వుంటాం. అందుచేత హనుమంతుడికి తను ఎంతటి భక్తుడో తనకి తెలియదు. తను ఎంత మధురంగా గానం చేస్తాడో తనకి తెలియదు. తను ఎంత ప్రతాపవంతుడో తనకి తెలియదు. ఏం తెలియదు, చెప్పాలి ఎవరైనా. మనమో? మనగురించి ఎవరు చెప్పినా మనకి బావుండదు. ఎందుకంటే మనం మన గురించి ఇంకా ఎక్కువ అనుకుంటూ వుంటాం. 'వీడు సభ పెట్టాడు పొగుడుతానని, ఇంతే చెప్పాడు ఇంక

చాలా వుంది' అనిపిస్తూవుంటుంది కదా! అందుకని ఎప్పుడూ దుఃఖంగానే వుంటుంది. ఎంత పొగిడినా ఇంకా చాలదన్నట్టుగా వుంటుంది మనకి. జాంబవంతుడు ఎంతో చెప్పవలసి వస్తుంది హనుమంతుడు ఎగరడానికి! 'ఒరేయ్ నువ్వు వంద యోజనాలు ఏపిట్రా బాబూ, ఏడవ ఆకాశంలో నువ్వు ఎగరగలవు. నువ్వు ఇంతటి వాడివి, నువ్వు అంతటివాడివి' అని పూటంతా పొగిడితే, 'నిజమా?' అని చూస్తాడు. అని బయలుదేరతాడు, దూకేసిన తరువాత ఇంతేనా అనుకుంటాడు. అప్పుడు అనుకుంటాడు, ఓహో! మనం గరుత్మంతుడితో సమానంగా ఎగరగలం అని కాసేపు గుర్తొచ్చి, మళ్ళీ మర్చిపోతాడు. అన్నీ మర్చిపోతాడు, అంటే తనగురించి తనకి, తన ప్రతిభ అంతా కూడా తనకి గుర్తులేకపోవటం అనేది, అది మహా గొప్ప దశ. భగవద్ భక్తుడు అంటే 'తనను తాను మరచినవాడు' అని అర్థం. తనకి తాను గుర్తున్నంతసేపూ దైవం రాడు. తనకి తాను గుర్తుండడం అంటే ఏమిటంటే, మన గుమ్మానికి అడ్డంగా మనమే నిలబడి 'లోపలకి రండి సార్' అని పిలిచినట్టుగా వుంటుంది ఎవరికైనా. మనమే గుమ్మము మొత్తం నిండినట్లుగ నిలబడి 'లోపలికి రండి, లోపలికి రండి' అంటే వాడు ఎలావస్తాడు రాడుగా? 'నువ్వు తప్పుకోరా నేను లోపలి వస్తాను' అంటాడు దేవుడు, మనం తప్పుకోం. మనం అంతా వుండి, వాణ్ని రమ్మంటాం లోపలికి. సరే, ఈ గాడిదకి ఇప్పుడు అర్థంకాదులే, అని వెళ్ళిపోతాడు. అందుకని మనం వున్నంతసేపూ దైవం వుండడు, రావడానికి వీల్లేదు లోపలికి, 'రారా మా ఇంటిదాకా' యే, 'రారా మా ఇంటిలోకి' కాదు. చాలా తేడా వుంది కదా? 'రారా మా ఇంటిదాకా' అంటే 'మీ ఇంటి దాకా వచ్చానురా, నువ్వు అడ్డంగా వున్నావు, వెళ్ళిపోయాను' అని చెప్తాడు. ఇంటి లోపలికి రావాలి కదా? ఎప్పుడు వస్తాడు లోపలికి? నిన్ను నువ్వు మర్చిపోతే వస్తాడు. నీకు నువ్వు గుర్తుంటే రాడు. వచ్చి వెళ్ళిన తరువాత, 'అయ్యో! వచ్చి వెళ్ళాడు, నేను చూడలేక పోతిని' అని ఏడుస్తూ వుంటావు. వాడు నిజంగా వస్తే మనం వాడిలోకి వెళ్ళిపోతాం కాబట్టి, మనం వుండం కాబట్టి, వాడు వెళ్ళిన తరువాతే, 'వాడు వచ్చాడు, వెళ్ళాడు' అని తెలుస్తుంది అంతే! అందుకని ఆ విధంగా మనకి మన ఆస్థిత్వం మొదటి ఆవరణ కదా? జీవుడు దైవమునకు వాహిక. 'నేను ఇంత భక్తుణ్ణి, నేను అంత భక్తుణ్ణి', 'నేను ఇంత చేసాను, అంత చేసాను', 'నేను ఇంత యోగసాధన చేసాను, అంత నామజపం చేసాను', 'ఇంత రామనామం రాసాను' అని గుర్తున్నవాళ్ళకెవరికీ ఏమీ జరగదు. ఎందుకు జరగదంటే, నీ గురించి నీవు గుర్తుపెట్టుకోవడానికే నీకు time

చాలడంలేదు, ఇక వాడెక్కడ గుర్తుంటాడు. నిన్ను పెద్ద చేసుకోవడంకోసం నువ్వు వాణ్ణి ఆరాధిస్తున్నావా? వాణ్ణి పెద్దచేసేసి నువ్వు almost లేకుండా వెళ్ళిపోతావా? అక్రూరుడు కృష్ణుణ్ణి బృందావనం నుంచి మధుర పట్టుకొస్తాడు. పట్టుకొచ్చిన తరువాత కృష్ణుణ్ణి:-

" నా ఇంటికి విచ్చేయుము నీ అంకిలి సరోజరేణువు నికరము సోకన్, నా ఇల్లు పవిత్రంబగు, శ్రీయుతా నీ భటుని పెద్ద చేయందగదే?" అంటాడు.

ఆహా! మళ్ళీ వస్తాలే, అంటాడు శ్రీకృష్ణుడు. ఎందుకు అలా అన్నాడు? అంటే 'మీరు మా ఇంటికి విచ్చేయండి సార్' గురువులని అడుగుతూవుంటాం కదా 'మా ఇంటికి రండి సార్, మా ఇంటికి రండి సార్'. ఎందుకుట మా ఇంటికి రావాలి? నీ అంకిలి సరోజరేణువు నికరము సోకన్, నా ఇల్లు పవిత్రంబగు అంటే నా ఇల్లు పవిత్రం చెయ్యి, నాకు వైభవం పెంచు, నీ భటుణ్ణి నేను, నన్ను పెద్దవాణ్ణి చెయ్యి. అదేవిటి నువ్వు పెద్దవాడివి అవటానికా నీ ఇంటికి నన్ను పిలుస్తున్నావు? నువ్వు చిన్నవాడివి అవడానికైతే నన్ను పిలు. నువ్వు పెద్దవాడివి అవడానికి పిలిస్తే అది ఒక రకమైన భక్తి. అందుకని కృష్ణుడు రాలేదు. అది చూడండి. మళ్ళీ వస్తాలే, time చూసుకుని, అంటే ఏమిటి time? నువ్వు బాగుపడి, బుద్ధి వచ్చి ఏడిస్తే నీకు, నీ బుద్ధి మారితే, నువ్వు పెద్దవాడివి అవుదాము అనే ఉద్దేశ్యంతో నన్ను పిలుస్తున్నావే, అది మారిన రోజున అప్పుడు వస్తా! ఎప్పుడూ వెళ్ళలేదు కృష్ణుడు అక్రూరుడి ఇంటికి. ఈయన మహా భక్తుడు. అక్రూరుడు పుట్టడమే విష్ణు అంశలో పుట్టాడు. అయినప్పటికీ చూడండి, ఆయనకి ఉన్న పాండిత్యమూ, జ్ఞానమూ ఆయన్ని ఎటువంటి మార్గంలో పంపించిందో! చాలా ఇబ్బందులు పడతాడు అక్రూరుడు. అదే మధురలో వెళ్తూ వుంటే, ఇంకొక సామాన్యుడు ఉంటాడు, మహాభక్తుడు. కృష్ణుడు కనపడంగానే వున్న దండలన్నీ వేసేస్తాడు కృష్ణుడి మెడలో. కాళ్ళకి దండం పెడతాడు. కృష్ణుడు చూస్తాడు, చూస్తే అతనంటాడు:-

"నీ పాద కమల సేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యము,
నితాంత అపార భూతదయ, తాపసమందారా నాకు దయసేయగదే"

నన్ను పెద్దవాణ్ణి చేయమనలేదు, మా ఇంటికిరా అనలేదు. నీ ఇంటికి రమ్మనడం స్వార్థమేగా? ఏదో ఒకరోజు నువ్వు వాడి ఇంటికి పోవాలి. ఈ యుగంలో కాకపోతే పై యుగంలో అయినా, ఈ సృష్టిలో కాకపోతే పై సృష్టిలో అయినా, మనం వెళ్లవలసినది వాడింటికి. వాణ్ని మనింటికి పట్టుకురావడం కాదు.

'నీ పాద కమల సేవయు', పాద కమలాలు అంటే భగవంతుని యొక్క పాదాలు కమలాల లాగ అందంగా వుంటాయని చెప్పారు. భగవంతుని యొక్క పాదములు ఏమిటి? విశ్వము, భూతములు, 'పాదోస్య విశ్వాభూతాని'. అందుకని, ఈ సృష్టీ, సృష్టి జీవులకు సేవచేసుకొనే భాగ్యం నాకు ఇవ్వమన్నాడు. 'నీ పాదార్చకులతోడి నెయ్యము' అలా సేవా చేస్తున్నారే సృష్టికీ, ఈ సృష్టి జీవులకీ? అలా సేవచేయడంలో నిష్ణాతులైన వారితో నాకు స్నేహం కల్పించవా? సత్సాంగత్యం! "నితాంత అపార భూతదయ" అంటే నిత్యమూ వుండే, మితములేని, అమితమైన, అపారమైన దయ నా గుండెల్లో వచ్చేట్టు చూడు, ఇది కఠినమైనది, ఏమీ బొత్తిగా జాలిపడదు. దేన్నీ చూసినానూ? అందుచేత అదొకటి నాకు పడెయ్, అని అడిగాడు. వీడు సామాన్యుడు, ఆయన మహాజ్ఞాని. రెండు పద్యాలూ ఒకే అధ్యాయంలో, ఒకే ఉపాఖ్యానంలో వస్తాయి. ఎంత తేడా! భగవంతుడి యొక్క ఆరాధన లో నిన్ను నువ్వు మర్చిపోవాలి. అతను నీలో కేంద్రబిందువుగా వున్నాడు. ఎలా వున్నాడు:-

"నీలతోయద మధ్యస్తా ద్విద్యుల్లేఖేవ భాస్వరా, నీవారశూకవత్తన్వీ
పీతాభాస్వత్యణూపమా, తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః"

మంచి బియ్యపుగింజని తీసుకుంటే, ఆ బియ్యపు గింజకి చిన్న తల వుంటుంది. అంత ఉంటాడు. అంటే బిందువు అని. 'విద్యుల్లేఖేవ' ఒక విద్యుత్తు బిందువు చూడండి మీరూ, T.V. off చేసినపుడు మొత్తం అంతా మూసుకుపోతూ ఒక బిందువు అలా క్షణంసేపు వెలిగి, మొత్తం T.V. off అయిపోతుంది. ఒక bluish spot లాగ, అంత ఉంటాడు. విద్యుల్లేఖ-దాని మధ్యలో 'పరమాత్మా వ్యవస్థిత'. ఈ మంత్రపుష్పం గానీ, నారాయణ సూక్తం గానీ చదువుకునేటప్పుడు ఆ స్ఫూర్తితో చదువుకోవాలి. నీ హృదయంలో ఉన్న ఆ బిందువు, ఆ బిందువు లోపల అతను వున్నాడు. ఎవరతడు? సబ్రహ్మ సశివ సహరి స్సేన్ద్రస్సో క్షర పరమస్స్వరాట్! అతడే రాజాధిరాజు. రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే...ఇలా చదువుకోవాలి. అంటే స్ఫూర్తితో చదవాలి. స్ఫూర్తిలేకుండా వూరికే volumes చదివేస్తే ఉపయోగం లేదు. అలా వున్నాడు భూతాత్మ! ఆత్మతత్వం ప్రతీ జీవిలోనూ అణుమాత్రం ఉంటాడు. 'అణోరణీయా మహతో మహీయాన్' అన్నారు. చిన్న అణువుగా, ప్రతీ చిన్న జీవిలో కూడా వున్నాడు. ఇసుకరేణువులో వున్నాడు. 'ఆ అణువులో ఉండే ఆ కాంతిలో ఉండే కేంద్రంలో ఉన్న తత్వమే ఆత్మతత్వము' అని ఋషులు చెప్పారు. అది ఉండబట్టి, అది ఆధారంగా ఇంత ఏర్పడిందండీ, సరుకు-పెద్ద సరుకు. ఐదడుగుల

సరుకు నుంచీ ఆరడుగుల సరుకు వరకూ ఒక పెద్ద mass ఒకటి ఏర్పడుతుంది ఆవరణలు కట్టుకుంటుంది. నవావరణలు పూజలు చేస్తూవుంటారే అమ్మవారికి, ఏమిటా ఆవరణలు? ఒక్కొక్క ఆవరణని దాటుకుంటూ లోపలి వెళ్ళాలి. ఏదీ? లోపల, బయట కాదు. సంవత్సరానికి ఒక్కొక్క ఆవరణ అయిపోతూ వుంటుంది. లోపలికి వెళ్ళిపోయాం, బిందువుకి వచ్చేసాం అంటారు. ఏదీ? ఎన్నో ఆవరణలో వున్నారు మీరూ అని అడుగుతూ వుంటారు. ఒకళ్ళు లలితపూజ చేసేవాళ్ళు, ఇంకొక లలిత పూజ చేసేవాళ్ళని, ఇద్దరూ బహిరావరణలో ఉన్నట్లే. ఈ లోపలికి పోవాలి. అటు పోతున్నకొద్దీ బయట విషయాలు రుచిగా వుండవు. మరి ఆత్మతత్వం అంటే అలా వుంటుందండీ! శుకుడు ఆత్మతత్వం ఎరిగిన వాడు. వ్యాసుడు బాగా gymnastics చేసుకున్న తరువాత తెలుసుకున్న వాడు. గోపికలు భగవంతుని అనుగ్రహం చేత తెలుసుకున్న వారు. మైత్రేయుడు ఒకడు భగవంతుని అనుగ్రహం వలన సరాసరి తెలుసుకున్న వాడు. నారదుడు చూసి ఆశ్చర్యపోయినవాడు. భగవద్ తత్వం రూపు కట్టుకుంటే ఇంత అద్భుతంగా ఉంటుందా? ఓహో! ఆహా! ఆయనకి పరమానందం వేసింది. అలా వాళ్ళు ఆత్మతత్వం ఎరిగిన వారు. అటువంటిది మనలో వుందండీ. కాబట్టి ఎక్కడికి వెళ్ళాలి? ఏమిటి చూడాలి? ఏది చెయ్యాలి? అది తెలిసినవాడు ఇక అంతర్గతంగానే, అంతర్ముఖంగానే అంతా అనుభూతి చెందుతూ ఉంటాడు. వారు ప్రత్యేకించి ఈ ఆవరణలు ప్రయత్నించి చూడాలి. వాళ్ళు ప్రయత్నిస్తే గానీ రూపం, నామం ఇవన్నీ కనపడవు. నామరూపాత్మకమైన జగత్తు, ప్రయత్నించి చూస్తే కనిపిస్తుంది వాళ్లకి. మనం ఎంత ప్రయత్నం చేస్తే ఇదంతా మాయం అవుతుందండీ? జన్మల ప్రయత్నం కూడా చాలడంలేదే మనకి ఇదంతా కనపడకుండా పోవడానికి. వాళ్లకిటా ఇది కనపడ్డానికి ప్రయత్నం చెయ్యాలిటండీ! అందుకే భగవంతుడు చెప్తాడు 'యోగికి, నీకేది పగలో వాడికది చీకటిరా' అని. పగలేకదా మనకి ఇవన్నీ కనిపిస్తాయి? చీకట్లో ఈ కన్నేమి కనిపిస్తుంది? గుడ్డే ఇది. పగలు నీకు కనిపించేవన్నీ ఉంటాయే... అవన్నీ వారికి కనిపించవు. వారికి రాత్రి అది. అదీ యోగులకి రాత్రంటే. నీ పగలు వారికి రాత్రి అంటే అర్థం అది. నీ రాత్రి వారికి పగలు, యోగికి. అంటే? నీకు కనపడనిదంతా వాళ్లకి కనిపిస్తుందీ, నీకు కనపడేది వాళ్లకి కనపడదు. అదీ యోగి! ఎంత అద్భుతంగా చెప్తాడు భగవద్గీత లో శ్రీ కృష్ణుడు, 'యోగికి, నీ పగలు రాత్రి, నీ రాత్రి పగలూ' అంటాడు. అంటే ఏమిటి? వాళ్ళు

రాత్రిపూట మేలుకుని పనులు చేసుకుంటారు, పగలు నిద్రపోతారు అని కాదు. మనం పగలు పనిచేసుకుంటాం, వాళ్ళు రాత్రి పనిచేసుకుంటారు కాబోలు, అనుకోకూడదు. నీకు కనపడేది వాడికి లేదు. అంటే నీకు కనపడేదంతా కూడా ఈ చిత్త భ్రమ, మాయా మోహములతో కూడినది చూస్తూ ఉంటావు నువ్వు, వాడికి అది కనపడదు. అలా కనపడక ఉండడానికి కారణం ఏమిటంటే వాడికి ఆత్మతత్వమే అనుభూతి చెందివుండడం చేత, వాడికి అంతా వెలుగు గానే కనిపిస్తుంది. మొత్తం అంతా కూడా ఒక expanse of light అండీ! అదే పాల సముద్రం! ఎటుచూసినా తెల్లగా, కళ్ళు మిరుమిట్లు గొలిపేట్లుగా వుంటుంది. అంచులు వుండవు, అంతులేని సముద్రం, దశదిశలా అదే వుంటుంది. నువ్వొకడివి తేలుతూ ఉంటావు అందులో. విష్ణుమూర్తి అలా ఉన్నాడని చెప్తారు. కదా! ఆ పాలసముద్రం మనలో వుంది. మనలో అన్ని సముద్రాలూ వున్నాయి, ఉప్పు సముద్రం దగ్గర్నుంచీ నేతి సముద్రం వరకూ  వున్నాయి వరుసగా. ఏడు కేంద్రాల లోనూ ఏడు సముద్రాలు కేంద్రానికీ కేంద్రానికీ మధ్యలో వున్నాయి. అందుచేత వాళ్ళకి నామరూపాత్మకమైన జగత్తు కోరి చూస్తే కనిపిస్తుంది. లేకపోతే కనిపించదు. అలా కోరిచూస్తే కనిపించి, లేకపోతే కనిపించక ఉండేవాళ్ళని ఇద్దర్ని చూసాను ఈ  జీవితంలో. మనకి కనపడేవన్నీ వాళ్లకి కనపడవసలు. మనం చూసేవన్నీ వాళ్ళు చూడరు. నువ్వు చెప్తే చూస్తారు. ఇదిగో ఇది ఇక్కడ వుంది అంటే చూస్తారు. ఓహో! ఉందా ? అలా వుంటుంది ఆత్మతత్వం.

## ౨. భూతభావనః

ఈ జీవుల గురించే ఎప్పుడూ భావన చేస్తూ వుంటాడుటండీ. అంటే మనకోసమే వున్నట్టుగా వుంటాడు ఆయన. మనం ఏదో అవసరం వున్నప్పుడు కనిపిస్తూ వుంటాము, అవసరం లేకపోతే మర్చిపోతూ ఉంటాము. కదా? మనది అంతా commercial attitude, దేవుడు కావచ్చు ఎవరైనా కావచ్చు, వాడితో ఏమిటి మన అవసరం, దాన్నిబట్టి కదా? ఆపద ఎక్కువగా వుంటే బాగా ఎక్కువ లెంపలు వేసుకుంటూ వుంటాం, గుంజీలు తీస్తూ వుంటాం, దండం పెట్టుకుంటాం, మొక్కుకుంటూ వుంటాం. అటువంటివి ఏవీ ప్రస్తుతం లేవు అనిపిస్తే, బొత్తిగా ...వేరే theory, వేరే సిద్ధాంతం వచ్చేస్తు వుంటాయి. వాడే ఆధారంగా జీవిస్తూ ఉన్నా వాడిగురించి గుర్తుపెట్టుకున్నప్పుడు గుర్తు పెట్టుకున్నాము, లేనప్పుడు లేదు. కానీ అతను అలా వుండడుట. నిరంతరం మన గురించి అతనియందు గుర్తు వుండడం చేత, మనం వున్నాము. గుర్తులేమనుకోండి అతనికి, మనం వుండము. అందుచేత ఈ భూతముల గురించి భగవంతునియొక్క భావన ఎలా వుంటుందో భీష్ముడు ఇలా దర్శించి చెప్పాడండీ. 'భూతకృత్'- అంటే భూతములను సృష్టి చేసేవాడు.'భూతభృత్'- అంటే వారి వృద్ధిని, పరిణామాన్ని సంరక్షించేవాడు.'భావః'- వారి యందు అస్తిత్వముగా వున్నవాడు.'భూతాత్మా'- వారి కేంద్రములుగా తాను నిలబడి వున్నవాడు.'భూత భావనః'- భావించడంచేత మనమంతా ఈ విధంగా వున్నాం.

## 10, 11- పూతాత్మా, పరమాత్మా చ

పూతాత్మా అంటే పవిత్రమైన ఆత్మ అని అర్థం. ('చ' అంటే మరియు అని అర్థము.) పవిత్రీకరింపబడిన ఆత్మ, అని అర్థం. ఆత్మ ఎప్పుడూ పవిత్రమే కదా! పవిత్రీకరింపబడిన ఆత్మ ఏమిటీ? పవిత్రమైన ఆత్మ ఏమిటి? అంటే జీవాత్మ, పరమాత్మ ఇద్దరున్నారు. పరమాత్మ సమస్తము నందు వ్యాపించి ఉండి, స్థితిగొని ఉండి, స్థాణువై ఉండి, సాన్నిధ్యాన్ని యిస్తూ వున్నప్పటికీ, అతనిని ఏమీ అంటదు. ఆ తత్త్వమును అంట గలిగినది ఏమీ లేదు. దాని నుండి ఉద్భవించిన చైతన్యం నుండి ఉద్భవించిన త్రిగుణముల నుండి అష్ట ప్రకృతులు ఏర్పడతాయి. అతడు త్రిగుణములకు అతీతుడు- మహా చైతన్యం! అందుచేత త్రిగుణాత్మకమైన సృష్టి పరమాత్మని అంటదు. ఎందుకనీ? సత్యమై, మహా చైతన్యమై ఉన్న దైవము, త్రిగుణములుగా, మూడు ప్రకృతులుగా విచ్చుకున్నప్పుడు, మూడు ప్రకృతులుగా విచ్చుకున్న దానిలో నుండి 'సప్తాస్యాసన్ పరిధయః' అన్నట్లుగా ఈ లోకములన్నీ ఏర్పడతాయి. ఈ లోకములో జీవులందరూ ఏర్పడతారు, ఈ లోకపాలకులూ ఏర్పడతారు, సమస్తము అందులో నుండే ఏర్పడతాయి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా తర్వాత వారే! భారతీయ వాఙ్మయములో చెప్పబడిన దైవము, అతడు సదాశివుడైనా, మహావిష్ణువైనా, అతడిని అంతర్యామి దైవముగా మనం భావించాలి. అంతర్యామి దైవానికి అనేక రూపాలుంటాయి. అనేక నామాలు ఉంటాయి. అందుచేత అతను పరమాత్మయే! అన్నిటియందు ఆ విధంగా వ్యాపించి ఉంటాడు. ఆయన లేకపోతే కథ లేదు. ఆయన ఉన్నప్పటికీ ఆయనని ఏమి అంటదు. అందుచేత పరమాత్మ దైవము అనేది మనం అంగీకరించక తప్పదు 'భూతకృత్, భూతభృత్, భావో, భూతాత్మ, భూత భావనః' అని అన్నప్పుడు, ఈ మహా చైతన్యము మూలంగా ఈ భూతములన్ని లేక జీవులన్నీ పుట్టుకొస్తున్నాయని తెలుస్తుంది. అందుచేత వీటన్నిటికి అతడు అతీతంగానే ఉంటాడు. ఇందులో ఉంటూ, దీనికి అతీతముగా ఉంటాడు. ఆయన ఉన్నంతగా మనం ఉండలేము. ఆయన నందిలో వున్నంతా పందిలో ఉన్నాడు, కుక్కలో వున్నాడు. అందుచేతనే పరమాత్మ లేని వస్తువు లేదు కాబట్టి, దేనినీ దూషించడానికి వీలులేదు అని మన పెద్దలు చెప్పారు. నీవు చెడ్డవాడు అనుకొనే వాడిలో కూడా పరమాత్మ ఉన్నాడు. లేకపోతే వాడు ఉండడుగా! ఏదైనా

ఉన్నదీ అంటే పరమాత్మ ఉన్నాడు కాబట్టే అది ఉన్నది. అందుకని ఉన్నదంతా దైవమే! అదే కదా విశ్వం! సమస్తము వ్యాపించిన దైవము, మనం మెచ్చుకొనే, మనం ఈసడించుకొనే, మనం అసహ్యించుకునే వాటిలో కూడా ఉన్నాడు. అదే శంకరాచార్యుల వారికి చిట్ట చివరి ఉపదేశముగ జరుగుతుంది. గంగలో స్నానం చేసి పవిత్రుణ్ణి అయ్యాననుకొని మెట్లెక్కి వస్తూ వుంటే, ఎదురుగుండా ఒక చండాలుడు వస్తాడు. వాడు చండాలుడు అని గుర్తుకి వచ్చి, పక్కకు తొలగమంటాడు. చండాలుడా వాడు? నీ దృష్టి చండాలుడ్ని చూడవచ్చు, పరమాత్మనీ చూడవచ్చు. శంకరాచార్యులవారు సమస్తము యందు దైవమును చూడ గలిగిన ప్రజ్ఞ కలవారు. "అంతా దైవమే, ఇంకేమి లేదు" అని ప్రతిపాదించిన వారు. ప్రతిపాదన ఎప్పుడు జరిగిందీ? తన అనుభూతియే తన ప్రతిపాదనగా జరిగింది. ఎవరి దర్శనము వారి యొక్క ప్రతిపాదనగా వస్తుంది. భగవతుడిని రకరకాలుగా దర్శించి, రకరకాల సిద్ధాంతాలు అందించారు. మీదైన అనుభూతి వచ్చినప్పుడు మీదీ ఓ సిద్ధాంతముగా ఏర్పరచవచ్చు. ఋషులందరు అట్లాగే ఏర్పరిచారు. ఉపనిషత్తులు అన్నీ అట్లాగే వచ్చినాయి. ఎవరిదైన అనుభవంగా వారు 'ఇట్లా చూసా భగవంతుడ్ని' అని రాసిచ్చారు. అదీ భారతీయ వాఙ్మయంలో ఉండే వైవిధ్యం. Monotony లేదు. అందరూ ఇవే కూరలు తినాలి. ఇదే పచ్చడి తినాలి, అని లేదు. ఇట్లాగే తినాలని, లేదు. వైవిధ్యం! సృష్టియే వైవిధ్యం! భారతీయ వాఙ్మయము వైవిధ్యం! ఆధ్యాత్మిక దర్శనములు వైవిధ్యం! భగవంతుడి యొక్క ముఖములు ఎన్ని ఉన్నాయో! విశ్వ రూపం అదే కదా! కాబట్టి ఎవరెవరికి కలిగిన దర్శనాలు, వారందరూ అదే సత్యాన్ని "నేను ఈ విధంగా దర్శనము చేశాను" అని అన్నారు. 'ఏకం సత్ విప్రాత్ బహుదా వదంతి'. 'విప్రా' అంటే విశిష్టమైన ప్రజ్ఞ కలిగినవాళ్లు. ఊరికే బ్రాహ్మణ పుట్టుక పుట్టినంత మాత్రాన విప్రులైపోరు. విశేషము, విశిష్టము, వికాసము చెందిన, 'జ్ఞా' అంటే ప్రజ్ఞ. అటువంటి జ్ఞానము కలిగిన వాళ్ళు ఏమి చెప్పారు? రకరకాలుగా చెప్పారు దైవాన్ని. ఎందుకనీ? ఎన్ని రకాలుగా చెప్పినా తనివి తీరక, అన్ని రకాలుగా చెప్పారు. అందుచేత శంకరులు ఈ విధంగా ప్రతిపాదన చేసారు. అంతా అదే ఉన్నది. విశ్వమే దైవము అని కదా మన మొదటి వాక్యం. ఇంకేమి లేదు కదా! రూపం అదే, రూపం ద్వారా ప్రవర్తించే గుణం అదే! గుణమునకు ఆధారముగా ఉన్న ప్రజ్ఞ అదే! అది కానిది ఏమీ లేదు. మరి అది కానిది కనబడ్డదే? వాడిని చూసి చండాలుడు అనుకోగానే, నవ్వుతాడు

చండాలుడు. పక్కకి తప్పుకోమంటాడు. ఏ పక్కకి? అని అడుగుతాడు. ఏ పక్క లేదు? ఒకటే ఉంది మొత్తం! అప్పుడు కొంచెము చురుక్కు మంటుంది శంకరాచార్యులవారికి. అప్పుడు మళ్ళీ గుర్తు వస్తుంది. 'అవును, ఇతడు కూడా దైవమే కదా!' అని. మనం వాటిని చూసి, వీటిని చూసి అసహ్యించుకుంటామే, అది మన దురదృష్టం! నువ్వు అసహ్యించుకోవడం వలన, నీ అసహ్యం కారణంగా అక్కడుండే మలినం నీ దగ్గరకి వస్తుంది. ఏ సందేహం లేదు! దేన్నీ అసహ్యించుకోనక్కర్లేదు. నువ్వు అనుకున్నవన్నీ నిజం అని నువ్వు తల వంచుకు నిర్వర్తించుకుంటున్నప్పుడు, నువ్వు మిగతా వాటిని అసహ్యించుకోవడం ఎందుకు? ఈసడించుకోవడం ఎందుకు? ద్వేషించడం ఎందుకు? అందుకని తెలిసిన వాళ్ళు కూడా పూతాత్ములు కారు. జీవాత్మ ఈ అష్ట ప్రకృతుల్లో దేనికో ఒకదానికి ముడి పడిపోతూ ఉటుంది. ఎప్పటికప్పుడు నిత్యం తోముకుంటూ ఉండాలి దాన్ని.

"యోగాగ్ని దగ్ధకర్ములు, యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుఁగక సద్యోగవిభావిత మనముల బాగుగ వీక్షింతు రట్టి పరము భజింతున్."అని అంటాడు గజేంద్రుడు . అంటే యోగం చేసి సమస్త కర్మలు దగ్ధం చేసి కూడా ఎప్పుడు వాడినే ధ్యానం చేస్తూ ఉంటారుట ఎందుకంటే, వాడిని ధ్యానం చేయటం అంటే ఎక్కడో కూర్చుని ముక్కు మూసుకొని ధ్యానం చేయటం కాదు. ఇలా మన మధ్య నలుగురి లోనూ తిరుగుతున్నప్పటికీ కూడా, అందరి లోనూ చూస్తూ తిరుగుతూ ఉంటారు, వాళ్ళు పరిపూర్ణులు. పారిపోయిన వాళ్ళు పరిపూర్ణులు కారు. ఎదో కొంత జరిగినది తప్ప అంత జరగలేదు. ప్రపంచంలో ఉంటూ ప్రపంచాన్ని అంటించుకోకుండా ఉన్నవాళ్ళు ఉంటారు. అంటించుకోకపోడం వలన పనులు చేయటం మానేయరు. అందరికన్న బాగా పని చేస్తారు, అందరి కన్న ఎక్కువ సమర్ధవంతముగా పనులు చేస్తారు. కానీ అంటించుకోరు. ఎంతటి వాడికైనా అంటుతుంది సుమా! అన్నారు. అంటైయిన వాడు కడుక్కోవాలి కదా! మరి ప్రకృతిలో దాన్ని, దీన్ని, భావమయ లోకము లోనూ, ఇంద్రియమైన లోకములోనూ, భౌతికమైన లోకములోనూ, ప్రతిదీ అంటుకున్నాక, మనం ఎంత మడి కట్టుకుంటే ఏం లాభం? మడి అది కాదు. ఎవరు మడి కట్టుకున్న వాళ్ళూ అంటే, మాస్టరుగారు లాంటి వారు మడి కట్టుకున్న వాళ్ళు. ఆయన అన్నిటిలో ఉన్నారు. ఏదీ కాదనలేదు. ఏదీ అంటించుకోలేదు. అది పరమ గురువుల యొక్క మార్గం. అది సంపూర్ణ యోగ మార్గం. సమగ్రమైన యోగం అది. అంతే కానీ ఏదో

ఒక మూలకి వెళ్లి కూర్చొని, ఎవరూ ముట్టుకో కూడదు, ఎవరూ తాకకూడదు అంటే? తాకితే ఏమిటి? తాకుతున్న వాడెవడు, తాకుతున్న వాడి రూపంలో వాడే ఉన్నాడని గుర్తు ఉంటే, వాడు ముట్టుకుంటే నువ్వు మైల పడిపోవడం పూతాత్మలు తిరుగుతూ ఉంటారు ప్రపంచంలో, వారికి అంతా అదే! ఒక లంచగొండి, ఒక చాలా ధర్మంగా పరిపాలించే ఇద్దరు ఆఫీసర్లు దగ్గరకు వచ్చారనుకోండి. వాడిని ఈసడించడం, వీడిని దగ్గర తీయటం, ఇట్లా ఉండదు పూతాత్మకు. వాడిలోను, వీడిలోను ఉన్నది అదే! వాడి లంచగొండి తనం వాడికి సంబంధించినది. వాడిని తిప్పలు పెడుతుంది. మనని ఎందుకు తిప్పలు పెడుతుంది? వీడి మంచితనం వీడిని రక్షిస్తుంది. మనకేమి? అందుకనే పరమగురువు Djwalakul ఒక మాట అంటారు, If you wish to follow the path of discipleship you better be in the world but not off the world. నువ్వు ప్రపంచంలో ఉండు, ప్రపంచం నుంచి పారిపోక! అలా అని ప్రపంచం లోనివి పూసుకోక! పూసుకోకుండా అందులో ఉంటె అది పూతాత్మా. పూసుకుంటే కడుక్కోవాలి. మనం పూసుకోడం కడుక్కోడం, పూసుకోడం కడుక్కోడం, పూసుకోడం కడుక్కోడం, ఇదే చేస్తూ ఉంటాము కదా? మనం పూసుకొనేది చాల ఎక్కువ, కడుక్కొనేది చాల తక్కువ. ఎందుకంటే ఈ కడుక్కొనే కార్యక్రమంలో కూడా ఎదో పూసుకుందామనే కదా చూస్తూ ఉంటాం. మనం పూజలు చేసినా, గుడికి వెళ్లినా, కొబ్బరికాయ కొట్టినా ఇంకా ఎదో పూసుకోవడం కోసమే! సందేహం లేదు. అందుకని ఈ జీవులు దైవాంశ సంభూతులు అయినప్పటికీ కూడా దివ్యులు కారు. కాని, దివ్యత్వం చెందిన వాళ్ళు కూడా ఇందులోనే ఉంటారు:-

"పురుషలందు పుణ్య పురుషులు వేరయా
విశ్వదాభి రామ వినుర వేమా."

పుణ్య పురుషులు కూడా పురుషులల్లే ఉంటారు. వాళ్ళు పుణ్య పురుషులని ఎట్లా తెలుస్తుంది? వాళ్ళ దృక్పధం బట్టి తెలుస్తుంది. వారిలో సమభావం ఉంటుంది. 'పండితా సమదర్శినః'! నీవు దైవమునే సమస్తము నందు చూడటం వలన పవిత్రీకరింప బడుతూ ఉంటావు. అలా అని అన్ని కలిపేసుకోమని చెప్పరు. ఓ పంది వచ్చింది. పందిలో దైవము ఉన్నాడు కాబట్టి, పందిని కౌగలించుకుంటామా, పంది పాదాలకి నమస్కారం చేస్తామా? తెలివి ఉండాలి. బుద్ధి లేకుండా ప్రవర్తించ

కూడదు. తక్కువ సంస్కారం వాడు ఉన్నాడనుకోండి, తక్కువ సంస్కారం ఉన్నవాడిలో కూడా దైవం ఉన్నాడని ముందు గుర్తించి, ఆ తరువాత వాడి గుణములను గుర్తించి, తదనుగుణంగా ప్రతిస్పందించడమే సోదర భావంతో. వాడిని అసహ్యించుకోనక్కర్లేదు, ఈసడించుకోనక్కర్లేదు, దైవాన్ని చూస్తూ వాడితో నీ ప్రవర్తనలో సాంఘికమైన తారతమ్యములను సున్నితంగా నిర్వర్తించుకో. మరి ఆ విధంగా నువ్వు సంస్కారవంతులను, సంస్కారము లేనివాళ్లను, రకరకాల సంస్కారములు గల వారిని ఎవ్వరినీ నొప్పించకుండా, అలా అని ఎవ్వరిది పూసుకోకుండా ఉండు. ఇప్పుడు పందిలో దేవుడు ఉన్నాడు కాబట్టి, పందిని కౌగలించుకోము. పంది లాంటి మనుషులుంటారు. దున్నపోతు లాంటి మనుషులుంటారు. ఉంటారా? గాడిద లాంటి మనుషులు ఉండరూ? జంతుప్రవృత్తులన్నీ మానవ ఆకారంలో జీవులుగా ఉన్నవారు మనకి కనిపిస్తూ ఉంటారు. ఓహో! ఇది గాడిదా, కాబట్టి మనం జాగ్రత్త ఉండటమే! గాడిదలా ఉన్నారనుకోండి, దైవాన్ని గుర్తిస్తాం, గాడిద స్వభావాన్ని గుర్తిస్తాం కదా. అది కదా శంకరాచార్యులవారు నేర్పుతారు. 'అన్నిటిలో దైవము ఉన్నాడురా' అని చెప్తూ, అడవిలో శిష్యులతో నడుస్తూ ఉంటె పులి వస్తుంది. వస్తే చెట్టెక్కేరు శంకరాచార్యులవారు. అదేమిటి గురువుగారు, వచ్చింది దైవమె కదా, చెట్టెక్కారు? అంటారు. అంటే దైవమనే మన్నించాను. కానీ పులి కదా, అది కూడా మన్నించాను, అని అంటారు. Practicality ఒకటి ఉండాలి. సంస్కరించుకుంటున్న కొద్దీ, మనలో పవిత్రత పెరుగుతూ ఉంటుంది. అందుకనే భారతీయ వాఙ్మయ సంప్రదాయములో రకరకమైన సంస్కారములు ఇచ్చారు. ఈ సంస్కారములన్ని నిర్వర్తించుకుంటూ ఉంటె, మనం సంస్కరించబడుతున్నాం అన్న భావన వల్ల, మళ్ళీ మనం మలినం చెందే అవకాశం ఉంది. 'మనం చాలా సంస్కారవంతులం' అనుకోవడమే మలినం. సంస్కారవంతుడవు అయ్యి ఉండు. నేను సంస్కారవంతుడను అన్న భావన పెట్టుకోక. పెట్టుకుంటే మలినం అది. మన గురించి గుర్తు ఉంటె మలినం. దైవం గురించి గుర్తు ఉంటె పవిత్రం. మనం మనల్ని బాగా సంస్కరించుకుంటుంటే అట్లా సంస్కరించుకోని వాళ్ళని చూస్తే, మనకి కొంచెం ఈసడింపుగా ఉంటుంది. ఈ మనసులో ఎన్నెన్ని పొరలున్నాయండీ! కోటానుకోట్ల పొరలున్నాయి. మనం ఈ రోజు తెల్లవారుజామున లేస్తే, ఆలస్యంగా లేచిన వారి పక్క చిన్న చూపు చూస్తాం కదా? మనం పూజ చేసుకుంటూ ఉంటె పూజ చేసుకోని వాళ్ళ పక్క కూడా అంతే!

మొన్న మొన్నటి వరకు మనమూ చేయలేదుగా! అది గుర్తు ఉండదు. ఇలా ఉంటాయి మనకి. అందుకే సంస్కారములు చేసుకుంటూ ఉంటే ఎలా ఉంటుందంటే నీ గురించి మరుపు తక్కువగా ఉంటుంది, నువ్వు చేయవలసిన వాటి గురించి గుర్తు ఎక్కువగా ఉంటుంది. ఏమి చేయాలో అది ఎక్కువ గుర్తు ఉంటుంది. ఎందుకంటే ఆ ప్రశ్న కదా బ్రహ్మకి కూడా పుట్టింది. మనకి కూడా పొద్దున్న అదే పుడుతుంది కదా. మనం ఏమి చేయాలో మనకి గుర్తు ఉండాలి. గుర్తు లేకపోతె మనం ఇక్కడ పది గంటలకి class అన్నామనుకోండి, 10.30 కి కూడా మనుషులు వస్తూ ఉంటారు. ఎందుకంటే గుర్తు లేదు. ఎందుకు గుర్తు లేదు? ఏవో అవి ఇవి పూసుకుంటాం. దైవం కాక ఇంకా పూసుకొనేవి ఏవో చాల ఉంటాయి. అన్నీ పూసుకొని 10 తరువాత వచ్చామనుకోండి తరగతికి? అలాగే 5.40కి పొద్దున్న ప్రార్ధన, అన్నామనుకోండి. 5.40 తరువాత వచ్చామనుకోండి? అంటే మనం Grossly Interested in Side Issues అంటారు. చిల్లర విషయాలలో మనసు పడితే ముఖ్యమైన విషయం మరపు వస్తుంది. పవిత్రంగా ఉన్నవారికి కర్తవ్యం మర్చిపోవడం ఉండదు. అందుచేత ఏ పనైనా సకాలంలో చేస్తారు. అంతే కాదు, సవ్యంగా చేస్తారు. మాటిమాటికి మర్చిపోతూ ఉంటే ఎవరో ఒకరు చెప్పాలి. మళ్ళీ మర్చిపోయే వాడికి చెప్పేవాడిని ఒకడిని పెట్టుకుంటూ ఉంటాడు. వాడూ మరిచిపోతాడు. మర్చిపోయే వాడి కింద బంటుగా ఉన్నాడంటే, వాడు అంతకన్నా బాగా మర్చిపోయే వాడండి. 'అదేమిటిరా చెప్పలేదు' అంటే, మర్చిపోయాను, అంటాడు వాడు మళ్ళి. మర్చిపోయాను అంటే ఇహ వేరే సమాధానమూ, enquiry ఏమి లేదు. అయిపోయింది దాంతోటి. 'Lateగ వచ్చేవేమయ్యా?' అంటే, 'lateగ వచ్చాను,' అంటుంటాడు. ఇవన్నీ ఎందుకు వస్తూ ఉంటాయంటే ఇదే కారణం. ఏమిటి కారణం? జీవుడు అన్నీ పూసుకుంటూ ఉంటాడు. పూసుకోడం చేత అతడు అపవిత్రుడు అవుతుంటాడు. అందుకని తనను తాను పవిత్రీకరించుకొనే కార్యక్రమం ప్రతి నిత్యం చేసుకొని, పనిలో దిగాలి. అందుచేతనే 'మనసుకి ప్రతి నిత్యం ధ్యానం ముఖ్యం', అన్నారు. శరీరానికి స్నానం, మనసుకి దైవధ్యానం! దైవధ్యానం చేయని మనసు కర్తవ్యము యందు ఏకాగ్రతతో, స్ఫూర్తితో, మేధస్సుతో పని చేయదు. ఎందుకంటే బుద్ధి ప్రచోదనానికి దైవాన్ని మనసుతో ఆరాధించాలి. కేవలం నోటితో ఆరాధిస్తే చాలదు. నోటికి వచ్చు కదా అని స్తోత్రం చదువుతూ ఉంటె, మనసు ఎక్కడికో వెళ్ళిపోతూ ఉంటుంది. అప్పుడు ఆ మనసుకి దైవధ్యానము యొక్క

ప్రభావము ఉండదు. ఉండక పోవటం వలన ఇంత దైవధ్యానం చేసినా, పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడతాం, వెంఠనే! ఈ గదిలోనే! ఆ తలుపు దాటి బయటకి వెళ్లే అంత ఓపిక కూడా ఉండదు. ఈ లోపే మాట్లాడేయాలి. ఏమిటో ఉగ్గబెట్టుకు కూర్చున్నట్టుగా ఉంటుంది. Class అయిపోయిందా, మాట్లాడుకోవాలి. Prayer అయిపోయిందా, మాట్లాడుకోవాలి. ఏద్దైనా అయిపోతే వెంటనే మాట్లాడుకోవాలి. అదేంటో? ఎందుకలా ఉంటుంది?

'క్షుత్పిపాసామలాం జ్యేష్టామ్ అలక్ష్మీర్నా శయా మ్యహం'.

నాకుగా నేను నిర్మూలించుకోలేను తల్లీ క్షుత్, పిపాసలు అనే మలినాలు. నువ్వే నాశనము చేయాలి. అంటే ఆకలి, దప్పిక. అంటే ఏమి కనబడుతున్నా మనకి కావలది, ఏమి చూసినా మనం చూడాలది. అక్కడెక్కడో. అక్కడ అది బాగుందంటాడు. అక్కడికి వెళ్లి చూడాలి. ఇక్కడ ఇది బాగుందంటాడు ఇక్కడికి వెళ్లి చూడాలి. ఎప్పుడూ ఏవో ఒకటి ఉంటూనే ఉంటాయి. ఊరికినే కూర్చున్న వాడికి 'అక్కడ చాల బాగుందండి, మీరు కూడా వెళ్ళాలండి,' అంటే వీడికి వేడి పుట్టేస్తుంది. వాడు వెళ్తే నువ్వు ఎందుకు వెళ్ళాలి? కర్తవ్యమూ కాదా? గుర్తు ఉండదు. ఇట్లా ఎన్ని రకాల ఆకర్షణలు సృష్టిలో ఉన్నప్పటికీ, తన కర్తవ్యము యందే తాను నిలబడిన వాడు కూడా దైవమే! వాడి రూపంలో దైవమె ఉన్నాడు. పుణ్య పురుషులు, మహాత్ములు  వాళ్ళందరూ కూడా దైవమే! అదీ 'పూతాత్మా పరమాత్మ చ' అని చెప్పడం. అందుకని ఇతడు దైవమే, పరమాత్మా దైవమే! ఇతడు ఎవరూ? పవిత్రీకరింపబడిన జీవాత్మ. అందుచేత ఆత్మ పవిత్రమే కదా అంటే ఆత్మ పవిత్రమే! ఎప్పుడూ? అష్ట ప్రకృతుల యొక్క ఆకర్షణకు లోను కాక, తదతీతంగా తాను ఉంటూ, సృష్టిలో తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉండే వాడు. అలా ఎవరు ఉంటె వాళ్ళందరూ పూతాత్మలు. మనకి తెలియనక్కర్లేదు. మనకి తెలిసిన పూతాత్మలు చాల తక్కువ. అందులో ఎక్కువ మంది పూతాత్మలు కూడా కారు. సృష్టిలో ఈ భూమి మీద చాల మంది పూతాత్మలు, చక్కగా అద్భుతంగా పని చేస్తూ ఉన్న వాళ్ళు ఉన్నారు. వాళ్ళందరూ మనకి తెలియదు. మనం పూతాత్మలు అని పూసుకుంటూ ఉంటామే, అందులో చాల తక్కువ మందే పూతాత్మలు. అది కూడా గుర్తు పెట్టుకోండి. ఎందుకంటే మనకి ఉండే ప్రలోభాల బట్టి తత్తుల్యమైన గురువు దొరుకుతుంటాడు. ఎవరెవరికి ఎటువంటి ప్రలోభాలుంటే, వారి వారికి, దాని

సంబంధమైన గురువు  దొరుకుతూ ఉంటాడండి. ఏమి సందేహం లేదు. ప్రకృతిలో ఏర్పాట్లన్ని అట్లా ఉన్నాయి. నీకు దేని మీద వ్యామోహం ఎక్కువగా ఉంటె, దాని మీద ఇంకా ఎక్కువగా వ్యామోహం ఉండే వాడు నీకు గురువు అవుతాడు. సద్గురువులు అక్కడక్కడా కనిపిస్తారు, కనిపించకుండా చాల మంది ఉన్నారు. అందరూ ప్రకటించుకోరు. అంతర్యామి సాధన చేస్తూ, లోక కళ్యాణము కోసం అహర్నిశలు పనిచేస్తున్న వారెవరూ మనం గుర్తించే పద్ధతులలో ఉండరు. ఎందుకంటే మన గుర్తింపు ఎంత సేపూ భాషల బట్టి ఉంటుంది. కట్టూ, బొట్టూ బట్టి ఉంటుంది. అందుచేత ఎవరు కాషాయం కట్టినా కాళ్ళ మీద పడిపోయే జాతి ఇది. మనమే కాదు, పాశ్చాత్యులు కూడా అంతే. ఎందుకనీ? లో విషయము ఎవ్వరికీ తెలియదు కదా! పై విషయాన్ని బట్టి పోతూ ఉంటాం. అవన్నీ పూతాత్మలు కావు. అది కూడ వేమన చాల చక్కగా చెప్తాడు. వైష్ణవుల గురించి, శైవుల గురించి ఆయన రాసిన కొన్ని పద్యాలు చదువుకుంటే, మనకి ఛెళ్ళుమని కొట్టినట్లు ఉంటుంది చెర్నాకోల్ పెట్టి. గుర్రాన్ని కొట్టే చెర్నాకోలతో మనని కొడితే ఎట్లా ఉంటుందో, అట్లా ఉంటుంది వేమన పద్యాలు చదివినప్పుడు. ఉపనిషద్ వాక్యాల్లాంటివి అవి. ఊరికే ఉపనిషత్తులు  చదువుతున్నామని గర్వపడిపోవక్కర్లేదు, గొప్పగా feel అవ్వక్కర్లేదు. వేమన శతకంలో చాల ఉపనిషత్తులు ఉన్నాయి. అత్యంత ఉత్కృష్టమైన సత్యాలు, నగ్న సత్యాలని చాల తేట తెలుగులో చక్కగా, చిన్న పిల్లలకి కూడా అర్థము అయ్యేటట్టు ఇచ్చిన ఒక మహాత్ముడు. ఒక మహాత్ముని గొప్పదనము ఎక్కడుందంటే, మహత్తరమైన విషయాన్నీ చాల చిన్న చిన్నపదాల్లో చెప్పగలగడంలో! గంభీరంగా ఉపన్యాసము ఇచ్చి, అబ్బో చాల బాగా చెప్పాడంటారే తప్పా: ఏమి చెప్పాడయ్యా, అంటే ఒక్క ముక్క చెప్పలేడు ఎవ్వడు. ఎందుకంటే register కాదు. నీకు హత్తుకొనే పద్ధతులలో ఆ భాషలోనే దిగి వచ్చి చెప్పగలడు అంటే, వేమన ఒక్కడే చెప్పగలడు. అన్నమయ్య చెప్పగలడు. అన్నమయ్య తేట తెలుగులో చక్కగా, చిన్న చిన్నపదాల్లో పెద్ద పెద్ద సత్యాల్ని అందించగలిగాడంటే అతనిలో ఎంత ప్రతిభ ఉన్నది?  అట్లాగే వేమన, అది తెలుగు వాళ్ళ అదృష్టం.  ఇక్కడ గంట సేపు సంస్కృతంలో ఉపన్యాసం చెప్పారనుకోండి, చాల బాగా చెప్పారనిపిస్తుంది కానీ, ఎవ్వరికి ఏమి అర్థం కాదు. The Truth is always simple and it should be expressed in simplest words. ఈ పూతాత్మలు అందరూ ఆ విధంగా simplicity వాళ్ళ main characteristic గ ఉంటారు. నువ్వు గుర్తించ లేవు. ఎందుకనీ? You should

be equally simple to recognize them. కొంచెం భేషజం, వేషం, హడావుడి, గొప్పదనం, అన్నీ చూపిస్తూ ఉంటే, మనం తొందరగా పడిపోతూ ఉంటాం. మనకి కావసినది అది. అందుచేత మనం పై మెరుగులకి ఎక్కువ లోబడిపోతూ ఉంటాం. ఎందుకంటే మనస్సు యొక్క పై పొరలలోనే జీవిస్తూ ఉంటాం కాబట్టి. Djwalkul మహర్షి చెప్తారూ, భారత దేశం ఎంత పుణ్య భూమి అంటే సమస్త ఋషులు భూగోళం మొత్తం అంతా పని చేస్తున్నప్పటికీ కూడా, అవకాశం మేరకి ఎక్కువ సేపు భారత భూమిలోనే తిరుగుదామనుకుంటారుట. వాళ్లకి కూడా ఈ భూమి మీద అంత వ్యామోహము ఉంటుందిట! అంత పవిత్రమైన వాతావరణం ఇక్కడ చోటులో ఉంది. Ethers are spread with spiritual energy అని రాశారు. ఎప్పుడు ఉత్తరము నుంచి దక్షిణానికి, తూర్పు నుంచి పడమరకి అట్లా ఋషులు తిరుగుతూనే ఉంటారు ఈ భూమి మీద. అందుకని 'కోరి ఇక్కడికి ఏదైనా ఒక కార్యం మీద ఆకాశ గమనంలో వద్దామని అనిపిస్తూ ఉంటుంది ఈ భూగోళం మీద పని చేసే మా బోటివారందరికి కూడా,' అని చెప్తారు. ఇక్కడ ఉన్న ఋషులు, తపస్వి సాధు జనులు భూమి మీద ఎక్కడా లేరు. మనకి ఎవరు తెలుసు? మనకి ప్రకటించుకున్న వాళ్ళే తెలుసు. కాని అంతర్యామి సాధనలో ఉండే వారు ప్రకటించుకోరు. అప్రకటితముగ ఉంటారు. అప్రకటితమైతే ఎట్లా చూస్తావు? అంతర్యామి ప్రకటితము అయ్యాడా? వెతుక్కుంటే కదా కనబడ్డాడు. ఎప్పుడూ గుర్తు పెట్టుకోండీ, విలువైన విషయాలు వెతుక్కోవాలండి. వెతుక్కుంటేనే కనిపిస్తాయి. బజారు విషయాలు మీ దగ్గరకి వచ్చేస్తాయి. ఇప్పుడు బజారు విషయాలు అవి ఇవి అమ్ముకొనేవన్ని మీ ఇంటికి కాగితాలు వస్తుంటాయి, ఇంట్లో television లో మోత మోయించేస్తారు. రేడియోలో మోత మోయించేస్తారు, రోడ్డు మీద ఉంటుందే అటు బొమ్మ ఇటు బొమ్మ ఓహో బోలెడు నీమీదికి వచ్చేస్తూ ఉంటుంది ఎంతసేపు. ఏంటదీ, బజారు విషయం! పవిత్రమైన విషయం నీ దగ్గరకి అట్లా వస్తుందా? నువ్వు వెతుక్కుంటూ వెళ్ళాలి. అత్యంత పవిత్రమైన విషయము సృష్టిలో సత్యము, ధర్మము. ఆ సత్యాన్ని ధరించిన వారిని, ఆ ధర్మాన్ని ధరించిన వారిని వెతుక్కుంటూ వెళ్ళాలి. నిన్ను వెతుక్కుంటూ వచ్చినా రావచ్చు. కానీ వాళ్ళు at large ప్రకటించుకోరు. వాళ్ళు వాళ్లుగా ఉంటారు. వారూ పూతాత్మలు. అందుచేత అన్ని చోట్లకి పరుగెత్తకండి. నీదయ్యింది నీదగ్గరకి వస్తుంది. పరుగెత్తటం waste, వృధా. అందుకని ఇటువంటి పూతాత్మలు అందరూ నేనే, అంటున్నాడు దైవం. ఇటువంటి పూతాత్మలు అన్నీ

కూడా భగవంతుడే! అని చెప్తున్నాడు భీష్ముడు. అది వేదవ్యాస మహర్షి మనకి చెప్తున్నాడు. అందుచేత మనకి గురువే దైవము! ప్రతి సత్పురుషుడు దైవమే! కోరి సత్పురుషుడి యొక్క సాన్నిధ్యాన్ని చేరాలిట. దర్శనం కోరాలి. పాద స్పర్శనం కోరాలి. భాషణం కోరాలి. దర్శన, స్పర్శన, సంభాషణాదులు సత్పురుషులతో చేస్తే, తద్వారా ఆ ప్రభావము మన మీద పడుతుంది. వెంకటేశ్వర స్వామి గుడిలోకి వెళ్ళటానికి ఎందుకు ఇంత తపన చెందుతారు? ఋషులు తపస్సు చేసి, వారి తపశ్శక్తి అంతా అక్కడ ధార పోసి, లోక సంక్షేమం కోసం అందరికి అందుబాటు అయ్యేట్లుగా అమరిక చేసారక్కడ. అందుచేత అంత ఆకర్షణ. బంగారం కిరీటం పెట్టినా, వజ్ర కిరీటం పెట్టినా, కిరీటం పెట్టినా పెట్టకపోయినా అది వెంకటేశ్వర స్వామే! అక్కడ ఉన్న ప్రభావము అదే! దగ్గర నుంచి చూసామా, దూరం నుంచి చూసామా కాదు, అందులోకి మనం వెళ్లి వస్తామే, అది చాలు. ఆ వెళ్లి రావటంలో అది నిన్ను స్పృశిస్తుంది. ఏది? అక్కడ ఉన్న ఆ తరంగం. ఆ ప్రతిభావంతమైన తపోశక్తిగల తరంగం నిన్ను స్పృశిస్తుంది. పునీతులమై బయటకి వస్తు ఉంటాము. అంతే! అందుచేత కొన్ని కొన్ని చోట్లకి మనం వెతుక్కొని వెళ్ళాలి. కొన్ని కొన్ని చోట్లకి మనం వెళదామనుకుంటే తుంబురవనం ఉంది. ఆ వనం నిండా ఉన్నారు, ఎవరు వెళ్తారు అక్కడికి? మనం శుభ్రంగా ఉన్న చోటుకి car gate వరకు వెళ్తే కానీ మనం వెళ్ళము కదా! అందుకనే పవిత్రమైన ప్రదేశాలన్నీ కూడా ఎప్పుడూ remote గ ఉంటూ ఉంటాయి. ఎక్కడో మారు మూల ఉంటూ ఉంటాయి. తెలుసుకొని వెళ్లి నమస్కరించుకోడం ఒక సాంప్రదాయంగా మనకి వచ్చింది. అలా మనకి తెలియాలంటే సత్యము ఎక్కడ ఉన్నది? ఇది సత్యమా, బూటకమా తెలియాలంటే మనలో సత్యం పెరిగితేనే కాని తెలియదు. అది గుర్తు పెట్టుకోండి. మనలో సత్యము యొక్క స్థితి గతులను బట్టి, బయట సత్యం మనకి గోచరిస్తుంది. మనలో ధర్మము యొక్క అవగాహన బట్టి, బయట ధర్మం మనకి అవగాహన అవుతుంది. మనలో ఉండే ప్రలోభాలు మనని, ప్రలోభాలు ఉన్న చోటుకే తీసుకు పోతుంది. ఇట్లా జరుగుతూ ఉంటాయి. అందుచేత ఎక్కడైతే భగవత్ సాన్నిధ్యం లభిస్తూ ఉంటుందో, ఎవరి వద్ద అయితే అది లభిస్తుందో వాళ్ళందరూ కూడా భగవత్ స్వరూపములే! భగవంతుడే! భగవంతుడి నామాల్లో 'పూతాత్మా' చేర్చారు. సనక సనందనాదులు అటువంటి వారు. ఆ విధంగా వాళ్ళు సృష్టి మొదటి నుంచి కూడా, అంటే సృష్టి లోకి వచ్చేటప్పటికి సమస్తము తెలిసే వచ్చారు. వారు

పూతాత్ములు. బ్రహ్మదేవుడు నుంచి దిగి వచ్చారు. బ్రహ్మదేవుడు 'మీరు సృష్టి కార్యము చేయాలి. మీరందరు వివాహం చేసుకోవాలి, మీ ద్వారా జీవులను సృష్టించాలి', అంటే నవ్వుతారు. నువ్వు ఇప్పుడు కొత్తగా సృష్టి మొదలు పెట్టావు, అని వాళ్ళ అనలేదు కానీ వాళ్ళ నవ్వుకి ఇలా నా వ్యాఖ్యానం అన్నమాట! నలుగురూ నవ్వుతారు. 'ఏమిటిరా నవ్వుతారు' అంటే, 'మేము ఏమి చేయాలో మాకు తెలిసి వచ్చాము నాన్న,' అని చెప్తారు. 'పెళ్ళి చేసుకోడం కాదు మా పని, మా పని ఉంది మాకు. మేము నాలుగు వ్యూహాలకి అధిష్టాన గురువులుగా ఉంటాం.' వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలు నాలిగింటికి గురు స్థానం వహించి, జీవులని ఉత్తమ లోకాలు చేరడానికి కావలసిన మార్గాన్ని అందించే వాళ్ళుగా, ఈ నలుగురు మొత్తం ఈ సృష్టిలో సంచారం చేస్తూ ఉంటారు. మన భూమి వరకు సనత్ కుమారుడు అటువంటి బాధ్యత వహించాడు. అందుచేత సనత్ కుమారుడే ఈ భూమికి రాజు, గురువు. సనత్ కుమారుడు శంబళ గ్రామంలో ఉంటాడు. ఇక్కడ ఉండే సమస్త పరమ గురువుల పరంపర సనత్ కుమారుడికే చెందుతుంది. ఆ సనత్ కుమారుడే శ్రీకృష్ణుడు దిగి వచ్చిన సందర్భంలో ప్రద్యుమ్నుడుగా దిగి వస్తాడు. మళ్ళి ఈ అవతార కార్యక్రమం అయిపోయిన తరువాత వెళ్ళి, సనత్ కుమారుడిగా స్థిర పడతాడు. ఇది కావాలంటే మీకు భారతంలో కనిపిస్తుంది. అందుచేత, అలా వీళ్ళందరూ గురు స్థానం, అంటే పుట్టుకతోనే రావటమే తెలిసి వచ్చారు. సద్గురువులుగా ఈ నాలుగు వ్యూహాలకి సంబంధించిన అనుభూతిని సత్సాధకులకు అందించడానికి ఆ విధంగా దిగి వచ్చారు వారు. వారు ఎంతటి పవిత్రాత్ములో, ఎంత పుణ్యాత్ములో, ఎంత పూతాత్మలో తెలియటానికి జయ విజయుల కథ ఉన్నది. వాళ్ళు వైకుంఠానికి వెళ్తే, దైవం దగ్గరగా ఉండటం చేత జయ విజయులకి ఏమి జరుగుతుందీ? చిన్న మోసం జరుగుతుంది. మనం చాల పెద్ద సద్గురువుకి దగ్గరగా ఉన్నామనుకోండి, దగ్గరగా ఉన్నాం అనే భావన లోంచి ఒక అహంభావం పుడుతుంది. నిజానికి సద్గురువుకి దగ్గరగా ఉండే వాళ్లకన్నా, దూరంగా ఉన్న వాళ్లలో ఎక్కువ సద్గురువుకి నచ్చిన వాళ్ళు, మెచ్చిన వాళ్ళు ఉంటారు. దగ్గరగా ఉన్న వాళ్ళు ప్రతిభావంతులు అయి ఉండవచ్చు కానీ, వాళ్ళ కన్నా ప్రతిభావంతులు దూరంగా, అక్కడా అక్కడా ఉంటూ ఉంటారు. ఈ దగ్గర ఉండే వాడికి చిన్న అహంకారం వస్తూ ఉంటుంది ఎప్పటికప్పుడు. ఎందుకంటే మనము దగ్గరగా ఉన్నాము కదా. మేము close అండీ అంటారు. ఏంటి నీ

మొహం close! ఆత్మకి  దగ్గర లేదు, దూరము లేదు. అలాగే సద్గురువుకి దగ్గర, దూరం లేవు. అందుచేత ఆయన సంకల్పము చేస్తే వాళ్ళు ఆయనని చూట్టానికి వస్తారు. ఇప్పుడు సనకుడు, సనందనుడు, సనత్ కుమారుడు, వీళ్ళందరూ సృష్టిలో దైవ కార్యాన్ని చేస్తూ ఉన్న వాళ్ళు దైవాన్ని చూసి వద్దాం అని అనుకోటం అంటే ఏమిటి? అది దైవసంకల్పమే! మైత్రేయుడంతటి వాడు వస్తే, కృష్ణుడు అడుగుతాడు, 'ఏమిటి ఇలా వచ్చావని.' 'నేను రావటం ఏంటి? నువ్వు సంకల్పం చేసావు, కాబట్టి వచ్చాను' అంటాడు. అదీ మైత్రేయుడు! చూసిపోదామని వచ్చాను అనేటటువంటివి ఏవీ ఉండవు. 'నువ్వు పిలిచావు కాబట్టి, నీ పిలుపు నా పని కన్నా ముఖ్యమైనది కాబట్టి వచ్చాను,' అంటాడు మైత్రేయుడు. దైవం పిలిస్తే దైవకార్యం చేసేవాడు, గురువు గారు పిలిస్తే గురువు గారి పని చేసేవాడు 'గురువు గారూ  పని చేస్తున్నాను, ఇప్పుడే రాలేను, busy గా ఉన్నాను' అని చెప్తాడా? అలా సనక సనందనాదులు అయన పిలుపు అందుకొని, ఇన్ని వ్యూహాలలో ఉండే వాళ్ళు, ఒక్కసారి కలిసి వైకుంఠానికి వస్తే, మరి close కదా వీళ్లిద్దరూ (జయవిజయులు) personal secretaries. చిన్న అహంకారం తెలియకుండానే వాళ్ళలో ఉంటుంది. ఉండటం చేత అడ్డగిస్తారు. అడ్డగిస్తే వాళ్ళు మీకు బాగా (అహంకారం) బలిసింది రా, అని కోపించి భూలోకంలోకి పోయి పుట్టండి, అని శాపం ఇస్తారు. ఇట్లా ఉంటుంది దగ్గరగా ఉంటే! అహంకారం పెరిగే అవకాశం చాలా దగ్గరగా ఉంటుంది. అందుకే ఒక పరమ గురువు  The light is illumination to the distance. In Proximity there is only darkness, అంటారు. దగ్గరలో ఎప్పుడూ చీకటే దీపానికి. ఎందుకంటే దీపం చుట్టూ ఉండే ఆ సెమ్మె క్రిందే ఉంటుంది చీకటి. చుట్టూ కాంతే, కిందే ఉంటుంది చీకటి. దానికే ఇంకో పరమ గురువు Groping for the light in the shadow of the lamp, అని చెప్పారు. అందుకని ఒక మహాత్మునికి మరీ దగ్గరలో ఉంటే అయన నీడలో ఉండవచ్చు నువ్వు, అంటే చీకటి. ఏమిటా నీడ? అంటే ఆ వెలుగు బయటికి వెళ్తూ ఉంటుంది, నువ్వు ఆ నీడ పడ్డ చోట కూర్చుని ఉంటావు. అందుకని అజ్ఞానం పెరిగిపోతూ ఉంటుంది. అది జయ — విజయుల కథ. అప్పుడు విష్ణు మూర్తే బయటికి వచ్చి 'ఒరే ! వాళ్ళకి రోజూ నేనే దండం పెడుతుంటాను రా. అంతటి వారు వాళ్ళు! వాళ్ళని మీరు అడ్డగించారేమిటి రా! సరే పుట్టండి అసురులు గా' అంటాడు. పూతాత్మలు అంటే వాళ్ళకి అన్నింట్లోనూ దైవమే కనిపిస్తాడు. అలా మనకు ఈ గురు పరంపర సృష్టిలో పూతాత్మలు.

సప్తర్షులు పూతాత్ములు. వాళ్లనెప్పుడూ స్మరించాలి. సప్తర్షులు మనలో సప్త కేంద్రాల్లోనూ ఉన్నారు, సృష్టిలో సప్త లోకాల్లోనూ గురువులుగా ఉన్నారు. అందుకని, సప్తర్షులను స్మరించని భారతీయుడు భారతీయుడే కాదు అని చెప్పారు ఒకప్పుడు. ఇప్పుడు సప్తర్షులు ఎవరండీ? అని అడిగే పరిస్థితికి వచ్చాం కదా! అందుకే 'గురుభ్యోం నమః' అని మనం గురువు గారిని తలచుకోవటమే కాదు. అయన గురువుగా మనల్ని ఆశీర్వదించటానికి ఎవరో ఒకరు ఉపదేశం ఇచ్చి ఉంటారుగా? అందుకని 'పరమ గురుభ్యోం నమః', 'పరమేష్టి గురుభ్యోం నమః' మూడు తరాలు చెప్పుకుంటాము. తద్దినానికైనా సరే మూడు తరాలు. తాత, తండ్రి, ముత్తాత. అలాగే మనం తరించడం అంటే, మన తరం తరువాత మూడు తరాలు. కొడుకు, మనవడు, ముని మనవడు. ఇట్లా పెట్టారు. అందుచేత, గురువు – పరమ గురువు- పరమేష్టి గురువు. అటుపైన సప్తర్షులు. అటుపైన ధ్రువుడు. అటుపైన సనందనాదులు. మైత్రేయుడు. తరువాత వ్యాస మహర్షి. అయన లేకపోతే కలియుగం అంతా చీకటే. భాగవతాన్ని అందించిన శుకుడు, నారదుడు. నారదుడు లేకపోతే ఏమీ లేదు. ఆ తరువాత పరతత్త్వమే. అదే కృష్ణ పరతత్త్వము. అందుచేత వీళ్ళందరినీ మనం ప్రతి నిత్యం తలచుకోవాలి. అది గురు పరంపర. నీ గురువు, ఆయన గురువు, ఆయన గురువూ! ఇక అక్కడినుంచి వీళ్ళందరూ culminate అయ్యేది సప్తర్షులలోనే. ఇంకా తలచుకుందాం అనుకుంటే కపిలుడు, దత్తాత్రేయుడు, గణపతి, హనుమంతుడు – నలుగురు. ప్రతి నిత్యం వీరిని తలచుకుంటే ఒకసారి సృష్టి మొత్తాన్ని నిర్వర్తించే పుతాత్ముల నందరినీ తలచుకున్నట్లు అవుతుంది. అందుచేత వారిని తలచుకుని, స్మరణ చేసుకోవాలి. వారి రూపంలో ఎవరున్నారు – దైవమే! అని చెప్తోంది విష్ణు సహస్రనామం. రెండో శ్లోకంలో మొదటి నామమే ఇది. అంటే ఎంత ప్రాముఖ్యత ఇచ్చారు సద్గురువులకు? అంటే సృష్టిలో దేనినీ అంటుకోని వాడు, దేనియందు వ్యామోహం లేనివాడు, దేనిచేతా బంధింపబడని వాడు, అతడూ సద్గురువు అంటే ! రకరకాల బంధాలతో అతడికే బాధలు ఉన్నాయనుకోండి, అతడికే సమస్యలు ఉన్నాయనుకోండి, కిందా మీదా పడుతున్నాడు అనుకోండి, అతడికి చాలా అవసరాలు ఉన్నాయి అనుకోండి, ఏదో అతను కూడా ఒక సాధకుడని గుర్తు పెట్టుకోండి. అందుకని పూతాత్మని పరమాత్మని కలిపి చెప్పారండి. పూతాత్మా పరమాత్మా చ. ఈ 'చ' తీసుకెళ్ళి వీళ్లిద్దరి మధ్య పెట్టాలి. 'చ' అంటే మరియు అని అర్థం. వేద వ్యాసుడు 'తు' ఒకటి,

'చ' ఒకటి ఎక్కువగా వాడారట అని కాళిదాసు గారు ఎగతాళిగ మాట్లాడతారు. కాళిదాసు కూడా వేదవ్యాసుడు అంతటి వారు. మాస్టర్ గారు అంటుండేవారు భారతీయుడై పుట్టి కాళిదాసు రచించిన గ్రంథాలు చదవకపోతే వాడు గాడిద ! అని. మరి మేమంతా అంతేనా మాస్టర్ గారు? అంటే, మరి అంతేనోయ్ ! అనేవారు. ఎవరు చదువుకుంటారు ఈ రోజుల్లో కాళిదాసు గ్రంథాలు? సంస్కృతమే రాదు కదా? ఎందుకని అంటే వేదవ్యాసుడు ఎంతటి వాడో కాళిదాసు అంతటి వాడు. అలాగే తెలుగు వాడిగా పుట్టి పోతనామాత్యుడు రాసిన భాగవతం నీ నాలుక ఉచ్చరించలేదుట, అంటే కూడా అంతే ! ఈ 'చ' ని తీసుకెళ్ళి 'పూతాత్మా పరమాత్మా చ' అని ఇద్దరినీ కలిపి చెప్పారు. కలిపి చెప్పటంలో వీరి యొక్క వైశిష్ట్యం ఉంది. భారతీయ సాంప్రదాయం ఒక్కటే గురు సాంప్రదాయాన్ని భూమి మీద ఇంత వరకూ కాపాడుకుంటూ వస్తోంది. కాబట్టే మనకు తరింపు సులభం. ఎందుకంటే గురువు దగ్గర పొందినంత సులభంగా దైవం దగ్గర పొందలేము. ఎందుకంటే గురువు అన్నీ అరటిపండు వలిచినట్టుగా చేసి అందిస్తాడు. దైవం అంత కార్యక్రమం తలపెట్టడు. అందుచేతనే వీళ్ళందరినీ తనతో సమానంగా చూస్తాడు. హనుమంతుడు దైవదూతయే అమ్మవారి వరకు. 'రాముడు' అనే దైవాన్ని చేరాలని అహర్నిశలు తపన చెందుతున్న జీవుడిగా అమ్మవారిని తీసుకున్నట్లయితే, ఆ రాముడికీ, సీతకూ మధ్య సంధానకర్తగా నిలిచిన హనుమంతుడు గురువు! రామాయణం లో గురువు ఆయనే! అందుకే అది సుందరకాండ! 'ఎక్కడ, ఎవరి జీవితంలో సద్గురువు ప్రాముఖ్యం వహిస్తాడో, ఎవరి జీవితంలో సద్గురువు నిండుతాడో, అతడే ముఖ్యం మిగతావన్నీ చిల్లర విషయాలు,' అని జీవించే జీవితాలు సుందరమైన జీవితాలు. ఎందుచేతనంటే వారు సద్గురువులో ఉన్న చైతన్యం చేత సత్యము వైపే నడుస్తూ ఉంటారు, సంస్కారములు అన్నీ కూడా క్రమశః మార్పు చెందుతూ ఉంటాయి. Visitors are different from pilgrims. Visit to Sadguru చాలా మంది చేస్తారు. Pilgrimage to Sadguru అందరూ చేయలేరు. ఎందుకంటే, వారి జీవితాల్లో pilgrims అంటే సత్యాన్వేషకులు! సత్సాధకుల జీవితంలో గురువే నిండిపోయి ఉంటాడు, గురువు కార్యక్రమమే వారికి ప్రధానం, మిగతా కార్యక్రమాలు అప్రధానంగా ఉంటాయి. ఆ జీవితాలు సుందరమైన జీవితాలు! ఎందుకు సుందరం అంటే, ఇకపైన రకరకాలుగా ఈ జన్మలు ఎత్తటం అనే చక్రం నుంచి ఆ సద్గురువు కారణంగా ఉద్ధరింపబడుతుంటారు.

అందుచేత సుందరం. గురు తత్త్వం చెప్పకుంటే చాలా ఉంది. కొంత రుచికి చెప్పకుంటున్నాం. ఇవాళ సాయంత్రం మనం హనుమంతుడి దగ్గరకు వెళ్ళి 11 సార్లు హనుమాన్ చాలీసా చేస్తాం. ఎందుకని అంటే అక్కడ అయన 'బేడీ' హనుమంతుడు. 'బేడీ' అంటే అయన చేతులు కట్టేసుకున్నాడట. 'దైవము కొరకే నేను' అన్నట్టుగా ఆ రెండు హస్తాలు అట్లా దైవానికి కైంకర్యం చెందినాయి. అందుచేత మనవాళ్ళు ఆయన్ని 'దాసాంజనేయుడు' అంటుంటారు. 'ఆ పనికే! నేను ఇంకేపనీ చేయను', అని 'దైవం పనే నా పని!' అనుకుని ఉన్నవాడు అయన. అలా మనం కూడా అనుకోగలిగితే, ఇక ఆ జన్మకి తిరుగులేదు. 'దైవం పనే నా పని, నాకు వేరే పని లేదు' అనుకునేవాడు ఇక చేతికి బేడీలు వేసుకున్నవాడు. ఏ విషయంలో? ఇతర విషయాల్లో! కాబట్టి వాడి జీవితం దైవమే చూసుకుంటాడు. నందీశ్వరుడు కూడా అంతే. శివుడినే చూస్తుంటాడు. ఎప్పుడు ఆజ్ఞ ఇస్తే అప్పుడు. గరుత్మంతుడు కూడా అంతే! అమ్మవారికి సింహమూ అంతే, వినాయకుడికి ఎలుకా అంతే! 'స్వామీ ! కాసేపు కూర్చుంటూ ఉండండి. అక్కడక్కడా కాస్త తినొస్తాను' అనే ఎలుక ఉండదు అక్కడ. ఎద్దల్లే అవీఇవీ మేస్తాను అనే ఎద్దులు నందిగా ఉండలేవు ! కైంకర్యం చెందినవే! వారు, వీరితో సమానం. వేంకటేశ్వర స్వామిని చూడాలని ఇంత తహతహ లాడుతుంటామే, నీలో కనుక simplicity ఉన్నట్లైతే అంతకన్నా ఎక్కువ తహతహ, అంతకన్నా ఎక్కువగా ముందు బేడీ ఆంజనేయ స్వామిని చూడాలని అనిపించాలి. ఇక్కడి కార్యనిర్వాహణ అధికారికి ఈ మాటే చెప్తే, 'అయ్యా! వేంకటేశ్వర స్వామి వారికి వైభవం అందరూ చేస్తారు. ఆంజనేయ స్వామి కి గుడి కూడా లేదు. ఏదో చిన్న గోపురం కట్టి, కటకటాల్లో , ఏదో జైల్లో పెట్టినట్టు పెట్టారు? అయన బేడీలు వేసుకున్నారు కదా అని మీరు కారాగారం నిర్మించేశారా? అని అన్నాను ఐదేళ్ల క్రితం. దానికి 'అమ్మమ్మో ! నేను చేయలేదు స్వామికి. మొదటి నుంచీ అట్లాగే ఉంది' అన్నారు. 'మరి మీరు ఏమైనా చేయవచ్చు కదా?'అన్నాను. అద్భుతంగా అక్కడ దేవాలయం నిర్మాణం చేసి, ప్రతి నిత్యం అక్కడ పూజలు చేసేటట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ కూడా వచ్చినప్పుడు 'మీ గుడి చూసుకున్నారా?' అంటుంటారు అయన. 'నా గుడి కాదు, మనందరి గుడి అది', అని చెప్తుంటాను. కారణం ఏమిటంటే, భగవంతుడు ఎప్పుడూ తనకి సేవలు చేస్తే పెద్దగా సంతోషించడు. తన భక్తుడికి చేస్తే సంతోషిస్తాడు. 'నాకు అందరూ చేస్తారయ్యా! నాతో ఉన్నవాడికి చెయ్యి! నా గురించే ఉన్నవాడికి చెయ్యి, వాడికి

చేస్తే నేను సంతోషిస్తాను! నాకు చేస్తే నేను సంతోషించను'. రామాయణం లో పెద్ద రహస్యం అది. సుగ్రీవుడు మాటిమాటికీ రాముడికి దండలు వేస్తాడు, లక్ష్మణుడికి వేయడు. మనలాంటి వాళ్ళే! ఏం సందేహం లేదు. ఇంత వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళి ఆయన్ని చూడాలి అని నానా తంటాలు పడిపోతూ ఉంటాం. అక్కడ ఈశాన్యంలో ఒక గుడి స్తంభం ఉంది. అది వేంకటేశ్వర స్వామితో సమానమైన ప్రతిభగలిగిన స్తంభం. యోగ నరసింహ స్వామి ఆలయం దగ్గర ఉంటుంది ఆ స్తంభం, ఈశాన్యంలో! అది చూడటానికి కూడా అంతే తహతహలాడాలి. అసలు ముందు అది చూడటానికి ప్రయత్నం చేయాలి. అంతకన్నా ముందు బేడీ ఆంజనేయ స్వామిని చూడటానికి ప్రయత్నం చేయాలి. నీకు ఎక్కడ సులభంగా దేవుడు దొరుకుతాడో అక్కడ వదిలేసి, ఎక్కడ కొంచెం దుర్లభంగా ఉంటుందో అక్కడికి ఈడుస్తుంటుంది మనసు తమాషాగా. మానవుడి మనసే అంత! గొప్పదనం వైపు వెళ్లిపోతుంది, మంచితనం వైపు మర్చిపోతుంది. దాని దరిద్రమే అది! రాముడు కదా రక్షించేది అనుకుని సుగ్రీవుడు ఏం చేస్తాడంటే, మాటిమాటికీ రాముడికి ఏదో ఒక చెట్టు కొట్టేసి వేస్తాడు కుర్చీ లాగా, కూర్చోమని. ఎక్కడో నాలుగు పూలు పీక్కొచ్చి దండ కట్టి అయన మెడలో వేసేస్తుంటాడు. ఈ లక్ష్మణుడిని పట్టించుకోడు. లక్ష్మణుడు ఎవరు? రాముడే ! విశ్వామిత్రుని ఆశ్రమానికి రక్షణ చేయటానికి వెళ్ళినప్పుడు వాళ్ళిద్దరూ నడిచి వెళ్తుంటే విశాఖ – స్కంధుల లాగా ఉన్నారు అని అని రాస్తాడు వాల్మీకి రామాయణంలో. విశాఖ – స్కంధులు అంటే ఇద్దరూ ఒకటే! సుబ్రమణ్య స్వామి యొక్క స్వరూపాలు. ఒకే అంశ కదా! పైగా కైంకర్యం చెందాడే! రాముడికి కారణం ఉంది అరణ్యానికి వెళ్ళటానికి, లక్ష్మణుడికి కారణం లేదు. రాముడికి కారణం ఉంది, రావణాసురుడితో యుద్ధం చేయడం కోసం ఈ అడవులు పట్టుకుని, కోతుల వెంట పడటానికి. లక్ష్మణుడికి ఏ కారణం లేదు. లక్ష్మణుడు నిష్కారణంగా సేవ చేశాడండి దైవానికి. అది సుగ్రీవుడు ఎక్కడ గుర్తించగలడు? మహాత్ముల దైవ కార్యాలన్నీ కూడా నిష్కారణమే! అందుకని నిష్కారణంగా రాముడి వెంట వచ్చి, రాముడికి కాపు ఉండి, రాముడు నిద్రపోతుంటే తాను మేలుకుని కాపు కాస్తూ, పద్నాలుగు సంవత్సరాలు నిద్ర కూడా మానేసిన తపస్వి లక్ష్మణుడు. శుభ లక్షణ లక్షణుడు లక్ష్మణుడు. వెంటనే హనుమంతుడు, రాముడికి సుగ్రీవుడు వేసిన చెట్టు కన్నా ఉత్తమమైన చెట్టొకటి పీక్కొచ్చి ఇతనికి ఆసనంగా వేసేవాడు. మూడు సార్లు చేస్తాడు ఇలా. రామాయణం

చదువుకుంటే తెలుస్తుంది, లేదా వింటే ఇంకా బాగా తెలుస్తుంది. వివరంగా చెప్పాను. అంతకన్నా మంచి పూలదండ ఒకటి తెచ్చి లక్ష్మణుడికి వేస్తాడు హనుమంతుడు. ఎందుకని? హనుమంతుడు తెలుసున్నవాడు. సుగ్రీవుడు తెలిసినవాడు కాదు, పనున్న వాడు. దైవంతో పనున్నవాడు మనలాంటి వాడే! ఎన్ని పనులు దైవంతో? బోలెడు పనులు. అందుకూ ఆయనకి importance. ఆయనతో ఉన్నవాడిని చూస్తే ఆయన ఎక్కువ సులభుడు అవుతాడు. భక్త సులభుడు.

"నాహం వసానే , నైకుంఠే, నయోగి హృదయే"

'యోగులు, ధ్యానులూ వీళ్ళందరిలో కాదురా నా భక్తుల హృదయంలో నేనుంటాను' అంటాడు భగవంతుడు. అక్కడ సులభంగా దొరుకుతాడు అక్కడేడవండి మీరుకూడా అంటాడు. రాముడు చూస్తాడు కానీ చూడనట్లు ఉంటాడు. హనుమంతుడు చూస్తాడు. చేసి చూపిస్తాడు కానీ, సుగ్రీవుడు గుడ్డి ప్రభువు. చూడడు. వాలి మీద యుద్ధానికి పంపినప్పుడు సుగ్రీవుడు రాముడికి నమస్కారము చేసి, లక్ష్మణుడికి నమస్కారము చేయకుండా వెళ్ళిపోతాడు. అంతే, చితకబాదుడు అయిపోతుంది. అప్పుడు ఏడుస్తూ వస్తాడు. అదేమిటీ అలా చేశావు అని సుగ్రీవుడు అంటే నువ్వేవరో, మీ అన్నేవరో తెలియలేదు నాకు, అంటాడు రాముడు. అది నేను ఒప్పుకోను. ఎందుకంటే రాముడు చాలా తెలిసినవాడు, దైవమని కాదు మామూలుగా కూడా. మానవుడే అయినా చాలా తెలిసినవాడు. హనుమంతుడికి తెలిసినంత తెలియదా రాముడికి? తెలుసు. లక్ష్మణుడు కాల పురుషుడు. తనతో వున్నవాడు. తనతో కాలం నడిచి వస్తూ వుంటుంది. కాలం ముందు నడిచి వెళ్తూ వుంటే, కాలాన్ని అనుసరించి ప్రకృతి నడిచి వెళ్తూ వుంటే, కాలానికీ ప్రకృతికీ వెన్నుదన్నుగా రాముడు నడిచి వెళ్తాడు. అలా నడుస్తారు వనవాసం అంతా కూడా. కొంతసేపు లక్ష్మణుడు ముందు ఉంటాడు, కొంతసేపు రాముడు ముందు ఉంటాడు. దాన్ని బట్టి సన్నివేశాల్లో తేడా మనకి తెలుస్తుంది. అందుచేత లక్ష్మణుడు కాలపురుషుడూ, రాముడు దైవము. బలరాముడు కాలపురుషుడూ, కృష్ణుడు దైవము. ఎప్పుడూ కాలపురుషుడు వెంట దిగి వస్తాడు. ఈ కాలపురుషుడిని మన్నించకుండా వెళ్లావు, దెబ్బలుతిన్నావు. వచ్చిన తరువాత అప్పుడు రాముడు ఏంచేసాడంటే, 'లక్ష్మణా! నువ్వు ఒక దండ సుగ్రీవుని మెడలో వెయ్యమ్మా, వేస్తే ఎవరు సుగ్రీవుడో ఎవరు వాలియో తెలుస్తుంది' అంటాడు. ఉద్దేశ్యం అదికాదు, లక్ష్మణుడి యొక్క ఆశీర్వచనం సుగ్రీవుడికి వుండాలి. లేకపోతే సుగ్రీవుడు గెలవడు. లక్ష్మణుడి యొక్క వైభవాన్ని,

అతనిలో వుండే గొప్పదనాన్ని, దైవాన్నీ, హనుమంతుడు గుర్తిస్తాడు తప్ప సుగ్రీవుడు గుర్తించకపోతే, గుర్తించని సుగ్రీవుడికి లక్ష్మణుడికే ఆదేశమిచ్చి, ఆశీర్వదింప చేస్తాడు. ఎందుకంటే నువ్వు దండం పెట్టకపోతే ఆశీర్వచనం రాదు. అందుకని దైవం అనుకూలించినా, కాలం అనుకూలించలేదుట అన్నట్టుగా అయ్యింది మొదటిసారి వెళ్ళినప్పుడు. రెండవసారి ఒకటే బాణం. ఒక్క బాణంతో వాలిని చంపడం సాధ్యమయ్యే విషయం కాదు. అది రామబాణం కాబట్టి. ఎందుకంటే ఆ యోధులు ఎలా వుంటారంటే ఎన్ని బాణాలు వేసినా చలించరు. రామాయణం, భారతం చదువుకోరు కాబట్టి తెలియదు కానీ, చదువుకుంటే తెలుస్తుంది ఎన్నెన్ని బాణాలు లోపలికి దూరిపోయి, గుచ్చుకుపోయినా చావరు వాళ్ళు. బాణాలు గుచ్చుకుని రక్తం చిమ్ముతున్నకొద్దీ ఇంకొంచం ప్రతాపంతో పోట్లాడుతూ వుంటారు. అందుకని ఒక్క బాణం వేస్తే చచ్చిపోతాడా? అదీ గొప్ప విషయం. ఒక్క బాణానికి చచ్చిపోయాడంటే, ఆ బాణం ఎంత శక్తివంతమైనదీ? చెట్టు చాటు నుండి వేసాడు కాబట్టి చచ్చిపోవడం కాదు. అది రామబాణంలో వుండే ప్రభావం. అంతటి రామబాణానికీ రావణుడి దగ్గర కుదరలేదు. అక్కడ చివర్లో అగస్త్యుడు ఇచ్చిన బాణం వాడతాడు రాముడు. అగస్త్యుడు ఇస్తాడు బాణం, అగస్త్యుడు ఇస్తాడు మంత్రం, అగస్త్యుడు వచ్చి చెప్తాడు బ్రహ్మాస్త్రం వెయ్యవయ్యా, ఇంకేదీ పనికిరాదు వీడిమీద, అని. అసలు ఏ నామానికి ఆ నామం అలాగే ఉంటుందండీ విష్ణు సహస్ర నామంలో. అందుకని ఆరేళ్ళు మనం తీరిగ్గా చెప్పుకున్నాం. ఎంత అద్భుతమైన నామాలు మనం పారాయణ చేస్తున్నామో మనకి తెలియాలిగా? కాబట్టి లక్ష్మణుడు రాముడితో సమానుడు. హనుమంతుడు రాముడితో సమానుడు. భరతుడు రాముడితో సమానుడు. 'నువ్వు నా అంతటి వాడివి' అంటే ఏం బావుంటుందని, 'భరతుడంతటి వాడివి' అంటాడు హనుమంతుణ్ణి. ఎందుకనీ? భరతుడు అంటే రాముడికి లోపల ఎంతుందో దాన్ని బట్టి తెలుస్తుంది. ఇలా మనకి భగవత్ భక్తుల కథలు, భగవంతుని కథల కన్నా రమ్యంగా వుంటాయి. భగవద్భక్తుల ద్వారా భగవంతుడు పలికినట్టుగా సరాసరి భగవంతుడు పలకడు. అందుచేత ముందు పూతాత్మా, తరువాత పరమాత్మచ.

## 12. ముక్తానాం పరమాగతిః

ముక్తానాం అంటే ముక్తి చెందిన జీవులు. ముక్తి అంటే ఏమిటీ? ఎక్కడో ఉట్టి కట్టుకు కూర్చుంటారని కాదు. ఎక్కడ వున్నా వాడికి దైవంతో ఉన్నట్టే! వాడూ ముక్తుడు. వాడు చెప్పులు కుట్టే వాడిగా వున్నా, మాంసం కొట్టేవాడిగా వున్నా, గొడ్లను తోలుకునేవాడిగా వున్నా, సింహాసనం మీద కూర్చున్నా, పొలం దున్నుకుంటున్నా, పాతాళంలో వున్నా వాడికి ఏమీ తేడా వుండదు. పాతాళంలో ఒకడిని పెట్టాడు. బలిని, సుతల లోకంలో అంటే భూగర్భంలో ఏడు పొరల్లో ఒక పొరలో వాణ్ని తొక్కేసాడు. 'ఎలా వుంది రా?' అన్నాడు. 'బ్రహ్మాండంగా వుంది, ఇక్కడ కూడా వున్నది నువ్వేగా!' అన్నాడు బలి. అదీ లెఖ్క. భగద్భక్తుడికి ఇక్కడ వున్నామా? అక్కడ వున్నామా? అనే ప్రశ్న లేదండీ. ఎక్కడ వున్నా వాడిలోనే వున్నాం కదా. ఎక్కడ వున్నా వాడితోనే వున్నాం అన్నప్పుడు ఇక్కడ కూర్చుందాం అనే బుద్ధి ఏం బుద్ధి? వెధవబుద్ధి. నీలో ఇంకా preferences వున్నాయి అంటే నీకు దైవం అర్ధం కాలేదుగా? 'వెంకటేశ్వర స్వామి దర్శనం కాలేదండీ, వరాహనరసింహస్వామి దర్శనం చేసుకుని వెళ్ళిపొండి' అంటే ముక్తుడికి ఏమీ తేడా పడదు తెలుసా? ధర్మ దర్శనం చేసుకొనే వాడికి, special దర్శనం చేయించి కొంచెం దూరం నుంచి దేవుణ్ణి చూపిస్తే, ఇంకొంచం తృప్తి. ఆ బయటకి వచ్చేసరికీ 'ఎన్ని గుమ్మాల ఇవతలనుంచి చూసావు?'అంటాడు. నాలుగు గుమ్మాలంటాడు. ఇంకో అతను.'అమ్మమ్మా! రెండు గుమ్మాల ఇవతలనుంచి చూడొచ్చు break దర్శనం అయితే' అంటాడు. Break దర్శనం వాడు 'రెండు గుమ్మాల ఇవతలనుంచి చూసాను' అంటే, 'అమ్మమ్మా! అసలు ఏ గుమ్మాలూ లేకుండా సరాసరి మొదటి గుమ్మం దగ్గరే, అక్కడే నిలబడొచ్చు' అన్నారనుకోండి. దానికోసం తాపత్రయం. ఏమాత్రం అవుతుంది ఆ సేవకి? ఏమిటీ? ఇన్ని ఆరాటాలు ముక్తుడికి వుండవు. ముక్తుడికి వుండవు కాబట్టి దేవుడు కూడా సరాసరి తీసుకొచ్చేసుకుంటాడు. ముక్తుడు అంటే, వాడికి దీనికన్నా ఇది బావుంటుంది, దానికన్నా అది బావుంటుంది అని వుండదు. ఇక్కడ కూర్చుంటే ఇక్కడే వున్నాడు దేవుడు. అక్కడ కూర్చుంటే అక్కడా వున్నాడు. ఎక్కడ కూర్చోపెడితే అక్కడ పని చేస్తాడండీ. అంతే! 'సత్కవుల్ హాలికులైననేమి నిజదార సుతోదర పోషనార్ధమై' అని చెప్తాడు కదా! శ్రీనాథుడికి

పోతనామాత్యుడు.'ఏమిటి బావా? ఇంత రసవత్తరమైన కవిత్వం నీ దగ్గర ఉన్నదీ. వింటే మనస్సు, హృదయాలూ కరిగిపోతాయి కదా? ఇది పెట్టుకుని ఇదేవిటి ఈపొలం దున్నుకుంటూ ఈ దరిద్రం అంతాను? చూడు నా వైభోగం' అన్నాడు. మహా వైభవంలో ఉన్నాడు కదా మరి. ఈ వైభవం పొందవయ్యా, అంటే 'నీ మొహంలే' అనుకుంటాడు మనసు లోపల, బయటకి అనడు. బయటకి అంటే ముక్తుడు కాదు కదా! ముక్తుడి గురించి మాస్టారు ఒక మంచి వాక్యం రాసారు భాగవతంలో. ఇతరులకు వారిపై వుండే అభిప్రాయాలకి వారికి చెవిటితనం ఉంటుందిట. వాడు ఎన్నన్నా అనుకోనీయండి, వీడేమీ పట్టించుకోడు. వీళ్ళకి ఇతరులపై వుండే అభిప్రాయాల గురించి మూగతనం ఉంటుందిట. వాడికీ ఎదో ఒక అభిప్రాయం వుంటుంది, శరీరంలో వున్నప్పుడు ప్రతీవాడికీ ఎదో ఒక అభిప్రాయాలు వస్తుంటాయి. ఆ విషయంలో వీళ్ళకి మూగతనం ఉంటుందిట. వాళ్ళు చేసే పనులు ప్రపంచానికి 'పిచ్చివాడిలా వీడేవిటి ఇలా చేస్తున్నాడు?'అన్నట్టుగా వుంటుందిట. 'ఇంకా బాగా సంపాయించుకోవచ్చు కదా, ఇంకా దర్జాగా ఉండొచ్చుకదా! పిచ్చి వాళ్ళలాగ అన్నీ వదిలేస్తున్నాడు' అనుకుంటారుట. అలాగే ముక్తుడికి వీళ్ళు పిచ్చివాళ్ళలాగ అనిపిస్తారు.'వీళ్ళేమిటి ఎంత చెప్పినా వినటంలేదు?' అనుకుంటాడు. అందుచేత లోకం తీరులో వాడు పిచ్చివాడిగా ఉంటాడుట. కాబట్టి ఇంతటి శ్రీనాధుడూ ఇంటికి వచ్చి వాళ్ళింట్లో తిని. -- ఎప్పుడూ తెలివి తక్కువ వాళ్ళూ, అజ్ఞానులూ అడక్కుండా సలహా ఇస్తారు--అడక్కుండా ఓ సలహా పారేసాడు, ఇస్తే ఏం చేయ్యాలండీ మామూలుగా? 'నీ బొంద నీకేం తెలుసు' అనాలి. మనబోటి వాడయితే అలా అంటాడు. లేకపోతే, నోరు మూసుకో, నా పని నాది, నీ పని నీది'అంటాడు. కానీ అక్కడ రజస్సు వుండదు కదా! శుద్ధ సత్వం వుంటుంది. నవ్వుతాడు అంతే! 'ఏమిటీ? ఏమీ మాట్లాడవేమిటి? నేను వెళ్ళి రాజుగారితో మాట్లాడాలి నీ గురించి' అంటాడు.'ఆ పని చెయ్యకు' అని చెప్తాడు పోతన. 'ఎందుకు చెయ్యకూడదు?' అంటే ఈ పద్యం చెప్తాడు. ఏ పద్యం? "దైవాన్ని ఆరాధన చేసే భక్తుడినయ్యా నేను, నా కవిత్వం భగవంతుడికే కైంకర్యం అయి వున్నది. అక్కడా ఇక్కడా అమ్ముకోమంటావేమిటి? నేను అమ్ముకోను. ఏం పని చేసుకుంటే ఏమిటి? చేసుకోకూడదా? నువ్వు అక్కడ కూర్చుని తింటున్నా, నేను ఇక్కడ కూర్చుని తింటున్నా ఉదరపోషణకేగా? ఆ ఉదరపోషణ మర్యాదగా జరుగుతోందిగా నాకు! పొలందున్నుకుంటే నామోషీ యా?". పోతనకి కనీసం

చెవుల కమ్మీలు కూడా లేవు. 'నాకు అమర్యాదగా వుంది నువ్వు నా బావ అని చెప్పుకోడానికి' అంటాడు. పోతన పొలంలో మట్టి శుభ్రం చేస్తూ వుంటే, కాళ్ళూ చేతులూ మట్టితో ఉంటే మా బావగారు అని చెప్పుకోవడానికి insult గా వుంటుంది శ్రీనాథుడికి. అలా వుండదు భగవద్భక్తులకి. మాంసం అమ్ముకునే కొట్టు పెట్టుకున్న వాడు ఒకడు వున్నాడు, ధర్మవ్యాధుడు. చెప్పులు కుట్టుకునేవాడుగా వున్నాడు. వడ్రంగిపని చేసినవాడుగా వున్నాడు ఏసుక్రీస్తు. గుర్తుపెట్టుకోండి! ఏసుక్రీస్తు వూరికే అలా ఉపన్యాసాలు దంచేస్తూ ప్రపంచానికి ప్రచోదనం చెయ్యడం కాదు, తన జీవితానికి తను ప్రతీరోజూ వడ్రంగి పని చేసేవాడు తెలుసా? దాంట్లోంచి వచ్చేది తాను తిని, తన శిష్యులకి పెట్టేవాడు. వాడి దగ్గర collect చేసి వీడికి పెట్టి, వీడి దగ్గర collect చేసి వాడికి పెట్టడం కాదు. ఆయన కష్టంలోంచి వచ్చేది ఆయన పెట్టేవాడు. అలా వుంటారు. అందుకని ఇటువంటి వాళ్ళు అందరూ ముక్తులు. వాళ్లకి ఏదీ పట్టదు. వాళ్లకి రాజు గౌరవించాడు అంటే పెద్ద పట్టింపులేదు. తనని ఛీత్కరించాడంటే పెద్ద పట్టింపు లేదు, సామాన్యప్రజకి ఎక్కువ అందుబాటులో ఉంటారు. అధికారులకీ, పదవుల్లో వుండేవాళ్ళకి, ధనవంతులకీ చిక్కకుండా వుంటారు. అది ఒక ప్రత్యేకమైన గుణం, కళ్యాణ గుణం. పూతాత్మలకి, ఈ ముక్తులకి obligations వుండవు కాబట్టి, రాజులు పట్టలేరు, ధనికులు పట్టలేరు, పదవిలో వుండే అధికారులు పట్టలేరు, ఎవ్వరూ పట్టలేరు. ఎందుకంటే ఎవ్వరితోనూ వాళ్ళు పని పెట్టుకోరు. వాళ్లకి వీళ్ళతో పని ఉండొచ్చు తప్ప, వీళ్ళకి వాళ్ళతో పనులు వుండవు. మనకి ఒకడితో పని వుంటే obligationలో పడినట్టేనండీ. శ్రీ కృష్ణుడు 'learn to be non-obligatory'అంటాడు. పదిమంది చేత నువ్వు చేయించుకుంటే పదిమందికీ నువ్వు చచ్చినట్టు చెయ్యాలి గాడిదలాగ, ఏమీ సందేహం లేదు. వ్యాపారి లంచం ఎందుకు ఇస్తాడు? పని చేయించుకోవడానికేగా ఇస్తాడు. అరటి పళ్ళు తెస్తాడు, ఆ పళ్ళు తెస్తాడు, ఈ పళ్ళు తెస్తాడు, ప్రతీ పండగకీ sweets తెస్తాడు, ఇంట్లో అందరూ తింటూ వుంటారు. వీడికి నెమ్మదిగా ఒక చిన్న మెతక వస్తుంది వాడి గురించి. కదా?ఆ తర్వాత సార్!' అంటాడు. కాదంటే లోపల తిన్న sweets, పళ్ళూ, డబ్బులయితే డబ్బులూ, ఇవన్నీ బాధ పెట్టవూ? అంతే కాదు వాడు complaint చేస్తాడేమో అనే భయం కూడా వుంది. ఎన్నో వుంటాయి, రకరకాలుగా obligations లో పెట్టేస్తారు. వ్యాపారం అంతా కూడా obligations మీద నడిచేదే. ఒకడికి ఒకడికి లంకెలు వేసేస్తారు, ముళ్ళు వేసేస్తారు. మనకి

advertisement ద్వారా వేస్తారు ముడి, అంతే అలా తిరుగుతూ ఉంటాము. Free అనగానే గొర్రెలల్లే పరుగెడతాం. అలా ఎటువంటి obligation లేకుండా ఎప్పుడూ ఓ మూల కూర్చున్నట్టుగా వుంటారండీ, వాళ్ళూ ముక్తులు. మోక్షం! మోక్షం! అంటూ ఎక్కడికో వెళ్లి కూర్చుందాం అనే భ్రమ వచ్చింది. ఇదికాదు మోక్షం. నువ్వు ఎక్కడుంటే అక్కడ ఏదీ నిన్ను అంటకుండా, అక్కడ నువ్వు చెయ్యవలసినది నువ్వు చేస్తూ వుంటే వాడు ముక్తుడు. గుర్తు పెట్టుకోండి. వాడు పాతాళంలో ఉండొచ్చు. ఏం? యమధర్మరాజు 'నన్ను ఎందుకయ్యా యమలోకంలో పెట్టావు?' అన్నాడా? చిత్రగుప్తుడూ, యమధర్మరాజూ'ఏం సార్? మాకు transfers లేవా? ఎప్పుడూ ఇక్కడేనా? ఉండాలి కదా transfers! మరి? అనివీళ్ళు అడగరు. ఈయన చెయ్యడు. యమకింకరులూ, మరి వాళ్లమాట ఏమిటండీ? వాడు ఏం తప్పు చేసాడని వాడు యమకింకరుడు. వాళ్ళు ఎందుకు అలా వుంటారు తెలుసా? భగవద్ పని అది! అంతే! విష్ణు కింకరులు కిరీటాలు పెట్టుకుని వస్తారు కదా? Almost విష్ణుమూర్తుల్లాగ వుంటారు, వైష్ణవులు అందరూ ఒకేలా అనిపిస్తారు మనకి. ఎందుకంటే మోహం కనపడకుండా నామం ఒక్కటే కనిపిస్తూ వుంటుంది. ఈ దేవుడికి కూడా పెట్టేసారు అది వేరే సంగతి. వాళ్ళు మంచి నగలు అవీ పెట్టుకుని మంచి grand గ వస్తూవుంటే, ఈ యమకింకరులు పాపం అవేమీ లేకుండా వస్తారు. అదేమిటి అలా? అని వాళ్లకి వుండదు. ఆ feelings అన్నీ మనకే! వాళ్లకి ఎలా వున్నా దైవంలో వున్నారు కాబట్టి వాళ్లకి అవి వున్నాయని తెలీదు. తారతమ్యాలు తెలియవు. చిత్రకేతూపాఖ్యానంలో అమ్మవారు అయ్యవారి వొళ్ళో కూర్చుని కైలాసంలో అక్కడ జరుగుతున్న నృత్య ప్రదర్శన చూస్తోంది. ప్రమథ గణాలందరూ కూడా కూర్చొని చూస్తున్నారు. అందరి మధ్యా ఉన్నత ఆసనం మీద శివుడు కూర్చున్నాడు. శివుడి పర్యంకము అంటే తొడ మీద అమ్మవారు కూర్చుంది. ఈయన చిత్రకేతు, విద్యాధరుడు, అంటే సమస్త విద్యలూ నేర్చినటువంటి వాడు, విష్ణుభక్తుడు. అలా వెళ్తూ వుంటే చూస్తాడు. ఆయనకి కొద్దిగా నవ్వొచ్చింది.'ఇంత సభలో పక్కన కూర్చోవచ్చు కదా! ఒళ్ళోనే కూర్చోవాలా? ఏమైపోతాడు మొగుడు?' అనిపించింది అంతే. 'నన్ను చూసి నవ్వుతావా' అని ఇంత తారాస్థాయిలో కోపం వచ్చేస్తుంది పార్వతికి. 'నన్ను చూసి నవ్వుతావురా? గాడిదా!' అని కోపం వచ్చి 'రాక్షసుడవు అయిపో!'అని శాపం పెట్టింది. వెంటనే ఆకాశంలో రథం మీద వెళ్తున్న చిత్రకేతు దిగివచ్చి అమ్మవారి కాళ్ళకి నమస్కారం

చేసి 'అమ్మా! మహాప్రసాదం' అని వెళ్ళిపోతాడు. పిచ్చెక్కిపోతుంది అమ్మవారికి, 'ఏవిటి వీడు శాపం పెడితే మహాప్రసాదం అని వెళ్ళిపోయాడు?' అని శివుణ్ణి అడుగుతుంది. వాడు విష్ణు భక్తుడు. వాడికి శాపం, వారం రెండూ ఒకటే అని చెప్తాడు. విష్ణుభక్తుడు విష్ణుభక్తుడు అనుకోవడం కాదు. వాడికి శాపం అయినా వరం అయనా విష్ణువే ఇచ్చాడు. కాబట్టి వాడికి అదీ ఆనందమే. జయవిజయులూ అంతే కదా? వాళ్ళూ విష్ణు భక్తులే. మూడుసార్లు 'మీతో పోట్లాడి మీ దగ్గరకి వచ్చేస్తాము, ఏడు సార్లు మిమ్మల్ని పూజించుకుంటూ అక్కడ ఎక్కడో వుండడం కన్నా' అన్నారు. వీళ్ళు ముక్తులు. ముక్త జీవులు వాళ్ళు. మనకి అన్నీ preferences. భక్తి పెరుగుతున్నకొద్దీ preferences పెరుగుతూ వుంటాయి కదా! అదేమిటండీ? ముక్తి ఎక్కడ వుంది? ఇక్కడవుంది. నీ భావ ప్రపంచంలో నీకు లక్షలాది ముడులు ఉన్నంత కాలం నువ్వు ఎన్ని పూజలు చేసినా, ఎన్ని హోమాలు చేసినా, ఎన్ని అభిషేకాలు చేసినా, ఎన్ని కీర్తనలు చేసినా, ఎన్ని గుళ్ళ చుట్టూ తిరిగినా, ఎన్ని పుణ్య నదులలో స్నానాలు చేసినా అది అక్కడే వుంది కదా, అది అలాగే వుంటుంది. ఎవరో అడిగాడుట రామకృష్ణ పరమహంసని 'గంగలో స్నానం చేస్తే దరిద్రాలుపోతాయిట కదా స్వామీ? అందుకనే వెళ్తున్నాను స్నానానికి' అని. నవ్వారుట రామకృష్ణ పరమహంస. 'ఎందుకు నవ్వుతున్నారు? దరిద్రాలుపోవా?' అని అడిగాడుట. 'మీ మాట నాకు ప్రమాణం. పోవా?' అన్నాడుట.'పోతాయి రా' అన్నాడట. మరి ఎందుకు నవ్వుతున్నారన్నాడట, ఆయన నవ్వి 'మళ్ళీ అన్నీ వస్తాయిరా నీ దగ్గరకి' అన్నారుట. 'అదేమిటి?' అంటే 'ఏమీలేదూ గంగ అంటే పాపాలకి కూడా గౌరవం వున్నది, అందుకనే గంగలో దిగుతున్నప్పుడు నువ్వు ఒడ్డున బట్టలు విప్పినప్పుడు అవికూడా పక్కకి వెళ్ళిపోతాయి. నువ్వు మళ్ళీ గంగ లోంచి వచ్చి బట్టలు వేసుకుంటావు కదా అవీ వచ్చేస్తాయి' అని చెప్పారుట. అంతే! మనం కూడా చూడండి గుళ్ళో వున్నప్పుడు మహా భక్తుల్లాగ వుంటాం. బయటకి రాగానే వెనకటి గుణమేల మాను? రాగానే మళ్ళీ మన గుణం మామూలే. గుళ్ళోప్రసాదం తిన్నా, ఇక్కడ మళ్ళీ ఇడ్లీ-వడా కనిపిస్తే అది కూడా తినాలి అనిపిస్తుంది. కదా! ఇక్కడ మారితే ముక్త జీవి. ఇక్కడ వున్నావా? స్వర్గంలో వున్నావా? నరకంలో వున్నావా? నరకంలో వుండు, స్వర్గంలో వుండు, పాతాళంలో వుండు, సుతలంలో వుండు, వితలంలో వుండు, అ తలంలో వుండు, తలాతలంలో వుండు, రసాతలంలో వుండు, ఎక్కడ వున్నా ఒక్కటే వాడియందు

నువ్వున్నట్టయితే! వాడి యందు నీవు ఉన్నంతసేపూ, వాడు నీ యందు ఉన్నప్పుడు, నీవు ముక్తుడవే. అది బలి చక్రవర్తి కథలోని ప్రధాన సన్నివేశం. అలా పాతాళంలోకి తొక్కేయడానికి బలి ఏం తప్పుచేసాడండీ? ఏం తప్పుచేసాడు? ఆ మాటే అడుగుతుంది బలి భార్య.'మా ఆయన ఏం తప్పుచేసాడని తొక్కేస్తున్నావు అలా?' ఆ పక్కన ఆకాశంలోనుంచి ప్రహ్లాదుడు చూస్తాడు. ప్రహ్లాదుడి మనవడు మరి.'అమ్మో! ఇంత అన్యాయంగా నా మనవడిని తొక్కేస్తున్నాడే దైవం. తన దైవమే తన మనవడిని తొక్కేస్తున్నాడు. ఇప్పుడు ఎలా?' చివుక్కుమందిట ప్రహ్లాదుడి మనస్సు. ఇటు ఈవిణ్ణి చూసాడుట, అటు అతన్ని చూసాడుట. విష్ణువుకి నవ్వు వచ్చిందిట.'వాణ్ని అడగండి, వాడికి complaint లేదు'. ఎందుకులేదూ? ఎప్పుడైతే ఆ శిరస్సుమీద విష్ణు పాదం పడిందో మొత్తం అంతా విష్ణుమయం అయిపోయింది. విష్ణుమయం అయిపోయిన వాడికి ఎక్కడ వుంటే అక్కడ విష్ణువు ఉంటాడు. ఇక్కడ కూర్చుంటే ఎక్కువ విష్ణువు, అక్కడ కూర్చుంటే తక్కువ విష్ణువు వుండదు. కొంచెం దూరం నుంచి చూస్తే ఎక్కువ విష్ణువు, దగ్గర నుంచి చూస్తే తక్కువ విష్ణువు వుండదు. మరీ దగ్గరనుంచి చూస్తే ఆ గుళ్ళో వుండే బల్లులూ అవీ కనిపిస్తూ వుంటాయి. మీకు వెనకాల గోడ కనపడదు దూరం నుంచి చూస్తే. మరీ దగ్గర నుంచి చూస్తే ఆ మూల బూజు ఉందనీ, ఇక్కడ బల్లి ఉందనీ, అక్కడేదో ఊరికే వేళ్ళాడుతోంది అనీ-- ఇవీ కనిపిస్తాయి. ఎక్కువసేపు చూడలేము. కొంచం సేపు చూపిస్తారు కాబట్టి మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది. అక్కడ గంట నిలబెట్టారనుకోండి, మీరు చూసే వెంకటేశ్వర స్వామి కాకుండా మిగతావన్నీ చూస్తారు, ఏం సందేహం లేదు, రాసిస్తా. అందుచేత ఎక్కడ వున్నా విష్ణుతత్వమే అన్నది వైష్ణవ భావం. అది భాగవతం! .ముక్తులంటే వాళ్ళు! వాళ్ళు... నువ్వే గతి 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ. తస్మాత్ కారుణ్యభావేన రక్ష రక్ష మహేశ్వరా!' అనుకుంటూ ఉంటారుట. ఎందుకంటే ఏ క్షణంలో అందులోంచి బయటకి వచ్చేస్తామో? ఎందుకంటే మాయ ఒకటి వుంది కదా? ప్రకృతి యొక్క ఆకర్షణ!అది నిన్ను ఆకర్షించదు. నువ్వు ఆకర్షింపబడవచ్చు. గుర్తుపెట్టుకోండి. అది కూడా భగవంతుడు చాలా బాగా చెప్పాడు భగవద్గీతలో, 'సృష్టి నిన్ను ఆకర్షించాలీ అని నేను చెయ్యలేదురా, నువ్వు ఆనందించాలి అని చేసాను, నువ్వు ఆకర్షింపబడితే నేను ఏమి చెయ్యను?' అన్నాడు ఆయన. అక్కడ ఎదో అందమైన విషయం వుంది. చూసి బావుంది అనుకుని వెళ్ళిపోయేవాడు ఉంటాడు. చూసి దాంట్లోకి

వెళ్ళిపోయేవాడు ఉంటాడు. ఎవడు పంపించాడు? వీడిబుద్ధే! సృష్టి అందంగా మీకోసం తయారు చేసాం. చాలా ఆకర్షణీయంగా వుంటుంది. దాంతో నువ్వు ఎలా ప్రవర్తించాలో కూడా చెప్పాము. తత్ప్రకారంగా నువ్వు ఉన్నట్లయితే నీకు అంతా ఆనందమే! Extra వెళ్ళావనుకో, నేను వెళ్ళమన్నానా? అది రమ్మందా? అది రమ్మందిటండీ? అది రమ్మనదు. అది అక్కడే వుంటుంది. నీకే వెళ్ళాలి అనిపిస్తుంది అదే వచ్చిన గొడవ. ఆకర్షణ వైపు వెళ్ళినవాళ్ళంతా అలా వెళ్ళినవాళ్ళే కదా! అలా వెళ్లడంవల్ల అది మింగేస్తుంది. అందుకని ఈ ముక్తజీవులు

'యోగాగ్ని దగ్ధ కర్మలు యోగీశ్వరులే మహాత్మునొండెరుగక, (ఇంకొకటి లేదుట వాళ్ళకి) స ద్యోగ విభావిత మనముల' బాగుగ వీక్షింతురట్టి పరము భజింతున్'

అంటాడు గజేంద్రుడు. అలా వాళ్లెప్పుడూ అన్నిట్లో వాణ్నే చూసుకుంటూ వుండటంవల్ల ముక్త స్థితిలో వున్నారు. అలా కాకపోతే మళ్ళీ బంధ స్థితిలోకి వచ్చేస్తారు. మోక్షం అంటే, బంధం అంటే ఈ రెండూ ఎక్కడ వున్నాయి తల్లీ? మనసులోనే కదా వున్నాయి? అంటాడు కపిలుడు దేవహూతితో. ఆవిడ అడుగుతుంది పాపం మనలాగే. 'నాన్నా మోక్షం అంటే ఏవిటి రా? ఈబంధం నుంచి బయటపడాలంటే మోక్షం ఎక్కడ దొరుకుతుంది? ఎలాచెయ్యాలి?' అంటే 'ఎక్కడా లేదమ్మా నీ మనసులో వుంది' అని చెప్తాడు కపిలుడు. మొదటిఅవతారం ఈ భూమి మీద. మొదటి గురువు ఈ భూమికి. అటువంటి ముక్తులకి కూడా గతి అయినట్టి వాడెవడో అదొక నామం. ముక్త జీవులు కూడా వాణ్నే చూస్తూ, వాణ్నే తలచుకుంటూ, వాడియందే ఉంటూ, వాడి పనులే చేస్తూ వుంటారండీ. వాళ్ళు ముక్త జీవులు. అది'పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః'

## 13. అవ్యయః

వ్యయము కానిది అని అర్ధం. దేవతలు మొత్తం సృష్టి యజ్ఞం రూపంలో ఆ తత్త్వంతో తయారు చేసినా, ఇన్ని గోళాలు, ఇన్ని మండలాలు, ఇన్ని లోకాలు, ఇంత ఏర్పాటు చేసినప్పటికీ కూడా ఇంకా ఆయన చాల మిగిలిపోయి ఉన్నాడుట. ఖర్చు కాలేదు. ఎంత మనం వినియోగించినా మళ్ళీ మళ్ళీ అంతా ఉండే తత్త్వం దైవీ తత్త్వం! దైవము ఆ విధముగా వ్యయము కాక ఉంటాడు. ఖర్చు అయిపోటం అనేది ఉండదన్నమాట. ఖర్చు అయిపోతుంది, లేదా అయిపోతుంది అన్నది దైవం దగ్గరా లేదు, దైవము నుంచి వచ్చే సృష్టిలో కూడా లేదు. సృష్టిలో ఎక్కడా అయిపోతుందెమో అన్న భయం లేదు. అది కేవలం మానవుడి మనసులో దరిద్రంగా ఉంది తప్ప, ఏదీ అయిపోదు. నీవు యజ్ఞార్థం సద్వినియోగం చేస్తుంటే మళ్ళీ వస్తూ ఉంటుంది. అదీ సద్వినియోగం చేస్తుంటే మళ్ళీ వస్తుంటుంది. అట్లా వస్తూనే ఉంటుంది. అది ఒక పూర్ణమైన స్థితి. డబ్బులు అయిపోతాయేమో అనుకొనే వాడికి అయిపోతాయి. అయిపోతాయేమో అని పిసినారిగా వాడికోసమే వాడు వాడుకుంటాడు కాబట్టే, వాడికి అయిపోతాయి. యజ్ఞార్థం జీవించే వాడికి ఏమి అయిపోదు. దానికి దమ్ము కావాలి జీవితంలో. యజ్ఞార్థం జీవించి చూపించిన వారి జీవితాలు చాల ఉన్నాయి. వారు యజ్ఞార్థము, ధర్మార్థము, సృష్ట్యార్థము వారి దగ్గర ఉండేటి వనరులు వినియోగ పరుస్తూ ఉంటే, అంతకు మించి వారి దగ్గరకు మళ్ళీ చేరుతూ ఉంటాయి. అది సృష్టి ధర్మం! చెట్టు నుంచి అలా పళ్ళు వచ్చినాయి. వాటిని మనం వినియోగించుకుంటే మళ్ళీ పళ్ళు వస్తాయి. పండుని తినేస్తే మళ్ళీ పండు వస్తుంది. అట్లా ఏదైనా మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటాయి. నారు రూపంలో ఒక గింజ నాటితే, వెయ్యి గింజల కంకి వస్తుంది. అవన్నీ మనం తినేసినా అయిపోవు. ఈ భూమి పుట్టి 30 కోట్ల సంవత్సరాలైంది. ఈ 30 కోట్ల సంవత్సరాలలో బియ్యం అయిపోయినాయా? గోధుమలు అయిపోయినాయా? పంచదార అయిపోయిందా? కంది పప్పు, పెసర పప్పు-- ఏది అయిపోలేదే! అయిపోదు. అయిపోడం అనేది మనకి ఒక అజ్ఞానంగా లోపల మిగిలిపోయింది తప్పా ఏది అయిపోదు. ఇన్ని సంవత్సరాల తరువాత ఈ భూమి మీద petrol అయిపోతుందని చెప్తుంటారు శాస్త్రజ్ఞులు. ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులు ఒప్పుకోరు, నవ్వుతారు. భౌతిక

వాదులు కనపడుతున్నదే ఉన్నది, అనుకుంటారు. ఈ కనపడుతున్నది, కనపడని వ్యూహం లోంచి తయారై వస్తూ ఉంటుంది. అది గుర్తించాలి. సూర్యుడు కిరణాల ద్వారా, రకరకముల గ్రహముల కిరణముల ద్వారా ఎప్పటికప్పుడు భూమికి కావలసినవన్నీ అంది వస్తూ ఉంటాయి. అంది వస్తూ ఉంటే అది భూమి అందుకుంటూ ఉంటుంది. మనం రోజు పాలు పితుక్కుంటాం ఆవు దగ్గర నుంచో, గేదె దగ్గర నుంచో. ఇహ పాలు ఉండవా? సాయంత్రం పాలు అన్నీ పిండుకున్నావా? ఆ-- అన్నీ పిండుకున్నాం. అన్ని పాలూ పిండుకున్నా మళ్ళీ రేపు పొద్దున్నకి పాలు వచ్చినాయా? మళ్ళీ రేపు పొద్దుట పాలు పిండాము. అన్నీ పిండావా? ఆ-- దూడకి కూడా లేకుండా పిండేసాను. కదా! అది కదా మనం చేస్తాము. అలా పిండినా మళ్ళీ సాయంత్రానికి పాలు వస్తున్నాయా? ఎక్కడ నుంచి వస్తున్నాయి? అది మేత మేయటం చేత, ఆ మేత లోనుంచి ఈ క్షీరం పుట్టుకు వస్తోంది. అందుచేత గేదె పాలు ఇవ్వటం అయిపోవటం అనేది ఏమి ఉండదు. ఆవు పాలు ఇవ్వటం అయిపోవడం అనేది ఏమి ఉండదు. ఆవు జీవించినంత కాలం, దానికి వయసు మీద పడనంత కాలం అయిపోకుండా ఇస్తూనే ఉంటుంది. అలాగే భూమి అనే గోవుకి కూడా సూర్యుడు ద్వారా, శుక్రుడు ద్వారా, బృహస్పతి ద్వారా, మిగతా గ్రహముల ద్వారా కావలసిన ఆహారం ఎప్పటికప్పుడు కిరణాల రూపంలో, తరంగాల రూపంలో వస్తు ఉంటుంది. వాటన్నిటిని తను ఆకళింపు చేసుకొని తన నుండి ఇన్ని పుట్టిస్తుంది. అందుకనే భూమి 'కామధేనువు' అన్నారు. కామధేనువు నువ్వు ఎంత పితుక్కుంటే అంత ఇస్తుంది. ఏమి పితుక్కుంటే అదే ఇస్తుంది, కదా! ఇదీ అవ్యయ తత్త్వం. ఈ భూమి మీద మనకి గోధుమలు ఎక్కడ నుంచి వస్తున్నాయి? మనం జల్లిన గోధుమల లోంచి గోధుమలు పుట్టుకు వచ్చినాయి. మరి మొట్ట మొదటి గోధుమలు ఎక్కడ నుంచి వచ్చినాయి? మొట్టమొదటి గోధుమలు బృహస్పతి గ్రహం నుంచి పట్టుకు వచ్చారు. ఎట్లా? కిరణాల రూపంలో. భాగవతంలో పృథు చక్రవర్తి కథ ఉన్నది. అది చాల అర్థవంతమైన కథ. పురాణ పరంగా భాగవతం చదువుకోడం ఓ పద్ధతి, దాని నిండా ఉన్న రహస్యార్థాలు తెలుసుకోడం గురించి చదువుకోవడం ఓ పద్ధతి. పృథు చక్రవర్తికి ఈ భూమి ఏమీ ఇవ్వటం లేదని( భూమి మీద) కోపం వస్తుంది. 'నువ్వు నా ప్రజల పోషణకి ఏమి అందించడం లేదు. నేను ఎందుకు నిన్ను ఉపేక్షించి ఊరుకోవాలి? నేను నిన్ను సంహరిస్తాను' అని ఒక బాణం పట్టుకుంటాడు. పృథు చక్రవర్తి విష్ణుమూర్తి యొక్క

ఏకవింశతి, అంటే 21 అవతారాలలో ఒకడు. మహాత్ముడు! సరాసరి విష్ణువే! అతడు అలా కోపిస్తే అప్పుడు భూమి, "ఇదీ అసమర్ధుడి కోపం లాంటిదిరా, నా నుంచి నువ్వు ఎలా పిండుకోవాలో నీకు తెలియకా, నామీద కోపిస్తావేమిటి?" అని నవ్వుతుంది. అప్పుడు భూమి తనను ఎలా పండించుకోవాలో పృధు చక్రవర్తికి ఉపదేశం చేస్తుంది! అప్పుడు ఆ గ్రహం నుంచి, ఈ గ్రహం నుంచి భూమి చేసిన ఉపదేశం ఆధారంగా ఆయా తరంగములను, ఆయా కిరణములను తెచ్చి ఈ భూమిని సారవంతం చేసి, దున్నించి, పండించి జీవులు భూమి నుండి ఆహారము పొందే పద్ధతిని మొట్ట మొదటి సారిగా భూమి మీద మానవులకి ఇచ్చిన వాడు పృధుచక్రవర్తి. అప్పటి నుంచి భూమి ఇస్తూనే ఉంది. ఇస్తూ ఉంటె అయిపోతుందా? అయిపోతే మళ్ళి వస్తాయి. ఈ పూటకి అయిపోతే పాలు మళ్ళి రాటంలే? మనం చూడండి, మధ్యాహ్నం తిన్నాము, ఆకలి తీరిపోయింది. ఇంకా కావాలా అంటే, వద్దండీ కడుపు నిండిపోయిందంటావు. ఎప్పటికీ కడుపు నిండిపోయిందా? లేదుగా! మళ్ళి సాయంత్రానికి ఎప్పుడూ అన్నం తిననట్టుగా ఉంటుంది. అవ్యయం! ఇట్లా చూడాలి దైవాన్ని అవ్యయం అంటే. వేసుకున్న బట్టకి పత్తి నుండి సమస్తము ఈ భూమి 30 కోట్ల సంవత్సరాల నుంచి ఇస్తోందండీ. దీని వయసు ఇంకా ఎంత ఉందో? అయిపోతే? భూమి అయిపోతే ఎట్లాగండి? అయిపోదుట! ఈ భూమి అయిపోయే లోపుగా ఇంకో భూమి వస్తుంది. విద్యాలయం పడిపోయే లోపల ఇంకో విద్యాలయం కడతారా? అట్లాగే! ఇప్పుడు మనం చూసే చంద్రుడు ఒకప్పుడు భూమి. ఇప్పుడు చంద్రుడుగా పని చేస్తున్నాడు. ఆ భూమి తిరోధానంలో ఉంటె, నువ్వు ఎలాగా వెళ్ళిపోతున్నావు కదా అందాకా చంద్రుడిగా పని చేయి, అంటే చేస్తున్నాడు. ఋషి దర్శనాలు అట్లా ఉంటాయి. అందుకని భూమి మీద ఎప్పుడూ ఏది అయిపోదు. మనకీ ఏది అయిపోదు. అయిపోతుందన్న భావన కేవలం అజ్ఞానం. అందుచేత దాచుకోటం, చాలకపోటం, ఇవన్నీ అజ్ఞానంలోంచి వస్తు ఉంటాయి. ఇచ్చి చూడు నీకె తెలుస్తుంది కథ. నువ్వు ఎంత బాగా ఇస్తే నీకు అంత బాగా వస్తుంది. అది సృష్టిలో ధర్మం! ఇస్తే నీ వాళ్లకి ఇచ్చుకోటం కాదు. ఎందుకంటే ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకొంటిని వాయనం. ఇవాళ మనం ఇస్తే రేపు మళ్ళి వాళ్ళు ఇస్తారు మనకి. కదా? ఇలా ఇచ్చిపుచ్చుకోడాలు కాదు. లేని వాడికి ఇవ్వాలి. అదీ లెక్క! అది యజ్ఞార్ధ జీవనం! యజ్ఞార్థం అంటే నిష్కారణము! కేవలం భగవంతుని యందుగల భక్తి చేత, జీవుని యందుగల అనురాగం చేత నీవు ఈ

జీవులకు తెగపడి చేస్తూ ఉండు, నీకు రాకపోటం అనేది ఏమి ఉండదు. ఎంతో మంది భక్తులు వాళ్ళు బహు కుటుంబీకులైనప్పటికీ కూడా ఎన్నడూ దరిద్రం అనుభవించ లేదు. దేని కోసమూ బయటకి వెళ్ళి దేహీ-- అనలేదు. ఏమిటి రహస్యం? ఇదే రహస్యం! భగవంతుని యొక్క అవ్యయత్వం! అయిపోదు. అయిపోతుందేమో అనుకొనే వాడికి అయిపోతుంది. యద్భావం తద్భవతి! కానీ సృష్టిలో అయిపోటం అనేది లేదు లేదు లేదు, అని చెప్పే నామం అవ్యయః! ఇస్తే వస్తుంది, అనేదే సృష్టి సిద్ధాంతం! మన చుట్టూ ఉండే గ్రహ గోళాల ద్వారా ఈ భూమికి కిరణముల రూపంలో, రకరకాల తరంగాలు అందుతూ ఉంటె, అందులోంచి అన్ని తయారైపోతూ ఉంటాయి. ఏది అయిపోదు. Petrol అయిపోతుంది. బంగారం అయిపోతుంది. వెండి అయిపోతుంది. అయిపోతుందంటే నువ్వు తవ్వుకున్న చోట అయిపోవచ్చు. ఇంకో చోట ఉంటుంది అది. మహాభారత యుద్ధం అయిపోయిన తరువాత ఎంతో జన నష్టం జరిగింది. ఎంతో మంది రాజులు చచ్చిపోయారు. సైనికులు చచ్చిపోయారు. దేశమంతా కూడా భయంకరంగా తయారైపోయింది. దుర్భిక్షం! రక్త పాతం, రక్తంతో భూమి తడిసింది. అలా తడవటం కారణంగా అంతా ఒక రకమైన విషాద వాతావరణం. అప్పుడు శ్రీకృష్ణుడు 'రాజసూయం చేయండి' అన్నాడు. రాజసూయం చేయాలంటే చాల సంపద ఉండాలి. అంతకు ముందు అంటే, సుభిక్షంగా ఉండే భూగోళం అంతా కూడా భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు నలుగురూ నాలుగు పక్కలకి వెళ్లి జయించుకు వచ్చారు. ఆ ధనం అంతా తెచ్చి రాజసూయం చేసారు. ఇప్పుడు ఏది? మొత్తం అంతా ఒక్క యుద్ధంతో మారణహోమం అయిపోయింది. ఇప్పుడు మనం అనుకొనే World War కంటే చాల పెద్ద War అది. అయిపోయింది కదా ఏముంది? ఇప్పుడు రాజసూయం చేయడానికి ధనము ఏది? అంటే నవ్వుతాడు కృష్ణుడు. 'నా తో రా నేను చూపిస్తాను' అంటాడు అర్జునుడ్ని. హిమాలయాలు తీసుకువెళ్లి, హిమాలయ ఉత్తర ప్రాంతంలో 'ఇక్కడ తవ్వు' అని చెప్తాడు. తవ్వితే అపారమైన ధనం. బంగారం, మణులు, ముత్యాలు, వజ్రాలు, వైఢూర్యాలు అన్ని కనిపిస్తాయి. భూమి గురించి మనకి ఏమి తెలుసు? ఏమి తెలీకుండా మనం చూసిన ఆ కాస్త చోట అయిపోయింది అనేసుకుంటే? భగవంతుని సృష్టిలో ఏదీ అయిపోటం అంటూ లేదండి. నువ్వు కూడా అయిపోవు. ఈ శరీరం పోతే ఇంకో శరీరం వస్తుంది. ఆ అవగాహన ఉంటె మనం

అయిపోతాం, ఇంతటితో కథ అయిపోయింది-- ఈ మాటలు ఉండవన్నమాట. భగవంతుడి సృష్టిలో ఉండే గోళములు అయిపోవు. జీవులు అయిపోరు. లోకములు అయిపోవు. ఏవీ అయిపోవు. మనమంతా ప్రళయము లోకి వెళ్ళిపోతే ? అంటే వెళ్ళిపోతే మళ్ళి వస్తుంది. అందుకే శ్రీకృష్ణుడు చెప్పాడు, 'ఈ సృష్టిలో ఉన్నది పోదు. లేనిది రాదు.' ఈ ఉన్నది అదృశ్యము అవ్వచ్చు మళ్ళి దృశ్యం అవ్వచ్చు, మళ్ళి అదృశ్యం అవ్వచ్చు మళ్ళి దృశ్యం అవ్వచ్చు తప్పా, అసలు అయిపోవటం అనేది భూమికి లేదు. ఒక భూమి అయిపోతే ఇంకో భూమి వస్తుంది. ఒక శరీరము అయిపోతే ఇంకో శరీరము రాలేదా? ఇలా అన్ని గోళాలకి వస్తుంది, ఒక్క భూమికే కాదు. మనం చూసేవి ఏడే గ్రహాలు. మిగతా రెండు నీడలు, రాహు కేతులు. ఈ గ్రహాలన్నీ కూడా ఒకటి అయిపోతే ఇంకోటి వస్తుంది. అది అయిపోతే ఇంకోటి వస్తుంది. వంశం ఎలా నిలబడుతోంది? వాడు అయిపోతే ఇంకోడు రావటం లేదా? వంశమే అఖర్లే, ఉద్యోగాలూ? ఈ Prime minister వెళ్ళిపోతే ఇంకోడు వస్తున్నాడు, ఇంకోడు వస్తున్నాడు. అసలు అయిపోతాం అనేది దైవ తత్వంలో లేదు, దైవం యొక్క సృష్టిలో కూడా లేదు. నీ దగ్గరకి వచ్చింది నువ్వు యజ్ఞార్థం వాడుతుంటే అయిపోతుందా? అయిపోదు! పెరుగుతుంది. ఎందుకంటే యజ్ఞార్థం అన్నీ వినియోగం చేసే వాడి దగ్గరకి ప్రకృతి ఎక్కువ చేరుస్తుంది. ఎందుకంటే విశ్వాసం! పది మంది పిల్లలు ఉంటె ఒకడు మిగతా వారికి పంచుతున్నాడనుకోండి, వాడికి ఎక్కువ ఇస్తారు. దాచుకొనే వాడికి ఎక్కువ ఇవ్వరు. ఎందుకివ్వరంటే దాచుకొనే వాడి వల్ల మిగతా వారికి వినియోగం లేదు. దాచుకొనే వాడు దానితోనే మురిగిపోతాడు. ఎప్పుడూ దేహియే! దాచుకొనే వాడిని దేహి అనక తప్పదు. ఇచ్చుకుంటూ వెళ్లిపోయే వాడు అసలు దేహి అనక్కర్లేదు, ఎందుకంటే తల్లి చూస్తూనే ఉంటుంది. తల్లి అంటే ప్రకృతి! ఎందుకంటే, మనమంతా ప్రకృతి పిల్లలమే! దైవము యొక్క పిల్లలమే! కాబట్టి పదిమందికి చేస్తాడుట అంటే వాడి దగ్గర ఆస్తి పెడితే బాగుంటుంది అనిపిస్తుంది తండ్రికి, వాడు సరైన తండ్రి అయితే! వాడే అంతా మింగుతాడుట అంటే వాడి దగ్గర పెడతారా ఏ తండ్రి అయినా, తల్లి అయినా? పెట్టరు కదా! పెడితే పెట్ట వచ్చు ఈ రోజుల్లో. కలియుగం కదా! కానీ దైవము, ప్రకృతి అట్లా చేయవు. వసిష్టుడు దగ్గర కామధేనువు చూసి విశ్వామిత్రుడు ఈర్ష్య పడతాడు. జమదగ్ని దగ్గర కామధేనువు చూసి కార్తవీర్యార్జునుడు ఈర్ష్య పడతాడు. ఈర్ష్య పడేవాడికి కామధేనువు రాదు.

ఏమిటా కామధేనువు? వాడిలో ఉండే అవ్యయము అనే తత్వాన్ని అనుభూతి చెందటం చేత, దానికి ప్రతీకగా అక్కడ నుంచి అది పని చేస్తూ ఉంటుంది. అది మామూలు ఆవే! అది వసిష్టుడు దగ్గర ఉండటం వల్ల కామధేనువు! అది గుర్తించాలి. చాల తక్కువ ఉన్నాయండి ప్రపంచంలో కామధేనువులు, చాలా rare గా దొరుకుతాయండీ అన్నామనుకోండి, దానికి అందరు ఎగబడతారు. వసిష్టుడు దగ్గర చూసిన కామధేనువుని విశ్వామిత్రుడు 'నాకు ఇవ్వవా' అన్నాడు. 'నీకు ఇస్తే పనికి రాదురా' అన్నాడు ఆయన. పనికి రాదు. ఎందుకూ? అసలు అందులో లేదు, మనలో ఉన్నది అది. మనలో తయారు చేసుకుంటే కామధేనువుని, దాని నుంచి ఇప్పిస్తాడు. ఎందుకంటే వీడి మీద పడకుండా. ఇది కావాలి, ఇది కావాలి, అంటే దాని నుంచి బాణాలు వచ్చినై, సైన్యాలు వచ్చినై. విశ్వామిత్రుడు ఓడిపోయినంత పని అయిపోయింది. ఇంకా పగ పెరిగింది, ప్రతీకారం పెరిగింది. ఇంకా సైన్యంతో వచ్చాడు ఏవేవో చేసాడు, వసిష్టుడు వంద కొడుకులను చంపేశాడు. ఏవో పిచ్చి పిచ్చి పనులన్నీ చేసాడు. ఏమి చేసినప్పటికి విశ్వామిత్రుని దగ్గర కామధేనువు ఇవాళ్టికి కూడా లేదే! కామధేనువు ఎక్కడ ఉంటుందిట అంటే, సద్వినియోగం చేసే వాడి దగ్గర ఉంటుంది. కాబట్టి అటువంటి కథలు మనకి చాలా కనిపిస్తూ ఉంటాయి. ఏమీ లేని నిరుపేదలు అట్లా అన్న దానాలు చేసేస్తూ ఉంటారు. అన్నీ ఉన్న ధనికులు దరిద్రులై ఏం చేయరు. వీడి నమ్మకం ఏమిటి? మనమా, చేసేవాళ్ళం? చేసేవాడు 'వాడు'! వాడి సంపద. వాడి వాళ్లకి వాడు పెట్టుకుంటాడు. మనం సిద్ధం అవ్వటమే! సంసిద్ధత! జ్వాలాకులుడు చెప్తాడు 'నీకు మొట్టమొదట ఉండాల్సింది సంసిద్ధత'. To Dare. Can you dare? అని అడుగుతారాయన. Can you Will? అని అడుగుతారాయన. To Dare, To Will, To Know and To Be Silent. ఈ నాలుగు qualities ఉంటె ఋషులతో పని చేయవచ్చు, అని చెప్పారు. 'సాహసం చేయరా డింగరీ' అని ఒకాయన అనేవాడు.

To Dare నువ్వు సాహసం చేయక ఉన్నదాన్ని అట్టా కప్పేసుకొని బాధ పడుతూ ఉంటావా?

To Will. నీలో బలమైన సంకల్పం ఉందా లేదా? ఊగిపోతూ ఉంటుందా ప్రతి చిన్న విషయానికీ?

To Know - జ్ఞాన సముపార్జన. చేస్తావా? ఎందుకంటే దానికి అంతం లేదు. నువ్వు 'అది' అయిపోవాలి. అది మొత్తం నీలో ఇమడ్డం అంటే నువ్వు అది అయిపోడమే.

To be Silent- నీకు ఇంత తెలిసి ఉండి, జ్ఞానం ఉండి, ధైర్యము ఉండి, ఎంతో సాహసం ఉన్నా మౌనంగా ఉంటావా?

ఈ నాలుగు ప్రమాణాలు చేస్తే వాళ్లు take up చేస్తారు. ప్రతి దానికి ఏడుస్తూ కూర్చుంటావా? మనం సాధన పరంగా చేయవలసింది ఏమిటీ? Remember the Sun, He is the Giver! అని రాసారు ఒక చోట. సూర్యుడికి ఏమి కావాలండి? ఈ సూర్య మండలంలో ఉన్న సమస్త గోళాలకి, అట్లా ఇస్తూనే ఉన్నాడట. Be A Giver. The Giver knows the quality of The Lord as Unspendable. అదీ రహస్యం ! The receiver does not, because receiving pole is south pole. Giving అంటే north pole, Distributing pole అది. అందుచేత, నువ్వు మూలాధారానికి ఇంకా కిందికి దిగిపోతావా, ఉత్తర ధృవం చేరుకుంటావా? ధృవ పధం అంటే? అది ఎంత అద్భుతమైన పధం! ధ్రువుడు ఎక్కడికి చేరాడు? సప్త ఋషులు పైన వెళ్లి చేరాడు. ధ్రువుడి ఎడల విష్ణుమూర్తి ప్రీతి చెంది అక్కడికి తీసుకు వెళ్లి కుర్చోపెట్టాడు. అది ఉత్తమోత్తమైన పధం! ఆ ధ్రువ పధం నుంచి అంటే ఈ భూగోళానికి ఉండే ఉత్తర ధృవానికి పైన ఉండే ఒక vertex, అక్కడ ఒక సుడి అల్లే తిరుగుతూ ఉంటె, ఆ పైన అంతరిక్షం లో ఉన్న ఆ చోటు నుంచి అట్లా అల్లికగా శక్తిపాతం జరుగుతుంటే, ఇలా ఈ భూమి ఏర్పడుతుంటే, ఇట్టా దీన్ని పోగు చేసుకోని దక్షిణ ధృవం వచ్చింది. టకిలి చివర ఉంటుంది చూడండి, దారం మధ్యలో వస్తు ఉంటుంది, అట్లా. ఈ machine లతో బట్టలు నేసె మగ్గాలు ఉంటాయి. అవి చూసినా మీకు కనిపిస్తుంది. మధ్యలో ఐదు ఆరు రకాల దారాలు పోగులు వేసేసి అలా కలిపి అల్లేస్తు ఉంటారు. అల్లేస్తు ఉంటె మధ్యలో వస్తుంది. అలాగే ఈ భూగోళం. కింద, అంతా పొదుపు చేసేది దక్షిణ ధృవం. దాన్ని అంత పైనుంచి తీసుకు వచ్చి distribute చేసేది ఉత్తర ధృవం. అందుకని ఉత్తర ధృవం చేరటం అంటే సహస్రారం చేరటం, అంత కన్నా పైకి వెళ్ళటం. దక్షిణ ధృవం చేరటం అంటే మూలాధారం, ఇంకా కిందకి తొడల లోకి, మోకాలు లోకి వెళ్ళిపోటం. సాధకులకు అవ్యయమనే తత్వాన్ని ఆశ్రయించి నిర్వర్తించుకోటం ఒక దీక్ష, ఒక సాధన! అవ్యయమైన తత్వాన్ని నిర్వర్తించిన

మహాత్ములు ఉన్నారు. సృష్టి అవ్యయము. అవ్యయ తత్వము ఎక్కడ నుంచి వచ్చింది? అంటే దైవము! అది అవ్యయము. అయన అవ్యయుడు. ఆయనని ఎంత వండినా ఇంకా బాగా మిగిలే ఉంటాడు. అసలు ఏమి వండలేదురా నన్ను మీరు, అంటాడు. అందులో ఆయన వండేసినా ఇంకా మిగిలే ఉంటాడు.

## 14. పురుషః.

ఈ పురుషః అన్న పదానికి అర్థం తెలియాలంటే పురుష సూక్తం వ్యాఖ్యానం చదువుకోవాలి. భాగవతంలో పురంజనోపాఖ్యానం చదువుకోవాలి. పురంజనుడు అంటే ఆంగ్లంలో citizen అని అర్థం. పురము, పురములోకి ప్రవేశించిన వాడు. భగవంతుడు పురములోకి ప్రవేశించిన వాడు. జీవుడు పురములోకి ప్రవేశించినవాడు. పురము అంటే శరీరం. మొత్తం సృష్టి అంతా భగవంతుని శరీరమే! ఆయన దాన్ని అల్లి, దానిలోకి ఆయన దిగాడు. మనం కూడా ఇల్లు కట్టి ఇంట్లోకి దిగుతాముగా! ఇల్లు కట్టకుండా ఇంట్లోకి దిగేది ఏముంది? ఇల్లు కట్టాలిగా. అట్లాగే ఈ ఇల్లు (శరీరము) కూడా మనం కట్టుకున్నదే. మనకి ఉండే tendencies తో శరీరం వస్తుంది మనకి. మనకి ఉండే స్వభావాలు, మనకి ఉండే శుభ - అశుభ లక్షణాలు అవన్నీ కలిపిన నూలు పోగులుగా ఈ శరీరం వస్తుందండి బయటకి. ఎవరు కట్టారు ఈ ఇల్లు? నువ్వు కట్టావు. నువ్వు కట్టుకున్న ఇంటికి నువ్వు వచ్చావు. ఇల్లు బాగా లేదు అనుకుంటే బాగు చేసుకో! నీ ఇల్లు నీ లోంచే వచ్చింది. భగవంతుడి ఇల్లు భగవంతుడి లోంచి వచ్చింది. అయన సృష్టి నిర్మాణము చేసి సృష్టి లోకి దిగాడండీ. అందులో ఉన్నాడు హాయిగా. ఆయనకి ఏమి తేడా పడలేదు. ఆయన సృష్టి అది. ఆయనకి బాగానే ఉంటుంది. మనకే బాగా లేదు. అట్లాగే మనం కూడా. ఎవడి జీవితం వాడిది, ఎవడి సృష్టి వాడిది. అది భగవంతుడి యొక్క సృష్టితో సంధించి చేసుకుంటే నీ సృష్టి దివ్యంగా ఉంటుంది. అట్లా కాకుండా నీదంటూ ఒకటి తయారు చేసుకున్నావనుకో, ఏదో అట్లా అట్లా ఉంటుంది. ఎందుకంటే నువ్వు రాక ముందే ఈ సృష్టి లోకి ఓ పద్ధతి వచ్చేసింది. కాబట్టి నువ్వు ఆ పద్దతి ప్రకారం జీవిస్తే నీకు ఆనందం. హాఁ ! నేను అట్లా ఎందుకు జీవించాలి? అంటే నీ ఇష్టం. ప్రయత్నం చేయి బాగుంటుందేమో, అని చెప్పారు. సృష్టి చేసి, సృష్టిలో ధర్మాలు ఏర్పరచి, జీవుల్ని అందులోకి పంపించి, ఇప్పుడు హాయిగా ఆడుకోండిరా ఈ ధర్మాలు ప్రకారం, ఆనందంగా ఉంటుందని ఏర్పాటు చేసారు. అంటే మాములుగా మనం మన భాషలో చెప్పకోవాలంటే ఒక football court తయారు చేసి, football ఆట తయారు చేసి, ఆ football ఆటకు నియమాలు నిబంధనలు పెట్టి, ఓ బంతి ఇచ్చి ఆడుకోమన్నారు. అట్లా ఆడుకోను,

ఇంకో రకముగా ఆడుకుంటాను అంటే కుదరదు. బంతి వచ్చి ఎక్కడో తగులుతుంది. ప్రతి ఆటకి కొన్ని నియమాలు ఉన్నాయి. ఈ జీవితము అనే ఆటకి కూడా నియమాలు నువ్వు పుట్టక ముందే ఉన్నాయి. జీవులు పుట్టక ముందే సృష్టి ధర్మాలు ఉన్నాయి. ఇది ఇట్లాగే ఎందుకు జరగాలి? తూర్పునే ఎందుకు ఉదయించాలి సూర్యుడు అంటే అప్పుడు నువ్వు పుట్ట లేదు కదా అందుకు. సూర్యుడు చుట్టూ భూమి తిరుగుతున్నప్పుడు అది ఇటు నుంచి అటు కాక, అటు నుంచి ఇటు తిరగ వచ్చు కదా అంటే! ఇప్పుడు America గొప్ప కదా, ముందు సూర్యుడు మా దేశంలో ఉదయించి, తరువాత భారత దేశం వెళ్ళ వచ్చు కదా అంటే కుదరదు. నువ్వు ఎంత పోటు గాడివైనా దానిని అనుసరించాల్సిందే! హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడూ కన్నానా? వాళ్ళు గోళాల arrangement నచ్చక ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు పెడదామని try చేసిన వాళ్ళు. నువ్వు పుట్టక ముందు ఏర్పడినవి. ఇప్పుడు కుదరదంటే ఎలా? ఇంకా అంత వరకు రాలేదు మన America. Cricket ఆట నువ్వు పుట్టక ముందు మొదలు అయ్యింది. నువ్వు ఆడడం మొదలుపెట్టి ఇట్లా ఉండ కూడదు ఆట అంటే, ఏడిశావులే! అంటారు అందరు. అంతేగా? మరీ గట్టిగా గోల చేసేస్తే ground లోంచి తీసి అవతల పారేస్తారు. సృష్టి నిర్మాణం అయినప్పుడు సృష్టి ధర్మాలు ఏర్పరచి, లోకాలు, లోక పాలకులు అన్నీ ఏర్పరచిన తరువాత లోకులను పంపించారు అందులోకి. ముందు Umpire లు వస్తారు కదండీ. ఆ తరువాత కదా players వస్తారు. మనమంతా cricket చూసే వాళ్ళమే కదా! Umpire లు వస్తూ ఉంటె కొంచెం ఉత్సాహం. హమ్మయ్య! ఇహ ఆట మొదలు అవుతుంది, వర్షం పడదు అని. Umpires రాకపోతే గొడవే లేదు. వస్తే వీళ్ళు నెమ్మదిగా వస్తారు. బంతి వేసే bowler, నేను ఇటు నుంచి వేయను batsman అవతల నుంచి వేస్తాను అంటే అవుతుందా? ఇట్లా ఎందుకు వేయాలంటే కుదరదు. నువ్వు లేవురా, Cricket ఆట నిర్ణయం చేసేటప్పుడు. ఉంటె, సలహా ఇచ్చి ఉంటె, అది వాళ్ళకి నచ్చితే, పుచ్చుకొనే వాళ్లేమో! అలానే నీకన్నా చాలా ముందు సృష్టి ఏర్పడింది. ఆ తరువాత నువ్వు వచ్చావు. వచ్చిన వాడివి ఇందులో ఆడాలంటే ఇట్లాగే ఆడాలి. Tennis courtలో tennis ఆడాలి. Cricket court లో cricket ఆడాలి. Football court లో football ఆడాలి. ఒకదాంట్లో ఒకటి ఆడేస్తాము అంటే కుదరదు. ఇలా ధర్మాలు ఏర్పరచినప్పుడు నువ్వు దిగినప్పుడు, ఆ ధర్మాల ప్రకారం ఆడావా, అంతా

అనుభూతే! అనుభూతి ఇవ్వు తల్లి అని అడుగుతాం శ్రీసూక్తంలో. సంస్కృతంలో అడుగుతున్నాము కాబట్టి మనకి ఏమి అడుగుతున్నామో తెలియదు. అర్థం తెలుసుకొని చదివితే ఎక్కువ బాగుంటుంది. లేకపోతె మనం చేసేవి అన్నీ కూడా అర్థరహితమే!

'అభూతిమ సమృద్ధిం చ సర్వా న్నిర్ణుద మే గృహాత్'

అంటాము కదా. అభూతి! ఏ విభూతి లేదు. ఏ అనుభూతి లేదు. ఇలా పడి ఉన్నాను. అది లేకుండా చూడు తల్లి! నాశనం చేసెయ్. అభూతి నాశనం చేసెయ్. అసమృద్ధి నాశనం చేసెయ్. సర్వా — మొత్తంగా, న్నిర్ణుదమే-ఈ శరీరం లోంచి విసిరి అవతల పారెయ్. గృహాత్ - ఇదే గృహం (శరీరం). ఈ విధముగా పురుషుడు దిగినప్పుడు అట్లాగే ఉన్నాడు. దేవతలు యజ్ఞం చేసి ఆయనని ఆవాహనము చేసి, 'సృష్టిలోకి దిగి వచ్చి దీన్ని అంతా నిర్వర్తించు స్వామి,' అంటే అన్నిటిలోకి దిగిపోయాడు. అన్ని అట్లాగే నిర్వర్తిస్తాడు. ఉప్పు ఉప్పగానే ఉంటుంది. పంచదార తీపిగానే ఉంటుంది. మారుతుందా? మారదే! గాడిద గాడిద లాగే ఉంటుంది. గుర్రం గుర్రం లాగానే ఉంటుంది. ఏం మార్చరు. మనం ఎదో మార్చేద్దామని చూస్తుంటాము. మనం అమ్మిని తిమ్మి, తిమ్మిని బమ్మి చేద్దామంటే కుదరదు. అందుకే నువ్వు దానిని అనుసరించావే అనుకో. నువ్వు ఇప్పడు ఈ పురంలో పురుషుడుగా జీవించవచ్చు. పురుషః అంటే అర్థం ఏమిటంటే, పురమున ప్రవేశించినవాడు. గృహప్రవేశము చేసిన వాడు. శరీరం అనే గృహము లేదా రూపము అనే గృహం. ఎంతో బాగుంటుంది పురంజనోపాఖ్యానం చదువుకుంటే. పాపం చాలా fresh గా దిగి వస్తాడు. చాల బాగుంది ఇందులోకి దిగనా అని స్నేహితుడిని అడుగుతాడుట. వాడి పేరు మిత్రుడు, అదే బుద్ధి! 'దిగు కానీ అది ఎంత బాగుంటుందో, ఎంత శక్తివంతమైనదో అంత మోహ పరిచేది సుమా, నిన్ను నువ్వు మర్చిపోక, నన్ను కూడా మర్చిపోక! నిన్ను నువ్వు మర్చిపోయినా పర్వాలేదు, నన్ను మర్చిపోకపోతే మళ్ళీ బయటికి లాగేస్తా! నిన్నూ మర్చిపోయి, నన్నూ మర్చిపోతే చచ్చిపోతావు' అని చెప్తాడు. అంటే, వీడు ఇద్దర్నీ మర్చిపోతాడు. ఎందుకంటే అంత అందమైన నవద్వారపురము అది. ఆ నవద్వారపురం లోకి దిగి నానా బాధలు పడిపోతాడు. ఎందుకంటే మనం దిగి వచ్చినప్పుడు ఒక ఐదు తలల పాము ఉందిట. ఆ పాముకి వెనకాల ఒక సుందరి ఉంటుందిట. 'రా రా,' అని పిలుస్తూ ఉంటుందిట. ఆకర్షణీయంగా ఉంటుందిట. దాని దగ్గరకి వెళ్లాలంటే పాము

నోట్లోంచి వెళ్ళాలిట. ఏమిటీ పాము? పంచ ప్రాణాలు. పంచ ప్రాణాలు తీసుకొని జీవుడి శరీరంలోకి ప్రవేశించగానే అది  మింగేస్తుంది. ఇక మళ్ళీ అందులోంచి బయటకి రావటం నీకు చాత కాదు. బుద్ధి సహాయం ఉంటె తప్ప మళ్ళీ బయటకి వచ్చే మార్గం తెలియదు. ఇహ ఈ సుందరి నీకు పంచేంద్రియాల ద్వారా సమస్తము అనుభూతి కలిగిస్తూ నిన్ను ఇక్కడ ఉంచేస్తుంది శాశ్వతంగా. వదలదు. బాగుంటుంది కథ. చదువుకోండి. పురంజనోపాఖ్యానం చదువుకుంటే  పురుషుడు, అంటే మన పరిస్థితి ఏమిటో తెలుస్తుంది. దైవమే పురుషుడిగా దిగి రావటం అంటే పురుషసూక్తం చదువుకోవాలి.

# 15. సాక్షి

నువ్వు దిగి వస్తావు చూసావా, దిగి వస్తే సాక్షీ భూతుడుగా దైవం కూడా దిగి వస్తాడుట. వాడే ఆ మిత్రుడు. పిలుస్తే పలుకుతాడు. పిలవకపోతే ఉంటాడు. పిలవందే పలకడు. అన్నీ చూస్తూ ఉంటాడు. సమస్తం గమనిస్తూ ఉంటాడు. నువ్వు కోరితే సహాయం చేస్తాడు. నువ్వు కోరకుండా  ధర్మాన్ని అనుసరిస్తే కోరే అవసరము కూడా లేదూ. ఎందుకంటే ధర్మాన్ని ఉపాసన చేసే వాళ్ళకి దైవము యొక్క ఉపాసన అప్రయత్నముగానే జరుగుతుంది. ఎందుకంటే సృష్టిలో ధర్మం రూపంలో దైవం ఉన్నాడు కనుక. ధర్మ ఆరాధన ఆశ్రయము, దైవ ఆరాధనా ఆశ్రయము రెండూ ఒకటే. నిజంగా నువ్వు దైవంని ఆశ్రయించావు, అని మనకు తెలియాలంటే మన ఆచరణ ధర్మ పరముగా ఉందంటే నువ్వు దైవ భక్తుడవని లెఖ్ఖ! దైవభక్తి దైవభక్తిగాను, దొంగబుద్ధి దొంగ బుద్ధిగాను నడచి వెళ్ళిపోతూ ఉంటె అది దైవ భక్తి ఎలా అవుతుంది? అవదే! దైవారాధన చేస్తూ, లోకంలో అందరిని మోసం చేస్తున్నావు అంటే ఎవరిని మోసం చేస్తున్నట్టు? దైవాన్నే మోసం చేస్తున్నావు. అప్పుడు దైవారాధన ఎట్లా జరుగుతుంది? ఆరాధిస్తున్న వాడిని మోసం చేస్తుంటే ఆరాధన అవుతుందా? అవదే! అందుకని ధర్మాచరణ అన్నా, దైవారాధన అన్నా ఒక్కటే. రూపాయి బిళ్ళకి అటుఇటుగ ఉంటాయి. ఇది లేందే అది లేదు. అది లేందే ఇది లేదు. దైవాన్ని ఆరాధన చేస్తూ ధర్మం వ్యతిరిక్తమైన పనులు మనం రోజు చేస్తున్నాము అనుకోండి! శాస్త్రముల పరంగా, సద్గురువుల పరంగా, ఋషుల పరంగా, వాఙ్మయము పరంగా మనం దైవారాధకులము కాము. ఎదో మనం మనని భ్రమ పెట్టుకుంటూ ఉంటాము భక్తులము అని చెప్పి. దాని వల్ల ఉపయోగము లేదు. అన్నీ  సాక్షిగా చూస్తూ ఉంటాడు. నువ్వు చేస్తున్న చెత్త పనులకి నీకు శిక్ష వేయటం, నువ్వు చేసిన మంచి పనులకి మంచి జరపడం అవన్నీ అయన చెయ్యక్కర్లే ప్రత్యేకంగా. ఇంతమందికి ఎక్కడ చేస్తాడండీ? కోటానుకోట్ల జీవులు. ఈ భూమి మీదే కాదు అన్ని చోట్ల ఉన్నారు. అందుకని ఎవడు చేసిన దానికి వాడికి తగ్గట్టుగా automatic గ అయ్యేటట్టుగా machine పెట్టేసాడండి సృష్టిలో. నువ్వు చేసిందాన్ని బట్టి నీకు వచ్చేస్తూ ఉంటుంది అంతే. మనం ఓ రెండు రోజులు గట్టిగ ఉపవాసం చేసి weighing machine ఎక్కుతాము. ఎదో ఓ పది కేజీలు

తగ్గకపోతామా అని. చేసింది రెండు రోజులు. అదేమో అంతకన్నా ఎక్కువ బరువు చూపించడం, లేకపోతే అంతే బరువు చూపించడం ఇలా చేస్తుంది. 'ఛీ వెధవ machine' అంటాం. వెధవ machine ఏంటి? నువ్వు ఎంత బరువు ఉంటె అంతే చూపిస్తుంది. అది impersonal. Machine ఎక్కే ప్రతివాడు తక్కువ బరువు తూగాలని కోరుకుంటాడు. మిగతా వాళ్ళు ఎక్కరు. సన్నంగా ఉండేవాడు machine ఎక్కడు. వాడికి machine తో సంబంధం ఏమి ఉంది? వాడు హాయిగానే ఉన్నాడు కదా. ఎక్కువ బరువు ఉన్న వాడిని ఒక పూట ఒక అర చపాతియో, అర ఇడ్లియో తక్కువ తినేసి ఓ కేజీ తగ్గావేమో అని చూసుకుంటూ ఉంటాడు cinema hall కి వెళ్ళినప్పుడు, Railway platform మీద wait చేస్తున్నప్పుడునూ. చూస్తే, అది ఎప్పుడూ నిరాశే! Machine తప్పేమో అంటాడు. పక్కవాడు ఒప్పుకోడు. పక్కనున్న వాడి రూపంలో వాసుదేవుడు ఉంటాడు కదా! చూస్తాను ఉండు, అని వాడు ఎక్కుతాడు. వాడు సన్నగా ఉంటాడు. వాడు మామూలుగా ఉండే బరువే ఉంటాడు. Machine తప్పేం కాదే, అంటాడు. తప్పు అనటానికి వీలులేదు. నువ్వు సాక్షి, నువ్వు తిన్న తిండికి, నీ ఆలోచనలకి. కేవలం తిండిలోంచి రాదు బరువు. ఆలోచనలలో నుండి వస్తుంది. నీకు భౌతికమైన సమస్యలకి పరిష్కారాలన్నీ సూక్ష్మ లోకాలలో ఉన్నాయి. మనసు తేలిక పరచుకో, శరీరం తేలిక పడకపోతే నన్ను అడుగు, అన్నారు ఋషులు. Master గారు అలాగే చేసేవారు. Master గారు చాల బరువుగా ఉందండి, ఏమి తింటే తగ్గుతుంది అంటే, ఇప్పుడు తింటున్నదే తిను అని చెప్పేవారు. తిండి మానక. తిండి మానితే బరువు తగ్గరు. ఆలోచనలు మార్చుకోవాలి. ఎదో ఒక పని, నేను చేస్తున్న పనిలో ఒక దాంట్లో నువ్వు కూడా చేరిపో, అని చెప్పేవారు. ఎందుకనీ? ఆ పనులు చేసుకుంటూ దైవీ భావము, ధర్మ భావము నీలో పెంపొందింపబడుతూ ఉంటె, నీలో ఉండే రుగ్మతలన్నీ కూడా సహజంగా పోతాయి. అట్లాగే కదా రోగులందరు వైద్యులు అయ్యారు మన జగద్గురు పీఠంలో. జగద్గురు పీఠంలో ఇప్పటి వైద్యులు అంతా ఒకప్పటి రోగులు. అది అందరికి తెలుసు. మరి అంతకన్నా miracle ఏమి కావాలండీ? Miracle miracle అని చచ్చిపోతూ ఉంటారు. దాని కన్నా miracle ఉందా? ఒక రోగి, ఒక వైద్యుడై కొన్ని లక్షల మందికి వైద్యం ఇవ్వడానికి తయారైయ్యాడంటే వాడి స్వభావంలో ఎంత మార్పు తేగలిగాడు ఓ సద్గురువూ? మరి వాళ్ళందరూ ఆరోగ్యంగానే ఉన్నారే. వారికి రోగాలు ఒకప్పుడు ఉన్నాయని

కూడా ఇప్పుడు మర్చిపోయి ఉంటారు. ఎందుకని? మిగతా వారి రోగాలని నయం చేసే కార్యక్రమాలలో ఉన్నారు కాబట్టి, నీ రోగం నీ నుంచి ఎప్పుడో వెళ్ళిపోతుంది. అందుకని ఆయన ఒంట్లో బాగా లేని వాళ్ళని, మందు వేస్తే తగ్గని వాళ్ళని 'ఓ పని చేయరా, నువ్వు రేపటి నుంచి dispensary కి వచ్చేసెయ్' అని చెప్పేవారు. ఇహ నీకు మందు లేదు dispensary కి వచ్చేసి హాయిగా అక్కడ పని చేస్తూ ఉండరా. అలా పని చేస్తూ ఉంటె తగ్గిపోయిన వాళ్ళు ఉన్నారు. ఎందుకని? ఇతరుల రోగానికి నువ్వు సేవ చేస్తే నీ రోగం తగ్గుతుంది. అది రహస్యం! సృష్టిలో స్థూలమైన సమస్యలకు పరిష్కారాలన్నీ సూక్ష్మంగా ఉంటాయి. అందుచేత సాక్షి భూతుడిగా అతడు ఉంటే, ఈ ధర్మమే నడిపిస్తూ ఉంటుంది అంతాను. నువ్వు ఎంత ధర్మము ఆచరిస్తే అంతే నీకు దైవము యొక్క సహకారము ఉంటుంది. ధర్మాన్ని ఆచరించకుండా దైవాన్ని ఆరాధన చేస్తే పలికే దైవము, లంచగొండి అధికారులు, రాజకీయ నాయకులు లాంటి వాడుకాదు. చట్టం దాని పని అది చేసుకుపోతూ ఉంటుందని అనే వాడు ఒకాయన. ఓ పదేళ్ల కిందట ఓ రాజకీయ నాయకుడ్నో, ఓ పెద్దవాడినో  పట్టుకుంటే, ఏమిటండి ఇతను తిన్నాడుట అంటే, ఏం చేస్తాము, చట్టం దాని పని అది చేసుకు పోతుంది, అన్నాడు. ఆయన పని కూడా చట్టమే చూసేసింది. సత్యం అది! ధర్మ చట్టం ఒకటి ఉంది, ధర్మ చక్రం ఒకటి ఉంది. ఆ ధర్మ చక్రాన్ని తప్పించుకు ఎవ్వడు పోలేడు. మహాప్రస్థానం పర్వంలో పంచ పాండవులు, ద్రౌపది అందరు మహా పుణ్యాత్ములు అనే బయలుదేరుతారు ఉత్తర దిశగా. శరీరాన్ని త్యజించి స్వర్గానికి వెళదామని. ఈ రోజులలో ఎవ్వరు చేయరు లెండి ఆ పని. పూర్వ కాలంలో మనం వచ్చిన పని అయిపోయింది కనక అలా నడిచి హిమాలయాలలోకి వెళ్ళిపోదాం, దారిలో శరీరం  పడిపోతుంది అని బయలుదేరేవారు. ధీమంతులు వాళ్లంతా. అట్లా బయలుదేరారుట వీళ్ళు. ముందు ద్రౌపది పడిపోయింది. ఎందుకిలా పడిపోయాను అని ధర్మరాజుని అడిగింది. ఎందుకనీ? అతను ధర్మానికి ప్రతీక! ఎందుకంటే నీకు పక్షపాత బుద్ధి ఉంది అందుకే పడిపోయావు. పక్షపాత బుద్ధి ఉంటె పడిపోకుండా ఉంటామా? ఉండము. పక్షపాత బుద్ధి ఉండేవాడు ముందుకి సాగలేడు. మన వాడు, మన వాడు కాదు. మన కులం, మన కులం కాదు. ఇది కదా మన రోగం. మనఇంట్లో వాళ్ళు, మన కులం వాళ్ళు, మన బంధువులు ఇట్లా చచ్చిపోతుంటాం. మన దేశం వాడు! నీ దేశమా? నువ్వు జీవుడుగా ఎక్కడ నుంచో వచ్చావు. సరదాగా ఇక్కడకి picnic కి

వచ్చి ఇరుక్కు పోయిన వాడివి. మళ్ళీ ఇందులో ownership లు ఒకటి. పక్షపాత బుద్ధి ఉండటం చేత ద్రౌపది పడిపోయిందిట. భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసు నాకు అనే జ్ఞానం ఉంది అనే గర్వము ఉంది సహదేవుడికి. అందుచేత పడిపోతాడు. చాల యుక్తియుక్తంగా పని చేయగలను అనే భావన, అందరికంటే అందగాడినని భావన నకులునికి. అతడి పడిపోతాడు. ఒక్కొక్కళ్ళు పడిపోతారు. అందరూ అడుగుతారు ఎందుకు పడిపోయామని? అర్జునుడు పడిపోతాడు. ఏమిటి అన్నయ్యా! నేను పడిపోవటం ఏంటి కృష్ణుడికి చాల దగ్గరగా ఉన్నవాడిని, అంటే. ఆ కాస్త సేపే కృష్ణుడికి దగ్గర అవటం. ఆ సమయములో ఆయనతో పని ఉంది అందుకని దగ్గరకి చేరాడు. పని పూర్తి చేసాడు. ఆ తరువాత నువ్వు వాడిని పట్టుకు కూర్చున్నావా? లేదు కదా? అహంభావం. నా అంతటి విలుకాడు లేడు భూమి మీద. నా వల్ల కదా భారత యుద్ధం గెలిచాము. అర్జునుడికి ఇటువంటి ఏవేవో ఉన్నాయి పాపం. భీముడికి అదే. ఇవన్నీ లేనివాడు ధర్మరాజు. కాబట్టి బలవంతుడు. చూడటానికి ధర్మరాజు Cinema లో పాపం ఏమి కానట్టుగా ఉంటాడు కదా. Cinema లో వేసే పాత్రధారి కూడా unimportant person ని పెడతారు. అర్జునుడిని, భీముడిని కొంచం ప్రసిద్ధి పొందిన నటుల్ని పెడుతూ ఉంటారు. లోకంలో మనకి కనిపించే గొప్పవేరు. పైలోకాల లోంచి చూచే గొప్ప వేరు. ఇంత పాండవులు నహుష ప్రశ్నలప్పుడు నహుషుడికి దొరికిపోతారు. యక్ష ప్రశ్నలప్పుడు యక్షులకి దొరికిపోతారు. రక్షించింది ఎవరూ? ధర్మరాజే! సరే వాళ్ళతో  కుక్క కూడా నడచి వస్తుంటుంది. కుక్క పడదు. వెంట వస్తుంది. రథం రాగానే కుక్కని చూచి 'ఎక్కు', అంటాడు ధర్మరాజు.  "స్వర్గం లోకి కుక్కలు రావు. కుదరదు, దాన్ని వదిలేయాలి" అంటే, "నా ధర్మము నేను వదలను. నేను క్షత్రియుడుగా పుట్టాను. తోటి జీవి, సాటి జీవి. మొత్తం ఈ పర్వత శ్రేణిలో  నాతో ఇంత దూరం నడిచింది. ఇప్పుడు  దీన్ని అర్ధాంతరంగా నేను వదలేసి రాలేను."  అంటే, 'మరి స్వర్గం వద్దా' అంటే' స్వర్గం వద్దంటాడు.' అదేమిటది?  దీన్ని రక్షించకుండా స్వర్గానికి వెళితే నాకేమిటి తృప్తి? అన్నాడు. మనకి దర్శనం అవుతుందంటే వెనక వాళ్ళని వదిలేసి పరుగెత్తి  వెళ్ళిపోతాం, కదా! దర్శనానికి ఒకళ్ళ కన్నా ఒకరు ముందు వెళ్ళిపోవాలి కదా! ప్రయత్నం అంతా అదేగా? మళ్ళీ ఆ కాస్తలో ఎవరు ముందు అనే  కదా! ఏదో మోహం! సాక్షి! అక్కడ నుండి  చూస్తాడు. కదా? అంతా స్వార్ధమే! ఎక్కడికి పోయినా  స్వార్ధమే! ఇంకోటి లేదు మన దగ్గర. మరి ఎలా అండీ? నీలో ఇన్ని

పెట్టుకున్నావు కదా! నేను నీలో ఉండే నీ సంగతి అంతా చూస్తున్నాను, అంటాడు ఆయన. మళ్ళీ బయట నుంచి ఎక్కడ నుంచో చూస్తుంటే miss అయిపోయారు, మీరు సరిగా చూడలేదు, అని చెప్తారు. We are always in camera. చూడండీ మనకి video తీస్తున్నారట అంటే మనం అలా కొంచెం హుందాగా ప్రవర్తిస్తూ ఉంటాం. నా బోటి వాడు ఇట్టా గోక్కోడానికి కూడా సందేహిస్తాడు video తీస్తున్నప్పుడు, అందరు చూస్తారని. But you are always in camera. అది తెలియదు తమాషా. అందుచేత, అతడు సర్వ సాక్షి. సమస్తాన్ని చూస్తూనే ఉన్నాడు. ఎక్కడ నుంచి చూస్తున్నాడంటే ఈ లోపల ( మన లోపల) నుంచి చూస్తాడు. ఎక్కడ నుంచో చూడడు. నీ లోపలే ఉన్నాడు. నీ తోనే ఉన్నాడు. నువ్వు చేసే ప్రతి పని చూస్తున్నాడు. నువ్వు చేసే ప్రతి భావన చూస్తున్నాడు. నీకు కలిగే ప్రతి కోరిక చూస్తున్నాడు. సమస్తం చూస్తున్నాడు. నువ్వు bathroom లో ఏమి చేస్తున్నావో కూడా చూస్తున్నాడు. ఏం సందేహం లేదు. అది సాక్షి. ఆ సాక్షి కూడా ఈ పురంలోనే ఉన్నాడు. లోపలా ఉన్నాడు బయట ఉన్నాడు. అటువంటి వాడు భగవంతుడు.

'అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞో అక్షర ఏవ చ' ఏవచ అంటే నామం కాదు, కూడా అని అర్థం.

# 16. క్షేత్రజ్ఞః

ఇది తెలియాలంటే  క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం అంతా చెప్పుకోవాలి. టూకీగా చెప్పుకోవాలంటే క్షేత్రములు తెలిసిన వాడు అని అర్ధం. 'క్షేత్రం' అంటే? మొత్తం చూస్తే క్షేత్రం. కురుక్షేత్రం అని  Delhi దగ్గర ఉంది, చూసి వచ్చామని అంటారు. అది ఆ ఊరుకి అట్లా పేరు పెట్టుకున్నారు. మా ఊరిలోనూ ఉంది కైలాసగిరి. మీరు విశాఖపట్నం వస్తే నేను మిమ్మల్ని కైలాసగిరి ఎక్కించగలను. చూట్టమే కాదు, ప్రదక్షిణం చేద్దాము అనుకుంటే చేయవచ్చు కూడా. అది కైలాసగిరియా? నేను చెప్పినా మీరు నమ్ముతారా? నమ్మరు కదా. అట్లాగే తెలిసిన వాళ్ళు కురుక్షేత్రం అంటే అక్కడేదో హస్తినాపురం దగ్గర వాళ్ళందరూ పోట్లాడుకున్నది కాదు కురుక్షేత్రం, అంటారు. మొత్తం అనంతమైన చోటు, space అంటుంటాము చూసారా,  ఆ చోటులో ఒక ప్రేరణ వచ్చినప్పుడు, ఒకచిన్న భాగం, ఆ ప్రేరణ అందుకుంటుంది. చిన్న బుడగ! అదీ ఇదంతా. అంటే 'అది' ఎంత? పెద్ద సరస్సులో ఒక చిన్న బుడగ ఎంతో, మొత్తం దైవమూ లేక చోటులో ఈ సృష్టి అంత. ఆవగింజంత. ఎవరికి? అనంతుడికి. ఎంత ఇది? ఇందులో ఇంత కార్యక్రమం. అందుకని ఈ మొత్తం చోటులో కొంత చోటు ప్రేరణ చెంది, అక్కడ సృష్టి కార్యము మొదలైయింది. దానికి ఒక పరిధి ఉంది. మొత్తం చోటులో ఎక్కడైతే ఈ సృష్టి కార్యం నిర్ణయింపబడి జరుగుతోందో ఆ మొత్తాన్ని క్షేత్రం అన్నారు. అది కురుక్షేత్రం! The action of creation happens in it. అది కురుక్షేత్రమే కాదు, ధర్మ క్షేత్రం! ధర్మంతో సృష్టి కార్యం మొదలైంది. సృష్టిలో ధర్మం ఉంది. సృష్టి ఉన్నంత వరకు ధర్మం ఉంటుంది. ఎప్పుడూ ఉంటుంది ధర్మం. అందుకని 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అది కదా భగవద్గీత మొదలు. భగవద్గీతలో  అసలు మొదటి పదమే ధర్మం తో మొదలు అవుతుంది. ఇంక అంతకన్న ఏమి కావాలి? ధర్మం గురించి, దాని యొక్క విలువ గురించి, దాని యొక్క ప్రాముఖ్యత గురించి?

'ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః   మామకాః పాండవాశ్చైవ
కిమకుర్వత సంజయ '

అంటే ఏమిటి? ఈ ధర్మ క్షేత్రమైన కురుక్షేత్రంలో నా వాళ్లూ, పాండవులు ఏమి చేస్తున్నారు? అంటే అక్కడ, ఆ పాండవులూ, ఆ వంద మంది కౌరవులు అని కాదు.

పాండవులు అంటే వెలుగును పొందిన వారు అని అర్థం. నా వాళ్ళు అంటే మమకారంతో జీవిస్తున్న వాళ్ళు. ఈ మమకారంతో జీవిస్తున్న వాళ్ళు ఎంతసేపూ పీక్కు తినటం తోనే సరిపోతుంది సృష్టి అంతా కూడా. వెలుగు కోసం పని చేస్తున్న వాళ్లు 'వాళ్ళు'. కాబట్టి ఈ సృష్టి అనే కురుక్షేత్రంలో స్వంతంగా తమకోసం తాము పని చేస్తున్న వాళ్ళు, పది మంది కోసం యజ్ఞార్థం జీవిస్తున్న వాళ్ళు, వీళ్ళమధ్య జరిగే కార్యక్రమం ఎట్లా ఉంటుంది? అది చెప్పమని. భగవద్గీత, మొత్తం సృష్టి మొత్తానికి కూడా అన్వయించ గలిగిన ఏకైక గ్రంధము. న భూతో న భవిష్యతి! ఏమి సందేహం లేదు. భారతీయులం, భగవద్గీత ఎంత వరకు చదువుతున్నాం? ధర్మక్షేత్రే కురుక్షేత్రే! ఈ క్షేత్రంలో  కర్మము యొక్క విశేషము ఏమిటో తెలిస్తే కురుక్షేత్రము ఏమిటో తెలుస్తుంది. ఈ (మనము) క్షేత్రంలో ఎలా నిర్వర్తించుకోవాలి? బయట క్షేత్రం ఉన్నది. నువ్వు ఉంటున్న శరీరము క్షేత్రమే! దీని గుణగణాలు ఏమిటి? దీని స్వరూప స్వభావాలు ఏమిటి? ఎలా నిర్వర్తించుకోవాలి అని చెప్పేది కర్మ యోగం. దీంట్లో ఏముందో తెలుసుకోవాలంటే మానవ నిర్మాణం శాస్త్రం తెలుసుకోవాలి. తపస్సు చేసి, యోగం ద్వారా మనలో ఉండే  సప్త లోకాలు దర్శనము చేసి మనకి ఋషులు ఇచ్చిన వాక్యాలు చదువుకోవాలి. చదువుకుంటే చాలదు.  ఆకళింపు చేసుకోవాలి, అనుభూతి పొందాలి. అట్లా పొందితే 'క్షేత్రజ్ఞుడు' అవుతాడు. ఇప్పుడు నువ్వు అదంతా నేర్చుకుంటున్నావు. ఆయనకి మొదటి నుంచి తెలుసు. చేసిన వాడు ఆయన కదా! చేసిన వాడికి అన్ని తెలుస్తాయి. క్షేత్రజ్ఞ! ఆయనకి తెలిసిన క్షేత్రం ఏమిటంటే ఈ విశ్వం అనే క్షేత్రము అతడే నిర్వర్తించాడు. ఎట్లా నిర్వర్తించాడు? తనని తాను త్యాగం చేసుకొని. నువ్వు కూడా నిన్ను త్యాగం చేసుకుంటే తప్ప నీకు ఏమీ దక్కదు సృష్టిలో. 'త్యాగే నైకేన అమృత మానస'  నీ ధనం నిన్ను రక్షించదు, నీ వారు నిన్ను రక్షించరు, ఏమిటి నిన్ను రక్షించుతుందీ అంటే నువ్వు చేసిన దానం, నువ్వు చేసిన త్యాగం! ఇవే రక్షిస్తాయి, మిగతావి రక్షించవు. 'న ప్రజయా, న ధనేన' అవి రక్షించవు. నిన్ను రక్షించేది త్యాగమే! త్యాగం ద్వారా నువ్వు అమృతత్వాన్ని పొందవచ్చు, 'త్యాగేనైకేన అమృత మానస'! ఎందుచేత? అమృత స్వరూపుడైన దైవము తన్ను తాను త్యాగం చేసుకొని దీనినంతా తయారుచేశాడు.  గోధుమపిండి తన్ను తాను త్యాగం చేసుకుంటే కదా మనకు పూరీలు, పుల్కాలు, చపాతీలు వస్తున్నాయి!  ఆ పిండి అహ- ఇది నేనే, నన్ను కదల్చక ఇక అని కూర్చుంటే నీకు పూరి లెక్కడ నుంచి వచ్చినయి, పుల్కా

లెక్కడనుంచి వచ్చినయి, చపాతీలు ఎక్కడ నుంచి వచ్చినయి? నేను ఇట్లాగే ఉంటాను, ఫుల్కాలు, చపాతీలు, పూరీలు రావాలంటే రావు కదా. అట్లాగే నేను ఇట్టాగే ఉంటాను. నాకు దైవం కనపడాలి, నేను అమృత స్వరూపుడు అయిపోవాలి అనేది దురాశ. ఏవో చిన్న చిన్న ఆశలు అయితే ఫర్వాలేదు, మరీ భయంకరమైన ఆశ. నువ్వు అమృత స్వరూపుడు అయిపోదామనుకుంటే నిన్ను నువ్వు త్యాగం చేసుకో. ఎందుకంటే అమృత స్వరూపుడు తనను తాను త్యాగం చేసుకుంటే ఇదంతా అయిందండీ. మళ్ళీ దీన్ని త్యాగం చేసుకుంటే అది అవుతుంది. అంతేగా! నీరు త్యాగం చేస్తే మంచు గడ్డ అయ్యింది. మంచు గడ్డ త్యాగం చేస్తే నీరు అవుతుంది. మంచు గడ్డ నేను మంచు గానే ఉంటాను నీరు అవను అంటే? వితండ వాదన కాక ఇంకోటి ఏముంది? అందుచేత ఈ క్షేత్రం నీకు తెలియాలంటే, అసలు ముందు ఇందులో ఏమి ఉన్నాయి? తెలియాలి. ఇందులో ఏమి ఉన్నాయంటే, భగవద్గీత క్షేత్ర క్షేత్రజ్ఞవిభాగం యోగం లో 24 తత్వాలు చక్కగా వివరంగా వివరిస్తాడు దైవం శ్రీకృష్ణుడు రూపంలో. ఆ 24 తత్వాలు-- పంచ భూతాలు, కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, పంచ తన్మాత్రలు ఐదు. అటుపైన నీ స్వభావం, నీ మనస్సు, నీ బుద్ధి, నీ అహంకారం. ఇరవైనాలుగు అయిపోయినాయి. ఇదిరా నీ recipe, అన్నాడు ఆయన. మరి ఇది అంతా అయ్యి బయటకి ఎట్లా రావాలి? బయటకి రావాలంటే మూడో అధ్యాయంలో చెప్పేసానురా అన్నాడు. కర్మయోగం! యజ్ఞార్థం జీవించు! 'యజ్ఞార్థం కురు కర్మాణి ' అంటాడు. నీకోసం బతకకురా, దరిద్రపు బతుకు. పది మంది కోసం బతుకు. నీ బతుకూ బ్రహ్మాండంగా గడుస్తుంది. అందరి బతుకులు నీ మూలంగా పండుతూ ఉంటె అది చూసి నిన్ను పండ వేస్తారు. యజ్ఞార్థ జీవనం! యజ్ఞార్థం కురు కర్మాణి, అనే సందేశం భగవంతుడే చెప్పేసాట్ట అంటే ఇంకా ఏమి చేయాలనే వాడికి ఏమి చెప్తారు? ఇక చెప్పేది ఏమి లేదు. ఇప్పుడు కాదు మళ్ళీరా అంటూ ఉంటాము చూడండి మాధవకబళం వాడు వస్తే అలా. అన్నీ విని ఇప్పుడు ఏమి చేయమంటారు Sir, అంటే ఏమి చెప్తాడు? ఏం చేయాలో చెప్పిన తరువాత, అయితే ఇప్పుడు ఏమి చేయమంటారు అని అంటే అసందర్భంగా ఉండదూ? ఉపవాసం గురించి ఎవడికో చెప్తే వాడు ఈ ఉపవాసం భోజనానికి ముందా, భోజనం తరువాతా? అని అడిగాడుట. ఎలాగుంటుంది? మన బతుకులు ఇట్లా వెళ్ళిపోవలసిందే. ఈ లోపున చచ్చే ఆశలు. మనం కైలాసానికి వెళ్తామా, వైకుంఠానికి వెళ్తామా? వాళ్ళెవరైనా తేల్చారా లేదా మన గురించి? అని. మనం

వెళ్ళేది ఎక్కడకో already prepared. మన బట్టే! ఇట్లా ఉంటాయి. అంతు లేని వ్యామోహాలు. భ్రమలు భ్రాంతులు! క్షేత్రజ్ఞః అంటే భలే చెప్తాడు భగవంతుడు క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో. నీ క్షేత్రం నువ్వు తెలుసుకుంటావు కదా, నువ్వు అట్లా తెలుసుకోడానికి పునాదిగా ఎవడున్నాడు? అని అడిగాడు. వాడూ క్షేత్రజ్ఞుడు! ఇప్పుడు నువ్వు తెలుసుకున్నావయ్యా! తిరుపతిలో ఏవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకున్నావు. ఇక్కడ మయూరి ఉంది, అక్కడ ఉడిపి, అక్కడ woodland ఉంది. ఇవే కదా మనకి తెలుసు. బాగుందీ, తెలుసుకున్నాం. ఇవి తెలుసుకొనే బుద్ధి రూపంలో నీలో ఎవడున్నాడు? వాడిని తెలుసుకున్నావా? వాడికి నువ్వు కూడా తెలుసు, నీ క్షేత్రమూ తెలుసు. వాడూ క్షేత్రజ్ఞుడు! క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో ఈ దేహము, క్షేత్రము, ఈ దేహి, క్షేత్రజ్ఞుడు అని ముందు చెప్తాడు. తరువాత ఏమి చెప్తాడంటే ఈ దేహము, క్షేత్రము తెలిసిన వాడు ఒకడు ఉన్నాడు. వాడు అసలు క్షేత్రజ్ఞుడు అని చెప్తాడు. వాడికి నీ బతుకు తెలుసు. నీవు ఎక్కడికి బయలుదేరావో, ఎక్కడికి వచ్చావో తెలుసు. నీ బతుకు నీకు తెలియదుగా! నీ క్షేత్రం నీకు తెలియడం మొదలు పెట్టు, అప్పుడు ఈ క్షేత్రాన్ని ఆధారం చేసుకొని దేన్నీ తెలియాలో దాన్ని తెలుసుకో, అని చెప్తుంది క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం! అది అందులో రహస్యం. ఈ క్షేత్రం గురించి తెలుసుకున్నావు కాబట్టి, దీని స్వరూప స్వభావాలు తెలుసుకున్నావు కాబట్టి, ఇది నీకు సహకరిస్తే కాని నువ్వు ఏమీ చేయలేవు కాబట్టి, దీన్ని ముందు ఎరుగు. అప్పుడు నువ్వు ఒక level, ఒక grade క్షేత్రజ్ఞుడివి! తరువాత నిన్ను, నీ క్షేత్రాన్ని ఈ విధంగా అస్తిత్వం కల్పించిన వాడు ఉన్నాడే, వాడిని తెలుసుకో. వాడూ క్షేత్రజ్ఞుడు! వాడిని నువ్వు చేరితే, 'అది' నువ్వు అయితే, అప్పుడు నువ్వు కూడా క్షేత్రజ్ఞుడివే. అదీ క్షేత్రజ్ఞ!

# 17, 18 అక్షర, ఏవ చ

వాడు అక్షరుడు. అవ్యయంతో మొదలు పెట్టాడు అక్షరంతో పూర్తి చేసాడు ఈ పాదం. అక్షరము అంటే క్షరము కానిది. మన అక్షరాలు  అ నుంచి హ వరకు ఉన్నాయి కదా, ఆహా అన్నట్టుగా! ఈ అక్షరాలు మీరు ఎన్ని సార్లు వాడారండి? మీరేంటి మన ముందు వాళ్ళు వాడారు. వారి ముందు వాళ్ళు వాడారు, ఈ సృష్టి మొదలు అయినప్పటి నుంచి వాడుతూనే ఉన్నారు ఆ అక్షరాలన్నీ. అయినప్పటికీ మిగిలే ఉన్నాయే, వాడుకోటానికి. అదీ అక్షరం! ఇక సంస్కృతంలో ఎన్ని అక్షరాలు ఉన్నాయని అడిగితే ఎవరూ చెప్పగలరని నేను అనుకోను. English లో ఎన్నని అడిగితే చెప్తాం అంటారు. పోనీ ఇంగ్లీష్ అక్షరాలో, తెలుగు అక్షరాలో, హిందీ అక్షరాలో, సంస్కృతం అక్షరాలో ఏవైనా అయిపోడం లేదు కదా! ఎన్ని పుస్తకాలు అచ్చు వేసేసాం! భయంకరంగా పుస్తకాలు అచ్చు వేస్తున్నాం కదా, అయినా అయిపోయినాయా? అయిపోవే! మళ్ళీ వాడడానికి ఉన్నాయి. నువ్వు ఎంతవాడినా అవి ఉన్నాయండి. మరి అవి కూడా అవ్యయమే! అవ్యయతత్త్వం అలా చెప్పుకుంటూ పోతుంటే చాలా వస్తుంది. అక్షరం అన్నా కూడా అదే! అక్షర లో ఇంకో భావం ఉంది, ఇదొక్కటే కాదు. అది అవ్యయం కదా. మరి అవ్యయం చెప్పినప్పుడు ఇది చెప్పేయవచ్చు కదండీ మళ్ళీ అక్షర నామం ఎందుకు? 'అక్ష' నుంచి కొనిరాబడినది అక్ష "ర". అక్షముగా కొనిరాబడినది. అంటే, కేంద్రము నుంచి పరిధికి. చాల మహత్తరమైన విజ్ఞానం. దాన్నే Pi అంటారు. Pi ని Greek భాషలో 'పి' అంటారు. English వాళ్ళు Pi ని పై అంటే మనం కూడా పై అంటున్నాం. ఆయన పైథాగొరస్ కాదు, Greek భాషలో పిథాగొరస్! అక్కడికి వెళ్తే వాళ్ళు చెప్పారు. ఈ పైథాగొరస్ అని అనటం మీరేనా మానేయండి అని. అదేంటి అంటే అది పిథాగొరస్ అన్నారు. ఆ English వాళ్ళు మన పేర్లూ చాల మార్చారు కదా. అందుకని వాళ్ళవీ మార్చేశారు. Mumbai ని Bombay చేసారు. వాళ్ళ ఇష్టం వచ్చినట్టు. Roma అనే నగరాన్ని Rome చేసారు. ఇట్లా అన్ని మార్చారు. అది వాళ్ళ బుద్ధి. అందుచేత ఇది "పి", ఏమిటదీ? కేంద్రము నుండి పరిధికి. కేంద్రము ఏమిటి? పరిధి ఏమిటి? సృష్టి కేంద్రం నుంచి సృష్టి పరిధికి. అది తెలిస్తే నీకు, వాడు ఏమిటో తెలుస్తుంది. అసలు అట్లా ఆ కేంద్రం ఎట్లా ఏర్పడింది, ఈ పరిధి ఎట్లా ఏర్పడింది? ఈ కేంద్రము నుంచి

పరిధికి ఉన్న విలువ ఏమిటి? ౨౨/౭ అంటాం. కాదు. ౨౧ plus something which is less than one, more than zero అది. Divided by seven అంటే ఏడు లోకాలు, మూడు గుణాలు. ఇరవై ఒకటి. మించి ఒకడు ఉన్నాడు. వాడూ సున్నా కాదు, అలా అని ఒకటీ కాదు. వాడినే పట్టుకొచ్చి ఇన్ని లోకాలలోను పంచుకుంటే ఇదంతా అయ్యిందదండీ. అక్షముగా కేంద్రము నుండి పరిధి వరకు వాడే వ్యాపనము చెందాడు. అట్లా వ్యాపనము జరిగేటట్లుగా అయన సంకల్పము చేసాడు. సహకరించాడు. దేవతలు ఇదంతా నిర్మాణం చేసారు. అదీ అక్షర! అక్షరాభ్యాసము ఎందుకు చేస్తాం? ఈ జ్ఞానం కోసం! పూర్వ కాలంలో వాళ్ళు అక్షరాభ్యాసం అట్లా చేసేవారు. అందుకనే 'ఓం నమః శివాయ' అని మొదలు అవుతుంది. నేను లేను, శివుడే ఉన్నాడు, అతడే ఓం, అని చెప్పే మంత్రం అది. ABCD లు కాదు. 'ఎ' పదం ఎప్పుడు వస్తుంది సంస్కృతంలో? అ ఇ ఉ తరువాత వస్తుంది ఎ. కదా! అ ఆ ఇ ఈ ఉ ఊ, ఎ ఏ అంటే మొదటి మూడు అయిపోయినై ముఖ్యమైనవి. అ అంటే 'నేను'అని చెప్పాడు భగవంతుడు భగవద్గీతలో. అక్షరంలో అ 'నేను' అన్నాడు. నువ్వు 'అ 'అయితే నేను 'ఇ 'అంది అమ్మవారు. నువ్వు అ తీసుకున్నావు కదా, నేను ఇ తీసుకుంటాను. అందుకనే 'తాం పద్మినీం,ఈం శరణమహం ప్రపద్యే'! 'ఈం' అనేది అమ్మవారి బీజాక్షరం. పార్వతి, లక్ష్మి, సరస్వతి అన్నీ 'ఇ' వే! సి. వి. వి.! ఎన్ని ఉన్నాయి ఇందులో! అది మనకి తెలియనటువంటి శ్రీవిద్య! మనకు తెలియనివి చాల ఉన్నాయి. అట్లా 'ఇ' కారం అమ్మవారు. 'అ'కారం అయ్యవారు. 'ఉ'కారం గురువు. ఈ ముగ్గురు అయిపోయిన తరువాత మిగిలినది పట్టుకుపోయాడు వాడు. ఏదీ? ఎ! ఏమిటీ 'ఎ'? వ్యాకరణం తెలియాలి. అ + ఇ = ఎ. అదే కదా మరి సంధి! అకారమునకు ఇకారము తోడైనప్పుడు ఎకారం వచ్చును. చిన్నప్పుడు ఏడుస్తూ నేర్చుకున్నాం కాబట్టి మనకి ఏమి తెలీదు. ఇప్పుడు ఏడవకుండా నేర్చుకుంటే అందులోంచి చాల విజ్ఞానం వస్తుంది. వ్యాకరణం వేదానికి ఒక తాళం చెవి. వేదాంగం! అందుకని అమ్మ, అయ్యా కలిసింది ఎ పట్టుకుపోయాడండి. A తో మొదలు పెడతాడు. ఏ భాషా భూమి మీద 'ఎ' తో మొదలు అవదు. English ఒక్కటే! మిగతా భాషలన్నీ అకారంతోనే మొదలు అవుతాయి. అ కారం నుంచి హ కారం వరకు. మన చివరి అక్షరం ఏమిటి? క్ష. ఇందులో మొత్తం సృష్టి అంత ఉన్నది. ఇక్కడ నుంచి మొత్తం పాదాల వరకు. సంస్కృత భాషలో ఉండే అక్షరాల అమరిక మనలో ఉండే శరీర

నిర్మాణం, సృష్టి నిర్మాణాన్ని వివరించగలిగే పద్ధతులలో ఏర్పాటు చేసి ఇచ్చారు. అందుకే దేవ భాష! కాబట్టి, అక్షము నుంచి పరిధి వరకు అట్లా సృష్టి అంతా ఉన్నది. ఈ 'పై' జ్ఞానం చాల పెద్ద విజ్ఞానం. దాని యొక్క సంకేతము కూడా రెండు నిలువు గీతలు మీద ఒకటి అలా అడ్డంగా వేస్తారు . అంటే అలా ఒక గంధర్వ తరంగం ఉంటె, అందులోంచి ప్రకృతి-పురుషులు రెండుగా దిగి వచ్చి ఇదంతా అల్లిందని చెప్పే ఒక సంకేతము అది. దాని కింద కూడా అలా వేస్తె జ్యోతిషంలో మిథున రాశి అయిపోతుంది. ఈ రెండూ రెండు pillars ట. పురుషుడు ప్రకృతి అనే రెండు స్తంభాల పై మొత్తం దేవాలయం అంతా నిర్మాణం చేసారుటండీ. ఆ రెండిటి లోంచి వెళ్ళి ఆ పైన ఉండే గంధర్వ లోకం చేరుకుంటారుట. గంధర్వ లోకం అంటే సృష్టికి అతీతమైన లోకం అది. అక్కడ నుంచి ఇక్కడ వరకు ఉండే కథ అంతా కూడా 'అక్షర' లో ఉంది. అక్షముగా కొనియాడబడిన వాడు. అంటే కేంద్రము నుంచి పరిధి వరకు, మన భూమి వరకు. ఎక్కడ నుంచి? సృష్టి కేంద్రం నుంచి. ఇన్ని లోకాలలోను ఆయన వ్యాపనము చెందితేనే కదా ఇవన్నీ ఉన్నాయి. ఆ విధంగా ఆయనని తీసుకు వచ్చేసారుట. ఆయన అంతటా, పరిధి వరకు వ్యాపించి ఉన్నాడుట. అందుకని ఎక్కడికో వెళ్ళనక్కర్లేదు ఆయన కోసం. ఇక్కడే, ఇప్పుడే అనుభూతి చెందవచ్చు. Here and Now అని ఒక సిద్ధాంతం ఉంది కదా! ఈ విధంగా వ్యాపనం చెందిన తత్త్వం అక్షర తత్త్వం. అక్షరము అంటే క్షరము కానిది. అది అ+క్షర. అక్ష+ము. అక్షము. వేదవ్యాసుడు అదే! కేంద్రము నుండి పరిధి వరకు ఉండే సమస్త జ్ఞానాన్ని అందించిన వాడు. వ్యాసము, వ్యాసార్ధము చదువుకుంటాం కదా మనం Geometry లో. వ్యాసం అంటే? పరిధికి ఆ చివరి నుంచి ఈ చివరి వరకు. వ్యాసార్ధము అంటే? అక్షం. మరి మొత్తం అక్షముగానే ఇవన్నీ వచ్చినాయి. 360 అక్షాలుగా ఓ సంవత్సరం వచ్చింది. 360 అక్షాలుగా ఒక గోళం వచ్చింది. చాల మహత్తరమైన విజ్ఞానం-- అక్షర విజ్ఞానము. ఏది ఏమి అయినప్పటికీ తెలుసుకోవలసిన ఒకే ఒక సూత్రం ఏమిటంటే, అక్కడ మొదలు పెట్టిన వాడు ఇక్కడ వరకు అంతటా తానే వ్యాపించి ఉన్నాడు. ఎక్కడా లేకపోవటం లేదు. అందుకని సూర్య కిరణం కూడా అక్షరమే! సూర్యుని నుండి కిరణం అక్కడ నుంచి ఇక్కడ వరకు ఉంటే, ఇక్కడ నుండి అక్కడ వరకు లేకపోవడం లేదే! పోనీ అక్కడా ఉంది, ఇక్కడా ఉంది అంటే కాదు. దారి అంతా కూడా ఉంది సూర్య కిరణం. మధ్యలో ఎక్కడైనా తెగిందా? మనం చూడండి తిరుపతిలో ఉంటె విశాఖపట్నంలో ఉండం.

విశాఖపట్నంలో ఉంటె తిరుపతిలో ఉండం. ఇక్కడ ఉండి విశాఖపట్నం విషయాలు ఆలోచించుకోవచ్చు. Cell phone చేసుకోవచ్చు. దారంతా ఉన్నామా? లేదు. కానీ ఆయన అట్లా ఉన్నాడు. అదీ ఆయన వ్యాపన శక్తి. అదీ ఆయన మహత్తరమైనటువంటి విషయం. అదీ అక్షరం! కాబట్టి అతడు అక్షరముగా సమస్తము వ్యాపించి ఉన్నాడు. అతడిని ఆరాధన చేసిన వాడికి ఈ మార్గం ద్వారా అంటే 'కిరణ మార్గం', దాన్నే 'అర్చిస్ మార్గం' అంటారు, 'వెలుగు మార్గం' అంటారు. ఆ మార్గంలో అన్ని వాడే చూపించి తీసుకు పోతూ ఉంటాడు. ఆ మార్గం లోనే వీళ్లంతా ఉన్నారుటండీ. ఎవరు?

'గురుభ్యో నమః పరమ గురుభ్యో నమః పరమేష్ఠి గురుభ్యో నమః,

శుక, వ్యాస, నారద '

ఇవన్నీ చెప్తామే ఈ మహాత్ములందరూ, సద్గురువులందరూ, వారి పరంపరంతా కూడా ఈ మార్గం అంతా వ్యాపించి ఎక్కడికక్కడ జీవుడు ఉత్సాహంతో దైవము గురించి తెలుసుకొనే ప్రయత్నంలో వెళుతుంటే, కనిపించి వాళ్ళు ఇట్లా వెళ్ళు నాన్న, అట్లా వెళ్ళు నాన్న అని చెప్తూ ఉంటారుట. The Masters of Wisdom pervade the Path. ఈ వాక్యం మనకి పెళ్లి మంత్రాలలో వస్తుంది తమాషాగా. చాల ఆశ్చర్యంగా ఉంటాయి మన సంస్కారాలు, క్రతువులు చూసి అర్థం చేసుకోవటం మొదలు పెడితే. ఈ మొత్తం మార్గంలో ఉండే సమస్త సద్గురువులు ఆశీర్వదించడానికి రావాలని ఆహ్వానం చేస్తాడు బ్రహ్మగారు. మనకి ఏం తెలుసు? ఓ Newspaper పట్టుకు కూర్చుంటాము కబుర్లు చెప్పుకుంటూ. చంద్రబాబు నాయుడు ఇట్లా అన్నాడు, వాజపేయి అట్లా అన్నారు అంటూ. అక్షింతలు కూడా వేయరు. ఈ మొత్తం వెలుగు మార్గాన్ని ఆశ్రయించిన వారు పరమ గురువులు ఉన్నారు. వాళ్ళు నడిపిస్తారు. ఈ మార్గం అంతా ఎవరు? అతడే! అందుకనే 'నేనే మార్గం' అని అన్నాడు యేసు క్రీస్తు. అంటే అర్థం ఏమిటి? ఆ 'నేను' ఏ 'నేను' గురించి చెప్పాడు? ఈ విశ్వం అంతా వ్యాపించి ఉన్న ఆ నేను గురించే చెప్పాడు. భగవద్గీతలో కూడా ఆ నేను గురించే చెప్తాడు శ్రీకృష్ణుడు. కాబట్టి ఆ 'నేనే', మార్గం కూడా అతడే! సద్గురువులు అతడే! నీలో నేనే ఉన్నాను ఇన్ని రకాలుగా అని చెప్తాడు కదా భగవద్గీతలో అందుచేత, అది అక్షరం. అందుచేత, ఏవ చ - అంటే అయ్యి ఉన్నాడు కూడా అని!.

## 19. యోగః

యోగము అనేది భగవంతుని నామములలో ఒకటి. ఈ రోజులలో ఈ పదం మనం చాలా ఎక్కువగా వింటూ ఉంటాం. English dictionaryలో కూడా ఈ పదాన్నిప్పుడు చేర్చటం జరిగింది, Yoga అని. భగవంతుడిని అవగాహన చేసుకోవటమే యోగాన్ని అవగాహన చేసుకోవటం. భగవంతుడే యోగము. ఎలా భగవంతుడు యోగం? అని మనం ఆలోచించినట్లయితే, యోగం అనే స్థితియందు ఈ మొత్తం సృష్టినంతా ధరించి ఉంటాడు భగవంతుడు. ఉదాహరణకి, ఏ బలమ్మీద ఈ భూమి చోటులో ఇట్లా suspend అయి ఉంది? ఏ బలం చేత, మిగతా గ్రహాలు, భూమి, ఇవన్నీ సూర్యుడు కేంద్రంగా చోటులో ఉన్నాయి? భగవంతుని యొక్క యోగబలం అని చెప్పుకోవాలి. లేకపోతే ఉండటానికి అవకాశం లేదు. కలిసి ఉండటం అనేది మనం, ప్రత్యేకించి ప్రయత్నం చేస్తూ ఉంటాం. కలిసి ఉండటమనేది, సృష్టిలో ఒక సహజమైన గుణం. ఆ కలిసి ఉండటంలో మనం గమనించినట్లయితే సూర్యుడి చుట్టూ గ్రహములన్నీ కలిసి ఉన్నాయి. ఏ గ్రహానికి ఆ గ్రహం విడిగా కాకుండా, అన్నీ సూర్యుని చుట్టూ కలిసి ఒక సౌరకుటుంబంగా ఉన్నాయి. ఈ కలిసి ఉండటానికి ఏది ఆధారమో, దాన్ని యోగం అంటారు. ఈ కలిసి ఉంచే తత్త్వాన్ని, యోగం అంటారు. భూమి మీద మనకి మూడువంతులు జలం, ఒకవంతు భూమి ఉన్నప్పటికీ కూడా, జలం, భూమిని పట్టుకుని ఉన్నది కదా! కేంద్రాన్ని పట్టుకుని జలం ఉండటం కన్నా అద్భుతమైన విషయం మనం వేరే ఏమీ చూడక్కర్లేదు. మనమంతా ప్రయత్నం చేసి చూడచ్చు. జలాన్ని ఉంచాలంటే ఒక ఆధారం కావాలి. ఇక్కడ జలానికి కేంద్రములో ఆధారం తప్ప, భూమి చుట్టూ ఉండే నీళ్లలో బహిర్గతంగా ఆధారం ఏమీ లేదు కదా! చోటులో గుండ్రంగా భూమి ఉంటే, అందులో మూడువంతులు జలం ఉన్నప్పుడు, దక్షిణంగా కూడా జలం ఉన్నప్పుడు, ఆ జలం కిందకి కారిపోవాలి కదా. కారిపోవట్లేదు కదా. ఏమిటి పట్టి ఉంచింది? ఏమిటా పట్టి ఉంచిన బలం? అలాగే, కిందభాగంలో ఉండే భూమి పెళ్లగా ఊడిపోయి చోటులో పడిపోవాలి కదా. పడిపోకుండా ఏది పట్టి ఉంచింది? ఆ బలమేమిటి? అది, యోగం! అలాగే Northern hemisphere కాకుండా Southern hemisphere లో, అంటే దక్షిణ

భూభాగంలో ఉన్న జీవరాశులన్నీ కూడా చోట్లోకి పడిపోవాలి మామూలుగా. పడిపోకుండా భూమినే అంటిపెట్టుకుని ఉన్నాయి కదా! ఏ బలం ఆధారం చేత అంటి పెట్టుకుని ఉన్నాయి? భూమి, నీరు, భూమ్మీద ఉన్న జీవులు, గుండ్రంగా గోళాకారంగా ఉన్న భూమి మీద, విపరీతమైన వేగంతో తిరుగుతున్న భూమి మీద జీవులు పడిపోకుండా ఉండటానికి ఏది బలం? అదీ భగవంతుని యొక్క యోగబలం! ఇట్లా భూమి, భూమి మీద ఉన్న జీవరాశులే కాకుండా, మిగతా గోళములు, వాటి మీదున్న జీవరాశులు, అంతే కాకుండా, పరస్పరంగా ఒక గ్రహమునకు, ఒక గ్రహమునకు మధ్య ఉండే ఆకర్షణ శక్తి , లేక కలిసి ఉండటం, అట్లా సౌరకుటుంబమంతా ఎలా నిలబడి ఉన్నదంటే అది భగవంతుని యొక్క యోగమునకు తార్కాణం. అంతకన్నా అద్భుతమైన విషయం మనకి వేరే ఏమీ గోచరించదు. ఇవన్నీ ఒక సౌర కుటుంబము గురించే మనం ఆలోచిస్తున్నాం. ఇటువంటి సౌర కుటుంబములు మనకి లెక్కకు తెలియనన్ని ఉన్నాయని చెప్పి పెద్దలు మనకి చెప్పి ఉన్నారు. మనం చూసేటి సప్తర్షి మండలము, కృత్తికా మండలము, దత్తాత్రేయ మండలము- ఇలా చాలా మండలాలున్నాయి. వీటన్నిటిలో కూడా ఉన్న సౌరకుటుంబములన్నీ కూడా ఏ విధంగా నిలబడి ఉన్నాయి, ఏ ఆధారం లేకుండా? ఏ ఆధారం లేకుండా, అని మనం అనుకుంటున్నామే, అదే అసలైన ఆధారం. మనకది కనిపించకపోవటం వలన, లేదని మనం అనుకుంటున్నాం. కానీ, ఉన్నదది. అది ఉండటం వలన ఈ మొత్తం అన్నీ దానిమీద తేలుతూ ఉన్నాయి. కాబట్టి అది బలంగా ఉంటుంది. ఆ విధంగా మొత్తం ఇన్ని వందల సౌర కుటుంబములతోను, వాటి మీద ఉన్న జీవరాశులతోనూ కూడిన సృష్టిని, తన యోగము చేత భగవంతుడిట్లా నిలబెట్టి ఉంచాడన్నమాట. అది భగవంతుని యొక్క యోగ బలం, లేక యోగము అనే భగవంతుని యొక్క సృష్టి! మనలో కూడా మనం ఆలోచించుకున్నట్లయితే- ఎందుకంటే ప్రతి విషయం ఆపాదించుకుని చెప్పకోకపోతే మనకంత అనుభూతి చెందటానికి అవకాశం లేదు. బ్రహ్మాండము, పిండాండము వీటి సమన్వయంలో అవగాహన ఎక్కువ ఏర్పడుతుంది - మనలో కూడా చాలా ఉన్నాయి. భూమి కేంద్రంగా భూమి చుట్టూ జీవరాశులుంటే, అలాగే మనం ఆధారంగా అంటే ప్రతి ఒక్కరూ నేననుకుంటాం, కాబట్టి ఈ నేను నాధారంగా చేసుకుని ఈ దేహం మీద చాలా ఉన్నాయి. నేను ఉన్నంతసేపూ ఈ దేహంలో దేహాన్నంటి పెట్టుకుని ఉంటాయి, నేను కనుక వెళ్లిపోయినట్లయితే దేహం నించి

ఇవన్నీ కూడా తప్పుకుంటాయి. నేను వెళ్ళిన తరువాత, వేటికవిగా అవి విడిపోతూ ఉంటాయి. నేను ఉన్నంతసేపూ కలిసి ఉంటాయి. ప్రతివాడూ అట్లాగే అనుకోవాలి. మనం ఉన్నంతసేపే కదా మనలో ఉన్న ప్రాణ ప్రవృత్తులు, మనలో ఉన్న పంచభూతములు, మనలో ఉన్న పంచేంద్రియములు, మనలో ఉన్న కర్మేంద్రియములు! ఇవన్నీ ఎవరి ఆజ్ఞ చేత మనలో పని చేస్తున్నాయి? మనమనే అనుకుంటూ ఉంటాం. మనముండబట్టి, మన కాళ్ళూ చేతులూ ఆడుతున్నాయి. మనముండబట్టి మనం తలకాయ ఊపుతున్నాం. మనం ఉండబట్టి మన పంచేంద్రియములు పనిచేస్తున్నాయి. మనం ఉండబట్టి పంచభూతములు పని చేస్తున్నాయి. మనం ఉండబట్టి మనలో ఉన్న కాలేయము, గుండె, ఊపిరితిత్తులు, ఇటువంటివన్నీ పని చేస్తున్నాయి. మనం అనుకుంటాం, మనం మొత్తం అంతా ఒకటే అనుకుంటాం. ఒకటి కాదు. ఇది చాలా పెద్ద group living. ఒక human bodyని తీసుకున్నట్లయితే, it is a concept of mysterious group living. ఇందులో, దేని వయసు దానికున్నది. ఒక్కొక్కటి, ఒక్కో సమయంలో ఇంక పనిచేయటం మానేయటమనేది జరుగుతుంటుంది కదా. లోపలున్న ఈ ప్రజ్ఞలన్నిటికీ ఒకే lifespan లేదు. కొంతమందికి ఇకనించి మీ కాలేయం కొంచెం సరిగా పని చేయట్లేదండీ, అంటారు. లేకపోతే మీ పిత్తాశయం పని చేయట్లేదంత బాగా. జీర్ణకోశం పనిచేయట్లేదు. ఇంకొకళ్ళకి కీళ్ళు కొంచెం ఇక పని చేయవండీ, మీకట్లా వంగవు, అట్లాగే పడుండాలి, అని చెప్తారు. ఇంకొంత మందికి పళ్ళు. మనం పోయే ముందే మన పళ్ళు పోతూ ఉంటాయి. అట్లాగే మనముండగానే అద్దంలో చూసుకుంటూ వుండగానే మన జుట్టు ఊడిపోతుంది. ఇవన్నీ మనలో ఉండే భాగములు. భాగములు పోయినా, మనముంటాం కదా. ఇప్పుడొక పన్ను పీకేశారనుకోండీ, మనం ఉండటం లేదా? ఒక కాలు తీసేశారు, ఉంటున్నాం కదా. Accident అయింది, కన్ను పోయిందిట పాపం, ఎలా ఉన్నాడంటే, ఉన్నాడు. ఒక చెవి వినపడటం లేదుట, అంటే భాగములు పోయినప్పటికీ మనం ఉండే పరిస్థితి మనకి అవగాహన అవుతోంది కదా. భాగాల్లేకపోయినా తను ఉంటాడు. అంటే 'నేను' ఉంటాడు. నేను ఈ భాగములన్నిటితో కూడి ఉన్నప్పుడు, యోగ స్థితి అంటారు. యోగ స్థితిలో నిలబడి ఉన్నప్పుడు, అన్నీ కూడా, మనలో ఉండే నేను అనే తత్త్వాన్ని ఆధారంగా చేసుకుని ఇవన్నీ కలిసి ఉన్నాయి. మనలో ఉన్న 'నేను తత్త్వం' కనుక జారిపోయిందనుకోండి, అప్పుడు కాలేయం, జీర్ణకోశం, రెండిటి మధ్య

అనుసంధానం ఏమీ ఉండదు. ఊపిరితిత్తులు, గుండె కొట్టుకోవటం, వీటి మధ్య అనుసంధానం అనేది ఉండదు. మెదడుకీ, అవయవాలకి coordination ఉండదు. ఈ coordination అంతా ఎక్కడనుంచి వస్తోందంటే నేనుగా యోగ స్థితిలో ఉండటంబట్టి. మనమెవరం? ఇప్పుడు నేను చెప్పిన భాగాలేవీ మనం కాకపోయినప్పటికీ, ఇన్ని భాగాల్లోనూ మనం పని చేస్తూ ఉంటాం. నువ్వు కాలేయమా అంటే నేను కాలేయమెట్లా అవుతాను? అని మనకే ప్రశ్న వస్తుంది కదా సహజంగా. కానీ వీటన్నిటి ద్వారా మనం వ్యక్తమవుతూ ఉంటాం. మనంగా ఉంటూ ఉంటాం. మనంగా ఎప్పుడూ ఉండబట్టి, ఇవన్నీ పని చేస్తున్నాయి అనేది మనకి గమనికకి వస్తుంది కదా! చచ్చిపోయినవాడికీ, బతికున్న వాడికి ఏమిటి తేడా? ఏమిటట్లా పడున్నాడంటే, వాడు పోయాడని చెప్తారు. పోయాడంటే? పోయిన వాడెవడు? పోయిన వాడు మనకి కనపడతాడా? వాడు ఉన్నాడు, వాడు పోయాడు అన్నదానికి తేడా అవగాహనకి తెలుస్తుంది కానీ, చూడటానికి కనపడని స్థితి. కొంత కొంత మందికి ఒక స్థితిలో జీవుడు వెళ్తూ ఉంటే కనిపిస్తూ ఉంటారు. దేహంలో ఉన్న జీవుడిని కూడా గమనించే స్థితి ఉన్నది. ఈ విధంగా మనం ఉండబట్టి మనలో ఉన్న సమస్త అవయవములు ఏ విధంగా యోగస్థితి చెంది, ఒకదానికొకటి సహకరిస్తూ పనిచేస్తున్నాయో, అదే విధంగా సృష్టిలో కూడా ఇన్ని రకములైన గ్రహగోళాదులన్నీ కూడా అవి పని చేయటమే కాకుండా మిగతావాటితో సహకరించి, సమన్వయించుకొని, పని చేస్తూ ఉండేటి స్థితి ఒకటి ఉంది. అది సృష్టిలో ఉన్నది కాబట్టి మనలో ఉన్నది. సృష్టిలో లేనిదేదీ మనలో ఉండటానికి అవకాశం లేదు. ఆ స్థితియందు ఎవరైతే ఉంటారో, వారిని యోగులంటారు. యోగంలో, యోగస్థితి చెందిన వారికి, సమస్తమునందు ఉన్న జీవప్రజ్ఞ యొక్క అనుభూతి కలుగుతూ ఉంటుంది. అంటే ఎదుటి మనిషిలో ఉన్న అవగాహన దగ్గరనుంచి, బాధల దగ్గరనించి, ఇతనికి కూడా అవి గోచరం అవుతాయి లేక అనుభూతికి అందుతాయి. ఆ విధంగా ఉంటారు. మనలో మనకి బొటనవేలు దగ్గరనించి తలవరకు ఉన్న మొత్తం శరీర భాగాల్లో ఎక్కడ ఏ విధమైన discomfort వచ్చినా, లేక ఒక దోమ కుట్టినా, ఒక ఈగ వాలినా, ఒక చీమ కుట్టినా, మనకి తెలుస్తుంది, కదా! ఎందుకు తెలుస్తుందంటే, ఈ మొత్తం శరీరం అంతా మనం వ్యాపనం చెంది ఉన్నాం కాబట్టి. అదే విధంగా యోగేశ్వరుడైన వాడికి ఈ సమస్త సృష్టిలో ఎక్కడ ఏం జరుగుతోందో, ఎక్కడ ఏ విధమైన ఈగ

వాలుతుందో, దోమ కుడుతుందో, చీమ కుడుతుందో, అవన్నీ గమనికకి వస్తాయి. అతనినే యోగేశ్వరుడు అంటారు. మనవరకు మనలో సమస్తమూ మనకి ఏ విధంగా అవగాహనకు వస్తుందో, అలాగే పరిసరముల యందున్న జీవరాశుల్లో ఉన్న మెళకువలు, స్థితిగతులు కూడా అవగాహనకు రావటం అనేది యోగ స్థితి యందు ఏర్పడే ఒక వ్యాపనము చెందిన చైతన్యము యొక్క స్థితి. మనము సహజంగా చైతన్య స్వరూపులమైనప్పటికీ కూడా, ఎంతసేపూ మనం ఈ దేహంలో ఉన్నాం అనుకుంటూ ఉంటాం. అదే మనం చేస్తున్న మొదటి పొరపాటు. దేహంలో మనం లేము, దేహం మనని అంటిపెట్టుకుని ఉంటుంది. మనలో దేహం ఉన్నది అని గుర్తు ఉన్నవాడు, దేహముయొక్క పరిమితి దాటి వ్యాపనము చెంది ఉండటానికి అవకాశం కలిగి ఉంటాడు. దాన్నే వారిని దేహము ధరించిన వారంటారు. మనం దేహమును ధరించిన వారమైనప్పటకీ కూడా దేహమునందు జీవించుచున్నట్టి వాళ్ళంగా గమనించుకుంటూ ఉంటాం కాబట్టి, 'యద్భావం, తద్భవతి' అనే పద్ధతుల్లో, ఆ ధర్మం ప్రకారం లోపలెక్కడో మనం ఇరుక్కుని బాధపడుతూ ఉంటాం. మనయందు దేహముంది అన్నదానికీను, దేహమందు మనమున్నాం అన్నదానికి, ఎంత తేడా ఉందంటే, నదిలో చెంబు ఉన్నది, చెంబులో నది ఉన్నది. చెంబులో నదా మనం? లేక చెంబుకి అతీతంగా ఉన్న నదా మనం? చెంబులో ఉన్న నదికి ప్రవాహం అనే ప్రక్రియ ఉండదు, వ్యాపనము అనే ప్రక్రియ ఉండదు. అలాగే ఈ దేహంలో నేనున్నాను అనుకునేవాడు అంతవరకే మేకులు కొట్టేసుకుంటాడు. పరిమితత్వం మనం ఏర్పరుచుకున్నదే తప్ప, అక్కడ ఉన్నది కాదు. కాబట్టి మనముగా మనని మనం ఆలోచించుకున్నప్పుడు, కేవలం ఈ దేహం వరకే పరిమితం చేసుకుంటే ఏమవుతుందంటే, ఈ దేహంలో by self proposition బందీ అయి ఉంటాం. ఇల్లు కట్టుకుని, ఇంట్లో ఉండటం నేర్చుకున్నామనుకోండి, ఇల్లు కట్టుకుని ఇంట్లో ఉండేవాళ్లు ఎప్పుడూ ఇంట్లోనే ఉంటారా? బయట పనులు కూడా చూసుకుని ఇంటికొస్తూ ఉంటారు కదా. కారు కొనుక్కొని కారులో తిరిగేవాళ్లు ఎప్పుడూ కార్లోనే ఉంటారా? అవసరమైనప్పుడు కార్లో ఎక్కి, పనులైపోయిన తరువాత కార్లోంచి బయటికొచ్చేస్తారు కదా. కారు మనకున్నంత మాత్రాన, ఎప్పుడూ కార్లోనే వుండక్కర్లేదు కదా. ఇల్లు మనకు ఉన్నంత మాత్రాన ఎప్పుడూ మనం ఇంట్లో ఉండక్కర్లేదు కదా. అదే విధంగా శరీరం మనకున్నంత మాత్రాన ఎప్పుడూ శరీరంలో మనం ఉంటున్నాం అని అనుకోవటం

అనేది, నిజమైన విషయం కాదు. కానీ మనం ఏర్పరుచుకున్న concretized view లేక కరడు కట్టిన ఒక భావం, మనని దీనికి మించి ఆలోచించనివ్వదు. ఈ శరీరం లోనే మనం ఉన్నాం అనే స్థితిని దాటి ఆలోచించనివ్వదు కాబట్టి, ఆలోచన ఉండదు కాబట్టి, పరిమితత్త్వంలో మనకిగా మనం by proposition ఖైదీ అయి ఉండిపోతాం. యోగులనే వాళ్ళు ఆ విధమైన పరిమితత్త్వంలో ఉండక, అవసరమైనప్పుడు దేహము నుంచి పని చేస్తూ ఉంటారు, అవసరం లేనప్పుడు దేహాన్నట్లా ఉంచి, వారు పరిభ్రమిస్తూ ఉంటారు, పరివర్తిస్తూ ఉంటారు. ప్రవర్తిస్తూ ఉంటారు. ఈ విధంగా అక్కడ ఉన్నా ఇక్కడ విషయాలు గమనించినట్లు, ఇక్కడ ఉన్నా అక్కడ విషయాలు గమనించినట్లు, దేహాన్నక్కడ ఉంచేసి, ఏవేవో కార్యక్రమాలు చేసి ఆ దేహంలోకి వచ్చినట్లు, ఇటువంటివన్నీ మనం ఎరిగిన యోగి చేస్తూ ఉంటే, చూసి ఆశ్చర్యపడుతూ ఉంటాం. ఆయనకీ, మనకీ తేడా ఏంటంటే, ఆయన, తను పరిమితుడను కాదు అనే సత్యమును గ్రహించినవాడు. మనము, పరిమితులము అనే దృష్టిని బాగా ధృఢపరచుకుని, దానినుంచి విముక్తి పొందటానికి ఏ మాత్రమూ ప్రయత్నం లేకుండా జీవించే వాళ్ళం. కాబట్టి విముక్తి ఉండదు. నిజానికి మనం ప్రతినిత్యం బయటికి వెళ్ళి వస్తూనే ఉంటాం. అవసరమైనప్పుడు దేహం నించి పని చేస్తూ ఉంటాం, అవసరం లేనప్పుడు దేహానికి, మనకి ఒక విధమైన సూత్రాన్ని ఉంచుకుని, బాహ్య ప్రపంచంలో తిరిగి వస్తూ ఉంటాం. ఇది మనకి నిద్రలో జరుగుతూ ఉంటుంది. పగలు మనం జరగనివ్వం కాబట్టి, నిద్రలో మనని కాస్త నువ్వట్లా షికారు వెళ్ళిరారా, నీ దేహాన్ని మరమ్మత్తు చేస్తాం, అని చెప్తుంది అమ్మవారు. మనం కారెప్పుడూ వాడుతున్నామనుకోండి, ఆ కారు బాగా పాడైపోతూ ఉంటుంది. కాసేపు కారిక్కడ పెట్టి మీరాట్లా వెళ్ళిరండి సార్, నేను బాగుచేసి పెడతాను, అని mechanic చెప్పినట్లు అన్నమాట. ప్రతిరాత్రి మనకి జరిగే కార్యక్రమం అదే! బయటికి వెళ్తాం, దేహానికి మరమ్మత్తులు జరుగుతాయి. మళ్ళీ పొద్దున్నే అందులో మేల్కొంచుతాం కాబట్టి, రాత్రి పడుకున్నప్పుడు ఉండే దేహ స్థితికినూ, పొద్దున లేచినప్పుడు ఉండే దేహ స్థితికి, చాలా వ్యత్యాసం కనిపిస్తుంది మనకి. అలసిపోయిన దేహం పొద్దున పువ్వువలే చాలా fresh గా అనిపిస్తుంది. మళ్ళీ పనుల్లోకి దిగుతాం. మధ్యాహ్నానికి కొంచెం మళ్ళీ dull అవుతుంది, రాత్రి పూర్తిగా dull అయిపోతుంది. మళ్ళీ పడుకుంటే, మళ్ళీ మర్నాటికి దాన్ని చక్కగా తయారు చేసి ఇస్తారు. ఇదంతా ఎందుకు

జరుగుతుందంటే మనం ఎప్పుడూ దేహంలో ఉండం కాబట్టి. దేహంలో నిజానికి మనం ఉండం, దేహం మనలో ఉన్నది. మనమే దేహాన్ని నిర్మాణం చేసుకుని, అందులో ఉంటున్నాం. ఇల్లు కట్టుకుని ఇంట్లో ఉండడం లేదండీ! ఇల్లు కట్టుకోక ముందు ఇల్లెక్కడ ఉంది? నీలో ఉంది ఇల్లు. మీరుండబట్టి, మీలో చిన్న ఇల్లు ముందు భాసిస్తుంది. కళ్ళు మూసుకుంటే నుదురు వద్ద , ఇట్లా ఉంటే బావుండు ఇల్లు అని ఆలోచించుకుంటాం కదా. అప్పుడది ఎంతిల్లు? అంతా కలిపితే, నీ నుదురు వైశాల్యం కన్నా పెద్దదిగా ఉండదు. అక్కడనించి నెమ్మదిగా మనం దాన్ని కాగితం మీదకి, ఇటుక మీదకి, cement మీదకి తెచ్చేసరికి పెద్దదైపోతుంది. ఇల్లు మీలోంచి వ్యక్తమై బయటికొచ్చిన తరువాత మీరుకూడా ఇంట్లో ఉంటున్నారు. అంతమాత్రం చేత ఇంట్లో మీరు బందీ అయి ఉన్నారా? అట్లాగే ఒక కారు, ఏ వాహనమైనా! శరీరం కూడా వాహనమే, కాబట్టి మననించి వ్యక్తమైన దాంట్లో మనం ఉంటూ ఉన్నప్పుడు, దానియందే మనం అహర్నిశలు ఉంటున్నామనుకోవటం అజ్ఞానం. ఉండం. వెళ్లి వస్తూ ఉంటాం. ఇంట్లోంచి వెళ్లి వస్తున్నట్లు, కార్లోంచి బయటికి, లోపలకి వెళ్తున్నట్టు. దీన్ని యోగంలో 'ధారణ' అంటారు. యోగంలో ధారణము, ఆ తరువాత సమాధి. ఆ స్థితి మనకి రావాలంటే, ధ్యానం ఒకటుంది మధ్యలో మనకి. ఆ ధారణ స్థితి యందు మనం నిలబడడానికి ప్రయత్నం చేసినప్పుడు నిజముగా యోగం జరుగుతున్నట్లు. యోగమంటే ఏమిటి? కలయిక అని చెప్పాను కదా. దేంతో కలయిక అంటే అందరిలో ఉన్న చైతన్యం తో. అందరిలో ఉన్న చైతన్యము గోదావరి నది లాంటిది. విడిగా చెంబులో ఉన్న గోదావరికి పారుదల లేదు కదా! పారుదల లేని గోదావరికి freshness ఉండదు. చెంబుకుండే గుణాలన్నీ కూడా నీటికి వస్తాయి. ఆ నీళ్ళు అందులోనే అలా పెట్టుకు కూర్చున్నామనుకోండి, కొన్నేళ్ళుపోయిన తరువాత చెంబుకుండే తత్త్వాన్ని బట్టి-- అంటే రాగి చెంబా, మట్టి చెంబా, ఇత్తడి చెంబా, కంచు చెంబా, దాన్ని బట్టి-- ప్రవాహం లేక నీటికి కూడా ఆ వాసన ఏర్పడుతుంది. ప్రవాహంలో ఉండే నీటికి, ఆ problem లేదు. కాబట్టి, పరిమితత్వంలో ఉండేవారికి అంతకంతకీ అంతకంతకీ దేహమునకు సంబంధించిన వాసనలు వారికి సోకుతూ ఉంటాయి. అపరిమితత్వంలోకి వెళ్ళిన వారికి దేహము యొక్క వాసనలు కానీ, దేహము యొక్క అవస్థితి కానీ ఏ విధంగా effect చేయవు, లేక బంధింపవు. వారిమీద అవి ప్రభావం చూపవన్నమాట. అలా ఉండేటి వారిని యోగులంటారు. తమ దేహము,

ఇతర దేహములు, సమస్త జీవరాశులు, అన్ని రూపములలో ఉన్న చైతన్యంతో ఏకీభావం చెంది ఉంటారు. తాను చైతన్యము, అలాగే అందరూ కూడా ఆ చైతన్యం యొక్క స్వరూపములే. ఈ స్వరూపములన్నీ కూడా ఆ చైతన్యంలో చేరుతున్నాయని గుర్తుంటుంది. ఇప్పుడు నేను గోదావరి చెంబే, నువ్వూ గోదావరి చెంబే. నాలో గోదావరి నీళ్లే ఉన్నాయి, నీలో గోదావరి నీళ్లే ఉన్నాయి అనేది చాలా ignorant understanding. నీలోనూ దేవుడున్నాడు, నాలోనూ దేవుడున్నాడు, ఇట్లా ఉండడు దేవుడు. ఇది ఊరికే మనం పరిపాటికి వాడుతూ ఉంటాం. నీలో ఉన్నాడు, నాలో ఉన్నాడు, వాడిలో ఉన్నాడు, వీడిలో ఉన్నాడు, చెంబులో ఉన్నాడు, తప్పేలాలో ఉన్నాడు. ఇవన్నీ ఒక్కడే ఉంటే వాడి మీద ఇన్ని ఇన్ని దేహాలు తేలుతూ ఉంటాయి. గోదావరిలో వంద చెంబులు పెడితే, ఒకటే గోదావరా? లేక వంద చెంబులు వేరువేరుగా గోదావరి ఉంటుందా? వెయ్యి చెంబులు పెట్టామనుకోండీ, రెండు వేల చెంబులు పెట్టామనుకోండీ, గోదావరి ఒకటే కదా! మీరెన్ని చెంబులన్నా పెట్టుకోండి, గోదావరి ఒకటే కదా! ఎన్ని కాలవలన్నా దాంట్లోంచి తీసుకోండి గోదావరి ఒకటే కదా! ఒక్కటే! ఆ స్థితి లోకి వీడు ఎదగటం ఉంటుంది తప్ప, నేను, వాడు ఒకటే అనే పరిస్థితి ఉండదు. ఎందుకంటే, గోదావరికి తాను ఒక్కటే అని గుర్తుంటుంది తప్ప, చెంబుల్లో ఉన్న గోదావరి నేనే అనే స్థితి ఉండదు. గోదావరి గానే ఉంటుంది, చెంబులో ఉన్నా కూడా. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇది అవగాహన చేసుకున్నట్లయితే, యోగ స్థితిలోకి ఎదగటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అంటే నాలోనూ దేవుడున్నాడు, నీలోనూ దేవుడున్నాడు అనుకోవటం కాదు. ఇద్దరం కూడా దేవుడిలో ఉన్నాం. మనమంతా దేవుడిలో ఉన్నాం. ఒకే దేవుని యందు మనమంతా ఉన్నాం. నిజానికి అదే మనం, అని తెలుసుకోవాలి. తెలుసుకుని, ఈ దేహమునందు మనం ఉన్నాం తప్ప, దేహమునందు బంటీ అయి లేము అనేది తెలుసుకున్నట్లయితే ఈ పరిమితత్వం పోతుంది. పరిమితత్త్వం పోయిన వారికి మాత్రమే యోగమునకు అవకాశమున్నది. ఎందుకంటే ఇన్నిటి మధ్యా బలం ఏదైతే ఉందో, అదిగా మనం మళ్ళీ మనకి మనం గుర్తొస్తాం. అంతవరకు గుర్తురాము. అలా గుర్తొచ్చినప్పుడు యోగ స్థితి చెందినవాడవుతాడు. అలా యోగ స్థితి చెందినవాడు, భగవంతుని యందు ఐక్యత చెందినవాడితో సమానం. కాబట్టి అటువంటి వాళ్ళని యోగవిదులు అంటారు.

## ౨౦. యోగవిదాం నేత

ఇది తెలిసిన వాళ్ళందరూ (యోగవిదులు) కూడా ఏదైతే తెలుసుకుంటారో అది 'నేత' లేక 'నాయకుడు'. చాలా మంది యోగులు ఉంటారు. మనం వాళ్లందరినీ చూసినప్పుడు మనం యోగులు ఉన్నారని భావన చేస్తూ ఉంటాం. వారు ఏ స్థితిలో ఉంటారంటే, అందరియందు ఒకే భగవంతుడు ఉన్నాడు, 'నేను' గా ఉన్నాడు. అది తెలుసుకొని ఉంటారు. మనం ఇంతమంది గురువులను చూస్తాం. నిజముగా యోగస్థితి చెందినవాడు ఇంతమందిని చూడడు. ఒక్కడినే చూస్తుంటాడు ఇంతమందిలోనూ. తనలో కూడా వాడే ఉన్నాడని గుర్తిస్తాడు. అందరియందు నేనుగా ఉన్నది ఒకే ఒక భగవంతుడు అని తెలిసి, దాని యందు ఎప్పుడూ జీవించేవాడు యోగవిదుడు అవుతాడు. ఈ యోగవిదులందరికీ కూడా ఆయన నాయకుడట. ఎందుకంటే, ఆయన నుంచి కదా వీళ్ళందరికీ ఇది వచ్చింది. అందుకని 'యోగవిదాం నేతా'.

## 21. ప్రధానః

ప్రధానం అంటే చాలా పెద్ద concept అది. ఈ ప్రధానాన్నే మనకి వేదాల్లో 'అదితి' అన్నారు. ఈ ప్రధానమునే మనకి 'భగవంతుని యొక్క సంకల్పశక్తి' అంటారు. ఈ ప్రధానాన్నే భగవంతుని యొక్క మూల పదార్ధము అంటారు. అంటే అది ఆధారంగా మిగతావన్నీ జరుగుతూ ఉంటాయన్నమాట. ఏ పదార్ధం ఆధారంగా ఈ సృష్టి అంతా జరుగుతుందో, ఆ మూల పదార్ధము భగవంతుని యొక్క మొదటి అవతరణం. దాన్నే 'ప్రధానము' అంటారు. అది కూడా మనని ఉదాహరణగా తీసుకుంటేనే మనకి అవగాహన కలుగుతుంది. మనం ఉండటం ఒకటుంది కదా, మనము ఎంత కాదనుకున్నా! ఉండటం ఆధారంగా మేల్కాంచటం జరగటం వలన, మేల్కాంచటం ఆధారంగా మిగతా పనులన్నీ జరుగుతాయి. మేల్కాంచకుండా పనులే ఉండవుగా! పుట్టాం అనుకోండి, పుట్టిన దగ్గర నుంచి నిద్రలేవలేదనుకోండి ఇంక ఏం పనులుంటాయి? ఏం పనులు ఉండవు. పుట్టి మేల్కాంచలేదనుకోండి. ఉన్నాము కానీ మేల్కాంచలేదు, ఉన్నామని మనకు తెలియదు. నిద్రలో కూడా మనము ఉన్నాము, ఉన్నామని తెలియదు. ఎందుకంటే ఉన్నామని తెలియటమే మేల్కాంచటం. లేకపోతే ఇంక మేల్కాంచేదేముంది? ఉండటమే ఉంటుంది. అదే సమాధి స్థితి. ఉండటం నించి, మనం మేల్కాంచినప్పుడు, We are ready, we are potential for action. అంటే, ఏ పని చేయడానికైనా అప్పుడు కదా మనకి సంసిద్ధత ఉన్నది. మనం ఉండబట్టి, మనం మేల్కాంచటం ఆధారంగా చాలా ఆలోచనలు వస్తాయి. ఆలోచనలను బట్టి మాటలు, పనులు, వస్తాయి. అది మన సృష్టి. అలాగే భగవంతుడు కూడా మేల్కాంచుతాడన్నమాట. అదే ఆయన్నుంచి అమ్మవారు బయటికి రావడం అంటారు. వెండి తెర ఏర్పడిందింక బొమ్మలు వేయడానికి. అంతకుముందు వెండితెర లేదు. సినిమాకెళ్ళినప్పుడు వాడు Curtain ఎత్తుతాడు. తెర ఉంటుంది. వెండితెరలాగా కనిపించదు. వెండితెర ఎప్పుడు కనబడుతుంది అంటే light వేసినప్పుడు కదా. అట్లాగే మనకి T.V. ఉంటుంది. T.V. కి కూడా మనకు ఒక screen ఉన్నది. ఆ screen మీద బొమ్మలు ఎప్పుడు పడతాయి? On చేసిన తరువాత కదా! On చేయాలా? On చేయకుండానే బొమ్మలు పడతాయా? అట్లాగే మనం కూడా నిద్రలోంచి లేవడమే on చేసుకోవడం

అంటే. నిద్రలోకి వెళ్లడం off చేసుకోవడం. ఏమిటి ఈ off చేసుకోవడం అంటే, నీ సృష్టి నుంచి నువ్వు withdraw అవుతున్నావన్నమాట. తిరోగమనం. On చేసుకోవడం అంటే నీ సృష్టిలోకి నువ్వు పురోగమిస్తున్నావన్నమాట. భగవంతుని విషయంలో అంతే, మన విషయంలోనూ అంతే, టీవీ విషయంలో కూడా అంతే, సినిమా విషయంలో కూడా అంతే! అన్ని విషయాల్లో కూడా అంతే! ఉండడం బట్టి, చైతన్యవంతులం అవుతున్నాం. అదే తెలివి వచ్చింది అంటూ ఉంటాం. తెలివి రావడం బట్టి ఆ తెలివి మేరకు పని చేస్తూ ఉంటాం. ఒక్కొక్కళ్ళ తెలివికి ఒక్కొక్క మేర ఉంటుంది. ఒక్కొక్క మేర అంటే, ఒక్కొక్క పరిధి అన్నమాట. ఇక అంతకుమించి, వాడి తెలివికి మించి వాడేమీ పని చేయలేడు కదా. కొంతమందికి కంది గింజంత ఉంటే, ఇంకొంతమందికి ఆనపకాయంతో, లేకపోతే గుమ్మడికాయంతో ఉంటుంది తెలివి. వాడి మేరకు పని చేస్తూ ఉంటాడు. C.V.V. గారి భాషలో చెప్పాలంటే అది వాడి memorandum. అంటే వాడి scope of action అన్నమాట అది. వాడి తెలివిని బట్టి వాడి scope of action ఉంటుంది. ఈ తెలివి రావడం అనేది లేకపోతే scope of action లేదుగా! ఉందా? నిద్రలోంచి లేవకుండా పనులు చేయగలమా? T.V. screen on చేయకుండా దానిమీద programs run చేయగలమా? Cinema తెర మీద light వేసుకోకుండా cinema reel తిప్పి బొమ్మలు చూపించగలమా? చూపించలేం కాబట్టి, ఈ on చేయడం అనేది, అంతకు ముందు లేని వెలుగు అక్కడ పడుతుందే, ఆ వెలుగు పడటమే భగవంతుని యొక్క సంకల్పంగా కొంత ప్రదేశం వెలుగవుతుందన్నమాట. అంతకుముందు వెలుగుకు అవ్వల ఉంటాడీయన. ఉండి, అట్లా చూస్తాడు. చూస్తే ఆ చూసినంత మేర వెలుగవుతుందన్నమాట. అప్పుడే మన అవగాహనకు వస్తుంది, చూస్తాడని. లేకపోతే మనకి భాష లేదు చెప్పుకోవడానికి. చూసినంత మేర వెలుగయిందండీ, వెలుగయినంత మేరలో పనిచేస్తున్నాడన్నమాట. మనం, ఎంత చూడగలం? ఏదో కొంత చూడగలం. చూసినంత మేరలో పని చేయగలం. చూడని మేరలో పనిచేయలేం కదా! అంతమాత్రం చేత ఇంక చోటు లేదనటానికి వీలు లేదు కదా! మనం చూడనిది చాలా ఉంది కదా! అక్కడి నుంచి ఇక్కడికి చూశామనుకోండి. మహా చూస్తే ఎంత చూస్తాం ? మొత్తం విశాఖపట్నమే చూడలేము. అట్లాగే భగవంతుడనే తత్వంలో కొంతమేర ఆయన చూపు పడటం వలన మేల్కాంచుతున్నాం. దాన్నే, ఆ area of operation ని area of action

అంటారు, లేక the field of action లేక కురుక్షేత్రం అంటారు. కురుక్షేత్రం అంటే అది అర్థం. ఆయన నుంచి వచ్చిన సంకల్పం కారణంగా మొత్తం చోట్లో కొంతమేర వెలిగింది. ఆ వెలిగిన మేరనే 'అదితి' అంటారు. 'గాయత్రీ' అంటారు. ఆ వెలిగిన మేరనే 'ప్రధానము' అంటారు. ఇక బొమ్మలన్నీ అక్కడే పడతాయి. అంటే సృష్టి ఆ మేరలో వస్తుంది. మొత్తం, వెండి screen ని దాటి బొమ్మ పడితే ఉపయోగం లేదు కదా! సినిమాలో బొమ్మ screen మీద పడుతూ ఉంటుంది. కొంతమేర వెలుగు screen మీదే పడుతోందనుకోండి, బొమ్మ కూడా అంత మేరలోనే పడుతుంది. చుట్టూ ఎంత screen ఉన్నా దాని మీద పడదు. అట్లా మొత్తం చోటు ఎంతంటే, ఎవరికీ తెలియదు. ఎందుకంటే, అదంతా చీకటి. దాని వెనకాల ఆయన ఉంటాడు. ఆ మొత్తం చోటులో చాలా కొంచెం చోటు, focus వేశారు. Focus వేస్తే అది వెలిగింది. వెలిగింది కాబట్టి 'ఆకాశం' అన్నారు దాన్ని. కాశము అంటే వెలుగు. ఆకాశం, ప్రకాశం, వికాసం, ఇవన్నీ కాశాలున్నాయి మనకి. కాశము అంటే ఏమిటంటే వెలిగిన చోటు అని. వెలిగింపబడిన చోటుని ఆకాశము అన్నారు. వెలిగింపబడిన చోటులో కొన్ని వందల సౌరకుటుంబాలు పుట్టుకొచ్చాయి. వెలిగింపబడని చోటు కూడా ఇంకా చాలా ఉంది. ఆయన ఇష్టం అది. వెలిగిద్దాం అనుకుంటే వెలిగించు కోవచ్చు. అక్కర్లేదనుకుంటే మానేస్తాడు. మనం కూడా మన తెలివి మేరకు పూర్తిగా ఎప్పుడూ పని చేయం. కొంత మేరకు పని చేస్తూ ఉంటాం. ఇప్పుడు అది పని చేయదనుకోండి. మనకి ప్రత్యేకమేమిటంటే ఒక అవస్థితి ఉంది. ఆయనకది పనిచేయకపోవడం అంటూ లేదు. పని చేసినంత మేర ఆ వెలిగిన యొక్క పరిధి ఎంత ఉందో, ఆ పరిధిని 'ప్రధానం' అంటారు. ఆ వెలిగిన చోట్లో ఉండే పదార్థాన్ని 'ప్రధానం' అంటారు. దాన్నే 'మూలప్రకృతి' అంటారు. దాన్ని 'etheric matter' అంటారు. లేక 'సూక్ష్మ పదార్థం' అంటారు. ఇక ఏ చూపుతో అయితే దాన్ని చూశాడో, ఆ చూపు అనే శక్తి ఉంది చూశారా, దాంతోటే ఆ పదార్థాన్ని అల్లుతూ ఉంటాడింక. ఇక్కడి నుంచి ఉద్భవించిన సంకల్పశక్తి ఏదైతే ఉందో, ఆ సంకల్పశక్తి చేతనే, ఆ ఏర్పడిన వెలుగు మేరా అల్లుతూ ఉంటే ఇక అందులోంచే అన్నీ దిగి వస్తూ ఉంటాయి. అక్కడ నుంచి దిగి వచ్చిన దగ్గర నుంచి మనకి తెలుసు. అంతకుముందు విషయం మనకు తెలియదు. ఎందుకంటే, మనం ఎట్లా నిద్రలేచామో మనకు తెలియదు కదా! తెలిస్తే, మనం కూడా యోగవిదులం అయిపోతాం. తెలియదు కదా! మనకి ఎక్కడనుంచి తెలుసంటే, బొమ్మలు పడటం

దగ్గర్నుంచి తెలుసు. బొమ్మల ముందు విషయం ఒకటుంది. అదేంటంటే బొమ్మ పడకుండా వెలిగి ఉన్న విషయం. ఆ వెలుగుని దర్శించటమే దేవుడిని దర్శించటం అంటారు. అసలు ఈ వెలుగు లేని, ఆ వెలుగుకు ఆధారమైన ఒక స్థితి ఉంది.

'లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది
నలోకంబగు పెంజీకటి కవ్వల నెవ్వం డేకాకృతి వెలుగునతని'

అంటే అక్కడ కూడా ఇంకా వెలగకముందు విషయం ఉంది. దాన్నే 'పరబ్రహ్మతత్వం' అంటారు. 'గుణాతీతుడు' అంటారు. 'అవ్యక్తుడంటారు'. ఏవో చాలా పేర్లు ఉన్నాయి. అవన్నీ అలా ఉండగా, మన వరకు బొమ్మ లేని స్థితి. లేవంగానే మనకి బొమ్మ లేకపోవడం అంటే ఏంటంటే, ఆలోచన లేకుండా మనం ఉంటే, బొమ్మ లేని స్థితి. అంటే ఆ ఆలోచన రాగానే మన ఆలోచనలన్నీ ఇదివరకు చూసిన రూపములకు సంబంధించి ఉంటాయి. కాబట్టి మనకి బొమ్మలు పడిపోతూ ఉంటాయి. చాలామంది, T.V. on చేశారనుకోండి, automatic గా program వచ్చేస్తుంది దాంట్లో. Program లేకుండా TV screen వెలిగే ఒక స్థితి ఉన్నది కదా. ఆ స్థితి యందు మనము ఉండగలిగినట్లయితే, ప్రధాన స్థితి అంటే ఏమిటో మనకి తెలుస్తుంది. అంటే మనం నిద్రలేచాం, ఇంకా ఆలోచనలేం రాలేదు. అలా మనం ఉండగలిగినట్లయితే అప్పుడు మనం ప్రధానము అనే స్థితి యందు ఉన్న వాళ్ళంగా లెక్క వేసుకోవచ్చు. అక్కడినుంచి మనకి ఆలోచనలు, ఆలోచన నుంచి చేతలు, మాటలు, ఇవన్నీ వస్తాయి. ఇక్కడ భగవంతుని యొక్క మొదటి అవతరణము "ప్రధానము" అని చెప్పారు. The first manifestation of the unmanifest. అవ్యక్తుడు అయిన భగవంతుని యొక్క మొదటి వ్యక్త స్థితిని 'ప్రధానము' అంటారు. అది ప్రధానం గురించి, అంటే, భగవంతుడు మనకి అవగాహన అయ్యే స్థితిలోకి రావటం అన్నమాట. మనం కూడా మనమెట్లా ఉన్నామో మనకి తెలియదు. మనం ఎట్లా ఉన్నామో మనం తెలుసుకుని, అందులోకి మనం వెళ్లిపోయిన తరువాత, ఇంక తెలియటం ఏమీ ఉండదు. ఒక ఇనుప ముక్క అయస్కాంతం వరకూ వస్తూ ఉంటే, తను ఇనుప ముక్కగా గుర్తు ఉంటూ ఉంటుంది. ఇనుప ముక్క వెళ్లి అయస్కాంతానికి అతుక్కుపోయిందనుకోండి, అతుక్కుపోతే ఇది కూడా అయస్కాంతం అయిపోతుంది, తను ఇనుప ముక్క అనే స్థితి గుర్తుండడానికి అవకాశం లేదు. నేను ఇనుప ముక్కను అయస్కాంతానికి అతుక్కుని ఉన్నాను, అని తెలియదు. ఎందుకంటే, తను అది అయిపోయిన స్థితి.

ఇదే నారదుడికి నారాయణ ఉపాసన ద్వారా జరుగుతుంది. జరిగిన తరువాత, ఆ స్థితిలో మళ్లీ తనకి తాను గుర్తొస్తాడు. గుర్తురాంగానే, ఇనుప ముక్క అయిపోయాడన్నమాట. అమ్మో! అంతకుముందు స్థితి బాగుంది, అది కావాలి, అది కావాలి అంటాడు. అది కావాలి అని అనుకున్న అంతసేపు అదిగా దాన్ని చూస్తున్నావు కాబట్టి, నువ్వు నువ్వుగాను, అది అదిగానే ఉండిపోతాయి. అందుకని 'నువ్వు నువ్వుగా ఉండి దానిని అదిగా చూస్తూ ఆనందం చెందు. ఇంక అంతకన్నా అవకాశం లేదు ప్రస్తుతం', అని భగవంతుడు నారదుడికి చెప్తాడు. కాబట్టి మనకి కూడా మేల్కాంచిన స్థితిలో, ఆలోచనల యొక్క పరంపరలు లేకుండా ఉన్న స్థితి ఉన్నట్లయితే అది కదా beginning అన్నిటికీ. అదితి అంటే The beginning అని ఒక అర్థం. అందుకనే మనకి పొద్దున్నే వచ్చే వెలుగుని 'అదితి' అంటారు. ఆ వెలుగు వచ్చిన తర్వాత, సూర్యుడు వస్తాడు. ఆయన అదితి నుంచి వచ్చినవాడు కాబట్టి, ఆదిత్యుడు అన్నారు. కాబట్టి అదితి అనే వెలుగు ఎవరయ్యా అంటే, భగవంతుని యొక్క మొదటి అవతరణ స్థితి. అది కూడా భగవంతుని నామాల్లో ఒకటి .

## ౨౨. పురుషేశ్వరః

తాను, తనకు సంబంధించినది అనే మొత్తం అంతా కూడా వ్యాపించిన వాడు పురుషేశ్వరుడు. ఈశ్వరుడు అనే పదానికి ఇంకొక అర్థం ఏమిటంటే, స్వామి అని. స్వామిత్వం చెంది ఉండటం అన్నమాట. దేని మీద స్వామిత్వం చెంది ఉండటం అంటే, తన యందు తను స్వామిత్వం చెంది ఉండాలి. తనది అనే అన్నిటి యందు స్వామిత్వం చెంది ఉండాలి. తన యందు తనకు స్వామిత్వం చెందినవాడు మాత్రమే తనది అనేదాని యందు కూడా స్వామిత్వం చెంది ఉండగలుగుతాడు. తనయందు తనకు స్వామిత్వం చెంది ఉండటం అంటే తన ఆలోచనల మీద తనకు స్వామిత్వం, తన ఆవేశము మీద తనకి స్వామిత్వము, తన వాక్కు యందు తనకి స్వామిత్వము, తన చేతలయందు తనకు స్వామిత్వము, తన ఇంద్రియములు, శరీరము మీద పూర్తి స్వామిత్వం ఏర్పడినవాడు, స్వామి. లేకపోతే మనకి అవి స్వాములయిపోతాయి. మామూలుగా మనం ఒకటి అనుకుంటే మనలో ఉన్నవే ఇంకోటి చేస్తూ ఉంటాయి. అంటే వాటికి మనం స్వామి కాదన్నమాట. మనం చెప్పినట్టు అవి వింటూ ఉంటే మనం దానికి స్వామి. అందుకనే ఈ శరీరం మన మాట వింటోందా లేదా, నాకు స్వామిత్వం ఉందా లేదా చెప్పకూడదు, స్వామిత్వం చెందిన వారికి తెలుస్తూ ఉంటుంది. అయినా చెప్పడు. ఎందుకంటే అది ఎవరికి వారుగా అంచనా వేసుకుని, ఎక్కడ మనకి సొట్టలు ఉన్నాయో అవి కొంచెం తీసుకుంటూ ఉండాలి. మాటలయందు, చేతలయందు, ఇంద్రియముల యందు, అన్నిటియందు స్వామిత్వం ఉన్నవాడు, ఒక రకం స్వామి. అప్పటికీ పూర్తి స్వామి కాదు, ఈశ్వరుడు కాదన్నమాట. ఏం స్వామీ! అంటూ ఉంటాం కదా! అంటే నిజానికి అవతలి వాడు నా బొంద, నేనేం స్వామిని అని అనుకోవాలి. స్వామిత్వం చెందిన వాడు తనయందు తనకు స్వామిత్వమే కాకుండా, తనది అనే వాటి అన్నిటియందు స్వామిత్వం ఉంటుందిట. ఎట్లా ఉంటుందంటే అన్నిటి యందు ఎరుక కలిగి ఉంటాడట. అట్లా ఎట్లా ఉంటారండీ? మనకి చీమ కుట్టిందనుకోండి మనకి తెలుస్తుంది. మన ఇంట్లో మనం ఒక కుక్కని పెంచుకుంటున్నామనుకోండి, కుక్కకి చీమ కుడితే మనకి తెలుస్తుందా, కుక్క అరిచేవరకు? కుక్క అరిచినా కూడా చీమ కుట్టి అరిచిందని మనకి తెలియదు కదా. కుక్క వరకు అక్కర్లా, ఇంట్లో సహా

కుటుంబి ఎవరో ఒక సభ్యుడు ఉంటాడు కదా, వాడికేదన్నా అయిందనుకోండి మనకి తెలుస్తుందా? అంటే తనది కదా, భావన. తన ఇల్లు, తన పొలము అని ఉంది కదా! తన పొలములో ఏమన్నా జరుగుతూ ఉంటే, ఇక్కడ కూర్చుని పొలంలో జరిగేది తను అనుభూతి చెందగలిగితే, దానికి వీడు స్వామిట. లేకపోతే కేవలం దస్తావేజుల ప్రకారం owner. దానికి మాస్టర్ గారు చెప్తుండేవారు, దాని దగ్గరికి మనమే పోతున్నాం, అది మన దగ్గరికి ఎప్పుడూ రాదు, దానికి మనమేం స్వామి? అని. మన కుక్కకి మనం స్వామంటే, జూ-- అంటే, అది మన దగ్గరికి రావాలి. జూ-- అని మనమే దాని దగ్గరకు పోతూ ఉంటే, అదా స్వామి, మనమా స్వామి? ఆ పద్ధతుల్లో మనం పొలం కొనుక్కుని పొలం చుట్టూ తిరుగుతాం కదా. మనం ఏం స్వాములమోయి! అనేవారు మాస్టారు. అట్లా ఎట్లా మాస్టారు మరీ స్వామి అయిన వాడికి మాత్రం, పొలం తన దగ్గరికి వస్తుందా? అని అడిగాను. పొలం మన దగ్గరికి రాదు కానీ పొలంలో ఏం జరుగుతున్నా వీడికి తెలుస్తుంది, అని చెప్పారు. పొలంలో ఉండే మట్టిలో వ్యాపించి ఉంటాడు, పొలం చుట్టూ వేసే గట్టులో వ్యాపించి ఉంటాడు, గట్టుమీద వేసే ముళ్ళకంచె మీద వ్యాపించి ఉంటాడు, ఎందుకంటే, పొలంలో వేసిన పంటయందు కూడా తానే ఉంటాడు. అదిట స్వామిత్వం అంటే! ఇంక పొలం వీడియందు ఉన్నట్టే కదా! వీడికి, తనయందు చీమ కుడితే తెలిసినట్టుగానే, పొలంలో ఏమన్నా జరుగుతూ ఉంటే వీడికి తెలుస్తూ ఉంటుందన్నమాట. అంటే పొలంలో మట్టి వీడుగా, పొలంలో పండే పంట యొక్క చైతన్యం తనే అనుభూతి చెంది ఉంటాడు. పొలం గట్టు, మొత్తం పొలము, పొలాల్లో ఉండే ముళ్ళ చెట్లు, పెద్ద పెద్ద తాటి చెట్లు వేస్తూ ఉంటాం కదా, దానికి frontiers గా, మనది అని తెలియడానికి. ఇంతవరకు మనది అని తెలియడానికి గట్లు, తాటిచెట్లు, తాటి మట్టలు ఇవన్నీ తెలుస్తూ ఉంటాయిట నిజంగా స్వామిత్వం చెందిన వాడికి. అంటే వ్యాపనం చెంది ఉంటాడు కాబట్టి, అట్లా తెలుస్తుంది. కాబట్టి పురుషేశ్వరుడంటే మనం, మన పొలం లాగా, ఎక్కడ ఏ పురుషుడు ఉన్నా, ఆ పురుషుడిలో వాడు ఉన్నాడు కాబట్టి ఈశ్వరుడిగా, ఎవడు ఎక్కడ ఏం చేస్తున్నా వాడికి తెలుస్తూ ఉంటుంది. ఈ విధమైన ఈశ్వరత్వము భగవంతునికి ఉన్నది. సమస్త లోకాల్లో అందరి జీవులయందు తానే ఉన్నాడు కాబట్టి, అక్కడక్కడ, అక్కడక్కడ, జరుగుతున్న విషయాలన్నిటికి తను స్వామిత్వం వహించి ఉంటాడన్నమాట. పురుషేశ్వరత్వం యోగులకు కూడా సాధ్యపడే విషయం కాదు.

అందుకని భగవంతుని నామాల్లో, 'యోగవిదాం నేత' కదా యోగవిదులు వేరు, యోగవిదులకు నాయకుడు వేరు. అట్లాగే పురుషులు వేరు, అందరు పురుషులయందున్న ఈశ్వర తత్వం నేనూ అనే అంతర్యామి ప్రజ్ఞ, అది పురుషేశ్వరుడు.

## 23. నారసింహవపుః

అతి పవిత్రమైన నామమిది. దీని గురించి ఎవరూ పెద్ద ఎక్కువ భాష్యం చెప్పింది లేదు. నరసింహావతారం కదా ఎత్తాడు. అంటే నరుడు, సింహము కలసిన స్థితి. సింహము తలకాయ, నర దేహం కలిగి, అపర సంధ్యలో పుట్టి, లోపల, బయట కాకుండా రాత్రి, చీకటి కాకుండా ఉండే పరిస్థితుల్లో, ఫలానా జీవరాశికి సంబంధించినవాడు అని కూడా కాకుండా, పుట్టినవాడు కదా నారసింహుడు. హిరణ్యకశ్యపుడు చాలా విచిత్రమైన వరం కోరతాడు. పుట్టించిన ఏ జీవరాశులతోనూ, తనకు చావు రాకూడదన్నాడు. అంటే ఏమున్నాయి మనకి, చెట్లున్నాయి, జంతువులున్నాయి, మనుషులున్నారు, దేవతలున్నారు, వీళ్ళెవరూ కాకూడదన్నాడు. ఆ తరువాత ఏమన్నాడు? పగలు రాకూడదు, రాత్రి రాకూడదు అన్నాడు. లోపల చావకూడదు, బయట చావకూడదు అన్నాడు. అట్లా కోరాడు. అంతేకాదు. వేటితో చంపుతారు, మహా చంపితే ఏదో ఆయుధంతో కదా చంపుతారు. కాబట్టి, ఏ ఆయుధంతోను కుదరదన్నాడు. అంటే, అప్పుడు ఇట్లా వస్తాడు. మనిషి కాదు, జంతువు కాదు. గోళ్ళు ఆయుధం అనటానికి వీలు లేదు కదా. పగలు కాదు, రాత్రి కాదు. ఇంట్లో లోపలా కాదు, బయటా కాదు. అట్లా పెట్టి వాడిని చీల్చేస్తాడు. మనకి మాస్టర్ గారు భగవంతుడు మనం చూస్తున్న possible రూపాల్లో కాకుండా ఇంకే రూపంలో అయినా కూడా రావచ్చు అనేది ఒకటి గుర్తుపెట్టుకోండి అని చెప్పారు. Any possible form, which is not conceivable by a human mind. భగవంతుడు మానవ మేధస్సుకి అందని రూపము ఏదైనా కూడా ధరించవచ్చు. ఈ తెలిసిన రూపాలే, ఇంతకుమించి కాదు అనటానికి వీలు లేదు. ఇదివరకు కొన్ని రూపాలు ఉన్నవి, ఇప్పుడు లేవు. Species కొన్ని extinct అయిపోతున్నాయి అని చెప్పి English లో గోలపెడుతూ ఉంటారు వాళ్ళు, అట్లాగే మనం ఊహించని కొత్త species కూడా కొన్ని రావచ్చు. ఎందుకు రావచ్చంటే భూమి తనచుట్టూ తాను తిరుగుతూ, ఆకాశాన్నట్లా చూస్తూ ఉంటుంది. చూస్తూ ఉండడం వల్ల ఏమవుతుందంటే, నక్షత్ర మండలంలో ఉన్న ఆకారాలన్నీ భూమి మీదకి, through a photographic principle ఈ భూమి మీద జీవులుగా పుట్టించుకుంటూ ఉంటుంది. మనకి సింహరాశి ఉంది, అందుకని

సింహాలు ఉన్నాయి. వృషభ రాశి ఉంది, ఎద్దులు ఉన్నాయి. మిధున రాశి ఉంది మగ, ఆడ ఉన్నారు. ఇట్లా తన చుట్టూ తను తిరుగుతున్నప్పుడు భూమి ఆకాశంలో ఉండే నక్షత్ర మండలాల్లో ఏర్పడుతున్న ఆకారాల్ని చూస్తూ ఉండబట్టి ఆ చూస్తూ ఉండే ఆకారాల్ని తను గర్భం ధరిస్తుంది. గర్భం ధరించేవాళ్లు కూడా అట్లా ధరించాలి. గర్భధారణ జరిగినప్పుడు ప్రసన్నమైన విష్ణుమూర్తి స్వరూపమో, లేక లక్ష్మీ దేవి స్వరూపమో, ఇటువంటివి చూడాలి. ఎదురుగుండా పిల్లి బొమ్మ, కుక్క బొమ్మ, ఎండిపోయిన చెట్టు బొమ్మల paintings, మునిగిపోతున్న ఓడ, ఇటువంటి చాలా పెద్ద పెద్ద modern paintings ఏవో పెట్టుకుని చూస్తూ, సరిగా బట్టలేసుకోని బొమ్మలూ చూస్తూ, గర్భిణీ స్త్రీ ఉందనుకోండి. రోజూ చూచేవి లోపల పుట్టే వాడికి, ఆ రూపం రావటానికి, ఆ స్వభావం రావటానికి చాలా ఎక్కువ అవకాశం ఉంది. అందుకని గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకించి ఆకర్షణీయమైన, అందమైన, దివ్యమైన రూపాల్ని ఎక్కువగా ఆరాధన చేసుకునే ఒక పద్ధతి పెద్ద వాళ్ళు ఇచ్చారు. ఊరికే పిచ్చివాళ్లై ఇవ్వలేదు. ఆ timeలో ఎటువంటిది మన యందు ఎక్కువ స్థిరమవుతుందో, దానికి సంబంధించిన స్వభావము, దానికి సంబంధించిన రూపము, మనకి రావటానికి అవకాశం ఏర్పడుతుంది. అలాగే భూమి కూడా చుట్టూ ఉండే ఆకాశంలో, తిరిగే ప్రదేశంలో అట్లా చూస్తూ (ఒకే route లో run అవుతూ ఉంటుంది) 27 నక్షత్ర మండలాలలో ఉన్న 27 రకములైన స్వరూపములను తన యందు గర్భధారణ చేసుకుని, వాటికి సంబంధించిన జీవుల్ని భూమిమీద పడేస్తూ ఉంటుంది. పడేస్తూ ఉంటే కొన్ని extinct అయిపోతూ ఉంటాయి, కొన్ని కొత్తవి వస్తూ వుంటాయి. ఎందుకు వస్తూ ఉంటాయి అంటే భూమి లక్షల సంవత్సరాలు తిరుగుతున్నప్పుడు ప్రతి 72 ఏళ్లకు ఇరుసు ఒక డిగ్రీ మారుతుంది. అంటే ఉత్తర దక్షిణ ధ్రువాలేవైతే ఉన్నాయో దాన్ని ఇరుసు అంటాం. ఆ ఇరుసు మారుతూ ఉండేసరికి ఏమవుతుందంటే, ఇంకొంచెం తిరుగుతుంది. ఇంకొంచెం తిరుగుతుంది. అట్లా ఒక 2,160 సంవత్సరాలకి, 30 డిగ్రీలు తిరుగుతుంది. అందుకనే మనం ఇప్పుడు మీనయుగంలో నుంచి కుంభయుగంలోకి వచ్చాం అంటారు. ఎందుకంటే మీనరాశిలోంచి ఇప్పుడు ఈ ఇరుసు కుంభము, సింహము ఇరుసుగా ఏర్పడిందన్నమాట. అంతకుముందు మీనము, కన్య ఇరుసుగా ఉండేవి. అంతకుముందు మేషము, తుల ఇరుసుగా ఉండేవి. ఇరుసుకి ఉత్తర ధ్రువం ఎక్కడ ఉందో, దాన్నిబట్టి Aries లో అన్నప్పుడు Aryan race అన్నారు. ఆ తరువాత అది

మీనం లోకి వచ్చినప్పుడు, Piscean లేక మీనయుగం అన్నారు. ఇంకొంచెం తిరిగి కుంభం లోకి వచ్చేసరికి కుంభ యుగం అన్నారు. ఇంకొక 2160 సంవత్సరాల తర్వాత, మకరంలోకి వస్తుంది. అప్పుడు మకర యుగం అంటారు. ఇట్లా పేర్లు పెట్టుకుంటూ ఉంటారు. ఈ పేర్లు ఇట్లా పెట్టుకుంటూ ఉండగా, ఇరుసు తిరిగేసరికి ఈ తిరుగుతున్న భూమి అక్కడ చూసే నక్షత్ర మండలంలో ఆ route లో చూడటం కన్నా కొంచెం ఈ పక్క రూట్లో చూస్తుంటుంది. ఇంకొంచెం పక్కకి చూసేసరికి ఏమవుతుంది, అంతకు ముందు ఉండే ఆకారాలు ఇప్పుడు కనిపించవు. కొత్త రకమైన ఆకారాలు కనిపిస్తాయి. అది చాలా క్రమశః జరుగుతుంది కాబట్టి, ఒక డిగ్రీ జరగాలంటే 72 సంవత్సరాలు పడుతుంది ఇరుసుకి. 30 డిగ్రీలు తిరిగేసరికి ఏమవుతుంది almost కొత్త route లో చూస్తూ ఉంటుంది. అందుకని అప్పుడు మనుషులు చాలా పొడుగ్గా ఉండేవారుటండి. ఇప్పుడు కొంచెం పొట్టిగా ఉన్నారు. అట్లాగే అప్పటి జంతువులకి, ఇప్పటి జంతువులకి ఆకారాల్లో తేడాలు వస్తూ ఉంటాయి. అట్లా కొన్ని యుగాలు దాటితే, అసలు ఆకారాలకి పోలికలు ఉండవు. రేవతీదేవి బలరాముని భార్య. ఆవిడ చాలా పెద్ద stature. ఎంత పెద్ద stature అంటే ఆవిడ stature కి సంబంధించి stature ఉన్న మగవాడు లేడు. అది పరిస్థితి. రేవతి రైవత మనువుకి పుట్టిందట. రేవతి పుట్టగానే మంచి బ్రహ్మాండంగా ఉంది పిల్ల, మరి ఇటువంటి అద్భుతమైన స్త్రీ మూర్తికి ఎవరు సరైన భర్తో కనుక్కుందామని బ్రహ్మ లోకానికి వెళ్లాడట మనువు. వెళ్లేసరికి అక్కడ బ్రహ్మ, ఏదో గానం వింటున్నాడు. పాట అయిపోయిన తరువాత మాట్లాడిద్దాం. పాట వింటుంటే disturb చేయడం ఎందుకని అనుకున్నాడట. పాట అయిపోయిన తరువాత, ఏమిటి ఇలా వచ్చావు అని అడిగితే, ఇట్లా మా అమ్మాయికి సరైన అల్లుడు, అంటే 'ఇంకేం అల్లుడు, ఇప్పటికే యుగాలు అయిపోయినాయి. ఇప్పుడు, అటువంటి మనుషులు భూమి మీద లేరు, ఒక పాట మూడు నిమిషాలు అయింది అనుకుంటున్నావేమో, కొన్ని యుగాలు వెళ్లిపోయినాయి, కొన్ని మన్వంతరాలు వెళ్లి పోయినాయిరా అబ్బాయి,' అని చెప్తాడు. అమ్మమ్మో ఎట్లా? అని అడిగితే బలరాముడు ఉన్నాడు, వాడికిచ్చి చెయ్యమని చెప్తాడు. అట్లా మన్వంతరాలు మారిపోతున్నప్పుడు, లేక ఈ ఇరుసు మారుతున్నప్పుడు, భూమి యొక్క దృష్టి బట్టి ఆకాశంలో ఆకారాలు మారుతూ ఉంటాయి. అందుకని ఏ ఆకారంలో అన్నా భగవంతుడు రావచ్చు. ఏ ఆకారమైనా ఏర్పడవచ్చు. ఇవాళ మనకున్న ఆకారాలే

ఆకారాలు అనుకోవడానికి వీలు లేదు. ఏమిటండీ, సింహం, మనిషి కలిపి how is it possible? అని మనం ఇవాళ English లో అడిగితే? కుదరదు. ఆ ఆకారం ఉన్న సమయంలో, అట్లాగే ఇంకోటి కూడా రావచ్చు. ఆ possibility చూపించటానికే మనకి వరాహ నర సింహ స్వామినిచ్చారు. కేవలం మనిషి, సింహమే కాకుండా మూడవది చేర్చారు. వరాహం, సింహం నరుడు. ఇది కూడా possible, anything is possible, every form is possible. How is it possible? అని అడిగితే , ఇప్పుడు నేను చెప్పిన science వలన ఇది possible అని, వైజ్ఞానికంగా ఆలోచించే దృష్టి కలిగే మనుషులకి చెప్పటానికి వీలుగా, ఖగోళ శాస్త్రం మనకి ఈ విషయాన్ని చెబుతుంది. అలా దృష్టితో గర్భం ధరించటం అనేది మనకి, పూర్వ కాలంలో ఉండేది. కుంతీదేవి అట్లాగే గర్భాన్ని ధరించింది. హనుమంతుడు సముద్రంలో ఎగురుతూ ఉంటే కింద ఒక మత్స్య కన్య కూడా ఆ విధంగా హనుమంతుణ్ణి చూసి, ఆయన యొక్క స్వరూపాన్ని ఆపాదన చేసుకుని, కొడుకుని కంటుంది. వాడు లంకలో హనుమంతుడి తో యుద్ధం చేస్తుంటే హనుమంతుడికి ఎంతసేపటికీ తెమలదు. నువ్వెక్కడ పుట్టావురా, అంటే నీ దగ్గర నుంచే, అని చెప్తాడప్పుడు. అంటే అన్యాయం, నేను ఒప్పుకోను, అంటాడు హనుమంతుడు. నేను బ్రహ్మచారిని, don't scandalize me అంటే, అప్పుడు ఛాయా రూపంగా వచ్చాడు, అని చెబుతారు. కాబట్టి ఈ నరసింహ రూపం, certain forms are possible అని చెప్పటానికి. అదలా ఉండగా, ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, 'నరసింహ' లో 4 బీజాక్షరాలు ఉన్నాయి. నర - నారాయణ లో ' నర' ఉన్నది. సింహ- సోహం, హసొమ్, హంస, ఇవన్నిటికీ సంబంధించిన రెండు బీజాక్షరాలు. 'సం' అనేది, 'హం' అనేది. నాలుగు బీజాక్షరాలతో కూడిన మహామంత్రం, నరసింహ మంత్రం. నరసింహ మంత్రం యొక్క సాధన, అది it's a doctrine by itself. విష్ణుమూర్తి గురించి చెప్పుకుంటే ఇలా ఎన్నాళ్లు చెప్పుకుంటామో, అట్లాగే నరసింహుని గురించి చెప్పుకోవాలంటే అంత చెప్పుకోవచ్చు. ప్రస్తుతం చెప్పుకోవాల్సింది ఏంటంటే, నర, సింహ, అనేవి రెండూ కూడా ఒకటి permeating principle, ఒకటి ascending and descending principle. ఇట్లా చెప్పుకున్నట్లయితే నారము, నీరు అంటే వ్యాపనం చెందుతూ ఉంటుంది. పరుచుకుపోతూ ఉంటుంది. పరుచుకుపోయే principle ఒకటి ఉంటే, దాంట్లో సోహం అనే, ఒక principle గా, ఎక్కేది, దిగేది, అంటే

వ్యాపనం చెందే ప్రజ్ఞ ఆధారంగా ఆరోహణము, అవరోహణము, ఆరోహణము అవరోహణము జరుగుతుంది. జరుగుతుంటే ఈ సృష్టి ఏర్పడటం, వృద్ధి పొందటం, మళ్లీ లయమైపోవటం. మళ్లీ ఏర్పడడం మళ్లీ వృద్ధి పొందటం, మళ్లీ లయమైపోవటం 'ప్రధానం' లో ఏర్పడుతుంది. ఈ నాలుగు శబ్దాలనే 'చతుర్భుజుడు' అంటారు. నాలుగు శబ్దాలకి, మనకు నాలుగు కాలాలు ఉన్నాయి సంవత్సరంలో. Solistice మనకి March, September లలో ఏర్పడితే, Equinox June, December లలో ఏర్పడతాయి. ఒకటి రాత్రి ఎక్కువ, పగలు తక్కువ. అతి పెద్ద రాత్రి ఉండేది December 22. అతి పెద్ద పగలు ఉండేది June 21. అట్లాగే రెండూ సమానంగా ఉండే March 21, 22 తేదీల్లోనూ, September 21,22, 23 తేదీల్లోనూ వస్తాయి. ఒకటి equinox అంటారు, ఇంకొకటి solstice అంటారు. ఈ నాలుగు ఆధారంగా మనకి ఈ ఋతుధర్మాలు, ఈ సృష్టి ఇక్కడ ఏర్పడుతూ ఉంటాయి. ఇట్లాగే విభజన నాలుగు రకాలుగా సృష్టిలో జరుగుతూ ఉంటుంది.

'చతుర్వర్గ ఫలం జ్ఞానం కాలావస్థా చతుర్విధాః,
చతుర్వర్ణమయో లోకం, తత్సర్వం చతుర్ముఖ'

కాబట్టి అన్నీ నాలుగు నాలుగు నాలుగుగాఉంటుంది. సంవత్సరపురుషుడు- నాలుగు. అట్లాగే మాసం కూడా నాలుగు. పౌర్ణమి, అమావాస్య, కృష్ణాష్టమి శుక్లాష్టమి, నాలుగు. అట్లాగే మరీ పెద్ద cycle తీసుకుంటే నాలుగు యుగాలు. అట్లాగే మానవ జీవితం తీసుకుంటే, నాలుగు దశలు. వేదాలు తీసుకుంటే నాలుగు. ఇట్లా నాలుగు నాలుగు నాలుగుగా, ఎన్నైనా చెప్పుకోవటానికి ఉన్నాయి. ఇట్లా నాలుగుగా ఏర్పడడానికి నాలుగు మూల శబ్దాలున్నాయి. ఈ మూల శబ్దాలలోనే మనకి ఈ నరసింహం వస్తుంది. ఈ నాలుగు శబ్దాలు, న, ర, సిం, హ అనే నాలుగు శబ్దాలు, శరీరముగా కలవాడు అని చెప్పటం అనేది 'నారసింహవపుః' అంటారు. న అంటే ascent. ర అంటే descent. అట్లాగే స అనేది ascent కి సంబంధించినది. హ అనేది descent కి సంబంధించినది. అంటే ఒకటేమో నార అనేది expansion and contraction కి సంబంధించింది అయితే, 'ర' అన్నప్పుడు expansion. అందుకనే అక్ష 'ర'ము అన్నప్పుడు అక్షము 'రా' గా కొనిరాబడినది; ఏమిటి ? కేంద్రం. కేంద్రప్రజ్ఞ వ్యాపనం చెందితే, అది అక్షరము అవుతుంది. అక్షముగా కొనిరాబడినది. 'ర' అనేది వ్యాపనమునకు సంబంధించిన ప్రజ్ఞ అయితే,

'న' అనేది contracted potential, seed principle. 'స' అనేది ascent. అంటే disappearance of matter into its original state అనేది. 'స' అనే దానికి 'హం' అనే శబ్దం descent of the subtle principle to gross. స, హ అనే శబ్దములు, vertical line కి సంబంధించినవి. 'న' 'ర' అనే శబ్దములు horizontal line కి సంబంధించినవి. ఒకటి X Axis, ఇంకొకటి Y Axis. ఈ రెండూ ఆధారంగా సృష్టి ఏర్పడుతుంది. ఆ 'నార'కి 'ఇ' కారం జోడిస్తే, నారి అవుతుంది. ఈ నిరుక్తంలోకి వెళితే ఆ శబ్దాల లోంచి చాలా రకములైన తత్వం మనకి గోచరిస్తుంది. ప్రత్యేకించి ఇక్కడ మనం తెలుసుకోవలసింది, 'నారసింహవపుః' అంటే భగవంతుడు ఈ నాలుగు మూల శబ్దములను తన శరీరంగా కట్టుకుని, ఈ సృష్టినంతా తానుగా వ్యాపనము చెందినవాడు అన్నమాట. అందుకని నారసింహవపుః అన్నారు. దీనికి జ్యోతిషపరంగా కూడా చెప్పుకోవలసింది చాలా ఉంది. ప్రస్తుతం మనం fixed cross అనే ఒక cross మీద ఇప్పుడున్న కుంభయుగంలో work చేస్తాము. అంటే కుంభము సింహము horizontals అయితే, వృషభము వృశ్చికము verticals అయితే, ఈ నాలుగు తత్వాలు ఎవరైతే అవగాహన చేసుకుంటారో, వాళ్ళు కేంద్రంలోకి తమని తాము ఉద్ధరించుకోవచ్చు. వృశ్చిక రాశి వారికి రెండు సంకేతాలు ఉన్నాయి. ఒకటి పాము, రెండు గరుడ పక్షి. నేల మీద పాకుతూ ఉండవచ్చు, కలుగుల్లోకి వెళ్ళిపోతూ ఉండొచ్చు. ఇంకా లోపలికి. లేదంటే పక్షి వలె ఎగిరి, ఊర్ధ్వలోకాల్లోకి ప్రయాణం చేయవచ్చు. అది verticals aspect. వృషభానికి కూడా ఈ verticals తో సంబంధం ఉంది. దానికి సంబంధించినవన్నీ చదువుకోవాలంటే గరుడ పురాణంలో వృషోత్సర్జనం చేయమంటారు. అంటే ఏం లేదు. వీర్యమును ఊర్ధ్వగతి పంపించమంటారు. ఇవన్నీ verticals కి సంబంధించిన descent and ascent. From Taurus to Scorpio, descent. From Scorpio to Taurus, ascent. అని ఒక జ్యోతిర్విద్య ఆధారంగా, యోగాన్ని సాధన చేసే పద్ధతి ఉంది. అట్లాగే సింహరాశి నుంచి కుంభరాశి, కుంభరాశి నుంచి సింహరాశికి వ్యాపనం చెందే పద్ధతి ఉంది. ఇప్పుడు ఈ కుంభయుగంలో ఉన్న వ్యాపనం expansion of consciousness అంటాం. కుంభరాశికి సంబంధించిన quality ఏమిటంటే, మన యొక్క చైతన్యం అపరిమితంగా వ్యాపనం చెందటానికి చక్కటి అవకాశం, కాలం మనకి కల్పిస్తోంది. కాబట్టి ఈ నాలుగు రాశుల యొక్క తత్వం మనయందు సాధన

చేసుకోవడం ద్వారా ఈ నరసింహమూర్తి యొక్క తత్వము మనకి అవగాహన అయ్యి , చతుర్భుజుడై భగవంతుడు ఎట్లా ఈ నాలుగు వ్యూహాలనీ నాలుగు రకాలుగా నడిపిస్తున్నాడో తెలుస్తుంది. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలు. లేక ఇంకో పద్ధతిలో చెప్పుకోవాలంటే సనక, సనందన, సనత్కుమార సనత్సుజాతీయులు అని. ఇట్లా నాలుగుగా చాలా ఉన్నాయి. కాబట్టి ఈ మొత్తం సృష్టి లో మనకి four fold key ఇచ్చారు. ఈ four fold key, Madam Blavatsky కి కూడా ఇచ్చారు పరమ గురువులు. ఈ four fold key ఉపయోగించి Pythagoras అనే పరమగురువు విజ్ఞానాన్ని పాశ్చాత్యదేశాలకు పంచడం జరుగుతుంది. దాన్నుంచి ఆయన ఒక four fold keyboard ని తయారు చేశారు. ఏమిటయ్యా అంటే అది, number key, sound key, color key, form key. Number, sound, color and form or shape. ఈ నాలుగు రకాలకి సంబంధించిన చతుర్వర్గ జ్ఞానమేదైతే ఉందో దీన్ని అవగాహన చేసుకుంటే సమస్తం అవగాహన అవుతుంది. దాన్ని బట్టే మనకి గుణముల యొక్క విభజన కూడా పెద్దలు చేశారు. "చాతుర్వర్ణ్యం మయా సృష్టం" అని చెప్పి భగవద్గీతలో ఉన్నట్టు, బ్రాహ్మణ ధర్మము, క్షత్రియ ధర్మము, వైశ్య ధర్మము, శూద్ర ధర్మము. అవి పుట్టుకతో సంబంధించినవి, స్వభావంతో సంబంధించినవి. ఇదంతా కూడా ఈ నారసింహ అనే దాంట్లో ఇమిడి ఉన్నది. ఒక పెద్ద విజ్ఞానం నారసింహ విజ్ఞానం. ఎంతో మంది భక్తులు, అంటే భగవత్సాధకులు నారసింహుని యొక్క ధ్యానం ద్వారా కైవల్యస్థితి చాలా సులభంగా పొందారు. నరసింహమంత్రంకి ఉండే మహత్తరమైన శక్తి ఏమిటంటే భయాన్ని పారద్రోలుతుంది. ఈ భూతప్రేతపిశాచాదివేవీ కూడా మన చుట్టూ వంద కిలోమీటర్ల రేడియస్ లో ఉండటానికి వీలు లేని శక్తి అది. భయంకరంగా ఉంటుంది. ఒక అబ్బాయి, America లో బాగా మంచి స్థితిలో ఉన్నాడు. పెళ్లి చేసుకుందాం అనుకుంటూ ఉంటే, అక్కడే ఎవరో పెళ్లి చేయటానికి ప్రయత్నం చేశారు, పెళ్లి కాలేదు. India కి వచ్చాడు. India కి వచ్చేసరికి, పిచ్చివాడై వచ్చాడు. ఏమిటేమిటో మాట్లాడతాడు, ఎవరెవరో కనపడుతున్నారు అంటాడు. Mental balance పోయింది. వీడు కాదు, ఎవరో వేరే మాట్లాడుతున్నట్టుగా వాళ్ల తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. అతను మన దగ్గరికి వస్తే హోమంలో కూర్చోబెట్టాను. కూర్చోబెట్టి కొంచెం హోమం చేస్తుంటే, నారసింహ మంత్రం చెప్పినప్పుడు, వాడిని పట్టినది ఒకసారి లేచి

పారిపోయింది. అంటే నరసింహ మంత్రం లో, నరసింహ మంత్రం చేసుకున్న వాళ్ళకి అసలు Evil కానీ, fear కానీ దరిదాపుల్లోకి రావడానికి అవకాశం లేదు. అది నరసింహమంత్రంలో ఉండే ఒక చిట్కా. 'నారసింహ వపుః' అనేది విష్ణుసహస్రనామంలో ఒక నామంగా మనకి భగవంతుడు ఇచ్చాడు. అంటే ఈ నాలుగు శబ్దముల యొక్క శక్తి ఏదైతే ఉన్నదో, అది ఆధారంగా ఈ మొత్తాన్ని తను పైన ఉండి మూడు లోకాలుగా అల్లుతాడన్నమాట. తానుంటాడు. తన నుండి, భర్గోదేవ మండలం లేక cosmic plane. తన నుండి సవితృ మండలం లేక solar plane. తననుండి భూమండలం లేక planetary plane అల్లుతాడు. భూర్భువస్సువర్లోకాలు తానుగా ఉండి అల్లుతాడు, తను నాలుగోవాడుగా ఉంటాడు. లేకపోతే ఆయన మొదటివాడైతే, ఈ మిగతా మూడు ఏర్పడుతుంటాయి. ఈ మొత్తం నాలుగుకి సంబంధించిన సమస్త విజ్ఞానము ఈ న, ర, సింహ అనే శబ్దాలలో ఉన్నాయి. ఈ నార శబ్దాన్ని మనకి అందించే వాడు నారదుడు. ఈ శబ్దముల యొక్క తత్వమును మన యందు శాశ్వతము చేయగలిగిన వరమును ప్రసాదించేవాడు నారదమహర్షి. నారాయణ మంత్రంలో కూడా ఈ రెండు శబ్దాలు మనకి ఎక్కువగా స్మరణకి వస్తూ ఉంటాయి. నరసింహ మంత్రంలో కూడా ఈ రెండు శబ్దాలు ఉంటాయి. ఇది కాక సింహ శబ్దం ఉంటుంది. సింహం, సోహం, హంస, హ్సౌం, ఇవన్నీ కూడా స, హ అనే శబ్దములకు సంబంధించిన permutations అన్నమాట. రకరకములైన కలయికలు దానిద్వారా మనకి ఆ, ఇ, ఉ, ఓ, ఏ, ఔ, ఇవన్నీ కూడా మనం అనుకున్న సామాన్యమైన శబ్దములు కావు. అ అంటే భగవత్ తత్త్వానికి సంబంధించిన శబ్దం. ఇ అంటే, ప్రధాన కి సంబంధించిన శబ్దం. అ కి, ఇ కి జరిగిన interaction వల్ల వచ్చిన శబ్దం, 'ఉ'. అట్లాగే అ కు ఉ కు, interaction వలన వచ్చిన శబ్దం 'ఓ' . అట్లాగే అ కి, ఇ కి interaction వలన వచ్చిన శబ్దమే 'ఏ'. ఇట్లా ఇవన్నీ కూడా మహత్తరమైన, శక్తివంతమైన శబ్దములు. అచ్చులని గూర్చి మనం సరదాగా చెప్పుకోవడానికి వీల్లేదు. అవి ప్రాణశక్తులు. వీటిని చక్కగా మన పెద్దలు ఒక పద్ధతిలో అమరిక చేసి, అవి ఉచ్చారణ ద్వారా మనలో ఒక విధమైన transmutation అంటే పదార్థము యొక్క మార్పు చైతన్యవంతముగా తయారుచేయటానికి ఈ శబ్దాలన్నీ అందులో ముఖ్యమైన శబ్దాలు, నారసింహ వపుః. నరసింహ క్షేత్రాలు సింహాచలం, అంతర్వేది, మంగళగిరి, అహోబిలం క్షేత్రాల్లో స్వామిని దర్శించి సాధన చేసుకుంటే,

చాలారకాలైన limitations మనలో shatter అయిపోతాయి. Shattering effect ఉంటుందన్నమాట నరసింహుడికి. ఒక్కసారి చూస్తే, మిరుమిట్లు గొలిపినట్లుగా చైతన్యం ప్రవేశించి, మనలో ఉండే పరిమితత్వాన్ని ఛేదన చేసే శక్తి అందులో ఉన్నది. నరసింహుడు  భగవంతుని నామములన్నిటిలోకి కూడా, అతిశక్తివంతమైన నామం. ఇక అంతకుమించి శక్తివంతమైన నామం, భగవంతునికి లేదు, మనకి పెద్దలు దర్శించిన మార్గంలో చూసుకున్నట్లయితే. నరసింహుడు అంటే, నరులలో సింహము వంటి వాడు అని కూడా ఒక అర్థం తెలుసుకోవచ్చు. నరదేహము, సింహము తల కలిగినవాడు కదా నరసింహుడు. మనకి, జంతువులలో సింహము ఉన్నది. జంతువులలో రెండు రకాల సింహాలున్నాయి. ఒకటి అడవిలో ఉండే సింహము, ఇంకొకటి, గ్రామంలో ఉండే సింహం. గ్రామములో ఉండే సింహాన్ని గ్రామసింహం అంటారు. గ్రామసింహమంటే, మనమెరిగిన కుక్క! గ్రామ సింహానికి, అడవిలో ఉండే సింహానికి కొన్ని పోలికలున్నాయి. అందుకనే దీన్ని గ్రామసింహం అన్నారు. ఎందుకనంటే, రక్షణ కల్పించటం అనే విషయంలో సింహానికి ఎక్కువ సంకేతంగా వాడతారు. మనకి కుక్క ఆ విధమైన రక్షణ కల్పిస్తూ ఉంటుంది. Beware of dogs. కుక్కలున్నాయి జాగ్రత్త! ఎందుకంటే, వెధవ్వేషాలు వేస్తే కరుస్తాయని. వెధవ పనులు చేసి, ఇంట్లోకి దూకామనుకోండి. అంతే సంగతి. Protection అనేది గ్రామసింహమునకు ఒక స్వభావం. అడవిలో సింహం కూడా అంతే! మిగతా జంతువులన్నిటినీ ఆ విధంగా protect చేస్తూ ఉంటుంది. Nobility అనేది సింహానికి అతి ముఖ్యమైన మరియొక స్వభావం. ఒకటేమో, రక్షణ, రెండవది, ఉదారమైన స్వభావము కలిగి ఉండటం. ఇదీ మనకి జంతువులకి సంబంధించినంతవరకు, సింహతత్త్వం. మనుషుల్లో కూడా ఈ సింహతత్త్వం వచ్చిందనుకోండి. సింహతత్వానికి సంబంధించిన సమస్త రహస్యాలు సింహరాశి యందు జ్యోతిష శాస్త్రంలో ఇవ్వబడి ఉంది. సింహరాశిలో ఉన్న రహస్యాలు, స, హ అనే శబ్దములకు సంబంధించి ఉంటాయి. నరుడియందు ఈ 'స' అనే శబ్దము, 'హ' అనే శబ్దము, పరిపూర్ణంగా అనుభూతి  నరసింహుని యొక్క ధ్యానం చేసుకోవటం ద్వారా కలుగుతుంది. మనమున్నాం అని చెప్తూ ఉంటామే, మనం మేల్కొంచాం అని చెప్తూ ఉంటామే, ఆ మనం ఉండటం అనేది 'స' అనే శబ్దానికి సంబంధించింది.  మనం మేల్కొంచటం అనేది 'హ' అనే శబ్దానికి సంబంధించింది. అంటే, చైతన్యవంతమైన స్థితిని, 'హ'

శబ్దంగా మనం తీసుకోవాలి. మనం ఉన్నాం అనే స్థితిని 'స' అనే శబ్దంగా తీసుకోవాలి. అంటే ఒకటి, existence, రెండవది, awareness of existence. ఒకటి, మనం ఎలా ఉన్నామో మనకి తెలియటం, రెండవది మనం ఎలా మేల్కొంచి ఉన్నామో మనకి తెలియటం. అందుకనే జగత్తుని మేల్కొంచే పరిస్థితిని, అమ్మవారంటారు. జగత్తులో ఉన్న స్థితిని అయ్యవారంటారు. అందుకని అయ్యవారి స్తోత్రం చేయటానికి ఋగ్వేదంలో 'స' అనే శబ్దంతో మొదలుపెడతారు. పురుష సూక్తంలో 'సహస్ర శీర్షా పురుషః' అంటారు. అలాగే, అమ్మవారికి సంబంధించిన సూక్తం మొదలుపెట్టినప్పుడు, 'హ' అనే శబ్దం 'హిరణ్యవర్ణాం' అని చెప్పి మొదలుపెడతారు. కాబట్టి ఇవన్నీ మనకి ఋషులు శబ్ద తరంగముల యొక్క potential అంటే శక్తిని గమనించి, ఆ శబ్దాన్ని అనుకరించి, దాని ద్వారా ఏ విధంగా సృష్టి ఏర్పడిందో గమనించి, అదే విధంగా సృష్టిలో ఉన్న శక్తులన్నీ కూడా మానవునిలో మేల్కొంచటానికి కొన్ని పద్ధతులిచ్చారు. కాబట్టి మనలో కూడా మనం ఉన్న స్థితి లేక సత్య స్థితి అంటాం. మనం నిద్రలో కూడా ఉన్నామని చెప్తూ ఉంటాం కదా! మనం మేల్కొంచినప్పుడూ ఉన్నాం, మనం పనులు చేసేటప్పుడు ఉన్నాం, మనం పోట్లాడుకునేటప్పుడూ ఉన్నాం, ఎప్పుడూ ఉంటాం. ఆ ఉన్న స్థితినే 'సత్య స్థితి' అంటారు. 'స' అనే శబ్దం యొక్క అవతరణం మనయందు పూర్తిగా జరిగినట్లయితే, మనకి ఈ ఉన్న స్థితి మేల్కొంచటం అనేది ఉంటుంది. అలాగే 'హ' అనే స్థితియందు మనం ఈ శబ్దం ద్వారా చైతన్యము నందు మేల్కొంచటానికి అవకాశం ఉంటుంది. అందుకని మనకి పెద్దలు 'సోహం' అనే మంత్రాన్ని ఇచ్చి ఉన్నారు. ఈ 'సోహం' మంత్రాన్ని చేసుకోవటానికి కొన్ని నియమాలు కూడా ఇచ్చి ఉన్నారు. ఆ నియమాలు పాటించకుండా కేవలం మంత్రాలు చేసుకుంటే మంత్రాలు ఫలించవు. 'స', 'హ' అనే శబ్దములు చక్కగా ఉచ్చరించాలి. చైతన్యం మనలో బాగా ఉద్బుధం అవ్వాలి అంటే వాక్కు, రుచి అనే విషయాల యందు పరిపూర్ణమైన నియమము కలిగి ఉండాలి. నాలుకకు రెండు ఉపయోగాలున్నాయి. ఒకటేంటంటే రుచి చూడటం, రెండవది మాట్లాడటం. ఈ రెండిటియందు నియమము లేనివారికి ఈ 'హ' అనే శబ్దం యొక్క ఉచ్చారణకి పట్టు తప్పుతుంది. 'హ' శబ్దాన్ని ఉచ్చారణ చేసుకోలేరు కాబట్టి చైతన్యవంతులవటానికి అవకాశం ఉండదు. అంటే మాటలయందు సరియైన పొందిక లేనివారికి, చైతన్యవంతులు అవటానికి అవకాశం లేదు. మహాత్ముల జీవితాలు కనుక మనం తరచి చూసుకున్నట్లయితే,

వాళ్ళ మాటల యొక్క పొందిక చాలా ఎక్కువగా ఉంటుంది. అపశబ్దం వారి నోటినుంచి రాదు. వారి నోటి నించి ఏదన్నా శబ్దం వస్తే, అది జరగబోయే కార్యక్రమానికి అనుగుణంగానే శబ్దము వస్తుంది తప్ప, తదతీతంగా రాదు. దానికి వ్యతిరేకంగా రాదు. అది ఎలా ఏర్పడుతుందంటే దానికి నియమం ఉన్నది. ఆ నియమంలో అతి ముఖ్యమైన నియమం, నాలుకని, ఆహారం స్వీకరించటానికి పవిత్రంగా వాడుతున్నామా, లేదా! అలాగే మాటను ఉచ్చరించటానికి పవిత్రంగా వాడుతున్నామా, లేదా! ఈ పవిత్రత కొరవడినప్పుడు చైతన్యవంతులవటం చాలా కష్టం. ఇది ముఖ్యమైనది. అది మనయొక్క చైతన్య స్థితి నించి మనని సంసరణం చెందేటట్టుగా తయారు చేస్తుంది. మాటలు సరిగ్గా లేకపోతే జారిపోతాం. పొందికగా మాట్లాడటం, అవసరమైన మాటే మాట్లాడటం, అవసరమైన భావాన్ని తెలియచేయటానికి అతి తక్కువ పదాలు వాడటం--. ఒక విషయం చెప్పాలంటే పది వాక్యాల్లో చెప్పచ్చు, ఒక వాక్యంలో చెప్పచ్చు, ఒక సంజ్ఞతో కూడా చెప్పచ్చు. ఆ చెప్పగలగటం అనేది, మనలో ఉండే చైతన్య స్థితి బట్టి ఉంటుంది. చైతన్య స్థితి లేని వాడు భావాన్ని సరిగ్గా బయటకి వ్యక్తం కూడా చేయలేడు. వ్యక్తం చేసినప్పటికీ, దానికి అక్కర్లేని పొట్టు చాలా ఉంటుంది, అసలు గింజ తక్కువ ఉంటుంది. Husk అంటూ ఉంటాం కదా, చాలా husk కొడుతున్నాడు వీడు అనంటే అర్థం ఏమిటంటే, అసలు తక్కువానూ, దాని చుట్టూ వేసే పదజాలం ఎక్కువ. ఈ వ్యాపార సరళిలో మాట్లాడేవాళ్ళు లోపల ఒక ఉద్దేశం పెట్టుకుని బయటి కొకటి మాట్లాడుతూ ఉంటారు చూశారా! వాళ్లందరూ కూడా ఈ పొట్టును బాగా దంచుతూ ఉంటారు, అసలు విషయం చెప్పకుండా. వాక్యము యందు పదబలం చక్కగా ఉచ్చరించేవాళ్లు, సరియైన పదాన్ని వేయగలిగినవాళ్ళు. వాళ్ళు ఇటువంటి మాటలు వింటున్నప్పుడు అందులో గింజ ఏమిటి, పొట్టు ఏమిటి అనేది సులభంగా చెప్పేయగలరు. ఎందుకంటే చైతన్యము నందు ఎక్కువ మేల్కాంచి ఉంటారు కాబట్టి. భగవంతుని యొక్క అనుభూతికి దగ్గరగా మనం వెళ్లాలంటే ఈ నాలుకకు సంబంధించిన సాధన, అతి ముఖ్యమైన సాధన. అందుకని, దానిని చాలా పవిత్రంగా వాడాలి. నాలుక రుచికి, మాటకి పని చేస్తుంది. మనిషి విషయంలో రెండు ఉపయోగాలు ఉన్నాయి నాలుకకి, జంతువుల విషయంలో ఒక ఉపయోగమే ఉన్నది. జంతువు తింటుంది, మనమూ తింటాం. కాకపోతే మనం మాట్లాడతాం, జంతువు మాట్లాడదు. కాబట్టి మనకి extra advantage ఇచ్చారు. దాని పక్కనే ఒక

disadvantage కూడా ఉంటుంది. కత్తి ఇచ్చారనుకోండి పళ్ళు కోసుకోమని, గొంతు కోసే ప్రమాదం కూడా దాంతో ఉంది కదా! ఆ పద్ధతుల్లో నాలుక యొక్క వినియోగం తెలిసి ఉండాలి. అలా అని మాట్లాడటం తెలియదు కాబట్టి మాట్లాడకుండా ఉండేవాడు గొప్పవాడు కాదు. ఎందుకంటే ఒక శక్తిని నీకిచ్చినప్పుడు దానిని సద్వినియోగం చేయగలిగితేనే, దానియొక్క అనుభూతి నీకు వస్తుంది. సద్వినియోగం చేసుకోకపోతే అనుభూతి రాదు. మంచి car ఇస్తే, drive చేస్తే accident అవుతుంది కాబట్టి drive చేయను, అనేవాడికి అనుభూతి ఏముంది? కాబట్టి ఇచ్చిన శక్తిని సద్వినియోగం చేయటం ద్వారా మనం చైతన్య వంతులం అవటానికి, అనుభూతి చెందటానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి బ్రహ్మ వైవత్స పురాణం లో దీని గురించే చెప్తారు. బ్రహ్మ దగ్గరకి, కలిదేవత వస్తాడు కలియుగం మొదలైనప్పుడు. కలిదేవత, నల్లగా వికారంగా ఉండి నవ్వుతూ, ఒక చెయ్యేమో నోటిదగ్గరానూ, ఇంకో చెయ్యేమో లింగం మీద వేసుకొని వస్తాడు వెకిలిగా నవ్వుతూను. ఎందుకు ఒక చెయ్యి అక్కడ పెట్టావు, ఒక చెయ్యి ఇక్కడ పెట్టావు అంటే, ఈ రెండూ ఎవరికి weak అయితే వాళ్ళందరూ నాకు బానిసలు, కలియుగంలో అని చెప్తాడు. అంటే కామమునకు లోబడిన వారు, రుచికి, మాటకి, వివశులైనవారు నాకు బానిసలు ఈ భూమ్మీద, అనే message చెప్పటానికి ఇట్లా దిగి వెళ్తున్నాను భూమి మీదకి అని చెప్పి, మనకి ఆ పురాణంలో చెప్పబడి ఉంది. దీన్ని బట్టి కలి మనని తాకుతున్నాడా లేదా అని చూసుకోవాలంటే ప్రత్యేకించి, నాలుక ఎట్లా వాడబడుతోంది అనేదాన్ని బట్టి చాలా సులభంగా తెలుస్తుంది. అబద్ధాలాడుతున్నామనుకోండి నాలుకతో. ఆడతాం కదా! Misrepresent చేశామనుకోండి నాలుకతో. గ్రీకు దేశంలో ఒక శిష్యుడు గురువుని, 'రెండు నాలుకలు కదా పాముకి, చాలా విషం కలిగిన జంతువట కదా' అంటే, 'రెండు నాలుకలు పాముకి ఉన్నాయని చెప్పి మనకి తెలుస్తుంది, కాబట్టి జాగ్రత్త పడతాం. మనిషికి, కనపడటానికి ఒక నాలికే కనిపిస్తుంది కానీ చాలా నాలుకలు ఉన్నాయి. వాడిని చూసి ఎక్కువ భయపడు. పామును చూసి భయపడక', అని చెప్తారు. పామును చూసి భయపడాల్సిన అవసరం లేదు, మనిషి నాలుకను గూర్చి ఒక్కసారి ఆలోచించు, అని చెప్తారు. ఆలోచిస్తే కొన్నాళ్ళు మనుషులు ఎట్లా మాట్లాడుతున్నారో ఈ శిష్యుడు చూసి, చాలా ఆశ్చర్యపోతాడు. అమ్మో! ఇంత భయంకరంగా నాలుకని వాడచ్చా అని చెప్పి. ఆశ్చర్యపోయి, మళ్లీ

గురువుగారి దగ్గరకు వచ్చి, ఈ ప్రపంచంలో అతి భయంకరమైన విషయం ఏమిటయ్యా అంటే నాలుక, అని చెప్తాడు. అది మనిషిని నాశనం చేసేస్తుంది, అని చెప్తాడు. అతి భయంకరమైన విషయం తెలుసుకున్నావు కాబట్టి, నీ సాధన, నీ విద్యాభ్యాసం పూర్తి చేసుకునే లోపల, అతి పవిత్రమైన విషయం కూడా నువ్వే కనుక్కుని నా దగ్గరకి రా, అని చెప్తాడు శిష్యుడికి గురువు. సాధన చేసి చేసి చేసి, చివరికి అతి పవిత్రమైన విషయం కూడా నాలుకయే, అని శిష్యుడు గురువుకి చెప్తాడు. సంతోషిస్తాడు గురువుగారు. అది తెలిసేటప్పటికి వాడు చైతన్యవంతుడవుతాడు. నాలుక యొక్క పవిత్రత, శక్తి తెలిసిన వారెవరూ కూడా నాలుకతో మరొక విధంగా ప్రవర్తించటానికి వెనకాడతారు. దాన్ని వినియోగించుకోవాలి. వినియోగించుకోకపోవటం చేతకానితనం. దుర్వినియోగం చేసుకోవటం దురదృష్టం. నిజానికి నాలుక, దాని వాడుక గురించి మనం కొన్ని క్లాసులు పెట్టుకోవాలి. మనకి fundamentals అవి. అవి సరిగ్గా ఉంటే, చైతన్య స్థితి యందు ఎక్కువ మేల్కొంచటానికి అవకాశం ఉంటుంది. అందుకనే మునులు ఎక్కువ మాట్లాడరు. మునులెందుకు అయ్యారంటే, వాళ్లెక్కువ మననమునందు ఉంటారన్నమాట. చైతన్యస్థితి యందు మేల్కొంచి ఉండి, అవసరమైతే అలా మాట్లాడి, అవసరం లేకపోతే వీలున్నంత వరకు మౌనంగా ఉంటారు. అక్కర్లేని పనులు చేయం కదా! చాలామంది complications వచ్చేసి పనులు చేయకుండా ఉండేవాళ్లు ఉంటారు. అక్కర్లేనప్పుడు మాట్లాడినా కూడా అంతే! అక్కర ఉన్నప్పుడు మాట్లాడకపోయినా అంతే. అక్కర ఉన్నప్పుడు మాట్లాడనివాడు, అక్కర్లేనప్పుడు మాట్లాడినవాడు ఇద్దరూ కూడా, consequences create చేసుకుంటారు. హేతువులు create అయిపోతాయి. సృష్టింపబడతాయి. కాబట్టి ఇంత విజ్ఞానం ఈ యొక్క 'హ' అనే శబ్దంలో ఇవ్వబడి ఉన్నది. దానికెప్పుడైనా మనం ప్రత్యేకంగా వాక్కు, దాని వినియోగం గురించి చెప్పుకుందాం. 'స' అనే శబ్దాన్ని ఉచ్చారణ చేయాలంటే, మూడు రకములైన స్థితులయందు మనకి, జయం కావాలి. అదేమిటయ్యా అంటే:-

1. మన పదార్థము 2. మనలో ఉండే ఇంద్రియ శక్తి. 3. మనలో ఉండే భావనము. ఈ మూడిటియందు పట్టు దొరికిన వారికి, 'స' అనే శబ్దంలో నించి పట్టు దొరుకుతుంది. పదార్థం మీద స్వామిత్వం, అంటే, ఇన్ని గంటలకి లేద్దామనుకుంటే,

అన్ని గంటలకి లేవగలిగి ఉండాలి. ఇంకో పావుగంట పడుకుందాంలే అనుకునేవాళ్లు, పదార్థం మీద స్వామిత్వం ఉన్న వాళ్ళు కాదు.

Madam Blavatsky, Practical occultism అనే పుస్తకంలో నువ్వు పడుకున్న తరువాత, మూడు గంటల తరువాత, ఎప్పుడు నీకు నీ అంతట నీకు మెలకువ వస్తుందో, అప్పుడు లేచిపోగలిగితే నువ్వు బద్ధకం లేనివాడివి, అని చెప్తారు. అంటే దీన్ని, అపరాహ్నం, మధ్యాహ్నం పన్నెండు తరువాత, అట్లాగే రాత్రి పన్నెండు తరువాత, రెండు ఉన్నాయి. రాత్రి పన్నెండు తరువాత గభాలున మెలకువ వచ్చింది అనుకోండి, అప్పుడు లేచిపోమని చెప్తారు. అమ్మో మనం పడుకోకపోతే ఎట్లా అని self pity మీద మళ్లీ పడుకుంటాం. కానీ లేచిపోతే అప్పుడు చాలా బావుంటుంది. అది ఆమె చెప్పినది. శరీరంలో ఉండే పదార్థం మనని చాలా control చేస్తుంది. శరీరమే మనకి మన కార్యక్రమాలన్నీ నిర్ణయం చేస్తూ ఉంటుంది. అంటే బద్ధకం అనేది ఏ మనిషిలో ఉందో వాణ్ణి శరీరం regulate చేస్తున్నట్టు. అంటే పదార్థం regulate చేస్తున్నట్టు. అలాగే ఇంద్రియములు! ఇంద్రియములు మనం ఉపయోగిస్తున్నామా, లేక ఇంద్రియములు మనని ఉపయోగించుకుంటున్నాయా? మనము ఉపయోగించుకోవలసినవి, మనని ఉపయోగించుకునేవి మూడు. 1. ఆలోచన 2. ఇంద్రియ శక్తి, 3. దేహము. ఈ మూడిటి యందు స్వామిత్వం వచ్చిన వారికి 'స' అనే శబ్దం మీద పట్టు వస్తుంది. అప్పుడు ఈ రెండు శబ్దములు సరిగా ఉచ్చరింపబడి, మనలో ప్రాణాపానములు అనేవి సవ్యంగా జరుగుతాయి. అంతవరకు సవ్యంగా జరగవు ప్రాణాపానములు. చాలా మంది ప్రాణాయామము అని చెప్పి చేస్తూ ఉంటారు. అది ఒక glamour. ప్రాణాయామము చేసేది కాదు, ప్రాణాయామము జరిగేది. ప్రాణాయామం ఎప్పుడు జరుగుతుదంటే, ప్రాణము పరిపూర్ణంగా దేహము లోనికి ఆవాహనం చేయబడటం, అపానము దేహము నించి బయటికి పరిపూర్ణంగా బహిర్గతం అవటం, ఈ రెండూ సమానంగా జరిగినప్పుడు, ప్రాణాయామం అనేది జరిగి, ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఆగిన స్థితిలో స్పందనము మాత్రమే అనుభూతి చెందుతూ, స్పందనం కూడా ఆగిన స్థితికి చేరడానికి అవకాశం ఏర్పడుతుంది. ఎప్పుడు ఏర్పడుతుంది? ఈ 'హ' అనే శబ్దానికి, 'స' అనే శబ్దానికి, వాటిమీద స్వామిత్వం వచ్చినప్పుడు మాత్రమే అది ఏర్పడుతుంది. కాబట్టి నరులలో, ఈ రెండు చైతన్యాలని ఎవరైతే పరిపూర్ణంగా అనుభూతి చెందుతాడో, వాడు, నరసింహుని యొక్క అనుగ్రహానికి

పాత్రుడైనవాడు. అటువంటి వాడు ప్రహ్లాదుడు. భాగవతంలో అందరికన్నా ముందు చెప్పే భాగవతులలో మొదటివాడు. భాగవతులు అంటే, సర్వకాల సర్వావస్థల యందు కూడా భగవంతుని యందు ఉండే వారు. అంతేకాని part time గా భగవంతుని తలుచుకుని మిగతా time లో మన ఇష్టమొచ్చిన పనులు చేసుకునే వారెవరూ కూడా భాగవతులు అనటానికి అపచారం చేసినట్లు. భాగవతులు ఎటువంటి వారంటే, ఈ time కి అని కానీ, ఈ place అని కానీ, ఈ రూపమని కానీ, ఈ నామమని కానీ పరిమితం కాకుండా ఎల్లవేళలయందు, ఎల్ల ప్రదేశములయందు, ఎల్ల రూపముల యందు, ఎల్ల నామముల యందు భగవంతుని మాత్రమే దర్శనం చేసేవారు భాగవతులు. అంతేకాని కాసేపు ఏదో రోజుకు గంట, రోజుకు రెండు గంటలు God consciousness, మిగతా అప్పుడు అంతా non God consciousness గా ఉండే వాళ్ళు భాగవతులు అనటానికి వీల్లేదు. అటువంటి భాగవతులందరిలోకి, number one, numero Uno ఎవరయ్యా అంటే ప్రహ్లాదుడు! అందుకనే భక్తుల గురించి చెప్పేటప్పుడు, ప్రహ్లాద నారద అంటారు. నారద ప్రహ్లాద ఉండదు. ప్రహ్లాద నారద అంబరీష అట్లా run అవుతుంది. ఎందుకంటే, ఎప్పుడూ మరువని వాడు ప్రహ్లాదుడు. అటువంటి ప్రహ్లాదుడు, నరసింహుడు అనే చైతన్య స్థితిని పరిపూర్ణంగా సిద్ధి చెంది ఉంటాడు. మొత్తం భాగవతంలో ఉన్న అందరు భాగవతోత్తముల యొక్క చరిత్రలను చదువుకున్నట్లయితే, ఆ మొత్తంలో instant protection అనేది ప్రహ్లాదుడొక్కడికే ఉంది. మిగతావారికి protection లేదని నేను అనను, కొంత సన్నివేశాలు అయిన తరువాత వస్తూ ఉంటాయి. కొంత నలుగుతూ ఉంటారు, ఆ తరువాత భగవంతుని యొక్క రక్షణ వస్తూ ఉంటుంది. గజేంద్రుడు కొంత నలిగిన తరువాత వస్తుంటుంది. కుంతి కొంత నలిగిన తరువాత రక్షణ వస్తుంటుంది. వ్యాసుడు కొంత వ్యాకులం పడ్డ తరువాత వస్తుంది. నారదుడు పూర్వ జన్మ వృత్తాంతాలు చాలా ఉన్నాయి. అంబరీషుడు, బలి, వీళ్ళందరిలో మనం ఎవరిని తీసుకున్నా, కొంత నలిగిన తరువాత, ఆ తరువాత రక్షణ కలగటం అనేది కనిపిస్తుంది. ప్రహ్లాదుని రక్షణ ఎటువంటిది? ఎటువంటి రక్షణ అంటే, ఎవడు రక్షిస్తున్నాడో కూడా తెలియదు. తండ్రి నూనెలో పారేసినా, నీళ్ళల్లో పారేసినా, మంటల్లో పారేసినా, కొండ ఎత్తు మీద నించి పడేసినా, వీడికి ఏమీ కావట్లేదు, ఎందుకు కావట్లేదు? ఎవరు రక్షిస్తున్నాడో తెలియదు. అంటే అవ్యక్తమైన స్థితి నించి భగవంతుడు instant

protection అనేది offer చేసే స్థితి నరసింహ స్థితి. నరసింహము అనే భగవంతుని యొక్క స్థితిని అనుభూతి చెంది, ఆ అనుగ్రహం లో జీవించేవాడిని ఎవరూ ముట్టుకోలేడు. అన్నమాచార్యులవారు కూడా నరసింహ నామాన్ని బాగా చేసుకున్నవారు. నారసింహ నామము నందు సిద్ధిపొందినవారు. ఇట్లా నరసింహకి సంబంధించిన యోగము ఒకటి ఉన్నది. యోగ నరసింహము, జ్వాలా నరసింహము. మనకి మన M.N గారి పేరు జ్వాలా నరసింహము. ఈ నరసింహ స్థితిలో instant protection అనేది ఈ regulations పాటించే వారికి ఉంటుంది, పాటించని వారికి ఉండదు. ఈ regulations లో ముఖ్యమైనవి, ఇందాక నేను చెప్పినవి పాటించుకుంటూ, ప్రాణాయామం చేసుకుంటూ ఉంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసలు చేస్తూ ఉంటే, వాటి మధ్య balance ఏర్పడుతుంది. ఆ balance ఏర్పడటం ద్వారా, మనలో శమము అనేది ఏర్పడుతుంది. ఇది ప్రశాంతతగా ఏర్పడుతుంది. ఆ ప్రశాంతతలో మనసు కరిగిన స్థితి ఏర్పడుతుంది, ఆ స్థితిలో ఎప్పుడూ ఉండటం అనేది ఏర్పడుతుంది. అది ఏర్పడటం అనేది ఈ కుంభ యుగంలో సులభంగా ఏర్పడుతుంది. అది నా తాపత్రయం. అందుకని మళ్లీ చెప్తున్నాను. నరసింహ అనే పవిత్రమైన నామము గురించి. కుంభయుగంలో నరసింహ అనే శబ్దము యొక్క అనుగ్రహము పొందడానికి కాలము ఎక్కువ అనుకూలంగా ఉంది. ఎందుకంటే, కుంభరాశిని అద్దంలో పెడితే సింహరాశి కనిపిస్తుందన్నమాట! అంటే మన బొమ్మ మనం అద్దంలో చూసుకున్నామనుకోండి. అద్దంలో ఉన్న బొమ్మ మనం కాదని మనకి తెలుసు కదా, కానీ మనలాగే ఉంటుంది కదా. అంటే మన copy కదా అక్కడ కనిపించేది. అట్లాగే కుంభరాశి యొక్క copy సింహరాశి. Original కుంభరాశి అన్నమాట. ఈ కుంభరాశిలో మళ్లీ మనకి నరసింహుని యొక్క అనుగ్రహాన్ని పొందటానికి అవకాశం ఎక్కువ ఉంది. అందుకని నరసింహ నామం బాగా చేసుకోవాల్సిన అవసరం కూడా ఉన్నది. నరసింహ నామం ద్వారా limitations అనేవి చాలా తొందరగా break అయిపోతాయి. మనలో ఉండే limitations ఏవైతే ఉన్నాయో, అవి నరసింహ నామంతో చాలా సులభంగా break అయిపోతాయి. అన్నీ self-proposed limitations మనకి. అవి ఇంకోళ్లు break చేయటానికి వీల్లేదు. మనమే break చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుంటే, ప్రకృతి కూడా co-operate చేస్తుంది. గుడ్డులో ఉన్న పిల్ల, బయటికి రావాలి కాబట్టి మనమే గుడ్డు

పగలగొట్టామనుకోండి. గుడ్డు చితికి పోవటమే కాకుండా, పిల్ల కూడా చచ్చిపోతుంది. గుడ్డులో పిల్ల, లోపలనుంచి గుడ్డుని పగుల కొట్టుకోవాలనే ప్రయత్నం చేస్తున్నప్పుడు, బయట nature co-operation వచ్చి గుడ్డు పగులుతుంది. ఈ గుడ్డు పగిలే కార్యక్రమం అనేది, ఈ నరసింహ నామంలో చాలా ఎక్కువగా జరుగుతుంది. అందుకే నరసింహం యొక్క చేతస్సు లేదా చైతన్యము, భళ్ళున తెల్లవారినట్టుగా ఔతుంది. అంటే చైతన్యము యొక్క వ్యాపన స్థితి చాలా అనూహ్యమైన రీతిలో expansion వస్తుంది. కుంభయుగం యొక్క, ఆ కాలం యొక్క స్వభావం కూడా చైతన్యం యొక్క వికాసమే కదా! Expansion of consciousness is the keynote of Aquarian age అని చెప్పకుంటూ ఉంటాం English లో. జ్యోతిష శాస్త్రంలో చెప్పబడింది ఏంటంటే, కుంభయుగంలో కుండపోతగా చైతన్యం మనలో ఏర్పడి, అది వికాసం చెందుతుందని. ఆ వికాసం చెందటానికి ఈ నరసింహ నామం చాలా పనిచేస్తుంది. చాలా త్వరగా break అయిపోతాయి limitations. పటపటలాడించేస్తాడన్నమాట.

'ఉగ్రం వీరం మహావిష్ణుం, జ్వలంతం సర్వతోముఖం
నృసింహం భీషణం భద్రం, మృత్యు మృత్యుం నమామ్యహమ్'

అన్నిపక్కలా మంట పెట్టేస్తే పని తొందరగా అయిపోతుంది కదా. మృత్యువుకే మృత్యువుట నరసింహుడు. అంటే మృత్యువు కూడా చచ్చేంత భయపడతాడు. నరసింహుడు ఉన్నచోట మృత్యువు రావటానికి చాలా భయపడుతుంది. నరసింహుడు ఉంటే ఎవరూ ఇంకేమి పని చేయటానికి వీలు లేదు. అంటే పెద్ద సార్ వాడు అన్నమాట. ఇంక అంతకన్నా మించి ఇంకేం లేదు, అదిటండీ ప్రహ్లాదుణ్ణి కాపాడిన భగవంతుని యొక్క, అవతరణ స్థితి. అంటే భాగవతం మొత్తం చదువుకుంటే, భాగవతులని రక్షించిన రీతిలో ప్రహ్లాదుని రక్షించిన రీతి ఇంకెవరికీ లేదు. అందుకనే ప్రహ్లాద, నారద, అంబరీష , అట్లా run అవుతూ ఉంటుంది, hierarchy. Instant protection! ఇటుపక్కనించి చూస్తే ప్రహ్లాదుడు అన్ని విషయాల్లోనూ, ఆయనయందే ఎప్పుడూ జారకుండా ఉన్న స్థితి.

'పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ హాసనిద్రాదుల్ చేయుచున్'

ఏం చేస్తున్నా, భగవంతుడ్నే! అన్నం తింటున్నాం కాబట్టి భగవంతుణ్ణి మర్చిపోవడం, friends తో మాట్లాడుతున్నాం కాబట్టి భగవంతుడిని మర్చిపోవడం, Office పనుల్లో busy గా ఉన్నాం కాబట్టి మర్చిపోవడం, అట్లా

ఉండే వాళ్ళకి భాగవత మార్గం కాదది. అదేదో some part-time job. Full-time కాదు. Full-time job లో ఇట్లా ఉన్నవాడికి ఈ విధమైన రక్షణ వస్తుంది. హిరణ్యకశిపుడికి కూడా అదే వస్తుంది. వాడికీ ఇదే తపన. ఎక్కడున్నాడు ఎక్కడున్నాడు, అని గోల చేస్తాడు, కదా! గోల చేస్తుంటే ఇక్కడున్నాను అని చెప్తాడన్నమాట. ఎక్కడ, ఎక్కడ అంటే, ఇక్కడ అంటాడే, అట్లా హిరణ్యకశిపుడి ఇంటి స్తంభంలోంచి బయటికి వ్యక్తమైన వాడు కదా నరసింహుడు. మన ఇంటికి కూడా ఒక స్తంభం ఉంది. ఆ స్తంభం లేకపోతే మన ఇల్లే లేదు. ఆ స్తంభమే మన వెన్నెముకలో ఉన్న బ్రహ్మాదండం. ఆ బ్రహ్మా దండంలో బ్రహ్మా రంధ్రంలో ఉన్న ఇడ, పింగళ, సుషుమ్న అనే నాడులు, అందులో సుషుమ్నలో ఉన్న పోగులు, సన్నని కనపడని దారాలుగా ఉండే గొట్టాలు గొట్టాలుగా ఉండే వాటిలో మనం ఉన్నాం అనే స్థితి  ఉంటుంది. అక్కడ నించి మొత్తం చైతన్యం ఒక్కసారి భళ్ళున ఈ గొట్టంలోంచి బయటికి వచ్చింది అనుకోండి! వెలిగిన tube light కి, వెలగని tube light కి ఎంత తేడా ఉంటుందీ? Tube light వెలగనప్పుడు, ఏం కనిపిస్తుంది మనకి? ఉత్త tube కనిపిస్తుంది. వెలిగినప్పుడు చుట్టుపక్కలంతా కూడా వెలుగు తీసుకొస్తుంది కదా. ఆ విధంగా స్తంభంలోంచి బయటికి వస్తాడు నరసింహుడు. అందుకని, స్తంభంలో ఉన్న నరసింహుని ధ్యానం చేసుకోవాలి. మనకి కూడా స్తంభం ఉంది కాబట్టి ఈ స్తంభంలో ఉండే నరసింహుడు, బయటికి వచ్చి మొత్తం అంతా వ్యాపనం చెందే ప్రక్రియ అంతా కూడా  నృసింహ అవతారం అనే విషయంలో చక్కగా ఇవ్వబడి ఉన్నది. మనయందు నరసింహుడు ఈ విధంగా ఉద్భవిస్తాడు. ఎందుకంటే ఉన్నాడు కాబట్టి. వాడు ఉండటమే మనం ఉండటం. కాబట్టి వాడు ఒక్కసారి వ్యాపనం చెందాడనుకోండి, expand అయ్యాడనుకోండి మనయందు  చైతన్యం  మేల్కాంచుతుంది. Everything is spread with light and there is nothing but light thereafter. అది మనకి కుంభయుగంలో చెప్పబడిన  సూక్ష్మశరీర నిర్మాణం అనండి, అంతఃకరణ శరీర నిర్మాణం అనండి, లేక భాగవత శరీర నిర్మాణం అనండి. ఇవన్నీ కూడా గ్రంధాల్లో ఇవ్వబడిన రకరకాల నామాలు. అటువంటి వాళ్ళకి భాగవత శరీరం ఏర్పడుతుంది. భాగవత శరీరం ఏర్పడినవారికి ఇంక నీరు ఏం చేయలేదు, గాలి ఏం చేయలేదు, నిప్పు ఏం చేయలేదు, భూమి ఏం చేయలేదు, ఆకాశం ఏం చేయలేదు. అటువంటి expansion నరసింహుడు తీసుకొస్తాడు. ఎట్లా తీసుకొస్తాడుట అంటే నరసింహుడు, బొడ్డులో

వేళ్ళు పెట్టి, గుండె వరకు పీకుతాడు. వేరు చేస్తాడు. అంటే మనలో బంధింపబడిన చైతన్యాన్ని హృదయం వరకు పట్టుకొస్తాడన్నమాట. అది, హిరణ్యకశిపుడికి చేసేది నరసింహుడు. తన ఒళ్లో పడుకోపెట్టుకుని, బొడ్లో గోళ్లు గుచ్చి లాగుతాడు. ఆ లాగటం అంటే ఏమిటంటే విడతీస్తాడన్నమాట. ఇరుక్కుపోయిన ప్రజ్ఞని విడతీసి, హృదయమునందు స్థిరపరుస్తాడు. హిరణ్యకశిపుడు మళ్లీ భగవంతునియందు చేరటం అనే ఒక కార్యక్రమం ఈ విధంగా అక్కడ నిర్దేశించారు. మనం నరసింహతత్వము గురించే చాలా చెప్పుకోవలసి ఉంది. న, ర, సింహ అనే ఈ నాలుగు అక్షరములు నాలుగు రకములైన ఆయన దేహ వ్యూహములు అని కిందటిసారి చెప్పాం. ఇప్పుడు, నరసింహ తత్వం ఏ విధంగా వ్యాపనం చెందుతుంది, ఏ విధంగా రక్షణ కలుగచేస్తుందనేది మీ ముందు ఉంచాను, దీని మీద ఎక్కువ ధ్యానం చేసుకోవాలి. ప్రత్యేకించి భయపడుతున్నవాళ్లు ధ్యానం చేసుకుంటే చాలా త్వరగా భయం నించి బయటపడతారు. భయానికి చాలా చక్కటి మందు నరసింహ మంత్రం. అక్రూరుడంతటి వాడు అర్ధరాత్రి భయమేస్తే ఉలిక్కి పడి లేచిన తరువాత, ఒక్కసారి నరసింహ మంత్రం చేసుకుంటాడు. అక్రూరుడికే తప్పలేదంటే మనమెంత? అక్రూరుడు భాగవతుల్లో ఒకడు. అక్రూరుడు భగవంతుని యొక్క దర్శనం చేసిన వాడు. నారాయణ స్థితి వరకు దర్శనం చేసిన వాడు. ఆయనకి కంసుడి కొలువులో పని చేస్తున్న రోజుల్లో, ఒక రోజు రాత్రి గభాలున భయం వేసి, లేచి కాళ్ళూ చేతులు కడుక్కుని, నరసింహ మంత్రం చదువుకుని మళ్లీ పడుకుంటాడు. మనం ఒకమాదిరి జీవులం కాబట్టి, వ్యాసుడు చెప్పిన అలసులమ్ కదా! అలసులు అంటే weak persons అన్నమాట. కాబట్టి మనకి భయం అనేది సహజంగా రావటానికి సన్నివేశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. అప్పుడు నరసింహ మంత్రం. రోజూ నరసింహ మంత్రం చేసుకుంటే, అంతకన్నా best లేదు. భగవంతుని యొక్క ఈ నామం మహత్తరమైన నామాల్లో ఒకటి, నారసింహవపుః.

## ౨4. శ్రీమాన్.

శ్రీ అంటే అమ్మవారు. వెలుగు. ఆయన నించి వ్యక్తమై వెలుగుతుంది, ఆ వెలుగు లోంచి మొత్తం సృష్టి అంతా నడిచివస్తుంది. దిగి వస్తుంది. శ్రీ చే కొలువబడే వాడు భగవంతుడు! వెలుగే కొలుస్తుందిట! చైతన్య స్వరూపిణి అయిన అమ్మవారు చేత కొలువబడుతున్న వాడా అని అర్థం. ఈ భాగవత మూర్తులందరూ ఎవరయ్యా అంటే, శ్రీ చేత అనుగ్రహింపబడినవాళ్ళు. భగవంతుడు శ్రీ చేత కొలువబడుతూ ఉంటాడు. అంటే చైతన్య స్వరూపానికి ఇంకా అవతల ఉన్న వాడన్నమాట, భగవంతుడు. ఎందుకంటే, మనం చైతన్యవంతులం కాకముందు కూడా ఉన్నాం కదా. పొద్దున్నే నిద్ర లేవకముందు కూడా మనం ఉన్నాం కాబట్టి, ఉన్న స్థితి, చైతన్య స్థితి కన్నా ముందు స్థితి. అంటే అమ్మవారి కన్నా ముందు స్థితి అన్నమాట. అమ్మవారికన్నా ముందు ఉన్నాడు కాబట్టి, అమ్మవారు కొలుస్తూ ఉంటుంది. మనకన్నా ముందు ఉన్నవాళ్ళని మనం కొలుచుకుంటూ ఉంటాం కదా. మన అబ్బాయిని మనం కొలుచుకోం కదా. మన తండ్రిని మనం కొలుచుకుంటూ ఉంటాం. ఎందుకంటే మన ముందు కాబట్టి. అట్లాగే అమ్మవారికి ముందు ఉన్న అయ్యవారిని, అమ్మవారు కొలుచుకుంటూ ఉంటుంది. అంటే, అటువంటి స్థితిలో ఉన్నవాడని! 'శ్రీ' గురించి నాలుగు స్థితులు ఉన్నాయి.

1 'శ్రీ' కి అవతల ఉన్న, 'శ్రీ' చేత కొలవబడుతున్న స్థితి ఒకటి, అది దైవ స్థితి లేక నారాయణ స్థితి.

౨. 'శ్రీ' యందు ఉండటం అనేది ఒకటి ఉన్నది. అంటే పరిపూర్ణమైన చైతన్య స్వరూపులుగా ఉండటమనే ఒక స్థితి. అది పరమ భాగవత మూర్తులకు ఉన్న స్థితి.

3. మూడవ స్థితిలో 'శ్రీ' చేత అనుగ్రహింపబడిన స్థితి ఒకటి ఉంటుంది. అంటే, వారియందు 'శ్రీ' పని చేస్తూ ఉంటుందన్నమాట. 'శ్రీ' యందు మనం ఉండటం ఒకటి. ఎప్పుడూ 'శ్రీ' యందే ఉంటారు కాబట్టి వాళ్ళు కూడా 'శ్రీ' తో సమానమైపోతారు. అంటే ఈయన అమ్మవారా అనిపిస్తుందన్నమాట, ఒక్కొక్కరిని చూస్తూ ఉంటే. ఎందుకంటే అమ్మవారు పరిపూర్ణంగా అతడు లేకుండా అమ్మవారున్న స్థితి అంటే పరిపూర్ణ చైతన్య స్థితిని 'శ్రీ స్థితి' అంటారు. మనం అందరినీ అందుకే 'శ్రీ శ్రీ' అని పిలుస్తూ ఉంటాం. శ్రీ సత్తిబాబు గారు

అన్నామనుకోండి, అంటే ఆయనలో 'శ్రీ' ఉన్నదని గుర్తించడం అన్నమాట. అందరిలో మరి, తలకాయ ఊపేవాళ్ళు, కాళ్ళూ చేతులూ కదిపేవాళ్లు, అందరిలో కూడా ఈ చైతన్య స్థితి ఉంది కదా. ఈ కదలిక ఏదైతే చేస్తున్నదో, ఆ కదలిక అంతా కూడా శ్రీయే. మనలో జరిగే కదలిక అంతా కూడా శ్రీయే. కాబట్టి ఈ 'శ్రీ' అనే స్థితి నించి 'శ్రీ' అనుగ్రహించే స్థితి ఉందిట అంటే, 'శ్రీ' నించి విడిపడి ఉన్నాడు కానీ 'శ్రీ' యొక్క అనుభూతి, అనుగ్రహం పొందుతూ ఉంటాడు. అంటే, వీళ్ళందరూ ఎవరయ్యా అంటే, అమ్మవారి యొక్క భక్తులు. లేక కరుణను అందుకోగలిగిన స్థితిలో ఉండేవారు. వీళ్ళందరూ ఎప్పుడూ పవిత్రమైన స్థితిలోనే ఉంటారు. ఇది మూడవ స్థితి.

4. నాలుగవ స్థితి, 'శ్రీ' అనుగ్రహానికి పాత్రత సంపాదించుకోని మనుషులు. 'శ్రీ' అనుగ్రహానికి పాత్రత సంపాదించుకోని మనుషులే ఎక్కువగా ఉంటారు. 'శ్రీ' అనుగ్రహానికి పాత్రత సంపాదించుకున్న వాళ్లంతా, ఒక విధమైన వైభవంలో ఉంటారు. ఎక్కడ వైభవం లేదో అక్కడ 'శ్రీ' లేదు. 'శ్రీ' అంటే వెలుగు. ఎంత వెలుగు ఉంటే, అంత వైభవంగా ఉంటుంది. అబ్బా ఆ ఇల్లా, చాలా కళకళలాడిపోతుందండీ అంటాం. ఆవిడ చాలా కళగా ఉంటారండి అంటాం. లేకపోతే, ఆయన చాలా కళగా ఉంటారండి అంటాం. వారిలో కళ అమ్మవారియొక్క అవతరణం. ఎంత అమ్మవారి యొక్క అవతరణ ఉంటే, అంత కళ ఉంటుంది, అంత రాణింపు ఉంటుంది, అంత వైభవం ఉంటుంది, అంత సౌభాగ్యం ఉంటుంది, సర్వతోముఖమైన సౌభాగ్యము, ఐశ్వర్యము కలిగి ఉంటారు. లేకపోతే paints ఊడిపోయిన గోడలు, బూజులు పట్టిన, దుమ్ము పట్టిన ఇళ్ళు, దుమ్ము ఎక్కువగా ఉండి, dull గా ఉండేవాళ్ళు, మామూలుగా సంతోషంగా ఉండేవాళ్ళకి కూడా అక్కడకి వెడితే ఉన్న సంతోషం మాయమైపోతుంది. చీకటి ప్రదేశాలు, దుఃఖపూరితమైన ప్రదేశాలు కష్టములతో కూడిన జీవితాలు, ఇవన్నీ కూడా 'శ్రీ' లేకపోతే ఉండేవి. 'శ్రీ' లేకపోతే, ఇంకంతా భయంకరమైన స్థితి. ఎవరుంటారు 'శ్రీ' లేకపోతే అంటే, 'శ్రీ' బదులు వాళ్ళ అక్కయ్య ఒకావిడ ఉంటుందిట, ఆవిడ పేరు జ్యేష్ఠ. పెద్దమ్మవారు అంటూ ఉంటామే, ఆవిడ చోటు చేసుకుంటుంది. కలియుగంలో ఆవిడదే domination. మనం చేసే ప్రతి పనికి, ఈ జ్యేష్ఠ అనే అమ్మవారు ఎక్కువ మనలో permanent గా settle అయిపోవటానికి కావలసిన పద్ధతిలో మనం జీవిస్తూ ఉంటాం అంటే, ఆపాదమస్తకము ఎంత మలినము ఉంటే, అంత జ్యేష్ఠ

అమ్మవారు ఉన్నట్టు. శరీరంలో మలినాలు, ఇంద్రియముల యొక్క ప్రవర్తనలో మలినాలు, మనస్సు యొక్క భావనలో మలినాలు ఇవన్నీ కూడా జ్యేష్ఠ అనే అమ్మవారు మనలో ఎంత ఉంటే అంత ఉంటుంది. వీటి బట్టి ఆవిడ ఉంటుంది. ఇవి ఎంత తక్కువ ఉంటే అంత 'శ్రీ' ఉండటానికి అవకాశం ఏర్పడుతుంది.

' క్షుత్పిపాసామలాం జ్యేష్టాం అలక్ష్మీర్ నాశయామ్యహమ్.'

నా యందు అలక్ష్మి అనే, అంటే లక్ష్మి కాని ఈ క్షుత్ - ఆకలి, పిపాస - దాహం, మల- మలమంటే, అపవిత్రత. ఇవి నాశనం చేసేసెయ్యి తల్లీ అలక్ష్మి ఇదంతా, అని అడుగుతున్నాం శ్రీ సూక్తంలో. ఇవి నాశనం చేసేయి. ఎంత తిన్నా ఆకలే కదా! అంటే తినటం అంటే భోజనం ఒకటే కాదు. డబ్బులు కూడా. పుచ్చుకోవడమల్లా తినటమే. ఏది పుచ్చుకున్నా సరే. ఆకలి, దాహము, అపవిత్రత. ఈ మూడు, అలక్ష్మి అని చెప్పారు. అందుకని మహాత్ములు, ఇచ్చిందల్లా పుచ్చుకోరు. అపరిగ్రహం అనే ఒక నియమంలో ఉంటారు. మనకి ఇచ్చిందల్లా పుచ్చుకోవడమే కాదు, ఇవ్వందల్లా దోచుకోవడం అనే స్థితిలో ఉన్నాం కదా. అంటే వాడు ఇస్తే సరి, ఇవ్వకపోతే ఎట్లాగో అట్లా లాగేద్దాం అనే పరిస్థితి వచ్చింది. రకరకాలుగా లాగేసే మనస్తత్వం ఉండేవాళ్ళు అమ్మవారి గురించి ప్రార్థన చేసుకుంటే అమ్మవారు నవ్వుతుంది. ఇస్తే పుచ్చుకోవయ్యా, అనే స్థితి నించి జారి, ఇస్తే కూడా నీకు అర్హత ఉంటే పుచ్చుకో, అన్నారు. అపరిగ్రహం అన్నారు. అర్హత లేనిది మనకిచ్చారనుకోండీ పుచ్చుకోకూడదు. ఎవరన్నా తీసుకొచ్చి సార్ ఈ diamond ring మీకు ఇస్తున్నానంటే, ఎందుకిస్తున్నావు అని అడగాలి. ఎందుకిస్తాడు ఊరికే అవన్నీ? Diamond ring వరకు అఖ్ఖర్లా, ఒక పళ్ళ బుట్ట తెచ్చాడనుకోండీ, ఎందుకు అని తెలుసుకుని పుచ్చుకోవాలి. సద్వినియోగం చేసేట్టయితే తీసుకోవచ్చు, అంతే కానీ మనమే తినేయటానికి పుచ్చుకోకూడదు. ఆ స్థితి నించి, వచ్చింది పుచ్చుకోవడం అనే స్థితికి జారతాం. మనం అడగలేదు కదా, అది వచ్చింది కదా, మనం పుచ్చుకుందాం అనిపిస్తుంది. వచ్చిందల్లా పుచ్చుకోవడం కూడా తంటాయే! వచ్చిందల్లా పుచ్చుకోవడం వల్లే విశ్వామిత్రుడు తపస్సు నుంచి పక్కకు వచ్చేస్తాడు. ఆవిడొచ్చింది కదా, వచ్చేసరికి ఈయన తపస్సులోంచి భగవంతుడే పంపించాడనుకున్నాడు, పక్కకెళ్ళిపోయాడు. వాసుదేవోపాసనని మనవాళ్ళు కొంతమంది విచక్షణ వదిలేసి సాధన చేస్తూ ఉంటారు. వచ్చిందల్లా పుచ్చుకోకూడదు, విషమిస్తే పుచ్చుకుంటావా? వచ్చిందిగా అది కూడా? అప్పుడెందుకు పుచ్చుకోవు? లేకపోతే ఎవరన్నా మనకి

అప్పు చేసి తిరిగి ఇవ్వలేదనుకోండీ, అప్పుడు మనం ఊరుకుంటామా? ఏదొస్తే అది పుచ్చుకుంటాం అనే వాడు, అన్నీ కూడా పుచ్చుకోగలగాలి. అదే కాదు, వచ్చింది పుచ్చుకోవటమే కాకుండా, రాని దానికి ఎగబడటం అనేది మనకి చాలా ఉంది కదా. అంటే ఎన్ని steps దిగిపోయాం 'శ్రీ' అనే స్థితి నించి చూసుకున్నట్లయితే, పరుగులాడే వాడికి 'శ్రీ' ఉండదు. డబ్బు ఉండచ్చు. 'శ్రీ' ఉండదు. కళ ఉండదు. కళావిహీనంగా ఉంటుంది. ఎంతుంటే ఏం లాభం? కళ లేదు. అందుకని
'క్షుత్పిపాసామలాం జ్యేష్ఠాం, అలక్ష్మీర్నాశయామ్యహం. అభూతిం, అసమృద్ధించ.'

ఈ జ్యేష్ఠ అనే అమ్మవారు అసలు అనుభూతి అనేది ఏం లేకుండా కూడ చేస్తుందిట. అన్నీ ఉంటాయి, అనుభూతి ఉండదు. అంగట్లో అన్నీ ఉన్నాయి అల్లుడి నోట్లో శని ఉంది అన్నట్లుగా ఉంటాయి అనుభూతి లేని జీవితాలు. అది కూడా జ్యేష్ఠ అనే అమ్మవారు బాగా తిష్ఠ వేసుకు కూర్చుంటే, వస్తాయి. 'అభూతిం, అసమృద్ధించ, సర్వాన్నిర్ణుదమే గృహాత్'. ఇవన్నీ తీసేయమ్మా మా ఇంట్లోంచి, అని అడుగుతున్నాం అమ్మవారిని రోజూ. అంటే మనకి తెలియని భాషలో అడుగుతూ ఉంటాం, అది కూడా. ఓహో! ఇవన్నీ.మనం అడుగుతున్నామా! మీకు తెలుసో తెలియదో మీరు గుర్రాలు, ఆవులు కూడా అడుగుతూ ఉంటారు. శ్రీ సూక్తంలో. "అశ్వదాయీచ గోదాయీ ధనదాయీ మహాధనే" అంటే. ధనం, మహాధనం ఇవన్నీ అడిగాం, ఇచ్చారంటే బావుంటుంది. అశ్వాలు, గోవులు కూడా ఇస్తుందిట అమ్మవారు. ఏం చేసుకుంటారివి? ఆవిస్తే ఇంట్లో పెట్టుకోలేం, గుర్రమిస్తే మేపలేం. కానీ అక్కడ అశ్వమంటే గుర్రమూ కాదు, గోవు అంటే ఆవూ కాదు. పవిత్ర గ్రంథాలు చదవాలంటే, మనలో ఉండే పవిత్రతను బట్టి అందులో ఉండే విషయాలు తెలుస్తాయి తప్ప, మనం ఎట్లా ఉన్నా చదివితే అందరికీ ఒకే అర్థం రాదు. అశ్వము అంటే ప్రాణము. గోవు అంటే వెలుగు. వెలుగు కిరణం! గో పాదం పెట్టించాలండీ పొలం దున్నే ముందు, అంటారు. అంటే ఏంటంటే సూర్యుడి కిరణం పడితే కానీ పొలం దున్నటానికి వీల్లేదు. గోపాదం పెట్టటం అంటే అది. అట్లాగే ప్రతిదానికీ సంకేత పదాలు ఉంటాయి. ఆ సంకేతాలు తెలుసుకోకుండా మనం పనిచేసుకుంటూ ఉంటే ఉపయోగపడదు. కాబట్టి ఇక్కడ శ్రీమాన్ అన్నప్పుడు ఈ 'శ్రీ' చాలా మృగ్యంగా ఉంటుంది. మనము చేసే పనులు బట్టి ఉండటానికి అవకాశం తక్కువుంటుంది. ఎంత పవిత్రత ఉంటే అంత 'శ్రీ' ఉంటుంది. ఎంత అపవిత్రత ఉంటే

అంత జ్యేష్ఠ ఉంటుంది. అందుకని 'శ్రీ' కన్నా జ్యేష్ఠ, పెద్దమ్మవారు అని ఎందుకన్నారంటే, ముందు మన దగ్గర ఉండేది ఈవిడ, తరువాత వచ్చేది ఆవిడని. ఆవిడ చిన్నమ్మవారు, ఈవిడ పెద్దమ్మవారు. మలినంగా ఉందనుకోండి అయినా పరవాలేదు, get on అయిపోయాం అనుకోండి. శరీరం వాసన వస్తోంది. స్నానం చేయకపోయినా పరవాలేదు అనుకున్నామనుకొండీ. వేసుకున్న బట్టలు వాసన వస్తున్నాయి. పరవాలేదు అనుకున్నామనుకోండి. గోళ్ళు పెరిగిపోయినాయి, దాంట్లో మట్టి చేరిపోతోంది. పరవాలేదు అనుకున్నామనుకోండి. ఇట్లా అనుకునేవాడు ఏమని చేస్తున్నాడంటే, అట్లా పేర్చుకుంటూ ఉంటాడు జ్యేష్ఠ అనే అమ్మవారిని. ఎంత మనం వీటిని clean గా ఉంచుకుంటే, అంత, శ్రీ can shine forth అంటే వెలుగు, అంత వికాసం చెందటానికి అవకాశం ఏర్పడుతుంది, ఎంత మనం అశ్రద్ధ చేస్తే, అంత మసిబారిపోతూ ఉంటుంది. Chimney వంటిది మసిబారిపోతుంది కదా దీపం పెట్టినప్పుడు. ఎంత దీపం వెలుగుతున్నప్పటికీ కూడా దీపం కిందే కొండి ఏర్పడుతూ ఉంటుంది కదా. కొండి తీయకపోతే దీపం కూడా పోతుంది. ఎంత బ్రహ్మాండంగా ప్రజ్వలంగా వెలుగుతున్న దీపం కూడా కొండి తీయకపోతే అది కాసేపటికి out. కాసేపు అంటే దానికి ఒక time span ఉంటుంది. కాబట్టి ఎప్పటికప్పుడు కొండి తీసేస్తూ ఉండాలి. ఈ మొత్తం creation అంతా కూడా ఒక process of combustion లో నడుస్తూ ఉంటుంది. ఒక అగ్నికార్యం ఇదంతా జరుగుతున్నది మనలో. అగ్ని కార్యం జరిగేటప్పుడు అందులోంచి పొగ, మసి, రావటం అనేది చాలా సహజమైన విషయం. రైలు ఇంజను వెళుతూ ఉంటే పొగ వదులుతూ ఉంటుంది కదా, అట్లాగే మనకి కూడా రకరకాల మలినాలు, అంటే carbon ఏర్పడుతూ ఉంటుంది, because of the activity that is being conducted inside by the fire. వేడిమి, లేక అగ్ని లోపల చేస్తున్న కార్యం అగ్ని కార్యం. ఆ కార్యం జరుగుతున్నప్పుడు కొంత ఈ మలినాలు వస్తూ ఉంటాయి. వీటిని clean చేసుకుంటూ ఉండాలి. ఎంత పరిపూర్ణంగా clean చేసుకుంటే అంత 'శ్రీ' యొక్క కిరణములు, అంటే వెలుగు కిరణములు మన మీద పడటానికి అవకాశం ఏర్పడుతుంది. వెలుగు కిరణాలు మన మీద పడటం అనేది ఏర్పడటమే బుద్ధి మనలో ఎక్కువ మేల్కొంచటం కింద చెప్తారు పెద్దలు, తెలివి మనలో ఎక్కువ పని చేయటం కింద చెప్తారు. వికాసవంతంగా కనిపించటం అని చెప్తారు. Attractive, magnetic, brilliant, ఇవన్నీ అంటూ

ఉంటాం కదా. What a brilliance he has అంటూ ఉంటాం. ఇవన్నీ ఎక్కడ నించి వస్తాయంటే, ఈ shining forth, ఈ లోపల ఉండే layers యొక్క purity బట్టి వస్తుంటాయి. ఆ purity పెంచుకున్న కొద్దీ నెమ్మదిగా, మొత్తం అంతా కూడా 'శ్రీ' తో నిండిపోయి, 'శ్రీ' యొక్క అనుగ్రహానికి పాత్రత ఏర్పరచుకున్న వాళ్ళమవుతాం. 'శ్రీ' యొక్క అనుగ్రహానికి పాత్రులు కాని వాళ్ళనల్లా కూడా తొక్కేస్తుంది పెద్దమ్మవారు. అది మనకి కాళి యొక్క సంకేతం. కాళికా అమ్మవారు, నిద్రపోతూ ఉన్న శివుడి మీద ఎక్కి తాండవం చేస్తూ ఉంటుంది. అంటే ఏమిటంటే మనలో ఉన్న ప్రజ్ఞా స్థితి శుభ్రంగా నిద్రపోతూ ఉంటుంది, ఇంక మిగతా matter అంతా కూడా, full activity లో ఉందని గుర్తుచేయటానికి మనకి ఆ సంకేతం ఇచ్చారు. కాస్త ఈ పవిత్రత పెంచుకుంటూ వెళ్తూ ఉంటే, దాని తరువాత ఇంకొక స్థితి కొస్తాం అదేమిటయ్యా అంటే అమ్మవారు ఒళ్ళోకి తీసుకుంటుందిట మనని. అందుకనే యశోద కృష్ణ, లేక Mary, Christ, క్రైస్తు నెత్తుకున్న మేరీ బొమ్మ, కృష్ణుడిని ఎత్తుకున్న యశోద బొమ్మ అంటే ఏమిటంటే అమ్మవారి యొక్క అనుగ్రహానికి పాత్రత సంపాదించుకున్నవాళ్ళం అన్నమాట. అమ్మవారి యొక్క అనుగ్రహానికి పాత్రత సంపాదించుకున్నాం అంటే, రక్షణకి మొట్టమొదట మెట్టు ఎక్కాం. ఎప్పుడెక్కించుకుంటుంది చంకలో అంటే, కాస్త పరిశుభ్రంగా ఉంటే ఎక్కించుకుంటుంది. మరీ మురుగ్గుంట లాగా ఉంటే, సరే అట్లా ఉండు కొన్నాళ్ళు అంటుంది. పవిత్రీకరించుకున్నప్పుడు ఆ తరువాత స్థితిలో ఏం చేస్తుందంటే, తనలో సగాన్ని అంకితం చేస్తుందిట. అంటే అర్ధనారీశ్వర తత్వంగా తన మీద స్వామిత్వాన్ని తనతో పాటు partner గా చేసుకుంటుంది. అంటే equal. ఎందుకంటే మొట్టమొదట ఏమో, when we have not observed the purity of life, slave state మనది. Purity కి, భారత దేశం ఇచ్చిన జీవన విధానంకి మించిన విధానం లేదు. మన సాంప్రదాయాల్లో ఇచ్చిన purity, మిగతా జాతుల్లో లేదు, ఈ మాట బల్లగుద్ది ఎక్కడైనా చెప్పచ్చు. ఎందుకంటే, ఎంగిలి అన్న పదమే లేదు మిగతా దేశాలలో. అంటు అన్న పదమే లేదు. ఎందుకు లేదంటే, వాళ్ళకి అది అసలు విధానంలో లేదు కాబట్టి, భాష లో అది పుట్టలేదు. అటువంటిది ఈ పవిత్రీకరణం అనే కార్యక్రమంలో ఎంత దూరం వెళ్లచ్చు అంటే, కింద పడి ఉన్న స్థితి నించి, అంటే, పదార్థం మనని తొక్కేసిన స్థితి నించి అమ్మవారి యొక్క అనుగ్రహానికి పాత్రుడవటం వరకు. అమ్మవారి యొక్క అనుగ్రహానికి పాత్రుడై, ఇంకా

పవిత్రీకరణకి సంబంధించిన జీవన విధానాన్ని పెంచుకుంటూ వెళ్తూ ఉంటే, తన partner గా చేసుకుని, తను సగం అప్పచెప్తుంది. సరే నువ్వు కూడా నాతోపాటు ఉండు, అని. ఆ తరువాత, మనకి స్వామిత్వాన్ని ఇస్తుందిట అది భగవంతుని యొక్క స్థితి. ఆమె మీద స్వామిత్వం ఉన్న స్థితి భగవత్ స్థితి. వారిని భగవాన్! అంటారు. ప్రకృతి మీద పరిపూర్ణమైన స్వామిత్వం కలిగిన వారిని, భగవాన్! అంటారు. మన పిల్లవాడికి 'భగవాన్' అని పేరు పెట్టుకున్నాం అనుకోండి. పెట్టేముందు ఆలోచించాలి. బావుందని పెట్టుకోకూడదు పేర్లని. 'భగవాన్' అని పెట్టుకున్నంత మాత్రాన భగవంతుడైపోరు కదా. 'భగవాన్' అయిన వాడు పెట్టుకోకపోయినా భగవానే! బంగారం బంగారం అని, చెప్పక్కర్లేదు. నకిలీ బంగారమే ఎక్కువ చెప్పుకోవాలి బంగారమని. ఈ స్థితిలో ఇక్కడ, భగవంతుడిని అవగాహన చేసుకోండి. ఏ శ్రీ అయితే ఆధారంగా ఈ మొత్తం సృష్టి అంతా ఏర్పడిందో, ఏ వెలుగైతే ఆధారంగా ఈ సృష్టి అంతా ఏర్పడిందో, ఈ మూడు లోకములు, అంటే భూర్భువస్సువర్లోకములన్నీ కూడా ఏర్పడినాయొ అటువంటి మొత్తానికి ఆధారమైన ఆమెకి, ఆయన కొలవబడేవాడు. ఆవిడ ఇంకో రకంగా కూడా కొలుస్తుందిట. అందుకని ఆవిడకి శ్రీమాత అని పేరు కూడా మనం చదువుతాం కదా లలితా సహస్రనామంలో. ఈయనని కొలుచుకుంటూ తయారు చేస్తుందిట మొత్తం అంతాను. అంటే వీడిలో ఇంత, వాడిలో ఇంత, ఇంతింతింతిత పడేస్తూ ఉంటుంది కొలతల ప్రకారం. మాతా అంటే కొలిచేదని. Measurer అని. భగవంతుడి యొక్క ముడిసరుకు అంటే raw material , దాంతో ఈ మొత్తం అంతా అల్లుతుంది కదా, పత్తితో గనక మనం దారాలల్లి, దారాలతో గుడ్డలల్లి, దాంతో బట్టలు నేసినట్టు, భగవంతుడనే తత్వాన్ని ఈమె measure చేసి, సృష్టి తయారు చేస్తుంది. అందుకని ఈమెని 'శ్రీమాత' అన్నారు. శ్రీ, that measures. ఈయన 'శ్రీమాన్' అన్నారు. అంటే 'శ్రీ' చేత కొలువబడేవాడా అని. 'శ్రీ' చేత కొలువబడే స్థితి నించి, 'శ్రీ' యందు జీవించే స్థితి నించి, 'శ్రీ' అనుగ్రహం పొందే స్థితి లోకి దిగజారి, అక్కడ నించి అనుగ్రహానికి పాత్రత పోగొట్టుకునే స్థితికి నాలుగు స్థితులున్నాయి. అంతా నాలుగు, నాలుగు గా వస్తుంది. మనకి ప్రస్తుతం కావలసినది ఏమిటంటే a continuous process of purification. అందుకనే purity of lifeకి చాలా importance. Purity of life, అంటే అది బహిర్గతమైనది ఒకటే కాదు, అంతర్గతం కూడాను. అంతర్గతమే కాదు, బహిర్గతం కూడాను. అటు దేశాల వారు

బహిర్గతమైన purity బాగా సాధించారు, మనకది లేదు. అంతర్గతమైన purity, ఇదివరకు మనకి ఎక్కువగా ఉండేది, ఇప్పుడది కూడా లేదు. మనకి రెండూ లేవు, వాళ్ళకి ఒకటుంది కనీసం. కానీ అంతర్గతమైన purity పెరిగితే మాత్రమే, 'శ్రీ' అనే స్థితి మనయందు ప్రసరించటానికి అవకాశం ఏర్పడుతుంది, అటువంటి అవకాశం ఏర్పడిన జాతి ఇక్కడ, మన పూర్వీకులు. కాబట్టి దానికి ఒక విధానమున్నది. ఆ విధానాన్ని మనం adapt చేసుకుంటూ వెళ్తుంటే purity పెరుగుతుంది. ఇంట్లో దుమ్మున్నా పరవాలేదు, కుర్చీలకు దుమ్మున్నా పరవాలేదు, గోడలకి బూజున్నా పరవాలేదు, కంచాలు clean గా లేకపోయినా పరవాలేదు, వంటిల్లు clean గా లేకపోయినా పరవాలేదు, బట్టలు clean గా లేకపోయినా పరవాలేదు, bathroom ఎట్లా ఉన్నా పరవాలేదు అనే పరిస్థితిలో ఉండే వాళ్ళకి purity గురించి చెప్పి ఉపయోగం లేదు. మరువు మహర్షిని ఒకసారి  ఒక సాధకుడు, నాకు ఏదన్నా ఒక పద్ధతి ఇవ్వండి సార్, అన్నాడు. అంటే అప్పుడు ఆయన అన్నారు, pure గా ఉండటం నేర్చుకో, అని. మరి మా ఇంటికి ఒకసారి మీరు ఎప్పుడొస్తారు సార్? అంటే,  నువ్వెంత pure గా ఉన్నావో చూడటానికి వస్తాను, అన్నారు. ఎప్పుడో అప్పుడు నాకు తోచినప్పుడు వస్తాను, అన్నారు. సరే వీడు pure, మొదలుపెట్టాడు. ఏదో pure. అదొక రకమైన purity మొదలుపెట్టాడు. కొన్నాళ్ళు పోయిన తరువాత, ఒరేయ్ వస్తున్నారా మీ ఇంటికి, అన్నారు. మామూలుగా మన ఇంటికి ఎవరన్నా వస్తే మనం ఏం చేస్తాం? మన drawing room అదీ బాగా సర్ది ఉంచుతాం. Drawing room సర్ది ఉంచితే వచ్చిన వాళ్ళు చూసి బావుందండీ వీళ్ళ ఇల్లు, అనుకుని వెళ్ళిపోతారు. కొంతమంది ముందు, Front lawn, పూల చెట్లు ఇవన్నీ బాగా పెంచుకుంటూ ఉంటారు కదా. లోపలికెళితే ఏమిటో మనకి తెలియదు. బయటికి మాత్రం బావుంటుంది.  Drawing room, అన్నీ బాగా సర్దాడు, dining hall అన్నీ సర్దుకున్నాడు. సర్దుకునేసరికి ఆయన వచ్చారు. ఆయన వచ్చిన తరువాత, కూర్చోండి సార్, అంటే, మీ ఇల్లు చూస్తానన్నాను కదా, ఇది కాదు నేను చూసేది నీ ఇల్లు అంటే, నీ bathroom ఎట్లా ఉందో, నీ kitchen ఎట్లా ఉందో, చూస్తాను అంటారు. అవి బావుండవు ఎప్పుడూను. ప్రత్యేకించి భారత దేశంలో. అదేమిటి సార్ అంటే, మరి చూడటం అంటే అక్కడ చూడాలిరా ఊరికే నువ్వు చూపించేవి చూస్తే ఏం లాభం, నువ్వు చూపించనివి నేను చూస్తే అప్పుడు తెలుస్తుంది నీ Purity ఎంతుందో, అని అంటారు. వద్దు సార్ ఇప్పుడు, ఇంకోసారి

రండి, అని చెప్తాడు. మన దేశంలో ఎవరింట్లో అయినా bathroom లోకి వెళ్లాలంటే చాలా భయమేస్తుంది. ఎందుకంటే, అంత భయంకరమైన వాసనలు అక్కడనించి బయల్దేరి మొత్తం ఇల్లంతా వ్యాపించే పరిస్థితుల్లో వాటిని ఉంచుకుంటాం మనం. పైగా ఇప్పుడు ఇంట్లోనే పెట్టుకుంటున్నాం కదా. అక్కడనించి, అంతకు ముందురోజు మనం తిన్న దుర్వాసనలన్నీ కూడా ఇంట్లో కొస్తాయి. ఇంట్లో bathroom పెట్టుకుంటే bathroom clean గా ఉంచుకోనివాళ్ళు, ఆధ్యాత్మికత గురించి మాట్లాడకూడదు. ముందు bathroom clean గా పెట్టుకోవాలి. వంటిల్లు clean గా పెట్టుకోనివాళ్ళు ఆధ్యాత్మికత గురించి మాట్లాడకూడదు. వంటింట్లో పిచ్చి పిచ్చి మాటలన్నీ మాట్లాడే వాళ్ళు ఆధ్యాత్మికత గురించి మాట్లాడకూడదు. ఎందుకంటే, అక్కడ మాట్లాడినవన్నీ ఆ వండే వాటిలోకి వెళ్ళిపోతూ ఉంటాయి కాబట్టి, అవే తింటూ ఉంటాం కాబట్టి, అవే మనలోకి వచ్చేస్తూ ఉంటాయి. వంటింట్లో కోప్పడుకునేవాళ్లు, తిట్టుకునే వాళ్ళు, ఉపయోగం లేదు. మరువుమహర్షి ఇంకో పన్నెండేళ్లకి మళ్లీ వస్తారు. అమ్మా! ఈ సారి మనమంతా upto the rear compound wall clean గా ఉంచాలని program పెట్టుకుంటాడు. అంటే ఎవరన్నా వస్తే clean చేసుకోవడం కానీ, మామూలుగా clean గా పెట్టుకుందామని కాదు.  మనం కూడా, ఎవరన్నా వస్తున్నారట అంటే అప్పుడు ఇల్లు సర్దుతాం. లేకపోతే మనం మామూలుగా, వెనకటి గుణమేల మాను, అన్నట్టుగా ఉంటుంది. ఆయన వచ్చారు. వచ్చిన తరువాత, రండి చూద్దురు గాని అంటే, ఆ ఇల్లు కాదురా చూడటానికి వచ్చింది, ఈ ఇల్లు అంటే  నువ్వుంటున్నావే, దేహం, దాన్ని చూస్తాను. దాన్నిండా చాలా ఉంటాయి కదా. అట్లా నెమ్మదిగా, మూడు visit లు అంటే అరవై ఏళ్లు అయిపోతాయి వీడికి. అప్పటికి వీడికసలు purity అంటే పరిపూర్ణమైన అవగాహన ఏర్పడుతుంది. ఇప్పుడు చెయ్యి సాధన అన్నీ జరుగుతాయి, అని చెప్తారు. ఎందుకనంటే, అమ్మవారి అనుగ్రహం లేకపోతే ఏవీ జరగవని మన పెద్దవాళ్ళు చెప్తుంటారే, అమ్మవారి అనుగ్రహం ఎట్లా వచ్చింది? అమ్మవారి ఫోటోయే సరిగ్గా తుడుచుకోవు, దానికి ఒక పువ్వే పెట్టవు.ఆ పటం పగిలిపోయినా అద్దం ముక్క కొంచెం, ఒక మూల విరిగిపోయిందనుకోండి, అదట్లాగే ఉంటుంది ఎందుకంటే డబ్బుకు విలువిచ్చి, అక్కడ అమ్మవారి ఫొటోయే తప్ప అమ్మవారనే భావన లేదు కదా. నిజంగా అమ్మవారన్న భావన ఉంటే, ఫొటో ఒక మూల ముక్క విరిగిపోతే తీసి వేయవా? మీకే కాలికి చిన్న దెబ్బ

తగిలిందనుకోండి వెంటనే కట్టు కట్టుకోవా? ఏది పగిలిపోయినా పరవాలేదు, ఫోటో వంకరగా ఉన్నా పరవాలేదు. లోపల పటం విరిగిపోయినా పరవాలేదు. లోపల చెదలున్నా పరవాలేదు. ఎందుకు పరవాలేదంటే, అమ్మవారిని ఊరికే పెట్టాము కానీ అక్కడ ఉందని భావన ఏది? అమ్మవారే, అమ్మవారి ఫోటో కాదు అనుకున్నవాడికి అమ్మవారు ఉంటుందక్కడ, అమ్మవారి ఫోటో అనుకున్నవాడికి ఫోటోయే ఉంటుంది. కాబట్టి మనం చేసే పనుల్లో, అక్కడ నిజంగా అమ్మవారుంటే మనం ఆ పనులు చేస్తామా? చాలా పనులు చేస్తూ ఉంటాం. ఇంటినిండా ఫోటోలు ఉంటాయి, కానీ మనం చేసే పనులేమీ మారవు. వాళ్లందరూ చూస్తున్నారనే భావన మనకుండదు. ఎందుకంటే ఫోటోలు అని మనకి బాగా రూఢిగా తెలుసు. అవి ఫోటోలు కావని తెలిస్తే, నిజంగా వాళ్లక్కడ కూర్చున్నారని తెలిస్తే, మనం అట్లా ప్రవర్తించటానికి అవకాశం ఏముంది? మరీ బొత్తిగా వాళ్ళ ముందు అట్లా ప్రవర్తిస్తే బావుండదు కదా. కానీ సత్యమేమిటంటే వాటిలోంచి వాళ్ళు దిగివస్తారు, మన భావన మాత్రం చేత. అందుకని మనవాళ్ళు, ఇల్లు చూస్తే ఇల్లాలిని చూడక్కర్లేదు, అని చెప్పారు. ఎందుకంటే ఆ ఇల్లు ఎంత కళగా ఉంటే, ఆ ఇల్లాలు అంత కళగా ఉంటుంది. కళకి, బయట పూసుకునే వాటికీ ఏమీ సంబంధం ఉండదు. అందంగా వేరే చాలా పూసుకోవచ్చు అది వేరే సంగతి. మేడి పండు చూడ మేలిమై ఉండును, పొట్ట విప్పి చూడ పురుగులుండు, అనే పద్ధతిలో మనకి బోలెడు పై మెరుగులుంటాయి. పై మెరుగులకేమీ అమ్మవారు మోసపోదు. ఎక్కడో లోపల గొట్టంలో ఉన్నది కదా ఆవిడ, గొట్టంలో ఉండే వెలుగుకు, అక్కడ నించి బయటవి అన్నీ easy గా కనిపిస్తాయి. మనం ఎంత దాచిపెడితే ఏమి ఉపయోగం? కాబట్టి ఆ పవిత్రత మనకి పెరగాలి, purity should become an aspect of life. ఒకసారి ఒంటిమీద తీసిన బట్ట మళ్లీ ఒంటి మీద వేసుకున్నాడంటే వాడెందుకూ పనికిరాడు. ఇంట్లోకి వచ్చేటప్పుడు, కాళ్ళు కడుక్కోకుండా ఇంట్లోకి వచ్చేసేవాళ్ళు, రైలు బట్టలతోనే మంచం మీద పడుకునే వాళ్ళు, వీళ్ళందరికీ, ఏం తెలియదు? అంటే purity aspect తెలియదు. రైలు నించి వచ్చి స్నానం చేయకుండా ఇంట్లో పడుకున్నామనుకోండి, ఏవేవో తెచ్చి ఇంట్లో పెడుతున్నట్టు. అట్లాగే బజారుకెళ్లి ఇంట్లోకొచ్చి, స్నానం చేసి లోపలకి రాని వాళ్లందరూ కూడా తెలియని వాళ్ళే. చెప్పులన్నీ గర్భగుడిలో వరకు తీసుకొచ్చేస్తుంటాం కదా. వాళ్ళు కూడా పవిత్రత అంటే తెలియనివాళ్ళే. పవిత్రత అంటే తెలిసినవాడికి, అంతకంతకీ, అంతకంతకీ ఇవన్నీ

తెలుస్తూ ఉంటాయి. ఊర్లో పెంటంతా, చెప్పుల ద్వారా ఇంట్లోకి తెచ్చుకుంటూ ఉంటాం కాబట్టి, అవి బయట వదలమన్నారు. లోపలకొచ్చే ముందు కాళ్లు కడుక్కోవడం వలన, there will be a cutoff of energies because, water is electricity. మన వేదంలో చెప్పిందేంటంటే, ఆకాశంలో ఉన్నది కూడా నీరే, భూమి మీద ఉండేది కూడా నీరే, ఆకాశంలో ఉన్న నీరును విద్యుత్తు అంటారు, భూమి మీద ఉన్న నీరును విద్యుత్తు అంటారు, కనుక ఇంత నీరు ఉండి, విద్యుత్తు తెచ్చుకోలేకపోతున్నాం అంటే, దౌర్భాగ్యం! కదలిక అంతా విద్యుత్తు అన్నారు. 'ఆపోవా ఇదగుం సర్వం' అని చెప్తాం కదా, ఈ మొత్తం అంతా కూడా కదలికే. కాబట్టి ఇంత ఉన్నప్పుడు మనం, మన ఆహార వ్యవహారాదులలో, మన దినచర్యలో పవిత్రత పాటించనివారు అమ్మవారి అనుగ్రహానికి పాత్రులవటానికి అవకాశం లేదు, లేదు, లేదు, ముమ్మాటికీ లేదు. జుట్టు కత్తిరించుకోనివాళ్ళు, గోళ్ళు తీసుకోనివాళ్ళు, మీసాలు కత్తిరించుకోనివాళ్ళు, పళ్ళుతోముకోనివాళ్ళు, సంస్కారము చేసుకోనివాళ్లు. అంటే దేహానికే అని చెప్పటంలేదు దేహానికి కూడా అంటున్నా. అంటే దేహానికే చేయనివాడు మిగతావి చేస్తాడనుకోవటం డంబాచారం. దేహానికే చేసి, దానితోనే పరిమితమైపోయిన వాళ్ళకి కూడా ఏమీ తెలియదు. దేహానికి చేయాలి, ఇంద్రియాలకు చేసుకుంటూ ఉండాలి, మనసుకు చేసుకుంటూ ఉండాలి, ఎప్పటికప్పుడు కడుక్కుంటూ ఉండాలి, ఎంత కడుక్కుంటూ తుడుచుకుంటూ, కడుక్కుంటూ తుడుచుకుంటూ ఉంటూ ఉంటే అంత మెరుపొస్తుంది. ఎంత మెరుపొస్తే అంత 'శ్రీ' మనకి ఉండటానికి అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి, దాని ప్రకారం, we have to mould our life. మళ్లీ వెధవది ఇస్త్రీకిస్తే డబ్బులు అయిపోతాయి అని, అవే బట్టలు మూడురోజులు వేసుకునేవాళ్ళకి ఆధ్యాత్మికత, పవిత్రత, అమ్మవారు, ఇవన్నీ ఊరికే అదొక glamour. తుడుచుకోకుండా పెట్టుకునేవాళ్లుంటారు. మన మీదవి, మనం వాడే వస్తువు ప్రతిదీ నిగనిగనిగలాడుతూ ఉండాలి. లేకపోతే ఏం లేదు సాధన. ఎంత నిగనిగలాడితే, అంత వెలుగుకు అవకాశం ఉంటుంది. గోడ మీదా వెలుగు పడుతోంది, బంగారం మీదా వెలుగు పడుతోంది. ఎక్కడ ఎక్కువ shining వస్తోంది? వెలుగొకటే అయినప్పటికీ కూడా, బంగారానికున్న shining వల్ల ఆ వెలుగు ఎక్కువ మెరుస్తోంది కదా. కాబట్టి మనలో పవిత్రత ఎంత పెరిగితే అంత వెలుగు వ్యక్తమవటానికి అవకాశం ఉంటుంది. లేకపోతే ఉండదు. అటువంటి వెలుగుకి

పుట్టుక స్థానం భగవంతుడు అని చెప్పటానికి 'శ్రీమాన్' అని ఇచ్చారు. 'శ్రీ' గురించి ప్రత్యేకించి message మనం తీసుకోవలసింది ఏమిటంటే, Let us bring more and more and more purity into our lives at all levels. Not only at the physical level. మానసిక కక్ష్యలోనూ, కామ కక్ష్యలోనూ. కామ లోకం అంటే మన desire. అదే కదా మనకి లేచిన దగ్గరనించి. వాటిలో purity. ఆలోచనల్లో purity, కోరికలో purity, దేహంలో purity, పరిసరాల్లో purity. చిమ్మి ముగ్గు వేసుకోకపోతే తోచని వాళ్లుంటారు. చిమ్మకపోతే ఏం, ముగ్గు వేయకపోతే ఏం అనుకునే వాళ్ళు కూడా ఉంటారు. Difference ఎక్కడ ఉందయ్యా అంటే, the presence of the mother in them. అట్లా ఉంటుంది. ఇది ఒక రకమైన science.

# 25. కేశవః

వెలుగుతో కిరణాలుగా వ్యాపనం చెందే వాడు. కేశవ నామాలు మనకి, 24 ఉన్నాయి. పొద్దున్నే ఓం కేశవాయ స్వాహా, అని మొదలు పెడతాం. ఎన్ని ఉన్నాయో ఎవరైనా లెక్కపెట్టారా? లెక్కపెట్టిన వాళ్ళకి 24 కనిపిస్తాయి. 24 నామాలకి, 24 గంటలకి, 12 పౌర్ణములు, 12 అమావాస్యలతో కూడిన సంవత్సర పురుషునికి, 24 అక్షరాలతో కూడిన గాయత్రీ మంత్రానికి, వీటన్నిటికీ ఒక విధమైన చక్కని అనుసంధానం ఉంది. దాంట్లో మొట్టమొదటిది కేశవ. కేశవ నామాలకి సంబంధించి మనకి మొదలయ్యేది కేశవ! కేశవా, అని లెమ్మంటారు పొద్దున్నే! 'మాం కేశవో ప్రాతరవ్యాత్!' అంటే పొద్దున పూట లేవగానే, 'కాపాడు నాయనా', అని కేశవుడిని పిలవాలిట. నారాయణ కవచానికి మనకి మాస్టరు గారు వివరణం ఇచ్చారు, అంతకు ముందు దాన్ని పోతన తెలుగు భాగవతంలో ఇచ్చారు, అంతకుముందు వ్యాసుడు ఇచ్చాడు. నారాయణ కవచం యొక్క ప్రాశస్త్యం అతి మహత్తరమైనది. ఆ కవచంలో మొత్తం రోజులో ఉన్న 24 గంటలని ఎనిమిది భాగాలు చేస్తారు. నారాయణుడంటే అష్టాక్షరి కదా. ఎనిమిది భాగాల్లో మొదటి భాగానికి కేశవుడు వస్తాడు. ఎనిమిది మంది ఎట్లా రక్షిస్తారో నారాయణ కవచం చదువుకోండి, కనిపిస్తుంది. ఈ కేశవ అనే స్థితి పొద్దున్నే లేవగానే ఉంటుంది. ఏమిటయ్యా కేశవుడు అంటే, వెలుగుతో కిరణాలుగా వ్యాపనం చెందేవాడట కేశవుడు. మామూలుగా కేశవుడంటే వెంట్రుకలని కూడా చెప్పుకోవచ్చు. కేశాలు అక్కడ నుంచే వచ్చినాయి. కేశవం, కేశం, ఇవన్నీ కూడా, పొడుచుకొస్తాయి కదా! మనం గీకినా మళ్లీ వస్తూ ఉంటాయి. ఎక్కడనుంచి వస్తున్నాయి? లోపలున్నాయా? లోపల అంతుంటే అసలు ఇంకేమీ ఉండకూడదు. మనకొచ్చే కేశాలు stock అంతా లోపల ఉండి కొంచెం కొంచెం బయటకొస్తే, లోపల చోటు ఏదీ? ఎక్కడ నుంచి వస్తుంది? ఈ వెలుగు కిరణాలన్నీ కూడా ఎక్కడ నించి వస్తున్నాయో తెలియకుండా అట్లా పుట్టుకొస్తాయన్నమాట. Stock ఉండదు. పుట్టుకొస్తూ ఉంటుంది, వ్యాపనం చెందుతూ ఉంటుంది. కిరణముల ద్వారా వ్యాపనము చెందిన స్థితిని, కేశవ స్థితి అంటారు. ఇది భగవంతుని యొక్క

నామాలలో అతి పవిత్రమైన నామం. ఎందుకంటే కేశవ నామాలలో మొదట ఉంది కాబట్టి. 'మాం కేశవో గదయా ప్రాతరవ్యా గోవింద ఆసంగవ మాత్త వేణుః' అన్నప్పుడు, ప్రాతః కాలంలో కేశవుడు నన్ను రక్షించు గాక, అని అడుగుతున్నాం సంస్కృతంలో. సంస్కృతంలో ఏముందో తెలియకుండా, దాన్ని గడగడగడా చదివేసి, ఏదో ఒకటి చేసేశాం, అని మనని మనం మభ్య పెట్టుకుని కదా జీవిస్తూ ఉంటాం. తెలిసి చదువు కోవడంలో definite గా ఎక్కువ వికాసం ఉంది. కాబట్టి తెలుసుకోవడానికి, ఒక ఆర్ధత ఉండాలి. ఒక ఉత్సుకత ఉండాలి. ఈ కేశవుడు, పొద్దున్నే మనల్ని మేల్కొలిపే వాడు. మనలో ఒకడు కిరణాల రూపంలో వ్యాపనము చెందుతాడు. From centre to circumference. అదే భూమి మీద కూడా పొద్దున్నే మనకి జరుగుతుంది. పొద్దున్నే వెలుగొచ్చినప్పుడు ఆ సూర్యుని యొక్క కిరణములు వ్యాపనము చెంది తూర్పున తెల్లవారుతున్నట్టుగా కనిపిస్తుంది. అదీ కేశవుడంటే! లేచేటప్పుడు ఇదే మనలో జరిగేది. మనం నిద్ర లేవటమన్నా, మనలో ఉండే భూభాగానికి వెలుగు రావటమన్నా ఒకటే! అట్లా ఉంటుంది కేశవ స్థితి. పొద్దున కేశవుడు. సాయంత్రం మాధవుడు. మధ్యాహ్నం పన్నెండు గంటలకి, విష్ణువు. అర్ధరాత్రి పన్నెండు గంటలకి పద్మనాభుడు. పొద్దున్నే ఈ కేశవుడిని మనం గుర్తుంచుకోవాలి. పొద్దున్నే చేసుకుంటాం అనే ఉద్దేశంతో మొట్టమొదట నామంగా ఓం కేశావాయ స్వాహా అని ఇచ్చారు. మనం లేచేటప్పటికే సూర్యుడు ఎటో వెళ్ళిపోయాడనుకోండి, ఇంక అప్పటికి కేశవుడు అయిపోయి ఇంకెక్కడో ఉంటాడు. ఉదయాన్నే మనలో కిరణముల ద్వారా వ్యాపనం చెంది, మొత్తం అంతా చైతన్యవంతం చేస్తాడు. పగలు దోమ కుడితే ఎక్కువ తెలుస్తుంది. రాత్రి నిద్రలో దోమ కుడితే ఎక్కువగా తెలియదుగా. పొద్దున అక్కడ ఏదో బొబ్బ ఉంటే ఏదో కుట్టింది అనుకుంటాం. ఎవరన్నా అడిగితే 'రాత్రి దోమ కుట్టిందండీ' అని చెప్తాం. By inference కుడుతున్నప్పుడు నిద్రలో నీకు తెలియదు. ఎందుకు తెలియదు? ఆ part లో చైతన్యం లేదు. నిద్రలో ఎవరన్నా మిమ్మల్ని గిలిగింతలు పెట్టారనుకోండి, లేదా కాళ్లల్లో అట్లా పామారనుకోండి, అసంకల్ప ప్రతీకారచర్యగా మనం కదుపుతాం తప్ప, వాళ్ళు గుచ్చారని తెలియదు. ఎందుకు తెలియదు? మొత్తం దేహం అంతా కూడా ఈ కిరణముల యొక్క ప్రసారం లేదు. కేంద్రంలో ఉంటుంది. పొద్దున ఉన్నంత ఉండదు. ఎవరన్నా నిద్రపోతున్నప్పుడు ముట్టుకున్నామనుకోండి వారికి తెలియదు. అదే పగలు ముట్టుకున్నామనుకోండి, తెలియకుండా

ఉంటుందా? ఏమిటి తేడా? అంటే from centre to circumference, there is the permeation of consciousness through the rays of the light. సూర్యుడి దగ్గరనించి వచ్చిన కిరణాలు భూమిని స్పృశించి, ప్రాణ శక్తిని ఎలా పెంపొందిస్తాయో అట్లాగే ఈ కేశవ అనే ఒక ప్రక్రియ ఆధారంగా సూర్య మండలము, భూమండలము, భూమిజీవులు అందరూ ఆ విధంగా వ్యాపనం చెంది ఉంటాం. మనం మొత్తం దేహం అంతా ఉంటాం, లేకపోతే మొత్తం దేహం అంతా ఉండం. తిమ్మిరెక్కింది అనుకోండి, అక్కడ ఏమిటి జరిగిందీ? ఆ part లోంచి consciousness withdraw అయ్యింది. పక్షవాతం వచ్చిందనుకోండి ఆ part లోకి కిరణాలు వెళ్ళటం మానేసినాయన్న మాట. ఇంకది పనిచేయదండీ, ఇంక వదిలేయండి దాన్ని అంటాడు doctor. కేశవుడిని బాగా ఆరాధన చేసుకున్న వాళ్ళకి ఆపాదమస్తకం చైతన్యము యొక్క వ్యాపనం బాగా ఉంటుంది. కేవలం ఆపాదమస్తకమే కాకుండా అందులోంచి బయటికి కూడా వస్తుంది. సూర్యుడికి చూడండి ఎంత బయటికి వస్తుందో! చాలా దూరం ఉంది మనకి, సూర్యుడికి. మరి ఇంత దూరం ఆయనలోంచి ఆయన వెలుగు వస్తోంది. మనలో వెలుగు మన దేహాన్ని కూడా దాటి బయటికి వెళ్ళని స్థితి. గుడ్డి దీపంలా ఉందో లేదో అని doubt గా ఉండే స్థితినించి, అంతవరకు వ్యాపనం చెందటానికి అవకాశం ఉంది. మహాత్ములందరూ కిరణాల్లాగ వ్యాపనం చెందుతారు. అక్కడే ఉన్నట్టున్నా ఆ దేహంలో మాత్రమే బందీకృతులై ఉండరు. దేహంలోంచి వెళ్లి వస్తూ ఉంటారు. వెళ్లి రావటమే కాదు దేహంలోనే ఉంటూ అట్లా పరుచుకుపోతారు మొత్తం. ఎంత పరుచుకుంటారంటే, వాళ్ళ పన్నాను బట్టి పరుచుకుంటారు. ఒక్కొక్కరు వారి ఊరంతా పరుచుకోవచ్చు, ఇంకొకరు ఆ రాష్ట్రమంతా పరుచుకోవచ్చు, ఇంకొకరు ఆ దేశం పరుచుకోవచ్చు, ఇంకొకరు మొత్తం భూమి అంతా పరుచుకోవచ్చు, మరికొంత మంది మిగతా గ్రహాలకు కూడా పరుచుకోగలరు. మరికొంతమంది సూర్య మండలానికి కూడా పరుచుకోవచ్చు. మరికొంతమంది సూర్య మండలానికి అతీతమైన స్థితిలోకి కూడా అలా పరుచుకుంటూ వెళ్ళిపోతారు. ఎట్లా వెళ్ళిపోతారంటే అది కేశవుడన్నమాట. అదీ వ్యాపనం! ఈ విధంగా పరుచుకుంటూ, పరుచుకుంటూ ఎక్కడి కొచ్చేశాడు? దోమలోకి, చీమలోకి కూడా వచ్చేశాడు. Can you imagine? ఆలోచన చేయండి, ఎక్కడ నించి బయలుదేరింది ఆ వెలుగు. ఎంతవరకు వచ్చింది! చీమ కన్నులో కూడా వెలుగు

కనిపిస్తుంది సృష్టిలో ! అన్నిటిలోనూ కనిపిస్తుంది వెలుగు. అంటే ఎక్కడ నించి బయలుదేరాడు, ఎక్కడకి వచ్చాడు, ఈ మొత్తం ఈ దారులన్నీ వెంట్రుకలల్లే విచ్చుకున్నాయిటండీ. అదీ కేశవనామము! అంటే వెంట్రుక అని ఎందుకు అన్నారంటే, కేశము అనే శబ్దము కేశవము లోంచి వస్తుంది. మనకి కేశవం కన్నా కేశమే ఎక్కువ తెలుసు కాబట్టి దీంట్లోంచి అది వచ్చిందనే భావన రాస్తూ ఉంటారు. ఈ వెంట్రుకలు రావటం కూడా ఆ ప్రక్రియకు సంబంధించిందే! కాకపోతే ఇది చాలా చిన్న విషయం దానితో compare చేస్తే. వెంట్రుకలు మొలిచినట్టుగా మొలుస్తాయి కిరణములు లోపలనుంచి. వెంట్రుకలు బయటికి బహిర్గతమైనట్టు, లోపల ఉన్న చైతన్యం నించి కిరణాలు కూడా బహిర్గతమవుతాయి. Provided you too adapt to a process. ఎందుకని? అది ఆయన యొక్క తత్వం! ఆ తత్వం తోనే అంతా నింపాడు. ఎంత నింపాడంటే, చాలా ఎక్కువగా ఉంటే భరించలేరు కాబట్టి తానే కొన్నికొన్ని చోట్ల, కొంత కొంత limit చేసుకుంటూ వస్తాడు. మన పురాణాల్లో ఉంటుంది. విశ్వకర్మ సూర్యుడికి, తన కూతురినిచ్చి పెళ్ళిచేస్తాడు. సూర్యుడు మరీ ఎక్కువ వెలుగుగా ఉన్నాడని ఆ అమ్మాయి వెళ్లి వాళ్ళ నాన్నతో చెప్పుకుందిట. ఎప్పుడూ పుట్టింట్లోనే ఉంటుంది ఆ అమ్మాయి. ఏమిటే వెళ్ళవేం అంటే, అక్కడ వేడి నాన్నా, మరీ హైదరాబాదులో ఎండాకాలంలో ఉన్నట్టుగా ఉంటుంది, అందుకని నేనక్కడ ఉండను, ఇక్కడ నీ దగ్గర ఏ.సీ లాగా ఉంటుంది అంటుంది. ఎట్లా? అమ్మాయి ఎక్కువ కాలం తన ఇంట్లో ఉంటే బావుండదు కదా! అందుకని ఒకసారి దసరా పండగకి అల్లుడిని పిలుస్తాడు. అల్లుడు రాంగానే సుబ్బరంగా గుండు గీయించేసి, ఏడు వెంట్రుకలే ఉంచుతాడట. ఈ కథ మనకి ఎందుకిచ్చారంటే, from cosmic to solar, from solar to planetary ఆ descent of light ఉన్నప్పుడు there is also descent in the measure of light. వెలుగు తగ్గుతూ వస్తుందిట. మన భూమి కూడా కాంతివంతంగా ఉంటుంది. మనం దాని మీద ఉన్నాం కాబట్టి మనకి తెలియదు. చంద్రుడు మనకి కాంతివంతంగా కనిపిస్తాడు కదా. చంద్రుడి మీదకు వెళ్ళి భూమి ఫోటోలు తీస్తే, భూమి కూడా కాంతివంతంగానే కనిపించింది. పరవా లేదే అనుకున్నారు. కానీ, మన భూమి కాంతి కన్నా, సూర్యుడి కాంతి ఏడు రెట్లెక్కువ. 1/7th మనకిస్తున్నాడు. అంతా ఇస్తే పేలిపోతుంది భూమి. Zero watt bulb లోకి 1000 kv పంపించామనుకోండి ఏమవుతుంది? పేలిపోతుంది. పేలకుండా ఉండాలి కాబట్టి

దీనికి ఇంతే చాలని అలా ఇస్తున్నాడు. అట్లాగే శుక్ర గ్రహం మనకన్నా ఎక్కువ. ఆ పద్ధతిలో బుధగ్రహం తీసుకుంటే మరీ సూర్యుడికి దగ్గరగా తిరుగుతుంటాడు కదా. ఆ మాత్రం withholding capacity లేకపోతే తిరగగలడా? చాలా చక్కటి సమన్వయం ఒకటి ఉంది. బుధుడు సూర్యుడి చుట్టూ తిరుగుతుంటాడు, చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతుంటాడు. అందుకని బుద్ధి, మనయొక్క ఉత్తమమైన మనసంటారు. చంద్రుడు మనయొక్క స్వభావానికి సంబంధించిన మనసంటారు. ఎందుకని? చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతుంటే, మనం కూడా మనసు ఆధారంగా మన శరీర అవయవాల కోసం రోజంతా తిరుగుతుంటాం. అది చంద్రుడి గురించి. ఎప్పుడూ మనకి జీవితంలో కావలసిన వాటికే మొగ్గి తిరుగుతున్నామనుకోండి, చంద్రుడు ఉన్నట్టు అక్కడ. బుధుడు ఎప్పుడూ సూర్యుడి చుట్టూ తిరుగుతాడు. అట్లాగే ఒక ఆధ్యాత్మిక సాధకుడు, తన జీవితంలో ఎక్కువ వ్యక్తిగతమైన అవసరాల కోసం వెంపర్లాడుతున్నాడా? అత్మతత్వం వైపు మొత్తం అంతా అల్లుకుని, ఆత్మ తత్వానికే సర్వస్వాన్నీ అంకితం చేస్తున్నాడా? అట్లా చేస్తుంటే బుధుడౌతాడు, ఇట్లా చేస్తుంటే, చంద్రుడౌతాడు. ఇట్లా చేసుకుంటే స్వభావం లోకి వెళ్తాడు, అట్లా చేసుకుంటే వెలుగులోకి వెళతాడు. అంటే ఇంకో సూర్యుడైపోతాడు. He is the second Sun for the solar system. అన్నట్టుగా ఉంటుంది. అంటే వెలుగు యొక్క స్థితి, పదార్థం యొక్క పరిస్థితిని బట్టి ఉంటుంది. పదార్థాన్ని పవిత్రీకరించుకుంటూ ఉంటూ ఉంటే వెలుగు పెరుగుతూ ఉంటుంది. ఈ కేశవ నామంలో మనకి భగవంతుని యొక్క ఈ ప్రక్రియ బాగా ఇవ్వటం జరిగింది.

## ౨౬. పురుషోత్తమః

నీకు, నాకు మధ్య ఉన్నవాడు, నీ లోపల, నా లోపల ఉన్నవాడు. వాడు పురుషోత్తముడు. నీకు నాకు మధ్య ఏముంది? నీకు నాకు మధ్యే కాదు ప్రతి రెండు ఆకారముల మధ్య కూడా ఉన్నవాడు. నారీ నారీ నడుమ మురారి అంటే అదే అర్థం. నారీ అంతా రూపం, అరూప స్థితి మురారి స్థితి. చోటుగా మొత్తం అంతా నిండి ఉన్న వాడు పురుషోత్తమ స్థితి. చోటు రూపంలో కూడా ఉంది. చోటు రూపానికి అతీతంగా కూడా ఉంది. మన bad luck ఏంటంటే, రూపంలో ఉన్నదీ కనపడదు, రూపానికి అతీతంగా ఉన్నదీ కనపడదు. ఎట్లా? అంటాడు కృష్ణుడు. ఈ రెండూ చూడలేవు కదా, నేనేం చేయను? రూపంలో ఉంటేనేమో రూపాన్నే చూస్తావు, చోటుని చూడవు. రూపంలోనే చోటు చూడలేనివాడివి, చోటులో చోటేం చూస్తావు? చోటుగానే చూస్తావు. ఏం లేదంటాం కదా! ఒక గదిలో ఏమీ సామాన్లు పెట్టకుండా గదిలో వెళ్లి ఏముందో చూసి రారా, అంటే వచ్చి 'ఏమీ లేదండీ', అని చెప్తాం, అంతేగా! ఏం లేదేమిటి? ఏం లేదని ఎందుకు చెప్తున్నామంటే రూపం చూడటానికి అలవాటు పడ్డావు కాబట్టి, రూపం లేకపోతే ఏమీ లేదంటూ ఉంటాం. అసలు రూపాలు లేకముందు అక్కడ ఉన్నదంతా చోటే. అందులో రూపాలొస్తూ ఉంటాయి. ఇల్లు కట్టక ముందు ఇక్కడున్నది చోటు. చోటులో ఇల్లు కడతాం. ఇంట్లో సామాన్లు చేరుస్తాం. ఒక్కొక్క గదికి ఒక్కొక్క పేరు పెడతాం. ఇది bedroom అంటాం. ఇది drawing room అంటాం. ఇది kitchen అంటాం, ఇది bath room అంటాం. ఇది వరండా అంటాం, మనకి ఆ పేర్లే మిగిలిపోతాయి. అది వరండా అని మనం అంటున్నాం కానీ అక్కడ చోటుకి అది వరండా కాదు కదా. ఇది bedroom అని మనం అంటాం కానీ ఆ bedroom లో ఉండే చోటుకి, bedroom కాదది. చోటు చోటుగానే ఉంటుంది. ఇల్లు కట్టక ముందు చోటు ఎట్లా ఉందో, ఇల్లు కట్టిన తరువాత కూడా ఇంట్లో చోటు అలాగే ఉంటుంది. ఇంట్లో ఉండే చోటు ఇల్లు కట్టిన తరువాత ఎట్లా మారదో, భగవంతుడు ఇన్ని రూపాలుగా తయారయి, ఇన్ని రూపాలలో ఉంటున్నప్పటికీ కూడా, తను తను గానే ఉంటాడట ఇన్నిట్లోనించి. అది పురుషోత్తముడు అంటే! ఇది బంగాళాఖాతం, ఇది హిందూ మహా సముద్రం, అది Bay of Bengal, అది Pacific Ocean, ఇది Atlantic

Ocean, ఇట్లా పేర్లు పెట్టాం కదా. ఇది Atlantic కదా నీకు తెలియదా? అంటాం. ఎవరు పెట్టారు? నువ్వు పెట్టుకుంటే Atlantic అయింది. లేకపోతే అది Atlantic కాదు కదా! ఒకటే నీళ్ళు కదా! అక్కడ గీతలుంటాయా మధ్యలో? ఇక్కడ మూడు సముద్రాలు కలిసినాయండీ అంటాం మనం, ఎందుకంటే మూడు పేర్లు పెట్టుకున్నాం కాబట్టి. అది కలవడం కాదు. మూడు వేరు వేరుగా ఉండి కలిస్తే అదీ కలవడం. ఉన్నదొకటే! ఒకదానికి మూడు పేర్లు పెట్టి, మూడు కలిసినాయని మనం నమ్మి ఏమిటేమిటో ఆలోచించుకుంటూ ఉంటాం. అంతకన్నా మనకు మాయ ఇంకేముంది. మనం ఆ మూడు పేర్లు పెట్టక ముందు అట్లాగే ఉంది సముద్రం. పేర్లు పెట్టుకున్న తరువాత, మూడు సముద్రాలు కలిసినాయి అంటూ ఉంటాం. ఏమిటిది? అన్యాయం కదూ? నేను మూడు కాదురా నేను ఒకడినే అన్నా కూడా వినం మనం. ఇంతమంది కూడా నేనొక్కడినే అంటారు. అంతేనా ఇక్కడ నించి చిలవలుపలవలు. నీళ్ళు ఆకాశం నించి వెళ్లి ఒక చోట పడితే దాన్ని గోదావరి అంటారు. ఇంకో చోట పడితే కృష్ణ అంటారు. ఇంకో చోట పడితే కావేరి. ఇవి కావేరి నీళ్ళు కదా, అవి గోదావరి నీళ్ళు కదా. ఇవి భారత దేశపు నదులు కదా! అంటారు. అంతటితో ఆగదు. అక్కడ నించి municipal water కదా, ఇవి మురుగు water కదా. ఇలా మురుగు water, municipal water దగ్గర నించి నదులు, కాలవలు, సముద్రాలు, అన్నీ నీరే కదా! ఒకటే అయినప్పటికీ కూడా ఒకటిగా చూడటం అనేది మన భావనలో పోయింది. పోవటం వల్ల ఒకడే ఇంతమందిగా ఉన్నాడట అంటే it seems to be a thought which is not comprehensible. మరి ఈ నీళ్లన్నీ ఒకటే అని తెలిసి చెప్పినప్పటికీ కూడా ఈ పేర్లతో మనం తిప్పలు పడుతూ ఉంటాం. ఇన్నిళ్లు కట్టారు ఈ వూళ్ళో. ఒక్కొక్క ఇంటికీ ఒక్కొక్క పేరు పెట్టారు. అన్నింటికీ వాడిన ఇటుకలు, ఇసుక ఒక source నించే వస్తుంది. ఈ ఇళ్లనే కాదు మొత్తం భూమి మీద కట్టిన వాటన్నిటికీ source భూమే! పేర్లు పెట్టుకుంటాం. దేనికోసం ఈ పేర్లంటే, సృష్టిలో for facility of interaction. ఈ పురుషోత్తముడు అనేవాడు, అన్నిటిలోనూ తానే ఉన్నప్పటికీ, వాడిని మనం చూడటానికి ప్రత్యేకమైన దృష్టి కలిగి ఉండాలి. మూడు రకాలుగా ఉంటాను నేనే, అని చెప్పాడు. పురుషోత్తముడుగా ఉంటాడట, అక్షరపురుషుడిగా ఉంటాడట, క్షరపురుషుడిగా ఉంటాడట. అంటే చోటుగా ఉంటాడు, ఇంట్లో చోటుగా ఉంటాడు, ఇల్లుగా కూడా ఉంటాడు. ఇంట్లో చోటు, బయట చోటు, ఎప్పుడూ ఒకటే! ఇల్లు మారుతూ ఉంటుంది. కొంచెం

పాడైపోతూ ఉంటుంది, మళ్ళా repair చేసుకుంటాం, మళ్ళా పాడైపోతుంటుంది, మళ్ళా repair చేస్తూ ఉంటాం. కానీ కొన్నాల్టికి ఉండదు. అటువంటిదే శరీరం కూడాను. దాన్ని 'క్షరం' అన్నారు. ఎందుకంటే, అది పోతుంది. దానికో lifespan ఉంది, ఆ span అయిన తరువాత అది పోతూ ఉంటుంది. ఈ లోపల నువ్వు పాడు చేసుకుంటే తొందరగా పోతుంది. కలియుగంలో మనకిచ్చిన span 100years. Science of living తెలిసిన వాడు, దాని ప్రకారం జీవిస్తే కలియుగంలో వంద సంవత్సరాలు ఈ శరీరంతో బతకచ్చు. ఎందుకంటే ఈ body కి అంత lifeకి సంబంధించిన capacity ఇచ్చి పంపించారు. మనక్కూడా తెలుసు కదా ఈ car, ఇంత life అని. జాగ్రత్తగా వాడుకున్న వాళ్లకి అంతకాలం పని చేస్తుంది. కారే అక్కర్లా, Tape recorder అయినా, radio అయినా, టీవీ అయినా. కొంత మంది చేతిలో ఏ వస్తువైనా వెంటనే పగిలిపోతుంది.  కొంతమంది చేతిలో ఏదైనా వస్తువు ఉంటే అది ఎన్నాల్టికీ పాడవదు, విసిరి అవతల పారేసేవరకు. ఒకడికి ఒక pen ఇచ్చామనుకోండీ, జీవితాంతం ఆ pen తో వాడు రాసుకోగలడు. ఒకడికి ప్రతి నెలా pen మార్చాలి. ప్రతినెలా pen మార్చటం అంటే పుట్టంగానే మార్చుకోవడం అన్నమాట. కొంతమందికి Bodies ఎక్కువ రోజులు పనిచేయవు. ఎందుకంటే చేతకావట్లేదు వాటిని వాడుకోవటం. Simple example మనం వాడుకునే వాహనాలు. కొంతమందికి తొందరగా పాడైపోతాయి. కొంతమందికి చెప్పినంత time వరకు నిలుస్తాయి. చెప్పినంత time కన్నా ఉంటాయి. ఎందుకంటే he is able to function according to the given instructions. ఇట్లా drive చేసుకో car పాడవదు. ఇట్లా drive చేసుకో scooter పాడవదు, ఇట్లా వాడుకో tape recorder పాడవదు. ఇట్లా వాడుకో, T.V. పాడవదు అని వాడు instruction book ఇస్తాడు. మనకి Instructions book scriptures. దాని ప్రకారం మనం నడుచుకుంటే  కలియుగంలో వంద ఏళ్లు ఖాయం. ద్వాపర యుగంలో రెండు వందల ఏళ్లు ఖాయం, త్రేతాయుగంలో మూడు వందల ఏళ్లు ఖాయం. కృతయుగంలో నాలుగు వందల ఏళ్లు ఖాయం. కానీ మనకు ఖాయంగా ఏమీ లేదు కదా! ఎందుకని లేదంటే, ఈ లోపల మనం తొందరపడి పాడుచేసుకుంటాం కాబట్టి. ఎందుకు తొందరపడ్డాం అంటే Know how తెలియక పాడు చేసుకున్నాం, అదట్లా ఉండగా know how తెలిసినా అది పాడయిపోతుంది కొన్నాళ్ళు పోయిన తరువాత. శాశ్వతంగా దేహం ఉండటం అనేది ఏమీ లేదు.

దానికో span ఉంది. అంటే మారుతూ ఉండి, రూపం కట్టుకుంటూ ఉంటుంది, రూపం నించి మళ్లీ dissolve అయిపోతూ ఉంటుంది. దాన్ని 'క్షర పురుషుడు' అన్నారు. దేని చుట్టూ ఈ రూపం కట్టుకుందో దాన్ని అక్షర పురుషుడు అన్నారు. మనం, మనం, మనం అనుకుంటూ ఉంటామే, మనం అంతా కూడా చోటు చుట్టూ ఏర్పడిన రూపం కలిగిన వాళ్ళం అన్నమాట. ఇంట్లో చోటు లాంటి వాళ్ళం. ఇంట్లో చోటు, ఇంట్లో జరిగే విషయాలతో interfere అవదు. చోటు చోటుగానే ఉంటుంది. అట్లా ఉండకుండా మనం ఏం చేస్తామంటే interfere అయిపోతూ ఉంటాం అన్నిటిలోకి. ఇంకా దిగజారుతాం. బుద్ధిలో జీవించేవాడు అన్ని విషయాల్లోకి దిగజారడు. విషయాల్లోకి దిగజారితే that which is not permanent అంటే క్షరమైపోయేదానితో ఎక్కువ లంకె వేసుకుంటాం. లేక జిగురుపెంచుకుంటాం. జిగురు పెంచుకుని అతుక్కున్నప్పుడు పీకితే, కొంచెం నొప్పిగా ఉంటుంది. అందుకని దేహం వదిలేసేటప్పుడు చాలా మందికి బాధలుంటాయి. ఎందుకు బాధగా ఉంటుందంటే అతుక్కున్నాం కాబట్టి. అతుక్కోని వాళ్ళకి బాధ ఉండదు. అట్లాగే ఇంట్లో చోటు. ఉన్న ఇల్లు తీసి flats కడుతున్నప్పుడు ఏం బాధపడదు. చోటు చోటుగానే ఉంటుంది. Flat కట్టు, లేకపోతే commercial complex కట్టు, లేకపోతే hospital కట్టు, cinema talkies కట్టు అట్లాగే ఉంటుంది. ఈ మొత్తం చోటు ఒకటుంటే అందులో మనం భాగాలు చేసుకోవటం వల్ల పురుషోత్తముడు, పురుషుడు అని రెండు అంటే లోపల వెలుపల లేని స్థితిలో ఉండే చోటుకి, ఒక ఇల్లు కట్టంగానే లోపల చోటు, బయట చోటు అని ఏర్పడుతుంది. కానీ మనం ఏర్పరుచుకున్న పరిమితులు వల్ల బోలెడు చోట్లు ఏర్పడ్డాయి. ఇదంతా ఒకటే చోటు అని గుర్తు ఉంటుందా? ఒకటే చోటు అని గుర్తుండి ప్రవర్తనకి మాత్రం ఏ చోట్లోకి వెళ్ళాలో తెలిసి ఉండటం అనేది జ్ఞానం, విజ్ఞానం కలిగి ఉండటం. అంతా ఒకటే చోటు కదా అని చెప్పి పక్క వాళ్ళ ఇంటికి వెళ్లిపోకూడదు. అది విజ్ఞానం లేకపోవటం అవుతుంది. ఆ ఒకటే అని గుర్తు ఉన్న స్థితి, భగవంతుడికి ఎప్పుడూ ఉంటుంది, అందులోకి ఎదగటం అనేది మనం చేస్తూ ఉండాలి. ఆయన పురుషోత్తముడు! అంటే ఏంటి? ఎప్పుడూ ఒక చోటు గానే ఉంటాడు. నువ్వు దాంట్లో ఇల్లు కట్టు, cinema talkies కట్టు, ఇంకోటి కట్టు, పేకాట club కట్టు, ఏం అభ్యంతరం లేదు, చోటుకి. అట్లా అభ్యంతరం లేకుండా ఉండే చోట్లో భూమి ఏర్పడితే అభ్యంతరం లేదు. ఈ భూమి మీద చోటు

అనుకుంటాం. భూమి మీద చోటు కాదు, చోటులో భూమి ఉంది. అన్నీ మనం reverse లో పెట్టుకుంటాం. మాస్టరుగారు అంటూ ఉండేవారు" చోటులో ఇల్లు కట్టుకుని, ఇంట్లో చోటు వీడిదంటాడు, అదేంటి, అన్యాయం కదా!" అని. చోటు నీదా? భూమి నీది కాదు, అదేదో కొనుక్కుంటున్నామని ఒక భ్రమ. కొనుక్కుని దాంట్లో ఇల్లు కడతాం, దాంట్లో ఉండే చోటు మన దంటూ ఉంటాం, అది అద్దెకిచ్చుకుంటూ ఉంటాం, అని ఆయనకి  కోపం వస్తూ ఉండేది. మానవుడు దరిద్రుడు, చోటులో ఇల్లు కట్టుకుని, చోటు అద్దెకిచ్చుకుని, డబ్బులు తిని బతుకుతున్నాడు, అని కోప్పడుతుండేవారు. ఆయనకెంత కోపంగా ఉండేదో. చోటుని కూడా అద్దెకివ్వడమేమిటని! మనమేదైనా అద్దెకిచ్చేస్తాం. We are for hire and we hire everything. భూములు కొనటం, అమ్మటం చేసి సంపాదన చేస్తూ ఉంటారు చూశారా, వారందరికీ చాలా రకాలైన  చిక్కులొస్తాయి. ఏదో profit అనుకుంటాం. ఇది కాదు profit. దానికి వేరే consequence ఉంది.

మన scriptures ప్రకారము భూమిని అమ్మినవాడు తల్లిని అమ్మిన వాడితో సమానం. Profit కోసం భూమినమ్మిన వాడు profit కోసం అమ్మని, చెల్లెల్ని, పెళ్ళాన్ని కూడా అమ్మగలడట. మరి పెద్దవాళ్ళ dimension అట్లా ఉంటుంది. మనకి అవగాహన కాదు. పవిత్రత పెరిగితే అవగాహన అవుతుంది. లేకపోతే అవగాహన కాదు. కొని అమ్మేసి, ఇదమ్మేసి అదికొని, అది కొని ఇది అమ్మేసి, ప్రత్యేకించి భూమిని, నీరుని, గాలిని, అగ్నిని, చోటుని, అమ్ముకోకూడదు For profit. అసలు కొనుక్కోనక్కర లేదు, అని చెప్పారు. Ownership అనేది, యోగికి ఉండదు. Trusteeship  తప్ప పంచ భూతాల మీద ownership ఏంటండీ? పంచ భూతాల మీద ownership పెట్టుకున్న వాడికన్నా అజ్ఞాని ఇంకొకడు లేడు. వాడికేమీ తెలియదు. So don't own అని చెప్తుంటే, not only own but make profit out of it అనేది ఇంకొకటి. ఈ చోటును నువ్వు అమ్ముకున్నా, కొన్నా దానికేం పట్టదు. తను తనుగానే ఉంటుంది ఎప్పుడూ. అట్లా చోటుగా ఉండి, దాంట్లో అన్నీ ఏర్పడుతూ ఉంటే, అందులోంచి అన్నీ పోతూ ఉంటాయి. ఈ ఇల్లే కాదు, ఈ ఊరే కాదు, ఈ రాష్ట్రమే కాదు, ఈ దేశమే కాదు, ఈ భూగోళం మొత్తం కూడా చోట్లో ఏర్పడిందే. భూగోళమే కాదు సూర్య మండలాలన్నీ చోట్లోనే ఏర్పడినాయి. ఈ ఏర్పడినప్పుడు చోటును గుర్తుంచుకుంటే, భగవంతుడు గుర్తున్నట్లే!  భగవంతుడి కోసం ఎక్కడో చూస్తూ ఉంటారు. ఎక్కడో చూడక్కరలేదు. నీ proximity లో

అంటే, నీ చర్మానికి పక్కనే ఉన్నాడు భగవంతుడు. నీ చర్మానికి పక్కనే అంటే బయట పక్కనే కాదు, లోపల పక్క కూడా. లోపల చోటు, బయట చోటు. అంటే చెవిలో చోటు, నోట్లో చోటు, పొట్టలో చోటు, అన్నీ కూడా అదే! ఇట్లా ఉంటాయి. మనము చోటులో ఇల్లు కట్టిన తరువాత, ఇంట్లో చోటు చూడట్లేదుగా. ఇంట్లో చోటు చూడటం చేతకాని వాడికి బయట కూడా చోటు చూడటం చేత కాదు. The space around you is the presence of God, అన్నారు మాస్టరు గారు. నీ చుట్టూ ఉండే చోటు భగవంతుని యొక్క అస్థిత్వము కలిగి ఉన్న స్థితి. విద్యుత్తు అనేది మనకి ఎప్పుడూ ఉన్నప్పటికీ కూడా tubelight వేస్తే గానీ మనకి ఉందని తెలియదు. అట్లాగే ఇది కూడా. తెలిసిన వాళ్లు దాన్నే చూసుకుంటారు కాబట్టి లోపల, బయటా కూడా దాన్నే చూసుకుంటూ ఆనంద పడుతూ ఉంటారు. అందుకని శ్రీ కృష్ణుడు ఏమంటాడంటే "నేనే ఉన్నాను, మీరెవ్వరూ లేరు. మీరంతా ఉన్నారని మీరనుకుంటున్నారు. అంతా తయారు చేసుకుని నేనుంటే, మీరంతా ఉన్నారంటారేంటి?" అంటాడు. మన లోపల కాలేయం ఉంది, ఊపిరి తిత్తులున్నాయి, గుండె ఉన్నదని మనకెక్కడ గుర్తుంటుంది? మనమే ఉన్నాం, అనుకుంటాం. ఎదురుగుండా plate ఇడ్లీ ఉంటుంది, మనం ఉన్నాం. ఇడ్లీ మనం తినేసిన తరువాత మనము, ఇడ్లీ, ఉన్నామా? మనమే ఉన్నామా? ఒక చెంబుడు నీళ్ళు తాగిన తరువాత మనము, మన చెంబు నీళ్ళు కలిసి నడుస్తున్నామా, మనమే నడుస్తున్నామా? నేనుగానే ఎప్పుడూ ఉంటాను , అన్నిట్లోనూ నేనుగానే ఉంటాను, మీరు చూస్తున్నారు వేరుగా కాబట్టి, వేరుగా కనిపిస్తున్నాను. లేకపోతే ఉన్నదొకటే! ఆ ఉన్నదొక్కటే అని తెలుసుకోవటానికి పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ఒక రహస్యం ఇచ్చారు. ఏమని ఇచ్చారు? ఇదంతా కిందకి పైకి, పైకి కిందకీ అల్లేసి, నీకు చాలా కష్టం ఈ detail తెలుసుకోవటం అని చెప్తాడు.

'ఊర్ధ్వ మూలం, అధశ్శాఖం, అశ్వత్థం ప్రాహురవ్యయం.'

ఇట్లా ఇటునించి అటు, అటునుంచి ఇటు, ఇలా చిలవలు పలువలుగా చేసిన అల్లికలో, నన్ను చూడు అంటే నీకిది చాలా కష్టం అని చెప్తాడు. ఏం చేయాలి సార్ అంటే, నీకొక అస్త్రం ఇస్తాను. దాంతో పని కానీ, అంటాడు. ఏమిటా అస్త్రం అంటే అసంగం అనే అస్త్రంతో ఈ మొత్తం అంతా ఖండించేసెయ్. అసంగం అంటే detachment అనుకుని, అన్నిటినించీ పారిపోవటం నేర్చుకున్నాడు భారతీయుడు. అది negative attachment. పారిపోవడం negative attachment,

పట్టుక్కూర్చోవటం Positive attachment. అసంగం అనే పదానికి చక్కటి అర్థం పెద్దలు ఇచ్చింది ఏంటంటే 'అ' తోటి సంగం చేయమని. ' అ' తో సంగం చేయటం అసంగం. సంగం కానిది అసంగం అనేది ఇంకొక అర్థం. అసంగం అంటే 'అ' తో సంగం చేయండి. 'అ' తో సంగం చేయటం అంటే ఏమిటి? మనకి 'అ' అంటే ఏం తెలియదు కదా! ఈ రోజుల్లో 'అ' కూడా ఎవరూ నేర్చుకోవట్లేదు. A నేర్చుకుంటున్నారు ముందు. అ ఆ, లు చెప్పండిరా అంటే ముందు A, B C ,D అంటాడు. A ఎప్పుడొస్తుంది? అ తరువాత, ఇ తరువాత, ఉ తరువాత వచ్చేది ఎ. మూడు స్థితులు ఎత్తేశాం. అంటే పరా, పశ్యంతి, మధ్యమ ఎగిరిపోయినాయి, వైఖరి లో ఉన్నాం అన్న మాట. అందుకని ABCD లు నేర్చుకునే వాడికీను, అ ఆ లు నేర్చుకునే వాడికీ చాలా తేడా ఉంటుంది. నిరుక్త శాస్త్ర ప్రకారం, వ్యాకరణ శాస్త్ర ప్రకారం చూసుకున్నట్లయితే, అ తో మొదలవ్వాలి. 'అ' అయ్యవారు. 'ఈ' అమ్మవారు. అందుకని 'ఈం' అంటాం శ్రీ సూక్తంలో. 'ఈం' బాగా పలకాలి. అది 'హ్రీం' అన్నా కూడా అందులో 'ఈం' పలకాలి. 'శ్రీమ్' అన్నా కూడా అందులో 'ఈం' పలకాలి. 'ఐం' అంటే 'అ' తరువాత 'ఇ' వస్తుంది. 'ఇ' పార్వతి, సుమతి, లక్ష్మి, సరస్వతి అన్నీ 'ఇ'. అమ్మవారి తత్వం. అ లేదు, ఇ లేదు, ఉ లేదు ఎ కి వచ్చేశాడంటే, A,B,C,D లు నేర్చుకుంటూ మొదలుపెట్టేవాళ్ళకి ముందు మూడు steps అన్నీ పోయినట్టే. 'అ' అంటే నేను, అని చెప్తారు, ఎక్కడ? విభూతి యోగంలో! విభూతి యోగము ఎన్నో chapter? 10వ chapter. పురుషోత్తమ ప్రాప్తి ఎన్నో chapter? 15వ chapter. 10వ chapter చదువుకోకుండా 15వ chapter చదువుకున్నామనుకోండి. ఇది అర్థం కాదు. అన్నిట్లో ఉండే నాతో నువ్వు సంగమం చేశావనుకో, ఏది చూసినా 'అ' నేను గా! అసంగం చేయరా అంటే, 'అ' తో సంగమం చేయమని. ఈ రహస్యం భాగవతంలో చాలా ఎక్కువగా ఇచ్చారు. అందుకని భాగవతం మానవుని ఈ భూమ్మీద కడతేర్చే గ్రంథం. ఈ మనస్సు లాభం లేదు, ఈ మనస్సు వల్లే ఇవన్నీ, ఈ మనస్సును మనం జయించాలి, ఈ మనస్సును తొక్కేయాలి, అని పిచ్చి పిచ్చి సిద్ధాంతాలు చెప్తే దాని ప్రకారం రకరకాలుగా బాధలు పడ్డవాళ్ళు కోటానుకోట్లు జనం ఉన్నారు. భాగవతంలో ఏం చెప్తాడు కపిలుడు దేవహూతితో? మనసనే దానికి అతుక్కునే గుణం ఉందా? ఉంది! దాన్నితీసుకెళ్ళి భగవంతునికి అతికించేసెయ్ అమ్మా, అని చెప్తాడు. ఎక్కడ అతికిస్తే అక్కడ అతుక్కుపోయే మనసుని, ఎక్కడా అతుక్కోకుండా ఉండే మనసుగా

తయారు చేయక చాలా dangerous, అని చెప్తాడు. దేనిమీదా ఆసక్తి లేని మనసు ఉందనుకోండి, అంతకన్నా dangerous ఇంకోటి ఏం లేదు. ఎందుకు లేదంటే, ఇంక వాడికి భగవంతుడు కూడా అనుభవం కాడు, అంటే అనుభూతికి దూరమైపోతాడు. అభూతి లోకి వచ్చేస్తాడు. అనుభూతి కావాలంటే మనసుకి ఆ ఉత్సాహం, ఆసక్తి ఉండాలి, ఆసక్తి ఉన్న మనస్సు కాబట్టి, ఆసక్తి అనే జిగురు దానికి ఉన్నది కాబట్టి, అది తీసుకెళ్ళి భగవంతుని మీద అతికించేస్తే, ఇంక అంతే! అక్కడే ఉంటుంది కదా! మరి మనసు గురించి worry అవుతావేంటి? అని చెప్తాడు తల్లికి, కొడుకు. అదే విషయం శ్రీ కృష్ణుడు పురుషోత్తమ ప్రాప్తి యోగంలో. 'అ' కి సంగమం చేసెయ్. 'అ' తో కలిసిపో అంటాడు. 'అ' అంటే నేనే, అని విభూతి యోగంలో చెప్తాడు. 'అ' అంటే మొదలుకి అనే ఒక సంకేతం ఉంది. అన్నిటికన్నా మొదలు చోటు. అన్నిట్లో ఉండే చోటు, అణువు నుండి బ్రహ్మాండం వరకు మొత్తం అంతా చోట్లో ఉంది. చోటు అందులో ఉన్నట్టు మనకనిపిస్తుంది. కుండ తయారు చేస్తాం అనుకోండి. కుండ తయారు చేయకముందు కూడా చోటు ఉంది కదా. చోట్లో కుండ ఉంది, కుండలో చోటు ఉంది. చోట్లో ఇల్లుంది, ఇంట్లో చోటు ఉంది. ముందు చోటు ఉంది, తరువాత మిగతావన్నీ ఉన్నాయి, అది గుర్తు పెట్టుకోండి. అది మొట్టమొదటిది, అది అంటే 'అ'. 'అ' అనే స్థితికి, మనం ప్రతి కార్యక్రమంలోనూ సంగమం చేశామనుకోండి, అదీ భాగవత మార్గం అంటే! అలా చేస్తే, పురుషోత్తమ ప్రాప్తి! పురుషోత్తమ ప్రాప్తి యోగము అని ఎందుకు పెట్టారు దానికి? పురుషోత్తముడు మనందరికీ దక్కాలని, ఆయన ఉద్దేశం. పురుషోత్తమ ప్రాప్తి మనకి ఎప్పుడు దక్కుతుందంటే, పురుషోత్తముడ్ని మాత్రమే చూస్తున్నప్పుడు దక్కుతుంది. ఇంకోటి, తదితరమైనవీ చూస్తే దక్కదు. ఆ రహస్యం పురుషోత్తమ ప్రాప్తి యోగంలో ఉంది, ఆ పురుషోత్తముడు గురించి మనకి విష్ణు సహస్రనామం లో ఓ నామంగా ఉంది.

## ౨౭. సర్వః

అంటే సర్వమూ తానే అయి ఉన్న స్థితి అన్నమాట."సర్వమున్ తానయినవాడు"అని మనకు గజేంద్ర మోక్షంలోని "ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపల నుండు" అన్న పద్యంలో చెప్తాడు. తానే సర్వంగా తయారయ్యాడు. తయారైనప్పుడు, తయారైన దాంట్లో మూల పదార్థం గుర్తుండదు. ఏది ఆధారంగా మొత్తం అంతా ఏర్పడిందో, ఆ మూల పదార్థం మరచిపోతుంటాము. దాన్నే 'మాయ' అంటారు. మర్చిపోవడం ఎందుకు జరుగుతుంది? గుర్తు పెట్టుకోవడం అనే అభ్యాసం ఒకటి చేయక పోవడం వలన! అన్నిట్లో ఉండేది ప్రత్తి అయినా ఇన్ని గుడ్డలలో అది మనకు చొక్కాలు గాను, లాగులు గాను, చీరలు గాను, ఇలా రకరకాలుగా కనిపిస్తుంది. మనం చూసినప్పుడు వీటి మూల పదార్థం గుర్తుంటుందా? మూల పదార్థం అన్నిటికీ ఒకటే కదా. అది లేకపోతే ఇవన్నీ లేవు కదా ! ఈ కనపడే అన్నింటికీ ఏది మూల పదార్థం? అదే ఇన్ని గా తయారయ్యింది. బంగారంతో రకరకాల నగలు చేయించుకుంటే ఇది నెక్లెస్, ఇది వడ్డాణం, ఇది గొలుసు, ఇవి లోలాకులు, ఇలా చెప్పుకుంటాం. ఇట్లా అనుకున్నప్పుడు అంతా బంగారమే అని కొంత గుర్తు ఉంటుంది. ఎందుకంటే commercial గా కొంత value బంగారానికి వుంది కాబట్టి. అలా కాకుండా commercial గా value లేని విషయాలు కూడా ప్రతిదీ మనం analyze చేసుకుంటే ప్రతిదీ అణువులోకి వెళ్తుంది. అణువు నుండి పరమాణువులోకి వెడుతుంది. పరమాణువు నుంచి పరమాత్మ లోకి వెళ్తాము. కాబట్టి పెట్టుబడిగా వున్నది, మూలధనంగా వున్నది నిధిరవ్యయః. ఇప్పుడు కనబడుతున్నదంతా సర్వము కూడా విష్ణువే! విష్ణువు అంటే వ్యాపనము చెందినవాడు. The one who permeates. The permeating principle as all. Permeate అయ్యి ఒక్కొక్క unit గా తయారయిన దానిలో centre of consciousness గా వున్నవాడిని వాసుదేవుడు అంటాము. అంటే ఒక్కడే ఇన్నిగా తయారైనప్పుడు, ఒక్కొక్కరికి ఒక్కొక్క కేంద్రం ఏర్పడుతుంది. ఈ ఒక్కొక్క కేంద్రాన్ని వాసుదేవుడు అంటాము. ఇన్ని కేంద్రాల సమాహార ప్రజ్ఞను నారాయణుడు అంటాము. ఈనామంలో 'కనపడు తున్నదంతా భగవంతుడే'! అన్న భావన మనకు పరిపూర్ణంగా స్థిరపడాలి. అది భక్తి వుంటేనే స్థిరపడుతుంది. లేకపోతే లక్ష సార్లు

చెప్పుకున్నా స్థిరపడదు. ప్రత్యేకించి మనకు ఇష్టం లేని మనుషులు కనిపించినపుడు అసలు బొత్తిగా భగవంతుని యొక్క అస్తిత్వం కనిపించడానికి అవకాశం ఉండదు. ఇష్టం లేని ప్రదేశములు, ఇష్టం లేని మనుషులు, ఇష్టం లేని సమయములు, ఇష్టం లేని సన్నివేశములు ఇటువంటివి కొన్ని ఉంటాయి కదా. ఇక్కడ మనకు పెద్దలు ఇచ్చిన రహస్యం ఏమిటంటే నీవు దేన్ని చూసి ఇష్ట పడడం లేదో దాన్ని మొత్తం భగవంతుని ఆస్తిత్వంగా భావన చేసినట్లైతే నీలో 'ఇష్టం లేదు' అనే పరిమితత్వం తగ్గి పోతుంది. ఎంత ఎక్కువ మనకు ఇష్టం లేదో అంత పరిమితత్వంలో మనం బ్రతుకుతున్నట్టు లెక్క. ఎన్ని తక్కువ విషయాల్లో మనకు ఇష్టం లేక పోవడం ఉంటుందో అంత పరిమితత్వం తగ్గి, అపరిమితత్వం వైపు ప్రయాణం చేస్తున్నట్లు లెక్క. అసలు బొత్తిగా ఏ విషయం ఇష్టంలేక పోవడం లేదట అనే పరిస్థితి వచ్చిందనుకోండి-అప్పుడు భగవంతుని పరిపూర్ణమైన ఆస్తిత్వమునందు ఎప్పుడూ జీవించడానికి అర్హత సంపాదించుకున్నట్లే. కేవలం అభ్యాసం వలన ఇది సంపాదించుకోవడం వీలవుతుంది. మన జీవితంలో కూడా మనం చూచుకున్నట్లయితే మనకిష్టం లేని మనుషుల మొత్తాన్ని భగవంతుని స్వరూపంగా భావన చేసుకుంటే, వాళ్ళతో మనం చేసే ప్రవర్తనలో మన నుండి తేడాలు రావు. ఎప్పుడైతే మన నుండి తేడాలు రావో, అటునుంచి కూడా తేడాలు రావడం తగ్గిపోతుంది. తగ్గకపోయినా దానివలన మనకు విఘ్నములు వాటిల్లవు. ఎటువంటి కలతలు మనయందు వుండవు. ఉదాహరణకు రామాయణంలో తన భార్యను ఎత్తుకుని పోయిన రావణుని మొదటి సారి చూచిన రాముడికి, అతడు ఎదురుగా రథంలో వస్తే ఏమనిపించాలక్కడ? ఎన్నో కష్టాలుపడి అరణ్యంలో తిరిగి, వానరులతో స్నేహం చేసి, వానరుల సాయంతో లంకకి వారధి నిర్మించి, యుద్ధంలో అందర్నీ చెండాడి, చివరకు తన ప్రియాతి ప్రియమైన భార్యని ఎత్తుకుపోయిన రావణుడు షోగ్గా తయారై రథం మీద వస్తే చూచినప్పుడు రాముడికి ఎలా ఉండాలండీ? మామూలుగా మనకేమనిపిస్తుంది? మన వద్ద 100 రూపాయలు తీసుకొని, ఇవ్వని వాడు కనిపిస్తేనే మనమెలా ప్రవర్తిస్తామో మనకి తెలుసు. రాముడు తన భార్య అయిన సీతని ప్రేమించినట్లుగా ఏ పురుషుడూ తన భార్యని ప్రేమించలేదు అనిపిస్తుంది రామాయణము చదివితే! తన ప్రాణసమానమైన సీతను దుష్ట మార్గంలో ఎత్తుకొని పోయి, ఎక్కడో దాచి, నానా అగచాట్లు పెట్టిన వాడు కనిపిస్తే ఎలా ఉండాలి? అలా వుండలేదు కాబట్టి

రాముడయ్యాడు! దైవీ సంపత్తి కలిగిన రాముడు రావణాసురుని లో నున్నట్టి భగవంతుని కళను చూచాడు. అంటే భగవంతుని యొక్క అస్తిత్వాన్ని ఎక్కడా మరువలేదు. మరచిన వారికి రాగ ద్వేషాలు వచ్చేస్తాయి. ఉక్రోషాలు వచ్చేస్తాయి. ఆయనకి అలా ఉక్రోషము రాలేదు. ద్వేషము రాలేదు. అసహ్యము రాలేదు. ఎందుకు రాలేదంటే ఈ విధమైన భావన అతనియందు స్థిరపడి ఉన్నది కాబట్టి. అదీ భక్తి అంటే! భక్తి అంటే మనము రాముని యందు, కృష్ణుని యందు చూడాలి. కృష్ణునికి తన శత్రువు నందుకూడా ద్వేష భావం ఉండదు. దుర్యోధనుని చూస్తే అర్జునుడు, భీముడు, ద్రౌపది, ధర్మరాజు ఇత్యాదులు చేసే భావన కన్నా ఎక్కువ పవిత్రమైన భావన ఉంటుంది కృష్ణుడి దగ్గర. అలాగే భాగవతోత్తములు అందరిలోనూ ఉంటుంది. అంబరీషుడు కూడా అదే చూపిస్తాడు. ప్రహ్లాదుడు  అదే చూపిస్తాడు. వృత్రాసురుడు అదే చూపిస్తాడు. ఏ భాగవతోత్తములను తీసుకున్నా వారు కేవలం ఈ విధమైన భక్తి ఆధారముగా జీవిస్తూ ఉంటారు, కాబట్టి మరచి పోరు. శ్రద్ధ ఉన్న వాళ్ళకు మరుపు రాదు. శ్రద్ధ లేని  వాళ్ళకు మరుపు వచ్చేస్తుంది. మనకు ఎన్ని విషయములు తెలిసినా ఆ సన్నివేశములలో మనము మామూలుగానే ప్రవర్తిస్తాము కదా! ఎందుకు ప్రవర్తిస్తాము అంటే భక్తి లేకపోవడం వలన. కాబట్టి 'సర్వము' అనే నామానికి అర్థం  ఇష్టము లేనివి వచ్చినప్పుడు కూడా, ఇష్టము లేనివాని రూపంలో, ఇష్టము లేని సన్నివేశములో, ఇష్టం లేని ప్రదేశములలో కూడా ఉన్నవాడు భగవంతుడే! అని. భగవంతుడు లేని చోటు లేదు. లేని చోటు లేనప్పుడు కనీసం అస్తిత్వాన్ని గమనిస్తూ ఉండాలి. భగవంతుని అస్తిత్వాన్ని గమనించడమంటే వెంటనే వెళ్ళి వాణ్ణి కౌగలించుకొని, నీవే right అనడం కాదు. ముందు మనకు వాడి మీద వుండే భావనలో పవిత్రత ఉండాలే తప్ప అపవిత్రత చోటు చేసుకోకూడదు. చేసుకుంటే cause of action వెంటనే మన దగ్గరినుండి వచ్చేస్తుంది. ఎంత వద్దనుకున్నా లోపలనుంచి తన్నుకొని వస్తుంది కాబట్టి ఏదో ఒకటి అనేస్తాము. భగవంతుని అస్తిత్వాన్ని గుర్తిస్తే అనము. అనకపోగా వాడు అంటుంటే వినడం అనేది ఉంటుంది. రాముడు అట్లా చేసి చూపించాడు. అందరితో యుద్ధం చేసేటప్పుడు నవ్వుతూ చేసే వాడు. లక్ష్మణుడు అలా కాదు. మనలాగా ఉక్రోషం వచ్చేది. అలా రాగానే మన capacity తగ్గిపోతుంది. కృష్ణుడు అలా కాదు. కష్టమైన సన్నివేశాలలో వాళ్ళు ఏ విధంగా ప్రవర్తించారు అనేది చాలా ముఖ్యం. కృష్ణుడి జీవితంలో వచ్చిన కష్టాలు ఎవ్వరి జీవితములోనూ రాలేదు. అయినా ఆయన

చిరునవ్వు ఎప్పుడు చెదరలేదట అంటే మొత్తాన్ని కూడా భగవంతుని అస్తిత్వంగా దర్శించుకున్న వాడు. ఆయన మనకు నేర్పిన విద్య కూడా అదే! కాబట్టి మనము కూడా సాధనలో ఇష్టం లేని సన్నివేశాలలో neutral గా ఉండగలగడం అంటే, ఇష్టం లేని సన్నివేశాలలో మననుండి ఒక అపశబ్దముగాని, అనవసరమైన చేత కానీ, రాకుండా ఉండగలగడం ఎప్పుడు వీలు పడుతుందంటే, అవతల రూపంలో కనిపిస్తున్న వానిని భగవంతునిగా ధ్యానం చేయడము వలన మాత్రమే! అదే సర్వము అంటే. మనం సర్వ అనే నామంతో భగవంతుని ఉచ్చారణ చేయాలంటే, ఈ విధముగా చేస్తే అది ఎక్కువ స్థిరపడుతుంది. జిల్లెళ్ళమూడి అమ్మ వద్దకు ఒక భక్తుడు వెళ్లి అడిగాడట "చీమలోనూ, బ్రహ్మలోనూ భగవంతుని చూడమన్నారు గదమ్మా త్యాగరాజు. అదెలా" అని అడిగితే ముందు చీమగా, బ్రహ్మగాను చూడమన్నారు. బ్రహ్మ ఎట్లాగూ కనబడడు కాబట్టి ముందు చీమను చీమ గాను, బ్రహ్మగానూ చూడమన్నారు. భగవంతుడు సర్వము తానే అయినవాడు. తయారైనవన్నీ వాడే అని గుర్తుంటే మనకు వచ్చే రకరకములైన భావములు, అభిప్రాయాలు రావు. ఇప్పుడిక్కడ తేలు కనబడితే సామాన్య మానవుడు కంగారు పడతాడు. ఎందుకంటే తేలు అంటే మనకున్న భావన. అది కూడా భగవంతుని యొక్క అవతరణమే. దాని స్వభావం అట్లా ఉంటుంది కాబట్టి దానితో మనం ఎలా మెలగాలి? చంప నక్కర లేదు. చంపుదాము అన్న బుద్ధి వున్నవాడిని తేలు కుడుతుంది. పాముని కొడదామనుకున్న వారిని పాము కాటేస్తుంది. ఎంతమందిని కుడదాము అని తేలుగానీ, ఎంతమందిని కాటేద్దామని పాము గానీ బయలుదేరవు. వాటి జీవితం కోసం అవి బయలుదేరుతాయి. దాన్ని చూసినప్పుడు భగవంతుని యొక్క అస్తిత్వం గుర్తుంటే మన వైపు నుంచి వేరే రకమైన తరంగాలు ప్రవహించడానికి అవకాశం ఉండదు. నా జీవితంలో నేను అలా మా నాన్నగారు తాచుపాముని చేత్తో పట్టుకోవడం చూశాను. దాన్ని చేత్తో పట్టుకొని రామనామం చెప్తూ ఇదికూడా రాముడే కదా, అని చెప్పారు. ఇలా ఆయన జీవితంలో 3 సార్లు-- చెదరకుండా ఉండడం వల్ల-- జరిగింది. అన్నిసార్లూ రాముడ్ని దానిలో చూడడం వల్ల అలా జరిగింది. అది పరిపూర్ణమైన స్థితి. ఇది ఎలా వస్తుంది. శ్రద్ధా, దానితో భక్తి, ఆ భక్తితో జ్ఞానానుభూతి ఉంటాయి. ఇవి విష జంతువులు అని మనం అనుకోవడం వలన, ఈ చూచే మనుషులు కొందరు చెడ్డవారు అనుకోవడం వలన, ఈ చూసే ప్రదేశాలు మంచివి కాదనుకోవడం వలన మనని మనం పరిమితం

చేసుకుంటున్నాము. ఎంత పరిమితం చేసుకుంటే అంత మనం అనుభూతికి అర్హత కోల్పోయిన వాళ్ళం అవుతాము. అర్హత పెంచుకోవాలంటే నిద్రలేచిన దగ్గర నుండి పడుకోబోయే వరకు కనబడుతున్న అన్ని రూపాల్లో ప్రత్యేకంగా మనకు ఎక్కువ resistance ఉండే వాటిలో, disinclination ఉండే వాటిలో భగవంతుని చూడగలగడానికి ప్రయత్నం చేయాలి. అలా ప్రయత్నం చేసిన వారి జీవిత చరిత్రలు చదువుకోవాలి. మహాత్ముల జీవిత చరిత్రలు చూస్తూ వుంటే, వారిని విపరీతముగా విమర్శించిన వాళ్ళు, హింస చేసిన వాళ్ళు కనిపిస్తూ ఉంటారు. అలాంటి వారి యందు మహాత్ముల దృక్పథం ఎలా వుందో గమనించాలి. అన్నీ మనం చెప్పినట్టు ఎదుటి వాళ్ళు వింటుంటే, వాళ్ళను ప్రేమించి నట్టుగా మనం చిరునవ్వు చిందించడం వేరు. మనం చెప్పినట్టు వాళ్ళు వినకపోయినా, వారిని అంగీకరించగలగడం వేరు. ఎదుటివాడి అభిప్రాయం అంగీకరించ నక్కర లేదు. వారిని అంగీకరించాలి. ఈ రెండింటిలో చాలా తేడా వుంది. ఎదుటివాడి అభిప్రాయం, మన అభిప్రాయం కుదరదనుకోండి. మనం అభిప్రాయాన్ని discord చేయకుండా, మనిషినే discord చేస్తాము. అది తెలియని వాళ్ళు చేసే పని. తెలిసిన వాళ్ళు మనిషిని discord చేయరు. వాళ్ళ యొక్క అభిప్రాయంతో విభేదిస్తాము (I like to differ) అంటారు. మనం differ అయ్యామని చెప్పే దమ్ము కూడా లేకుండా, లోపల differ అయ్యి, బయటకు నవ్వుతూ బాగానే వుందని అంటుంటాం. అంటే తనకున్న అభిప్రాయాన్ని చెప్పగలిగే దమ్ము, ధైర్యం లేదు. లోపల ధీ శక్తి, ఆత్మ విశ్వాసం లేవు. ఎదుటి వాళ్ళు ఈయన అంగీకరించారు అనుకుంటారు. కానీ లోపల non cooperation ఉంటుంది. బయటకు మాత్రం manage చేస్తూ ఉంటారు. ఇవన్నీ కూడా ఆధ్యాత్మిక సాధనకు అడ్డుగోడల్లాంటివి. వీనితో ఆధ్యాత్మిక సాధనకు అవకాశం ఉండదు. అందుకని కనబడుతున్న రూపాలన్నీ భగవంతుని ఆస్తిత్వం కలిగి వున్నవే అని గుర్తుండాలి. శంకరాచార్యులవారు అన్నీ భగవంతుడే, There is no other thing అని చెప్పారు. అద్వైతము అని చెప్తూ, గబాల్న పులి వస్తే చెట్టు ఎక్కుతాడు ఆయన. మీలాగా కంగారు పడకుండా నేను చెట్టు ఎక్కాను, మీరు కంగారుపడి చెట్టు ఎక్కారు అదే తేడా, అని చెప్తారు. పులిని చూసి కంగారు పడక పోవడమనేది సాధనకు సంబంధించినది. వెర్రిగా పులి భగవంతుడే అని చెప్పి దానికి సమర్పణ చేసుకోవడమనేది సాధనలో మెలకువ తెలియక చేసేటి పని. అటువంటి పులిని తన యొక్క స్పర్శతో పిల్లిలా చేసిన సన్నివేశాలు శంకరుల వద్ద ఉన్నాయి. ఉన్నప్పటికీ

శిష్యులకు నేర్పాలి కాబట్టి, భగవంతుని అస్తిత్వం గమనించడం ఎలాగో చూపారు. అందువల్ల దాని పట్ల ద్వేషము, అసహ్యము, విముఖత ఏర్పడవు. దాని యందు శ్రద్ధ మనకు తగ్గదు. దుష్టులున్నారని అనుకోవడం వలన దురాచారం ఎక్కువగా జరుగుతూ ఉంటుంది, అని ఒక వాక్యం ఇచ్చారు మాస్టర్ గారు. దుష్టులున్నారని భక్తులు అనుకుంటూ ఉంటారు. ప్రతివాడు తనను తాను భక్తుడనని ఒక ముద్ర వేసుకుంటాడు. No one has confirmed the status that he conferred upon himself. మిగతా వాళ్ళు ఎలాకారో చూస్తూ వుంటారు. ఎవరు కారు, ఎవరు ఔను అనేది మనం చేసే డంభాచార కార్యక్రమాల్లో ఉండదు. మనం చేసే పనుల్లో, మన మాట యందు, మన చేతయందు, మన ఆలోచనల యందు-అది గమనిస్తూ ఉంటారు. ఇలా వర్తిస్తున్నప్పుడు మన చైతన్య స్థితి పరిమితత్వం లేకుండా పెరుగుతుంటుంది. ఎవరైనా ఇష్టం లేని మనిషి రాగానే మనం కుంచించుకొని పోయామంటే in terms of consciousness we have contracted అనే కదా? మన చైతన్య స్థితిని తగ్గించుకున్నామని అర్ధము. ఉన్న అస్థిత్వాన్ని ఉన్నట్లు చూడగలిగినట్లయితే ఈ ఒక్క నామంతో భగవంతుని అనుభూతి పొందే అర్హత వస్తుంది. అందుకని భక్తి లేనిదే ఉపయోగం లేదు. కేవలం జ్ఞానం ఉన్నా లాభం లేదు. అందుకే భక్తి మొదటిదై మిగతవి తర్వాత రావాలి. ఇష్టం ఉన్నా లేకపోయినా ఎదుటి మనిషిని చూసి నీవు నవ్వగలవా? రాముడు చేశాడు. కృష్ణుడు చేశాడు. మహాత్ములు చేసి చూపిస్తూ ఉంటారు. ఎదుటి వ్యక్తి స్వభావం తో సంబంధం లేకుండా వానిని చూసి నవ్వగలగడమనేది ఎదుటి మనిషిమీద తనకున్న అభిప్రాయాన్ని చూడటం కాకుండా, ఎదుటి మనిషిని మాత్రం చూడటం చేతనయిన వారికి వీలు పడుతుంది. అలా కాని వారు ఈ సాధన భక్తి పేర్న చేస్తున్నప్పటికీ ఎదుటి వ్యక్తి లోని లోపాలు చూస్తూ ఉంటారు. ఆ లోపాలు ఎక్కువ చూడడం వలన, ఉన్న లోపాలకంటే వీడు చూసే లోపాలే ఎక్కువ ఉంటాయి. దాని వలన దురాచారము పెరుగుతూ ఉంటుంది. ఇంతమంది దుష్టులు ఇలా విజృంభిస్తుంటే మీరేం చేస్తున్నారు? అని మైత్రేయుడు శ్రీకృష్ణుని అడిగితే 'అసలు దుష్టులు ఎక్కడ ఉన్నారయ్యా! మీరందరు కొంతమందిని categorize చేసి నా ప్రాణాలు తీస్తారు కానీ, వాళ్ళే better మీ కన్నా' అని అంటాడు, ఎందుకన్నాడంటే భక్తుల రూపంలో చాలా మంది నాస్తికులుంటారు. నాస్తికుల రూపంలో చాలా మంది భక్తులు ఉంటారు. ఆస్తికులని పేరు పెట్టుకున్న వాళ్ళలో భగవంతుని కేవలం ఒక పెట్టుబడిగా

వాడుకొని, పనులు చేయించుకునే వాళ్ళు ఉంటారు. ఆ దరిద్రం నాస్తికులలో ఉండదు. నాస్తికుల లో కొందరు చేసే పనులలో పరిపూర్ణమైన శ్రద్ధ కలిగి, అనుభూతి పొందగలిగే స్థితిలో ఉంటారు. ఆస్తికత్వం, నాస్తికత్వము ప్రవర్తన యందు కనిపించే conformation తప్ప, మాటల యందు, ఉపన్యాసాలలో కనిపించేది కాదు. పూజలు, యజ్ఞాలు, క్రతువులు ఇటువంటి వాటిలో అందరూ జాగ్రత్తగానే ఉంటారు. అతి సాధారణ జీవిత సన్నివేశాలలో ప్రశాంతత పోగొట్టుకున్న వాడు, పెద్ద విషయాలలో ప్రశాంతత పోగొట్టుకొనని వాడు వీరిద్దరిని మనం తీసుకుంటే నలుగురూ చూస్తున్నప్పుడు ప్రశాంతతతో ఉండే వాళ్ళు కొంతమంది ఉంటారు. ఎవరూ లేనప్పుడు తమ నిజస్వరూపము చూపించే వారుంటారు. ఇలా చూస్తే ఆస్తికత్వానికి, నాస్తికత్వానికి  మనం వేసుకొనే measurements సరైనవి కావు. భగవంతుని ఆస్తికత్వం ఎంత చూడగలిగితే అంత నిజమైన ఆస్తికత ఉన్నట్లు. భగవంతుని అస్తిత్వము లేకుండా  మన అభిప్రాయాల రూపంలో ప్రపంచం చూస్తున్నామనుకోండి, అప్పుడది ఆస్తికత కాదు. ఎదుటివాడిని చూడగనే Muslim అని, Christian  అని అనిపించిందనుకోండి. You have seen something other than ఆస్తికత. భగవంతుడు, 'సర్వమున్ తానె యైన వాడు', అన్నప్పుడు ఈ రూపంలో కూడా వున్నాడు అని తెలియాలి. భగవంతుని అస్తిత్వం రాయిలో కూడా చూడాల్సిన పరిస్థితి వస్తుంది. మామూలుగా రాయిని మనము తన్ని, రాయి మనని తన్ని నట్లుగా బాధపడతాము. ఏమిటిరా? అంటే రాయి తగిలింది, అంటాము. నువ్వు కదా తగిలించుకున్నది. మనం అన్నీ reverse గా అర్థం చేసుకుంటాం. ఉన్న అస్తిత్వాన్ని ఉన్నట్లు చూడగలిగితే ఈ ఒక్క నామముతో భగవంతుని యొక్క అనుభూతి పొందగలిగే అర్హత వస్తుంది. అందుకని కేవలం జ్ఞానం ఉన్నా, భక్తి లేనిదే ఉపయోగం లేదని తెలుసుకోవాలి. Anything you see, first thing you have to recognize is its existence. మొత్తం చోటులో లేనిదంటూ లేదు కదా! ఉన్నది వాడే, అలా ఉన్నాడు అనే భావము మొదటిదై  మిగిలినవి తరువాత రావాలి. రావణుని చూచినా, ఆ రూపములో ఉండే భగవత్ చైతన్యమనేది మొదట గుర్తుకి వస్తుంది. రావణుడు దురాచారి అనేది రాముడికి తర్వాత వస్తుంది. అందుకని సీతను వదిలేస్తే  రావణాసురునితో రామునికి వైరం ఏమీ లేదు. రాజుగా సీతను రక్షిస్తున్నాను, అంటాడు. రాజుగా ఒక స్త్రీని రక్షించాలి కాబట్టి, బందీ కృతమైన స్త్రీ ని రక్షిస్తున్నాను, అంటాడు. అలా చూసే వాళ్ళ మార్గం భాగవత

మార్గం. అలా చూడగలిగితే మాత్రమే మనలో అస్తిత్వం పెరుగుతుంది. విషయాలు తెలుసుకోవడం వల్ల ఆస్తికులము అవ్వము.  ప్రతివాడికీ జీవితంలో లేచిన దగ్గర నుండి పడుకోబోయే వరకు కనిపించే రూపాలు, వినిపించే మాటలు అన్నీ ఆయన పెట్టుబడిగా వస్తున్నాయని గుర్తించడం మొదటి step. తర్వాత ఎదుటి వారు మనల్ని బాధ పెడుతున్నారు, వారు మనకు ఇష్టం లేకపోవడమనేది second step. అవి అప్రధానమైన విషయంగా ఉండాలి తప్ప, ప్రధానమైన విషయంగా ఉండకూడదు. అప్పుడు  నువ్వు చెదరవు. నువ్వు చెదరక పోతే నీ శ్రద్ధ  చెదరదు. శ్రద్ధ  చెదరక పోతే భగవంతుని అస్తిత్వం ఎప్పుడూ నీకు మిగిలి ఉంటుంది. ఇంద్రుడు వృత్రాసురునితో యుద్ధం చేసినప్పుడు, వృత్రాసురుని శత్రువుగా చూస్తుంటాడు. వృత్రాసురుని సంహరిద్దామనుకొని, విష్ణువు దగ్గర నుండి అస్త్రాలు తెచ్చుకున్నా చంపలేకపోతాడు. అప్పుడు ఇంద్రుడు "నేనెన్ని ఆయుధాలు వాడినా నిన్నెందుకు చంపలేక పోతున్నాను", అని వృత్రాసురుని అడుగుతాడు. దానికి వృత్రాసురుడు "నువ్వు ఎన్ని తెచ్చుకున్నా, నేను శత్రువును అన్న భావంతో, నన్ను చంపుదామన్న భావనతో వున్నావు. కానీ నాకు నీయందు శతృత్వం లేదు. అందుకని నీవు నన్ను చంపలేవు" అని  రహస్యాన్ని చెప్తాడు. శ్రీకృష్ణుని జీవితంలో ఎవరి యందు శతృత్వం లేదు. అందుకే శత్రువు అనుకొనేవాళ్ళు వాళ్ళని వాళ్ళే చంపుకొనేవారు. రాముని జీవితంలో కాని, క్రీస్తు జీవితంలో కాని ఎవరిపట్ల శతృత్వం కనిపించదు. శతృత్వం కనిపించడం వలన మన యందు cause of action arise అవుతుంది. కాబట్టి చూసే వారిలో శతృత్వం లేకపోతే దానిని 'అజాతశత్రువు' అన్నారు. ధర్మరాజు అటువంటివాడు. భక్తి చెదరని మార్గం మనకు కావాలంటే ఈ fundamental step రావాలి. ఇది రాకుండా మనము ఏమి నేర్చుకున్నా time waste. అది గొప్పదనానికి పనికి వస్తుంది తప్పా అనుభూతికి పనికి రాదు. ఇన్ని తెలుసు అని గొప్పగా చెప్పుకోడానికే పనికి వస్తాయి. మన మాస్టర్ E.K గారిని చూసినట్లయితే వారు భక్తి, జ్ఞానం సమపాళ్ళలో కలసి ఉన్న ప్రజ్ఞ. ఆయన తమ అనుయాయులకు వివరించిన ఎన్నెన్నో విషయాలు, భక్తి కలిగిన వారికి అనుభూతిగా మిగులుతాయి. లేనివారికి విజ్ఞానంగా మిగులుతాయి. విజ్ఞానంగా మిగిలితే గొప్పగా చెప్పుకోడానికి పనికి వస్తుంది. భక్తిగా మిగిలితే అనుభూతి చెందడము జరుగుతుంది. అనుభూతి చెందినవారికి అనుభూతిలో ఉండడము ఎక్కువగా ఉంటుంది, మాటలు తక్కువగా ఉంటాయి. అనుభూతి లేని వారికి

మాటలు ఎక్కువగా వుంటాయి. అనుభూతి తక్కువగా ఉంటుంది. ఈ సర్వము మనము ఎంత వరకు చూడగలము? చూసి, తర్వాత you can attribute. అదీ ప్రహ్లాదుడు చేసింది. భాగవతోత్తములలో ప్రహ్లాదుడ్ని ముందు చెప్తారు. నారదుడు కూడా అదే చేస్తాడు. ఈ నామము మనకు fundamental instruction. రూపాత్మక మైన సృష్టి అంతా కూడా భగవత్పరంగా చూడాలని శంకరాచార్యుల వారు చెప్పారు. అలా కాకపోతే నీవు చూసేదంతా మిథ్య, అన్నారు. అంటే ఉన్నది కాదు, నీవు చూసేది మిథ్య, అన్నారు. మనం ఎదుటి వ్యక్తిలో స్నేహితుడిని, శత్రువును, భార్యను, భర్తను ఇలా చూస్తుంటాము కదా! అవి ఉండవు. Unit consciousness గా వాళ్ళు ఎప్పుడూ ఉంటారు. కానీ మనం చూడడంలో తేడా ఉంటుంది. అలా చూడ గలిగితే రూపాత్మకమైన సృష్టి లో రూపంగా ఉన్న భగవంతుడిని మనం దర్శనం చేసుకోవచ్చు. ఆయనే రూపం, రూపాతీతం కూడానూ. ఈ మార్గంలో పత్తి, పత్తి నుండి నూలు, నూలు నుండి బట్ట, బట్టల మీద రంగులు- ఇవన్నీ చూసే సరికి అసలు బట్టే గుర్తుండదు. అసలు మూలమైన పదార్థాన్ని మరచి పోవడం అనేది సహజంగా జరుగుతుంది. కాబట్టి ఎలా కనబడుతుందో దానిని as it is take it, అంగీకారంగా తీసుకోవాలి. Master CVV గారు ఇచ్చిన అతి ముఖ్యమైన సాధన కూడా అదే. "నీలో పరిమితత్వాన్ని నేను తొలగిస్తాను. తొలగించేంత వరకు నీకు భగవంతుని యొక్క అనుభూతికి అర్హత లేదు కాబట్టి, దానిని మొదటి కార్యక్రమంగా నీయందు చేపట్టాను. నీకు దేనియందు ఇష్టము లేదో ఆ సన్నివేశాలు ఎక్కువ ఇస్తుంటాను. అలాగే ఏ సన్నివేశముల యందు, ఏ ప్రదేశములయందు, ఏ మనుషుల యందు -ఇష్టం లేదూ అంటే అది limitation. మీకు limitation ఉంటే నాకు ఇష్టం లేదు కాబట్టీ, ఆ యిష్టం లేకపోవడమనేది పోగొట్టి, మిమ్మల్ని అపరిమితులుగా చేసి, నా అంతటివారిని చేసుకుంటాను" అని చెప్పారు. అదే శ్రీకృష్ణుడు భగవద్గీత సాంఖ్యయోగంలో లాభ నష్టములు, జయాపజయములు, మానావమానములు- ఇవన్నీ ముందు basis గా పెట్టుకోక, first basis is existence of one soul! అని చెప్పాడు. ఆత్మ! దాన్ని ఎక్కువ తీసుకురావాలి. లేకపోతే ఇబ్బంది పడతాం. బయటకి వెళ్ళినప్పుడు, shopping కి వెళ్ళినప్పుడు చిరాకు పెరిగి పోతుంది. ఎందుకు పెరుగుతుంటీ అంటే ఇది చూడము. గందరగోళాలే కనిపిస్తుంటాయి. మోసం అనిపిస్తుంది. మోసం చేసే వాడిని కూడా నేనే అన్నాడుగా! ముందు

రూపాన్ని భగవంతునిగా చూడడము 'సర్వః' నామానికి అర్ధము కాబట్టి  కొన్ని జన్మలు అదే practice చేస్తే, దానిలో నుండి భక్తి పుడుతుంది. దాని నుండి శ్రద్ధ పుడుతుంది. తర్వాత అర్హత వస్తుంది. లేకపోతే అర్హత రాదు.

## ౨౮. శర్వః

అంటే శివుడు. ఉన్నట్టు గా కనిపించే రూపంలో తర్వాత ఏమీ లేనట్లు కనిపిస్తుంది. ఎందుకంటే ఇటు వచ్చిందంతా అటు వెళ్ళిపోయేదే. సర్వము, ఇన్ని రూపాలుగా ఉన్న ఒకే ఒక రూపము. శర్వము అంటే రూపాలేవీ లేనప్పుడు ఉన్న Raw material, ముడి పదార్థము. అదెప్పుడూ ఉంటుంది. దాన్లోంచి రూపాలు వస్తుంటాయి, మళ్ళీ అందులోకి వెళ్ళిపోతాయి. లేనిది చూడగలవా? ఉన్నదే చూడలేనప్పుడు లేనిది చూడడం ఎలా? లేనిది చూడడానికి సంబంధించిన నామము ఇది. ఒక గురువుగారు ఒక శిష్యుణ్ణి తీసుకొని నదీ స్నానానికి వెళ్ళేవాడు. ఒకరోజు నదికి వెళ్ళిన తర్వాత "ఒరే స్నానానికి తీసుకురావలసిన చెంబు ఇంట్లో మర్చిపోయాను. ఇంటికి వెళ్ళి చెంబు పట్టుకొని రా" అంటాడు. గురువుగారు చెంబును కావాలనే ఎప్పుడూ పెట్టే చోట కాక వేరొక చోట పెట్టి వస్తాడు. శిష్యుడు ఇంటికి వెళ్ళి వచ్చి 'ఇంట్లో చెంబు లేదు సార్' అంటాడు. ఇది చాలా మహత్తరమైన విషయం. ఇది ఉపనిషత్తులో ఉన్నదీ, మాస్టారు మనకి చెప్పినది. చెంబు లేదా? అంటే, లేదండీ, అంటాడు శిష్యుడు. బాగా చూశావా, అని శిష్యుణ్ణి అడుగుతారు గురువుగారు. చూశానండి, అంటాడు. అప్పుడు గురువుగారు, లేని చెంబును ఎలా చూసావు? అని అడుగుతాడు. ఆ ప్రశ్న వాడికి అర్థం కాలేదు. ఆయన ప్రశ్న అర్థమైతే శర్వము అనే పదం అర్థమైనట్టు. అది అర్థం కాకపోతే కానట్టు. లేనిది ఎట్లా చూసి వచ్చావురా? అంటాడు. చెంబు లేదని చూసి వచ్చాడు. అందులో ఉపనిషత్తులలో చెప్పిన మహత్తరమైన రహస్యం ఉన్నది. అంటే ఉన్నది ఎట్లా చూస్తావో, లేనిది కూడా అట్లా చూడవచ్చు. వీడు చూశాడు. ఇపుడు మీకు నాకు మధ్య ఏమీ లేదనుకుంటాము కదా? లేదనుకున్నదే అసలు ముడి పదార్థం. Etheric pervasion ఉన్నప్పుడు అందులోంచి ఏ potency అయినా manifest అవ్వచ్చు. ఆకాశం చూస్తే ఏమీ లేనట్టు ఉంటుంది కదా ? 'ఏమి లేనట్టి గగనాన ఉండి, అన్నీ వున్నట్టి భూమికి అవతరింతువు' అని ఒక పద్యం రాశారు గురువుగారు గోదా వైభవంలో. ఏమీ లేనట్టు ఉంటుంది కానీ దాని నిండా అన్నీ ఉన్నాయి. Potencies గా వున్నాయి. అన్నీ ఉన్నట్లు ఉన్న వాటిలో కూడా వాడే ఉన్నాడు. మర్రి గింజలో మర్రి చెట్టు లేదా? అని అడిగేవారు మాస్టారు. ఇక్కడ details potencies గా

ఉంటాయి.  అందువల్ల మనము లేవనడానికి వీల్లేదు. కాబట్టి నీవు ఏదయితే లేదంటావో అది శర్వము. మన పరిస్థితి ఏమిటంటే రూపంగా ఉన్నప్పుడు చూడ లేము. రూపాతీతంగా ఉన్నప్పుడూ చూడలేము. రెండు కళ్ళూ గుడ్డి. ఉన్నది చూడలేని వాడు, లేనిది ఎలా చూస్తాడు? కష్టం కదా! అందుకే రెండు పదాలూ సర్వః, శర్వః పక్కపక్కన వచ్చినాయి. లేనిది చూడగలగటం అంటే మనము కూడా లేనట్టుగా ఉన్నాం ఒకప్పుడు.  నిద్రలో మన మున్నామని మనకు తెలియదు కదా! అంటే లేమనే, గానీ ఉన్నామని మనకు తెలుసు కదా! We know by inference we are existing. అప్పుడు మనకు మనసు లేదు. మన కార్యక్రమాలు లేవు. అభిప్రాయాలు లేవు. ఇంద్రియాలు లేవు. శరీరం లేదు. లేవు అంటే ఉన్నాయి కానీ దాని ఎరుక మనకు లేదు. అసలు మనమే ఉన్నామో, లేమో అన్నట్టుగా  వుంటుంది. అది తెలిసిన వారికి అదొక్కటే ఉంటుంది కానీ మిగతవి ఉండవు. మనం పొద్దున్నే, ఉన్న స్థితి నుండి చైతన్య వంతుల మవుతూ ఉంటాం. అది అవడమేగా! Root matter అంటే మూల పదార్థం చైతన్య వంత మైనప్పుడు అందులో నుంచి మనసు పుడుతుంది. మనస్సు పుట్టగానే ఇంద్రియములు, శరీరం -ఇట్లా మొత్తం విచ్చు కుంటాయి. ఇలా విచ్చుకోడానికి ఏది కారణమో దానికి రూపంలేదు, నామం లేదు. ఆ రూపం, నామము లేని స్థితిని శర్వము అంటారు. అక్కడ ఒక అగ్ని ప్రమాదం జరిగి ఓ 20 ఇళ్ళు కాలిపోయాయను కోండి అక్కడేమీ మిగల్లేదు, అంటాం. అంటే శివుడు నవ్వుతాడుట. నేనున్నాను కదరా, నువ్వు లేవంటావేం? అని. శివుడే రూపంగా దిగుతాడూ, శివుడే అరూప స్థితికీ వెళతాడు. ఈ మధ్య చిదంబరంలో అరూప శివుడ్ని చూపించాను. అది చిదంబర రహస్యం, అంటారు. అక్కడ ఒక తెర వేసి ఉంటుంది. తెర తీస్తే ఏమీ ఉండదక్కడ. కనిపిస్తున్నాడా? అంటారు. చిదంబరంలో ఆకాశ రూపంలో శివలింగ మున్నది. ఆకాశ రూపం చూడగలిగిన వారికి ఉంది. అంటే etheric form లో వుంది. చూచేవాడికి చక్కగా కనిపిస్తుంది. ఇంకొక చోట వాయురూపంలో శివలింగ మున్నది. మనం కాళహస్తి వెళితే, అక్కడ శ్రీ, కాళ, హస్తి ముగ్గురు పూజ చేసిన లింగం ఒకటి మనం చూస్తాం. లోపల గర్భగుడి లో ఇంకొక లింగం వున్నది. అంటే లోపల రెండు లింగాలు ఉన్నాయి. ఒకటి వాయు లింగం, రెండు మనకు కనిపించే లింగం. చూడ గలిగే వాళ్ళకు వాయు లింగం కనిపిస్తుంది. అలాగే అరుణాచలంలో అగ్నిలింగం ఒక దీపం లింగాకారంలో ఉంటుంది. దాన్ని చూసినవాళ్ళు చాలా మంది ఉన్నారు. అదీకాక

మనలాటి వాళ్ళ కోసం substitute గా ఇంకో లింగమున్నది. దాన్నే జ్యోతిర్లింగం అంటారు. అక్కడకి వెళితే జ్యోతి కనిపిస్తుంది లింగం కనిపించదు. అలాగే వాయు లింగం, ఆకాశ లింగం మనలో ఉన్న అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశముల శుద్ధి ని బట్టి కనిపిస్తాయి. మనకు పంచ లింగాలు ఉన్నాయి. జంబుకేశ్వరంలో జల లింగం, కంచిలో మట్టిలింగం, ఇలా 5 తత్వాలతో కూడిన లింగాలు ఉన్నాయి. ఇందులో మట్టి లింగము, నీటి లింగము అవగాహన చేసుకోడానికి కొంచెం సులభం. చిత్ అంబరము అంటే చైతన్యమే అంబరముగా కలవాడు చిదంబరుడు, అదే ఆకాశ లింగం. మనం కూడా లేచినప్పుడు రూపం లేకుండా వున్నాననుకునే స్థితి అనుభూతి చెందే పరిస్థితి లేదు. అది అనుభూతి చెందుతున్నప్పుడు రూపం గురించి ఆలోచించడం ఉండదు. దానిని మనకు చెప్పడానికి శర్వము అనే నామాన్ని ఇచ్చారు. మనం లేదను కుంటున్నామే అది పరిపూర్ణంగా భగవంతుడు ఉన్న స్థితే! అందుకే Madam Blavatsky 19 వ శతాబ్దములో, శాస్త్రజ్ఞులు vacuum తప్పా అక్కడేం లేదు, అంటే చీవాట్లు పెడ్తుంది. నీకు లేదురా, కానీ ఉంది అని చెప్తుంది. రోజూ సముద్రము చూద్దామని beach road లో ఇల్లు కట్టుకొని, మనకున్న problems తో కనీసము ఇంటి నుండి బయటకి వచ్చినప్పుడు కూడా సముద్రాన్ని గమనించము. కానీ అలలు, మారే రంగులు మొదలైనవి మనం చూస్తే కనిపిస్తుంది. రూపముతో కూడిన భగవంతుడు సర్వము అయితే, రూపము లేనప్పుడు కూడా భగవంతుడు వుండేదే శర్వము. చోటు! అది లేనట్టుగా ఉంటుంది. అంతా తీసేసినట్టు గా వుంటుంది. అంతా అయిపోయినట్టు ఉంటుంది. దానికి శివుడు అని పేరు పెట్టారు. ఉన్నప్పుడు ఉన్నది వాడే -వాడి చుట్టూ రూపం ఉంటుంది. లేనప్పుడు ఉండేదీ వాడే. రూపం వచ్చినప్పుడూ, రూపం లేనప్పుడూ ఉన్నది శివుడే! సంపద ఉన్నప్పుడూ, లేనప్పుడూ ఒకేలా ఉన్నారనుకోండి. దానికి best example రాముడు. రెండు పదాలకి representative. ఉన్నప్పుడు ఒక పద్ధతి, లేనప్పుడు ఒక పద్ధతిగా కాకుండా. ఏర్పడడం -వాడే దాన్ని సృష్టి చేయడం, మళ్ళీ వాడిలోకే లయం అయిపోవడం ఉంటుంది. అదే——

"ఒకపరి జగముల వెలినిడి, యొక పరి లోపలికిన్ గొనుచు, నుభయము దానై సకలార్థ సాక్షియగు, నయ్యకలంకుని నాత్మమూలు నర్థిన్ దలంతున్" అంటాడు

గజేంద్రుడు. ఎవరిని ప్రార్ధించాలో తెలియక మూలమెవ్వరో వాడ్ని పట్టుకుందామనుకుంటాడు. అక్కడ మొదలు పెడ్తాడు గజేంద్రుడు సాధన.

"లోకంబులు లోకేశులు, లోకస్థులున్ దెగినన్ దుది నలోకంబగు
పెంజీకటికవ్వల నెవ్వం డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్"

అన్నీ తెగిపోయినప్పుడు వుండే వాడు ఎవడయ్యా అంటే శివుడు! శివుడు శ్మశానం లో వుంటాడు అనటానికి అర్ధం అదే. శ్మశానం అంటే ఏమీ లేని స్థితిలో పరిపూర్ణంగా వుండేవాడు. దానికి precipitate గా ఈ రూపాలన్నీ వస్తూ వుంటాయి. Precipitate లో వున్నప్పుడు దాని గుణాల్లో ఇరుక్కు పోయి, మూల పదార్ధం చూడము. మనం ఎలా ఉన్నామో మనకి తెలియదు కదా! ఉండబట్టి లేస్తున్నాం, పనులు చేసుకుంటున్నాం, కానీ అసలు ఎలా ఉన్నాం? అదీ వాడుండం! ఇవన్నీ లేకపోయినా నీవుంటావని శ్రీకృష్ణుడు చెప్పడం అది. నాటకాల్లో , సినిమాల్లో ఒకడు ఎన్ని వేషాలు వేసినా వ్యక్తి మాత్రం ఒక్కడే. కానీ మనం మన అసలు స్థితి మరచిపోయి మనం వేసుకున్న వేషం ఎక్కువ గుర్తు పెట్టుకుంటూ వుంటాం. అసలు ఈ వేషం మనం అనుకుంటూ ఉంటాం. ఆ వేషం వదలము. Cinema ల్లో వేషం వేసి, బయటకి వచ్చాక కూడా అదే పాత్రధారిని నేను, అంటే ఎలా ఉంటుందీ? మనం కూడా అలాగే అనుకుంటాం. అందుకని వాడే తీసేస్తాడు. నేను ఫలానా అని అనుకున్నప్పుడు 'నేను నేనైన నేను' అని గుర్తు లేకుండా మిగతావన్నీ గుర్తుంటే ఉపయోగం ఏమి లేదు. ఆ గుర్తు వున్న వాడికి శర్వుడు అన్నవాడు అర్ధం అవుతాడు.

## ౨౯, ౩౦. శివః, స్థాణుః

“సర్వః శర్వః ఈ రెండూ తెలిస్తే శివ స్థాణుః. వాడికి అంతా శుభమే! ‘పరమ శుభమైన స్థితిని శివము’ అంటారు. శివము అనే దానికి ఇంకో అర్థముంది. పవిత్రత తో కూడిన అందము కలిగినది. చాలా మంది అందంగా ఉంటారు కానీ పవిత్రత ఉండదు. కొంత మంది అందంగా లేకపోయినా పవిత్రంగా ఉంటారు. అలాంటప్పుడు మొదటివారికన్నా రెండవ కోవకి చెందినవారు better. అందము, పవిత్రత కలిగిన వాళ్ళ దగ్గర దివ్యకళ ఉంటుంది. అదీ మన మాస్టరుగారు! అందమూ ఉన్నది. పవిత్రత ఉన్నది. అందము, పవిత్రత రెండు కలవడం అమ్మవారు, అయ్యవారు కలయిక. అంటే రూపంలో ఉన్నప్పుడు, రూపంలో లేనప్పుడు చూడగలిగిన వారి జీవితం శివమయం అవుతుంది. అలాంటి పరిపూర్ణ స్థితి యందు శివం ఏర్పడుతుంది. అంటే నానా రూపాలతో, రూపాలుగా ఏర్పడిన భగవంతుడు, రూపానికి రూపానికి మధ్య ఉన్న భగవంతుడు, రూపములు లేనప్పుడు ఏర్పడిన భగవంతుడు వాడు సర్వుడు, వీడు శర్వుడు. సర్వః శర్వః శివ స్థాణుః ఇవి మంచి పదాలు. దాని మీద భక్తి కొద్దీ, అవగాహన చేసుకున్న కొద్దీ మనకు ఎక్కువ విచ్చుకుంటాయి. అది మన పరిపక్వతని బట్టి ఉంటుంది తప్పా, ఇంతే ఇంక లేదు అని చెప్పడానికి లేదు. మన జీవితం రూపం గా ఉన్న భగవంతుని, రూపాతీతంగా ఉన్న భగవంతుని చూడగలిగినప్పుడు శివం అవుతుంది. అప్పుడు ’స్థాణు’ అనే భగవత్తత్వం మనకు అవగాహన అవుతుంది. మనం undisturbed state లో ఉంటే, undisturbed state లో ఎప్పుడూ ఉండే భగవంతుని అవగాహన అవుతుంది, దర్శనమౌతుంది. స్థాణు అంటే stone లాగా నిశ్చలంగా ఉండే స్థితి ! రాయి అక్కడ పెట్టి వెడితే ఎవరూ దాన్ని కదపలేదనుకోండి ఈ భూమి ఉన్నంతకాలం అది అక్కడే ఉంటుంది. Stone like అంటారు కదా! Stable like stone, rock stable అంటారు కదా! ఏమొచ్చినా ఊగడం ఉండదు. భాగవతంలో చెప్పబడిన మహాత్ములందరు అలా ఊగనివారే! నారదుడు, శుకుడు, వ్యాసుడు, అంబరీషుడు, ప్రహ్లాదుడు, బలి. అందరూ ఇలాంటి వారే. బలిని అంతా పోతోంది అంటే, ‘ఎక్కడకి పోతోంది? వాడిలోంచి వచ్చింది వాడిలోకి వెళ్ళిపోతుంది’ అని చెప్తాడు. ‘నిన్ను సుతలంలో పెట్టారుటా’, అని చెప్తారు. సుతలం

అంటే మోకాళ్ళ level లో ఉండరా, అని చెప్పాడు. 'భావనే కదా ఇక్కడా, అక్కడాను. ఎక్కడుంటే ఏమిటీ?' అన్నాడు. మాస్టారుగారు పురుషమేధంలో అభ్యాసమూర్తి పాత్ర ఒకటి ఇచ్చారు. "అందరూ నువ్వు చేసే మంచిపనుల్లో పాల్గొంటున్నారు, నాకేమిటీ ఇలాంటి పని పెట్టావు. నేనిప్పుడు నీ body తీసేయాలి", అని కృష్ణుడితో అంటాడు. "సృష్టి కార్యంలో మంచి చెడులు దాటిన వాడివి కాబట్టి నిన్నక్కడ పెట్టాను", అంటాడు శ్రీ కృష్ణుడు. అలాగా బలి చక్రవర్తి ఇవన్నీ దాటిపోయాడు. దాటిపోయి మోకాలి లోకంలోకి వస్తాడు. అప్పుడు భగవంతుడు ప్రహ్లాదుడ్ని చూస్తాడు మీవాడికి ఏమన్నా తక్కువ చేశానా అని. అంటే, ప్రహ్లాదుడు లేదు, చాలా మంచిపని చేశావు, అంటాడు. మొదట ప్రహ్లాదుడు కూడా ఏమిటి నా మనమడ్ని ఇలా తొక్కేస్తున్నావన్నట్లు భావంలో వ్యక్తం చేస్తాడు. అవి, ఇవి రెండూ సమానస్థితిలో ఉండేవాడు స్థాణు.

## 31. భూతాదిః

అంటే భూతములన్నిటికి ఆది లేక పుట్టుక స్థానం. ఆయన నుండి భూతములు పుడుతున్నాయి. భూతములలో ఆయనయే వుంటున్నాడు. మట్టి నుండి కుండ పుట్టి, కుండలో మట్టి ఉంటుంది. మట్టి లేకపోతే కుండ లేదు. కుండలో మట్టి కుండ రూపంలో వుంది తప్ప, లేక పోవడం లేదు. ఈ సమస్త భూతములుగా చెట్టు, పుట్ట, జంతువు, మనిషి -ఇవే గాక గ్రహ గోళాదులూ, సూర్య మండలములు, నక్షత్ర మండలములు -ఇవన్నీ అక్కడి నుండి దిగి వస్తున్నాయి. ఎక్కడ నుండి అంటే, ఇది అని చెప్పడానికి ఆకారము లేదు. ఆకారము లేని చోటు నుండి పుట్టుకొని వస్తున్నాయి. పిండాండ, బ్రహ్మాండ న్యాయం ప్రకారం, మనలో లేనిదీ, భగవంతునిలో ఉన్నది, భగవంతునిలో లేనిదీ మనలో ఉన్నదీ ఏమీ లేదు. భగవంతునిలో ఏమి జరుగుతూ ఉంటుందో, సృష్టిలో మానవునిలోనూ అదే జరుగుతూ వుంటుంది. మానవునిలో జరిగేది అవగాహన చేసుకుంటే, భగవంతునిలో జరిగేది తెలుస్తూ ఉంటుంది. అందుకనే నిన్ను నీవు తెలుసుకో అన్నారు. కాబట్టి భూతాదిః అనే విషయాన్ని సరాసరి బ్రహ్మాండంగా తెలుసుకుందామనుకొంటే, కొంచెం కష్టంగా ఉంటుంది. అవగాహన కాదు. పిండాండము లో మనల్ని మనం అన్వయం చేసుకొని తెలుసుకొంటే, కొంచెం సులభంగా అవగాహన అవుతుంది. భగవంతునిలో పుట్టినట్టుగా మనలో కూడా చాలా పుడుతూ వుంటాయి. అదెలాగంటే ముందు మనలో నుంచి చైతన్యం పుట్టుకొచ్చి మేలు కొంటాము. లేకపోతే మేల్కాంచడం ఏమి ఉండదు. ఉండడమే వుంటుంది. నిద్రలో కూడా ఉన్నాము. ఉండడం నుండి మేల్కాంచడం అనేది మొదటి పుట్టుక. దానినే 'ప్రధాన' అనే శబ్దంగా, భగవంతుని నామం గా చెప్పుకున్నాము. చైతన్యవంతుల మయ్యాక మననుండి అనేకం పుట్టుకొస్తాయి. మనలో ఎన్ని ఆలోచనలు పుట్టుకొస్తాయో అవన్నీ భూతాలే. భూతము అంటే పుట్టినదని అర్థం. మనమందరం కూడా భూతము లే! ఆలోచనలు పుట్టినప్పుడు మనం అందులో ఉంటున్నాము. మనం లేకపోతే ఆలోచనే లేదు కదా! అలాగే భగవంతుడు లేకపోతే భూతాలన్నీ లేవు. కాబట్టి భగవంతుని నుండి పుట్టుకొచ్చిన భూతాలన్నిటికి భగవంతుడే మొదలు. ఆయన ఎప్పుడూ వుంటాడు. భూతములు వచ్చి పోతూ

వుంటాయి. మనము కూడా వుంటూ ఉంటాము. మన ఆలోచనలు వచ్చి పోతూ ఉంటాయి. ఎవరి స్థాయిలో వారి ఆలోచనలు వారికి వచ్చి పోతూ వుంటాయి. ఒక రోజు మనకు వచ్చే ఆలోచనలు మనం లెక్కపెట్టలేనన్ని ఉంటాయి. అవి అత్యద్భుతంగా, అతి ఆశ్చర్యకరంగా వుంటాయి. మళ్ళీ మనం నిద్ర పోయే వరకు అలా ఆలోచనలు పుడుతూనే వుంటాయి. ఆలోచనలు చావక పోతే నిద్రేలేదు. అవన్నీ మనలో నుండి పుట్టు కొని వచ్చిన భూతాలే. మనలో నుండి పుట్టుకొచ్చిన భూతాలకు, భగవంతుని నుండి పుట్టుకొచ్చిన భూతాలకు తేడా వుంది. భగవంతుని నుండి పుట్టుకొచ్చిన భూతాలు, భగవంతుని వశం లో వుంటాయి. మనలో నుండి పుట్టుకొచ్చిన భూతాల వశంలో మనం వుంటాము. అదీ తమాషా. అందుకే ఆయన దేవుడై కూర్చున్నాడు. మనం జీవులమై బంధింపబడిన స్థితిలోఉన్నాము. మళ్ళీ దేవుడై ఈశ్వరత్వాన్ని పొందాలంటే ఈ ఆలోచనల పుట్టుక మీద మనకు స్వామిత్వం రావాలి. అలా వస్తే మనమూ స్వామియే! భగవంతుని సృష్టి లో తననుండి పుట్టు కొని వచ్చిన వాని మీద తనకు స్వామిత్వమున్నది. మన నుండి పుట్టుకు రావడం వరకు సత్యమే కానీ వాటి మీద మనకు స్వామిత్వం లేదు. ఎవరిమీదైనా మనకు అసూయ, కోపం, ద్వేషం పుట్టుక వచ్చాయి అనుకోండి. అవి మనని ఊపేసి తినేస్తాయి. కేవలం ద్వేషమే కాదు, రాగము, మమకారము అయినా అంతే. అసూయ లాంటిది మరీ భయంకరంగా వుంటుంది. మహాభారతంలో దుర్యోధనుని, కర్ణుని స్వతంత్రముగా వాళ్ళ ఇష్టం వచ్చినట్లు నడవకుండా, అసూయ వాళ్ళను నడిపించింది. ఒక్క ఆలోచన వారి మొత్తము జీవితాన్ని బలిగొనింది. ఎంత ఉన్నా ఇంకా కావాలనే ఆలోచనే మొత్తం మానవ జాతినంతా గుప్పెట్లో పెట్టుకుంది. మానవ జీవితాలు ''కావాలి''అనే ఒక్క ఆలోచన నుండి బయట పడలేక దుర్భరమై పోతూ వుంటాయి. 'సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుండు, సంతోషికి నెపుడు కలుగు శుభము, సంతోషి కాకుంట సంసార హేతువు' అన్నట్లు ఉన్న దానితో తృప్తి చెంది, తృప్తిలేని పరిస్థితి లో పడకుండా కర్తవ్యం నిర్వర్తిస్తూ ఉంటే, మనిషికి స్వామిత్వం ఉంటుంది. లేకపోతే సంపాదనకు దాసోహమే! ప్రత్యేకించి భారతీయులకి ఉన్న దరిద్రం ఏమంటే డబ్బుకి, పదవికి దాసోహం! అది ఈ జాతి కున్న ఒక శాపం. డబ్బులు వచ్చాయిట అంటే మనం ఆగలేం. పదవి, తద్వారా పలుకుబడి వచ్చిందిట అంటే ఆగలేం. ఇవి పెద్ద వ్యామోహాములు. ఈ రెండు రకాలైన జారుడు బండల వెంట పడితే మనిషి సుఖ పడే అర్హత కోల్పోతాడు.

అవసరమా అని చూసుకోకుండా వీటి వెనుక పడ్దామనుకోండి, మనల్ని డబ్బున్న వాళ్ళ వెనుక, పదవులున్న వాళ్ళ వెనుక పడేట్లుగా చేస్తుంది. ఇవి కావాలి అనే ఒక్క కోరిక వల్ల మొత్తం మానవజాతి బానిసత్వాన్ని అనుభవిస్తున్నది. కానీ వీటిపై స్వామిత్వము పొంది బాగా జీవించే వాళ్ళూ కొద్దిమంది ఉన్నారు. మనకింత ఉంది, చాల్లే ఇహ మంచి విషయాలకి పోదాము, అని ఆగిన వాడికి రావడం ఆగదు. నిజానికి మనకు రావడం, రాకపోవడం అనేదానికి వేరే scheme ఉన్నది. మనం చేయడం, చేయకపోవడం ఒక్కటే కారణం కాదు.

"కాగల పనులెల్ల కాక మానవు, కాని పనులు భువిని కానేకావు, మహిమ వేరే కలదు మన తోడ గలదా, విశ్వదాభిరామ వినుర వేమ" అన్నారు. వంటి నిండా నూనె రాసుకొని పుట్టెడు నువ్వులలో పొరలినా అంటిందే అంటుతుంది అంటనిదంటదు. 'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచనా', పనిచేస్తూ ఉండు. వచ్చేది వస్తుంది. చేయడానికి, రావడానికి అంత link వుందనుకోకు, కొంత gap ఉంది. భగవంతుడు ఈ భూతములన్ని తననుండి వ్యక్తమైనా, తన యందున్నా స్వామిత్వము వహించి ఉంటాడు. కానీ మానవుడికి తన నుండి వ్యక్తమైన వాటియందు రసము లేదు. నీరసమున్నది. అందుకే మనము కాసేపు కళ్ళు మూసుకొని ధ్యానం చేద్దామనుకుంటే ఆలోచనలు, 'పోవోయ్' అంటాయి. Let us see how you will meditate అన్నట్లుగా వరుసగా ఆలోచనలు వచ్చేస్తాయి. అసలు ఈ ఆలోచనలు ఎక్కడి నుండి వస్తున్నాయంటే, can we say we are the creators of the thought? We are not the creators of the thought; we are platform for the thought. రెంటికీ చాలా తేడా ఉంది. Platform మీద (మన దేశంలో ticket లేకుండా) ఎవరైనా తిరగచ్చు. అందుకే మా ఇల్లు railway platform అయిపోయిందంటారు. ఎవరైనా, ఎప్పుడైనా, ఏ గదిలోకైనా వచ్చేయచ్చు. అలాటి ఇల్లు లాంటిది మన మనస్సు. బద్దలైపోయిన మనోఫలకంలా ఉంటుంది. మన మనోఫలకము ముక్కలు ముక్కలు అయిపోయి ఉంటుంది. కాకపోతే frame ఉంటుంది కనుక ముక్కలన్నీ ఒక చోట ఉంటాయి. అందరూ వచ్చితొక్కేస్తారు. ఎవరు? మన ఆలోచనలు. మన ఆలోచనలు మనల్ని తొక్కినంత, బయట వాళ్ళు తొక్కరు. స్వంత ఆలోచనలకి ticket, permission అక్కర్లేదు కదా! మన railway platform మీద జరిగే అన్ని చెత్త పనులలాగే మన ఆలోచనలూనూ. మన railway platform మంచి example మన

మనోఫలకానికి. Anything and everything can be done on an Indian railway platform, so is the human mind. వీళ్ళేమీ చేయలేరూ, మన ఇష్టం వచ్చినట్లు ఆడుకోవచ్చు అనుకుంటాయి ఆలోచనలు. మొత్తం మానవ జాతికి అంతా కలిపి ఒక thought plane వుంది. ఎవడి instrument యొక్క fitness ని బట్టి వాడు దానికి సంబంధించిన ఆలోచన, ఒకే thought plane నుండి తెచ్చుకుంటాడు. మనింట్లో ఉన్న radioలో చాలా stations ఉంటాయి. కానీ మనకున్న సంస్కారాలను బట్టి ఆ station tune చేసుకుంటాం. అలాగే ఈ thought plane లో అన్నీ ఉన్నాయి. దైవత్వము, ప్రేమతత్వము, విజ్ఞానము, వికాసమే కాకుండా రాగద్వేషాలు, కామక్రోధలోభాలు, మోహమదమాత్సర్యాలు. అన్నీ కలిపి చుట్టూ చోటులో ఉంటాయి. Fitness of the instrument ని బట్టి అవి లోపలకి వస్తుంటాయి. Railway platform అయితే ఎవడి ఇష్టము వచ్చినట్లు వాడు ఏమన్నా చేయవచ్చు కానీ, మనింట్లో చేస్తే ఒప్పుకుంటామా? ఎందుకు ఒప్పుకోమూ? Because we have established certain regulations and some control. అలాంటివి ఆలోచనల విషయంలో మనకి లేవు. భగవంతునికి ఉన్నాయి. అందుకే ఆయన భూతాది, మనం భూతాది కాదు. మనలో, ఆయనలో కూడా ఆలోచనలు పుట్టుకొస్తాయి. కానీ వాటికి తేడా ఉందని అర్థం. Process అదే అయినా purpose అదికాదు. మనం, మనకొచ్చే ఆలోచనల విషయం లో వివశులయి పోయాము. అవి మనని పట్టి పీడిస్తాయి. వాటితో ఎలా పీడింపబడుతామో తెలియడానికి పురాణాలలో చాలా కథలు ఇచ్చారు. దశరథుడు, శంతనుడు భార్యా వ్యామోహం తో, దుర్యోధన కర్ణులు అసూయ తో పీడింప బడ్డారు. ఇలా వారికి వచ్చిన ఆలోచన దాటి బయటకి వెళ్ళలేక దానికోసం మిగతావన్నీ అల్లే ఓ పద్ధతి నేర్చుకొని, వీడు అల్లుతున్నాననుకుంటాడు కానీ ఆ ఆలోచన అల్లేస్తుంది. మనం ఇల్లు కట్టుకున్నామనుకొంటాము కానీ ఆ ఇల్లు మనను బంధిస్తుంది. ఎక్కడికి వెళ్ళాలన్నా ఇల్లు అడ్డం. ఇది చాలక సరదాగా మనం ఒక కుక్కను పెంచుతాము. ఆ కుక్క తన సరదాలన్నీ మనతో తీర్చుకుంటుంది. దాన్ని పొద్దున, సాయంత్రం బయటకు తీసుకొని వెళ్ళాలి. అన్నీ చక్కగా చేయించుకుంటుంది. మనం పెంచుకుంటున్నాం అనుకోవడం మన అమాయకత్వం. ఇవన్నీ స్వామిత్వం వహించి చేస్తున్నాడా? లేక ఏడుస్తూ, తప్పక చేస్తున్నాడా? అని రెండు వుంటాయి. భగవంతుడు ఎప్పుడైనా తప్పుకో గలడు. At any moment

He can withdraw the whole thing. Can we do it? మనకి ఇరక పెట్టుకోవడమే కానీ, బయటకు రావడం తెలియదు. పట్టుకొని లాగినా రాము. అందుకే మనకు తెలియకుండా తీసుకొని వెళ్ళి పోతాడు. అదే ఈ శరీరము లోనుంచి వెళ్ళిపోవడ మంటే. రారా బాలేదు అంటే, అబ్బే ఇంకా ఉంటాను, అంటాడు. ఏడుస్తూ ఉంటాడు. ఇంతకన్నా మంచిది ఇస్తాను రావయ్యా అంటే, నేను రాను, అంటాడు. ఆయనకు స్వామిత్వమున్నది. మనకు స్వామిత్వం లేదు. Concept is very clear. ఈ స్థితి నుండి బయట పడడానికే ఈ యోగ సాధన అంతా. రోజూ TV పెట్టుకొనే దరిద్రం అక్కర్లేదు. నీ మనసనే పెద్ద TV ఉందిగా! రోజూ చూసుకోవచ్చు. ఒక్కొక్కళ్ళకి TV చూస్తున్నప్పుడు పక్కన మనిషి వచ్చినా ఏం పట్టదు. అంతకన్నా రమ్యంగా మనలో ఒక TV ఉంది. అదే పొద్దున్నే లేచి CVV గారు TV చూడమన్నారు. సాయంత్రం కూడా చూడమన్నారు. అసలు మన mind అనే platform మీద ఏ ఆలోచనలు వచ్చి వెడుతున్నాయి? మన మనసనే తెరమీద ఎన్ని రకములైన ఆలోచనలు వచ్చి పోతుంటాయో రోజూ పొద్దున, సాయంత్రం కొంతసేపు కూర్చొని చూడమని చెప్పారు CVV గారు. ధ్యానం లో మనకొచ్చే ఆలోచనలు గమనిస్తూ ఉంటే, మన స్వభావమేమిటో మనకు చక్కగా అద్దం పట్టినట్లు తెలుస్తుంది. Know thy self అనేది ఇక్కడ మొదలవుతుంది. ఈ ఆలోచనలో మనకు పనికి వచ్చేవి, ఆనందాన్నిచ్చేవి చూచు కొని అక్కరలేనివి ఏరి పారేయాలి. ఆలోచనలు తగ్గితే ఉచ్ఛ్వాస నిశ్వాసల వేగం తగ్గుతుంది. గుండె కొట్టుకునే వేగము తగ్గుతుంది. ఇదీ రహస్యం. అందుకే రోజుకు 21, 24, 27 లేక 108 సార్లు వరకు నెమ్మదిగా, లోతుగా దీర్ఘంగా శ్వాస తీసుకోమన్నారు. మరీ ఎక్కువ చేస్తే అలవాటు లేదు కాబట్టి చాలా మందికి నిద్ర వచ్చేస్తుంది. గమనించేవాడుగా మనం ఆలోచనల నుంచి బయటకు వస్తాం కాబట్టి, శ్వాస వేగం తగ్గుతుంది. ఆలోచనల తీవ్రత వలన గుండె rhythm లో మార్పు వచ్చి, ఆయువు తగ్గి అకాల మృత్యువు వాతపడతాము. అకాల మృత్యువు రాకుండా చూచుకొనే బుద్ధి భగవంతుడు ఇస్తాడు. ఆ బుద్ధి చెప్పినట్లు నడచు కోక పోతే " అకాల మృత్యు హరణం" శ్లోకం చదువుకున్నా ఉపయోగము లేదు. అందుకనే మనసు ప్రశాంతంగా వుండాలని అందరూ నొక్కి చెప్తారు. మనకు వచ్చే ఆలోచనలు ఎక్కువ అయిన కొద్ది ఆయుష్షు తగ్గిపోతుందని నొక్కి చెప్తే జనం భయపడతారేమో! మనకు వచ్చే ఆలోచన నాణ్యత తెలియాలంటే వాటిని ఒక

diary లో రాసుకుంటూ వుండాలి. ఎదుటి వారిని తిట్టడంలో negative energy మనలో కొంత energy ని చంపి పోతుంది. Criticism is a major source of loss of energy. అందుకనే " తనకోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష" అన్నారు. మానవునికి కావలసినది గొప్ప తప్ప, మంచితనం కాదు. గొప్పతనానికి కాక మంచితనానికి ప్రాముఖ్యత ఇవ్వడం మొదలు పెట్టినప్పటి నుండి మనిషికి సంస్కారం పుట్టినట్లు లెక్క. మనసులో కావలననే కోరికలు లేక పోవుట వలన ప్రశాంతత వస్తుంది. జీవితానికి ఒక లక్ష్యం, ఒక ధ్యేయం ఉంటే ధ్యేయానికి, లక్ష్యానికి అడ్డు వచ్చే పనులు మానుకోవచ్చును. మానుకోవడం వలన చాలా ఆలోచనలు తొలగిపోతాయి. భగవతత్త్వానికి దగ్గరయ్యే వారికి, అవసరమయ్యే పనికి కావలసిన ఆలోచన వస్తుంది తప్ప, పనిలేకుండా ఆలోచన రాదు. మనకు పనిలేకుండా ఆలోచనలు ఎక్కువగా వస్తుంటాయి. అందువల్ల పని తగ్గి పోతుంది. అనవసరమైనవన్నీ మనసులో ఉండటం వలన మనం చేయవలసిన పని మరచిపోతుంటాం. భగవంతుని విషయం లో అలా కాదు. తన నుండి పుట్టిన భూతాల నుండి ఎప్పుడైనా withdraw అయిపోవడమన్నది మన will కాదు. ఆయన will. మనము కూడా ఆయనలా వుండడం నేర్చుకున్నామనుకోండి. ఆయనలా ఆలోచనల నుండి withdraw అయిపోవచ్చును. మొదట మనం పుట్టినప్పుడు తండ్రి భావనయే. తరువాత ఒక బిందువు. అక్కడ నుండి కదా ఇంత ఏర్పడింది. ఇంత శరీరం ఒక సంకల్పం నుండి బిందువు గా తయారై ఎంత పెరిగింది? మనం original గా ఎంతో, అంతే వుండి చుట్టూ చూడగలిగి నట్లయితే, ఈ ఇల్లు మనం కట్టుకున్నాక, ఈ ఇంట్లో ( ఈ దేహం) నుండి బయటకు రావడం, పోవడం చేసుకోవచ్చును. అప్పుడు భగవత్తత్వం నందు ఏకీభావం చెందినట్లు. అది మహాత్ముల యందు సత్యము. మనయందు కాదు. మహాత్ములకు ఒక దేహంలో అవతరించడం, పనులు చేయడం, అయిపోయిన తరువాత వెళ్ళిపోవడం అన్నది, 'at will' వుంటుంది. ఈ దేహం లోకి దిగిన వాళ్ళు purpose మరచిపోతే దేహములో నుండి తీసి వేస్తారు. దుర్వినియోగం జరుగుతుందని తెలిసినప్పుడు కూడా అలానే తీసేస్తారు. దేహము లోని ప్రజ్ఞ లన్ని group living చేస్తున్నాయి. వానితో మనం సవ్యంగా ప్రవర్తించక పోతే అవి పనిచేయడం మానేస్తాయి. భగవంతుని సృష్టిలో ఎన్ని పుట్టి పోయినా ఆయన ఉంటాడు. మట్టితో చేసిన కుండ

పోయినా మట్టి ఎప్పుడూ వుంటుంది. అది చెప్పడానికే భూతాధి.

# 32. నిధిః

నిధి అంటే సరుకు. అది ఎప్పుడూ వుంటుంది. ఆయన సరుకు బంగారం. అది ఎప్పటికీ ఏమీ కాదు. నిధి అంటే దాచుకునేది. అంటే మనకు కనబడకుండా దాగి ఉండేది. రూపాయి బిళ్ళ ఎన్నో చేతులు మారినా ఎంతోమందితో పనులు చేయిస్తూ వుంటుంది. అలా ఎప్పుడూ వుండే సంపద కలిగిన వాడు భగవంతుడు. మనకు సంపద తరిగి పోతుందేమో అనే భయం. ఆ భయం వల్ల సంపద తరిగి పోతుంది. ఈ భూమి మీద నీళ్ళు వున్నాయనుకోండి. తరిగి పోవడమంటూ ఏమీ వుండదు. ఆకాశం లోకి వెళుతుంది. క్రిందికి వస్తుంది. మొత్తం మీద భూమి మీద వుండే నీరు ఎప్పుడూ ఒక్కటే. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క నదిలో ఎక్కువ తక్కువలుగా కనిపిస్తుంది. అలాగే భూమి మీద వుండే మట్టి కూడానూ. ఈ సృష్టి విషయం లో అది చాలా సత్యము. ఏ ప్రళయమో వచ్చి ఇళ్ళన్నీ నేలమట్టమయ్యాయనుకొండి, మట్టి నేల మిగులుతుంది. దీని నుండే మళ్ళీ ఇళ్ళు తయారవుతాయి. కాబట్టి భగవంతునిది పోయేదేమీ లేని material. భగవంతుడు నువ్వు చేసే పని బాగుంటే నీకు ఇస్తాడు. వస్తువును వృధా చేశావనుకో, displacement నీకు వుంటుంది. వస్తువుకు కాదు. మాస్టర్ గారు ఒక విషయం చెప్పేవారు. ఒక ఇంటికి ఇద్దరు వేద బ్రాహ్మణులు వచ్చారట. ఇంటాయన చాలా సంపద వున్నవాడు. ధనికుడు. బాగా మత్తెక్కి వున్నాడు. ఆ ఇంటాయనతో వారు ఇలా అన్నారు "మీ తండ్రిగారు బాగా పుణ్య కార్యాలు చేశారు. వేదోద్ధరణకు బాగా పాటు బడ్డారు. మేము చాతుర్మాస్యం లో( ఆషాఢము నుండి ఆశ్వయుజ మాసం వరకు) వచ్చి ఆశీర్వదిస్తూ వుంటే మాకు కానుకలు ఇస్తూ వుండేవారు. ఆ సాంప్రదాయం ప్రకారము మిమ్మల్ని ఆశీర్వదించడానికి వచ్చాము. వేదం చదివి మిమ్మల్ని ఆశీర్వదిస్తాము" అన్నారు. అందుకాయన మిమ్మల్ని మీరు పోషించుకోకుండా, నా దగ్గరకు వచ్చి, నన్ను ఆశీర్వదిస్తే, నాకేదో కలిసి వస్తే, అందులో మీకు ఇవ్వడమన్నది తర్క సమ్మతం గా లేదు. మిమ్మల్ని మీరు పోషించుకోలేనివారు నా పోషణ అభివృద్ధి ఎలా చేయగలరు? అని అడిగాడు. ఆ బ్రాహ్మణులు ఆయన చెప్పిన దానికి తిరిగి ఏమీ మాట్లాడ లేక పోయారు. వీరితో కూర్చున్న ఒక యోగి " అయ్యా! ఏదో ఆవు వచ్చింది. మీ మొక్క లేమయినా తినేస్తుందేమో" అన్నాడు. దానికి ఆయన "అవన్నీ

మా ఆవులే. చాలా పాలు ఇస్తాయి. వాటిని అమ్ముకుంటే చాలా డబ్బు వస్తుంది" అనిచెప్పాడు. ఆ యోగి " మీరు  చాలా అదృష్టవంతులు. అన్నీ పాలు ఇచ్చే ఆవులు. వాటి వలన ఆదాయం బాగుంది"  దానికి ఆయింటాయన "అదృష్టం ఏముంది? వాటిని నేను ఎంతో బాగా పోషిస్తున్నాను. బోలెడు గడ్డి, కుడితి పెడుతున్నాను" అన్నాడు. దానికి ఆయోగి "మీరు చెప్పేది తర్క సమ్మతంగా లేదు. వాటికి గడ్డి, కుడితి పెట్టి అవి పాలిస్తే మీరు అమ్ముకుని సంపాదించేకంటే, ఆ గడ్డి మీరే తిని, కుడితి మీరే తాగి, ఆ పాలు మీరే ఇస్తే సరి పోతుంది కదా. అవి మీరు తాగినన్నితాగి, మిగిలినవి  అమ్ముకోవచ్చు కదా!" అన్నాడు. మనము చాలా తర్క సమ్మతంగా, తెలివిగా మాట్లాడ గలము అనుకొనే వారు పరమ మూర్ఖులు. అవి ఉపయోగించి ఇతరులతో మాట్లాడడం వాళ్ళ చిన్నతనాన్ని తెలియ జేస్తుంది. "ఆ పాడి ఆవు ఎలాగైతే గడ్డి తిని పాలు ఇస్తుందో, ఈ బ్రాహ్మణులు కూడా అంతే. వాళ్ళ కోసం వాళ్ళు వాడుకోవడానికి వేదవిద్య పనికిరాదు. మీ గడ్డి మీరు ఎలా తినలేరో, వాళ్ళ విద్య వాళ్ళకు పనికిరాదు. ఈ సంగతి వాళ్ళకు తెలుసు. మీకు తెలియదు. అదే వాళ్ళకు మీకు తేడా" అని చెప్పగానే ఆయన అహం దిగిపోయి ఆయన కాళ్ళ మీద పడి క్షమించమని కోరాడు. అలాగే భగవంతుని నిధి (ఉపాధులు మారుతూ వుంటాయి తప్ప,) ఎప్పుడూ వుంటుంది. ఆవు గడ్డి తిని పాలు ఇస్తుంది. ఆ పాలు మనిషి తాగి ఆవును పోషిస్తాడు. అలాగే వృక్షం పశువుకు,  మనిషికి ఉపయోగపడుతుంటే మనిషి వృక్షానికి ఉపయోగ పడుతుంటాడు. అలా ఒకరినొకరు పోషించు కుంటూ, రక్షించుకుంటూ వుంటారు. సృష్టి లో the law of economy అని ఒకటి ఉన్నది. అదే సరుకు అక్కడక్కడా తిరుగుతూ అందరికీ సరి పోతుంది. అది తెలిసిన వాడు అయిపోతుంది అన్న భావన లేకుండా వుంటాడు. మనం చేయాల్సిఇది మనం చేస్తూ వుంటే, మనకు రావాల్సినది మనకు వస్తూ వుంటుంది. చాలా మంది చేయవలసినది మాని వేసి, రావలసిన దానికై చూస్తారు. అలా అయితే మనకు పనులు కావు. ఇదే గోవర్ధన పర్వతం ఎత్తిన సందర్భంలో కృష్ణుడు పెద్దలందరికి చెప్పడం జరుగుతుంది. ఇంద్రుని గురించి యాగం చేద్దామనుకున్నామనుకొంటే "ఇంద్రునికి యాగం చేస్తే వర్షాలు వస్తాయన్నది తప్పు" అని చెప్తాడు. "ఇంద్రునికి యాగం చేయనక్కరలేకుండా, ఇంకొకరికి నీవు చేయవలసినది చేయమని చెప్పాడు. మిమ్ము పోషిస్తున్న పాడిని, పంటను జాగ్రత్తగా పోషించుకోండి", అని చెప్పాడు. "ఇదంతా మీకు సమ కూర్చినది ఇంద్రుడు కాదు.

అతని కంటే పైవాడు." అని చెప్పాడు. ఆయన ఇది చెప్పడానికి దిగి వచ్చాడు. ఎవరైనా డబ్బు ఇచ్చి మంచిపని చేయమని చెప్పినప్పుడు, ఇచ్చిన వాడి పేరు చెప్పాలే కాని అంతా మనమే చేస్తున్నట్లు చేయకూడదు. ఇంద్రుడు యాగాలన్నీ చేయించుకొని, తన దగ్గర వున్నది పంచడానికి చూస్తూ వుంటాడు అంతా తనది అయినట్లు. ఇచ్చే వాడు ఆపడు కానీ, పంచేవాడు ఆపుతాడు. ఇంద్రుడు వర్షాలు కురిపించకపోయినా, కురుస్తాయి. ఇంద్రునికి కనువిప్పు కలుగుతుంది. మనం మంచి పనులు చేయడం ఆపినా, చేయడానికి మనకంటే బాగా చేసేవాడు వస్తాడు. నువ్వు చక్కటి విత్తనం వేసి బాగా పోషిస్తే మంచి ఫలం పొందగలవు. నీమీద ఆధార పడిన వాళ్ళకి, పశువుకి, పంటకి నీవు చేయగలిగినది నీవు చేస్తే, నీకు కావలసింది నీవు పొందగలవు. These are called kingdoms of God. Mineral kingdom, plant kingdom, animal kingdom, human kingdom and deva kingdom. ఈ అయిదింటి మధ్య పరస్పరత్వం ఉన్నది. కృష్ణుడు పరస్పరత్వానికి ప్రతీక. అందుకే కృష్ణుని బొమ్మ చుట్టూ ఒక ఆవు, చెట్లు, నీళ్ళు, భూమి, ఆకాశం అన్నీ వుంటాయి. అన్నీ ఒక దాని కొకటి ఉపయోగ పడుతూ వుంటాయి. దేవతలు లోపల నుండి, బయటి నుండి పని చేస్తారు. గుండె కొట్టుకోడం, ఊపిరి పీల్చడం, ఆహారం జీర్ణమవడం మొదలైన క్రియలన్నీ దేవతలు లోపల నుండి చేస్తారు. Free will ఇవ్వబడిన మానవుడు మాత్రం చేయడు. మిగతా అందరూ చేస్తారు. మానవుడు బుద్ధి వినియోగం బట్టి ఇతరుల కంటే మంచి అనుభూతి కానీ, ఎక్కువ బాధలు కానీ తెచ్చుకోగలడు. బుద్ధి కూడా నిధియే. ఈ నిధిని వినియోగం చేసుకోవడము మానవుడొక్కనికే చేతకావడం లేదు. మిగిలిన వాటికి బాగానే చేతనవుతున్నది. ఒక్క మానవునికి తప్ప ఏ వృక్షజంతుజాలానికి రేపు అనే బాధ లేదు. భగవంతుని నిధి నుండి అందుతూనే వున్నది.

# 33. అవ్యయః

ఈ నిధి ఎప్పటికీ తరిగిపోనిది. అవ్యయము. మనకు కావలసింది మన దగ్గరకు నడచి వస్తుందనే ఎరుక నుండి జారిపోక పోవడం వలన ఈ పరిస్థితి వస్తుంది. కుచేలుని  కథ దీనికి ఒక ఉదాహరణ. ఆయనకు ఏమీ లేకపోయినా కావలసినవి ఎప్పటికప్పుడు వస్తాయనే నమ్మకం గలవాడు. లేదనే బాధ ఆయనకు లేకపోయినా ఆయన భార్యకు ఉండేది. కావలసిన సమయానికి ఎవరో ఒకరు తెచ్చి యిస్తారని ఆయనకు తెలుసు. కానీ ఆ ధైర్యము ఆవిడకు లేదు. చివరకు కృష్ణుని దగ్గరకు వెళ్లి అడగమని ఆమె చెపితే, కృష్ణుడే రమ్మని సందేశం పంపాడనుకొని, వెళ్ళి కుటుంబానికి కావలసినవి అమర్చి, కృష్ణుని కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి వెళ్ళిపోతాడు. భగవంతుని నామం లో 'అవ్యయమైన నిధి' అర్థమైన వాళ్ళలో కుచేలుడు ఒకడు.'రేపు ఎలా? అనుకొనేవాడు యోగి కాదు. పూర్వం కంటే మనిషి భౌతికంగా బాగా పెంచుకుంటున్నాడు. భగవంతుని యొక్క ఆర్థిక విధానం ఎంత ఎక్కువ తెలిస్తే అంత తక్కువ పోగేసుకుంటాము. అందుకే మహాత్ముల చుట్టూ ఎక్కువ చేరవు. వాళ్ళు చేరనివ్వరు. అవ్యయమైన నిధి యొక్క అస్థిత్వాన్ని గుర్తించని వాళ్ళు ఎక్కువ పోగేస్తారు. ఏ భక్తుని చరిత్ర చూచినా అంతే! వాళ్ళకు ఎప్పుడు, ఎంత కావాలో అప్పుడు అంత వచ్చేస్తుంది. చేసే పని మీద ఆ నమ్మకం వాళ్ళకు ఉంది. మనం చేసే పనుల మీద ఆధారపడి ఆ నమ్మకం కలుగుతుంది. ఏదీ మనది కాదు. భగవంతునిది. ఈ దేహం కూడా మనది  కాదు. సంపద మనకిచ్చారు కానీ మనది  కాదు. సద్వినియోగం చేయకపోతే పోతుంది. అసలు సద్వినియోగం చేతకాని వారికి ఇవ్వరు. ఇవి ఆర్థిక విధానాలలో భగవత్ సామ్రాజ్యంలో ఉన్న రహస్యాలు. ఇంద్రుడంతటి వాడు సద్వినియోగం చేయక పోతే, సింహాసనం మీద నుంచి తీసేస్తారు. అహంకారము తగ్గాక మళ్ళీ ఇస్తారు. సద్వినియోగం చేయలేని వాడి దగ్గరకు ధనం వస్తే అది వానిని సంస్కార హీనుడిని చేస్తుంది. భగవంతుని నిధి అంటే అమ్మవారే! తాను వున్నంత కాలము ఆవిడా వుంటుంది. అందుకే సృష్టి లో అమ్మవారు ముందా, అయ్యవారు ముందా అంటే ఎప్పటికీ తేలని విషయం. తనతో బాటు ఎప్పుడూ శాశ్వతముగా వుంటుంది. తన యందే వుంటుంది. ఇవన్నీ మారుస్తూ వుంటుంది. అందుకే ఖనిజముల నుండి

వృక్షాలు, వృక్షాల నుండి జంతువులు, జంతువుల నుండి మానవ దేహాలు అవుతూ, అన్నింటిలోకీ దిగి వస్తుంది. ఇంత అవ్యయంగా వుంటుంది కాబట్టి మనం చేసే పనులు సవ్యంగా ఉన్నట్లయితే మనకు లోటు వుండదు. ''కృషి తో నాస్తి దుర్భిక్షం'' అనేది భగవత్ వాక్యం. దానినిబట్టి మనం ''నిధిరవ్యయః'' అనే పదం అవగాహన చేసుకో వాలి.

## 34, 35, 36, 37, 38. సంభవః, భావనః, భర్తా, ప్రభవ, ప్రభు

ఈ మూడు పదాలు ఒకసారి అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలి. ఈ మూడింటికి ఒక చక్కని క్రమం ఉన్నది. సృష్టిలో ఆ విధంగా జరుగుతూ ఉంటుంది కనుక సృష్టిని అనుసరించి ఈ నామాలు ఇవ్వబడి ఉంటాయి. ఒక మహర్షి యొక్క స్మృతిపథం లోనుంచి వ్యక్తమైనప్పుడు, భగవంతుడే తనను తన నామాలుగా వ్యక్తం చేసుకుంటాడు. సృష్టి క్రమం ఏ విధంగా ఉంటుందో భగవంతుని నామాలు ఆ విధంగానే ఉంటాయి కానీ వేరొక విధంగా ఉండవు. అవి తెలుసుకోవడం అనేది, మనకున్న పరిపక్వతను బట్టి ఎక్కువగా భాసిస్తూ వుంటుంది. సంభవించడమంటే రెండుమూడు రకాల అర్థాలు ఉంటాయి. ఒక idea ఇప్పుడే తట్టింది అంటాము, ఇప్పుడే వెలిగింది అంటాము. అప్పటికప్పుడు మెరుపులా బీజప్రాయంగా ఒక భావం ఉంటుంది. అది విచ్చుకొని భావనగా మారుతుంది. దాన్ని మనం భరిస్తూ వుంటాము, మోసుకు తిరుగుతూ ఉంటాము. కాబట్టి మన నెత్తిమీద చాలా పెద్ద luggage వుంటుంది. భగవంతుని నుండి కూడా ఇదే విధముగా సంభవించినప్పటికీ, ఈ సృష్టి, గ్రహగోళాదులు, జీవులు ఆయన నుండి వ్యక్త మైనప్పటికి, ఆయన భావనగా ఆయనే భరిస్తూ ఉన్నాడు కాబట్టి, ఆయన అసలైన 'భర్త'. మనం అదొక రకమైన భర్తలం. మన భర్తృత్వానికి, ఆయన భర్తృత్వానికి చాలా వ్యత్యాసం వుంది. రెండూ తెలుసుకోవాలి. పిండాండ, బ్రహ్మాండ సమన్వయము ద్వారా నామము యొక్క అవగాహన ఎక్కువగా అవుతుంది. మనకి ఎలా సంభవిస్తోంది? మనం ఏవిధంగా దాన్ని భావిస్తున్నాం? ఎలా దాన్ని భరిస్తున్నాం? ఇది మొదటి అవగాహన. ఆయనయందు ఏ విధంగా సంభవిస్తోంది? ఆయన భావన ఏ విధంగా నడుస్తున్నది? ఆయన ఏ విధంగా భరిస్తున్నాడు? ఇది తెలుసుకుంటే సంభవో, భావనో, భర్తా-- కొంత అవగాహన అవుతుంది. మనం మేల్కాంచిన తర్వాత మనసులో చిన్న పురుగులాంటి ఆలోచన నుండి మెరుపు లాంటి ఆలోచన వరకు మనకు తట్టి, అవి విచ్చుకొని, పరచుకొని మన బరువు చాలా పెంచుతాయి. ఇవన్నీ మన నుండీ సంభవిస్తున్నాయి, భగవంతుడి నుండీ సంభవిస్తున్నాయి. భగవంతునియందు సంభవించడానికి ఒక క్రమబద్ధమైన ప్రణాళిక ఉంది. మనయందు సంభవించడానికి ఒక క్రమబద్ధమైన

ప్రణాళిక ఏమీ లేదు. మనం ఊరికే సరదాగా అలా కూర్చుని మనయందు ఎటువంటి సంభవములు కలుగుతున్నాయో గమనిస్తే, వాటికి ఒక తీరు తెన్ను, పద్ధతి ఏమీ లేకుండా కోతివలె ఈ కొమ్మ మీద నుండి ఆ కొమ్మమీదికి, ఆ కొమ్మమీద నుండి ఈ కొమ్మమీదకి గెంతినట్లు ఉంటాయి. Prayer లో ఒకదానికి ఒకటి పొంతన లేకుండా ఎన్నయినా ఆలోచించగలం. ఇలా ఆలోచిస్తున్నాం అని కూడా తెలియని స్థితిలో వుంటాం. మనలో వచ్చే ఆలోచనలను మనం గమనిస్తూ ఉండాలి. గమనిస్తున్నామన్న స్థితి నుండి జారిపోయి, భావనలోనే వుండి, అది ఎక్కడికి పట్టుకుని వెళ్తే అక్కడికి పోయి, ఎటుపడితే అటు తిరిగి రకరకాల ప్రదేశాలు చూసి, రకరకాల మనుష్యులతో మాట్లాడి, వాళ్ళ గురించి రకరకాల భావనలు చేసి, మళ్ళీ గాయత్రి మంత్రం time కు తిరిగి వస్తాం. నారాయణమంత్రం మొదలు పెట్టినప్పుడు అది ఉంటుంది. మళ్ళీ మనసు ఎటో వెళ్ళిపోతుంది. అంటే సంభవించడమనేది క్రమబద్ధంగా ఉండదు. సంభవించడమనేది మనలో పుట్టినప్పటికీ మన ప్రమేయం ఏమీ ఉండదు. మనమే లేకపోతే ఆలోచన పుట్టడానికి అవకాశం లేదు. మనం ఉండబట్టే మనకు ఊహలు వస్తున్నాయి. మనం వున్నా మేల్కొంచి లేకపోతే రావు. మన నుంచి వస్తున్నా కూడా అవి మనను సంప్రదించవు. మన నుంచి వచ్చే సంభవములు, మనతో సంబంధం లేకుండా మనని platform లాగ వాడుకుంటాయి. అలా గమనిస్తూ వుంటే మనకే ఆశ్చర్యం వేస్తుంది. 'ఏమిటిది? మనం లేకపోతే తప్ప వీటికి జరుగుబాటు లేదు, మనం వుంటే మనతో సంప్రదించకుండా వాటంతట అవే ఉద్భవించి నడిచి వెళ్ళిపోతున్నాయి?' అని. మనలో సంభవించేవాటితో మనం సహకరించకుండా ఉంటే అవి వాటి ఇష్టం వచ్చినట్లు వెళ్ళడానికి వీలుండదు, పుట్టగానే చచ్చిపోతాయి. మనలో ఎవరో ఒకరి మీద ఒక భావన లేదా అభిప్రాయం సంభవించిందనుకోండి. దానికి మనం సహకారమిస్తే అది మంచికైనా, చెడుకైనా మనల్ని చాలా దూరం తీసుకొని వెళ్తుంది. అది చెడుదని తెలిసి సహకరించే దౌర్బల్యం మనకుంటే, అది ముందు మాటలలోకి, తరువాత చేతలలోకి తీసుకొని వెళ్ళి మనను ఇరుకున పెట్టేస్తుంది."నా నుంచి వచ్చిన ప్రకృతి నుండి పుట్టే త్రిగుణాలలో మీరు బ్రతుకుతూ వుంటారు కాబట్టి మీకు ఇంతే" అని చెప్పాడు శ్రీకృష్ణుడు. మేల్కొంచిన తరువాత మనలో వచ్చే భావనలు మనలోని త్రిగుణముల పొందికను బట్టి ఉంటాయి. భగవంతుని నుండి వచ్చే భావన తీరు సత్వరజస్తమస్సుల equilateral triangle,

అంటే సమకోణ త్రిభుజం నుంచి రావడం వలన వాటియొక్క తీరు బాగుంటుంది. Lens బాగుండకపోతే ఎలా అయితే photo సరిగ్గా రాదో, అలాగే ఈ త్రిభుజం బాగుండకపోతే ఆలోచనలు సరిగ్గా తట్టవు. కొంతమందికి తడతాయి, కొంతమందికి తట్టవు. ఎందుకంటే తట్టడానికి కావలసిన equipment అక్కడలేదు. Receiving stationలో receptors clean గా లేకపోతే ఎంత బాగా broadcast చేసినా అక్కడ reception problem కాబట్టి అక్కడ తట్టవు. సృష్టితో సరిగా అనుసంధానం చెందిన కొద్దీ భావన సరిగా తట్టడం జరుగుతుంది. దాని కొరకే గాయత్రి మంత్రం. ఏ వెలుగు మూడు లోకాలకు ఆధారభూతమై ఉన్నదో, ఆ వెలుగు నన్ను ఆవరించి, నా బుద్ధులను ప్రచోదనము చేయుగాక అని గాయత్రీ మాతను కోరుకుంటాము. కానీ అది చేస్తున్నప్పుడు మనం వినము. సరైన పద్ధతిలో గాయత్రి మంత్రము చేస్తే బాగా తట్టడమనేది జరగాలి. ఆలోచనలకు పుట్టినిల్లు చైతన్యం అనే స్థితి. చైతన్య స్థితినుంచి పుట్టుకొచ్చే ఆలోచనలకి ఏవిటి మూలం అంటే చైతన్యమే! అదే గాయత్రి! The world mother! అమ్మలకు అమ్మ! అంటాం. అక్కడ నుండి వస్తున్న ఆలోచనలు సక్రమంగా జరగడానికి, జరగకపోవడానికి తేడా మనయందున్న పవిత్రతలో ఉంటుంది. పవిత్రత మనస్సు, వాక్కు, ఇంద్రియములు, శరీరము-ఈ నాలుగింటిని బట్టి ఉంటుంది. దీనిని పశ్యంతీ (వాక్కు) అంటారు. ఒక సన్నివేశంలో ఒకరికి తట్టినంత త్వరగా ఇంకొకరికి తట్టదు. అంటే పదార్థం బాగా మందంగా బరువెక్కి వుంటే చైతన్యం తక్కువగా వుంటుంది. అందుకని మనం పదార్థం బరువు తగ్గించుకోవడానికి కొంతసాధన చేయవలసి ఉంటుంది. అంటే మాటల యందు, చేతలయందు, పనులయందు పవిత్రత పెరగాలి. ఆపాదమస్తకం పవిత్రంగా ఉండాలి. పవిత్రత భౌతికమే కాకుండా, మనస్సు నుండి భౌతికము వరకు ఉండాలి. ప్రతిరోజూ ఒక అర్ధగంట అయినా సత్ గ్రంథ పఠనం చేశామనుకోండి. మనస్సు ఒక చక్కటి పద్ధతిలోకి వస్తుంది. పద్ధతి లేని మనస్సుతో మనం బయట ప్రపంచంలోకి వెళ్ళామనుకోండి, సరియైన సమయానికి సరియైన ఆలోచన, చేత, మాటరావు. సమయం అయిపోయిన తర్వాత తట్టిన తెలివికి ఉపయోగం లేదు కదా! పవిత్రత భావన యందు, మాటయందు, చేతలయందు ఎక్కువగా ఉండాలి. భౌతికమైన పవిత్రత లేని ప్రదేశాలకు వెళ్లడం, పవిత్రత లేని ప్రదేశాల్లో తినడం చేయకూడదు. అలాగే పవిత్రత లేని సంభాషణలలో పాల్గొనకూడదు. ఈ సాధన మార్గంలో వెళదామని అనుకునే వారికి ఈ

నియమాలు తప్పవు. ఆ విధంగా మనం insulate చేసుకుంటూ ఒక పద్ధతి ఏర్పరచుకుంటే మన brain cells లో చాలా తేడా వస్తుంది. మెదడు చాలా చురుగ్గా పని చేస్తుంది. అసలు సంభవం దగ్గరే మనకు problem వుంది కాబట్టి, భావన వద్దకు వచ్చేటప్పటికి అన్నీ చుట్టలే వుంటాయి. ఒక అచ్చు (mould) లో తేడా ఉన్నప్పుడు, అందులోనుంచి వచ్చేవన్నీ తేడాగానే ఉంటాయి. మనం ఎక్కడికి వెళ్ళినా అదే mould కాబట్టి దాన్ని పాడుచేసుకుంటూ వుంటాము. ప్రదేశాలు మార్చినా, మనుషుల్ని మార్చినా, వృత్తి మార్చినా, ఏమి మార్చినా మన mould బాగుండనంతసేపు, అన్నీ అలాగే తయారు చేసుకుంటాం కదా! వంకర మనలో ఉన్నంతసేపు ఏ పనైనా వంకరగా చేసుకుంటాము. అందుకే బయట చాలా మారాలని నీకు అనిపించినప్పుడు ముందు నీ లోపల చాలా మారాలని గుర్తుంచుకోమని పెద్దలు చెప్పారు. బయట మార్చడం నీ వంతు కాదు. అది భగవంతుడు, ప్రకృతి జరిపిస్తున్నారు. అవి ఏదో మారుద్దామని ప్రయత్నం చేయకు. దానికి ఓ పద్ధతి వుంది. ఆ timetable ప్రకారం జరిగిపోతూ వుంటాయి. దాన్ని మార్చడం కన్నా నువ్వు మారితే, దానితో చక్కగా tune up అయి జీవించడానికి అవకాశం ఉంటుంది. ఓడ తూర్పువైపు వెళ్తున్నప్పుడు మనం ఎంత పడమరవైపుకి వెళ్ళినా మన ప్రయాణం ఓడలోనే కాబట్టి తూర్పుకే వెళ్తాము. మహా అయితే ఓడ కొసవరకూ వెళ్తాము, అక్కణ్నుంచి దూకలేము కదా! Higher things మారడం కంటే మనం మారితే, తట్టడం అనేది సులభంగా వుంటుంది. నేను నాలాగే ఉంటాను. అందరూ మారాలి అనుకుంటే మాత్రం కుదరదు. ప్రతి ఒక్కరూ అలాగే అనుకుంటారు. కనుక మనకు సంక్షోభం తప్పదు. భగవంతుని సృష్టిని తీసుకున్నట్లయితే సంభవించడంలో ఒక క్రమం ఉంది, ఒక పద్ధతి ఉంది. ఆ భావన వికాసం చెందడానికి ఒక పద్ధతి ఉంది, దానికి ఒక కాలపు పట్టీ ఉన్నది. మనకు ఒక భావన వచ్చిందనుకోండి. అది మనలను ఎంతసేపు వేధిస్తుందో తెలియదు. ఒక భావన మనలోనికి ప్రవేశించినపుడు దానిని మనం ఎంతసేపు భరించి ఉండాలన్న దానికి ఒక కాలపట్టీ ఏమీ లేదు. భగవంతుని విషయంలో ప్రతి భావనకు ఒక time cycle ఉంటుంది. అది అయిపోయేసరికి అదృశ్యమౌతుంది. భగవంతుని నుండి పుట్టిన గ్రహగోళాదులకు, అలాగే మన భూమికి ఒక time span వుంది. ఇప్పుడు మనం చూసే భూమి, ఇలా ఉండటానికి ముందు మూడు స్థితులున్నాయి.ఈ మూడు స్థితులు దాటి ఇప్పుడున్న నాలుగవ స్థితికి భూమి వచ్చిందన్న మాట. మళ్ళీ

మూడు స్థితులు వెనక్కి ముడుచుకుంటూ వెళ్ళి, ఆకాశంలో లీనమై పోతుంది. దీనికో time span ఉంది. అలాగే మనిషి పుట్టిన దగ్గర నుండి వెళ్ళి పోయేదాక ఒక lifespan ఉంటుంది. ఆ spanలో వచ్చి అలా manifest అయ్యి, మళ్ళీ అంతర్ధానమైపోయి భగవంతునిలో ఐక్యం అయిపోడం జరుగుతుంది. అలాగే ఒక సంవత్సరానికి ఒక చైత్ర పూర్ణిమ నుండి తరువాతి చైత్ర పూర్ణిమ వరకు ఒక time span ఉంటుంది. ఒక పరిధి. ప్రతి చైత్ర పూర్ణిమకు, ఈ భూమికి సంబంధించినంత వరకు ఒక seed thought ఉంటుంది. పైలోకాల నుండి ఒక విత్తనం పడేస్తే, అది ఆ సంవత్సరానికంతా ఈ భూమి activityకి కారణమౌతుంది. అది పడేయడానికి భూమిలో ఒక చోటుంది. దాన్ని శంబళ గ్రామమంటారు. ఈ భూమికి ప్రభువుగా ఉన్న సనత్కుమారుడు అలా పడేసిన ఆ గింజను తన చుట్టూ వున్న అనుయాయిలతో అవగాహన చేసుకుని, ఆ విత్తనాన్ని చక్కగా తన లోపల వుంచుకొని, ఈ సంవత్సరానికి ఈ భూమికి ఇవ్వవలసిన seed thought ని తనలో దాన్ని విశదీకరించుకుని, దానిని బుద్ధుడికి అందించడం జరుగుతుంది. బుద్ధుని నుండి ఈ భూమిని నడుపుతున్న అంతర్గత ప్రభుత్వానికి సంబంధించిన మైత్రేయుడు, మరువు, దేవాపి ఆది భాగవతమూర్తులకు, భగవద్భక్తులకు వైశాఖ పూర్ణిమకు అందించబడుతుంది. అప్పుడు seed thought కాస్తా thought అవుతుంది. అంటే సంభవించింది భావనా రూపం దాలుస్తుంది. భావనా రూపం దాల్చిన దాన్ని మైత్రేయునికి అందించే సందర్భమే వైశాఖ పూర్ణిమ. వైశాఖ పూర్ణిమ నుండి ఈ భావనను తీసుకొని వెళ్ళి జ్యేష్ఠ పూర్ణిమనాడు, భూమికి సంబంధించినంతవరకు చక్కగా భరించే వారైన మానవ జాతికి అందిస్తారు. అది మొదలు వారు ౨ నెలలు workout చేసుకుంటూ వుంటారు. ఒక hierarchical system ఈ మొత్తం workout చెయ్యడానికి ఉన్నది. ఆ system లో భగవద్భక్తులు, మైత్రేయాదులవంటి భాగవతమూర్తులందరి శిష్యులు ఈ ప్రపంచంలో అంటే బహిర్గతమైన లోకములో రకరకములైన బాధ్యతలు వహించి ఉన్నారు. వారు సలహాదారులుగా పనిచేసి, ఎవరి ద్వారా ఈ కార్యక్రమం నెరవేరుతుందో, వారికి సూచనలిచ్చి, వారిద్వారా ఈ కార్యక్రమము వ్యక్తం చేస్తూ వుంటారు. ఇలా ఒక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక భగవంతుడు భూమియందు చక్కగా నిర్వర్తిస్తాడు. అలాగే మిగతా గ్రహగోళాదులయందు నిర్వర్తిస్తాడు. అలాగే ఒక మండలానికి ప్రణాళిక వుంటుంది, ఒక పక్షానికి ప్రణాళిక వుంటుంది, ఒక వారానికి

ప్రణాళిక వుంటుంది, ఒక రోజుకి కూడా ప్రణాళిక వుంటుంది. అన్నీ seed thought నుండి విచ్చుకుంటూ వుంటాయి. మనలో కూడా అలాంటి seed thoughts పుట్టి, మనం కూడా చాలా కార్యక్రమాలు చేస్తూ వుంటాం కానీ భగవంతుని విషయంలో ఒక పద్ధతివుంది. అది కాలము యొక్క స్వరూపము ఎరిగినవారు ఆ భావాన్ని కాలపరిమితిలోగా పూర్తిచేసుకునే పద్ధతి. చాలా మంది దేహములలోకి దిగిన తరువాత, మళ్ళీ పట్టిపీకి తీసుకొని వెళ్ళడమే తప్ప వారు వదిలి రారు కదా. మామూలు మనుష్యులకు, మహాత్ములకు ఏమిటి తేడా? మహాత్ముడు తన పని అయిపోయిన తర్వాత, ఇక వస్తాను మళ్ళీ మీకు కనిపించను, అని చెప్పి ఏ గుహలోకో  వెళ్ళి దేహము వదిలేస్తాడు. చెప్పి మరీ వెళ్తారు. మనం ఇట్లోంచి బయటకు వెళ్తున్నప్పుడు కూడా చెప్పము. కాస్త ఎక్కడికి వెళ్తున్నావో చెప్పు, అంటూ ఉంటారుగా ఇంట్లోవాళ్ళు. ఇంట్లో చెప్పడం లాంటిదే ఆ వెళ్ళడం కూడా. పరాశరుడు అలా చెప్పి వెళ్ళాడు. మన మహాత్ముల జీవితచరిత్రలు చూసుకుంటే చెప్పి వెళ్తారు. చక్కగా వానప్రస్థానం చేసి, అరణ్యంలోకి వెళ్లి ఎవరూలేని చోట వాళ్ళ దేహం వదిలేస్తారు. మన సంగతి ఏమిటి? మన భావనకో పరిధి వుంది. అది అయ్యేలోపు పని పూర్తి చేసుకోవాలని కాక, అదే పట్టుకుని సాగుతూ వుంటాము. సినిమాహాలుకి వెళ్ళి, సినిమా అయిపోయిన తర్వాత కూడా కదలకపోతే ఇద్దరు ముగ్గురు వచ్చి బయటకు లాగేస్తారు. మన భావనకు భగవంతుని భావనకు తేడా ఏమిటంటే అయిపోయిందని మనకు తెలియదు. ఇంకా వుందని అలా వేలాడుతూ ఉంటాము. పెంచుకోవడం తెలుసు, తెముల్చుకోవడం తెలియదు. అందుకనే మనకు భర్త అనే స్థితి ఒక బరువైన పదము. భగవంతునికి అలా కాదు. రైలుకి బరువౌతుందని నా సామాను నా నెత్తిన పెట్టుకున్నానన్నట్లు -మన భావనల బరువు మన నెత్తిమీద పెట్టుకుంటుంటాము. దించేస్తే లేదా తెముల్చుకుంటే తేలిక పడతాము కానీ అది మనకు ఇష్టముండదు. 'Hercules! నీకు నేను సహాయం చేస్తాను, ఈ భూమి నువ్వు మోస్తున్నావు కదా! నేనూ కొంత బరువు మోస్తాను' అని ఒకాయన భూమ్మీద నిలబడి రెండు బండరాళ్ళు నెత్తిన పెట్టుకున్నాడుట. భూమి మీద నిలబడిన వాడు ఎన్ని రాళ్లు తన నెత్తిన పెట్టుకున్నా భూమి మీద నిలబడినంతకాలం వీడూ, వీడినెత్తిన రాళ్లూ, మోసేవాడికి బరువే కదా? భూమ్మీదనుంచి వెళ్ళిపోతే వాడి బరువు కాస్త తగ్గుతుంది. మోసేవాడు ఒకడున్నాడని గుర్తుండేవాళ్ళ పని చాలా తేలికగా ఉంటుంది. నారు పోసినవాడు నీళ్ళు పోయడా? అన్నదాంట్లో సత్యం

వుంది. కాకపోతే మనకి అవగాహన చేసుకోవడం తెలియక, దాన్ని మనం బద్ధకానికి ఒక చక్కటి పరిష్కారమార్గంగా ఎన్నుకున్నాం. సత్యం ఏమిటంటే, there is a purpose for our coming into this project. ఆ purpose దైవానిది. ఆయనే దేహం కట్టుకొచ్చాడు. ఆయనే ముచ్చటపడి దిగి వచ్చాడు కనక, ఆయన కార్యక్రమం కానిస్తూ ఆయన్ని మనం మర్చిపోకుండా ఉన్నంతసేపూ బరువులేని పద్ధతిలో జీవించడం, అయిపోయిన తరువాత చెప్పి వెళ్ళడంగా వుంటుంది. ఆ time కి workout చేసుకుని ఆ cyclic action అయిపోగానే అక్కడి నుంచి విరమించుకోవడం అనేది సృష్టిలో మనం అన్నిటిలోనూ చూస్తాం. చెట్టు దగ్గర నుంచి, పక్షి దగ్గరనుంచి, జంతువుల వరకు ఒక కాలపట్టీని అనుసరించి అవి రావడం, వెళ్ళిపోవడం ఉంటుంది. There is a timespan by which they manifest and disappear. Appearance and disappearance ఒక cyclic plan గా వుంటుంది. ఆ cyclic plan అన్నది భూమికే తప్పనప్పుడు, భూమి మీద జీవులకెంత? మనం కూడా ఆ విధంగా ఉన్నప్పుడు, ఆ rhythm లోకి మనం enter అయినప్పుడు మన భావనలు కూడా అలా rhythmic గా తయారవుతాయి. లేకపోతే ఒక్కొక్క భావన యొక్క duration మనకు తెమలదు. సంపాదన అనే భావన ఉందనుకోండి. దానియొక్క purpose తెలియకుండా సంపాదించడమే జీవనం అనే పద్ధతిలో ఎక్కువ మంది ఉంటారు. దాని purpose మర్చిపోయి అలా పోగేసుకుంటూ చివరకు వెళ్ళిపోయేటప్పుడు కూడా దాన్ని గురించి స్మరిస్తూ వెళ్ళి పోతారు. అలాగే కుటుంబం యొక్క purpose మర్చిపోతూ దానికోసం తాపత్రయపడిపోతూ వుండడం. Purpose తెలిస్తే అంటే భగవంతుడు దేనిని ఉద్దేశించి మనయందు ఉన్నాడు? అనేది ఎవరికి గుర్తుంటుందో వాళ్ళకి త్వరగా తెములుతాయి విషయాలు. భావనలకి ఒక అంతు వుంటుంది. అలా లేకపోతే వచ్చిన భావన పోదు, అలా కొత్త భావనలు వస్తూనే వుంటాయి, అలా వచ్చీ వచ్చీ మనం బాగా బరవెక్కుతాము. సంసారం అంటే అది. సంసారం అంటే మనకి idea గా వచ్చి, భావనగా మారి అవన్నీ అలాగే మనయందు నిలబడడం వలన వాటిని భరిస్తూ, బాధపడుతూ ఉంటాము. అంటే మన స్వభావమే మనను ఎక్కువ బాధపెడుతూ ఉంటుంది. బయట వారెవ్వరూ మనల్ని బాధపెట్టనక్కర లేదు. ఎక్కువ మందికి బయట బాధకన్న లోపలి బాధలు ఎక్కువ. బయట ఏమన్నా ఉంటే వాటిని పరిష్కరించుకోవచ్చును. లోపల ఉంటే ఎలా పరిష్కరించుకుంటారు? ఒకరెవరైనా

మనని తిడితే మనం account settle చేసుకోవచ్చు. మనమే మనని తిట్టుకునే స్థితి, నిస్పృహ వచ్చేసాయనుకోండి, మనమే మనకి agreeable కాలేదు అనుకోండి. లేదా వేరే ఎవరి కారణం వల్ల అయినా agreeability తగ్గిందనుకోండి, అప్పుడు మనని మనం నిందించుకునే కార్యక్రమంగా మొదలయ్యి, మన స్వభావం మనని మింగేసి, అక్కడి నుంచి మనం త్వరగా శరీరం నుండి బయటకు వెళ్ళి పోయే కార్యక్రమం ఒకటి పెట్టుకోవాల్సి వస్తుంది. అలా కాకుండా ఉండాలంటే అసలు మనలో నుంచి ఏమిటి పుట్టుకొని వస్తున్నాయి? అనేది గమనించుకోవాలి. మనం లేకుండా అవి పుట్టవు, కానీ మన permission లేకుండా పుట్టుకొస్తున్నాయి. పుట్టినవి వాటి దారిన అవి పోవు, మనని లాక్కుపోతూ వుంటాయి. మనలో పుట్టుకొచ్చిన ఒక ఆలోచన ఎంతవరకూ మనని పట్టుకుపోతుందంటే, loss of name, loss of fame, loss of energy, loss of time అక్కడ ఆపుతుంది. అప్పుడు కూడా సర్దుకోబుద్ధి కాదు కానీ, దాన్ని సమర్ధించుకోవడానికి ఇంకా ఆలోచనలు పుట్టుకొస్తుంటాయి. అలా పుట్టుకొచ్చి, పుట్టుకొచ్చి, పుట్టుకొచ్చి మనం బరువెక్కడం జరుగుతుంది. అలా కాకుండా వుండాలంటే మనము పొద్దుటే లేవగానే అసలు మనలో నుంచి ఏ ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి? మనము ఏమి చేస్తున్నాము? మనము చేసేవన్నీ చేయవలసిన పనులేనా? ఇందులో అవసరమైనవెన్ని? అవసరం లేనివెన్ని? పొద్దున్నే ఒక పావుగంట, లేక అరగంట నీలో నుంచి ఏ రకములైన భావనలు సంభవిస్తున్నాయో గమనించాలన్నారు. ఎక్కువగా మనకి గుర్తుండవు కాబట్టి రాసుకుంటే మంచిది. రాసుకుంటే ఏమౌతుంది మన thought pattern, అంటే ఆలోచనా సరళి ఏ ప్రకారం ఉందో చూసుకోవచ్చు. అందులో మనల్ని రొష్టు పెట్టేవి చాలా ఉంటాయి. ఆ ఆలోచనలు వస్తున్నప్పుడు గమనిస్తూ వున్నట్లయితే, వాటికి గమనం ఉండదు. లేకపోతే  అవి మనను పట్టుకొని పోతాయి. వాటితో చాలా దూరం వెళ్ళి పోతుంటాము. మన నుంచి పుట్టే ఒక idea మన పిల్ల అయితే, దాని నుంచి విచ్చుకునే భావన పెరిగిన పిల్లవాడైతే, అందులోంచి పుట్టుకొచ్చే కోరికలు, మాటలు మనవలు, చేతలు మునిమనవలు అలా సంసారంగా విచ్చుకుంటూ వుంటాం. ఆ విచ్చుకున్న సంసారంలో ఇరుక్కుపోతాం. అవి పుట్టేటప్పుడే 'నాకు గానీ, ఇతరులుకు గానీ ప్రయోజనం ఉందా' అని ప్రశ్నించుకొని, ఇతరులకు ప్రయోజనం ఉంటే తప్పకుండా చేయండి. ఇతరులకు నష్టం కలిగించేదయితే చేయకండి. ఇలా ఒక

filter వేస్తే చాలా భావనలు filter అయిపోయి, అవసరమైన భావనలే మనకు వచ్చే స్థితి ఏర్పడుతుంది. మహాత్ములకు ఏదైనా ఒకకార్యం తలపెట్టినప్పుడు తప్ప వేరే ఆలోచనలు రావు. మనలాగ లక్ష ఆలోచనలు వచ్చి, పుచ్చువీ చచ్చువీ ఏరేసిన తరువాత అసలు thought రావడం, అలా వుండదు. మనం ఒకచోటకి వెళ్ళాలి అనుకోండి, దారి తెలిస్తే తిన్నగా వెళ్తాం. తెలియకపోతే ఆ దారీ ఈదారీ వెతుక్కుంటూ చివరకు ఆ చోటు చేరుకుంటాం. స్వామిత్వం వున్నవాడు సరాసరి వెళ్ళవలసిన చోటుకే వెళ్తాడు. మనసులో వాళ్లకు ఒక కార్యక్రమానికి సంబంధించిన ఒక భావన భాసిస్తుంది. దాని ప్రకారం వాళ్ళు కార్యక్రమం లోనికి దిగుతారు. రావణుడు మొత్తం ప్రపంచాన్ని బాధ పెడుతుంటే, అది విశ్వామిత్రుని వరకు వచ్చినప్పుడు, ఆయన ఒకసారి కళ్ళు మూసుకుంటే  కళ్ళలో రాముడు మెదిలాడు. కాబట్టి బయలుదేరి వెళ్ళాడు. అంతేగానీ వెతుక్కుందాం భగవంతుడు ఎక్కడ ఉన్నాడో అని వెదకడం ఏమీలేదు. ఋషులకు దేనిని గురించి భావన చేస్తే అది భాసిస్తుంది. ఋషులకి ఎందుకు అలా భాసిస్తుంది? మనకి ఎందుకు లేదు? మనలో జరిగే భావన అనే ఈ process కొంక నియమము లేకుండా చేసుకున్నాము కనుక దాని ఇష్టం వచ్చినట్లు అది ప్రవర్తిస్తుంది. ఆలోచనలన్నీ మననుంచి పుట్టి మననే పట్టుకెళ్తున్నాయి. దానినే బ్రహ్మ నుండి సరస్వతి పుడితే, సరస్వతి వెంబడి బ్రహ్మ వెళ్ళాడు అంటాము. మనమే బ్రహ్మలం ఇక్కడ, మననుంచి పుట్టిన భావనల వెంట మనమే పరిగెడుతూ ఉంటాము. రకరకాల ఆలోచనలు మన నుండి పుట్టి చేతనైనవి, కానివి అనేక రకములైన పనులు చేయించేస్తుంటే అందులో మంచి-చెడు ఏరుకోలేని స్థితిలో మనముంటే కష్టము. మహాత్ముల విషయంలో జరగవలసిన కార్యాన్ని బట్టి భావన వస్తుంటుంది. మనం భావనను బట్టి కార్యాలు చేసుకుంటుంటాం. అందుకే మన ఉద్దేశ్యాలకు ఒక పద్ధతి, ధ్యేయం ఏమీ ఉండదు. ఈ స్థితి నుండి ఆ స్థితికి ఎదిగితే, భగవంతుని యొక్క సంభవమేమిటి? భావనమేమిటి? ఆయన భర్తగా ఎలా వున్నాడు? అనేది తెలుస్తుంది. భగవంతుని నుండి వచ్చిన భావనయే ఈ సృష్టి సంభవం! అంటే ఆయనయందు ఒక సంకల్పం వచ్చిందిట. ఎలా వచ్చిందిట అంటే మనకి వచ్చినట్లే. వచ్చేసరికి ఆవిడ వచ్చిందిట ఆయనలోంచి. ఏ పురాణం చూసినా ఇదే, సంకల్పం రావడం అంటే అమ్మవారు బయటకి వస్తుంది. అక్కడి నుంచి ఆవిడ పనులు చేసుకుంటూ వుంటుంది, ఈయన పెట్టుబడిగా ఉంటాడు. పనులన్నీ ఆవిడే! ఈయన ఉంటాడు. 'నేను వుంటాను నువ్వు

చూసుకుంటూ వుండు అంతా' అంటాడు. ఈయన ఉన్నాడని ఆవిడ చేస్తూ వుంటుంది, ఆవిడ చేసిన ప్రతీదాంట్లో ఈయన ఉంటూ ఉంటాడు. అలా చేసుకుంటూ వెళ్తూ వుంటుంది ఆవిడ. మనకు కూడా మేల్కాంచినపుడే కదా సంకల్పం వస్తుంది. మనకు మేల్కాంచడం ఎటువంటిదో, భగవంతుని నుండి ఆయన సంకల్పంగా చైతన్యం వ్యక్తమవడం అటువంటిది. సృష్టికి ముందేమిటి? ఇదంతా మొదలు కాకముందేమిటి? అని అడుగుతుంటారుకదా! మాస్టారి సమాధానం ఏవిటంటే 'నువ్వు అప్పుడు లేవు కదా! ఎందుకు నీకీ ప్రశ్న? అదొక సమాధానం. ఇంకో సమాధానం ఏమిటంటే, ఇదంతా లేనప్పుడు ఏముంది అంటే నీవు నిద్రలో ఉన్నప్పుడు ఎలా వున్నావో అట్లా ఉంటుంది. నీవు నిద్రలో నుంచి లేచినప్పుడు ఎలా వుందో, ఆయన లోనుంచి అమ్మవారు అలా మేల్కాంచింది. మేల్కాంచిన తర్వాత పనులన్నీ అమ్మవారివే. మన చైతన్యము పెట్టుబడిగా మనకు ఆలోచనలు వస్తుంటాయి. ఇవన్నీ ప్రకృతి నుండి పుడుతుంటాయి. నాకేమీ సంబంధం లేదు అంటాడు శివుడు. అంతా ఆవిడదే programme, నాదేమీలేదు అంటాడు. మనం కూడా అంతే. మనం ఉంటాము. మన నుంచి మేల్కాంచిన చైతన్య స్థితి నుంచి పుట్టుకొస్తున్న భావనలో కూడా మనం ఉంటాము. మన కోరికలో, వాక్కులో, చేతలో మనం ఉంటాము. కాబట్టి ఇన్నింటిలోకి మనం వ్యాపనం చెందుతుంటాము. అలాగే శివుడు కూడా అన్నింటిలో ఉంటాడు. ఉండటంలో తేడా లేదు కానీ, ఉండటాన్ని ఆవరించి ఉన్న స్వభావంలో తేడా ఉంటుంది. అది ఎక్కడ అంటే, మొట్టమొదటి filter లోనే తేడా వస్తుంది. ఆ మొదటి filter మనకి సంభవించడం. రెండవ filter భావన. Moulds సరిగ్గా వుంటే prints ది ఏముంది? అన్నీ శుభ్రంగా వుంటాయి. ఈ రెండూ చక్కగా ఉంటే కార్యక్రమములన్నీ చక్కగా వుంటాయి. Moulds లో తేడా ఉంటే కష్టం. భగవంతుని యొక్క mould చక్కగా వుంటుంది కాబట్టి ఇవన్నీ భరించడం పెద్ద విషయంకాదు. ఈ భూగోళం ఇంత భరిస్తోంది కదా? మనల్ని భరిస్తోంది అంటే దేన్నయినా భరించొచ్చు. మననే కాదు, మనకన్నా కూడా చాలా క్రూర జంతువుల్ని, చెట్లని, కొండల్ని, సముద్రాలని భరిస్తోంది. ఇవన్నీ భరిస్తున్న భూగోళాన్ని ఎవరు భరిస్తున్నారు? చాలా ఆశ్చర్యం! మనం Magnetism అంటే భూమ్యాకర్షణ శక్తి కనుక్కోకముందే అలా నిలబడింది. భూమ్యాకర్షణ శక్తి ముందు నుంచి ఎట్లా వున్నదో అలా మొదటినుంచీ 'ఉండడం' అనేది ఒకటి వున్నది. ఆ వుండటం లోంచి

అన్నీ పుట్టుకొని వచ్చి ఆ వుండడం లో భాగంగా వుంటుంటాయి. చూడండి ఎలా భరిస్తున్నాడో, సాధారణమైన బరువు కాదుకదా భూమి బరువు. దేని ఆధారంగా భరిస్తున్నాడు? అలాగే మిగతా గోళాలు కూడా. భరించడమే కాదు, వాటి movements, వాటి rhythm అంత precise గా ఎలా move అవుతున్నాయి గ్రహాలు? బృహస్పతి తులారాశిలో ప్రవేశిస్తున్నాడు అని Astrology లో చెప్తాము కదా! ఎలా చెప్ప గలుగుతున్నాము? What kind of control is there in His భావన? భగవంతుని యొక్క భావన యందు ఎంత rhythm, ఎంత regularisation, ఎంత systematisation వుందో చూడండి. Aquarian Age అంటే అది time ప్రకారం వస్తుంది. తన నుంచి పుట్టుకొని వచ్చిన సూర్య మండలాల గుంపులని ఒక rhythm ప్రకారం నడిపిస్తున్నాడు. He is the Master of the house. నిజమైన అర్థంలో భర్త అంటే భరించువాడు. What are you holding? ప్రతీ ఒక్కరూ కూడా భావనలు కాస్తో కూస్తో భరిస్తూ వుంటారు కదా! అవి ఎలా వుంటాయి? ఇంత systematic గా, ఇంత regularised గా సరైన direction లో ఉన్నాయా? ఎప్పుడూ unpredictable గా వుంటాయి కదా! మన భర్తృత్వానికి, ఆయన భర్తృత్వానికి compare చేసి చూసుకుంటే ఇంత బృహత్తరంగా వున్నదాన్ని తన భావన చేత చక్కగా hold చేస్తుంటాడు. అందుకని ఆయన భర్త. ఇంట్లో ఒక పెద్దాయన వున్నాడు అంటే ఇంట్లో వాళ్ళందరూ ఎట్లా order లో వుంటారో, మొత్తం సృష్టికి పెద్దాయనగా ఆయన వున్నాడు. ఆయన ఆధారంగా వీళ్ళందరూ వున్నారు కాబట్టి అట్లా order లో వుంటారు. తను భరిస్తున్నాడు గానీ ప్రభువు కూడా! చాలామంది భరిస్తూ వుంటారు, ఏడుస్తూ వుంటారు. భరిస్తూ వున్నా వాళ్ళచేత ఇంకా ఎక్కువ చేయించుకునే వాళ్ళు వుండరూ? వీడు చేసి ఏడుస్తూ ఉంటాడు. అంటే వీడికి భర్తృత్వం లేదు, వీడు ప్రభువు కాదు అదొకరకమైన భర్త. భగవంతుని యొక్క భావానికి లోబడి మొత్తం అన్నీ పనిచేస్తుంటాయి తప్ప, దానికి అతిక్రమించి పనిచేయడానికి అవకాశంలేదు. ఉంటే దానికి automatic penalties పడిపోతూ వుంటాయి. బావుందని కొంచెం ఎక్కువ తిన్నాం అనుకోండి, ఏమౌతుంది? ఆ రోజు సరిగ్గా నిద్రపట్టదు. కడుపునొప్పి వస్తుంది. అంటే immediate గా the law is set into operation. బావుంది అని మనం ఏదైనా ఎక్కువ చేసినప్పుడు automatic గా natural law

ఒకటి workout అవ్వదూ? ఈ మొత్తం అంతా కూడా అతిక్రమించకుండా చూసుకుంటూ వుంటాడుట వీళ్ళ యొక్క ప్రవర్తన యందు ఈ ప్రభువు.

## ౩౨. ఈశ్వరః

అంటే అందరియందూ తానే వుండి వుంటాడు. మనం ఏదైనా కట్టుకున్నా, కొనుక్కున్నా  దానికి మనం ఈశ్వరులం అవ్వడానికి వీలులేదు, owners అనడం తప్పు. ఎందుకంటే దాని యందు కూడా వ్యాపించి వున్నవాడు ఈశ్వరుడు. మనవి అనే అన్నిటియందు మనం వ్యాపించి వుండాలి అదే ఈశ్వరత్వం. అలా వున్నామా? మన పిల్లలు...ఎంత సంస్కృతంలో "ఆత్మావై పుత్రనామాసి" అన్నా కూడా, మన భావమే కదా పుత్రుడిగా దిగివచ్చాడు. అయినా వానియందు మనం జీవించి వున్నామా? వ్యాపించి వున్నామా? చాలా కష్టమైన విషయం, అసలు మాటే వినడు కదా? "నీకేం తెలుసు నువ్వు అలా కూర్చో', అని చెప్తాడు. అంటే వ్యాపనం లేదు అన్నమాట. వ్యాపనం ఉన్నవాడికి ఎలా ఉంటుందంటే తండ్రి చెప్పక్కర్లేదు, తండ్రి ఆలోచన ప్రకారం కొడుకు చేసుకుని వెళ్ళిపోతాడు. రాముడు-దశరథుడు అట్లా వుంటుంది. దశరథుడు నోరు విప్పి చెప్పడు నువ్వు పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం వెళ్ళాలి అని. దశరథుడి యొక్క మనోభావం రాముని యందు భాసిస్తుంది అంతే. నిజంగా తండ్రీకొడుకుల మధ్య మాటలు ఎక్కువ వున్నాయి అంటే communication లేదు, అంటే మనోభావాలు అర్థంకాడం లేదుటా  అని అర్థం. ఎంత మాట్లాడుకుంటే అంత communication ఉంటుందని చాలామంది అనుకుంటారు కానీ, అలా  ఉండదు. Fear arising out of lack of communication. నిజంగా తనకి  విశ్వాసం వున్నవాడు, తప్పకుండా తన తనయులయందు విశ్వాసం కలిగి వుంటాడు. తన మనసులో మెదిలే ప్రతీ భావనా వారికి సులభంగా అవగాహన అయ్యి చేసుకు వెళ్ళిపోతూ వుంటారు. అందుకనే తండ్రి దేహాన్ని వదిలేసినా వాళ్ళు continue చేస్తూ వుంటారు. ఎందుకు చేస్తూ వుంటారు అంటే the thought prevails and it continuously functions. అదీ తండ్రి నుంచి కొడుకు పుట్టడం అంటే. అలా పుట్టలేదంటే, అది continue కాలేదు అంటే, అది ఆత్మనుంచి పుట్టుకొచ్చిన వ్యవహారం కాదు. మనకి కాముకమైన భావన నుండి పుట్టుకొచ్చిన వాళ్ళ programme, వాళ్ళ desire bodyకి సంబంధించినది వుంటుంది. నిజంగా తల్లిదండ్రుల యొక్క భావనలు పరిపూర్ణం చేసే సంతానం కూడా అప్పుడప్పుడు వస్తూ వుంటుంది. అలాగే గురువు

యొక్క భావనలు పరిపూర్ణం చేసే శిష్యులు కూడా వస్తూ వుంటారు. వీళ్ళే continue చేసే వాళ్ళు. ఈ continuity చాలా ముఖ్యం. అది వున్నచోట communication ఎక్కువ వుండదు. చాలా అనుంగు శిష్యుడితో గురువు ఎక్కువ మాట్లాడేది ఏమీ వుండదు. శిష్యుడు కూడా గురువుతో కూర్చుని మాట్లాడుకునేది ఏమీ వుండదు. అలాగే అనుంగు పుత్రుడు వున్నాడనుకోండి వాణ్ని చూసి తండ్రి ఆనందిస్తూ ఉంటాడు. తండ్రిని చూసి వాడు నేర్చుకుంటూ ఉంటాడు, అంతే! Teaching అని చెప్పి, కుర్చీ వేసి కూర్చోపెట్టి పాఠాలు చెప్తే ఇద్దరికీ తలనెప్పి. చాలా artificial గా వుంటుంది. ఎక్కడ continue అవుతుంది అంటే there is no difference. It is only extension. State Bank విశాఖపట్టణంలో వుంది, దానియొక్క branches విశాఖపట్టణంలో చాలా చోట్ల వున్నాయి. ఇవన్నీ ఒకే bank యొక్క extensions కదా? వేరే వేరే ప్రదేశాలలో, వేరే వేరే buildings లో ఉన్నా అన్ని branches లో మనం ఒకే bank అని feel అవుతామా లేక ఇన్ని banks అని feel అవుతామా? అలా ఎందుకు ఒకటే bank అని అనుకుంటాము అంటే because it is only one thought that prevails. అలాగే ఒక తండ్రికి నలుగురు కొడుకులు వుంటే, నలుగురి యందూ తండ్రి యొక్క భావన పూర్తిగా పని చేస్తుంటే ఆ నలుగురూ కొడుకులూ తండ్రే! ఒకడి యందు మాత్రమే పని చేస్తుంటే వాడొక్కడే తండ్రి. మిగతా వాళ్ళు something else. ఇక్కడే వుంది మొత్తం ఈశ్వరత్వం. వ్యాపనం చెందడం అంటే అట్లా వ్యాపనం చెందాలి. రాముని యందు దశరధుడు పూర్తిగా వ్యాపనం చెంది వుంటాడు. అందుకే రామునికి తెలిసినంతగా దశరధుని యొక్క మనసు మళ్ళీ భరతునికే తెలుసు. మిగతావాళ్ళకి తెలియదు. కాస్తో కూస్తో తెలియడం వేరు మొత్తం తెలియడం వేరు. అందుకనే దశరధుడు నిశ్శబ్దంగా నిలబడి వుంటే, కైక తాను వరాలు కోరుకున్న విషయం, దశరధుడు ఇచ్చిన మాట, ప్రస్తుత పరిస్థితి అంతా వివరిస్తుంది. ఒక్కసారి రాముడు తండ్రి ప్రక్క చూస్తాడు. అంతే! అంతా అవగాహన అయిపోతుంది. ఏం నాన్నా? నాకు రేపు పట్టాభిషేకం అన్నావు కదా! ఏమిటి ఇదంతా? ఇలా చేసావేమిటి? ఇలా మన logic ప్రకారం అడగాలి కదా! అతను చెప్తే వెళ్తాను, నువ్వు చెప్తే వెళ్ళను అనైనా అనాలి కదా? అక్కడ చెప్పినది ఎవరు? కైకేయి! అది విని తండ్రి వంక ఒకే ఒక్కసారి రాముడు చూస్తాడు. అంతే! తండ్రి మనోభావం తన యందు వ్యక్తమై, సమస్తం విచ్చుకుంటుంది. తనకు, తండ్రికి తేడా లేని స్థితి కాబట్టి, నోరు విప్పకుండా

బయటకు వెళతాడు. తర్వాత వచ్చి పిలిచినా కూడా రాడు. ఎందుకంటే, దశరథుడు ఉన్నాడు- లేడు అనే తేడా ఉన్నవాడు కాదు రాముడు. ఉండడం లేకపోవడం అనేవి మన యొక్క అజ్ఞానం యొక్క చిహ్నం. ఎంత లేడనుకుంటే అంత అజ్ఞానం. 'ఉన్నది పోదు, లేనిది రాదు' ఇది ఒక సత్యం. తర్వాత భరతుడు వచ్చి పిలిచినా కూడా రాడు. ఇప్పుడు దశరథుడు లేడు కదా! భరతుడు తప్పు జరిగి పోయిందని, నిన్ను వచ్చేయమని అడుగుతున్నాడు కదా! వచ్చేయమని, చాలా మంది చెప్తారు రామునికి. "అసలు దశరథుడే లేకపోతే నేను అసలు రానక్కర్లేదు, ఎందుకంటే అప్పుడు నాకు, ఆయనకు సంబంధము లేదుగా! అప్పుడు ఆ రాజ్యం నాదెందుకౌతుంది?" అంటాడు రాముడు. వీళ్ళకన్నా విపరీతమైన logic చెప్తాడు రాముడు అక్కడ. తనకీ తండ్రికీ సంబంధం ఉందా, లేదా? అని అడుగుతాడు. "తండ్రి లేడు అన్నది మీకు. నాకు తండ్రి వున్నాడు", అని చెప్తాడు. తండ్రి తనకి ఉన్నాడు కాబట్టే మొత్తం రామ రావణ యుద్ధం అంతా అయిపోయిన సందర్భంలో, దశరథుడు రామునికి కనిపించి "కొడుకంటే నాకు నువ్వే" అని ఆశీర్వదిస్తాడు. ఉన్నాడు అనుకునే వాళ్ళకి అలా వుంటారు. గురువుగారు లేరు అనుకుంటారు కదా. లేరు అనుకునే వాళ్ళకి ఏ జ్ఞానం వుండదు. ఉన్నారు అనుకునే వాడికి ఎప్పుడూ వుంటారు. ఎందుకంటే వున్నది పోదు కదా! లేనిది రాదు కదా! ఉన్నప్పుడు కూడా ఉన్నారనుకునే అవగాహన లో తేడా వుంటుంది. అందుకనే లేరు అనుకోవడం కూడా జరుగుతుంది. ఇది కొంచెం మెలికలుగా వుంటుంది. కానీ అవగాహన చేసుకోవడం చాలామంచిది అందరికీ. మనందరం ఎక్కడి నుంచి వచ్చాం? చోటులో నుంచే కదా! భూగోళం, సూర్య మండలాలు ఇలా అన్నీ  చోటు లోంచే వచ్చాయి అంటే మనమొక లెఖ్ఖా? మనం చోటు నుంచి వచ్చి, చోటు లోకి వెళ్లిపోతాం. మనం వున్నప్పుడు వున్నది చోటే, మనం వెళ్ళిపోయినప్పుడూ వుండేది చోటే! ఎప్పుడూ వుండేది చోటు అని గుర్తుండే వాడికి లేకపోవడం అనేది ఉండదు. లేకపోవడం అనేది ఉండడం వల్లనే ఎక్కువ దురాచారం జరుగుతూ వుంటుంది. ఈ లేకపోవడం అనేది రాముడికి లేదు కాబట్టి, దశరథుడు వున్నాడు, అంటాడు. దశరథుణ్ని చూడడం అంటే చోటుని చూడడమే! శ్రీకృష్ణుడు విశ్వరూప సందర్శనంలో 'అందరిలో నన్నే చూస్తుంటారు ఋషులు' అని చెబుతాడు. అంతా నేను, నేను అని చెప్పి రకరకాలుగా చెప్తుంటాడు. అలా నేను అన్న చోటల్లా కృష్ణుడనుకుంటే బోల్తా పడతాము. నేనంటే, ఏది కేంద్రంగా ఈ మొత్తమంతా

విచ్చుకుంటుందో, ఏది ఆధారంగా మిగతావన్నీ ఏర్పడుతున్నాయో అది! మనం కూడా నేను, నేను అంటూ వుంటాం కదా? 'నేను' అని అనేవాడు ఎక్కడి నుంచి అంటున్నాడు. మనం we take it for granted. రమణ మహర్షి మొత్తం program అంతా అదే ఇస్తాడు. "ఈ నేను అనే చోటు చూడు. ఎవరంటున్నారు నేను అని? నేనేగా? ఎట్లా అంటున్నావు? దాని గురించి విచారణ చేయి" అని చెప్తారు. ఒక 'నేను' ఈ  మొత్తమంతా వ్యాపించి ఉన్నది కాబట్టి ఈశ్వరుడుగా ఉండే తత్వం ఈ 'నేను'కు ఉంటుంది. ఈశ్వరతత్వం ఉన్నవాళ్ళు అన్నిటియందు వ్యాపించి ఉంటారు. అన్నిటియందు వ్యాపించి ఉన్నప్పుడు నేను లేనని ఎప్పుడూ అనుకోముకదా. ఒక ప్రదేశంలో లేనని చెప్పుకోవాలే తప్ప నేను లేనని చెప్పలేముకదా. అలా రాముడికి దశరథుడు లేడు అనంటే నేను లేను అనే అర్థం అక్కడ. అందుకని దశరథుడు లేకపోవడం అనేది లేదు. ఎప్పుడూ ఉండడమే వున్నది. నువ్వన్నట్టు లేకపోవడమే అయితే, అసలు ఈ రాజ్యానికీ నాకూ ఏ సంబంధమూ లేదు పొమ్మన్నాడు. ఇది ఎందుకు చెప్తున్నాను అంటే రాముడికి, దశరథుడికి ఉన్న వ్యాపనం. మనకి అలా ఉందా? దశరథుడు-రాముడు ఎక్కువ మాట్లాడుకోలేదు. ఎక్కువ మాట్లాడుకుంటే communications తక్కువ వున్నట్టు అర్థం. ఒక ఆఫీసులో ఒక యజమాని అందరిచేత పనిచేయిస్తుంటే, ఎవరి పని వాళ్ళు చేసుకుని పోతున్నారనుకోండి, ఎలాచేస్తే అతను సంతోషిస్తాడో అలా చేసుకుపోతారు. అంతే కానీ చీటికీ మాటికీ వెళ్లి అడగరుకదా? యాజమానే వెళ్లి ప్రతివాడి చేత పని చెప్పి చేయించుకోవాలనుకోండి, communications బాగా లేవని అర్థము. సరైన కుటుంబంలో భర్త యొక్క మనసెరిగి భార్య పనిచేస్తూ వుంటుంది. భార్య యొక్క మనసెరిగి భర్త పని చేస్తూ ఉంటాడు. పిల్లల మనసెరిగి భార్యాభర్తలు పని చేస్తూ ఉంటారు. పిల్లలు తల్లిదండ్రుల మనసెరిగి ప్రవర్తిస్తుంటారు. చాలా తక్కువ మాట్లాడుకుంటారు. Communications peripheral levels లో వుండే వారు ఎక్కువ మాట్లాడుకుంటారు. Communications deeper levels లో ఉండేవాళ్ళు తక్కువ మాట్లాడుకుంటారు. వాళ్లకి ఎలా ఉంటుందంటే, ఆ కుటుంబంలో ఎక్కడో, ఎవరో సభ్యులకు ఒక ఆపద కలిగితే, తమకు ఆపద కలిగినట్లు భావన కలుగుతుంది. వ్యాపనం ఉన్న స్థితి కాబట్టి అలా అనిపిస్తుంది. రాముడు కష్టంలో వుంటే కౌసల్యకు కలుగుతుంది ఆ బాధ. కౌసల్య కష్టంలో వుంటే రాముడికి కలుగుతుంది ఆ బాధ. ఇవన్నీ ఎలా ఏర్పడ్డాయి? ఉన్న ఏకీభావంలో

నుంచి ఏర్పడతాయి. "ఈ భూమి మీద ఎవరు కన్నీరు చిందించినా, అది భూమి మీద పడే లోపు నా హృదయం మీద పడుతుందని" చెప్పాడు బుద్ధుడు. "ఎవరికి కష్టం వచ్చినా, తన కష్టంగా భావించి, ఆ కష్టాలన్నీ తీరేవరకు నేను భూమి మీద వుంటానని" ఆయన అన్నాడంటే అందులో చాలా అర్థం ఉంది. ఎందుకంటే, వీరందరూ 'నేనే' అనే భావన వుంది కాబట్టి, అందరియందుండే ఈ'నేను' యొక్క అవతరణము పరిపూర్ణంగా జరిగి, అందరూ హాయిగా ఉండాలనే భావన ఉన్నవాడు కాబట్టి ఊర్ధ్వలోకాలకు వెళ్లకుండా ఇక్కడే ఉండిపోవడం జరిగింది. అలాగే Christ. అలాగే అవతారమూర్తులందరు కూడా. ఎందుకని? మనకు ఎక్కడో కాలికి చీమ కుడితే మనం మొత్తం దేహమంతా గమనించుకోమూ? మనం గమనిస్తాము. కాలే కదా అని ఊరుకోము కదా. పక్కవాడి కాలైతే వూరుకుంటాము. ఎందుకంటే మనకి పక్కవాడనేవాడు ఒకడున్నాడు కాబట్టి. భగవంతుడికి పక్కవాడనే వాడు లేడు, అంతా వాడే కదా! భాగవతంలో చెప్పబడిన భాగవతోత్తములకి కూడా ఇతరులు ఎవ్వరూ ఉండరు. ఎవరికైనా కష్టం వచ్చిందంటే వారు చెప్పకపోయినా వీరికే వచ్చినట్లుగా ఉంటుంది. ఇతరుల కష్టం తెలిసినా చీమ కుటినట్టు కూడా వుండదు మన బోటివాళ్లకి. అసలు వాడి బాధ అవగాహన అయ్యి, సహవేదన వున్నవారే ప్రేమ కలిగిన వారని వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఒక మారు చెబుతారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు ఎక్కడో ఎవరో ఓ పదిమందిని చంపితే ఆరోజు రాత్రి ఈయనకి, ఈయన్ని చంపినట్లు భావన కలిగేదిట. ఎవడికో Europe లో కాలు తెగిపోతే, ఈయనకి తన కాలు తెగిపోయినట్టు భావన. పొద్దున paper రాకుండానే ఈ రోజు ఎక్కడో బాగా జననష్టం జరిగింది అని ఆరుగంటల prayer లో శిష్యులకి paper రాకుండానే చెప్పేసేవారు. ఎక్కడైనా అగ్ని పర్వతం పేలిందనుకోండి, ఈయనకు లోపల చాలా వేడి వస్తూ వుండేది. ఎక్కడైనా జలప్రళయం జరిగితే, ఈయనకి లోపల బాగా కదిలిపోయినట్టు వుండేది. ఏమిటిదంతా? వ్యాపనం చెందిన చైతన్యానికి అట్లా వుంటుంది. మనం దేహానికే పరిమితమై వుండిపోయినందు వలన, పక్కింట్లో ఎవరో చచ్చిపోయినా మనకు తెలియదు. పక్కలో పడుకున్న వారు మూలిగినా పట్టని స్థితిలో మనం ఉంటాము. కొంచెం అటు తిరిగి పడుకుని, దుప్పటి ముసుగేసుకుని బాగా నిద్రలోకి వెళ్ళిపోయినట్టుగా ఉండిపోతాం కదా! అంటే ఎక్కడ ఉన్నదీ? అదే మనకి వస్తే? హాయిగా నిద్రపోతున్నారు

దున్నపోతుల్లాగ అని బాధగా వుంటుంది. Belonging ఉన్నచోట పక్కవారికి ఇబ్బంది కలిగితే వాళ్ళు పడినంత యమయాతన వీళ్ళు పడరు గానీ, వీరు గుర్తించగలుగుతారు. జ్వాలాకూల్ మహర్షి ఒక విషయం చెబుతారు. A man who is not interested about himself and who is concerned about the unhappy beings around him, he is the man whom we see content. భగవత్ సాధన మొదలు పెట్టిన వాళ్ళు, వారి గురించి వారు చాలా ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారు. అది రెండు రకాలుగా వుంటుంది. వారి గురించి వారికి estimation ఎక్కువగా వుంటుంది. ఎక్కువ సమయం వారి గురించి వారు ఆలోచించుకోవడంతోటే సరిపోతుంది, ఇక పక్కవాళ్ళ గురించి ఆలోచించడానికి వీరి దగ్గర సమయం ఉండదు. గురువుగారు ఎప్పుడు కనిపిస్తారు? ఎప్పుడు హిమాలయాల్లో ఉండే వారు కనిపిస్తారు? ఎప్పుడు ఉత్తరధృవంలో ఉండేవారు కనిపిస్తారు? ఎప్పుడు మనకు విష్ణువు కనిపిస్తాడు?--ఇలా ఉంటుంది. ఎందుకు కనిపించాలి? వాళ్లకి ఏవైనా obligation ఉందా? తెలియకుండా అలా చూస్తూ loop line లోకి వెళ్ళిపోయి చాలా జన్మలు waste చేసుకునే వారు చాలా మంది ఉంటారు. భగవంతుని యొక్క సాన్నిధ్యం కోసం చేసే ప్రయత్నంలో, తమ గురించి తాము పడే తాపత్రయంలో అక్కడికీ ఇక్కడికీ వెళ్ళి చేతులు చూపించుకుంటూ ఉంటారు, నాడీ గ్రంథం చదివించుకుంటూ వుంటారు. నీ గురించి నువ్వు తెలుసుకుందామనుకొంటే you are not fit to be in the line. వీటన్నిటిలో నీ గురించి తెలుసుకోవలసినది personality aspect కాబట్టి అసలు తెలియడం అనేది ఉండదు. అలా తిరుగుతూ వుంటారు. నేను స్వంత జాతకం ఎవరికీ చూపించుకోవడం అన్నది లేదు, ఎవరైనా చెయ్యి చూస్తాను అంటే ఒప్పుకునేవాణ్ని కాదు, ఎవరైనా అడిగితే, నా సంగతి నాకు తెలుసు ఎవరూ చెప్పక్కర్లేదు అని చెప్పేవాణ్ని. ఒకసారి నా professional గురువుగారు 'ఒకాయన వస్తారు. ఆయన జాతకం చాలా బాగా చేప్తాడోయ్ చూపించుకో' అంటే 'ఎందుకు మాస్టారూ మన బట్టే మనకి తెలుస్తుంది. మనం నిన్నా మొన్నా ఏమిటి చేసామో దాన్ని బట్టే రేపూ ఎల్లుండీనూ! నాకు వద్దు' అని చెప్పాను. అయినప్పటికీ బలవంతంగా ఆయన వున్న సమయంలో నన్ను కూడా పిలిచారు. పిలిచి తను చెప్పించుకున్న తరువాత, ఈ కుర్రవాడి సంగతి ఏమిటి అంటే, 'ఉందా జాతకం' అంటే 'వుంది గానీ ఇవ్వను' అని చెప్పాను. 'అదేవిటయ్యా' అన్నారు. 'అఖ్కర్లేదండీ నాకుతెలుసుకోవాలని ఉత్సాహం

లేదు.' ఏం? అన్నాడు. "మనం చేసినదాని బట్టి జరుగుతూ వుంటుంది. దాని గురించి ఇంకొకళ్ళ చేత చెప్పించుకోవడం ఎందుకు? సరిగ్గా చేసామా సరిగ్గా జరుగుతుంది, సరిగ్గా చెయ్యలేదో సరిగ్గా జరగదు. ఇప్పుడన్నా సరిగ్గా చేసుకుంటే తరువాత బావుంటుంది. ఇంతే నాకు తెలిసినది." అని చెప్పాను. 'ఈ కుర్రాడికి చాలా పొగరు' అని చెప్పాడు. ఏదో అనాలికదా! అనేసాడు అయిపోయింది. అటువంటిది మాస్టరుగారు ఈ రాముని పట్టుకొచ్చి, 'నీ జాతకం ఒకసారి ఇవ్వవోయ్ ఇలాగ' అన్నారు. ఎంతోమందిని ఎగగొట్టేసాం కానీ, మాస్టరుగారిని చూస్తే మనం కాదనలేం! ఆయన అడగడంలో ఏదో జగత్కళ్యాణమే వుంటుంది. ఇచ్చాను, ఏదో రాసారు ఆయన. ఫలానా time కి ఇలా జరుగుతుంది అని. ఒక మూడేళ్ళు పోయిన తరువాత ఒక రోజు మాస్టారుగారి గదిలోకి వెళ్ళి, నా జాతకం చూపించి 'దీని మీద ఒక idea ఇవ్వండి మాస్టారు' అన్నాను. ఆయన 'ఈరోజు నుంచీ నువ్వు నీ జాతకం చూసుకోవడంలేదు, ఎవ్వరికీ చూపించడం లేదు' అన్నారు. 'ఈ రోజువరకూ నేను ఎవరికీ చూపించలేదు, మీకే చూపించాను, అదీ మీరు వేయించిన దానిమీద develop అయిన భావన ఇది,' అంటే 'అప్పుడు ఒక purpose కోసం చూసాను, ఇప్పుడు ఇంక అవసరంలేదు, నీ గురించి ఇక నువ్వు ఆలోచించడం మానేయ్' అన్నారు. ఆ రోజుల్లో నేను చేతులు చూస్తూ వుండేవాణ్ని. చేతులు చూస్తూ నేర్చుకుంటూ వుంటే, మన చేతులు చూసుకుంటూ వుంటాం. జాతకాలు చూస్తూ వుంటే, మన జాతకం చూసుకుంటూ వుంటాం. 'నువ్వు చేతులు చూస్తున్నావు కదా, నేర్చుకుంటున్నావు కదా, నీ చెయ్యి ఎప్పుడూ చూసుకోకు' అని చెప్పారు మాస్టారు. తరువాత అర్థం అయ్యింది మన గురించి మనం ఆలోచించుకుంటూ వుంటే we are always preoccupied with ourselves and not available for any useful work. మాస్టారు అంటూ వుండేవారు "మనం రెండు సార్లు జింఖానాలో కసరత్తు చేసి, ఏ మాత్రం కండలు వచ్చాయో చూసుకున్నట్టుగా వుంటుందయ్యా ఇవి చూసుకుంటుంటే! జగత్ కళ్యాణమైన కార్యక్రమాలు ఏమైనా చేసుకుంటూ ఉండటం తప్ప, మన గురించి మనం ఆలోచించుకోవడం మానేసిన దగ్గరి నుండి భగవంతుడు మనకి ఎక్కువ సాన్నిధ్యాన్ని ఇస్తాడు" అని చెప్పారు. ఆధ్యాత్మిక సాధనలోకి రాకముందు ఆలోచన మన గురించే, మన ఆరోగ్యం గురించే! ఆధ్యాత్మిక సాధనలో కూడా మన గురించే ఆలోచిస్తుంటే అది మూర్ఖతకు దారితీస్తుంది. భగవద్ సాధన పేరుతో they tend

to become more and more impractical. అదొక రకమైన మాలోకంలా కళ తప్పి, పైకే చూస్తూ కిందకి చూడకుండా, ఎదో కోల్పోయినట్టుగా తిరగడం ఆధ్యాత్మిక సాధన అన్నట్టుగా వుంటుంది. ఇవన్నీ చాలా mundane అన్నట్లుగా వుంటారు. Those who think about themselves have absolutly no time to think of others. That is what is being done by a person whom we call materialistic. And in the name of spiritualism people continue to do the same thing. ఇంకొకరికి సహాయం చేస్తున్నా కూడా service చేస్తున్నామన్న భావన మన మనస్సులో స్థిరపడి ఉంటే ఆ చేసేది శుద్ధ దండగ. 'చేస్తున్నానన్న భావనతో చేయకు' అని చెప్పారు రమణ మహర్షి. "ఇస్తున్నానన్న భావనతో ఇవ్వకు. అప్పుడు నువ్వు ఇవ్వకపోతే మమ్మల్ని అందరినీ రక్షించినవాడివి అవుతావు" అని చెప్తారు. Service అంతా projection of personality కదా! మనం service చేస్తున్నప్పుడు అందరికీ నదురుగా కనపడాలనే తహతహ హతం అయ్యేవరకు service ఏమీ జరగదు. ఎందుకంటే అది చేస్తున్నప్పుడు కూడా thinking of ourselves మాత్రమే ఉంటుంది. 24 గంటల రుద్రాభిషేకానికి వచ్చి గురువుగారు ఉన్నంత సేపే వుండి, ఆయన వెళ్ళిపోగానే మనమూ వెళ్ళిపోయి-- ఎవరికోసం? అలాగే ఎవరైనా చూస్తూ వుంటే service చేస్తాం, చూడకపోతే చెయ్యం అనుకోండి లేదా చేస్తున్నామన్న భావన ఎక్కువ ఉందనుకోండి, ఇదంతా కూడా thinking about ourselves. A man who is interested about himself, తన గురించి...ఆ 'గురించి' ఉన్నంతసేపూ ఎవరికీ interest వుండదు. ఎందుకంటే you are working for some gain. You are working for others అని రావడం అనేదే చాలా పెద్ద step. అది రావడ మన్నది పెద్ద పూర్వ పుణ్యం. అందులో నీ గురించి నువ్వు మర్చిపోవాలి. నిజమైన మహాత్ములు ఎప్పుడు వారి గురించి మాట్లాడరు. మనం ఏవరైనా మహాత్ముల దగ్గరకు వెళితే, వాళ్ళ దగ్గర వినడానికి వెళ్ళం. మనకెంత తెలుసో, ఎంత సాధన చేస్తున్నామో, వారికి చెప్పుకోవాలనే ఆబ ఎక్కువ వుంటుంది మనకి. ఎందుకు వుంటుంది అంటే మన గురించి మనం చెప్పుకోవాలనే తాపత్రయము వల్ల. జీవితంలో అది చాలా పెద్ద obstruction. మన గురించి మనం చెప్పుకోవడం, మన గురించి మనం భావన చేసుకోవడం. A man who speaks about himself is not fit to be in discipleship. పరమగురువుల

మార్గంలో నిజమైన సన్మార్గంలో సాధన చేసుకునే శిష్యునికి తన గురించి తాను చెప్పుకోవడం ఎట్టి పరిస్థితులలోను ఉండదు. కాబట్టి ఆత్మకథ రాసుకునే పరిస్థితి అసలు వుండదు. మనం గమనిస్తే ఏ మహాత్ములూ ఆత్మకథ వ్రాసుకోరు. ఇంకొకరు రాయొచ్చు అది వేరే సంగతి. రాసినా అది వాళ్లకి అందినంత వరకే తప్ప వీళ్ళ గురించి పూర్తిగా కాదు, కొంతవరకే! ఎందుకంటే వారి గురించి వారు ఎన్నడో మరచిపోయారు. ఎందుకంటే తనంటూ ఒకడు లేడు. ఉన్నది ఒక్కడే లోపలా బయటా కూడా! కాబట్టి రాస్తే ఆ లోపలా బయటా ఉన్న ఒక్కడిని గురించి రాస్తాడు. సొంతం గురించి రాసుకొనేవాడు 'నేను' అనే ప్రజ్ఞను వ్యక్తము చేయగలిగే సామర్థ్యం కలిగి ఉండడు. మనం 'నేను' అనే చైతన్యానికి కాస్త దారి ఇస్తే వ్యక్తమౌతుంది. మనయందు మనకి ప్రీతి ఎలా ఉంటుందో అంత ప్రీతీ అందరి మీద ఉంచరా, అంటారు. మన గురించి మరచిపోయి get concerned about unhappy beings around us. Are we concerned about unhappy beings around us? ఇదంతా ఈశ్వరత్వం లో భాగం. How much are we concerned about those who are working in our house? మన ఇంట్లో పనిచేస్తూ వుంటారు, మన ఇల్లు తుడుస్తుంటారు, మన car drive చేస్తూ వుంటారు, మన చుట్టూ చాలా మంది కనిపిస్తూ వుంటారు. మన చుట్టుపక్కల ఉండే వాళ్ళు బాగుండాలి, అన్న భావన ఉందా? వాళ్ళ కష్టంలో మనం పాలు పంచుకుందామనే భావన వుందా? ఉంటే వాళ్ళు ఆనందపడతారే గానీ, ఏమీ ఆశించరు. ఎందుకంటే మనం ఏమీ ఇవ్వము అని వాళ్లకి తెలుసు. ఏవీ ఇవ్వము అని తెలిసి, వాళ్ళ దారిన వాళ్ళు చేసుకుపోయే వాళ్లకు మనం సాయంచేస్తే ఒక రకమైన ఆనందం కలగదూ? అబ్బా! నాగురించి ఎలా ఆలోచించారు అనిపించదూ? ఒక పదిలక్షల లాటరీ మనకి వస్తే మన మొహం ఎలా విచ్చుకుంటుంది? మనం అనుకోని విషయం కదా? అనుకోని లాభం మనకి కలిగినప్పుడు, ఎలా ఆనందం వస్తుంది? అలా మన చుట్టూ వుండే వారిలో కనీస అవసరాలు తీరని వారికి, వారి అవసరాలు తీర్చడానికి మనం చేసే ప్రయత్నంలో వాళ్ళలో సంతోషించేది నేనే! వాళ్ళను పట్టించుకోకుండా మనం ఊరికే ఉపనిషత్తులు, గీతాసారం, రహస్య ప్రకాశం ఇలా పెట్టుకున్నాం అనుకోండి, ఎవరికోసం? అవి ఇందుకు దారితీసినట్లయితే, it has a purpose! లేకపోతే it has no purpose. ఇవన్నీ చదువుకోకండి అని నేను చెప్పడంలేదు. పుస్తకాలు

చదివితే వాటి నుండి స్ఫూర్తి వస్తుంది. లేకపోతే బోలెడన్ని పుస్తకాలు ఎందుకు ఇచ్చాడు భగవంతుడు? రాసిన వాళ్ళందరూ మహాత్ములు. వాళ్లకి ఏమీ తెలియక రాసారా? మనలో పవిత్రీకరణ జరుగుతున్న కొద్దీ భావనలు చక్కగా వస్తాయి. దానికి కావలసిన స్ఫూర్తి సత్ గ్రంథాలలో వుంటుంది. అందుకే చదువుకోవాలి. ఈ చదువునే వాటన్నిటికీ పరాకాష్ఠ, ఫలస్తుతి ఎక్కడనుంచి వస్తుందంటే your usefulness to the people around you, particularly to the people who are weaker than you, Particularly to the people who are unhappy. బాధల్లో ఉండేవారిని ఆదుకోకుండా, ఎక్కడో బాగున్న వాళ్ళతో వేదాంతం గురించి చెప్తున్నామనుకోండి--. అదే అన్నమాచార్యుల వారు "చీకట్లో దీపం పెట్టవయ్యా-పెద్ద వెలుగులో పోయి కూర్చుంటావెందుకు? చీకటి బ్రతుకులు మావి. మాలో ఇంత చిన్న దీపం పెట్టు. (చాలా చీకటిలో చిన్న దీపం పెడితే పెద్ద వెలుగుగా వుంటుంది. సూర్యుడున్నప్పుడు మనం ఎంత పెద్ద 100 watts bulb పెట్టినా ఏమీ లాభం లేదు కదా!) జ్ఞానుల దగ్గర, ఋషుల దగ్గర, అంతా తెలిసిన వాళ్ల దగ్గర కూర్చుంటావేమిటి? మా దగ్గరకు రా!" అంటాడు. భగవంతుడికి service అంటే ఏమిటో చెప్తాడు. Service service అని చెప్పి ఎప్పుడూ నారదుడుతోను, వ్యాసుడు తోను ఉంటే ఏం లాభం? వాళ్లకి నువ్వు కనిపించినా కనిపించకపోయినా ఒకటే, వాళ్లకి ఎప్పుడూ ఉంటావు నువ్వు. కాబట్టి, అక్కడికి పోయి వాళ్ళతో ఆడుకుని, కబుర్లు చెప్పుకుని time waste చేసుకోబోకు. మాబోటి వాళ్ళం ఇక్కడ వున్నాం, కటిక చీకట్లో వున్నాం. ఒకచిన్న దీపం పెట్టు చాలు, మాకు అదే వెలుగు. 'చెలియా చీకటికీ దీపమెట్టకా, పెద్ద వెలుగులో వెలుగే వెలుగేలా? అంటాడు. పెట్టుకుంటే చీకట్లో దీపం పెడితే బాగుంటుంది కానీ, పెద్ద వెలుగులో నీవేదో వెలుగుతానంటే ఏమి ఉపయోగము? వాడికి అవసరం లేదు నీ వెలుగు అంటారు. అలా మనం as concept చైతన్య స్వరూపులుగా, దేహమనే పరిమితమైన రూపాన్ని దాటి వ్యక్తమవ్వాలి, వ్యాపనము చెందాలి, ఈశ్వరత్వంలోకి ప్రవేశించాలంటే ఒకే ఒక మార్గమున్నది. అదే చుట్టూ పక్కల ఉండే వారి బాధలలో పాలు పంచుకోవాలి. Sharing and distribution. అది లేనంతసేపు మనలో ఉండే ఈశ్వరుడు మనల్ని మెచ్చుకోడు. ఇతరులలో ఉండే ఈశ్వరుడు ఎలాగో మెచ్చుకోడు. ఏదో రకమైన మోహంలో పడి, ఆధ్యాత్మిక సాధన పేరుతో, సత్సంగం పేరున, గురువుల పేరున, పూజల పేరున, క్రతువుల పేరున, వ్రతాల పేరున loop

line లోకి చాలా దూరం వెళ్ళి పోతాము. అక్కడ నుండి బయటకు రావడం కష్టం. ఈశ్వరత్వానికి ఒకటే మార్గం, you have to see yourself in others. అదే మనకు ప్రహ్లాదుడు 'మీరు, మేమను మతి భ్రమణంబున ప్రవర్తిల్లక' అని చెప్పాడు. వాళ్ళు, మేము అంటారేమిటి? అందరూ ఒకటే కదా? ఆ mental disease పోతే అంతా బావుంటుంది కదా, అని చెప్తాడు. మనం మొత్తం ప్రపంచం అంతా ఆకట్టుకోలేము కానీ, కనీసం మన చుట్టుపక్కల మనం తింటూ ఉంటే ఒక కుక్క అక్కడ నిలబడి చూస్తూ ఉందనుకోండి, దానికి ఇంత వేసి మనం తినగలగాలి. వేసిన తర్వాత కూడా అది చూస్తూ ఉంటుంది. ఇది సాధన చేసేటప్పుడు చాలా తమాషాగా వుంటుంది. దానికి కొంత వేసి నువ్వు తిను. మొత్తం అంతా వేసేయగలిగితే అది వేరే సంగతి. అలాగే మన చుట్టుపక్కల వాళ్ళల్లోనే అసలు ఒక పూట కూడ తిండి తినని వాళ్ళు ఉన్నారనుకోండి. మీరు రెండో పూట కూడా తింటున్నారనుకోండి. వాళ్లకు కొంత పెట్టి నీవు రెండవ పూట తిను. మనకి బట్టలు పెట్టెలు పట్టకుండా వున్నాయనుకోండి, వాడికి బట్టలేదనుకోండి, వాడికి ఒక బట్ట ఇచ్చేయ్. మనం ఇలా చేయగలిగినప్పుడు Yoga living అంటే యోగ జీవన మన్నది ఏర్పడుతుంది. పరమ గురువు Djwalkul గారు అలాంటివాళ్ళు మాకు కావాలన్నారు. వేదాంతం చెప్పేవాళ్ళు మాకు అక్కరలేదు. వాళ్ళకన్నా మేము వేదాంతం బాగా చెప్పగలము. ఇతరుల యందు భగవంతుని దర్శనం చేసుకుని, తద్వారా వాళ్ళకు సేవచేసుకోవడంలో ఆనందం పొందే వాళ్ళు మాకు కావాలి. అలా చేస్తూ తమ గురించి ఆలోచించకుండా చేసే వాళ్లయితే మరీ మంచిదన్నారు. అందుకని ఆ వాక్యంలో ఇలా ముందుపెట్టారు Those who are not interested about themselves or the one who is not interested about himself and who is concerned of the unhappy beings around him-- తమ చుట్టూ వుండే వాళ్ళలో బాధ పడుతున్న వారిని గురించి తపన పడేవాడు, ఏం చేస్తాడు అనేది తరువాత సంగతి. కనీసం recognition of others' pain అనేది ఉండాలి. మన గురించి మనం బేరీజులు వేసుకోవడం అనేది మర్చిపోవాలి. మనం ఇంకా ఎంత దూరంలో ఉన్నాం మోక్షానికి? అనుకునే వాడు చాలా దూరంలో ఉంటాడు. అందులో ఏమీ సందేహంలేదు. ఈ మోక్షాన్ని గురించిన ఆలోచన చాలా స్వార్థానికి పరాకాష్ట. ఇంతమంది ఇక్కడ వుండగా మనకి ఒక్కళ్ళకీ ఎక్కడో ఒక air conditioned room కావాలని అడిగినట్లు

ఉంటుంది. గురుపూజలలో గదికి 10 నుండి 25 మంది వరకు ఉన్నప్పుడు నాకు ఒక్కడికీ వేరుగా ఒక గది ఇవ్వండి, అనేవాడు ఎలా ఉంటాడు? We are just working the opposite అన్నమాట. ఒకడు తెల్లవారుజామున 4 గంటలకు వేణ్ణీళ్ళు ఇవ్వండి అని అడుగుతాడు. గదిలో పడుకున్న వాడికి విసుగ్గా ఉంటుంది. అడిగిన వాడు పడుకోటానికి కూడా చోటు లేని వాడు, నువ్వు పడుకున్నావు. నీ గదిలో వేణ్ణీళ్ళు ఉన్నాయి, వాడికి వేన్నీళ్ళు కావాలి. అడిగిన వాడు నీబోటి వాడు కాదూ? కానీ అలా అనిపించదు. అదీ తమాషా, అదే మనిషి లో ఉండే స్వభావం. ఇలా ప్రతీవాడికీ వేన్నీళ్ళు ఇస్తూ కూర్చుంటే మనకి ఎప్పటికి తెల్లారేను అనిపిస్తుంది. అసలు సహకరించడం కోసం కదా  గురుపూజలు పెట్టారు. మనం ఎట్లా సహకరిస్తాము మిగతా వాళ్ళతో అని మనకుగా తెలియడానికి కానీ, ఇంకొకరికి చెప్పడానికి కాదు. అలా మనం అల్లుళ్ళలాగ ప్రవర్తిస్తే, it is only a good assessment that takes place in the records of the Master. ప్రతివారిది చూపుడు వేలంత image వాళ్ళ యొక్క గురువు దగ్గర వుంటుంది. దానిని సంవత్సరానికి ఒకసారి చూస్తాడట గురువుగారు. చూసినప్పుడు దానిలో వెలుగు ఏమైనా కొద్దిగా కనిపిస్తే, వానికి inspiration ఇచ్చి మళ్ళీ సంవత్సరం తరువాత చూస్తాడట. వెలుగేమీ లేదనుకోండి, చెక్కముక్కలాగ ఉందనుకోండి అసలు ఏమీపట్టించుకోడట. ఎప్పుడొస్తుంది ఆ బొమ్మలోకి వెలుగు? మన బొమ్మలన్నీ కూడా మన గురువుగారి ఆశ్రమంలో వుంటాయి. ఆ గురువుగారి ఆశ్రమంలో మన బొమ్మ వెలగడానికి కారణం ఏమిటంటే, మనం ఇతరులకు చేసే నిర్మలమైన సేవ. పెద్దపెద్ద గొప్ప విషయాలు ఏమీ కోరరు గానీ, ఎంత నిర్మలంగా వుంది సేవ అనేది చూస్తూ వుంటారు. మనం ఇతరులకు చేసిన సేవ ఎంత నిర్మలంగా ఉంది అనే దాన్ని బట్టి మన బొమ్మకు కాంతి పెరుగుతూ ఉంటుంది. సంవత్సరం సంవత్సరంకీ ఇంకా బాగా చేస్తున్నామనుకోండీ, కాంతి బాగా పెరుగుతూ వుంటుంది. ఒరేయ్! వీడు ఎదో చేస్తున్నాడు అనుకుంటారట. దాన్ని బట్టి ఇంకొంత స్ఫూర్తి ఇస్తాడట. ఆ కాంతి మరీ పెరిగిపోతూ ఉంటే ఆనందం తట్టుకోలేక, తానే వచ్చి వాడితోనే పని చేస్తారట గురువుగారు. తట్టుకోలేరు ఎందుకంటే వెన్నలాగా వుంటారు వాళ్ళు. అందుకనే వాడి ద్వారా మాట్లాడి, వాడి ద్వారా పని చేసి...ఎక్కడ జరుగుతుంది ఇదీ అంటే where by himself he is effective, he is useful. ఇలా ఇతరులకు ఉపయోగ పడుతున్న కొద్దీ, లోపల

"నేను" పెరుగుతూ వుంటాడు. మన instrument cleaning అవన్నీ కూడా వాడి మెప్పుకోసం అనుకోండి, అంటే మనం ఈ రోజు పొద్దున్న prayer చేసుకోలేదు అనుకోండి, మనం instrument clean చేసుకోలేదు అని అర్ధం. మాస్టారు ఏవైనా అనుకుంటారేమో అని prayer చెయ్యక్కర్లేదు కదా! మాస్టారు ఏమీ అనుకోరు. మాష్టారు అనుకొనేంత important కాదుకదా మనం. స్నానం చేయరా, అంటే స్నానం చేసి, నేను చేసాను చూసావా? అని అడిగినట్లు. చెయ్యకపోతే నీకు తేడా తప్ప చేస్తే మిగతా వాళ్లకి ఉద్ధరింపు ఏమీ కాదు. అలాగే ఈ prayer, ధ్యానం ఇవన్నీకూడా చేసుకుంటే నీ instrument clean అవుతుంది. Clean instrument దేనికి? అలా తోమి పెట్టుకున్నాం అనుకోండి ఉపయోగం లేదు, వాడాలి కదా? అలాగే వాడడం తప్ప తోమడం లేదనుకోండి ఉపయోగంలేదు. అందుకని వాడడం కోసం తోముకోవాలి. అంటే వాడుక పెరగాలి. అటువంటి వాడుక ఎంత జరిగితే అంత permeation వస్తుంది. ఈరోజున ఇన్నివేల మంది మాస్టర్ EK గారిని అహర్నిశలు ఎందుకు గుర్తుపెట్టుకుంటున్నారు? కేవలం ఆయన నిర్మలత్వంతో చూపించిన ఆప్యాయత వల్ల కదా? ఆ ఆప్యాయత ఆధారంగా ఆయన అందరిలోనూ వ్యాపనం చెందారు. అలా వ్యాపనం చెందడమే ఈశ్వరత్వాన్ని పొందడం అంటే. మాస్టారుతో సమకాలీకులు అయిన చాలా ధనవంతులు, చాలా పలుకుబడిగలవాళ్ళు, చాలా పెద్ద పదవుల్లో వున్నవాళ్ళు వెళ్లిపోయిన తరువాత వాళ్ళని గురించి తలుచుకునేవాళ్ళకి, మాస్టారుని తలుచుకునే వాళ్ళకి లెఖ్ఖ వేసి చూసుకుంటే సంఖ్యలో ఎక్కడా పోలిక వుండదు. ఏమిటి తేడా అంటే the belongingness is showed in his actions. ఎక్కడ కష్టం వుందో, ఎక్కడ నష్టం వుందో, ఎక్కడ అసౌకర్యం వుందో అక్కడ నిలబడేవాడు నిజమైన సాధకుడు. ఎక్కడ లాభం వుందో, ఎక్కడ సౌకర్యం వుందో, ఎక్కడ జయం వుందో అక్కడ manage చేసేవాడు దొంగ. సౌకర్యంగా వుండేచోట ఉపన్యాసాలు చెప్పుకుని, అసౌకర్యంగా వుండేచోట service కి పనికి రాలేదనుకొండి, వాడివల్ల ఏమీ ఉపయోగంలేదు. The key to ఈశ్వరత్వం is in this. అది కేవలం మనుష్యులకే పరిమితం చేసుకోనఖ్ఖర్లేదు. పశుపక్ష్యాదులకు, వృక్షాలకు పెంచుకోవచ్చు. చూస్తూ ఉండగానే మన కళ్ళముందు ఒక మొక్క చచ్చిపోతూవుంటే మనం ఒక్క చెంబెడు నీళ్ళు పోయ్యలేదంటే, మనకి సమాధి కట్టేసినట్టే. మనంచూస్తూ ఉండగానే అన్నంలేక ఎవరో చచ్చిపోతున్నారనుకోండి, మనం చూస్తూ ఉండగానే నీళ్ళులేక

ఎవరో చచ్చిపోతున్నారనుకోండి, మనంచూస్తూ ఉండగానే ఒంటిమీద బట్టలేక చలికి గిజగిజలాడి పోతున్నారనుకోండి, లోపలికి వచ్చి నారాయణకవచం చదివేసి, ఓంకారం చేస్తే ఉపయోగంలేదు. అందుకని service ని పెంచుకుంటే ఇవన్నీ చాలా సులభంగా తెలుసుకోడానికి అవకాశం వుంటుంది. దాన్ని పెంచుకోకుండా ఇవన్నీ తెలుసుకుంటే అది విజ్ఞానం అవుతుంది. దాన్ని పెంచుకుంటే అందులోంచి భక్తి, శ్రద్ధ అన్నీవస్తాయి, భగవంతుని సాన్నిధ్యం వస్తుంది. భగవంతుని సాన్నిధ్యం వస్తే మనం చదువుకోవడంతో సంబంధంలేకుండా అన్ని శాస్త్రాలూ వాటంతట అవే తెలియడం మొదలుపెడతాయి. అది మనకి ఈశ్వరత్వానికి సంబంధించినది. భగవంతునియందు సంభవం ఎలా వుంటుంది? భగవంతునియొక్క భావన ఎలా వుంటుంది? భగవంతుని యొక్క ప్రభుత్వం ఎలా వుంటుంది? భగవంతుని యొక్క భర్తృత్వం ఎలా వుంటుంది? భగవంతునియొక్క ఈశ్వరత్వం ఎలా వుంటుంది? మనలో సంభవం, భావన ఎలా వుంటుంది, మన భర్తృత్వం ఎలా వుంటుంది, మన ప్రభుత్వం అంటే మన administration ఎలా వుంది? మన administration అంటే, of the things that come out of us ఎలా ఉంది? మనకి ఈశ్వరత్వం ఎలా వుంది? ఈ పోలిక చూసుకుంటే భగవన్నామం మనకి సిద్ధిస్తుంది, భగవంతుని యొక్క అనుభూతి మనకి దక్కుతుంది.

## 40. స్వయంభూః

అంటే Self manifested. తనంతట తానే ఉద్భవిస్తాడట. ఆయన నుంచి ఆయనే ఉద్భవించి, ఆయన్ని ఆయనే తయారు చేసుకుంటాడట. తన నుండి ఉత్పన్నమైనదే సంకల్పము. సంకల్పం నుండి విరాట్ స్వరూపం. విరాట్ స్వరూపం నుండి పురుషుడు. పురుషుడ్ని బంధించి యజ్ఞం చేయడం వల్ల సమస్త సృష్టి వస్తుంది. ఈ విధంగా తనను తాను సమర్పణ చేసుకుంటే ఈ సృష్టి అంతా ఏర్పడుతుంది. తననుండే తాను పుట్టుక వచ్చే ఒక స్థితిని స్వయంభూః అంటారు. By It Self. మనమంతా ఆయన నుండి పుట్టిన వాళ్ళం కాబట్టి ఆయన యందు ఉన్నప్పుడు మనం ఉండం. ఆయనగా ఉన్నప్పుడు మనం ఉండడానికి అవకాశం లేదు. మనంగా ఉన్నప్పుడు ఆయనగా చూడడానికి ఒక అవకాశం ఉన్నది. చూడడం అంటే ఇక్కడ అనుభూతే తప్ప భౌతికమైన చక్షువులకు దొరికే విషయం కాదది. తన నుండి తాను మేల్కొంచగా ఒక సంకల్పం తన నుండి వచ్చింది. తన నుండి వచ్చిన సంకల్పానికి తనే బలం చేకూర్చి, తన లోకం నుంచి సంకల్పం బయటకు రాగానే ఒకరికొకరు ఉన్ముఖులు అవుతారట. ఎవరు? తను, తన సంకల్పం. తన నుంచి వచ్చింది కాబట్టి అమ్మవారు అని చెబుతుంటారు. సంకల్పాన్ని అమ్మవారు అనడంవల్ల, ఆయన్ని అయ్యవారు అనడం తప్ప, సంకల్పం రాక ముందు అయ్యవారు, అమ్మవారు అనడానికి వీలులేదు. ఎందుకంటే అయ్యవారు అనాలంటే ఒక అమ్మవారు ఉండాలి. అమ్మవారు అనాలంటే ఒక అయ్యవారు ఉండాలి. ఇద్దరు కలిసి ఉన్న స్థితిలో అమ్మవారు అంటారా? అయ్యవారు అంటారా? అమ్మవారు, అయ్యవారు గా ఏర్పడిన స్థితిలో అమ్మవారు అనేవారు కొంతమంది, అయ్యవారు అనేవారు కొంతమంది. అయ్యవారు అనే వారందరూ బ్రహ్మవిద్య అని వాళ్లొక పాయ లాక్కున్నారు మొత్తం విజ్ఞానాన్ని. అమ్మవారు అనుకునేవాళ్ళు శ్రీవిద్య అని ఇంకొక పాయ లాక్కున్నారు. రెండూ ఒకటే అనే యోగస్థితి యందు మరియొక పాయ ఏర్పరుచుకున్న వాళ్ళు యోగులు. "ఏమి లేనట్టి గగనాన ఇమిడి ఉండి, అన్నీ ఉన్నట్టి భువికి అవతరించు" అని మాస్టర్ గారు ఒక పద్యం వ్రాసారు. ఏమీ లేనట్టుగా ఉంటుందట. అక్కడ నుంచి వస్తుందట. మనకి కూడా ఏమీ లేని స్థితి నుంచి ఒక ఆలోచన బయటకు

వస్తుంది కదా! మనకి ఏమీ లేని  స్థితి అసలు ఉండదు. ఎందుకంటే ఎప్పుడూ ఏదో ఆలోచన వస్తుంది కాబట్టి. కానీ ఏమీ లేని స్థితి మనం ఒకటి అనుభూతి చెందినట్లైతే  అందులో నుంచి మనకి "ఏ విధంగా ఒక సంకల్పం బయటకు వస్తోంది" అన్నది తెలుస్తుంది.  మన నుంచే వ్యక్తం  అవుతుంది. లేకపోతే వ్యక్తమయ్యే వాటికి మనకి అధికారం, స్వామిత్వము లేదు. భగవంతుని నుండి వచ్చేవాటిలో తానే  వ్యక్తమవుతాడు. తన నుండి వచ్చే సంకల్పము తానే! కాబట్టి స్వయంభూః, అన్నారు. ఆకాశం లాగా ఉండే  స్థితి నుంచి ఒక సంకల్పం ఒక తరంగం లాగా బయలు దేరితే. ఆ  తరంగానికి  తనకి గల పరస్పరత్వము శక్తిగా తయారయితే, అందులోంచి ఒక మనస్సు పుడితే, ఆ మనస్సులోంచి ఈ సృష్టి అంతా పదార్థమయంగా ఏర్పడుతుంది. అంటే  మొదట సంకల్పం వస్తుంది. తరువాత సంకల్పానికి బలం చేకూర్చే శక్తి వస్తుంది.  అందుకని  భగవంతుడి నుంచి దిగి వచ్చే మొదటి  triangle ఏదయ్యా అంటే  భగవంతుడు, ప్రకృతి, శక్తి. లేదా పురుషుడు, ప్రకృతి, శక్తి. శక్తి లేకుండా  ప్రకృతికి  కదలిక రాదు. మన శరీరం పదార్థం కదా! ఈ పదార్థానికి శక్తి ఉండడం, లేకపోవడం, తక్కువ అవడం మనం చూస్తూంటాం గదా!  మనం ఉన్నా మన శక్తి బట్టి మన పదార్థం యొక్క కదలిక ఉంటుంది.  ఏంట్రా అట్లా కూర్చుండిపోయావు అంటే,  ఓపిక లేదురా, అంటాం. ఓపిక లేకపోవడం అంటే శక్తి లేకపోవడం అన్నమాట. ఈ శక్తిని ఆధారంగా ప్రకృతిని మార్చుకుంటూ సృష్టి  చేసుకురావటమనే ఒక పద్ధతి ఉన్నది.  "Nature unaided falls" అని Madam Blavatsky  ఒక statement ఇచ్చింది.  ప్రకృతికి ఈ శక్తి యొక్క బలం లేకపోతే అది పడిపోతుంది.  పురుషుడి నుంచి వ్యక్తమైన ప్రకృతికి, పురుషుడి నుంచే వ్యక్తమైన శక్తియే బలాన్ని కలిగిస్తూ, ఆ ప్రకృతికి మార్పులు చేస్తూంటుంది. పురుషుడు ఏమి చేయడు. ఆ రెండూ ఆయన నుంచే బయటికి వచ్చి ఒకదానినొకటి అల్లుకొంటూ జమిలిగా సృష్టి  చేసుకుంటూ వెళ్ళిపోతుంటాయి. ఆయన ఆ శక్తి ద్వారాను, ఆ ప్రకృతి ద్వారాను వ్యాపనం చెందుతుంటాడు. ఈ వ్యాపనం చెందడం ఏ విధంగా జరుగుతోందో మనయందు మనం గమనించాలి.  మనలో గూడా సంకల్పం వస్తుంది గదా!  మనలో సంకల్పాలు వచ్చినప్పుడు, ఆ అన్ని సంకల్పాలు నెరవేరవేం?  సంకల్పం తప్ప బలం లేదు.  సంకల్ప బలం కలిగినవాళ్ళకి ఏమవుతుంది?  సంకల్పించిన  దానికి సిద్ధి కలుగుతుంది.  మనకు బోల్డు సంకల్పాలు వస్తుంటాయి. అన్నీ దారిలోనే, పురిట్లో

సంధి కొట్టినట్లు అంటారు చూసారా, అలా ఉంటాయి. Abortions ఎక్కువ, delivaries తక్కువ. పూర్తిగా దాన్ని భరించి, దాన్ని సృష్టించి, భూమికి అందించలేం. కారణం ఏమిటయ్యా అంటే బలం లేక! ఆ బలం భగవంతుని విషయంలో చూసుకున్నట్లయితే చాలా ఎక్కువగా ఉంటుంది. సంకల్పబలం కలిగి ఉండటం అనేది శక్తి కలిగి ఉండటం. సంకల్పాలకేం ప్రతి వాళ్ళకి పుడుతుంటాయి పుట్టలు పుట్టలుగా. ఇన్ని సంకల్పాలలో కనీసం 1/1000 th కూడా manifest ఎందుకు కాదు? సిద్ధి ఎందుకు రాదు? పరిపూర్ణత ఎందుకు కలగదు సంకల్పానికి? శక్తి తక్కువగా వుండడం వలన కలుగదు. సంకల్ప శక్తి, అంటారు. సంకల్పము! సంకల్పాన్ని నడిపించే శక్తి. అది ఎక్కడ నుంచి వస్తుంది? భగవంతుని నుంచే! నేను అనే ప్రజ్ఞ నుంచి వస్తుంది. ఇది చాలా ముఖ్యమైన విషయం. Madam Blavatsky Secret Doctrine 3వ volume లో ఈ విషయం అందించడానికి చాలా ప్రయత్నం చేశారు. మనకి అన్నీ తెలుసు అనుకుంటాం కానీ, అన్నీ కలబోసేసుకుంటాం. కాబట్టి ప్రకృతి అన్నా శక్తి అన్నా అన్నీ ఒకటే. శివశక్తి అంటాం కదా. 'శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితం' అంటాం గదా! శక్తి వేరు, ప్రకృతి వేరు గుర్తుపెట్టుకోండి. అందుకనే ప్రకృతిశక్తి, అంటుంటాం. శివశక్తి, అంటుంటాం. మనలో శక్తి సమంగా లేకపోతే మనలో నుంచి వచ్చే సంకల్పాలు నెరవేరవు. భగవంతుని సంకల్పము స్వయంభూ: అంటే తానే ప్రకృతిగా వ్యక్తమవుతాడు. తన నుండే శక్తి వ్యక్తమవుతుంది. ఈ శక్తి వ్యక్తమవటాన్నే 'అగ్ని యొక్క ఆవిర్భావము' అని కూడా చెబుతారు పెద్దలు. అక్కడ నుండి పుట్టుక వస్తాడు అగ్ని. పెళ్లి చేసుకున్న తరువాత శివుడు పార్వతి కలిసి friends లాగా జీవిస్తుంటారు. మనలాగా పెళ్ళయిన మర్నాటికే కార్యానికి ముహూర్తం పెట్టుకొనే పద్ధతులు సాదాసీదా మహాత్ములకు ఉండవు. పవిత్ర మూర్తులు పెళ్లి చేసుకోవడం అందుకు కాదు. కలిసి జీవించడానికి. నిజంగా పవిత్రత కలిగిన జీవులకి పెళ్లి అంటే స్త్రీ పురుషుల యొక్క సహజీవనంగా ఉంటుంది. సహజీవనంగా ఉండి సత్సంతానం కలగడానికి సంకల్పం తమ యందు ఉద్భవించినపుడు, ఆ సంకల్పాన్ని నిర్వహించడానికి వారు సహకరిస్తారు. అది పరిపూర్ణ ఆరోగ్యము గల స్త్రీ పురుషుల యొక్క సహజ స్వభావము. దానితో ఇప్పుడు ఉండే స్త్రీ పురుషుల యొక్క అవగాహన compare చేస్తే, హస్తి-మశకంత తేడా ఉంటుంది. మనం సంతానం కోసం కాదు కదా! అసలు పెళ్లి అంటే అందుకే

అన్న స్థితికి దిగజారిన వారికి ఇది అర్థం కాదు. సాదా సీదా పవిత్రత కలిగిన వారికే సహజంగా సహజీవనం తప్ప మిగతా కార్యక్రమం, సంతానమునకు సంబంధించిన కార్యక్రమము ఉండదు. ఆది దంపతులు ఆయిన శివుడు పార్వతి ఎట్లా ఉంటారు? అతిలోక సుందరి అయిన పార్వతీ దేవి తపస్సు చేస్తుంటే కూడా శివుడెంతకీ లభ్యం కాడు. మామూలుగా మనం అందంగా ఉన్నట్లయితే ఎదుటి పురుషుడిని ఆకర్షించి పెళ్లి చేసుకునే పద్ధతులు చాలా ఉంటాయి గదా! ఆ విధంగా ఆకర్షించి పెళ్లి చేసుకోలేమని చెప్పి పార్వతీదేవికి తెలుసు. తల్లితండ్రి పెళ్ళీడు వచ్చింది పెళ్ళి చేస్తాము, అంటే వస్తా అంటుంది. ఎక్కడికే అంటే, తపస్సుకి అంటుంది. పెళ్ళి చేస్తామంటే తపస్సేమిటి? పెళ్లికూతురు పెళ్ళికి బదులు తపస్సు అంటే ఎట్లా ఉంటుంది? ఏమిటమ్మా తపస్సు ఎందుకంటే, శివుణ్ణి వరుడిగా పొందాలనుకుంటున్నాను నేను, కాబట్టి తపస్సుకి వెళుతున్నాను, అంటుంది. పర్వత రాజు కూతురు కాబట్టి 'పార్వతి' అని పేరు. ఇట్లా వెళుతుంటే వాళ్ళమ్మ చాలా కంగారు పడుతుంది. ఇదేమిటి శివుడ్ని పెళ్ళి చేసుకోవటమేమిటి అని. శివుడ్ని పెళ్ళి చేసుకోవాలంటే రకరకాల భావాలు వస్తాయి. ఒకటి ఏమిటంటే ఉద్యోగం లేదు. ఆస్తి అసలు లేదు. రోజూ భిక్షా పాత్ర పట్టుకు తిరిగేవాడిని ఎవరు అల్లుడ్ని చేసుకుంటారండి? కష్టం కదా! శివుడు ఎందుకు భిక్షాపాత్ర పట్టుకు తిరుగుతుంటాడట అంటే మన పుర్రె నిండా ఉండే బొద్దింకలు, నల్లులు, తేళ్ళు, పాములు ఇవన్నీ ఇందులో పడేయండిరా, హాయిగా ఉంటారు, అని. తనకై ఏమి అక్కర లేదు. మనం బావుండటం కోరుకుంటాడు. అదీ శివుడంటే! ఒంటికి సరియైన బట్ట ఉండదు కదా! ఒక ఏనుగు చర్మం కట్టుకు తిరుగుతున్నాడు. అటువంటి వాడిని చేసుకుంటాను అంటే, తల్లి కంగారు పడుతుంది. వద్దు తల్లీ, అంటుంది. వద్దమ్మా, అని ఎవరన్నా పేరు పెట్టుకుంటారా? వద్దమ్మా అంటానికి సంస్కృతంలో 'ఉమా' అంటారు. 'ఉ' నువ్వు 'మా' వద్దు. వెళ్ళొద్దు, అని చెబుతుంది వాళ్ళమ్మ. అంటే నవ్వుతుంది పార్వతీదేవి. మామూలు ఇహలోకానికి సంబందించిన తల్లి వలె నువ్వు వెళ్లవద్దు. ఉమా, ఉమా, ఉమా, అని చెబుతుంది. --ఏ తల్లికైనా సంతానం విషయం వచ్చేసరికి తల్లికేమిటి, తండ్రికైనా సరే ఒక రకమైన మమకారపు పొర వస్తుంది. ఎంత మహాత్ములకైనా సరే! -- తల్లి అలా చెప్తే పార్వతి నవ్వుతూ వెళ్ళి పోయి తపస్సులో కూర్చుంటుంది. ఎన్నాళ్లు తపస్సు చేస్తే అయ్యేను పని? ఎందుకంటే ఆయన బొత్తిగా ఆడవాళ్ళ వైపు చూట్టం వుండదు.

అందుకనే ఈ దత్తాత్రేయ మార్గంలో, అవధూత తత్వములో ఆడవాళ్ళ వైపు చూడటం వుండదు. ఆడవాళ్ళ వైపు బొత్తిగా చూడని తత్వంలో వుండే ఆ hierarchy కి Head శివుడు. చలించే వ్యవహారం కాదు. ఆయన్ని కోరింది. మనసా వాచా కర్మణా శివుని తప్ప మరొకరిని పెళ్లి చేసుకోలేని స్థితికి ఎదుగుతోంది. తపస్సు ద్వారా అగ్నిని పెంపొందింపచేసుకుంటూ, పవిత్రీకరించుకోంటోంది. మనలాగా ఏదో రెండు మూడు సార్లు నారాయణ మంత్రం చదివి చాలా పవిత్రులమైపోయామనే స్థితి కాదు కదా! అప్పటికే సహజంగా పవిత్రత కలిగిన పార్వతీదేవి శివుడి గురించి ఎన్ని సంవత్సరములు తపస్సు చేసిందో? తపస్సు అంటే ఏమిటి? ఒక సంకల్పానికి బలం చేకూరుస్తుంటే మంట పుడుతుందిట. దానిలో అగ్ని పుట్టి తనని, తన పరిసరాల్ని ప్రజ్వలింప చేస్తూ, ప్రకాశింపచేస్తూ వ్యాపనం చెందుతూ వుంటుంది. ఒక idea మనకు రావాలంటే ప్రహ్లాదుడు సినిమాలో హిరణ్యకశిపుడు తపస్సు చేసే సీను చూపించాడు. వాడు క్రుంగి కృశించి పోతూ వుంటాడు. వాడి నుంచి జ్వాల ఒకటి వచ్చి, లోకాలని ఎండాకాలంలాగా వేడి ఎక్కించేస్తూ వుంటుంది. సృష్టిలోని సమస్త లోకాలు ఆ వేడి భరించలేకపోతాయి. ఇదేమిట్రా ఇంత వేడి ఎక్కడి నుంచి వస్తోంది అని చూస్తే మనవాడి తపస్సు అన్నమాట. ఇట్లా పార్వతీదేవి తపస్సు చేస్తుంటే ఎన్ని లోకాలన్నా కదలొచ్చుగాని, శివుడు కదలడు. ఎందుకంటే లోకాలన్నింటిని అట్లా పొట్టలో పెట్టుక్కూర్చుంటాడు కాబట్టి. ఇట్లా వుంటే, చూసాడు చూసాడు చూసాడు మన్మథుడు. 'పాపం ఈవిడ ఏమిటి అమాయకురాలు. చాలా కష్టపడుతోంది. మనమేదో కొంత ప్రయత్నం చేద్దాం? ఏం, మహాశివుడైతే మాత్రం మన దెబ్బకి పడడా' అనుకొని, పూల బాణం తీసుకొని వేస్తాడు. మాటిమాటికి వేస్తుంటే, 'ఎవడురా వాడు పూచికపుల్లలు వేస్తున్నాడు' అని కళ్ళు తెరుస్తాడు. అంతేగానీ భస్మం చేద్దామనే వుద్దేశ్యం కాదు. కళ్ళు తెరిచేసరికి ఇంతటి మన్మధుడు భస్మపురాశి అయిపోయాడు. శివుడు చూస్తే అట్లా అయిపోతుంది. శివుడు మనల్ని చూడాలనుకుంటే ఎట్లా? మన్మధుడికే దిక్కు లేనప్పుడు మనము ఎంతండి? మన్మధుడు ఎవరు? సరాసరి విష్ణుమూర్తి నోటిలోంచి వూడి పడ్డాడు. సామాన్యుడేం కాదు. అటువంటి మన్మధుడిని ఏదో పూచికపుల్ల తగిలింది కదా అని చూస్తే వాడు భస్మం అయిపోయాట్ట. అటువంటి శివుడ్ని పార్వతీదేవి పెళ్లి చేసుకోవటానికి సంకల్పించింది అంటే, ఎట్లా వుంటుంది చెప్పండి ? ప్రకృతి

పురుషుడ్ని ఆశించడం అనేది సహజమైన స్థితి. సృష్టికి సంబధించిన ప్రకృతి పార్వతి అయితే, సృష్టికి సంబధించిన పురుషుడు శివుడైతే వాళ్ళిద్దరి మధ్యా ఇంకొకళ్ళు జోక్యం కల్పించుకుంటే మాడిపోతారు. ఎవరు వుండగలరు అంటే అగ్ని మాత్రం వుండగలడు. సరే మొత్తానికి ఇతను భస్మమైపోతే దేవతలందరూ ఎలారా? అని బాధ పడుతుంటే వారి ప్రార్థనలను విని పార్వతిని అనుగ్రహిస్తాడు శివుడు. అనుగ్రహించిన తర్వాత శివపార్వతుల యొక్క వివాహం అవుతుంది. దేవతలందరికి సృష్టికి సంబధించిన కొన్ని schemes ఉంటాయి. పార్వతీదేవిని శివుడు పెళ్లి చేసుకుంటే బావుండునని కొన్ని సంవత్సరాలనుంచి wait చేస్తుంటారు, ఎందుకంటే తారకాసురుడు అనేవాడిని సంహరించాలి. సంహరించాలి అంటే ఆది దంపతులయందు వ్యక్తమైన కుమారుడే అందుకు తగిన వాడు. శివుడి రేతస్సునుండి ఉద్భవమైన కుమారుడు మాత్రమే తారకాసురుడిని వధించగలడు. అందుకని దేవతలందరూ పార్వతీదేవి శివుడ్ని పెళ్లి చేసుకోవాలని చాలా తాపత్రయపడతారు. వీళ్ళిద్దరూ పెళ్లి చేసుకుంటారు గానీ సహజీవనమే తప్ప ఇంకొకటి వుండదు. ఎన్నాళ్లు పోయినా ఇంతే. అతిలోక సౌందర్యవతి అయిన భార్య వున్న శివుడు, ఆనందిస్తుంటాడు సౌందర్యం చూసి. తనతోపాటు అక్కడికి తీసుకువెళ్లడం, ఇక్కడికి తీసుకువెళ్లడం, తరువాత ఏమనిపించిందంటే dance చేసుకుందామని. సరే అట్లా dance చేస్తున్నారుట. ఎప్పటికి అయ్యేను dance? ఆయన ఒకటి చేస్తుంటే ఈవిడ ఒకటి చేస్తుంది. ఈవిడ ఒకటి చేస్తూంటే, ఆయన ఒకటి చేస్తాడు. ఇట్లా ఇద్దరూ కలిసి చేస్తూ వుంటే, ఎందుకు పెళ్లి చేసుకున్నారు ఇద్దరూ అనేది మర్చిపోయారు. మన లెక్కలో వాళ్ళు చాలా మరుపు కలిగినవాళ్లు. కానీ వాళ్ళు అట్లా వుండిపోతే దేవతలకి బాగా నిరుత్సాహపడిపోతారు. ఇది కుదిరే పని కాదు. ఆయనకేమి అఖ్ఖర్లేదు. ఈవిడ ఆయనలో చేరింది. మతిమరుపు వచ్చేసింది పూర్తిగా. ఇక ఎవడన్నా వాళ్ళ దగ్గరి నుంచి రావడం, అతన్ని తీసుకుని మనం తారకాసురుడ్ని చంపడం కల్లో మాట. మన బతుకింతే, అని ఏడుస్తారు. పోనీ వెళదాం అంటే శివుడు చూస్తే కష్టం కదా! ఎవడన్నా వస్తే ఆయన చూస్తే finish. పార్వతీదేవి తన తపశ్శక్తి వలన ఉద్భవించిన పవిత్రత కారణంగా ఆయన దగ్గర వుండ గలుగుతోంది. మనకు ఒక precedent వుంది. మన్మధుడు కాలిపోయాడుగదా ! ఆ context లో ఎవరు వెళ్ళగలరు? అప్పుడు ఆలోచించి, ఆలోచించి 'అగ్నియే దీనికి సమర్ధుడు' అని నిర్ణయం చేసుకుంటారు దేవతలు. 'అగ్నే

వినయతి ఇతి అగ్నిః' అన్నారు. అంటే అందరికంటే ముందు నిలబడేవాడు అని. ఏ దేవత కివ్వాలన్నా అగ్నికిస్తే ఇచ్చేస్తాడు. ఎవరి కన్నా ఇవ్వమని మనకిస్తే, మనం ఇవ్వకపోవచ్చు. కానీ అగ్ని అట్లా చెయ్యడుకదా! ముందు నిలబడతాడు గదా! నాయనా ఇటువంటి situation లో వెనక నించుంటే ఎట్టాగు? ఇప్పుడు నీదే కార్యక్రమం, అని చెబుతారు. నువ్వు ఎలా అయినా వెళ్ళి ఆయన చెవిలో ఊదితే బావుంటుంది ఇదీ విషయమని. ఆయనకేమీ బొత్తిగా పట్టకుండా కూర్చున్నాడు. అంటే అగ్నిదేవుడు కూడా చాలా భయపడుతూ వెళతాడు. ఎట్లా వెడితే బావుంటుందా, అని చూస్తాడు. తెల్లపావురం రూపంలో బిక్కుబిక్కుమంటూ వెళతాడు. పైగా మొగుడు పెళ్ళాం ఏకాంతంగా ఉంటే అక్కడికి వెళితే ఎట్లా ఉంటుందండి? ఎటువంటి భావన రావలసిన stage అది. శివుడు predictable కాదు. ఆగ్రహానుగ్రహములు గలిగిన స్థితి కదా! అందుకని ఎంతో జాగ్రతతో దగ్గరికి జేరతాడు. ఏదో వచ్చింది, అని శివుడు పక్కకి చూడబోతుంటే, గట్టిగా చూడబోకండి మహాప్రభో, అని దణ్ణం పెట్టేసుకుంటాడు. 'నేను అగ్నిదేవుణ్ణి! దేవతల కార్యం గురించి మీ వద్దకు వచ్చాను. తమరు కరుణించి నన్ను అనుగ్రహించండి' అంటాడు. ఏమిట్రా ఇది నేనేమీ చేయకుండానే గొడవ చేస్తున్నావు. ఏమిటి విషయం? అని అడిగితే చెబుతాడు. 'నీ రేతస్సులో నుండి పుట్టిన మహాత్ముడు మాత్రమే తారకాసురుణ్ణి చంపగలడు. ఆ తారకాసురుణ్ణి చంపాలంటే నీ కుమారుడు కావాలి. వాణ్ని పొందాలని మేమంతా ఒక scheme వేసి ఈవిడని నీ దగ్గరకు వంపించాం. ఆవిడా మర్చిపోయింది. నువ్వూ మర్చిపోయావు. మాగతి ఇట్లా ఉంది' అంటే ఆగ్రహించకుండా అనుగ్రహిస్తాడు. పట్టుకుపో అని ఇస్తాడు తన రేతస్సు. ఆయన దోసిలో పోసేస్తాడు. పట్టుకుపొమ్మని ఎందుకు చెబుతున్నానంటే అగ్ని మాత్రమే పార్వతీదేవిని శివుడు దగ్గరకు చేర్చగలిగింది. శివుడి దగ్గరకు మళ్ళీ వెళ్లగలిగింది అగ్ని. ఈ అగ్నియే నేను ఇందాకటి నుంచి చెబుతున్న సంకల్పబలం. బాగా సోమరిపోతు అంటే ఏమిటంటే అర్థం, లోపల ఏమీ లేదని. కొట్టినా ఏంకాదు వాడికి. సిగ్గులేదురా, అంటే ఇహిహి అంటాడు. సోమరిపోతుతనం ఎందుకు వస్తుంది అంటే లోపల వేడిమి తక్కువ ఉంటే వస్తుంది. ఎప్పుడూ ఆరి పోతూ ఉంటుంది. పొద్దున్నే లేవలేడు. లేచినా ఏం చేయాలో గుర్తుండదు. అన్నీ చెబుతూ ఉండాలి. తొందరగా బయలుదేరడు. ఏ పనీ సమయానికి చేయడు. ఎందుకయ్యా అంటే బద్ధకం. అగ్ని చేతుల్లో పోసేశాడండీ శివుడు రేతస్సు

పట్టుకుపోరా, అని చెప్పి. అగ్నికన్నా వేడిగా ఏమైనా ఉంటుందా? అగ్నియే పరాకాష్ఠ వేడికి. అగ్నిదేవుడే పట్టుకుంటే చేతులు కాలుతాయి ఆయనకి. అదీ, శివునియొక్క రేతస్సు అంటే! ఇక శివుడేమిటో అర్థం చేసుకోండి. అగ్నికే 'ఇది అగ్నిగుండమా,' అనిపిస్తుంది. అటువంటి దాన్ని 'బాబోయ్ దీనిసంగతి నేను చూడలేను' అని చెప్పి తీసుకువెళ్లి సప్తఋషులభార్యలు గంగానదిలో స్నానం చేస్తుంటే (except అరుంధతి) గంగలో వదిలేస్తాడు, నువ్వే భరించు అని. పార్వతికి అవసరం లేదు. ఆవిడకి ఒక కొడుకేమో ఒంటినుండి నలుగు పిండి నుంచి వచ్చేశాడు, వినాయకుడు. ఇంకొక కొడుకు శివుడు నుంచి directగా వచ్చేశాడు. Delivery problem లేకుండా ఇద్దరు కొడుకులు పార్వతీదేవికి. ఒకడు తల్లికి కొడుకు. ఒకడు తండ్రికి కొడుకు. Son of the mother పార్వతీకుమార్, అన్నమాట వినాయకుడంటే. శివ కుమార్ కుమారస్వామి. కాబట్టి రేతస్సుని గంగలో వదిలేశాడు. మనం గంగలో వదిలేయడానికి, అగ్నిదేవుడు గంగలో వదిలేయడానికి చాలా తేడా ఉంది. మనం ఏదైనా వదిలేయటం అంటే ఏమన్నా అక్కరలేకపోతే వదిలేస్తుంటాం. గంగపాలు చేసావే, అంటుంటాం గదా! అట్లా మనవాడు కూడా గంగపాలు చేస్తాడు. గంగకి వెర్రులు ఎత్తిపోతాయి ఆ వేడికి. బాబోయ్ ఏం చేద్దాం, అనుకుంటుంది. అప్పుడే పొద్దున్న స్నానానికి వస్తుంటారు, సప్తఋషుల భార్యలు ఆరుగురు అరుంధతి తప్ప. వాళ్ళు నదిలో స్నానం చేస్తున్నంత సేపు బాగానే ఉంటుంది. బయటకు వచ్చిన తరువాత గంగ వెర్రులెత్తిపోతుంది ఒళ్ళు అంతా. ఇదేమిటే గంగలో స్నానం చేస్తే శమము కలగాలి కానీ గంగ వెర్రులు ఎత్తుతున్నాయేమిటి, అని కళ్ళు మూసుకొని ఆలోచిస్తే అంతా అర్థమైపోతుంది. అమ్మ బాబోయి అనుకుని, అక్కడ రెల్లు పొదలు ఉంటే అక్కడ వదిలేస్తారు. అక్కడ రెల్లు పొదలలో ఉద్భవిస్తాడు కుమారుడు. ఉద్భవించడం, ఉద్భవించడమే ఐదు ఏండ్ల కుమారుడైపోతాడు. పదండిరా యుద్ధానికి, అంటాడు. అదీ కుమారస్వామి. పదండిరా మీ problem నేను చూస్తాను, అంటాడు. ఈ దేవతల సమూహాలన్నీ ఐదేళ్ళ పిల్లవాడు lead చేస్తుంటే చావగొట్టేస్తారు ఆ తారకాసురుణ్ణి. అప్పుడు తండ్రి దగ్గరకు వస్తాడు. అటువంటి వాడికి ఈ గణాధిపత్యం time వచ్చేసరికి మరి natural కదా, పక్కన అన్నయ్యని చూస్తే doubtగానే ఉంటుంది కదా! పుట్టీ పుట్టంగానే దేవతలందరినీ lead చేసిన వాడు కుమారస్వామి. మనం తెలియక ఊరకనే ఇంట్లో ఫోటో పెట్టుకుని దాని మొహం చూడకుండా, దానికో పువ్వు

పెట్టకుండా, దాన్ని తుడవకుండా ఉంచేస్తాం. పెట్టుకోకూడదు. పెట్టుకుంటే దానికి కావలసినట్లు సేవ చెయ్యాలి. శరవణభవ అంటాం కదా! ఇదంతా శక్తి అంటే అట్లా ఉంటుంది అని చెప్పడానికి నా తాపత్రయం అంతా. ప్రకృతిని శక్తి నడిపిస్తూ ఉంటుంది. ప్రకృతి విష్ణువులోంచే వచ్చింది. శక్తీ విష్ణువులోంచే వచ్చింది. ఈయనతో కలిపి ఒక త్రిభుజమవుతారు వాళ్ళు. మొదటి త్రిభుజమది సృష్టికి. One springs from the other. Then the second develops. ప్రకృతిని తనలోంచి వచ్చిన శక్తితో పరిణామం చెందించి సృష్టిని తయారు చేస్తాడు. అదీ సృష్టి వ్యక్తం అవటమంటే. మనం గూడా అట్లాగే చేయాలి. ఊరికే సృష్టిస్తాం తప్ప, పోషించం, నిలబడం. మనమూ స్వయంభువులమే. అదొక type స్వయంభువులం. మనలోంచి సంకల్పాలు పుట్టటంలో ఏం తక్కువ లేదు. తేడా ఎక్కడంటే ఆ సంకల్పానికి ఇచ్చే బలం ఏదైతే ఉందో అక్కడ. మన దగ్గర సరకు లేదు. సరకు లేదా? ఉంది కానీ ప్రసరించదు. ఎందుకంటే చాలా రకాలైన అడ్డగోడలు కట్టేస్తున్నాం కాబట్టి ప్రసరించదు. ఇవాళ సంకల్పం చేస్తే అది మర్చిపోతాము. 21 సార్లు 'ఓంకారం' అనుకున్నాం అనుకోండి ఎన్నాళ్లు చేయగలం? ఏదో ఒక రోజు రెండు రోజులే ఎందుకంటే బలం లేదు. బలం లేకపోతే ఏమీ చేయలేరు. కాబట్టి అమ్మవారిని, ఆ ఆదిపరాశక్తిని బాగా ఆవాహనం చేసుకో అంటాము. "దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే" అంటుంటాం గదా! శక్తితో వాణ్ణి వాడు ధ్వంసం చేసుకోవచ్చు. సంస్కరించుకుని శక్తి తెచ్చుకున్నట్లైతే జగత్కళ్యాణమైన కార్యక్రమములు వాడి నుండి వ్యక్తమై పరిపరిపూర్ణత చెందుతాయి. స్వయంభూః అంటే అట్లా పుట్టుక వస్తాడు. ఆయనే అమ్మవారు, శక్తి. అది ఒక నామం భగవంతునిది. ఈ నామం గురించి చెప్పుకుంటే అసలు సృష్టి ఎలా మొదలయింది తెలిసిపోతుంది. ఈ ముగ్గురూ మొదటి త్రిభుజం. First triangle.

## 41. శంభుః

'శంభుడు' అంటే మన లెక్కలో శివుడు గదా! 'శంభో' అంటే బాబోయ్ అన్నట్లుగా ఉంటుంది. 'శం' శబ్దం అతి పవిత్రమైనది. మనకు శాంతి కలిగిస్తుంది. శాంతి కూడా దానికి సంబందించినదే. High B.P. ఉండే వాళ్ళు రోజూ 'శం' అని చేసుకుంటే బాగా తగ్గిపోతుంది. అంటే Flow of energy లో ఉధృతం లేకుండా చేస్తుంది. శమిస్తుంది. శమీ వృక్షం అంటారు కదా! ఆ పేరెందుకు వచ్చింది? ఆ' శం' కి సంబంధించిన తత్వం దాని యందు ఇమిడి ఉంది కాబట్టి, శమీవృక్షం అని పేరు వచ్చింది. శని కూడా శమాన్ని ఇస్తాడు. ఎందుకంటే, అవి వున్న వాళ్ళకే బాగా ఓర్పునిస్తాడు, క్షమనిస్తాడు. మిగతా వాళ్ళకి ఎప్పుడూ ఏడుపే, ఏదో చీకాకే, ఎప్పుడూ కొట్టుకుంటూ వుంటారు. కోప్పడుకుంటూ వుంటారు. తిట్టుకుంటూ వుంటారు. చికాకు పడుతుంటారు. పీక్కుంటూ వుంటారు. ఇవన్నీ ఏమిటంటే 'శం' లేకపోతే జరుగుతుంటాయి. శంభుడు అంటే peaceful existence. హాయిగా వుండే స్థితి అన్నమాట. ఎటువంటి హాయి అంటే అది ఎప్పుడూ వుంటుందిట. హాయి అనేది ఎప్పుడూ వుందిట. ఎప్పుడైనా వుందా మనకి? భగవంతుడు ఇంత చేస్తున్నా హాయిగా వుంటామటండీ! మనం కొంత చేసుకుని అందులో ఇరుక్కుపోయి, సొట్టబోయి, కన్నులొట్టబోయి--ఇలా ఉంటుంది. కనబడకపోవడమే కన్నుసొట్టబోవడం, ఏదో ఒక మాదిరిగా. Are we living life or living a way life? అన్నారు మాస్టర్ గారు. లాగేస్తున్నాం అంటే బరువు అన్నమాట కదా! బరువుంటే కదా లాగటం అన్నది. బరువు దేనివల్ల? శమము లేకపోవడం వల్ల. శమము ఎక్కడి నుంచి వస్తుంది? ఈ శమము అనేది చాలా అద్భుతమైన తత్వం. శంనో మిత్ర: శం వరుణ: అంటారు. ఎన్ని సార్లు 'శం' అంటాం? శం, అన్నది పరిపూర్ణంగా పలకాలి. శం, అన్నది పలకనివారికి ప్రశాంతత రాదు. కొన్ని ఆధ్యాత్మిక విద్యాలయాలలో "శం" చేసుకోమని ఇస్తుంటారు. Equilateral triangle ఒకటి ఇచ్చి, అంటే సమకోణ త్రిభుజం ఒకటి ఇచ్చి. అంటే దానిలాగా 3 చుక్కలు పెట్టుకొని, వాటిని చూస్తూ ఈ 'శం' అని చేసే శబ్దం యొక్క తరంగములు దేహములో అన్ని చోట్లకి కేంద్రం నుంచి వ్యాపనం చెందుతున్నట్లుగా భావన చేసుకుంటే, అందులోంచి ఎంతో relief వస్తుంది. అయితే

relief వచ్చినా మన సంకల్పముల యొక్క అభ్యాసంచేత పోగొట్టుకుంటుంటాం. ఈ శమమునే మనకి నిద్రలో కల్పిస్తుంటాడు భగవంతుడు. అందుకనే ఆయన శంభుడు. తాను హాయిగా వుండడమే కాకుండా మనకి కూడా హాయిని కల్పిస్తాడు. చాలా హాయిగా వుంది అనిపిస్తూంటుంది. అదీ శంభుడంటే! మనం 'శం' చేస్తుంటే కొంత ఉపశమనం కలుగుతుంటుంది. నిజంగా ఎప్పటికీ ఉపశమనం కలగాలంటే పెద్దలు చెప్పింది ఆచరించాలి. పెద్దవాళ్ళందరికీ పెద్దవాడు వున్నాడు కదా, కృష్ణుడు! శమము అనేది ఎట్లా వుంటుంది? ఏం చేస్తే వుంటుంది, అన్నది కృష్ణుడు చెప్పాడు. ఎందుకంటే ఆయనకన్నా అతి దరిద్రమైన సమస్యలు ఉన్నవాడెవడూ లేడు. ఆయనకన్నా అతి ప్రశాంతమైన వాడు కూడా ఎవరు లేరు. కృష్ణుడి యొక్క ముఖమును ఒకసారి చూసినట్లైయితే మనలో సహజంగా ప్రశాంతత రావచ్చు. రావచ్చు అని ఎందుకంటున్నానంటే మన బట్టి. అక్కడ ఉన్నప్పటికీ మనం తెచ్చుకోవాలి గదా! ఇంటినిండా కృష్ణుడి బొమ్మలు వున్నా మనం ఏడుపు ముఖంగా ఉండవచ్చు కదా! శ్రీకృష్ణుడు మనం ఏ విధంగా శంభుత్వం పొందవచ్చో చక్కటి ఉపదేశం ఇచ్చాడు. మొట్టమొదట ఈ 'శం' అనే శబ్దమును దేహామంతటా వ్యాపనం చెందే పద్ధతిలో అంటూ, వింటూ ఉండే పద్ధతిలో చేసుకోవాలి. తరువాత మనకి కర్మాచరణ ఒకటి ఉన్నది కాబట్టి, ఈ కర్మాచరణాన్ని మన యొక్క దృక్పథంతో సత్కర్మాచరణముగా మార్చుకోవాలి. పనులు మారవు. పనులలో దృక్పథం మారితే మామూలు పనులే సత్కర్మలై పోతాయి. సత్కర్మలని వేరుగా ఏమీ లేవు. దృక్పథంలో తేడా. ఇంట్లో వంట వండుతున్నామనుకోండి, ఇంట్లో అందరికీ ఆరోగ్యంగా ఉండాలి అని వంటచేసుకుంటే అది సత్కర్మ అయిపోతుంది. ఈ వెధవ వంట మనకే పెట్టాడు. ఈ మగవాళ్ళు హాయిగా తిరుగుతుంటారు రోడ్ల వెంబడి, వాళ్ళు వచ్చేసరికి మనం వండి పడేయలి గదా, అని తిట్టుకుంటూ ఆ పద్ధతిలో మనం వంట వండామనుకోండి, దుష్కర్మ అవుతుంది. ఎందుకంటే నువ్వు వండక పోతేపోయే, ఈ భావనల్తో వండేసరికి తిరగమోత వేసినట్లు తినేవాడికి అనారోగ్యం తథ్యము సుమతీ. హాయిగా వచ్చేస్తుంది. ఏదీ? అనారోగ్యం. మనకి అనారోగ్యము వచ్చేయటానికి కావలసిన దారులన్నీ సంసిద్ధంగా పెట్టుకొని ఉంటాం. అందులో ఇది ఒకటి. ఏ పనైనా సరే చేసుకొనే దృక్పథం బట్టి సత్కార్యం అవుతుంది తప్ప, సత్కార్యానికి వేరే ఒక చోటు పెట్టుకోనక్కరలేదు. సత్కర్యానికి వేరే ఒక చోటు పెట్టుకుంటే అసలు కార్యాలు ఎవరు చేస్తారు? అందరూ సత్కర్యాలు

అని ఉన్న పనులు మానేశారనుకోండి, క్రాఫు చేయించుకుందామని saloon కి వెళితే, 'వాడు service కి వెళ్ళాడు సార్ అంటే, Voluntary service అని ఈ మధ్య ఒక organisation పెట్టారు, అందులో చేరాడు.' అంటే, మనం జుట్టు పెంచుకుంటూ కూర్చోవాల్సిందే. బట్టల కొట్టుకు వెడితే వాడు ఆ మాటే అంటే, కూరగాయల కొట్టుకెళితే వాడూ ఆ మాటే అంటే, మూసేశాడండీ, service కెళ్ళాడంటే, పచారీ కొట్టుకెళితే వాడూ service కెళ్ళాడు అంటే, అందరూ service కు వెళితే, అసలు service ఎట్లా జరుగుతుంది? Railway వాళ్ళు, postal వాళ్ళు, electricity వాళ్ళు, రోడ్లు ఊడ్చేవాళ్లు అందరూ serviceకు వెళ్లిపోయారనుకోండి! అంటే మనం అనుకొనే service అదొక వెర్రి! అంతకన్నా ఏం లేదు. అది ఆవేశం. అసలు బొత్తిగా ఇంకొకళ్ళకి ఏమైనా చేద్దాం అనే భావన లేని దరిద్రపుగొట్టు స్థితిలో కొంత encouragement తప్ప, service అంటే it is a way of life! అంతే! జీవనవిధానం. నీ కర్తవ్యాన్ని నువ్వు సక్రమంగా ఇతరులకు మేలు కలిగేటట్లుగా ఆచరించటమే సేవ. నీ ఉద్యోగం నువ్వు సవ్యంగా చేసి, ఆ ఉద్యోగరీత్యా నీ దగ్గరికి వచ్చిన వాళ్ళకి నీ కర్తవ్యం మేరకు చేయవలసిందంతా చేసి, నీ వ్యాపారం నువ్వు సవ్యంగా చేసి, వ్యాపార దృష్ట్యా నీ దగ్గరకు వచ్చిన వాళ్ళందరితో చక్కగా కర్తవ్యాన్ని నిర్వర్తించుకుంటూ మోసం చెయ్యకుండా ఉంటే service. వంకరటింకర లేకుండా నువ్విచ్చే సలహా service. బట్టలు కుట్టడం నీ వృత్తి అయితే వేసుకునేవాడు మనం కుట్టిన బట్టలు వేసుకుని ఆనందంగా ఉండాలి అనుకొని కుట్టిచ్చాము అనుకోండి service. అందుకే మనకి ధర్మవ్యాధుడి కథ ఇచ్చారు. శుభ్రంగా మాంసం అమ్ముకుంటూ కూర్చుంటాడాయన. మహాయోగిట, మాంసం అమ్ముకుంటాడుట అంటే ఎవరు ఒప్పుకుంటారు ఈ రోజుల్లో. కోడిగుడ్డు ముట్టుకుంటేనే మనకేదో దేవుడు దూరమైపోతాడు అనుకుంటారు కొందరు. కోడిగుడ్డు ముట్టుకుంటే దేవుడు దూరం అవడు. మన భావన బట్టి అవుతాడు దూరమో దగ్గరో. గుడ్డు ఇంట్లో పొరపాటున కాకి తెచ్చి పడేసింది అనుకోండి ఒళ్ళంతా కంపరం వచ్చేస్తుంది. మన భావనలో తప్ప ఏముంది అక్కడ? అది చెప్పడానికే మాంసం రోజూ ఇంత కోసి, అందరికీ అమ్మి ఇచ్చే ధర్మవ్యాధుడి కథ మనకి ఇచ్చారు. Service పేరున కనీసం అప్పుడైనా వెర్రిపనులు, వెర్రి ఆలోచనలు, వెర్రి ఆవేశాలు దిగిపోతాయేమో అని! Let us remain in the system. మనకి ఒక economic activity వుంది. ఏమిటి?

పురుషుడుగా ఆర్థికమైన కార్యక్రమములలో మన కర్తవ్యం మేరకు పనిచేయడం. కుటుంబమునకు యజమానిగా, భార్యకు పిల్లలకి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడం. సంఘములో ఒక సభ్యుడుగా సంఘానికి కావలసినవి చేసి పెడుతుండడం. తను దేవతలనుండి పొందుతాడు గనుక దేవతలకి తన సహకారాన్ని అందించడం. జంతువుల నుండి పొందుతాడు కాబట్టి జంతువులకు తన సహకారాన్ని అందించడం. వృక్షాలనుండి పొందుతాడు కాబట్టి వృక్షాలకి తన సహకారాన్ని అందించడం. ఇంతే! ఇంతకు మించి serviceకి వేరే బోర్డు పెట్టుకోనక్కరలేదు. అంటే కర్మాచారణ మనేది సత్కర్మాచరణంగా మారాలి. మనం చేసే దృక్పథం మారితే అది మారుతుంది. నాతో మాట్లాడమే నీకు పెద్ద ఎడ్యుకేషనోయ్, అంటాడు కదా గిరీశం! అట్లా మనం చేసే ప్రతిదీ దృక్పథం మారితే service అయిపోతుంది. Service అనుకొని వెధవ పనులు చేస్తుండచ్చు గదా! ప్రపంచంలో సత్కర్మాచరణ పేర ఎంత దురాచారం జరుగుతోంది? ఎంత మోసం జరుగుతోంది? ఎంత మనుషుల భుజాలమీదకి ఎక్కి పనులు చేయించుకోవడం జరుగుతుంది? ఇదంతా సత్కర్మాచరణం కింద వెళ్ళిపోతుంటుంది కదా! నేను మంచి పనులు చేస్తున్నాను కాబట్టి మీ భుజాల మీద నుంచి నడచి వెళ్లిపోతుంటాను, మీరట్లా నిలబడండి అని చెప్పటం అన్న మాట! అదంతా లేదు మన పద్ధతిలో. చేస్తున్న పని సవ్యంగా, శ్రద్ధతో, ఆ పనికి మనం వాడే వస్తువుల్ని, పని చేసే మనుషుల్ని వీటి యందు భగవంతుడ్ని ఆర్చిస్తున్నాము అని గుర్తుపెట్టుకొని, చేసుకుంటూ వెళ్తుంటే మొత్తం కర్మ సత్కర్మ అయిపోతుంది. అంతే! నువ్వు బాతు కోసినా, కోడి కోసినా, దానిని అమ్మినా కూడా! అది చెప్పటానికే ధర్మవ్యాధుడి కథ ఇచ్చారు. ఉద్యోగం చేస్తుంటే లాభం లేదండి, ఉద్యోగాలు మానేయాలి, భగవత్తత్వమ్ తెలియాలి అంటే వ్యాపారం చేసేవాళ్ళకి వీలుపడదు, రాజకీయాలలో ఉండేవారికి అస్సలు వీలుపడదు అనే అవివేకులు ఉన్నారు. ఇదంతా కేవలం మిడిమిడి జ్ఞానం వలన వచ్చే భావాలు. శ్రీకృష్ణుడు రాజకీయాలలో కూడా ఉన్నాడు. మంచి వాళ్ళంతా మడికట్టుకొని కూర్చుంటే రాజకీయాలు ఎట్లా బాగుపడుతాయండి? మంచి వాళ్ళు అంతా వ్యాపారాలు మానేస్తే మంచి వాళ్ళు అవరు. మంచి అంటే అందరికీ ఏది పనికి వస్తుందో దాంట్లో మనం activeగా పని చేయాలి. అన్నీ వదిలేసి వచ్చిన వాడు మంచివాడు అంటే నమ్మకండి. నిజమైన మంచి వాళ్ళు ఇప్పుడు ఈ భూమిమీద పెద్ద పెద్ద వ్యాపారాలలోనూ,

రాజకీయాలలోనూ, వైజ్ఞానిక ప్రయోగ శాలలలోనూ ఉన్నారు. అంతేగాని కాషాయాలు కట్టుకొని ఊరికే ఉపన్యాసాలు చెప్పుకుంటూ లేరు వాళ్ళు. వాళ్ళకి ఇటువంటి వాటికి time లేదు. They are more in action than in speech. పనిచేసేవాడిని, రోజూ వాడి పని మానిపించేసి ఉపన్యాసం చెప్పుకుంటున్నామనుకోండి. అంటే కూసేగాడిద వచ్చి మేసే గాడిదని చెడిపాడని అంతకు ముందు బాగా పని చేసినవాళ్ళు గూడా పనిచేయటం మర్చిపోతారు. అది reverse అవుతుంది. చాలా మంది service పేరున, unknowingly they become less and less competent, more and more incompetent. చాలా మంది ఏమిట్రా అట్లా అయిపోయావు అంటే, ఈ మధ్య సాధన చేస్తున్నానండి అంటాడు. Competency తగ్గిపోతే సాధన అవదు. Something is wrong. Competency పెరగాలి. You should become more competent. More competent ఎప్పుడు అవుతాడు అంటే orientation మారితే అవుతాడు. మనం ఏమిచేసినా సరే service. నేను మాట్లాడడమే నీకు education అన్నట్లుగా, నేను watch కొనుక్కోవటం గూడా service. నేను చొక్కా కొనుక్కోవటం service. నేను చెప్పులు కొనుక్కోవటం service. ఎప్పుడు? ఇచ్చేటప్పుడు బేరమాడి ఒక రూపాయి తగ్గిస్తాడా? Discount ఇస్తాడా? లేకపోతే ఎవరి దగ్గరన్నా చెప్పించుకుందామా, ఈ దరిద్రం లేకుండా, వాడు అడిగింది వాడికి ఇచ్చేస్తే, అది నలుగురుకీ ఉపయోగపడేది కదా! ఎంతమంది చేస్తే ఆ స్థితిలో ఆ వస్తువు మనకి వచ్చింది.? నువ్వు బట్ట కొనుక్కున్నావంటే ప్రత్తి పండించిన వాడి దగ్గర నుంచి, నూలు వడికిన వాడి దగ్గర నుంచి, బట్ట తయారుచేసిన వాడి దగ్గర నుంచి, దానిని shopకు సరఫరా చేసిన వాడిదగ్గర నుంచి, దాన్ని అమ్మిన వాడి దగ్గర నుంచి--, ఇంతమందిని పోషించడానికి ఆ ధర ఉంటుంది. ఇంతమందికి నేను at one stroke helpful గా ఉన్నాను అన్న భావన మనకి వచ్చిందనుకోండి ఇందాక మనం చెప్పుకున్న గిరీశం statement నిజం. అసలు వాడి దగ్గర ఊరికే పుచ్చుకుందాం అన్న బుద్ధి ఉంటుందే, వాడు దొంగ అన్నమాట. అపరిగ్రహం అన్నది చాలా important. శమము అన్నది రావాలంటే, అపరిగ్రహం అన్నది చాలా ముఖ్యం. శమము అన్నది రావాలంటే మనకెక్కడన్నా కాస్త concession వస్తుందా? ఊరికే ఇస్తే బావుంటుందేమో, discountకి ఇస్తే బావుంటుందేమో అనుకోవడం మానేసి, మనం ఇచ్చేటప్పుడు పదిమందికి అది ఉపయోగపడుతుంది

అన్న భావనతో ఇవ్వడం మొదలుపెడితే service అయిపోతుంది. మనం చేసే ఉద్యోగం పదిమంది కోసం కాదు, మనకోసం అనుకొనేవాడు దురదృష్టవంతుడు. మనం చేసే ఉద్యోగం మనకోసం కాదు పదిమందికోసం అని గుర్తుంచుకున్నవాడు అదృష్టవంతుడు. మనకోసం అనుకున్నా, పదిమంది కోసం అనుకున్నా వచ్చే జీతం అదే కాబట్టి రెండో రకంగా అనుకుంటే ఆనందం పెరుగుతుంది. శమం పెరుగుతుంది. శంభుడిని గదా మనం ప్రధానంగా తీసుకున్నాం. ఏ పనిచేసినా ఇంకోళ్ళ కోసం చేయటమేనండి. ఏ action అయినా two parts. There is some part which is meant for others. ఇంకొకళ్ళకు ఏదైనా చేయటం అన్నది ప్రతి పనిలోనూ ఉంటుంది. నేను కారు షెడ్ కట్టుకుంటున్నానని అనుకున్నాను. ఇటుకకి, cementకి, concreteకి, labourకి రోజూ తే, తే, తే అని వాళ్ళు అడుగుతుంటారు. దానికి తే, దీనికి తే అని. నేను కారు షెడ్ కట్టుకోవాలన్న సంకల్పం వీళ్ళందరికీ ఉపయోగపడ్డది కదా అని అనిపిస్తే చాలా హాయిగా ఉంటుంది. లేకపోతే మనం కారు షెడ్ కట్టుకుంటుంన్నాం అనుకుంటే, ఈ workers చాలా దొంగలు, ఎప్పుడూ పని తక్కువ చేసి డబ్బులు ఎక్కువ తీసుకుందాం అని చూస్తుంటారు. పని ఎక్కువ అయిపోయింది. రేట్లు ఎక్కువయిపోతున్నాయి. ఇట్లా tension వచ్చేస్తుంటుంది. Opposite of శమం వచ్చేస్తుంటుంది. అక్కడ కారు షెడ్ ఇటుక మీద ఇటుక పెడుతుంటే మనలో B.P. unit మీద unit పెరిగిపోతుంటుంది. ఎందుకంటే వాడేదో దోచేస్తున్నాడనుకొంటాం. వాడు హాయిగా కట్టుకుంటుంటాడు, చుట్ట తాగుతుంటాడు, తాపీ మేస్త్రీ పని చేస్తుంటాడు, ఇటిక అయిపోతే రేపు ప్రొద్దున ఇటిక తెండి సార్, అని చెప్పి వెళ్ళిపోతాడు సాయంకాలం హాయిగా. తేకపోతే మనదీ problem. Tea నీళ్ళకు డబ్బు ఇవ్వండి అంటాడు. అన్నిటి కంటే joke ఏమిటంటే సాయంత్రం మన దగ్గరికి వచ్చి, కొత్త సినిమా వచ్చింది సార్ వెళ్తాను ఒక 20/- రూపాయలు ఇవ్వండి అని అడిగితే, వాడు అడిగిన పద్ధతి చూసి, ఆనందం వేసి, ఏ కళనున్నామో ఇచ్చామనుకోండి. శమం పెరుగుతుంది కారు షెడ్ కట్టించడం అనే సంకల్పము వలన. ఇంతమందికీ అంటే రాయివాడికి, ఇటికవాడికి, ఇసుకవాడికి, సిమెంట్ వాడికి అది సరఫరా అవుతుంది. ఒక సంకల్పం వలన అనే భావన ఉంటే అది service అయిపోతుంది. You tell me any work that you do in which you have a major portion of doing that you have to do for

others. కాబట్టి orientation అటు మారింది అనుకోండి, నిన్ను నువ్వు మర్చిపోయి ఇతరుల కోసం పని చేయడం అన్న స్థితికి చేరుకోవడం అనే పరిస్థితి ఇందులో ఉంది. వేరే service అనే vocation ఏమి పెట్టుకోనక్కరలేదు. మంగలికొట్టుకి వెళ్ళామనుకోండి, వాడు సార్ రేట్ పెరిగిపోయింది, పదిరూపాయలు అని వాడంటాడు. అంటే అంతకుముందు వీడు ఐదు రూపాయలు ఇచ్చివుంటాడు. ఇప్పుడు వాడికి పదిరూపాయలు ఇవ్వాలా అనుకుంటాడు వీడు. 5 నుంచి 10 raise ఒక్కసారి బాగాలేదు, 7 పెట్టుకో, లేకపోతే ఎవరూ రారేమో అంటాం. ఆ సంగతి నేను చూసుకుంటాను, ముందు మీరివ్వండి, అని అంటాడు. మరీ నువ్వు నాకు ముందుగా చెప్పలేదుగా నేను ఐదు తెచ్చాను అని చెప్పి ఇచ్చేసి వెళ్ళిపోతాం. మనం ఇచ్చేసి వెళ్ళిపోయినా వాడేమీ అనడు, ఎందుకంటే వాడు మనకన్నా ధనికుడు కాబట్టి. Next time వెళ్లినప్పుడు అడగడు గూడా. మనమే ఏమిటయ్యా, రేట్లు పెరిగిపోతున్నాయి, ఇంకా నువ్వు ఐదు పుచ్చుకుంటున్నావు, 7 or 8 పుచ్చుకుంటే బావుంటుంది అని అన్నామనుకోండి, అనటమే కాదు ఇచ్చామనుకోండి అది service అవుతుంది. నీకు రేట్లు పెరిగితే, నీ జీతం పెంచుకుంటూ, నీ D.A నువ్వు పెంచుకుంటూ, ఇంకా వాడివ్వలేదని strikes చేస్తూ ఉన్నప్పుడూ, Is it not equally true with others? అట్లా అనిపించదు. వంకాయల ధర పెరిగిపోయినా, బెండకాయల ధర పెరిగిపోయినా చికాకు వస్తుంది. శమము అనేది కర్మాచరణమే తప్ప అది ఇంకా సత్కర్మాచరణ కాలేదు కాబట్టి. కర్మాచరణ అంతా సత్కర్మాచరణంగా మారింది అనుకోండి. ఎట్లా మారుతుందంటే, దృక్పథం మార్చుకోవడం వల్ల మారుతుంది. మారితే నెమ్మదిగా శమము వస్తుంది. లేకపోతే శమము రాదు. మన దగ్గర నుంచి ఏదైనా బయటకు వెళ్ళినప్పుడు చికాకు వస్తుంది అనుకోండి, శమము రాదు. జేబులోంచి బయటకు వెళ్ళుతుంటే కాల్చేసిన వంకాయలాగా మొహం మాడుతుంటే శమము రాదు. జేబులోకి వస్తున్నప్పుడు వెలిగిపోయి, ఇస్తున్నప్పుడు వాడిపోయే ముఖం ఉన్నప్పుడు శమము రావడానికి అవకాశం లేదు. ఎంతసేపు గింజుకుంటూ ఉండాలి వాడు. పీకుతాడు. నువ్వు ఆ పది ఇవ్వకపోతే నేను క్షవరం చెయ్యనంటాడు. గింజులాట మిగులుతుంది. పని చెడుతుంది. మొత్తం పని అంతా అవుతుంది, అయినా హాయి ఉండదు. చచ్చిచెడి కట్టాడండి కారుషెడ్ అన్నట్లుగా ఉంటుందన్నమాట. మొత్తానికి ఎలాగో గురుపూజలు పూర్తి చేశాం అనుకుంటూ ఉండమూ? అమ్మ! ఈ ఏడాదికి

అయిపోయిందనిపించదూ? ఎందుకని అట్లా ఉంటుందంటే ఇటునుంచి అటు వెళ్ళడానికి బాధ. ఏది ? In terms of money, in terms of energy, in terms of time. అటు నుంచి ఇటు వస్తుంటే హాయి తెలియదు మనకి. ఇటునుంచి అటువెళితే బాధ. అటునుంచి ఇటు వస్తున్న కొద్దీ బిగుస్తుంటుంది. ఇటునుంచి అటు వెళుతున్న కొద్ది తేలికపడుతుంది. ఎంత పుచ్చుకుంటే అంత బిగుతవుతుంది. ఎంత ఇచ్చుకుంటే అంత తేలికవుతూటుంది. ఇచ్చుకుంటూ, ఇచ్చుకుంటూ రాక్షసుడు దేవతలని మించి పోయాడు కదా! చూశాడు, చూశాడు శ్రుక్రాచార్యుడు. ఇది కాదు వీళ్ళని కొట్టాలంటే పద్ధతి ఇది కాదు, దండోపాయాలు వద్దు అనుకున్నాడు. ఎందుకంటే చాలాసార్లు fail అయిపోయాయి అవన్నీ. ఎన్ని సార్లు కొట్టినా మళ్ళీ వాడెవాడో వస్తాడు, మళ్ళీ కొడతాడు. అందుకని technique మార్చి ఇస్తే పెరుగుతూపోతాం. అందరూ మనకి లోబడిపోతారు అని చెప్పి ఇచ్చుకుంటూ వెళ్లిపోయాడు. ఊర్లో ఆఫీసర్లందరకీ పళ్ళ బుట్టలు ఇచ్చాడనుకోండి, ఆఫీసర్లందరూ వీళ్ళకి లోబడి ఉంటారు. అట్లా లోబరుచుకుంటారు కొంతమంది. ఇచ్చి లోబరుచుకుంటారు. ఎందుకయ్యా ఇస్తున్నారు అంటే ఉంచండి సార్ అంటాడు, పడి ఉంటావు నాక్రింద అన్నట్టుగా, మీకెందుకు మీరు ఉంచండి చెప్తా, అని అంటాడు. వాడిచ్చిన పండు వీడు ఊరికే తిన్న తర్వాత నరనరాల్లోనూ వాడు ఆ పండు ద్వారా ఎక్కేస్తాడు. అందుకే పెద్దవాళ్ళు ఏంచేస్తారంటే తనది కానిది పుచ్చుకోరు, అర్హత లేనిది పుచ్చుకోరు. ఎందుకంటే పుచ్చుకున్న తర్వాత ఎక్కేసి భుజాలమీద కూర్చుంటారు. ఊరుకుంటాండేంటి? పళ్ళబుట్ట అయిన తరువాత ఆరునెలలకి ఆఫీసులో చిన్న కాయితం సార్ అంటాడు. పళ్ళు కాకపోతే ఇంకోటి, అది కాకపోతే ఇంకోటి. మొత్తానికి పుచ్చుకున్నాడంటే oblige చేయాలి, చూశాడు శుక్రాచార్యుడు ఈ technique. బలితో 'గురూ నువ్వు ఇస్తూ ఉండు చూద్దాం' అన్నాడు. ఇచ్చుకుంటూ పోయాడు. ఇచ్చాడు, ఇచ్చాడు, ఇచ్చాడు , ఇచ్చి పెరగటం మొదలు పెట్టాడు. ఎంత పెరుగుతూ పోయాడంటే ఇంద్రుడి సింహాసనం గూడ వీడి వశమై పోయింది. ఇంకా మిగతా లోకాలన్నీ వశమైపోతున్నాయి. ఇంక ఎప్పటికీ దక్కలేదు దేవతలకి సింహాసనం. ఎందుకంటే ఇంద్రుడికన్నా బలి better గా work చేస్తుంటే అక్కడ నుంచి వాడినెందుకు తీసేయాలి? ఇంద్రుడి కన్నా బలి బాగా పనిచేస్తున్నాడు. బలిని తీసేయటానికి కారణం ఏమి లేదు. ఏమిటి cause. Cause of action ఏమి లేదు. బలికి ఇవ్వటంలో వైరాగ్యం కూడా వచ్చింది. ఎంతదూరం

వెళ్ళిపోయాడంటే గురువుని మించి పోయాడు. గురువు scheme ఎక్కడ పెట్టాడంటే రాక్షసుల చేతిలో మొత్తం తీసుకువచ్చేటట్లు plan వేశాడు. ఈయన ఈ ఇవ్వటంలో అది గూడా దాటిపోయి ఇదంతా ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి అనే state కి వెళ్ళిపోతాడు. అందుకనే వచ్చిన వాడు సామాన్యుడు కాదు, అంటే పోనిద్దూ, అన్నాడు. అంటే ఇవ్వటంలో ఎటువంటి relief వస్తుంది అంటే, you don't care for anything. పుచ్చుకోవడంలో ఎంత conditioning వస్తుంది అంటే, you fear for everything. Fear, fear, fear nothing but fear. అందుకని ఇవ్వమన్నారు. అంతేగానీ మనం ఇస్తే ఏదో వస్తుంది అని కాదు. దానం గురించి చాలా చెప్పారుగానీ, పుచ్చుకోవడం గురించి చాలా తక్కువ చెప్పారు మన వాళ్ళు. నువ్వు ఇవ్వటం అట్లా వుంచి పుచ్చుకోవటంలో చూడు ఎట్లా పుచ్చుకుంటావో. దానం అనేది next step. ముందు అక్కర్లేనిది పుచ్చుకోవడం మానేయాలి. వచ్చినదల్లా పుచ్చుకుంటుంటే ఇల్లంతా నిండి పోతుంది. మనం వుండడానికి చోటు వుండదు. వస్తువులకే వుంటుంది చోటు, అట్లా వుంటే ఏమవుతుంది అంటే శమం reverse అయిపోయి చికాకు permanentగా settle అయిపోతుంది. ఏం చేసినా చికాకుగా వుంటుంది. ఏం చేసినా ఒక రకమైన discomfort వుంటుంది. ఎందుకుంటుందీ అంటే ఆచరణయందు orientation to receive ఎక్కువ, orientation to give తక్కువ. Orientation to give ఎక్కువ అవుతూ పోతే నువ్వు పరుచుకుపోతూ వుంటావు. శమం పెరుగుతూ వుంటుంది . అట్లా ఇతరులకి చెయ్యటమే తప్ప, తన గురించి ఆలోచించకుండా ఉన్న స్థితికి ఎదిగితే దాన్ని నిష్ఠ అంటారు. సత్కర్మాచరణ అనేది పూర్తిగా నరనరాల్లోకి ఎక్కి చేసే పనుల్లోనే నిష్ఠ వుంటుంది. వేరే కొత్త కార్యక్రమాలు పెట్టుకోనక్కర్లేదు, as father to children, as husband to wife, as son to parents, as a co-worker in the vacation, as a member in the society చేసే పనుల్లోనే మనం ఎవరికైనా ఏం చేయగలం అనేది గుర్తుంటే జరగవలసినది దానికది automatic గా జరుగుతుంది. అట్లా చేసుకుంటూ పోతుంటే, అది మన స్వభావమైపోయినప్పుడు, శమం అన్నది కూడా మన స్వభావమైపోతుందిట. ఎందుకంటే నిష్ఠ కుదిరింది కాబట్టి భగవంతునికి మనం చేయగలిగింది ఏమీ లేదుగదా! అంతా ఆయన దగ్గరనుంచి పుచ్చుకోవాల్సిందే గదా! అంతా ఆయనా, ఆయన నుంచి వచ్చిన ఆవిడే గదా మనకి పెట్టుబడి? వీళ్ళిద్దరూ

లేకపోతే ఏమీ లేదు కదా! పుచ్చుకోవటం అన్న స్థితికి అతీతంగా వున్నవాడు కాబట్టి, ఆయన permanentగా శమములో వుంటాడు. ఇవ్వటమే తప్ప, పుచ్చుకోవటం ఎరగనివాడు కనుక శమము అనేది ఆయనకు సహజమైన ఆస్తి. Through reorientations of our actions మనం శమము సంపాదించుకోవాలి. Reorientation ఆయనకి ఏమి అక్కర్లేదు. అందుకని కృష్ణుడు suddenగా అర్జునుడికి పెద్ద declaration ఇస్తాడు. గుర్తు పెట్టుకో నీకు driver గా పని చేయవలసిన ఆగత్యం నాకు లేదు, అయినా సరదాకి చేస్తున్నానని. మన వాళ్ళు ఎవరికన్నా ఉపకారం చేస్తున్నారనుకోండి, వాడు ఉపకారం చెయ్యాలికదా అన్నట్టుగా వుంటాడు. అసలు ఉపకారం చెయ్యనివాడినేమీ పట్టించుకోరు. చేసేవాడిని చెయ్యడేం అంటారు. అట్లా వుంటుంది తమాషా. 'పెట్టనమ్మ ఎట్లాగూ పెట్టదు, పెట్టే ఆవిడకేమొచ్చింది' అన్నాట్ట. సంస్కారంలో ఎంతో పతనం చెందినప్పుడు అటువంటి ఆలోచనలు వస్తాయి, ఇంకాతే ఇంకాతే అని. ఎందుకు ఇవ్వట్లేదు? మానేశావేం? బాగుపడవు అంటారు. ఎంత ఇచ్చినా ఇంకా తే, అంటాడు. వాడు ఆపేశాడనుకోండి, లాభం లేదు వాడు అంటారు. మన మధ్యలోకి ఒక గురువుగారు వచ్చారనుకోండి, ఇది అది అని ఏమి లేదు ప్రతిదీ చేయించుకొంటాము. చేయించుకుంటే చేస్తుంటాడాయిన, చేయడం ఆయన స్వభావం కాబట్టి. చేయించుకున్న వాళ్ళ సంగతేమిటి? ఇట్లాగే వుండిపోతారు వాళ్ళు, ఇంకో చేసేవాడి కోసం వెతుక్కోవడం తప్ప, వీడేమీ చెయ్యడు కదా! శమము ఎక్కడనుంచి వస్తుంది? శ్రీకృష్ణుడు ఏమి చెప్పాడంటే, గుర్తుపెట్టుకో నాకు ఎవ్వరితోనూ obligations లేవు, నీతో కూడా లేవు, మీ అన్నదమ్ముల్తో, బంధువుల్తో లేవు. మీ cousins కొట్టుకు చచ్చిపోయినా నాకేం సంబంధం లేదు. అయినా నేను పని చేస్తున్నాను. Not because I am obliged but, because I like it. Obligation లో పెట్టి service పిండుకోవటం గూడా ఉంది. గట్టిగా నాలుగుసార్లు పొగిడితే పాపం ప్రతివాడు ఏదో చెయ్యటం మొదలు పెడతాడు. ఇంకో నాలుగు పొగడ్తలు వెయ్యటం మళ్ళీ వాడి దగ్గర నుంచి లాగటం. ఇట్లా ఒక పద్ధతి ఉంది. ఇటువంటి వాడికి పడడు శ్రీకృష్ణుడు. ఎంత పొగిడినా నవ్వుతాడు. పిచ్చివెధవ అనుకుంటాడు. మీరే కాదు, ఈ మూడు లోకాలలోనూ నన్ను నువ్వు ఇది చెయ్యి అని Demand చెయ్యగలిగిన అర్హత ఎవ్వరికీ లేదు గుర్తుపెట్టుకో, అంటాడు అర్జునుడితో. ఈ మూడు లోకాలలోనూ నేనేం చేయకపోయినా

నన్నడిగేవాడు ఎవ్వడూ లేడు. ఎట్లా వచ్చింది ఆ position ఆయనకి, ఎప్పుడూ ఎవ్వరినీ ఏదీ అడగటం అన్నది లేక అందరికీ చేయటం అన్నది పెట్టుకున్నాడు. మూడు లోకాలు ఆయనకి obliged తప్ప, మూడు లోకాలలో ఎవరికీ ఆయన obliged కాదు. మనకి తెలియక మనం reverse ఆడుకుంటాం గాని, ఎంత సులువైన మార్గమో చూసారా? అందుకని Master C.V.V గారు ఇట్లా పెట్టకురా (చెయ్యి చాచకు) అన్నారు. ఇట్లా పెట్టావో అడుగంటి పోతావు. పైకి రావింక. గిన్నెకి అంటుకుపోతావు. నీకు వున్నదాంట్లో పెట్టటానికి ప్రయత్నం చెయ్యి, దాంట్లోంచి పెరుగుతావు. పెరగడానికి this is the simple way అన్నారు. శంభుడు మనకి నరనరాల్లో స్థిరపడటానికి ఇదొక్కటే మార్గం. ఎంతసేపూ మన ఆనందానికి వీపు చూపిస్తాం కాబట్టి పద్ధతి మారుతుంది. వీపు చూపించకండి ధైర్యంగా అట్లాగే చేసుకుంటూ వెళ్ళండి. ఉన్నదాంట్లో ఇంకోళ్ళకి చెయ్యి. ఏమీ లేకపోయినా ఉన్నదానిలో ఎంతో చేసిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. నా దగ్గర ఈ source ఉంటే చేద్దామనుకున్నవాడు ఎవ్వడూ చెయ్యలేడు. జీవితంలో అది ఒకటి గుర్తుపెట్టుకోండి, ఉంటే నేనూ చేసే వాడ్నే అంటారు చాలా మంది. ఉన్నవాళ్ళు ఎవరూ చేయరు. ఉండి చేశాడుట అంటే వాడు చాలా గొప్పవాడు. ఉండి, లేనట్టుగా ఉండే వాడే ఎక్కువ చేస్తాడు. నేను మాస్టర్ గారిని అడిగాను క్రొత్తలో, ఈ good workకి ఎవరూ డబ్బులు ఇవ్వరేమిటని? 'నీకూ నాకూ డబ్బులు వచ్చినా అంతే! నువ్వు ఎవరి గురించి అంటున్నావో, ఆ స్థితికి మనం కూడా ఎదిగామనుకో, మనం కూడా అంతే! మనకి లేక అట్లా అంటున్నాం గాని ఉంటే పట్టేస్తుందోయ్,' అన్నారు. లేకపోవటమే సుఖం, ఎప్పుడు ఎంత అవసరం ఉందో అంత వస్తే చాలు తప్ప, అంతకు మించి ఉన్నదంటే చుట్టేస్తుంది. ఉండి చెయ్యగలిగామనుకో అది రాజర్షిత్వం అని చెప్పారు. రాజర్షి ఎవరయ్యా అంటే ఉన్నా దాని యందు ఇరుక్కోని వాడు. ఋషి లేదని ఏడవడు. ఉన్నది స్వదినియోగం చేస్తుంటాడు. ప్రణాళిక ప్రకారం దిగి వస్తుంటుంది. అందుకని రాజర్షిగా జనకుడ్ని చెప్తారు. చాలా ఉన్నాయిచుట్టూ, కానీ వాటి యందు ఆయన ఉండడు. సద్వినియోగం చేస్తుంటాడు. లేనివాళ్లు కూడా ఋషులుగా ఉంటారు. అవసరమైనది అవసరమైనట్టుగా వస్తుంటుంది. కుచేలుడు ఎటువంటి సందర్భంలోనైనా శమము పొంది వుంటాడు. ఎందుకంటే ఎదుటివాడికి చెయ్యవలసిందే ఎక్కువ గుర్తుంటుంది. దాని నుంచే శమము వస్తుంటుంది. మనకి

కావాల్సినవి గుర్తుంటే దాని నుంచి అశాంతి వస్తుంటుంది. As a meditational point ఒక పక్క 'శం' అనే శబ్దాన్ని చేసుకుంటూ, ఇంకొక పక్క ఈ orientation కుదురుతూ చేస్తే, దానిలో మనకు నిష్ఠ కుదిరితే, శమము అనేది మనకు ఏర్పడి, సర్వకాల సర్వావస్థలయందు ప్రశాంతత కోల్పోని స్థితికి ఎదగడానికి వీలువుంటుంది. అది భగవంతునియందు ఎప్పుడూ ఉన్నది. ఈ విధంగా వుంటే మన యందు కూడా ఆయన శమము కలిగించగలడు. ఇవి చెప్పుకున్నప్పుడు చాలా బాగుంటాయి. చేస్తున్నప్పుడు మనకి మనం అడ్డం పడిపోతుంటాము. ప్రయత్నం చేసుకుని దాటుకుంటూ ఉండాలి. ఎన్ని జన్మలు పట్టినా తప్పు లేదు. మొదలు పెట్టాలి అంతే. శంభుడు, అంటే peaceful existence కలిగినవాడు. Peaceful existence ఇవ్వగలిగిన వాడు. శమము, శాంతి కలిగిన వాడు, ఇవ్వగలిగినవాడూనూ. ఆయన యొక్క సమక్షంలో హాయిగా వుంటారు. కొంతమంది దగ్గర కూర్చుంటే హాయిగా వుంటుంది. కొంతమంది దగ్గర కూర్చుంటే గంగ వెర్రులెత్తుతుంది. కొంతమంది సమక్షంలో ఎంత హాయిగా ఉంటుందంటే నిద్రకూడా పోతారు. ఎట్లా నిద్ర పోతారంటే అలజడి కలిగిన జంతు స్వభావము కలవాళ్ళకి గూడ ప్రశాంతత వస్తుంది. పులిలాంటిది, అటువంటి వాళ్ళ దగ్గరికి వచ్చినప్పుడు ఒక్కసారి చెయ్యివేసి నిమిరితే దాని రజోగుణమంతా పోయి, హాయిగా నిద్ర పోతుంది. ఇది ఎక్కడో చదివి, ఒక రోజు బొంబాయి వెళ్లాల్సివచ్చింది. అక్కడ ఒకరింట్లో వుండవలసివచ్చింది. వాళ్ళింట్లో ఒక కుక్క కూడా వుంది. మనకి కుక్కలంటే అదొక రకమైన శమము లేని స్థితి. సరే నిన్న చదివాంగదా! ఈ రోజు experiment చేద్దాం అనుకున్నాను. మూడో రోజయితే మర్చిపోయి వుండే వాళ్ళం. అదీగాక కొత్త వాళ్ళు వస్తే అది వాళ్ళ చుట్టూ తిరుగుతుంది గదా! వీళ్ళ సంగతి ఏమిటో చూద్దామని వచ్చి కూర్చుంది. సరే కాస్త నెమ్మదిగా నాలో వున్న భగవంతుడు, కుక్కలో వున్న భగవంతుడు రెండూ ఒకటే అన్న పద్ధతిలో చేయి వేశాను. నిద్ర పోయింది. అమ్మ! నిజమే! ఇది సత్యం! కుక్క వరకూ సత్యమయింది. ఇట్లా మనం శమాన్ని పంచ వచ్చు. ఎప్పుడు పంచగలం అంటే మనలో వుంటే. మనం దానియందు వుంటే అది మన నించి వ్యక్తమవుతుంది. అదీ తమాషా! మనం దేవుడియందు వుంటే దేవుడు మన నించి వ్యక్తమవుతూ ఉంటాడండీ. మనం శమమునందు ఉంటే శమము మననించి వ్యక్తమవుతూ ఉంటుంది. మనం శబ్దమునందు ఉంటే శబ్దము మననించి

వ్యక్తమవుతూ ఉంటుంది. అట్లా శమము నందు ఉండటానికి చేయవలిసిన కార్యక్రమము ఇది. అట్లా చేసుకుంటూ వెళుతుంటే ముందు నీకు హాయిగా ఉంటుంది. నీ దగ్గర హాయిగా ఉండటం కోసం వచ్చేవాళ్లు పెరుగుతుంటారు. వాళ్ళందరూ హాయిని పొందుతూవుంటారు. అట్లా జరిగి పోతుంటుంది. అటువంటి వ్యక్తి ఉన్న ప్రదేశం ఒక ఋషి ఆశ్రమం అయిపోతుంటుంది. అక్కడ పూలు విరబూస్తాయి. ఫలవృక్షములు ఫలముల బరువుతో కొమ్మలు నేలకు తాకుతున్నాయా అన్నట్లుగా ఉంటాయిట. ఎందుకంటే హాయిగా వుంటే అన్నీ అట్లా విచ్చుకుంటాయి. గోవులు పొదుగులు విపరీతంగా పెరిగి, బాగా చేపి, చక్కటి పాలు ఇస్తాయి. దూడ తాగిన తరువాత మనం పుచ్చుకునేటన్ని పాలు వుంటాయి. దానికి ఎగ్గొట్టి మనం పుచ్చుకునే పరిస్థితి ఉండదు. జంతువులన్నీ పరస్పరము మిత్రత్వము కలిగి వుంటాయి. మానవులకు కూడా ఆశ్రమంలోకి వెళ్ళగానే అటువంటి ఆనందమే కలుగుతుంది. మనం ఎంత కలతగల వాళ్ళమైనా కూడా అటువంటి ప్రదేశానికి వెళితే మనకి కొంత హాయి కలుగుతుంది. మనలాంటి చికాకుగాళ్లు నడిచి వెళుతుంటే మనకి తెలియకుండా, మనతో సంబంధం లేకుండా suddenగా హాయిగా వుందనుకోండి, understand that there is an ashram there. ఈ భౌతికమైన కన్నులకు కనిపించక పోవచ్చుగాని, అక్కడ ఆశ్రమ వాతావరణం ఒకటి ఉన్నది. ఒక మహర్షి ఉన్నారని గుర్తించండి, మనకి కనబడని లోకాల్లో. లోకం అంటే ఏమిటి దృష్టే కదా? నీ దృష్టి కొంతే చూడ గలదు. మనకు కనబడనివి అంతకు మించి ఉంటాయి. వాటిని పైలోకాలు అంటూ ఉంటాం. మనకి కనబడని ఆ లోకాల్లో వాళ్ళు ఉండబట్టి ఆ ప్రదేశం చాలా హాయిగా ఉంటుంది. కారణం ఏమిటంటే ఆ ప్రదేశం అట్లా తయారయిందన్న మాట ! ఒక రావిచెట్టు శమాన్ని ఇస్తుంది. ఒక మర్రిచెట్టు శమాన్నిస్తుంది. ఒక శమీ వృక్షం శమాన్ని ఇస్తుంది. ఒక గోవు శమమును పంచుతుంది. ఒక తెల్ల గుర్రం శమముని పంచుతుంది. ఒక తెల్ల కలువ శమమును పంచుతుంది. ఒక తెల్లని కుక్క శమమును పంచుతుంది. ఒక తెల్లని పావురం శమముని పంచుతుంది. ఒక నిర్మలమైన మనిషి శమముని పంచుతాడు. అట్లా ప్రదేశములు, మానవులు, జంతువులు, వృక్షములు కూడా శమమును పంచడం ఉంటుంది. వాళ్ళ దగ్గర కూర్చుంటే కూడా కొంత అయస్కాంతీకరణము జరిగి మనకి శమము వస్తుంది. కానీ దక్కదు, ఎందుకంటే ఆ స్ఫూర్తితో కర్మాచరణలో సర్దుబాటు చేసుకోపోతే

మళ్ళీ, వెనుకటి గుణమేల మానుగదరా సుమతీ, అన్నట్లుగా వంకర తిరిగిపోతుంది. మళ్ళీ వెళ్ళి సాఫు చేసుకుంటుండాలి. మళ్ళీ వంకర తిరుగుతుంటుంది.  మళ్ళీ సాపు చేసుకుంటుండాలి.  Battery charge చేసుకు వచ్చాను సార్ అంటాడు.  వచ్చావు కదా !  ఇప్పుడు chargeలో వుందా అంటే దారిలోనే అయిపోయివుంటుంది.

## 42. ఆదిత్య:

వేదములలో అతి ముఖ్యమైన అతి ప్రాముఖ్యమైన శబ్ధము అదితి. అదితి గురించి చెప్పుకునేటప్పుడు అరవింద మహర్షి గురించి తప్పకుండా చెప్పుకోవాలి. ఆయన ఈ నవీన యుగంలో అదితి, సావిత్రి అనే పదముల ప్రాముఖ్యత వివరించారు. ఆయన ప్రస్తుతం శ్వేతదీపమునందున్న ఒక మహర్షి. ఆదిత్యులు అనే వారు అదితి నుంచి పుట్టుకువస్తారు. ఆదిత్యులు అంటే వెలుగు లోకములు. వెలుగు లోకాల నుంచి వెలుగు ముద్దలుగా దిగి వస్తారు. సూర్యోదయమునకు ముందు వచ్చే వెలుగును 'అదితి' అంటారు. సాయంత్రం సూర్యాస్తమయం తరువాత ఉండే వెలుగును 'సావిత్రి' అని అంటారు. అదితిని, సావిత్రిని ఆ సమయాలలో దర్శించి, స్తోత్ర పఠనాదులు గావించి వారి యొక్క అనుగ్రహాదులు పొందడానికి సంధ్యావందనం ఇచ్చారు. 'సావిత్రీ సత్యవంతుడు వెళ్ళిపోయాడని బాధపడకు, నేను రేప్పొద్దున్న మళ్ళీ చీకటి లోకాల నుంచి తెచ్చి నీకప్పచెపుతాను కదా!' అని చెబుతుంది. అదీ సావిత్రి అంటే. సూర్యుడస్తమించినప్పటికీ మనకు వెలుగు కనిపిస్తుంది కదా! ఆ వెలుగు ఏమని వాగ్దానం చేస్తుందంటే for sure I shall bring him to you tomorrow. The light that shines forth in darkness అని అర్థం చెప్పుకోవచ్చు. I am all the light in darkness అని అంటూంటాం కదా! Watching light in darkness అంటే ఏమిటి? చీకటిలోఉన్న మనకి అంతర్ముఖమైన వెలుగు దర్శనమిచ్చే పరిస్థితి సావిత్రి అన్నమాట. అదితి వెలుగు 'సూర్యుడు వస్తున్నాడు, వస్తున్నాడు' అని మనకి దండోరావేయటానికి వస్తుంది. The son of God వస్తున్నాడు అని చెప్పటానికి ఒక దూత ముందు వస్తాడు కదా! అట్లా వచ్చేస్తున్నాడు అని చెప్పటానికి ముందు వెలుగుగా తాను వస్తుందన్నమాట. "నా కడుపులో నుండే బయటపెడతాను, మీఅందరి కోసం వస్తాడు" అని చెబుతుంది అదితి. అదితికి ఆదిత్యులు పుట్టట మంటే వెలుగుకిరణాల ప్రసారానికి మాతృస్థానముగా ఉన్నదని. దానినే అదితి అంటారు, లేక అమ్మవారు అంటారు. అందులో వ్యక్తమైన వెలుగును ఆదిత్యులు అంటారు. మనకి సంవత్సరానికి 12 రకములైన వెలుగుల్ని అందిస్తుంటారు. రోజూ అదే సూర్యుడు అదే రకమైన వెలుగును పట్టుకొస్తున్నాడు అనుకోకండి. అదే

సూర్యుడు అయినప్పటికీ అదే వెలుగు కాదు. రోజు మనం నిద్ర లేస్తునప్పటికీ ఒకే విధంగా ఉంటున్నామా? సూర్యుడు ఒక్కొక్క రోజు ఒక్కొక్క భావము పట్టుకువస్తాడు. ఒక్కొక్క మాసం ఒక్కొక్క భావం. 365 రోజులు 365 భావములు ఉన్నప్పటికీ, క్లుప్తంగా చెప్పాలంటే ఒక్కొక్క మాసం ఒక్కొక్క భావం అంటే 12 భావములు అన్నమాట. అందుకని ద్వాదశాదిత్యులు అని అన్నారు. 12మంది సంతానం అదితికి. మిత్ర, పూషా, వరుణ, విష్ణువు, ఇంద్రుడు, భగ, అంశుమాన్ ...... ఇలా వీళ్ళంతా అదితికి పుట్టినవాళ్లే; మొత్తం 12 మంది ఉన్నారు. ఈ 12 భావములు సంవత్సరము లోపు మనకి అందివ్వబడుతూ ఉంటాయి. కనుక ఆదిత్యుల రూపంలో భగవంతుడు తానే, తానేర్పరచిన ప్రకృతి నుంచి వెలుగుగా దిగివస్తాడు. అదీ ఆదిత్యుడు అంటే. మనకి సృష్టిలో ఆదిత్య అనే ప్రక్రియ తెలియచేయడానికి జ్యోతిష్యం బాగా ఉపయోగపడుతుంది. మాస్టర్ E.K గారు 12 మాసములకు సంభందించిన తత్వమును Spiritual Astrology అని ఇచ్చారు. నిజానికి అదంతా ఒక జ్ఞానపు పుట్ట. అందులో astrology aspect చాలా తక్కువ. వేదపరమైన సమస్త విజ్ఞానమును చాలా క్లుప్తంగా ఇచ్చారు. భగవంతుడు 12 భావములు సూర్యుని ద్వారా వ్యక్తంచేస్తుంటాడని ఇచ్చారు. ఇప్పుడు మనం మార్గశీర్ష మాసంలో ఉన్నామనుకోండి. Sagittarius (ధనుస్సు) అనే heading ఉన్న chapter 30 రోజులూ చదువుకున్నామనుకోండి. ఇట్లా 12 మాసాల గురించి 12 ఏళ్ళు చదువుకున్నామనుకోండి, ప్రతి సంవత్సరము 30 రోజుల చొప్పున ప్రతి రోజూ Sagittarians 12 ఏళ్ళు చదువుకుంటే 360 సార్లు అవుతుంది. రోజూ కనీసం ఒక పేరా అయినా చదుకున్నా 4, 5 సార్లు అన్నా పూర్తి అవుతుంది. ఆ నెలలో జీవిస్తున్నప్పుడు ఆ భావం నందు కూడా జీవించి ఉండాలి. ఇప్పుడు సూర్యుడేమిస్తున్నాడు? అనేది తెలిసి ఉండాలి. కార్తీక మాసం లో ఏమిస్తున్నాడు? మార్గశీర్ష మాసంలో ఏమిస్తాడు? రాబోయే పుష్య మాసంలో ఏమిస్తాడు? మాఘ మాసంలో ఏమిస్తాడు? ఫాల్గుణంలో ఏమిస్తాడు? మేషంలో ఏమిస్తాడు? తట్టెడు తట్టెడు తెచ్చి పోస్తుంటాడు. మనకేమి తెలియదు కాబట్టి పుచ్చుకోం. ఇదేమిటి? మనం ఇన్ని ఇచ్చినా పుచ్చుకోరేం? అని పోనీలే మళ్ళీ ఇద్దాం అని మళ్ళీ ఇస్తుంటాడు. ఎప్పుడూ వెష్ఠ పడడుట, నిరుత్సాహ పడడుట. ఇస్తూనే ఉంటాడు. పన్నెండు మాసముల భావములను తెలుసుకొంటే అవ్యక్తమైన భగవత్తత్వము, ఆదిత్య స్థితి నుంచి పన్నెండు రకములైన భావములను మనలో

ఎలా ప్రవేశ పెడతాడో తెలుస్తుంది. మనలో కూడా ఈ పన్నెండు భావాలు ఉన్నాయి. అవి మన శిరస్సు నుంచి పాదాలవరకు ఆయా భాగములలో ఆయా భావములు పని చేస్తుంటే మనం కూడా ఒక చిన్నరకం సృష్టే. ఆ భాగములలో ఆ భావములు పని చేయకపోవడం వల్ల మనం అదొక మాదిరిగా ఉన్నాం. ఆ భాగములలో ఆ భావములు అంటే నుదటి వరకు మేషం. (చైత్ర మాసం) నుదుటి నుంచి గడ్డం వరకు వృషభం. (వైశాఖం) గొంతు, భుజములు, చేతులు అంతా మిధునం. (జేష్ఠం) రక్త ప్రసారం, ఊపిరితిత్తులు, ఉఛ్వాస నిశ్వాసలకు జరిగే ప్రయత్నమంతా కర్కాటకం. (ఆషాఢం) ఉదరవితానం పైన ఉండే point సింహం. (శ్రావణం) అక్కడినుంచి బొడ్డు వరకు కన్య లేక భద్ర అనే అమ్మవారికి సంబంధించిన మాసం భాద్రపద మాసం. భద్ర అనే అమ్మవారికి సంబంధించిన ప్రక్రియ అంతాగూడ పై పొట్టలో ఉందన్నమాట! బొడ్డు మనకి తుల. (ఆశ్వీయుజము) అమ్మవారి పూజలు బొడ్డులో చేసుకుంటున్నామన్నమాట! ఎందుకో ఏమిటో spiritual astrology చదువుకుంటే తెలుస్తుంది. చాలా ఉత్కృష్టమైన గ్రంధమది. మనం జీవితంలో ప్రతి రోజూ ఆచరించుకోవలసినవన్నీ day-to-day basis మీద ఇవ్వబడిన గ్రంధం. ఆ తరువాత బొడ్డు నుంచి క్రిందకి భయంకరమైనదిగా కనిపిస్తుంది గాని at the same time చాలా ఉత్కృష్టమైన ప్రజ్ఞలు పని చేయగలిగిన భావం వృశ్చికం. (కార్తీకం) అది పెనుచీకటికి నిలయము. Absolute light అనే స్థితి శివతత్వమునకు చిహ్నం. అందుకని శివపూజలు చేసుకుంటూ ఉంటాం. శివుడి పూజలకి కార్తీక మాసానికి లంకె. ఆశ్వీయుజ మాసానికి అమ్మవారి పూజలకి లంకె, భాద్రపదమాసానికి వినాయకుడి పూజలకి ప్రసిద్ధి కదా! కన్యాపుత్రుడు వినాయకుడు. Immaculate conception అంటారు. అంతకు ముందు శ్రావణమాసంలో లక్ష్మి అమ్మవారిపూజలు. ప్రతినెలా ఆ విధంగా భావంతో నిండి ఉన్నది. కనుకనే ఆర్యులు కాలము యొక్క తీరుతెన్నులు తెలిసికొని మనకి తెలిపారు. ఆ ప్రకారం మనం అట్లా చేస్తే సంవత్సరం ఒక లీలగా గడిచిపోతుంది. ధనుస్సు అంటే మార్గశీర్ష మాసం రాంగానే విష్ణుప్రీతి గల కార్యక్రమము. ఆ తరువాత ఉత్తరాయణం రాగానే మకరం (పుష్య మాసం.) ఆ తరువాత ఆకాశంలోకి వెళ్ళిపోతే కుంభం అంటే మాఘమాసంలో spaceman అయిపోతాం. మీనంలో అంటే ఫాల్గుణ మాసంలో ఒక పని పూర్తిచేసికొని మరియొక పనికి ready అయిపోతుంటాం. మళ్ళీ మేషం. ఇట్లా circular

pathలో భగవంతుని తత్వాన్ని భావపరంగా అనుభూతి చెందటానికి ద్వాదశ ఆదిత్యులుగా ఏర్పడినాయి. ఆదిత్య అన్న శబ్దానికి సంగ్రహమైన అర్థం చెబుతున్నాను. సరియైన అర్థం తెలియాలంటే Spiritual Astrology లో ఉన్న 12 భావముల యొక్క అర్థం చెప్పుకున్నప్పుడు అది మనకి పరిపూర్ణమవుతుంది. ఒక్కొక్క మాసానికి ఒక్కొక్క భావం ఉన్నది. ఆ మాసంయొక్క పౌర్ణమి నాడు ఆ భావం పరిపూర్ణంగా దిగివస్తుంది. కనుక ఆ పౌర్ణమి మనకు చాలా ముఖ్యం. రానున్న పౌర్ణమి మార్గశీర్ష పౌర్ణమి, దత్తాత్రేయ జననం అని చెప్పుకుంటుంన్నాము గదా! దత్తాత్రేయ జననం అంటే ఏమిటి? మూల నక్షత్రంలో ఇటు సూర్యుడు ఉంటే, మృగశిర నక్షత్రములో అటు చంద్రుడు ఉంటే ఒక చక్కటి axis from above to below ఏర్పడుతుంది మన వెన్నెముకలో. అటు జేష్ట మాసంలో వచ్చే పౌర్ణమి ఒకటి ఉంటే, ఇటు మార్గశీర్షమాసంలో వచ్చే పౌర్ణమి ఒకటి ఉన్నది. ఈ రెండూ గూడ భార్యాభర్తల వంటివి. అంటే ఒకదానికి ఒకటి reverse. మార్గశీర్ష మాసంలో (ధనుర్మాసంలో) సూర్యుడు మూలాధారంలో ఉంటే, చంద్రుడు మృగశీర్ష (జ్యేష్టమాసం) అనే భాగంలో ఏర్పడినపుడు అక్కడనుండి సూర్యకాంతులు, ఇక్కడినుంచి చంద్ర కాంతులు రెండూ వెన్నెముకలో చక్కటి ప్రసారాన్ని ఇస్తాయి, యోగమునకు అది ముఖ్యమైన సమయము. అదే జేష్ఠ మాసంలో (మిధునం) మూలలో చంద్రుడు వస్తాడు, మృగశీర్షలో సూర్యుడు వస్తాడు. చూడండి మనకి ఎంత చక్కటి అనుసంధానం జరుగుతుందో. అట్లాగే మనకి పౌర్ణమి ధ్యానాలు చేసుకునేటప్పుడు చంద్రుడెక్కడున్నాడో, సూర్యుడెక్కడున్నాడో మనలో భావన చేసికొని ధ్యానం చేసుకోవాలి. ఇక్కడ మార్గశీర్ష మాసంలో దత్తాత్రేయ జననం జరిగితే అక్కడ మిధునమాసంలో మైత్రేయ జననం. వాళ్ళు ఆ timeలో సరదాకి పుట్టరు. ఇద్దరూ ఆత్రేయులే. దత్తాత్రేయులు, మైత్రేయులు. పశ్చిమదేశాల్లో సత్యాన్వేషకులు పరమగురువుల అనుగ్రహ కారణంగా జ్యేష్ట పౌర్ణిమని Full Moon of the Christ గా చక్కటి పర్వదినంగా భావన చేసుకుంటూ సాధన చేస్తున్నారు. మనం దత్తాత్రేయ పౌర్ణమికి జయంతి ఉత్సవాలు కాదు చేయవలసింది, దత్తాత్రేయ ధ్యానం ద్వారా యోగము నందు స్థిర పడటానికి ప్రయత్నించాలి. ఇట్లా ప్రతి నెలకి ఎన్నో రకములైన అతి పవిత్రమైన భావములు సూర్యుని ద్వారా అందింపబడుతుంటాయి. అవీ సంధ్యా సమయములో చాలా ఎక్కువగా అందింపబడుతుంటాయి. సంధ్యా సమయంలో వచ్చే సూర్య కిరణములకు,

తరువాత వచ్చే కిరణములకు చాలా తేడా వుంటుంది. అందుకని ఆ సంధ్యా సమయంలో వచ్చే సూర్య కిరణముల కాంతికి మన దేహాన్ని ఉన్ముఖం చేయాలి. చేస్తే చాలా రకములైన actions మనలో జరుగుతాయి.

పరమాత్మయే కృష్ణద్వైపాయనుని రూపంలో తన యొక్క నామాలకు తానే వివరణ ఇచ్చాడు కనుక దానికి ఒక పద్ధతి ఉంటుంది. ఆ పద్ధతిలో మనం అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేయడం ఆయన యొక్క అనుగ్రహం. నిజానికి ఈ విష్ణు సహస్రనామం మనం చెప్పుకుంటున్నాం, లేక మనం వింటున్నాం అనుకుంటే అది ఒక దృక్పథం అవుతుంది. కానీ, సత్యమేమిటంటే విష్ణువు మనని కరుణించినప్పుడు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి అవకాశం ఏర్పడుతుంది. కేవలం భగవంతుని అనుగ్రహ విశేషం కారణంగా, ఈ నామములు మనం విశదీకరించుకోవడం, తద్వారా భగవంతునియందు జీవించడం అన్నది మనకు భగవంతునియొక్క అనుగ్రహం మాత్రమే అని గుర్తుంచుకుని, భగవంతుని యొక్క అనుగ్రహంలో భాగంగా, భగవంతుని యందు ఉంటూ భగవంతుని అవగాహన చేసుకుంటున్నాం అన్నది గుర్తుపెట్టుకోవాలి. భగవంతుడు తమాషాకి కొన్నికొన్ని, ఇట్లా చూడు, అని చూపిస్తుంటాడు. అదీ అనుగ్రహం అంటే.

'ఉప్పు కప్పురంబు ఒక్కపోలిక నుండు, చూడ చూడ రుచుల జాడ వేరు'

రుచులు అంటే మనం తినే రుచులు కాదు అక్కడ. ఉప్పు, కర్పూరము నోట్లో వేసుకుంటే తేడా తెలుస్తుందని ఒక అవగాహన చేసుకోవచ్చు. అలా కాకుండా రుచి అంటే కిరణము, వెలుగు అని కూడా అర్థం ఉంది అని మనకి భాసించవచ్చు, లేదా తెలిసిన వ్యక్తి ద్వారా తెలియవచ్చు. రెండూ కూడా భగవంతుని యొక్క అనుగ్రహాలే. మనకి తెలిస్తేనే భగవంతుని అనుగ్రహం, ఎవరన్నా చెబితే కాదు అనుకోకండి. ఎదుటివ్యక్తి లోంచి మనకి ఇట్లా చూడు అని చూపిస్తూ ఉంటాడు. లేకపోతే మనకే ఇట్లా చూడు ఎట్లా ఉంటుందో అని చూపిస్తాడు. చూడ చూడ రుచుల జాడ వేరు. అంటే వెలుగు యొక్క జాడలు ఎంత చూస్తే అంత. లోకము అంటే మన దృష్టి అన్నమాట. ఎంత చూస్తే అంత కనిపిస్తుంది సుమా! చూడకపోతే కనిపించదు సుమా! వెలుగులు చూసినకొద్ది కనిపిస్తాయండి. ఇది సాధనకు సంబంధించినది. వెలుగు దర్శనం కోసం గదా అందరూ తాపత్రయపడుతుంటారు. ఆ వెలుగుని మనం దర్శనం చెయ్యాలంటే మన చూపులు బావుండాలి. చూపులు బావుండాలి అంటే చూడడానికి ఒక శాస్త్రము ఉన్నది, ఎలాగ వినడానికి ఒక శాస్త్రమున్నదో!

శబ్దముతో ఏ విధముగా ప్రవర్తించవలెను అనేది ఒకటి ఉన్నది కదా! అలాగే రుచి విషయంలో నాలుకతో ఎలా ప్రవర్తించాలి? వాక్కు విషయంలో ఏ విధంగా ప్రవర్తించాలి అని కొన్ని నియమములు మనకి ఇవ్వబడివున్నాయి. అలాగే స్పర్శ విషయంలో ఉన్నాయి. దేన్ని బడితే దాన్ని ముట్టుకోగూడదు. అలాగే చూపు విషయంలో. అంటే కొన్ని చూడగూడదనికాదు. అన్నిటిలోనూ ఒక్కణ్ణే చూస్తుండాలి. ఎంత చూస్తే అంత కనిపిస్తుంది, అన్నారు. మామూలుగా మనం ఏం చేస్తామంటే మనకి కావాల్సింది చూస్తాం తప్ప, ఉన్నది చూడం. మనకేం కావాలో అది చూస్తాం తప్ప, అక్కడ ఏముందో అది చూడం. అందుకని పెద్దలు ఏం చెప్పారంటే నువ్వు చూసేది మిధ్య అన్నారు. ఎందుకన్నారంటే నీలో ఉన్న స్వభావం బట్టి నీవు చూస్తావు కనుక. నీ స్వభావం మారుతుంటే నీ చూపుకు కనబడేవి మారుతుంటాయి. యుక్త వయస్సులో, యవ్వనంలో ఉన్నప్పుడు చూసేచూపుకి, 10 మంది పిల్లలు, 50 మంది మనుమలు ఉన్న వయసులో చూసే చూపుకి తేడా ఉందా లేదా? అలాగే ప్రతి విషయంలో కూడా అనుభవం ద్వారా చూపులో మార్పు వస్తుంది. మన లోపల ఏ స్వభావం కలిగి ఉంటామో అదే చూస్తాము. కాబట్టి మనం దేన్ని చూస్తున్నాము అంటే అది మన స్వభావం అని గుర్తుపెట్టుకోవాలి. అదేమిటోనండి ఇవన్నీ ఇట్లా ఉన్నాయి అని మోసపోవద్దు, మోసపుచ్చవద్దు. మనలోపల వాటికి సంబంధించిన బీజములు ఉండబట్టి బయట అవి చూస్తాం. కొంతమంది road మీద సౌధములు చూస్తుంటారు. కొంతమంది మనుషుల్ని చూస్తుంటారు. కొంతమంది ఇతరుల దుస్తుల్ని, నగలని చూస్తుంటారు. చూడటం దేనిని బట్టి ఉంటుంది అంటే వారివారి స్వభావాన్ని బట్టి ఉంటుంది. కొంతమందికి ఎదుటివాడిలో తప్పులే కనిపిస్తుంటాయి. అది మన చూపుల వల్లనే కదా! తప్పులు కనిపించడమనేది కొంతమందికి సహజమైతే, ఒప్పులు కనిపించడమనేది కొంతమందికి సహజం. అందుకని లోపల నువ్వు ఏ విధమైన పవిత్రతతో ఉన్నావో, అంటే ఏ degree of light నీలో ఉన్నదో అంతవరకు వెలుగు బయట కనిపిస్తుంది. లోపల పూర్తిగా గుడ్డి అనుకోండి, వాడు గుడ్డివాడే! అదే ధృతరాష్ట్రుడు. అందుకని మన చూపులు దేనియందు కేంద్రీకరింపబడి వున్నవి అన్నది చాలా ముఖ్యమైన విషయం. లోపల స్వభావం మారాలంటే బయట చూసే విషయాలు మార్చుకుంటే లోపల మారుతుంది. లోపల మార్చుకుంటే బయట మారుతుంది. ఒక పక్క తిప్పితే రెండో పక్క తిరుగుతుందన్నమాట. ఏడు సముద్రాల

అవతల ఉన్న మర్రి చెట్టు తొర్రలో ఉన్న పంజరంలో ఉన్న పక్షి కాలు తిప్పితే ఇక్కడ రాక్షసుడి కాలు తిరిగిపోతుంది అని కథలు చెప్పుకున్నాం కదా! అట్లా మన లోపల ఉన్న రాక్షసుణ్ణి rectify చేస్తే మన చూపులో మార్పు వస్తుంది. చూపులు మారితే వాడు rectify అవుతాడు. సరళరేఖకి ఈ end లో మొదలు పెట్టినా, ఆ end లో మొదలుపెట్టినా ఒకే విధమైన rectifications ఉంటాయి. అందుకని ఈ విషయంలో మనం ఏం చూస్తున్నాం అన్నది ముఖ్యం. చూసేవి వస్తువులుగా చూసే వారుంటారు. చూసేవాట్లో మనవి, ఇంకోరివి అని చూసేవారు ఉంటారు. మనవారు, పరాయివారుగా చూసేవారు ఉంటారు. మంచివారు, చెడ్డవారుగా చూసేవారు ఉంటారు. అభిప్రాయాలు ఏర్పరచుకొని అభిప్రాయాలు అనే లోకాలలో జీవిస్తుంటారు. ఇవన్నీ దాటి అవతలికి వెళితే తప్ప, అసలు వెలుగు కనిపించదు. అందుకని మన చూపుకి చక్కటి శిక్షణ ఇచ్చారు. ఏమిటీ ఆ శిక్షణ? ఈ సృష్టి నేను అందంగా తయారుచేసాను చూస్తూ వుండు ముందు, అని చెప్పాడు భగవంతుడు. అందుకని మనము మన పరిసరములు వీలైనంతవరకూ అందమైనవిగా తయారుచేసుకుంటూ ఉండాలి. రెండోది రూపములయందు అందం ఏదైతే ఉందో అది నువ్వు చూడడం బట్టి బాగా కనిపిస్తుంది తప్ప వాటి యందు ఉండదు. కొన్నికొన్ని రూపములు అందంగా లేవు అనుకోవచ్చు. నిజానికి మనం మంచి ఆవును చూసినా, మంచి పావురాన్ని చూసినా, తెల్లటి గుర్రాన్ని చూసినా, నిర్మలమైన ఆకాశాన్ని చూసినా, తెల్లని కలువని చూసినా మంచి భావన కలుగుతుంది. అంటే ఎటు చూసినా మన స్వభావంతో సంబంధం లేకుండా మనకి అందం దర్శనమిచ్చే కొన్ని రూపాలుంటాయి. వాటిని చూడడమనేది daily ఒక programme గా రావాలి. మనకి అమ్మవారితో ఒక రకమైన అనుసంధానం ఏర్పడడానికి అది ఒక ప్రాథమికమైన మెట్టు. అందుకని మన చుట్టూ ఉండేవన్నీ అందంగా తయారుచేసుకుంటూ ఉంటే, ఈ రూపంలో ఉండే అందాన్ని గమనిస్తూ వుంటే, రూపం అందంగా లేకపోయినా లోపల అందాన్ని చూసే ఇంకొక మెట్టు ఎక్కడానికి అవకాశం ఉంటుంది. మంచి ఆవును చూసినా, మంచి గేదెను చూసినా దానికి మనలో తేడా వుంటుంది. ఇంకా సమదర్శనం ఏర్పడనప్పుడు అలా ఉంటుంది. మంచి ఆవును చూసినా, మంచి తేలుని చూసినా ఒకే విధమైన చూపు ఉండాలి. సమదర్శనమంటే, సమమైన చూపు గలవాడు. రెండింటి యొక్క కదలిక లోనూ చైతన్యాన్ని చూస్తాడు, కాబట్టి వీడికి తేడా ఏమీ ఉండదు. పాము కూడా

అంతే. పులికి కూడా అంతే. అట్లా ఉండే ఇంకొక రకమైన మనుషులు ఉన్నారు. ఈ మార్పు ఎందుకు వస్తుంది అంటే మనబట్టి మారుతుంది. బుద్ధుడు పిచ్చి ఎక్కిన ఏనుగుని, తన చల్లని చేయి వేసి శాంతింపచేశాడు కదా! అలాగే మనం మారుతికార్లో తిరిగినట్లుగా పులిమీద చక్కగా తిరిగిన వారు ఉన్నారు. ఎట్లా వీలుపడుతుంది అంటే లోపల దర్శనముని బట్టి వీలు బడుతుంది. మనకి అవన్నీ కావాలి కానీ మన చూపులు మారవు. చూపులు మారితే చాలా మార్పు వస్తుంది. మొదటి చూపు ఆకారము నందు చూస్తే, రెండవ చూపు స్వభావము నందు చూడాలి. స్వభావము నందు చూడవలసిన చూపుకి, భాగవతంలో దాదాపు ప్రతి అధ్యాయమందు ఒక నిర్దేశము ఉన్నది. దానిని గమనించి పాటించినట్లైతే మనం ఉత్తీర్ణులము అవుతాము. లేకపోతే ఇట్లాగే ఉండిపోతాం. అదేమిటంటే రెండవపక్క చూడక స్వభావమునందు ఉండే కళ్యాణ గుణములను చూడమని చెప్పారు. ఎదుటి వ్యక్తిలో గాని, ఎదుటి జంతువులో గాని, ఎదుటి చెట్టులోగాని, ఆకారం ఏదైనా కాని ప్రతివాళ్ళలో కలగూరగంపగా మంచి,చెడు మనకి కనిపించినప్పుడు మనవరకు మంచే చూడడం అనే ప్రయత్నం చేస్తుండాలి. చేస్తుంటే మనలో మంచి పెరుగుతుంటుంది. మనం వాళ్ళలో కళ్యాణగుణాలు ఎంత చూస్తే, మనలో అవి అంత పెరుగుతాయి. ఇది చూపుకు సంభందించిన సాధన. వాళ్ళలో క్రమశిక్షణారాహిత్యం ఎక్కువ చూస్తున్నారు అనుకోండి, మనలో తెలియకుండా క్రమశిక్షణారాహిత్యం పెరుగుతూ ఉంటుంది. వాళ్ళు మంచివాళ్ళు కాదనుకొని ద్వేషిస్తున్నాం అనుకోండి, ద్వేషించడం ఒక గుణంగా మనలో ఏర్పడిపోతుంది. ఎవరూ మాకక్కరలేదు, ఎందుకంటే వీళ్ళందరూ పనికిమాలిన వారు అనుకుంటే మనం అది అయిపోతాం. అందుకని మనం మనుషులని చూసినప్పుడు మనం వారిలో కళ్యాణగుణాన్ని చూడాలి. ఎంత గేదైనా మనకు పాలిస్తుంది గదా! ఈ సృష్టిలో పనికిరానిది అంటూ ఏదీ లేదు. అన్నీ పనికి వచ్చేవే. దానితో మనం ఏ విధంగా ప్రవర్తించాలో తెలుసుకోవటం వలన, మనకి సమభావం ఏర్పడుతుంది. కనుక భగవంతుడు ఈ రూపాన్ని, ఈ జీవాన్ని, ఈ విధంగా ఎందుకు తీసుకువచ్చాడు? దానిలో ఉండే సద్గుణం ఏమిటి? అనేది మనం తెలుసుకుంటే అది ఒక పద్ధతి. వెధవ ఎలుకలు ఇంటినిండా నానాదరిద్రం చేస్తున్నాయి అనుకుంటాం కదా! కాని ఎలుకలలో గూడ ఒక చక్కటి గుణం ఉన్నది. అదేమిటి? Skill in action. కర్మలయందు కౌశలం, movement లో skill తీసికోవచ్చు.

పులిని గురించి మనకొక భావన ఉండవచ్చు, దానివరకు అది ఏదైనా ఒక నిర్ణయం చేసుకుంటే అది పూర్తి అయ్యేంతవరుకు ఎట్టి పరిస్థితులలోనూ ఊరుకోదు. అంటే పట్టుదల! అట్లా ప్రతిజీవి యొక్క స్వభావమును మనం గమనిస్తున్నప్పుడు అందులో ఉండే కళ్యాణ గుణములను ఎక్కువ దర్శనం చేయటం అనే దృష్టిని ఏర్పరచుకుంటూ ఉండాలి. దాని వలన వెలుగు లోకాల్లోకి ఇంకొక మెట్టు ఎక్కిన వాళ్ళమవుతాం. లేకపోతే వెలుగులోకాలు ఉంటాయట, అని చెప్పుకోవాల్సివస్తుంది. ఇంకొకళ్ళని చూసి మురిసిపోవటం తప్ప మనం ఇక్కడే ఉంటాం. ఎన్నాళ్ళని మురిసిపోతాం ఇంకొకళ్ళని చూసి. మనం అట్లా తయారవ్వాలనే జిజ్ఞాస మొదలవ్వాలి కదా! జిజ్ఞాస మొదలైనప్పుడు ఒక మార్గం ఉండాలి కదా! ఆ మార్గం ఇది. మనకి పవిత్రమైన గ్రంథములలో ఇచ్చిన మార్గం. మొదట అందమైన రూపములను చూడటమనే ప్రయత్నం చేయండి. సముద్రాన్ని చూడండి, సూర్యోదయం చూడండి, చంద్రోదయాన్ని చూడండి, నక్షత్రాల్ని చూడండి, ఆకాశాన్ని చూడండి, చక్కగా విరబూసిన పూలచెట్లు, పళ్ళచెట్లు చూడండి. అందమైన జంతువులను చూడండి. చూసి ఒక్క క్షణం దానియందు ఉన్ముఖులై ఉండండి. అది మొదటి మెట్టు. రెండవ మెట్టు అన్నిజీవుల స్వభావములయందు ఉన్న సద్గుణములను చూడండి. చూస్తే ఏమవుతుంది అంటే లోపల ఆనందం పెరుగుతూంటుంది. ఎందుకంటే అందులో మనకి ఏది పనికి వస్తుందో దానితో ఏకీభావం చెందుతున్నామే తప్ప, మిగతా చెత్తతో ఏకీభావం చెందటంలేదు. వాడిలో చాలా చెత్త ఉందనుకోండి అందులో కాలు, వేళ్ళు పెడితే అది మనకి అంటుకుంటుంది. తెలుగులో చాలా చక్కటి సామెత ఉంది. 'అశుద్ధం మీద రాయేస్తే మొహం అంతా చిందింది' అని మనం అటు పోయినకొద్దీ పతనమే తప్ప, ఏ మాత్రం లోపల ఒక రకమైన సమీకరణం, consolidation జరగదు. అందుకనే భగవంతుడు అందరి యొక్క కళ్యాణగుణములుగా నేనే ఉన్నాను, చూస్తుండమన్నాడు. భగవంతుడు విభూతియోగంలో నాయొక్క విభూతి చూడు, రుద్రులలో శంకరుడిగా, పాండవులలో అర్జునుడిగా, తిధులలో ఏకాదశిగా , మాసములలో మార్గశీర్షముగా-- ఉన్నాను అని చెప్పాడు. ఇవన్నీ ఎందుకు చెప్పాడు? ఎక్కువ వెలుగల్లే అక్కడ కనిపిస్తున్నాను కదా, చూడవేం? గుడ్డివాడివలే అని. ఇట్లా రూపములు, స్వభావములు చూస్తుంటే, ఇతరులయొక్క స్వభావము మనమీద ప్రభావం చూపించవు. మనం చాలా సులభంగా effect అయిపోతాం

గదా! వాడు వెధవ అన్న భావమే చాలు మనము effect అయిపోవటానికి. శమము లేక మనం సులభంగా ప్రశాంతతని పోగొట్టుకుంటుంటాం. ఆ శమము మనకి ఎప్పుడు ఏర్పడుతుందంటే, ఈ విధమైన చూపుతో వారిలో ఉన్న మంచి చూసి, చెడుతో మనం interact కానప్పుడు. ఒక తేనెటీగ ఏం చేస్తుందండి? గులాబీ చెట్టుకు ముళ్ళున్నాయని, ఆ ముళ్ళ గురించి discuss చేస్తుందా? ఆకుల మీద వాళ్ళు వీళ్ళు ఉమ్మేశారు అని చూసుకుంటుందా? ఆ ప్రక్కనే గేదె పడుకుంది, నేను వెళ్ళను అంటుందా? దానికి కావలసింది అక్కడ ఉండే center point, పువ్వులో ఉండే తేనె. మకరందముతో మాత్రమే సంబంధం పెట్టుకునే తేనెటీగ యోగమునకు చాలా పవిత్రమైన చిహ్నము. అడ్డమైన విషయాలలోనూ మన దృష్టిని ప్రవేశింపచేయకుండా, ఆ మొత్తం సన్నివేశములో మనకి ఏది అవసరమో దాని యందే మనం ప్రవర్తిస్తూ, మిగతాది ప్రక్కన పెట్టేయాలి. పొట్టుతో సంబంధం లేకుండా బియ్యాన్ని ఉంచుకున్నట్లు. పువ్వుల రేకులతో సంబంధం లేకుండా, వాటికి బాధ కలుగకుండా కేవలం మకరందం యొక్క ఆస్వాదనమే చేసుకుంటూ జీవిస్తుంటే, మనకి ఎవ్వరితోనూ తంటా ఉండడానికి అవకాశం లేదు. తంటా ఎందుకు వస్తుందంటే అందుకుగాను అని పక్కన చేసే పనులతో ఎక్కువ వస్తుంటుంది. అందుకని కళ్యాణ గుణములను చూడడం ద్వారానే దృష్టి యొక్క స్థితి కొంచెం మనయందు ఉద్ధరింపబడుతుంది. నిజానికి మనకి కళ్ళు ఉన్నాయి కాని గుడ్డివాళ్ళం. చెవులు ఉన్నాయి గాని చెవిటి వాళ్ళం. నాలుక ఉన్నది గాని దాన్ని ఎట్లా వాడుకోవాలో తెలియదు కనుక మూగవాళ్ళం. అందుకనే సరస్వతీ సూక్తం లో నన్ను చూస్తూనే ఉంటారు గాని మీరు చూడరు. నన్ను వింటూనే ఉంటారు గాని మీరు వినరు.

'ఉతత్వః పశ్యన్నదదర్శ వాచం, ఉతత్వ శృణ్వన్న శృణోత్యేనామ్:'

అని చెబుతుంది ఆమె. ఎందుకంటే, మనం అది తప్ప ఇంకోటి చూస్తాం. గుడికి వెళ్ళి అక్కడి క్యూలు, అక్కడ జరిగే అన్యాయాలు, పురోహితులు చేసే పనులు ఇవన్నీ చూసివచ్చే వాళ్ళు లేరూ? అందుకా మనం గుడికి వెళ్లింది? నువ్వెందుకు వెళ్ళావు? వెళ్ళిన పని మర్చిపోయి, మిగతావన్నీ పట్టుకొచ్చుకుంటాం ఇంటికి. అంతకు ముందు అవి లేవు నీ దగ్గర. ప్రత్యేకంగా పట్టుకొచ్చుకుంటావు. చాలా మంది సామాన్యంగా ఎదుటి వ్యక్తిలో ఉన్న అక్కరలేనివన్నీ పట్టుకొచ్చుకుంటారు. కావలసింది మర్చిపోతుంటారు. అందుకనే ఒక పరమగురువు మన సాన్నిధ్యంలో

మెలుగుతుంటే కూడా అందుకోలేము. ఆయన దగ్గర నుంచి శాస్త్రములు పుచ్చుకోవటం కూడా మహత్తరమైన విషయం కాదు. నాకు శకున శాస్త్రం ఇవ్వండి, నాకు వైద్య శాస్త్రం ఇవ్వండి, నాకు జ్యోతిష్యశాస్త్రం ఇవ్వండి సార్ అంటే ఇస్తారు, కాని ఆయన మనయందు ఉండేట్టుగా, మనం ఆయన యందు ఉండేట్టుగా ఒక పద్ధతి ఉంది. ఆయనే మనతో ఉంటే మిగతా శాస్త్రాలన్నీ ఒక్కొక్కటే అడగడమెందుకు? అన్నీ ఉంటాయి కదా! ఆ దృష్టి ఎప్పుడు వస్తుంది అంటే , కేంద్రమునందు వుంటూ, side issueలలో participate చెయ్యకుండా essentials యందు జీవించినప్పుడు మాత్రమే ఆ దృష్టి వస్తుంది. కావలసిన వస్తువు కోసం shopలోకి వెళ్ళి ఆ వస్తువు ఒక్కటీ కొని, వచ్చిన వాడు ధన్యుడు. ఇంకా అక్కడా ఇక్కడా అవీ ఇవీ చూపిస్తుంటే దానితో పాటు అవన్నీ వేసుకొచ్చేవాడు యోగానికి పనికిరాడు. నీకేది అవసరమో దాని కోసం వెళ్ళాలి. చాలా మటుకు అవసరం లేకుండానే వెళతావు. అవసరం ఉండి వెళ్లినప్పుడు కూడా బాగున్నాయి కదా అని కొనుక్కుంటాం. మళ్ళీ ధరలు పెరిగిపోతాయేమో అని కొనుక్కుంటాం. అట్లా కొనుక్కునే వాళ్ళకి దృష్టి కుదరదు. ఎందుకంటే దృష్టి కేంద్రీకరణము బాగా తగ్గి, పల్చబడి పోతుంది. ఎక్కడ కేంద్రీకరణం చెయ్యాలంటే ఈ కళ్యాణగుణాల మీద కేంద్రీకరణం చెయ్యండి. బావున్నదల్లా మనకి ఉండనక్కరలేదు. చూసి ఆనందిచవచ్చు కదా! బావుంది గదా అని అన్నీ కొనుక్కొచ్చుకుంటే ఇల్లు పట్టదు. బావున్నది చూసి ఆనందించాలి తప్ప, బావుంది గదా పొందుదాం అనుకుంటే రావణాసురుడి లాగా అయిపోతాం. Homeopathy theory లో psorinum అనే మందుకి గురి అయిపోతాం. Mayasam. మనకి అదే problem. ప్రతిదీ అవసరమున్నా లేకపోయినా మనకు కావాలి. అలాగా కాక స్వభావమునందు ఉన్న మంచితనాన్ని గుర్తించడం ఒక అభ్యాసంగా చేస్తూ ఉండాలి. చూడ చూడ రుచుల జాడ వేరు అన్నాం కదా! అబ్బేబ్బే ఆయన ఏమీ లాభం లేదండీ అనే వాళ్ళలో చాలా మంచితనం కనిపిస్తుంది మంచివాడికి. చూస్తే డోకొచ్చే యువతిలో అపరిమితమైన అందం కనిపిస్తుంది కృష్ణుడికి. కుబ్జ సన్నివేశంలో మనబోటి వాళ్ళమైతే తిన్నది వెంటనే డోక్కుంటాం. అంటే ఏం చూస్తున్నాడు ఆయన? మనం చూసేదీ వేరు ఆయన చూసేదీ వేరు. మనం లోపల చూడం కదా! పొర దాటి లోపలకి వెళ్ళం. దృష్టి అట్లా ఆగి పోతుంది. దూసుకుపోదు లోపలికి. దూసుకుపోయే వాళ్ళు, స్వభావంలో

మంచితనం చూసి 'సుందరి' అని పిలుస్తారు. సత్యసాయిబాబా గారు 'బంగారు' అని పిలుస్తారు. ఏమిటి మనలో బంగారం? మనకి తెలుసుకదా మనం ఎంత బంగారమో! ఆయన చాలా అమాయకులు మనదంతా rolled gold. అయినా 'బంగారు' అని పిలుస్తారు. ఆయన మనలో ఉండే బంగారాన్ని మాత్రమే చూస్తారు తప్ప, మిగతావాటితో ఆయనకేమీ సంబంధం లేదు. ఇక్కడ బంగారం అంటే అర్థం ఆ చైతన్యస్వరూపము ఏదైతే ఉందో అది. దాన్ని 'బంగారు' అంటారు. దేన్ని పలకరిస్తున్నారు అంటే చైతన్యాన్ని ఒక్కసారి touch చేస్తారు. అంటే జ్యోతిస్వరూపులారా, అని అర్థం. ప్రేమస్వరూపులారా, అంటారు. అంతే గాని వ్యాపారస్తులారా, ఉద్యోగస్తులారా , రాజకీయనాయకులారా! అని ఇట్లా ఉండదు గదా! ఎందుకు ఉండదు అంటే దాని యందు వాళ్ళకి దృష్టి ఉండదు కాబట్టి. మన దృష్టి ఎట్లా ఉంటుంది ? ఒక officer వచ్చాడనుకోండి మన దగ్గరికి, పైగా వాడితో చాలా పని ఉందనుకోండి, అంతే తత్తరబిత్తరగా ఉంటుంది. మనమే వాళ్ళ దగ్గరికి వెళ్ళాల్సిన వాళ్ళం, వాడే మన దగ్గరకు వస్తే ఎంత కంగారుగా ఉంటుంది? ఎందుకు ఉండాలి కంగారు? అట్లా ఉంటుంది? ఎందుకంటే మనం చూసేది వేరు. చూడ చూడ రుచుల జాడ వేరు, అన్నప్పుడు ఏమిటి చూస్తున్నావు నువ్వు? రెండో మెట్టు స్వభావంలోని కళ్యాణగుణములను మాత్రమే చూస్తూ మిగతాది మర్చిపోవాలి అనేది నీ స్వభావం అవ్వాలి. అది అయితేనే దారి. లేకపోతే దారి లేదు. ఇంకొకటి చూస్తున్నావు అంటే పనికి రావు. పాపం ఏసుక్రీస్తుని మేకులు కొట్టేస్తుంటే, 'వీళ్ళు తెలియక కొడుతున్నారు, ఏం అనుకోకు. వీళ్ళని క్షమించు' అంటాడు పైన ఆకాశంలో ఉన్న వాళ్ళ నాన్నగారితో. అది పరాకాష్ఠ. అది మనం ఊహించే విషయం కాదు. మనకి మేకులు అక్కరలేదు, చిన్నమాట అంటే చాలు జన్మాంతం గుర్తుపెట్టుకొని సాధిస్తాం. మనకి పొరపాటున ఒక్క మేకు తగిలితే వాడికి నఖశిఖ పర్యంతం మేకులు కొట్టేస్తాం. మనం అట్లాంటి పవిత్ర నామాలు తలచుకోవడానికి చాలా అర్హత సంపాదించుకోవాలి. ఏదో వాళ్ళు ఒప్పేసుకున్నారు కాబట్టి వాళ్ళ ఫోటోలు పెట్టేసుకొని, వాటికి ఒక పువ్వుకూడా పెట్టకుండా, కనీసం తుడవకుండా ఉంటాం. నిజానికి వాళ్ళుఏమిటి చూస్తున్నారు మనయందు? మనం ఏమి చూస్తున్నాం? అందుకని రూపంలో గల అందాన్ని చూసిన తరువాత, స్వభావంలోగల అందాన్ని మాత్రమే చూడగలిగిన ప్రయత్నమే సాధన. లోపల అంతరంతరాలలో మనకి అక్కడ బాగా పట్టు ఉన్నట్లయితే దృష్టి ముందుకు సాగదు

కాబట్టి ఏమీ కనిపించదు. అందుకని మనం భాగవతంలో చెప్పబడిన కళ్యాణగుణముల దర్శనం కార్యక్రమంగా చేసుకుంటూ ఉండాలి. చేస్తూ ఉంటే మిగతావి పడిపోతాయి. ఎదుటివ్యక్తిలో ఎద్దేవా చేసివి చూస్తున్నామంటే మనకి చాలా programme ఉందనే! ఎదుటివ్యక్తిలో కళ్యాణగుణములను చూడడం వల్ల దృష్టికి ఇంకొంచెం projecting power వస్తుంది. We will be able to see, అనేది ఏర్పడుతుంది. అక్కడ నుంచి ముందుకు వెళితే కనిపిస్తుంది ఎంత వైభవంగా ఉందో. అది విభూతియోగం. అక్కడి నుంచి ఇంకొంచెం ముందుకు వెళితే 11వ అధ్యాయములోకి వెళ్తాం. అక్కడ ఏముంది? అన్ని జీవరాసులలోనూ జరిగే స్పందనము. అది చూసేవాడు ఋషి. రూపము, గుణములు దాటిన తర్వాత వైభవము. వైభవము దాటిన తరువాత స్పందనము. ఈ స్పందనము బాగా చూడగలిగే స్థితికి చేరుకున్నామంటే అప్పుడు ఋషుల పాదధూళిని కాస్త స్పర్శించే అర్హత కలిగినవాళ్లమవుతాం. లేకపోతే ఋషుల పేర్లు మనకీ తెలుసు అని చెప్పుకోవాలి. ఆ మైత్రేయులూ- అని మాట్లాడుతామే అలా మాట్లాడగూడదు. ఆ పేరు ఉచ్చరించే అర్హతకి ఒక సాధన ఉంది. అందుకే చాలా తక్కువ మాట్లాడాలి వాళ్ళ గురించి. పైగా పెద్దవాళ్ళ గురించి మాట్లాడేటప్పుడు చాలా వినమ్రత కావాలి. ఎందుకంటే మనకి, వారి చూపులకు దూరంలో ఉన్నప్పుడు, short sight తప్పా దూరదృష్టి రాదు. ఇవన్నీ జరిగితే దూరదృష్టి సులభంగా వస్తుంది. ఎట్లా అంటే కళ్ళు మూసుకుంటే చాలా దూరంలో జరిగేవి కూడా కనిపిస్తాయి. మనకి దూరదృష్టి అంటే చత్వారమే. అది 40వ పడిలోకి రాగానే వచ్చేస్తుంది. మన దృష్టిని వ్యాపనం చెందించుకోవచ్చు. చెందితే హంసస్వరూపుడుగా ఉండే అన్ని జీవులను చూడటానికి అవకాశం ఉంటుంది. అందరిలోనూ ఉంది గదా అది. అణువు దగ్గరనుంచి ఆకాశం వరకు, అన్నింటిలో గూడ ఈ స్పందనం అనే ప్రక్రియ చక్కగా గోచరిస్తుంది. అదే చూస్తాడు ఋషి. ఇంకేమీ చూడడు. అది చూస్తే మిగతావన్నీ అర్థమైపోతాయి వాళ్ళకి. అది అడ్డ గోలగా కొట్టుకుంటుందా? సత్వ లయాత్మకంగా ఉందా? అడ్డ గోలగా కొట్టుకునే వాళ్ళ, సత్వ లయాత్మకంగా లేని వాళ్ళ జోలికి వీళ్ళు పోరు. కాస్తోకూస్తో సత్వ లయాత్మకంగా వున్న ప్రతి జీవినీ ఋషి చాలా సులభంగా గమనించి, చిరునవ్వు చిందిస్తాడు. అలాగని వాళ్ళ జోలికి పోరు. అందుకనే మనబోటి వాళ్లెవరికీ కనబడకుండా తిరుగుతుంటారు. మనల్ని పలకరిస్తే వాళ్ళకి disturbance తప్ప ఏమి లేదు. మనం వాళ్ళని disturb

చెయ్యలేం కానీ వాళ్ళ పలకరింపువల్ల మనలో disturbance వస్తుంది. ఎందుకంటే ఒక కిరణం మనలోంచి దూసుకు వెళ్ళి కొంత అపవిత్రతని తొలగించడం మొదలుపెడితే జబ్బులొచ్చే స్తాయి. ఒక్కొక్కసారి చచ్చిపోవచ్చు. ఎందుకంటే మనకి అర్హతలేని శక్తి మనలో ప్రవేశిస్తే అటువంటివి జరగటానికి అవకాశం వుంది. అందుకని వాళ్ళు తప్పించుకు తిరుగుతారు, మన కోసం. కాబట్టి విశ్వరూప సందర్శనం వరకు దృష్టికి సంబంధించిన మెట్లు ఇవి . ఆకారంలో అందం, స్వభావంలో అందం చూసిన వారికే వైభవం అన్నది తెలుస్తుంది. స్వభావంలో అందాన్ని చూసి, అమ్మవారి వైభవాన్ని అనుభూతి చెందుతున్న వాళ్లే అమ్మవారి యొక్క సృష్టిని చూసి ఆనందించే వాళ్ళు. అంతవరకు ఈ సృష్ఠి, ఇదంతా ఎందుకు చేశాడు nuisance అన్నట్లుగా వుంటుంది. ఎందుకంటే దృష్ఠి సరియైనది ఏర్పడక. దృష్ఠి సరియైనది ఏర్పడినప్పుడు ఈ విధమైన భావనలు కలగవు. అందుకని దృష్ఠి ఏర్పడినప్పుడు అంతా సమన్వయంగానే వుంటుంది. రామకృష్ణ పరమహంస ఎప్పుడూ అమ్మవారి సృష్ఠి వైభవాన్ని ఆ విధంగా ఆనందిస్తూ వుంటారు. ఆయనకి అమ్మవారి యొక్క విన్యాసమే ఈ సృష్టి, ఈ సృష్ఠి లోని జీవుల కదలిక అంతా. ఎవరో నా బోటి చదువుకున్నవాడు వెళ్ళి ఏముందండీ ఇక్కడ అంతా అన్యాయమే కదా ఈ కలియుగంలో, మోసమే కదా, అంటూ ఏవేవో ఏకరువు పెడతాడు. అవేమీ నాకు కనిపించటం లేదే, అంటారు రామకృష్ణ పరమహంస. 'అదేమిటండీ బహుశా బయట ఎక్కువగా తిరగరు కాబట్టి మీకేమి తెలియడం లేదు,' అంటాడు. అది వీడి దృష్టే! ఆయన తిరుగుతున్నాడో లేదో వీడికి తెలుసా? తిరగటమంటే physical గా తిరగటమే కదా వీడికి తెలిసింది! Physic ని అక్కడ పారేసి తిరగగలిగిన స్థితిలో ఉన్నవారిని, అబ్బే మీరు తిరగటం లేదు అన్నట్లుగా, ఉంటుంది. ఏ పనీ చెయ్యనట్లుగా కనిపిస్తూ అన్నిపనులు చేసే వాళ్ళు ఉంటారు. ఎంటండీ ఏమీ చేయడంలేదు, అన్నట్లుగా ఉంటారు. మన దృష్టి భౌతికాన్ని దాటి వెళ్లదు కాబట్టి అట్లా అన్నాడు ఆయనెవడో. 'మీరేమీ తిరగరు; పైగా గుళ్ళో కూర్చొని అమ్మవారికి ప్రసాదాలు చేసుకుంటూ ఉంటే ఏమి తెలుస్తుంది? కలకత్తాలో ఏమున్నాయో మీకేం తెలుసు?' అన్నట్లుగా అడుగుతాడు. అప్పుడు ఆయన చెప్తారు 'బయటికి కనిపించేదంతా బహుశా మన బట్టి ఉంటుందనుకుంటా' అని. ఎందుకంటే వాడికన్ని పనికిరానివి కనిపిస్తున్నాయి కదా బయట, నీ లోపల నువ్వు అదే అని చెప్పకుండా ఇలా చెప్పాడన్నమాట. అట్లా మన లోపల మారాలి అంటే ఈ విధమైన

సాధన చేసుకుంటూ వెడుతుంటే మారుతుంది. ఏ విధమైన సాధనా? అందమైనవి చూస్తూ ఉండడం. అన్నీ ఆకారాలలోనూ అందం చూస్తూ ఉండడం. అందమైనవి చూడడం పెద్ద కష్టం కాదు. అందమైనవి ఉన్నా అవి కూడా చూడలేని busy mind ఉంటే అది కూడా చూడలేం. ఎవరూ రక్షించరు వారిని. బీచ్ ఒడ్డున నడుస్తూ సముద్రాన్ని చూడని వారు కూడా ఉంటారు. నక్షత్రాలని చూడని వారు ఉంటారు. అలలు ఎట్లా వస్తున్నాయో చూడని వారు ఉంటారు. సముద్రం ఏ రంగులో ఉన్నది చూడని వారు ఉంటారు. ఆకాశంలో రంగులు ఏమిటి'? అని చూడరు. రైల్లో వెళుతుంటే కొండలు ఎట్లా ఉన్నాయి? చెట్లు ఎట్లా ఉన్నాయి అని చూడని వారు ఉన్నారు. ఎంతసేపూ లోపల పేకాట ఆడుకొనేవారు ఒకరు, నిద్రపోయేవాడు ఒకడు, పుస్తకం చదువుకొనే వారు ఒకరు. Paper book కన్నా living book ఎక్కువ important. Paper book లో ఎక్కువ engage అయినవారు living book ని చూడలేరు. నువ్వు ఇంతదూరం ప్రయాణం చేసి వచ్చావుగదా! దారిలో ఏం కనిపించాయి అని అడిగితే, నీకేం తెలుసు? పుస్తకంలో మొహం పెట్టుకొని కూర్చున్నావు కాబట్టి నీకేం తెలియదు. నిద్ర పోయావు గాబట్టి నీకేమీ తెలియదు. కాబట్టి next time అక్కడ నుంచి ఏమైనా తీసుకురావాలంటే నువ్వు పనికి రావు. దృష్టి ఏర్పడినవాడు అన్నీ చూడగలుగుతాడు. చూడగలిగితే అన్నీ తెలుస్తుంటాయి. తెలుస్తూ ఉండడం అనేది భగవంతుని అనుగ్రహం. నువ్వు ఈ ప్రయత్నం చేస్తూ ఉంటే భగవంతుని యొక్క అనుగ్రహం వస్తుంది. అట్లా చూస్తూ ఉంటాడట ఒకాయన మొత్తం సృష్టి నంతాకూడా. ఆ చూస్తూ ఉండేవాడిని కశ్యపుడు అన్నారు. ఆదిత్య అంటే అదితి నుంచి పుట్టుకు వచ్చినవాడు అని చెప్పుకున్నాం కదా! ఎవరు పుట్టుకువచ్చారు అదితి నుంచీ అంటే తండ్రి అయిన కశ్యపుడు పుట్టుకువస్తాడు కొడుకుగా; "ఆత్మా వై పుత్ర నామాసి" అని కదా! కశ్యపుడు అదితి నుండి ఆదిత్యుడు గా దిగి వచ్చాడు. ఎందుకంటే ప్రకృతి పురుషుల యొక్క ఈ విన్యాసంలో పురుషుడు ప్రకృతి నుండి దిగి వస్తుంటాడు. అది దాటి వెళ్ళగానే ఇంకోటి అవుతుంటాడు. ఇట్లా వాళ్ళిద్దరూ గడపలు దాటుకొంటూ సృష్టి చేసుకుంటూ వస్తారు. గడపలన్నీ అమ్మవారు. అందుకని గడపకి పసుపు రాసి బొట్టు పెట్టుకుంటాం. గడప ఇవతల ఉండే చోటుకి, గడప అవతల ఉండే చోటుకి స్వభావంలో తేడా ఉంటుంది. ఉండదా? ఉదాహరణకి attached bathroom ఉంది bedrooms కి. Bedroom లో ఉండే చోటుకి, bath room లో ఉండే చోటుకి difference

ఉన్నది కదా! ఏమిటీ తేడా అంటే గడప! ఇంటి బయటికి, ఇంటి లోపలికి చోటులో తేడా ఉంది. చోటులో అంటే చోటు స్వభావంలో తేడా. తేడా ఎక్కడ ఉంది? గడపలో. అందుకని గడప అమ్మవారు. ఒక్కొక్క గడపా ఎంతో నమ్రతతో దాటాలి. లోకములన్నీ కూడా ఈ గడపలు ఏర్పరచటం వల్ల ఏర్పడినాయి. ఒకే అయ్యవారిని ఆవిడ ముక్కలు ముక్కలుగా ప్రహారీలు కట్టేసి తయారుచేసింది. అదీ పురుషమేధం అంటే. తయారుచేస్తే ఒక్కొక్క చోట ఒక్కొక్క రూపం. ఒక్కటే ఇన్ని రకాలుగా వచ్చేశాడు. చోటు ఒకటే అయినప్పటికీ మన సింహద్వారం బయట ఉండే చోటు వేరు. మన ఇంట్లో ఉండే చోటు వేరు. ప్రహరీగోడ అవతల ఉండేది వేరు. ఇవతల ఉండేది వేరు. గోడలు ఎందుకు కట్టుకుంటారు? ఇందుకు కట్టుకుంటారు. అందుకని ఎక్కడన్నా ఏదన్నా దాటుతుంటే లోకాలు దాటుతున్నాం. అంటే అమ్మవారిని దాటి వెళ్ళుతున్నాం కాబట్టి వాటియందు మనకి వుండే భక్తి ప్రదర్శించడం కోసం వాటికి పసుపు రాసి, బొట్టు పెట్టి దణ్ణం పెట్టుకోవడం. వాస్తు ప్రకారం కూడా ఉత్తరం కన్నా దక్షిణాన కొంచెం ఎక్కువ స్థలం ఉందనుకోండి, ఒక 4 అడుగుల గోడ, గోడే అక్కరలేదు, కొంచెం ఎత్తుగా మట్టి పోసుకున్నా energies movement ఇంకో విధంగా ఉంటుంది. అంటే గడపల వరకు ఇచ్చేశారు మనవాళ్ళు అధ్యాత్మిక జీవనంలో. నిత్య జీవితంలో యోగసాధన అంటే ఇంతకన్నా ఇంకేమి వుంటుందండి? ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చారు అంటే జీవితంలో ప్రతి చిన్న విషయంలోకి ఆధ్యాత్మికతని ప్రవేశపెట్టిన మహర్షులు మన పూర్వీకులందరు. కాబట్టి మనం అవన్నీ తెచ్చుకుంటూ ఉండాలి. అందుకని కశ్యపుడే అదితి నుంచి ఆదిత్యుడుగా దిగి వచ్చాడు. దిగి వచ్చిన వాళ్ళంతా వెలుగు లోకాలకి అధిపతులు. మీరంతా ఈ section చూస్తుండయ్యా అని చెప్పారు. ఈ మొత్తం సృష్టిని కన్ను పెట్టి చూస్తుండే వాడిని కశ్యపుడు అంటారు. The Onlooker. దానికి ఇంకొక పదం అవలోకతేశ్వరుడు. సృష్టికి సంభందించిన అవలోకతేశ్వరుడు కశ్యపుడు. భూమికి సంభందించిన అవలోకతేశ్వరుడు గౌతమ బుద్ధుడు. ఈ భూమి మీద సర్వజీవరాసులను ఒక కంట కనిపెడుతుంటాడు బుద్ధుడు. అందుకని బుద్ధుడ్ని అవలోకతేశ్వరా! అని పిలుస్తారు వాళ్ళు. ఇది భూమికి సంభందించిన అవలోకతేశ్వరుడు. అక్కడ మొత్తం సృష్టినంతా ఈశ్వరత్వంగా చూస్తాడు. అదీ కశ్యపుడు. ఆయనకి 12 మంది భార్యలు. అందులో అదితి మొదటి భార్య. ఆవిడలో నుంచి తానే ఆదిత్యుడుగా బయటకి వస్తాడు. వచ్చి ఏం చేశాడు?

వెలుగు లోకాల యొక్క సృష్టి.  తనే దితి కడుపు నుంచి బయటకు వచ్చాడు. దైత్యులు వచ్చారు. ఇట్లా 12 మంది భార్యల ద్వారా తను బయటకి వచ్చేసరికి 12 భావములకు కావలసింది ఏర్పడిపోయింది.  12 మంది ఆదిత్యుల నామములు. 1) సవిత 2) ధాత 3) శక్ర 4) త్వష్ట 5) పూష 6) అర్యముడు 7) భగుడు 8) వివస్వంతుడు 9) విష్ణువు 10) అంశుమంతుడు 11) వరుణుడు 12) మిత్రుడు. ఇట్లా  బయటకి వచ్చి వెలుగు లోకాల సృష్టి చేస్తే,  కేవలం వెలుగు ఉంటే సరిపోతుందా?  అందుకని చీకటి. చీకట్లో పని చేసేవాళ్ళు కొంతమంది ఉన్నారు, వెలుగులో పని చేసే వాళ్ళు కొంతమంది ఉన్నారు.  మనకి వెలుగులో పని చేసే వాళ్ళే బాగా కనిపిస్తారు. చీకటిలో పని చేసేవాళ్లు కనిపించరు. Stage మీద perform చేసేవారే ఎక్కువ తెలుస్తుంటారు తప్ప, stage వెనుక పనిచేసేవాళ్లు కనిపించరు కదా! ఒక నాటకంలో గాని, ఒక సినిమాలోగాని  ఒక hero పాత్ర వేసిన వారికి, ఒక heroine పాత్ర  వేసిన  వారికి ఎక్కువ ప్రాధాన్యత చూపిస్తుంటాం. కానీ వాడు అట్లా ఉండడానికి, వాడి చేత మాటలు చెప్పించడానికి రాసినవాడు ఒకడు ఉన్నాడు. అది ఎట్లా నాటకీయంగా చెప్పాలో చెప్పినవాడు ఒకడున్నాడు. వాడికి వేషం వేసిన వాడున్నాడు. వాడి మీద సరియైన focus చేసినవాడొకడున్నాడు.  వీళ్ళందరూ ఉండబట్టి కదా వీడిట్లా కనిపిస్తున్నాడు.  మనకి వాళ్ళందరూ కనబడరుకదా! ఈ కనిపించే వాళ్ళని గౌరవించడమనేది ఒక స్థితి మన అవగాహనలో.  తెర వెనుక కనిపించకుండా ఉండి పనిచేసే వాళ్ళని కూడా గమనించే వాళ్ళు  నిజమైన యోగులు, ఋషులు. వాళ్ళు రెంటినీ గౌరవిస్తారు. వాళ్ళకి  సంభంధించిన వాడు ఈ పుష్కరాక్షుడు.

## 43. పుష్కరాక్షః

పుష్కర అంటే నల్ల కలువ అని అర్థం. నల్ల కలువలు ఉన్నాయి, తెల్ల కలువలు ఉన్నాయి. తెల్ల కలువలు పగలు సూర్యుడు రాగానే విచ్చుకుంటాయి. రాత్రి చంద్రుడు రాగానే నల్ల కలువలు విచ్చుకుంటాయి. రెండూ ఈయన నుంచే వచ్చినాయి సుమా! కశ్యపుడు ఇద్దరి ద్వారా రెండు రకాలుగా వచ్చాడు. ఒకటి positive energy, ఇంకోటి negative energy. రెండూ కలిపితేనే గదా సృష్టి! అట్లా బయటకి వచ్చింది. ఒకటి అమావాస్య అయితే ఇంకొకటి పౌర్ణమి. ఒకటి వృద్ధి, ఇంకొకటి తరుగు. ఎంతసేపూ వృద్ధి తప్ప తరగక పోతే మనం దెబ్బతింటాం. అందుకే వినాయకుడి పొట్ట చుట్టూ పాము వేసి కట్టేశారు. పెరుగుదల ఒక స్థితిలో ఆగకపోతే practical గా ఉండదు. మనలో పెరుగుదల, తరుగుదల సమంగా పని చేస్తూ మధ్య వయసులో మనము ఉండేటట్టుగా చూస్తారు. ఆ తరువాత పెరుగుదల తక్కువగా, తరుగుదల ఎక్కువగా ఉంటుంది. ఏమిటీ చిక్కి పోతున్నారు, అంటుంటాం. చిక్కిపోతున్నామని బాధ పడనక్కరలేదు, ఎందుకంటే చిక్కిపోయే time వచ్చింది కాబట్టి చిక్కిపోతారు. పెరుగుతున్నాం అన్నారు కదా పెరుగుతున్నప్పుడు. పెరుగుట తరుగుట కొరకే. కాబట్టి తరగటమన్నది ఒక natural process. పెరగటం అన్నది ఎంత సహజమో తరగటమన్నదీ అంతే సహజం. అట్లాగే వెలుగు ఎంత సహజమో చీకటీ అంతే సహజం. పగలు ఎంత సహజమో రాత్రి అంత సహజం. పౌర్ణమి తరవాత మళ్ళీ పౌర్ణమి రావాలంటే మధ్యలో అమావాస్య రావాలి. ఉచ్ఛ్వాస తరువాత మళ్ళీ ఉచ్ఛ్వాస రాదు. నిశ్వాస వచ్చిన తరువాతే ఉచ్ఛ్వాస వస్తుంది. Alternating currents ఇవి. Alternating currents ని ఇద్దరు పెళ్ళాలు అన్నారు. వినత, కద్రువ. ఒకావిడకి పాకేవి పుట్టాయి. ఇంకొకావిడకి ఎగిరేవి పుట్టాయి. వినతకి అరుణుడు, గరుత్మంతుడు. కద్రువకి వాసుకి, అనంతుడు, మిగతా నాగజాతి, సర్పజాతి పుట్టుకు వచ్చాయి. అంటే ఒకటి వృషభ రాశికి సంబంధించిన తత్వం, ఇంకొకటి వృశ్చిక రాశికి సంబంధించిన తత్వం. మొత్తం 12 భావాలు కదా! అట్లా పుట్టుకొస్తూంటాయి, alternating గా. 12 భావాలూ 6 తత్వాలు. ఈ పుష్కరం అన్నదానికి అర్థం నీలపు కలువ, నల్ల కలువ. పుష్కరాక్షుడు అంటే నల్ల కలువ వంటి కన్నులు

గలవాడని  ఒక అర్థం ఉంది. అంతే కాదు ఇంకా చాలా ఉంది.  విచ్చుకున్నటువంటి నల్లటి కళ్ళు చాలా బావుంటాయి. తెల్లటి కళ్ళు ఉంటే బావుండవు కదా! విశాలమైన నల్లని కళ్ళు కలవాడు అంటే చీకట్లో చూసేవాడు అని అర్థం చేసుకోవాలి.  మనకి వెలుగులో చూడటమే చేత కావడం లేదు.  ఆయన చీకట్లో చూస్తాడట.  పగలు చేసేవన్నీ సూర్యుడు చూస్తుంటాడు. రాత్రిపూట చంద్రుడు లేడనుకోండి. ఎవడూ చూడడు కదా! మన ఇష్టం వచ్చినట్లు చెయ్యవచ్చా? ఉపనిషత్తులో ఒక శిష్యుడు ఒక గురువుగారిని 'వెలుగుని చూడమన్నారు కదండీ మరి సూర్యుడు లేనప్పుడు చీకట్లో ఎట్లా' అని అడిగాడట.  అంటే చీకట్లో చంద్రుడి ద్వారా వెలుగు వస్తుంది చూడమన్నారుట గురువుగారు. Suppose చంద్రుడు లేడనుకోండి, అన్నాడు. మనబోటి వాడే కదా శిష్యుడు కూడా. మన కోసమే అడుగుతారు వాళ్ళు. సూర్యుడు, చంద్రుడు ఇద్దరూ లేకపోతే, అగ్నిని చూడమన్నారు గురువు.  అగ్నిని చూడటానికి మన దగ్గర నిప్పు లేదనుకోండి, అప్పుడేం చెయ్యాలి అంటే, లోపల ఉంటుంది 'వెలుగు'  దానిని చూడమన్నాడు.  అంటే వెలుగు అనేది ఎప్పుడూ ఉంటుంది, దాని చుట్టూ ఆవరణలు ఉంటాయి. చీకటి వెలుగుల కార్యక్రమంగా నడుస్తూ ఉంటుంది.    ఒకే వెలుగు ఆదిత్యుడిగా, పుష్కరాక్షుడుగా రెండు వెలుగులుగా దిగి వస్తారు. దిగి వచ్చి వెలుగుకి సంబంధించిన లోకాలలో కార్యక్రమము ఒకరు చేస్తుంటే, చీకటికి సంబంధించిన కార్యక్రమములన్నీ ఒకరు చేస్తూంటారు.  సృష్టిలో రాత్రి పూట చీకట్లో చెయ్యవలసిన  కార్యక్రమములు ఎన్నో జరుగుతుండబట్టి మనం మళ్ళీ పగలు fit గా బయటకి వస్తాము.  Fitness దానిని బట్టి వస్తోంది. తెల్లవాళ్లు తెల్ల పనులు చేస్తుంటారు.  నల్లవాళ్ళు నల్ల పనులు చేస్తుంటారు.  రెండు పనులూ జరుగుతుంటాయి. అందుకని సృష్ఠి  నడుస్తుంటుంది. వాళ్ళు, వీళ్ళు ఇద్దరూ సమమై కార్యక్రమం చేస్తున్నారు తప్ప ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువా కాదు.  ఎక్కువ, తక్కువలు మన భావనే తప్ప అక్కడ ఏం లేవు. ఈ తెల్లవాళ్లు అంటే దేవతలు సరిగ్గా పని చేయడం లేదనుకోండి, నల్లవాళ్ల (రాక్షసులు) చేత కొట్టిస్తాడు వాళ్ళని. అదేగదా చేస్తుంటారు? మాటిమాటికి ఇంద్రుడి కుర్చీ లాగేస్తూంటారు వీళ్ళు.  వీడు సరిగ్గా పని చెయ్యనప్పుడల్లా  వాడు వస్తుంటాడు.  ఈ లోపల దేవతలు, వారి అధిపతి ఇంద్రుడు బాగుపడి, పశ్చాత్తాప హృదయులైనప్పుడు, వీడు fit అయ్యాడు అనుకున్నప్పుడు, వాడిని తీసేస్తుంటారు, సరేలేరా నీ పని అయిపోయిందని.  ఎవరు వాళ్ళు?  ఈయనికి బాగా దగ్గర.

ఈయన ఇంటి దగ్గర కాపలా వుండే వాళ్ళు వాళ్ళిద్దరూ. వాళ్ళని గదా వాడుతుంటాడు మాటిమాటికి. ఒకళ్లు కుడి పక్క పని చేస్తుంటే ఒకళ్లు ఎడమ పక్క పని చేస్తుంటారు. అదీ మంధర పర్వతాన్ని మధించడానికి వాసుకి అనే సర్పం తల ఒకరు పట్టుకొన్నారు, తోక ఇంకొకరు పట్టుకున్నారనేది. ఒకళ్లు కుడి పక్కకు లాగుతూ వుంటే, ఒకళ్లు ఎడమ పక్కకి లాగుతుంటారు. మనలో కూడా అంతే! కుడి, ఎడమల యొక్క శక్తులు మనలో సరిగ్గా పని చెయ్యాలంటే రెండూ పని చెయ్యాలి. ఒక పక్కే లాగేస్తే బయటకి వచ్చేస్తాం. మందరం కూలిపోతుంది. మనం బయట పడిపోతాం. మనలో మందరం అంటే వెన్నముకలో ఉన్నది. కుడి ఎడమల శక్తులు సరి సమానంగా పని చేస్తుంటే మన దేహం యొక్క కార్యక్రమం చక్కగా నిర్వహింపబడుతుంది ఒక పక్క సరిగ్గా పని చేయడం లేదు అంటే పక్షవాతం వచ్చింది అంటారు కదా! ఇంకేమీ లాభం లేదు, అటు పడి పోయింది అంటారు. అంటే దాన్ని మనం ఎక్కువ care చేయలేదన్న మాట. ఒకటి ఇడ, ఒకటి పింగళ. ఈ విధంగా stage మీద పనిచేసే వాళ్ళు కొందరు, stage వెనుక పని చేసేవాళ్ళు కొందరు. వీళ్ళిద్దరూ సమానులే. ఎవరికి? అవలోకతేశ్వరునికి లేక కశ్యపునికి. దృష్టిలో ఇద్దరికీ తేడా ఉండదు. ఎందుకంటే ఇద్దరూ ఆయనలో నుంచి వచ్చిన వారే. రాత్రి పూట జీవులను చూస్తూ, రక్షిస్తూ ఉండే భగవత్ ప్రజ్ఞను పుష్కరాక్షుడంటారు. 'పుష్కర' అనే పదానికి నిరుక్తం శాస్త్రం ప్రకారం 'తరగనిది' అనే అర్థం ఉన్నది. పుష్కలంగా వున్నదండి వాళ్ళకి అంటాం గదా! తరగనిది అంటే ఒక ప్రక్క అయిపోతుంటే , రెండవ ప్రక్క వచ్చేస్తుంటుందన్నమాట. అయిపోవడము అన్నది ఉండదు. అయిపోతుంది అన్నట్టుగా ఉంటుంది తప్ప అయిపోదు. మనం కూడా అంతే. అంతా అయిపోయిందండి అంటాం కదా! అయిపోయాడంటే బయటకి లేస్తూన్నాడన్నమాట. ఉంటాడు. బియ్యం బస్తా అయిపోవస్తుంటే అయిపోయిందని కంగారు పడుతామా! ఇంకో బస్తా వస్తుందని ఇంటావిడకి చాల ధైర్యం ఉంటుంది. లేకపోతే చెవులు పిండేసి అయినా తెప్పిస్తుంది. అయిపోవడం అనేది లేని స్థితి ఒకటి ఉన్నది. దాన్ని పుష్కర అంటారు. దాని నుంచే పుష్కలము అనే పదము కూడా. మన భూమి చుట్టూ వుండే పొరలలో ఏడు ద్వీపాలున్నాయి. మాస్టర్ E.Kగారు వ్రాసిన భాగవతం 13వ భాగం చదివితే భూమి చుట్టూ వున్న పొరలు తెలుస్తాయి. వాటిలో 7 వ పొర 'పుష్కర ద్వీపము' అంటారు. ఈ భూమికి అంత supply అక్కడ నుంచే వస్తుంది. ఈ భూమి మీద ఏమీ

అయిపోదు. అయిపోకుండా చూసుకునే layer, పొర పుష్కర ద్వీపం. పుష్కర ద్వీపం మనలో కూడా ఉన్నది. అక్కడ నుంచి eternal supply ఉంటుంది. Fulfilment ఉంటుంది. పరిపూర్ణత ఉంటుంది. అయిపోకుండా చూస్తూ ఉంటాడన్న మాట పుష్కరాక్షుడు. చీకటి అంటే అంతా అయిపోయింది అని గదా మనకి. అంతా అయిపోవటము అంటూ ఏమీ లేదు అని తెలపడానికి ఈ నామం ఇచ్చారు. అందుకని పుష్కరాక్షుని యొక్క ధ్యానం చేసుకోవాలి. మరల supply ఇస్తారు. మన భూమి చుట్టూ ఉండే పొరలలో మనకు కనబడే భూమిని జంబూ ద్వీపం అంటారు. దాని చుట్టూ 6 ద్వీపాలు ఉన్నాయి. 1) జంబూ ద్వీపం 2) ప్లక్ష ద్వీపం3) కుశ ద్వీపం4) క్రౌంచ ద్వీపం5) శాక ద్వీపం6) శాల్మల ద్వీపం 7) పుష్కర ద్వీపం. పుష్కరము అనే పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం అదృష్టవశాత్తూ భారత దేశంలో ఉంది. ఆ క్షేత్రంలో ఎవరైతే జపతపాదులు చేసుకొంటారో వారికీ పరిపూర్ణత అనేది చాలా సులభంగా వస్తుంది. ఐహికమైన విషయాలకుగాని, ఆముష్మికమైన విషయాలకుగాని దేనికైనా అక్కడ తపస్సు చేసుకుంటే సిద్ధి త్వరగా వస్తుంది. ఆది పర్వంలో అర్జునుడు పుష్కర పుణ్యక్షేత్రములో తపస్సు చేసుకుంటాడు. అర్జునునికి అంతా సిద్దే! మహాభారతం అరణ్యపర్వంలో ధౌమ్యుడు పుష్కరక్షేత్రం గురించి చేసిన వర్ణన చదువుకోవటం వలన, మనలో ఉన్న పుష్కరద్వీపం మేల్కాంచ బడుతుంది. అందుకు చదువుకోవాలి మహాభారతం. వేదవ్యాసుడు ఆ విధంగా అమర్చి ఇచ్చి, చదువుకోండి మీకు బాగా జరుగుతుంది అంటాడు. పుష్కరద్వీపం గురించి, పుష్కర పుణ్యక్షేత్రం గురించి చాలా వివరణ వుంది. ఈ పుష్కర పుణ్యక్షేత్రమునందు మానవుడు కొన్నాళ్ళు జీవించినట్లయితే ఏ విధంగా పవిత్రీకరింపబడతాడో, ధౌమ్యుడు ధర్మరాజుకి చెబుతాడు. ఆ పుష్కర పుణ్యక్షేత్రం అజ్మీరుకి 36 / 37 కి.మీ దూరంలో ఉంది. అక్కడ పుష్కరము అనే ఒక కొండ కూడా ఉంది. పుష్కరము అనే ఒక నది కూడా ఉంది. నదులకి, పుష్కరాలు అంటుంటాం కదా మనం! ఈ పుష్కరమనే చైతన్యం ఏ సంవత్సరంలో ఏ నదియందు ప్రవహిస్తుందో ఆ సంవత్సరం ఆ నదికి పుష్కరం వస్తుంది. అంటే మనం అక్కడకు వెళ్ళలేము కనుక మన దగ్గరికి రావటమనే ప్రయత్నం అన్నమాట. గోదావరి వరకు వచ్చానయ్యా చూసుకోండి అంటుంది. లేదు, నేను బిజీగా ఉన్నాను అంటే , సరే అయితే మళ్ళీ 12 ఏళ్ల తరువాత వస్తాను అంటుంది. బృహస్పతి అనే ప్రజ్ఞను పట్టుకొని ప్రతి నదికి ఈ స్పర్శను ఇస్తుంటుంది.

ఈ పుష్కరత్వము అనే ప్రజ్ఞ సింహరాశిలో బృహస్పతి వచ్చినప్పుడు గోదావరిలోకి వస్తుంది. కన్యారాశి లోకి వచ్చినప్పుడు కృష్ణలోకి వస్తుంది. తుల లోకి వచ్చినప్పుడు కావేరిలోకి వస్తుంది. కుంభంలోకి వచ్చినప్పుడు గంగ లోకి వస్తుంది. కుంభమేళా జరుగుతుంది. అటు కుంభంలో వచ్చినా, ఇటు సింహంలో వచ్చినా ఒకటే కనుక గోదావరి పుష్కరాలు గంగా పుష్కరాలతో సమానమైనటువంటివి. అన్నిట్లో పుష్కరాలు ఒకటే కదండీ, దీని గొప్ప ఏమిటంటే అది కుంభ, సింహ రాశుల యొక్క ప్రత్యేకత. జ్యోతిష్యపరంగా చాలా ఉంది దాంట్లో. కాబట్టి ఈ పుష్కర అనే ద్వీపం, పుష్కర పుణ్య క్షేత్రం, పుష్కరము అనే పర్వతము, పుష్కరము అనే నది కాక, పుష్కరాక్షుడు అనే అవతారం ఉంది. ఒకసారి అయన అలా అవతరించాడు. బృహదాక్షుడు అనే రాజు, రోజూ 108 నల్లకలువలతో విష్ణు మూర్తిని పూజ చేసేవాడట. ఒక రోజు పూజ చేస్తుంటే 107 అయినాయట. 108 నామానికి నల్ల కలువ లేదుట. లేకపోతే మనమైతే ఏమి చేస్తాం? అట్లా గింజుకోకూడదు, ఇవాళ భగవంతుడు మనకి ఇంతే ఇచ్చాడనుకొని సరి పెట్టేస్తాం. ఆయన అట్లా సరిపెట్టుకోకుండా గుండె చీల్చి హృదయ కమలాన్ని అక్కడ పెట్టాడట. ఇది 108 వ కలువగా తీసుకొని ఈ రోజుకి నన్ను కరుణించు అని. భగవంతునికి కంగారు పుట్టిందట. ఏదో ఒక కమలం తగ్గిందట అనుకుంటే, హృదయం చీల్చి పడేశాడని, చాలా కరుణించి భగవంతుడు నేను నీకు కొడుకునై పుడుతానని, పుట్టి పుష్కరాక్షుడు అనే మహారాజుగా ఈ భూమిని పరిపాలించాడు విష్ణుమూర్తి. అదొక నామం. ఈ నామం గురించి అవగాహన ఇది కొంత. పుష్కర క్షేత్రం ఇంత పుణ్యభూమి ఎలా అయింది అంటే ఒకసారి బ్రహ్మ నల్ల కలువ పట్టుకొని అలా ఆకాశంలో తిరుగుతుంటే, అది తనంతట తాను జారి అక్కడ పడిపోయింది. అందువలన బ్రహ్మలోకానికి సంభంధించిన ప్రజ్ఞ భూమి మీద ఆవిధంగా అక్కడ స్థాపించబడినదని మహాభారతంలో ఇచ్చారు.

## 44. మహాస్వనః

మహత్తరమైన శబ్దాన్ని మహాస్వనము అంటారు. ఈ మొత్తం సృష్టి అంతా కూడా శబ్దం కారణంగా ఏర్పడింది. మనం కూడా శబ్దాన్ని బట్టి మన సృష్టి చేసుకుంటూ ఉంటాం. మనతో ముడి పెట్టుకుని చెప్పుకోక పోతే అంత సులభంగా అర్థం కాదు. ఉత్+ చరణము= ఉచ్చారణము వల్ల చైతన్యము ఊర్ధ్వ ముఖము చెందటం ఉంది. అట్లాగే సు+ ఉక్తము= సూక్తము అంటే చక్కగా ఉచ్ఛరింపబడినది. పురుష సూక్తము, శ్రీ సూక్తము, సరస్వతీ సూక్తము మొదలైనవి చక్కగా ఉచ్ఛరింపబడుటమనేది సృష్టిలో ఉండే ఒక విధానము. మనం చేసుకునే సృష్టి మనం చేసే శబ్ద ఉచ్చారణ బట్టి ఉంటుంది. భగవంతుడు చేసే సృష్టి, ఆయన నుంచి వ్యక్తమవుతున్న శబ్దమును బట్టి ఉంటుంది. ఈ శబ్దము యొక్క సాధన చాల ఉత్కృష్ట మైన సాధన. మనం చేసే శబ్దాల నుంచి వాటంతటఅవే జరిగే శబ్దాల వరకు ఉన్నాయి. మనం చెయ్యక పోయినా జరిగే శబ్దం ఉన్నది. మనం చేసే శబ్దాలు ఉన్నాయి. జరుగుతుండే శబ్దంతో పాటు మన శబ్దాన్ని మనం గనుక శృతి చేసుకుంటే మన నుంచి కుడా సృష్టి కార్యమే వ్యక్తమవుతూ ఉంటుంది. జరుగుతున్న శబ్దంతో సంబంధం లేకుండా, మనం శబ్దాలు చేస్తుంటే, గొంతు ఉన్నది కనుక, ప్రాణం ఉన్నది కనుక ఏం జరుగుతుంది? We make our own creation. నీ సృష్టి స్వంతంగా ఒకటి చేసుకుంటావు. చేసుకుంటే ఏమవుతుంది? శ్రీకృష్ణుడు 'నా సృష్టి నేను వెనక్కి పిలిస్తే వచ్చేస్తుంది. నీ సృష్టి కుడా అట్లా వెనక్కి పిల్చి neutralise చేసుకో', అని చెప్పాడు. నువ్వు చేసుకున్న సృష్టి నేనేమీ చెయ్యను. 'I dispose what I propose. Like wise you dispose that which you have proposed.' అంటాడు శ్రీకృష్ణుడు. మనమేం అనుకుంటాం? మనం చేసేవన్నీ మనం చేసేసి, తరువాత ఆయనకి అప్పచెప్పేద్దాము అనుకుంటాం. Complicate అయిన తరువాత కదా case ఆయన దగ్గర పెడతాం. ఆయన 'మొత్తం నేనే చేయడానికి ఒప్పుకుంటానంటే, నే చేస్తాను. అంతేగానీ నేనిట్లా చేస్తున్నాను, మిగతాది నాకిట్లా కావాలి, చేసిపెట్టమంటే, చెయ్యను.'అంటాడు. అది 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' అనే శ్లోకం అర్థం. ప్రత్యేకంగా ఒక వికారమల్లే నీ నుంచి వ్యక్తమైంది, అదే వికృతి అంటే. భగవంతునిది ప్రకృతి.

అందులోంచి మనం పుట్టుకొచ్చాం. మన లోంచి పుట్టుకొచ్చే వికృతులు ఉంటాయి. ఆ వికృతులు నాకు సమర్పణ చేయక, నిన్ను సమర్పణ చేసుకుంటే ఆ వికృతులను నేను dissolve చేస్తాను. లేదూ proceed. నువ్వు చక్కగా దాన్ని roundup చేసుకుని మార్గంలో పడు. దానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి భక్తి మార్గం. ఒకటి జ్ఞాన మార్గం. మనం మాట్లాడే మాటల వల్ల చాలా సృష్టి ఏర్పడుతుంటుంది. కాలు జారినా ఫర్వాలేదు గాని మాట జారకూడదు, అంటారు కదా! ఎందుకంటే మాటలో అంత consequences ఉంటాయి. "మా కర్మఫలహేతుర్భవ" చక్కగా create అయిపోతాయి. దానినిబట్టి తరువాత కర్మకాండంతా ఏర్పడుతుంది. మాటలయందు శ్రద్ధ లేనివారికి, చేతలయందు శ్రద్ధఉండదు. చేతలయందు శ్రద్ధ పెరగాలంటే మాటలు తక్కువ ఉండాలి. ఎంత తగ్గించుకుంటే చుట్టూ అంత harmony వస్తుంది. ముళ్ళు ముళ్ళుగా ఉండే కత్తి ఒకసారి గిర్రున తిప్పామనుకోండి 100 మంది చుట్టూ. ఎంత damage జరుగుతుందో, ఒక పొరపాటు మాట వల్ల చుట్టూ ఉండే చోటులో కూడా అదే జరుగుతుంది. ఆ పుళ్ళు అన్నీ మానాలి కదా! అవి మనకి పుళ్ళుగా తయారవుతాయి. చోటుకేమీ పట్టదు. ఉల్లాసంగా మాట్లాడుకోవచ్చు. ఎదుటివారిని నొప్పి పెట్టకుండా మాట్లాడుకోవచ్చు. అవసరమైతే మాట్లాడవచ్చు. ఇంకొకళ్ళ ఆహ్లాదంకోసం అబద్ధాలు మాట్లాడ రాదు. ఇంకొకరి మెప్పుకోసం మొదలు పెడితే అబద్ధాలు మాట్లాడటమనే అభ్యాసం వచ్చేస్తుంది. దాంట్లోంచి బయట పడడం కష్టం. ఒక మాట చెప్పేటప్పుడు, అనేటప్పుడు చాలా ఆలోచించాలి. ఒక్క మాటలో తేడా చేస్తుంది. మాటలన్నీ తగ్గి, నిశ్శబ్దం యొక్క రుచి మరిగినవాడికి లోపల నుంచి ఒక చిన్న శబ్దం వినిపిస్తుంది. మాటలయందు రుచి మరిగినవారికి వీలు పడదు. కొంతమందికి తమ మాటలు తమకెంతో ఇష్టం. ఒక పిసినారి డబ్బునే విధంగా ఖర్చు పెడతాడో, ఒక యోగ సాధకుడు మాటనా విధంగా ఖర్చు పెడతాడు. ఇది కూడా శక్తి యొక్క వినియోగమే. అన్నింటికంటే ఉత్కృష్టమైన శక్తి. చాలా పెద్ద శక్తి. దాన్ని pleasantగా వాడ గలిగితే చాలా గొప్ప విషయం. pleasantగా వాడటం చేతగాని వాళ్ళం, దాన్ని వాడకుండా ఉండటం సుఖం. మాటలలో ఈ విధమైన క్రమశిక్షణ వస్తున్నకొద్దీ మన చేతనంలో ఒక విధమైన వృద్ధి వస్తూంటుంది. మాటలు జాగ్రత్తగా ఉంటే రోజూ activityలో అక్కరలేనివి రావు. మాటలో మనకి diversion వచ్చిందనుకోండి, చేతల్లో కూడా diversions వచ్చేస్తాయి.

మాటల్లోపడితే చేతలు కూడా మర్చిపోతాము. ఎక్కువ మాట్లాడేవాళ్ళు తక్కువ పని చేస్తారు. తక్కువ మాట్లాడేవాళ్ళు ఎక్కువ పని చేస్తారని అనను కాని, ఎక్కువ పని చేసేవారు తక్కువ మాట్లాడుతారు. "You better speak less and do more Major!" అంటాడు అల్లూరి సీతరామరాజు. తక్కువ మాట్లాడటం వచ్చిందంటే నిశ్శబ్ధంగా ఉండటంలో రుచి పెరిగిందన్నమాట! నిశ్శబ్దం అంటే మన చుట్టూ శబ్దాలు ఉండకూడదు అనుకోవటం కాదు. మనం ఊరికే శబ్దాలు చెయ్యకుండా ఉంటే మనలో ఒక చిన్న శబ్దం వినిపిస్తుంది. 'Little voice' అన్నారు. ఆ little voice నుంచి 'voice of the silence' వరకు వెళ్తాంట. నెమ్మదిగా హృదయంలో స్పందనంగా వినిపిస్తున్న దాన్ని 'నాదము' అంటారు. శబ్దం మనం చేస్తుంటాము. నాదం దానంతట అది జరుగుతుంది. ఈ చెయ్యటము, జరగటము అన్నది ప్రతి దాంట్లోనూ మనకి కనిపిస్తూంటుంది. పనులు చేసే వాళ్ళు కొంతమంది ఉంటారు. పనులు జరుగుతూంటాయి కొందరి నుంచి. అట్లాగే మాటలు మాట్లాడేవాళ్ళు కొంతమంది ఉంటారు. వాక్కు వ్యక్తమయ్యేవాళ్ళు కొంతమంది. మనం మాట్లాడటంగాదు, మననుంచి సరస్వతి వ్యక్తం కావాలి. పోతన సూక్తులే !

"సుశబ్దముల్ పల్కు నాదు వాక్కునన్, సంప్రీతిన్, జగన్మోహినీ,
పుల్లాబ్జాక్షి, సరస్వతీ, భగవతీ, భారతి పూర్ణేందు బింబాననా!"

అన్నాడు . నువ్వు పలుకు తల్లీ, నేను ఊరికే stenographer గా ఉంటానన్నాడు గాని, నేను రాస్తాను, నువ్వు కొంచెం ఇక్కడ support ఇవ్వు అని అడగలేదు. మనం రాస్తాం, మనం చేస్తాం, మనం మాట్లాడుతాం అనుకునేవన్నీ ఒట్టి మాటలండి, వట్టి చేష్టలు, వట్టి రాతలు. అందుకనే వాటిని కాలచక్రం ఒక round తిరగ్గానే మర్చిపోతారందరూ. ఒక సంవత్సరం అన్న మాట. ఫెళ్ళున వచ్చిన పుస్తకాలు సంవత్సరంలో మాయమైపోయినవి ఉండవూ? యుగముల తరబడి ఉన్నటువంటి పుస్తకాలున్నాయి కదా! ఏమిటి తేడా? ఒకటేమో మనం రాసింది. ఇంకొకటి మన ద్వారా రాయబడింది. మన ద్వారా సరస్వతి వ్యక్తమవటాన్ని scripture లేదా గ్రంథం అంటారు. మనం రాసేది పుస్తకం అవుతుంది. ఈ రెండింటికీ తేడా ఉంది. కాలమునకు, దేశమునకు లోబడక, అతీతములై నిలచి ఉండే సత్యములు వ్యక్తమైనవి గ్రంథములు. కాలానికి, దేశానికీ అతీతమై ఎప్పుడూ ఉంటూ ఉంటాయి. దాన్నే 'వేదం' అన్నారు. ప్రళయం వచ్చినా మళ్ళీ పుట్టుకొస్తాయి. చింపేస్తే పోయే knowledge ఎంతకాలం ఉంటుంది? గ్రంథం

విషయంలో అలా ఉండదు, మళ్ళీ అట్లాగే వస్తుంది. అట్లా వ్యక్తం అవుతూ ఉంటుంది ఒక శబ్దము. దానిని 'నాదము' అంటారు. అది మనలో నుంచి వ్యక్తమవుతూ ఉంటుంది. మనలో అది వ్యక్తమవడం వల్ల మనం మాట్లాడగలుగుతున్నాం. ఉన్న నాదానికి మనని సమర్పణ చేసుకోవడం ఒక పద్ధతి. నాదాన్ని మనకి తోచినట్లుగా వాడుకోవడం ఇంకొక పద్ధతి. మనకి అప్పచెప్పబడిన దాన్ని మనం వాడుకొనే పద్ధతి. అది నాదం అవ్వచ్చు, దృష్టి అవ్వచ్చు, రుచి అవ్వచ్చు, స్పర్శ అవ్వచ్చు, వాసన చూడడం అవ్వచ్చు. అన్నీ మనకి ఇవ్వబడినవే. సంపద దగ్గర నుండి ఇవ్వబడుతుంది మనకి. ఇవ్వబడిన దానిని ఎందుకిచ్చారో దానికి వినియోగం చేసే వాడు చిక్కులు వేసుకోడు. వచ్చింది కదా అని ప్రతిదీ జేబులో పెట్టేసుకుని మింగేసి, ఇట్లా చేస్తే ఇమడవు. అన్ని విషయాలలో ఇమడక మనకి problems వస్తాయి. శబ్దం విషయంలో కూడా అంతే. శబ్దం విషయంలో సాధన చేస్తే, మిగిలిన సాధనలు సులభంగా చేతికందుతాయి. నాలుక గనక వశమైనదంటే మొత్తమంతా వశమవుతుంది సుమా! అని శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చెప్పాడు. నాలుక వశం అవటం చాల కష్టం. ఎన్నయినా వశం అవుతాయి తప్ప, అది వశం అవడం చాల కష్టం అని చెబుతాడు ఉద్ధవగీతలో. కనుక నాలుకకి చాల నియమాలు ఉన్నాయి భగవద్దర్శన కార్యక్రమములో. పరుషమైన వాక్కులు వచ్చే వారికి చాలా కష్టం. జన్మంతా ప్రయత్నం చేసుకుంటూ ఉండాలి. మౌనం అన్నది అభ్యాసం కావాలి. అయినప్పుడు దాని నుంచి ఈ చైతన్యం యొక్క ప్రసారంలో ఒడిదుడుకులు లేకుండా ఉంటుంది. ఆ తరువాత కనబడటమనేది ఉంటుంది. మనం అంటూ ఉండే శబ్దములకు నాదం ఆధారం. కాబట్టి నాదాన్ని వినడం కోసం ఓంకారం చేయాలి. ఓంకారం అనటం దేనికోసం అంటే, ఓంకారం వినటంకోసం. ఓంకారం వినటం దేనికోసం అంటే, ఓంకారంలో ఉండడం కోసం. అదీ పరమ గురువైన జ్వాలాకూలుడు esoteric healings లో ఇచ్చిన ఒక వాక్యం. మనం ఓంకారాన్ని ఎందుకు అనాలి, అంటే ఓంకారాన్ని వినటానికి అనాలి. ఎందుకంటే ఓంకారం జరుగుతుంటే మనం దాన్ని బయటకు అంటున్నాం. అంటే ఎవరో మనకిస్తే దానిని మనం ఇస్తున్నట్లుగా భావన చేస్తాం. మాటలన్నీ మనం మాట్లాడుతున్నట్లు అనుకుంటూ ఉంటాం. నిజంగా తెలిసినవాళ్ళకి మనం మాట్లాడటం ఏమీ ఉండదు. పైనుంచి వ్యక్తమవుతోంది కాబట్టి, వ్యక్తమయ్యేదాన్ని వినటము అనే స్థితికి వెళతారు వాళ్ళు. ఓంకారాన్ని వినటం వల్ల ఏం

జరుగుతుందంటే ఏది వ్యక్తమవుతుందో దానిని ఉచ్చరించడం జరుగుతుంది తప్ప, నోటికి వచ్చినట్టల్లా మాట్లాడడం జరగదు ఓంకారం వినే వాళ్ళకి. మనం ఓంకారం అనటం, అంటున్నదానిని వినటం అయిన తరువాత, అనకుండా ఉన్నప్పుడు వినబడడం అన్న స్థితికి చేరుకోవాలి. మనం అనకపోయినా అది వినపడుతుంది. ఎందుకంటే అది ఎప్పుడూ జరుగుతూంటుంది కాబట్టి. సుషుమ్నలో శాశ్వతంగా జరిగే నాదం ఓంకారం. దాన్ని మనం ఎప్పుడూ వింటూ ఉండే స్థితి Third Initiation అనవచ్చు. మొదటిది అనటం, అంటూ వినటం, రెండోది వినటం, అనటం ఆపిన తరువాత వినటం. మనం అని వినకుండా ఉంటాం. అక్కడ నుంచి అని వినటం అనే స్థితికి రావాలి. అక్కడ నుంచి అనకుండా వినటం అనే స్థితికి రావాలి. అప్పుడు దూరదృష్టి లాగానే, దూర శ్రవణం వస్తుంది. ఎందుకంటే చాల దూరాల నుండి వస్తుంది అది మనలోకి. ఎక్కడి నుండి వస్తుందో దాన్ని మహాస్వనము అన్నారు. మన కుండలిని మన property కాదు. బొత్తిగా ఏమీ అవగాహన లేనివాళ్ళు, చాలా సాధన చేసుకుంటున్నాం అనుకునే వాళ్ళు వున్నారు. ఎవరన్నా నా కుండలిని అంటే, వెంటనే మనం చెవులు మూసుకొని వీడికేమీ తెలియదని నిర్ణయం చేసుకోవచ్చు. మన కుండలిని అంటూ ఉండదు. కుండలిని మనయందు ఉండటం వలన మనం ఉన్నాం. ఈ కుండలినికి భూమి కుండలిని ఆధారం. భూమి కుండలిని independent గా ఉండటానికి లేదు. సూర్యమండల కుండలిని దానికి ఆధారం. సూర్యమండల కుండలినికి, సవితృ మండల కుండలిని ఆధారం. సవితృ మండల కుండలినికి, భర్గోదేవ మండల కుండలిని ఆధారం. దానికి ఆధారం ఏమిటంటే మహాస్వనము. చుట్టలు చుట్టలుగా దిగి వస్తుందట. చుట్టలు చుట్టలుగా దిగి వచ్చింది వేరు. ఊరికే circular గా ఉన్నది వేరు. గానుగ circular గా ఉంటుంది. దానికి కట్టి తిప్పారనుకోండి. అక్కడే తిరుగుతుంటాం. గానుగెద్దు లాంటి జీవితం అంటారు గదా ! అక్కడే తిరుగుతుంటాం. ఇదిగూడ గుండ్రంగానే ఉంటుంది కాని చుట్టలుగా ఉంటుంది కాబట్టి పైకి అట్లా వెళ్లిపోతుంటాం. దిగివస్తే అట్లా దిగి వస్తుంది, ఆ శబ్దము. దానినే 'మహాకుండలిని' అంటారు. దిగి వచ్చే ఆ చుట్టలను తీగగా వర్ణించారు. అది ఎంతవరకు దిగి వస్తుందంటే అనురాధ అనే చోటు వరకు వస్తుంది. అనురాధ అంటే అర్థం The spiral; The spirallic consciousness. గుండ్రని మెట్లు కట్టుకుంటూ ఉంటాం. అట్లా తిరుగుతుంటే పైకి వెళ్ళిపోతుంది, మధ్యలో స్థంభం ఉంటుంది. అట్లాగే అది

పట్టుకొని, చుట్టలు చుట్టుకొంటూ పైకి వెళ్లిపోవచ్చుట. అనురాధ నక్షత్రంలో పుట్టిన వాళ్ళకి అందుకనే ఆధ్యాత్మికతలో అవకాశం ఎక్కువ అని చెప్తుంది శాస్త్రం. అంటే మన orientation ని అనుసరించి తప్ప, కేవలం ఆ నక్షత్రంలో పుట్టటం బట్టి కాదు. ప్రతి సంవత్సరం వృశ్చిక రాశిలో, అనురాధ లో బోలెడు పుడుతూ ఉంటాయి జంతువుల దగ్గర నుంచి. మనలో ఉన్న కుండలినిలో నుంచి అందరి మానవులలోనున్న కుండలినితో సమాహారం చెందామనుకోండి. మనం ఒక పెద్ద చుట్ట cover చేసిన వాళ్ళం అవుతాం. అక్కడి నుంచి భూమి కుండలినిలోకి ఒక చుట్ట తిరిగాం అనుకోండి. అప్పుడు భూమితో మనకి ఏకీభావం వస్తుంది. పరమగురువులందరికీ భూమితో ఏకీభావం ఉంటుంది గనుక, భూమి మీద ఏం జరిగినా తెలుస్తుంది వాళ్ళకి. మన లాగా రేడియో వినడం, TV చూడడం అక్కర్లేదు. మన వూళ్ళో జరిగేదానికి గూడ radio లో ప్రాంతీయ వార్తలు పెట్టుకుంటాం. ఇంక భూమి గురించి ఎక్కడ? భూమికుండలినీతో ఏకీభావం చెందినవారు కాబట్టి, భూమి మీద ఈ రోజు ఇక్కడ ఇబ్బంది కలుగబోతోంది కనుక మనం ఏమైనా చేద్దాం, అనే స్థితిలో ఉంటారు వాళ్ళు. భూమి కుండలిని నుంచి సూర్యమండల కుండలిని కి వ్యాపనం చెందుతుంది. ఈ వ్యాపనంలోకి ప్రవేశం కావాలి అంటే నాదాన్ని వినగలగాలి. పరుచుకుపోదామన్న యావ తప్ప, ఇచ్చిన మార్గాలలో ప్రయాణం చెయ్యం. నాదాన్ని వినాలంటే నాదానికి వైఖరిగా ఏర్పడిన ఓంకారాన్ని వినాలి. వైఖరి అంటే వ్యక్తమైనదన్నమాట. ఓంకారం, ఉచ్చరింపబడే మాటలన్నింటికీ మాతృస్థానం. ఎందుకంటే మనం మాట్లాడే వాక్యములన్నీ కొన్ని పదముల సముదాయం. పదములన్నీ మాటల సముదాయం. మాటలు కొన్ని అక్షరముల సముదాయం; అక్షరాలు అంటే హల్లులు, అచ్చుల సముదాయం. హల్లులు దేహములైతే, అచ్చులు ప్రాణములు. అచ్చులు అన్నిటికీ అకారం మొదలు. ఉకారం దానితో కలిసి ఉంటుంది. 'అ' అంటే సృష్టికి అవతల ఉండేవాడు. 'ఉ' అంటే సృష్టిలో ఉండేవాడు. ఇద్దరూ కలిపితే 'ఓ' అవుతుంది. కుండగా కనబడుతున్న మట్టి. కుండ కాకుండా విడిగా ఉన్న మట్టి. అ + ఉ = ఓ. కాబట్టి "ఓం " అనే శబ్దంలో మొత్తమంతా ఇమిడి ఉన్నది. ఈ ఇమిడి ఉన్న "ఓం "కారాన్ని మనం పరిపూర్ణంగా అంటూ వింటూ ఉంటే, వినటం పరిపూర్ణం అయినతరువాత అనటం మానేస్తే, వినబడుతూ ఉంటుంది. "ఓం "కారం అవగానే next ఏమిటి అని చూసుకునేవాళ్ళకి ఏమీ వినబడదు. ఓంకారం అయింది, ఇంకా గురుబ్రహ్మ

చెప్పడేం, అనుకుంటూ ఉంటాం. మర్చిపోయాడా? పరధ్యానంలో ఉన్నాడా? Correct! పరధ్యానం లో ఉంటాడు. పరమునందు ధ్యానం లగ్నమైనవాడు పరధ్యానంలో ఉంటాడు. పదం వాడుక కూడా ఇంకో రకంగా వాడుతారు. పనులలో వాడి mind లేకపోతే ఏరా! పరధ్యానంగా ఉన్నావా ? అంటాం. ఓంకారం అన్న తరువాత వినటానికి కొంత time పెట్టుకోవాలి. ఎంతసేపూ అందామనే తప్ప, విందామనే యావ లేదు. మాట్లాడుతున్నప్పుడు కూడా అవతలివాడు చెప్పేది విందామని ఉండదు. మనం మాట్లాడదామనే తప్ప. ఎక్కువ భాగం ఇంతే! ఇవన్నీ చూసే, వాళ్ళు ఆ పద్యం ఇచ్చారు, వినదగునెవ్వరు చెప్పిన, అని. వాడు ఆపేయంగానే మనం మొదలు పెడతాం గదా! అది కూడా వద్దు అని చెప్పాడు ఆ పద్యంలో. అవన్నీ చాలా preliminaries, ఓంకారం దగ్గరికి వచ్చినప్పుడు. ఓంకారం అని, అన్నది విని, అనటం ఆపి వినటానికి ప్రయత్నం చెయ్యాలి. అది 21 ఓంకారాల సాధన. మనం ఆ విధంగా సాధన చేయాలి. 21 ఓంకారాలు అనేసి, వెంటనే అమ్మయ్య! ఇవ్వాల్టికి అయిపోయింది, అని లేచి వెళ్ళిపోకుండా కొంతసేపు కూర్చొని ఉండండి. మొన్న ఎవరో చెప్పారు. చంద్రగ్రహణం రోజున చాలా చక్కగా అనుభవం పొందామని. అసలు ఏ చప్పుడూ లేకుండా ఉండే స్థితి అప్పుడు చాలా బాగా తెలిసిందని. మామూలుగా ఉదయం 5 గంటలకి లేచినా పాలవాళ్ళు పనివాళ్ళు చప్పుళ్ళు ఉంటాయి. అవే కాదు, పక్షుల చప్పుళ్ళు కూడా ఉంటాయి. అవి కూడా లేవక ముందు లేస్తే, అంతా నిశ్శబ్దంగా ఉంటుంది. అప్పుడు పొద్దున్నే ఓంకారం చేసుకోవాలి అని పెద్దలు ఎందుకు చెప్పారో నాకు అనుభవానికి వచ్చింది. 3.30 గంటలకి చేసుకున్నాం కదా! చంద్ర గ్రహణం రోజున. మనం బాగా బయటకి పరుచుకుపోకుండా నిశ్శబ్దంగా ఉండే వేళలలో చేసుకోవాలి. లేదూ దానితో సంబంధం లేకుండా మనం బాగా ఉచ్చారణ చేసి ఓంకారాన్ని అంటుంటే, అనటం ఆపిన తరువాత వినటం కోసం కాసేపు కూర్చోండి. హృదయమునందు స్పందనం వినటం కోసం ప్రయత్నం చెయ్యండి. చేస్తూ ఉంటే ముందు Little Voice వినిపిస్తుంది; Madam Blavatsky చెప్పారు, and that leads to voice of silence" అని. చిన్నగా ఉంటుందట ముందు. నెమ్మదిగా వింటుంటే ఝుమ్మని పెద్దదై నాదం మనం అనకుండానే లోపల జరుగుతున్నట్లు తెలుస్తుంది. అది విన్నవాళ్ళకు ఇంక మాట్లాడ బుద్ధి కాదు. ఎందుకంటే అంత బాగుంటుంది. అది వినటం కోసం చాల తాపత్రయ పడుతుంటారు ఋషులు.

ఏవన్నా బయట పనులు ఉంటే గబగబా పూర్తి చేసుకొని, మళ్ళి వచ్చి ఈ నాదం వినడం కోసం కూర్చుంటారట. మత్తెక్కి పోతుందట నాదంతో! బయట పనులు అంటే బహిర్ముఖమైన మనస్సులోకి, ఇంద్రియాలలోకి, శరీరం లోకి విచ్చుకోవటమే కదా! ఈ విచ్చుకోవటం కర్తవ్యం మేరకు విచ్చుకొని, గభాల్న మళ్ళి వచ్చేసి, అంతర్ముఖంగా లోపలికి వెళ్ళి, ఈ నాదాన్ని వింటూ ఉంటారు. బయటికి ఎందుకు వెళ్తుంటారు? ఏవో పనులు వుంటాయి గదండీ, అంటాం. వాళ్ళకేం పనులు వుండవు. నాదం యొక్క పనులుంటాయి వాళ్ళకి. వింటారు కదా! వినటంతో అందులో నుంచి ప్రణాళిక ఏమిటో వ్యక్తమవుతుంది. వ్యక్తమైంది చేస్తూంటారు. మళ్ళి వెళ్ళిపోతుంటారు వెనక్కి. వినటం అంటే అదీ. అప్పుడే మన ప్రణాళిక దివ్య ప్రణాళిక గా అవుతుంది. మన ప్రణాళిక దివ్య ప్రణాళిక అయి విశ్వ మూర్తిలో శాశ్వతంగా నిలిచిపోవాలంటే ఇదీ మార్గం.

" తెలివికిని సద్గుణమ్ముల బలము గూర్చి, నా ప్రణాళిక విశ్వ ప్రణాళిక గను వ్యాప్తమై విశ్వమూర్తి రూపము నందు, నిలుచు గావుత నిలయమగుచు."

Let my plan be an epitome of the Divine plan,
May we speak the silence without breaking it,
May we live in the awareness of the background,
May we transact light in terms of joy.

ఇవన్నీ అందులోకి వస్తాయి. వాళ్ళూ, ప్రణాళిక తెలిసి పని చేసేవాళ్ళు. ప్రతివాళ్ళు ప్రణాళిక తెలుసు అనుకునో, లేదా గురువు గారు చెప్పారు అనో అంటుంటారు. ఇవన్నీ పిల్లకాయ ఆటలు. నిజంగా తెలిసిన వాళ్ళు ఎక్కువ వింటారు. అసలు వాళ్ళ ప్రణాళిక ఏమిటి? మనం ఏ మాత్రం చెయ్యగలం? ముడిపడుతుందా వాళ్ళకి, మనకి? పడింది అని మనం అనుకుంటున్నామా? ముడి మనం వేశామా? వాళ్ళు మనతో వేసుకున్నారా? వాళ్ళు మనతో ముడి వేసుకుంటే ధన్యులం. మనం వాళ్ళతో ముడివేసుకోడానికి ప్రయత్నం చేస్తే ఊరికే ఆకాశంలో ముడి వేసుకున్నట్లుంటుంది. అందుకని అది వినటానికి కొంత ప్రయత్నం జరిగితే అది నాంది అవుతుంది మహాస్వనము అనే భగవంతుని యొక్క నామమునకు చేరువ అవటానికి. ఎందుకంటే హృదయము నందు అది వినాలి. ఇది వినే మార్గం. ఈ వినే మార్గం ద్వారా వింటుంటే వినటం, చూడటం ఒక చోట కలిసిపోతాయి. వినటం అన్నా, చూడటం అన్నా ఒకటే అవుతుంది. అక్కడ ఆ

హృదయము నుండి లోపల జరుగుతున్న నాదము యొక్క గమనము తెలుస్తుంది. ఇది పుస్తకాల్లో బాగా ఇచ్చేసారు కాబట్టి ప్రతివాళ్ళు బాగా మాట్లాడుతుంటారు. భ్రూమధ్యం అంటారు. విశుద్ధి అంటుంటారు. అనాహతం అంటుంటారు. మరీ అదిగూడా చాలనివాళ్ళు highest కి వెళ్ళాలని సహస్రారం అంటుంటారు. ఊరికే మాటలు అనవసరం. జరిగేవాడు మాట్లాడడు. మాట్లాడే వాడికి జరగటం లేదని తెలుస్తుంది. అక్కడ లోపల ఆ నాదాన్ని వింటూ వుంటే ఆ నాదం వీడితో communicate చేస్తూ ఉంటుంది. ఒరేయ్ ! ఆ పని చేసి రా! వాడికిది చెప్పు, వీడికిది చెప్పు. వాడితో ఇట్లా ప్రవర్తించు. అంటూ మొత్తం guidance పూర్తిగా ఇస్తుంది.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"

అన్నట్లుగా దానికి శరణు పొందాలి. పొందితే విశ్వ ప్రణాళికలో తను భాగం అవుతాడు. భాగమై దాని ప్రకారం తను ప్రవర్తిస్తాడు తప్ప తనకంటూ స్వంతప్రవర్తన ఉండదు. అంతా వాడి పనే కాబట్టి; దానిలో ఇమిడి తను చేస్తుంటాడు కాబట్టి; దానికి సంభంధించిన పనులు, ఫలితములు చేస్తున్నవాడిని బంధించవు. దైవ కార్యములు మనవంతు మనం చేస్తుంటాం. కనుక ఫలితములన్నీ దైవానివే. అలా చేసుకుంటూ వెళ్లి పోవటమనే స్థితికి వెళ్లి పూర్తిగా మనిషి silent అయిపోతాడు. ఎందుకంటే మాటను వ్యక్తం చెయ్యటమనేది ఒక బాధ్యత. మనకి అది ఒక ఉల్లాసం. కనుక ఆ బాధ్యతలోనికి మనం వెళితే ఈ మహాస్వనము అనే నామం అవగాహన అవుతుంది. మనం విష్ణు సహస్రనామం చదువుతున్నప్పుడు వినండి అని చెప్పటం అందుకే. మనకివ్వబడిన ఇన్ని నామములు, ఇన్ని స్తోత్రములు ఏదో విధంగా అక్కడికి తీసుకు వెళ్ళాలని తపన. ఈ మార్గానికి దగ్గరవ్వాలని ఇచ్చారు. భ్రమర గీతికలు అంటే అవి. భ్రమరాంబ అంటే ఏమిటో తెలుస్తుందప్పుడు. కుండలిని శక్తి చేసే విలాసము ఏమిటో అవగాహనలోకి వస్తుంది. ఇవన్నీ మెట్లు, మనకి కావలసింది సాధన. ఒక్కక్క రోజు కొన్నికొన్ని వస్తుంటాయి. అన్నీ ఒకేసారి చేద్దాం అనుకోవటం కూడా సాధ్యం కాదు. ఒక్కొక్క జీవికి ఒక్కొక్క దాని యందు పట్టు చిక్కుతుంది. పట్టు చిక్కినవి చేసుకోండి. మిగతావి తెలుస్తాయి. అట్లా చేసుకుంటూ ఉండాలి. దీర్ఘకాలం, నిరంతరం సత్కార్యాలు చేసుకుంటూ వుంటే, అప్పుడు వాటికి లంగరు అందుతుందట. 'దీర్ఘకాల నైరంతర్య సత్కార్యా సేవితో దృఢ భూమిః' అన్నారు. పతంజలి యోగ సూత్రాలలో బయట చేసే పనులు

సత్కార్యములు అయితే  అవి పనులు కాదు.  కనుక సత్కార్యముల యందు ఆశ్రయం పొంది,  చేసే పనులలో ఆ భావంతో ఎక్కువ ఏకీభావం చెంది, నిరంతరము దీర్ఘ కాలం చేస్తూ ఉంటే అది ఒక triangle path.  ఒకటి బహిర్గతమై చేసే పనులు  సత్కర్యాలుగా వుండాలి. 'సత్కార్యాసేవితః' అది.  దీర్ఘ కాలమునకు minimum cycle 12 ఏళ్ళు.  అప్పటికి  ఇంకా ఎన్ని ఏళ్ళు చెయ్యాలన్న భావన పోతుంది.  12 ఏళ్ళలో  'నిరంతరం' ఉండాలది. మనం ఏదో  సంవత్సరానికి ఒకసారి అన్నామనుకోండి. అట్లా  కూడా 12 ఏళ్ళు  అవుతుంది.  అట్లా  మనం వస్తామేమో ఆ route లో అని చెప్పి  నిరంతరం అని చెప్పారు.  మధ్యలో gaps కొట్టకూడదు అని అర్థం.  నిరంతరానికి మన వాళ్ళు ఒక ఉదాహరణ నూనెధార అని ఇచ్చారు. పుంపు ధార అయితే మధ్యలో gaps వుంటాయి.  నూనెధారకి మొత్తం అట్లా తీగె సాగినట్లు ఉంటుంది. తేనె ధార అంతే! అట్లా ఉండాలిట  12 ఏళ్ళు. ఏదో temporary ఉద్యోగానికి చెప్పకుండా సెలవు పెడితే  service ఆ తరువాత  నుండి count చేస్తారు చూడండి,  అట్లా ఎక్కడ cut అయిపోతే, అక్కడి నుండి 12 ఏళ్ళు అని గుర్తు పెట్టుకోండి. అంటే మనకి ఎప్పుడూ 12 ఏళ్ళు ఉండేలా చూసుకోవాలి. ఇట్లా service cut లేకుండా చూసుకుంటూ ఉంటే, ఈ నామాల నిజస్వరుపాలు మనకి అవగాహన అవుతాయి.  ఆ అవగాహన కూడా  భగవంతుని కరుణగా భావన చేసుకుంటూ ఉండాలి. మహాస్వనము అంటే పెద్ద శబ్దం. శబ్దము వలననే మొత్తం సృష్టి అంతా ఏర్పడుతుంటుంది.  సృష్టి యందు శబ్దము ఎప్పుడూ ఉంటుంది. ఎప్పుడూ అయిపోవడము ఉండదు.  ఓం కారమునకు తుది లేదు, మొదలు లేదు. ఎప్పుడు తుది లేదో అప్పుడు మొదలు కూడా ఉండదు. అది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. జరుగుతుంటే  ఓంకారం  కారణంగా శబ్ద తరంగములు ఏర్పడి,  ఆ తరంగములు  ఆధారంగా వాయు తరంగాలు ఏర్పడి,  అక్కడి నుంచి శబ్దం కారణంగానే అగ్ని ఉత్పన్నమై  పంచ భూతాలు, సృష్టి అంతా మొదలవుతూ ఉంటుంది.  ఒక్కొక్క తరంగానికి ఒక్కొక్క కాలపరిమితి ఉంటుంది.  ఒక సరస్సులో రాయి వేస్తే ఒక తరంగం అట్లా వచ్చి కొంత కాలముండి మళ్ళీ కలిసి పోతుంటుంది. మళ్ళీ ఇంకో తరంగం వస్తుంది. ఆ తరంగం కదిలి వెళ్లి పోతుంటే ఇంకో తరంగం వస్తుంది.  ఇట్లా జరుగుతూనే ఉంటుంది. అదే  పద్ధతిలో ఈ శబ్ద తరంగములు ఒక కేంద్రం నుంచి ఉత్పన్నమై అక్కడి నుంచి ఇన్ని లోకలముల సృష్టి ఏర్పడుతుంటుంది. తరంగం తరువాత తరంగం ఎట్లా వస్తుందో, అలాగే చోటులో ఒక కేంద్రంలో

పుట్టిన శబ్దం ఆధారంగా నక్షత్ర మండలాలు, సూర్య మండలాలు, గ్రహ గోళాదులు ఇవన్నీ విచ్చుకొంటూ ఉంటాయి. విచ్చుకునేవన్నీ గూడా మళ్ళీ చోటులో కలిసి పోతుంటే, ఇంకో పక్కనుంచి విచ్చుకుంటాయి. విచ్చుకోవటం, విచ్చుకొన్నవి వృద్ధిపొందటం, వృద్ధిపొంది మళ్ళీ కలిసిపోవటం అట్లా అనుస్యూతంగా జరుగుతుంటుంది. దానికి ఇది మొదలు అన్నది ఏమీ ఉండదు. ఆ శబ్దం అట్లా జరుగుతుంటుంది. సృష్టికి ముందు ఉండి, సృష్టిలో కూడా ఉండి, సృష్టి తరువాత కూడా ఉంటుంది. ఒక school తీసుకున్నామనుకోండి ; స్కూల్లో ఎప్పుడూ 10 తరగతులు ఉంటాయి. L.K.G, U.K.G. కలిపి 12 తరగతులు వేసుకోండి. ఎప్పుడూ L.K.G. ఉంటుంది. ఎప్పుడూ 10 వ తరగతి ఉంటుంది. L.K.G వాళ్ళు U.K.G.లోకి వచ్చేసరికి మళ్ళీ L.K.G లోకి పిల్లలు వస్తున్నారుకదా! ఎలా వస్తున్నారు? వరుసగా అన్నీ జరుగుతాయి. L.K.G వాళ్ళు U.K.G లోకి అలా 10 వ class వచ్చేసరికి వాళ్ళు చోటులోకి వెళ్లి పోతారన్నమాట. అలాగే సృష్టి అనే దాంట్లో కూడా ఈ 12 తరగతులు అట్లా జరుగుతూనే ఉంటాయి. జరుగుతున్నప్పుడు అయిపోతోంది అనుకొనేవాళ్ళు కొంతమంది ఉంటారు. చివరికి చేరిన వాళ్ళకి తప్ప సృష్టి అయిపోదు. స్కూలు అయిపోవటం ఎవరికి ఉంటుంది? విద్యార్థికి. 12 తరగతులు అయిపోయిన తరువాత అతనికి స్కూలు అయిపోతుంది కాని, స్కూలు అయిపోదు. స్కూలు అయిపోతోంది అనుకునేవాడు తనకు అయిపోతోంది అని గుర్తించాలి. అందుకని Master EK గారి తండ్రిగారు అనంతాచార్యుల వారు మనకి మంచి సందేశాన్ని ఇచ్చారు. H.G Wells అన్న మహాత్ముడు కొన్ని రోజులలో ఈ ప్రపంచం అంతా ప్రళయం లోకి వెళ్ళిపోతుంది అని ఒక declaration ఇచ్చాడు. అందరూ కంగారుపడ్డారు. ఎందుకంటే మహాత్ములు అట్లా చెప్పినప్పుడు కావచ్చు అనుకుంటాం కదా! అప్పుడు అనంతాచార్యులు గారిని కొంతమంది దీని గురించి మీరేమంటారు? అని అడిగారు. అప్పుడు ఆయన " సృష్టి ప్రళయంలోకి వెళ్ళదు. బహుశ ఆ time కి H. G Wellsగారు దేహం వదిలేస్తారు" అని చెప్పారు. తనకి ప్రళయం వచ్చినప్పుడు సృష్టికి ప్రళయం అనిపిస్తుంది. మనకి ఒంట్లో బావుండకపోతే, అసలు ఈ మధ్య ఎవరికీ ఒంట్లో బావుండడం లేదు అనిపిస్తుంది. మనకి ఆకలేసినప్పుడే పక్క వాడిని ఆకలేస్తోందా? అని అడుగుతాము. కడుపు నిండి, కడుపు నిండని వాడి ఆకలి తెలుసుకున్న వాడు దైవీతత్త్వం ఉన్నవాడు. కడుపు నిండక, కడుపు నిండని వాడి

సంగతి తెలిసి నినాదాలు చేసే వాళ్ళు ఆవేశాత్మకులు. కడుపు నిండి, కడుపు నిండని వాణ్ణి పట్టించుకోని వాడు సామాన్యుడు. కడుపు నిండి, ఇతరుల కడుపు నిండలేదే అని అనుకునే వాడు అసామాన్యుడు. వాడిలో పవిత్రత పాలు ఎక్కువ. అటువంటి వాడు ఇతరుల కష్టాన్ని తన కష్టంగా భావించి, తనకు తోచిన సహాయ సహకారాలు అందించగలవాడు. అట్లా మనకేం జరుగుతోందో ప్రపంచంలో అది జరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. ఈ మధ్య వచ్చిన " యుగాంతం" ఇటు వంటిదే. మార్పులనేవి ఎప్పుడూ జరుగుతుంటాయి. కాలం మార్పును తీసుకువస్తుంది. ప్రతి రోజూ ఆ మార్పులు జరుగుతున్నాయి. చిన్నా పెద్ద మార్పులు కొంచెం ఎక్కువగా జరిగే కాలమిది. దాన్ని యుగాంతంగా భావన చేయటం వారివారి ప్రజ్ఞా విలాసం యొక్క వైచిత్రి. అలా జరుగుతూ ఉండగా ఇలా నడిచి వెళ్ళిపోతూ ఉంటుంది తరంగం. ఒక తరంగం పుట్టిందనుకోండి, ఆ తరంగంలో నుంచి ఒక కేంద్రం, ఆ కేంద్రం నుంచి ఒక సవిత్ృ మండలం పుడుతుంది. ఆ సవిత్ృ మండలం నుంచి సూర్య మండలం పుడుతుంది. ఆ సూర్య మండలం నుంచి ఈ గ్రహగోళాదులు పుడుతాయి. సూర్యుని చుట్టూ ఉండే గోళాలు అన్నీ సూర్యుని ఆధారంగా ఏర్పడినాయి. ఈ ఏర్పడినవన్నీ ఏమైపోతాయి? ఇవి అయిపోతే అయిపోయినట్లు కాదు. ఇప్పుడు మనకి వున్న చంద్రుడు ఇది వరకు భూగోళం. ఆ భూగోళం నుండి ఈ భూగోళానికి మనని transport చెయ్యడమే వైవస్వత మనువు కథ. మత్స్యావతార కథ అదే! మత్స్య రూపంలో వచ్చి వైవస్వత మనువు దగ్గర పెరిగి, 'ప్రళయం రాబోతోంది' అంటాడు. దేనికి ప్రళయం? అంటే ఆ భూమికి, మొత్తం సూర్య మండలానికి కాదు. ఆ భూమికి మాత్రమే , మరి ఏం చేద్దాం అంటే, మిమ్మల్నందరినీ transport చెయ్యడానికి చేప రూపంలో వచ్చానంటాడు. అదీ మత్స్యావతార కథ. అదే Nova's Ark అని old testament Bible లో కూడా ఉంటుంది. అదేమిటంటే ఒక భూగోళం నుంచి జీవరాసులని ఇంకొక భూగోళం మీదకి transport చేసే కథ. Nova's Ark, ఒక పడవ తెస్తాడు. ఆ పడవలో అన్ని జంతువుల్ని, అన్ని species మగ,ఆడ జంటల్ని చేరుస్తాడు. చేర్చి ఇక్కడికి transport చేస్తాడు అని old testamentలో చదివాం. ఒక భూగోళం అయిపోయే లోపల ఇంకో భూగోళం తయారవుతుంది. అందుకని సృష్టిలో అయిపోవటం అంటూ ఉండదు. ఈ భూగోళం అయిపోయే లోపల ఇంకో భూగోళం వస్తుంది. ఎందుకంటే భూగోళానికి ఒక కాల పరిమితి ఉంటుంది.

మనకొక కాల పరిమితి ఉంది. ఒక్కొక్కళ్ళకి ఒక పన్నా ఉంటుంది. గులాబీ మొక్కకి ఒక పన్నా. మర్రిచెట్టుకు ఒక పన్నా. గులాబీ మొక్క తను పోయేటప్పుడు మఱ్ఱిచెట్టుతో అంతా అయిపోతోంది అంటే, మఱ్ఱిచెట్టు నవ్వుకొని ' నీకు అయిపోతుంది' అంటుంది. గులాబీ మొక్కకి అయిపోటానికి, మఱ్ఱిచెట్టుకు అయిపోటానికి చాలా తేడా ఉంది. ఎప్పటికప్పుడు అయిపోతుంది, అయిపోతుంది అనుకునే వాళ్ళందరూ వాళ్లకై పోతుంది అని గుర్తు పెట్టుకోవాలి. సృష్టికి అయిపోవటం అంటూ ఉండదు. ఎందుకంటే అది అయిపోతుంటే ఇంకొకటి వస్తుంది. ఒక మామిడి మొక్క అయిపోతుంటే ఇంకొక మామిడిమొక్క వస్తుంది. లేకపోతే ఇన్ని వేల సంవత్సరముల నుంచి భూమి మీద మామిడి చెట్లు ఎట్లా ఉన్నాయి? మనం ఉన్న ఈ భూమి, భూమిగా కనబడటానికి ఈ భౌతిక లోకానికి ఏడు స్పందనాల్లో దిగి వస్తుంది. మళ్ళీ 7 స్పందనాలు అయ్యేసరికి, మళ్ళీ ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడికి క్రమశః వెళ్ళిపోతుంది. ప్రస్తుతం మనకి కనిపించే చంద్రుడు 7 స్పందనాలు అయ్యి వెనక్కి వెళుతున్నాడు. అంటే 8 అన్నమాట. మొత్తం 7 స్పందనాల్లో ఈ భూమి రావటం 4వ స్పందనం. ఈ 4 వ స్పందనంలో మనకి భౌతికంగా కనిపిస్తుంది. అంటే ఉన్న స్థితి నుంచి చైతన్య స్థితికి వచ్చి , అక్కడ నుంచి వెలుగులోకి వచ్చి, అక్కడి నుంచి భూమిగా వస్తుంది. దీన్ని మనకి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగా చెప్తారు. దీన్ని Madam Blavatsky, Globe Changes అని Secret Doctrine లో చాల విశదంగా చెబుతుంది. 7 స్పందనాలలో ఒక గోళము రావటం మళ్ళీ వెళ్ళిపోవటం కూడా జరుగుతుంది. మొదటి స్పందనంతో కేంద్రమవుతుంది. మనం ఉన్నాం. మనలోంచి ఒక సంకల్పం వచ్చింది. సంకల్పానికి భాష ఏర్పరచుకున్నాం. ఏర్పరచిన భాషని వ్యక్తం చేస్తున్నాం. ఇట్లా 4గా వస్తాం. 'చతుర్వర్గ ఫలం జ్ఞానం' కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం 4. వేదాలు 4, ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం. అట్లాగే వర్ణములు 4.

'చతుర్వర్గ ఫలం జ్ఞానం. నానా వస్థ చతుర్విధ
చతుర్వర్ణమయో లోకః తత్తత్ సర్వం చతుర్ముఖః.'

అంతా 4 గా ఉంటుంది. నాలుగవది అంతకు ముందు మూడు ప్రకారం ఉంటుంది. వచ్చిన సంకల్పం ప్రకారం భాష ఏర్పరుచుకుంటాం కాని, సంకల్పం ఒకటి, భాష ఒకటి కాదు కదా! వచ్చింది అసూయకి సంబంధించిన సంకల్పం

అనుకోండి భాష ఇంకొకటి రాదు. ఎంత మనం దానికి రంగు పూసినా మాటల్లో అది కనిపిస్తూనే ఉంటుంది. కనుక మనం మాట్లాడుతున్నదే మొదలు అనుకుంటే ఎంత పొరపాటు? మనం మాట్లాడడానికి ముందు భాష ఏర్పరచుకున్నాం. భాషకి ముందు భావమున్నది. భావానికి ముందు మనం ఉన్నాం. మనం లేకుండా భావం లేదు. భావన లేకుండా భాష లేదు. భాష లేకుండా మాట లేదు. కనిపించేదేమిటి? మాట! దీన్నే Madam Blavatsky ఏమందంటే 'This is the D Globe'. 4 వ స్థితి. వైఖరీ వాక్కు అంటారు మన పెద్దలు. మనం ఉండటాన్ని 'పర' అంటారు. మనకొచ్చే ఒక భావం తట్టింది లేక వెలిగింది అంటామే: అంటే మనకి భాసించింది అన్న మాట. భాసించింది భావం. దాన్ని పశ్యంతి అంటారు. అంటే we have visualized. అంతకు ముందు ఎక్కడ ఉంది? మనలోనే ఉంది. మనలో మనంగా ఉన్నది, మనలో ఒక సంకల్పంగా వ్యక్తమవుతుంటుంది. సంకల్పంగా వ్యకమైన దానికి భాష ఇస్తుంటాం. ఇచ్చిన భాషని మాటల్లో పెడుతుంటాం. మాటలో పెట్టడానికి ముందు లేదా మాట? ఉంది. అట్లాగే మనకి కనిపించక పోయినంత మాత్రాన లేదనటం తప్పు. చాలా విషయాలు భౌతికంగా చూడటం అలవాటు అయిన వాళ్ళకి భౌతికంగా కనిపించినప్పుడే 'ఉంది' అనుకుంటారు. అంతకు ముందు కూడా ఉంది. ఏదన్నా సరే మనం మొదలు పెట్టాం అన్నదానికి ముందు చాల మొదళ్ళు ఉంటాయి. విత్తనం మొక్కగా ఎదుగుతున్నప్పుడు ఎప్పుడు అది మొక్క అయింది? ఎవరు మొట్టమొదట విత్తనం నాటారు? అంటే మనం భూమిలో నాటింది ఒక time అనుకోవచ్చు, భూమిలో నాటుదాం, అని మన మనసులో నాటుకున్నప్పుడు The beginning కదా! ఎందుకు చెబుతున్నాను అంటే ఇది చాలా important concept. భూగోళాలు 7 తరంగాలలో వచ్చి వెళ్లిపోతుంటాయి. అట్లాగే జీవకోటి కూడా! మొట్టమొదట ఉండే స్థితిని A Globe, అంటారు. రెండవది అక్కడి నుంచి సంకల్పంగా వస్తుంది. దానిని B Globe, అంటారు. మూడవది భాషాపరంగా వస్తుంది. దానిని C Globe, అంటారు. వైఖరిగా వచ్చే దాన్ని D Globe అంటారు. అంటే A Globe అనేది పృధ్వీతత్వంగా సృష్టిలో మొదటి నుంచి ఉంటుంది. దాన్ని మూల ప్రకృతి అంటారు. అది ఎట్లా ఉంటుందంటే అతి సూక్ష్మమై వుంటుంది. సూక్ష్మతరము అంటారు. స్థూలము, సూక్ష్మమూ, సూక్ష్మతరమూ స్థితిలో ఉన్న పదార్థం భూగోళంగా ఏర్పడుదాం, అన్న సంకల్పంగా రెండో స్థితిలోకి వస్తుంది. దాన్ని

Buddhic State అంటారు. మూడవ స్థితిలో Astral State, దాని చుట్టూ గోళాకారంగా ఏర్పడటానికి పదార్థం, semi Gaseous State లోకి వస్తుంది. అక్కడి నుంచి నెమ్మదిగా నీరు, నీరు నుంచి భూమిగా మారుతుంది. భాగవతంలో కర్దమ ప్రజాపతికి సంబంధించిన కథా భాగమంతా ఈ భూమి నీటినుంచి బురదగా మారి భూమిగా అయిన ఆ స్థితి ఒక కథలా ఇచ్చారు. మనలాగే ఒక ఊళ్ళో ఒక బ్రాహ్మణుడు, ఆయనకొక భార్య, కొడుకుగా కనిపిస్తుంది కథగా చదువుకునేవాళ్ళకి. నిజానికి అది కాదు. భాగవతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే భూమి ఏర్పడే స్థితిలో జరిగిన కథలు అవి. అంతకు ముందు కథలు భూమి పుట్టకముందు ఏర్పడిన కథలు. కాబట్టి ఈ కథలు ఇట్లా 4 స్థితులుగా భూమి ఏర్పడి, మళ్ళీ తిరోగమనం చెందటానికి సంబంధించినవి. అట్లా చంద్రుడు ఇప్పుడు వెనక్కి వెళ్ళాడు. అంటే దానిని E GLOBE, అంటారు. It corresponds to the C Globe. మనం ఇక్కడికి దిగి రాకముందు మనం కూడా అంతే! దిగి రాకముందు పితృ లోకంలో ఉంటాము కదా! దిగి వచ్చిన తరువాత మళ్ళీ వెళ్ళేటప్పుడు పితృలోకానికి వెళతాం. ఏ దారిన వస్తే ఆ దారినే వెళ్ళాలి కాని ఇంకో దారి లేదు. అందుకని C Globe కి corresponding గా E Globe అవుతుంది. అదీ ఇప్పటి చంద్రుడి స్థితి. B Globe కి corresponding గా F Globe వస్తుంది. A Globe కి ఇంక correspondence ఏమీ ఉండదు, A అవుతుంది. ఇది చాలా పవిత్రమైన విజ్ఞానం. ఇంతకు ముందు మన వాళ్ళు చెప్పని విజ్ఞానం. శబ్దము ఆధారంగా భూగోళం పుట్టుక తెలుసుకుంటున్నాం. మననిగా మనం మార్చుకోలేము కనుక. మనలాంటి దుస్థితిలో ఉన్నవాళ్ళని బాగుచేయడానికి చెప్పబడిన విషయాలివి. అందుకనే Secret Doctrine చదువుకుంటే పునీతులవుతారు. అంత పవిత్రమైన విషయం ఇక్కడ చెప్పుకుంటున్నాం. ఒక శబ్ద తరంగం ఆ విధంగా దిగి వచ్చినప్పుడు 4 తరంగాలలో భూమి ఏర్పడి, 4 వ తరంగంలో మనం దాన్ని చూస్తుంటే. మళ్ళీ అదే పద్ధతిలో తిరిగి వెళుతుందిట. According to the due and ancient form అంటారు మాస్టర్ E.K. అట్లా ఇప్పుడు తిరిగి వెళుతున్న భూగోళం చంద్రుడు. చంద్రుడు గ్రహం కాదు. ఇదివరకటి భూగోళం. దాన్ని ఏం చేసారంటే తిరిగి వెళ్ళుతున్నప్పుడు ఈ సూర్య మండలానికి వాడుకోవచ్చని, మిగతా శక్తులు, ప్రజ్ఞల యొక్క ప్రభావాన్ని ఈ భూమికి అందించడానికి చంద్రుణ్ణి ఒక satellite గా వాడుకుంటున్నారు ప్రస్తుతం. ఈ చంద్రుడు కొన్నాళ్ళు పోతే ఉండడు. ఇంకో

చంద్రుడు వస్తాడు.  ఇట్లా చంద్రుళ్ళు అవుతున్న వాళ్ళు కొంత మంది ఉంటారు. ఇట్లా భూగోళాలు దిగి వస్తుంటే ఈ భూమి కూడా ఆ పరిస్థితి వచ్చేసరికి ఇంకో భూమి వస్తుంది.  స్కూల్లో ఎప్పుడూ classes ఉంటాయన్నానే అలాగే సూర్య మండలాలు కూడా ఎప్పుడూ ఉండేటట్లు వాళ్ళు శబ్దాన్ని ఆధారం చేసుకున్నారు. Continuous గా, శబ్ద తరంగాలు ఏర్పడడం వల్ల వీటికి వేటికి లోటులేకుండా అట్లా వెళ్ళిపోతుంటాయి. అది అయిపోయిందట అంటే ఇంట్లో ఒక బస్తా అయిపోతే ఇంకో బస్తా వచ్చినట్టు అన్నమాట.  Creation లో discontinuity ఉండదు. ఓంకారంలో ఎప్పుడూ కూడా discontinuity ఉండదు. అది discontinue అయితే మొత్తం పడిపోతుంది. ఒకటి ముందుకు జరగగానే దాని స్థానంలో ఇంకొకటి వస్తుంది.  అది theory of substitution అని మాస్టారు గారు మనకి చెప్పారు.  నువ్వు చేసే పనికి ఇంకొకడు తయారయ్యేంత వరకు నువ్వు అక్కడే ఉండాలి. ఇంకొకడు అక్కడకొచ్చి నువ్వు చేసే పని చేస్తుంటే, నువ్వు ఇంకొక పనికి వెళ్ళవచ్చు.  నువ్వు చేసే పని ఇంకొకళ్ళు చెయ్యట్లేదనుకో నువ్వే వచ్చి చేసుకోవాలి. మనం కూడా అంతే.  మనం ఇక్కడి నుంచి తిరిగి వెళ్తాం. వసులోకం, రుద్రలోకం, ఆదిత్యలోకం ఇట్లాగే కదా పెడతారు పిండాలు ముగ్గురికి. ఆ తరువాత అవసరం లేదు.  మనం ఇక్కడ 4వ వాడుగా ఉన్నాం. మన ముందు ముగ్గురివరకు connection ఉంది.  మన తరువాత ముగ్గురి వరకు మనకి connection ఉంది.  మన తరువాత 3 వ వాడెవడు?  ముని మనవడు.  మనం పై ముగ్గురి తో పెట్టుకుని, వారి ఆశీర్వచనం తీసుకుంటూ, మన మునిమనవడు వరకు మనం ఉన్నట్లయితే, మన ఏడు స్పందనాలు పరిపూర్ణమయినట్లు. వీడు పరిపూర్ణ జీవి, అని పెద్ద వాళ్ళు చెప్పింది అందుకు. మన ముత్తాత, మన తాత, మన తండ్రి, మనం. మన ముత్తాతకి ప్రతినిధి ఆదిత్య లోకం లో ఉంటే,  మన తాత రుద్రలోకం లో అయన ప్రతినిధి.  వసులోకంలో ఉండే తండ్రి, (వెళ్ళిపోయినవాడు) ఆయనకు ప్రతినిధి.  ఆ తండ్రికి భూమి మీద మనం ప్రతినిధులం.  మనకి రాబోయే ప్రతినిధులు కొడుకు, మనవడు, మునిమనవడు. ఇట్లా 7 pulsations work out అవుతుంటాయి.  అందుకని 7 తరాలు చూసుకోమన్నారు. ఎందుకంటే continuity తెలుస్తుంది.  తండ్రి చేసింది కొడుకు continue చెయ్యక పోతే, తండ్రి తిరిగి వచ్చి చేసుకోవలసిందే.  ఇంట్లో పని అప్ప చెప్పి ఊరెళ్ళాం అనుకోండి,  ఇంటి వాళ్ళు చెయ్యకపోతే మనమే తిరిగి వచ్చి చేసుకోవాలి. నీ పని అక్కడ పాడయింది. వెళ్ళి

చేసుకో, అని చెప్తారు. అందుకనే తను భూమి మీద చేసే కార్యాలని ఎవరైతే వృద్ధి చేస్తూ తన తరువాత కూడా చేసుకునేలా ఉంటారో వాళ్ళకి పురోగతి, లేకపోతే తిరోగతి, అందుకని ఈ జీవితంలో మన ముందు ముగ్గురి ఆశీర్వచనం తీసుకుంటూ, వాళ్ళ స్ఫూర్తి పొంది, కార్యక్రమాలు చేసుకుంటూ, మన తరువాత వాళ్ళకి ఆ స్ఫూర్తి ఇవ్వడానికి చేసే ప్రయత్నంలో జన్మ సాఫల్యం ఉంది. "ప్రజా తంతుం మా వ్యవ చ్ఛేత్సీ" అని తైత్తిరీయోపనిషత్తు చెప్తుంది. ప్రజా తంతు అనే వ్యవస్థని కత్తెర వెయ్యకు. కత్తెర వేస్తే నువ్వే తిరిగి వచ్చి టకటక గింగిరాలు కొడుతూ తిరుగుతుండాలి అని చెప్పారు. ఒక తండ్రి కుమారుల మధ్య నున్న సంబంధము అటువంటిది. ఒక గురువు శిష్యుల మధ్య ఉండే సంబంధము కూడా అదే. గురువు చేసే కార్యక్రమాలు continue చేయడానికి ఒక శిష్యుడేర్పడితే, గురువు ఊర్ధ్వ లోకాల్లో ఉంటాడు. గురువు పరమ గురువు అవుతాడు. చెయ్యకపోతే మళ్ళీ దిగి వచ్చి చేసుకోవాలి. ఆ గురువు గురువు, పరమ గురువు నుంచి పరమేష్టి గురువు అవుతాడు. గురుభ్యోనమః పరమ గురుభ్యోనమః. పరమేష్టి గురుభ్యోనమః ఎప్పుడవుతాడు? తన తరువాత రెండు తరాల వాళ్ళు శుభ్రంగా చెప్పినది చెప్పినట్లు చేస్తూ, దానికి ఎక్కడా వంకరలు లేకుండా చేస్తే! మనం కుడా అంతే! మనం చేసే సత్కార్యాలు continue అయితే మన తరువాత వచ్చే తరాల వాళ్ళు ముందుకు వెడుతుంటారు. అగస్త్యుడంతటివాడికి తప్ప లేదు. అగస్త్యుడి పూర్వీకులు తల్లక్రిందులుగా బావిలో పడి ఉంటారు. ఈయన నడిచి వెళ్తుంటే చూస్తాడు. అందరూ మహాత్ములు, ఋషులు. Clairvoyance కాబట్టి ఆయనకి అలా కనిపిస్తుంది. 'ఏమిటి ఇలా ఉన్నారు మీరు' అంటే, 'ఏం చెప్పం మా దురవస్థ? మా వంశంలో ఒకడు పుట్టాడు. వాడు మొండివాడు. మాట వినకుండా అంతా తనకే తెలుసు అనుకుంటాడు. వాడు పెళ్ళి చేసుకొని ఈ వ్యవస్థని continue చేయని కారణంగా మేము ఇక్కడ stuck up అయి ఉన్నాం,' అని చెబుతారు. 'ఎవడు వాడు?' అంటే, 'నువ్వే' అని చెబుతారు. పొరపాటు గ్రహించి, అప్పుడు లోపాముద్రని పెళ్ళి చేసుకొని, continue చేస్తాడు. ప్రజాతంతువు ఒకటి. విజ్ఞానం ఒకటి. మనం పెద్దల దగ్గర నుంచి పొందిన విజ్ఞానాన్ని మన పిల్లలకి అందివ్వక పోవటం ఒక అపచారం. మన కోసం కాదు. మనం దాన్ని అనుభూతి చెంది, దాని ప్రకారం ప్రవర్తిస్తూ మన పిల్లలకి అందించటం అన్నది పవిత్రమైన కార్యం. అది చెయ్యాలి. అట్లాగే వృత్తి విద్యలలో

మనం నేర్చుకున్న దానిని కూడా! మన తరువాత ఇంకొకడు అక్కడ తయారవ్వాలి.ముక్తి అంటే ఊరికే ఆకాశంలో చూస్తే ముక్తి రాదు. మనం కుటుంబపరంగా కొన్ని పనులు చేస్తుంటాం. దాంట్లో ఒక continuity ఉండాలి. తండ్రి చేస్తున్న సత్కార్యాలు కొడుకు continue చేయాలి. చెయ్యకపోతే ఆ తండ్రికి సద్గతులు లేవు. కొడుకవ్వచ్చు, కూతురవ్వచ్చు. అదీ Domestic life. అట్లాగే economic life ఒకటి ఉంటుంది కదా! అంటే తను సంపాదించడం అనే కార్యక్రమంలో సంఘానికి సేవ చేస్తుంటాడు. సంఘానికి సేవ చేసుకుంటే గాని సంపాదన ఉండదు. సంఘానికి నేను ఏమీ చెయ్యను, నాకు డబ్బు కావాలి అనుకుంటే రాదు. ఆ విధంగా సంఘానికి' చేసిన సేవలో వీడు పొందిన అనుభవం, అనుభూతి ఇంకొకడికి అప్ప చెప్పాలి. వాడు చేసుకుంటూ వెళతాడు వీడి తరువాత. అట్లాగే తను గురువు దగ్గర నేర్చుకున్న విజ్ఞానం. ఒకటి economic social cause. ఒకటి domestic cause. ఒకటి spiritual cause. గురుమూర్తి దగ్గర, ఋషుల దగ్గర నేర్చుకున్న విజ్ఞానాన్ని మన వాళ్ళకి దానిని concession లలో కొట్టేయకుండా అందించాలి. మన వాళ్ళకి అంటే, తన చుట్టూ ఉండే బంధుమిత్ర వర్గాలకి అందించి, వాళ్ళకి ఆ స్ఫూర్తినివ్వాలి. ఇట్లా చేస్తే 3 రకాలుగా ఉత్తీర్ణుడవుతాడు. లేకపోతే వాడు తిరిగి వచ్చి చేసుకుంటాడు. ఎందుకిలా జరుగుతుందంటే continuity లేదన్నమాట శబ్దంలో. నాదం యొక్క continuity లేకపోతే మళ్ళీ nuts బిగించుకోవాలి. ఫిడేలు మీద వాయించగానే శబ్దం బాగా లేదు అనుకోండి, ఆపి మళ్ళీ nuts బిగించుకోవాలి. అందుకని దశరథుడి యొక్క ఉత్తమ లోకాల మీద ఆసక్తి ఉన్న దశరథ రాముడు, తను అరణ్యానికి వెళ్ళవలసిన అవసరం లేకపోయినా ఆ dimension చూసి, అరణ్య వాసం చేస్తాడు. నిజానికి అరణ్యవాసం చెయ్యనక్కర లేదు, ఎందుకంటే కోరింది కైకేయి. ఎవరికోసం కోరింది? భరతుడి కోసం. కోరిన కైకేయి, ఎవరి కోసం కోరిందో ఆ భరతుడు ఆ ఇద్దరూ వచ్చి ప్రాధేయపడితే సమస్య అంతటితో తీరిపోయినట్లే. కాని ఎందుకోసం రాముడు పట్టు పడతాడు నేను అరణ్యవాసం చేస్తానని? తండ్రికోసం! ఎందుకంటే తండ్రి ఊర్ధ్వ గతులకి అది దెబ్బ కొడుతుంది తను చేయకపోతే. తండ్రి అప్పు చేసి చనిపోయాడనుకోండి. మా నాన్న గారు ఏం చేశారో, మా కేమీ తెలియదండీ అని దాటేసే వాళ్ళతో చాల ఇబ్బంది. అక్కడ దశరథుడు మాట అప్పు చేసాడు, మరి ఆ బాకీ తీర్చాలి. అందుకని యుద్ధమంతా

ముగిసి సీతాదేవిని తన దగ్గరకు తీసుకున్న సందర్భంలో, దశరధుడు కనిపించి 'నా జన్మ కృతార్ధమైంది,' అని చెబుతాడు. అంటే ఏమిటి? 14 ఏళ్ళు వనవాసం చేసి మాట చెల్లించాడు. గృహపరంగా గాని, సంఘపరంగా గాని అట్లాగే నడిపించాలి. నడిపించి, వృద్ధి చేసిన తరువాత, తర్వాత తరానికి అందించి వెళ్ళాలి. అంత బాధ్యత ఉంది. ఏదో మన ఆయుష్షు , మన ఆరోగ్యం కాదు. ఉద్యోగం చేస్తున్నామనుకోండి, మన దగ్గర ఉన్న మెళకువలన్నీ మన క్రింద పని చేస్తున్న వాళ్ళకి నేర్పుతుండాలి. వాడు సవ్యంగా తయారైతే నీ పని కూడా సులువవుతుంది. ఇట్లా తయారు చేసుకుంటే నీకు విముక్తి వస్తుంది. నీ place లో ఇంకొకడు పని చేయడానికి వచ్చాడు కాబట్టి. You are taken into a better responsibility. Promotions అంటే అందుకు. అవీ నిజమైన promotions. వీడు కింద వాడికి పని నేర్పి, వీడి పని వాడికి అప్ప చెబితే వీడు పైకి వెళతాడు. వీడి పైవాడు ఇంకా పైకి; వాడి పై వాడు ఇంకా పైకి వెళతారు. ఈ మొత్తమంతా నిచ్చెన. అంతా పడిపోకుండా చోటులో వేలాడుతూండటానికి ఏమిటి ఆధారం? ఓంకారం అట్లా నిలబెడుతుంది. మహాస్వనం అంటే మనం ఒకసారి "ఓం" అని rest తీసుకున్నట్లు కాదు. మనం ఒకసారి ఓం అని, రెండోసారికే rest తీసుకుంటాం కదా! కానీ ఆ ఓంకారం అలా జరుగుతూ ఉండడం వలన అన్నీ అలా నిలబడినాయి. భూగోళం చాలా చిన్నది. అన్నిటికన్నా పెద్దది Jupiter. ఇట్లాంటి గోళాలు చోటులో ఎన్ని ఉన్నాయో! ఇవన్నీ ఓంకారం జరుగుతూ ఉండటం వలన ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది వేలాడితే ఎట్లా ఉన్నాయి? అదీ మహాస్వనం. అవన్నీ అట్లా ఉండటంగాదు. కొన్ని నెమ్మదిగా కరిగిపోతుంటాయి చోటులోకి. అవి కరిగి పొయ్యే లోపల మళ్ళీ అక్కడికి ఇంకొకటి వస్తుంది. మనం వెళ్లి పొయ్యే లోపల మళ్ళీ ఇంకొకడు రావటం మన వరకు ఎట్లా సత్యమో, భూగోళం వరకు కూడా అట్లాగే సత్యం. అలాగే సూర్యమండలాలకి. మీకు తెలుసో తెలియదో ఇది రెండో సూర్యమండలం. The second systemic existence అంటారు. ౩వ సూర్యమండలం ఉంది. ఇంకో 3 స్పందనాల్లో ఇది చోటులోకి వెళ్లిపోతుంది. గోళాలకి ౭ స్పందనాలు ఉన్నాయి. మనం గూడ ౭ మెట్లు ఎక్కి, మళ్ళీ ౮వ వాడిగా తేలాలి. ఆ ౮వ వాడెవడంటే ఈ ౭లో దిగని వాడు, దిగినా ఇరుక్కోని వాడు. కనుక ఈ మొత్తాన్ని అంతా, ఎక్కడా, ఏదీ అయిపోకుండా నడిపించే శబ్దం ఉంది. అది "ఓం"కారం . అదీ మహాస్వనం.

Great Sound. Continuous గా ఆ sound జరుగుతున్నంతసేపూ అన్నీ తేలుతూనే ఉంటాయి. Sounds withdraw అయిపోతే మొత్తం అంతా కూడా పడిపోతుంది. అలా arrange చేసారు. విషయం ఏమిటంటే ప్రతి గోళం 7 స్పందనాల్లో, చోటులోంచి వచ్చి కనబడి, తిరిగి చోటులోకి వెళ్లి పోతుంది. 4 వ స్పందనంలో మనకి కనిపిస్తూ ఉంటుంది. మనం కూడా ఒకళ్ళకొకళ్ళు కనిపిస్తున్నాం అంటే 4 th state లో ఉన్నాం. ఇంతకుముందు state కామలోకం. దాన్నే astral plane అంటారు. అంతకుముందు state Manasic plane (మానసిక కక్ష్య) లేక mind. అంతకుముందు plane మనమే. మనమే మన వెలుగుగా ఉండి, మన మనసులోకి దిగుతాం. మన ఇంద్రియాలలోకి దిగుతాం. మన శరీరంలోకి దిగుతాం. మనమున్నాం. మనం నిద్ర లేస్తున్నాం. నిద్ర లేస్తున్నాం కాబట్టి ఆలోచిస్తున్నాం. ఆలోచిస్తున్నాం కాబట్టి పనులు చేస్తున్నాం. మొత్తం నాలుగుగా ఉంటాం. మళ్ళీ return ఎట్లా అవుతాం? ఇదే పద్ధతి. శరీరంగా ఉన్నా దాంట్లోంచి నిద్రలో నెమ్మదిగా ఇంద్రియాలలోంచి కామలోకంలోకి withdraw అయిపోతాం. అందుకనే అక్కడ కలలు కంటాం. అక్కడి నుంచి మనోలోకాలలోకి, అక్కడి నుండి అసలు లోకం లోకి ఇట్లా withdraw అయిపోతుంటాం. మూడు విడతలుగా విచ్చుకుంటాం. మళ్ళీ మూడుగా ముడుచుకుంటే మనం అయిపోతాం. మనం నాలుగవ వాళ్ళం. అట్లా ఇది మనకు సత్యం, భూమండలానికి సత్యం, సూర్య మండలానికి సత్యం. సవితృ మండలానికి సత్యం. ఇవన్నీ ఇలా ఏర్పడటానికి ఒక పద్ధతి ప్రకారం నడిపించేది శబ్దం. దాన్ని నడిపించేవాడు ధాత.

# 45. అనాది నిధనః

ఆది అంటే మొదలు అని, పుట్టుక అని. నిధనం అంటే ఆ పుట్టిన దాని అంతం. నిధన పతయే నమః అంటుంటాం కదా! ఎవర్ని? శివుణ్ణి. మళ్ళీ అన్ని love all చేసేస్తాడన్న మాట. పూర్ణం చేసేస్తాడన్న మాట. అంటే మట్టి నుంచి కుండ ఏర్పడితే, మళ్ళీ కుండ నుంచి మట్టి చేసేస్తాడు. రావటం అనే దానికి ఒక ప్రజ్ఞ ఉంటె, పోవటం అనే దానికి ఇంకొకటి. రావటం ఉంటె పోవటం ఉంటుంది. రాని, పోని వాడు దేవుడు. కానీ రాని పోనిగా ఉండే దేవుడు వచ్చి పెరిగి పోతున్నట్లుగా కనిపిస్తాడు. మామిడిపండు ఉందనుకోండి, మామిడి పండు పుడుతుంది, పెరుగుతుంది. ఆ తరువాత మనం తినేస్తాం. అయిపోయిందా? అవలేదు. దాని టెంకె ఉంటుంది. A bit of him remained in the ashes అన్నట్లుగా, మళ్ళీ మొలకేస్తుంది. సృష్టిలో పోయేది ఏమీ లేదు. అన్నీ principles గా ఉంటాయి. అయితే మనకి కనిపించేటట్టుగా ఉండక పోవచ్చు. మనకి కనిపించేది మార్పు చెందుతుంది. కాని ఉండేది ఎప్పుడూ శాశ్వతంగా ఉంటుంది. ఆ ఉండే దానిలోంచి ఈ పుట్టినట్లుగా వచ్చి, పోయినట్టుగా పోతుంది. అట్లా మనకి ఒక triangular force background మీద పని చేస్తోంది. అదీ త్రిగుణాత్మకంగా సృష్టి పని చెయ్యటం అంటే! పుట్టకముందు ఏదైతే ఉన్నాదో అదే పుట్టుకు వస్తుంది తనంత తానే! పుట్టి పెరిగి తరుగుతూ ఉంటుంది. మనకి పుట్టటం తెలియదు, పోవటం తెలియదు, మధ్యలో వృద్ధి తెలుస్తుంది కాస్తో కూస్తో. కాని నిజానికి పుట్టకముందు ఎక్కడున్నాం? తల్లి గర్భంలో ఉన్నాం. తల్లి గర్భంలోకి ఎట్లా వచ్చాం? తండ్రి సంకల్పంలోంచి. తండ్రి సంకల్పంలోకి ఎట్లా వచ్చాం, ఆకాశంలో ఉన్నాం కాబట్టి. ఉన్నవాళ్ళమే అట్లా వస్తుంటాం, వెళుతుంటాం, ఒక Giant wheel ఎక్కినట్లు. అది మనకి భగవద్గీత 8 వఅధ్యాయం చదువుకుంటే తెలుస్తుంది. పైకి వెళ్తుంటారు క్రిందకి వస్తుంటారు. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి'. పుణ్యం చేసుకుని పైకి వెళ్తుంటారు. మళ్ళీ కిందకి వస్తుంటారు. ఉత్తరాయణం, దక్షిణాయణంగా జరుగుతుంటుంది. పైకెళ్ళి కిందకి వచ్చి సరదాగా తిరగటం ఒక పద్ధతి. ఆ తిరిగే చక్రం నుంచి బయటకి వచ్చి, ఆ తిరుగుతున్న చక్రాన్ని చూడటం ఒక పద్ధతి. రెండవది ఎక్కువ బాగుంటుంది. చక్రంలో మనం ఉంటే మొత్తం చక్రం

మనకు కనబడదు. ఎవరు పైనున్నారో, ఎవరు కింద ఉన్నారో బాగా తెలియదు. చక్రం ఇవతల ఉంటే అన్నీ చాలా విశదంగా కన్పిస్తుంటాయి. ఆయన చక్రభ్రమణానికి అవతల ఒడ్డున ఉంటాడు. అది ఆధారంగా చక్రం తిరుగుతూ ఉంటుంది. కాబట్టి మనం పుట్టటం, పోవటంగా కనిపిస్తుంటుంది. అయితే ఈ పుట్టిన వాడు అసలు పుట్టనివాడు. వాడికి పుట్టుక లేదు. పుట్టినట్లుగా కనిపిస్తాడు. ఆది అంటే మొదలని కదా, ఈ class ఎప్పుడు మొదలయిందీ? ఇవ్వాళ 6 గంలకి prayer తో class అని ఇవ్వాళ మొదలు కాలేదు. 9 రోజుల క్రితం శనివారం class లో సోమవారం నాడు చెప్పుకుందాం అనటంతో మొదలయింది. అప్పుడూ కాదు. అంతకుముందు 20వ తారీకు వలివేరు గురుపూజలని నిర్ణయమవడం వలన ఇలా సోమవారం class అయ్యింది. ఇలా వెనక్కి వెనక్కి వెళుతుంటే అసలెప్పటికీ తీరదు ఎప్పుడు మొదలయ్యిందో. ఏదో ఒక మొదలు మనం గుర్తుకి చెప్పుకొంటాం అంతే. Retrace చేసుకుంటూ వెళితే మనలోంచి మొట్టమొదటగా దిగి వచ్చిన సంకల్పం ఉందే దానికి మొదలెవరూ? నేనే! ఆ నేను ఆధారంగా మొదలై ఇవన్నీ ఏర్పడి, అందులోకి మళ్ళీ వెళ్లి పోతుంటాయి. ఈ మొదలవటం అయిపోవటం, రెండూ ఆయనే అని చెప్పటానికి, ఆది, నిధనం లేనివాడు. మొదలు, తుది లేనివాడు అని చెప్పటానికి 'అనాది నిధనము' అంటారు. అది ఎప్పుడూ ఉంది. దాన్నే 'background consciousness' అంటారు. దాన్ని 'పరబ్రహ్మతత్వము' అంటారు. దాంట్లోంచే అన్నీ పుట్టుకు వస్తుంటాయి. అది కనబడదు. అది ఆధారంగా మిగతావన్నీ ఏర్పడుతుంటాయి. పురాణాలు చదువుకుంటే దేవతలందరూ కష్టాలు వచ్చినప్పుడు సరాసరి నారాయణుడి దగ్గరికి వెళ్ళటం ఉండదు, బ్రహ్మ దగ్గరికి వెళతారు. బ్రహ్మ ఏం చేస్తాడంటే కూర్చోండి చెబుతానని, వాళ్ళని కూర్చోబెట్టి ధ్యానం లోకి వెళ్తాడు. ఆహా ఆహా అని, ఇలా చెప్తున్నాడు నారాయణమూర్తి అని చెప్తాడు. మీకేమీ పర్వాలేదనో, లేకపోతే ఇంకా కొన్నాళ్ళు time ఉందనో చెపుతారు. బ్రహ్మ solution ఎక్కడి నుండి ఇస్తున్నాడు? తన నుండి కాదు. తన ద్వారా! మనం పెద్దవాళ్ళ దగ్గరికి వెళ్లి సలహా అడిగామనుకోండి. నేను సలహా ఇచ్చాను, అనుకునే వాడెవ్వడూ సరియైన సలహా ఇవ్వలేడు. సలహా ఇస్తాను, అనుకున్న వాడెవ్వడూ సలహా ఇవ్వలేడు. సలహా అడిగినప్పుడు తన అంతరంతరాలలో ఉన్న అంతర్యామిని consult చేసి, అక్కడి నుంచి ఏమి వినబడుతుందో అది చెప్పేవాడు నిజమైన సలహా ఇస్తాడు.

ఋషులు అందరూ సలహాలు అట్లా ఇస్తుంటారు. వాళ్ళని అడిగినప్పుడు తమ పొరలన్నీ దాటుకొని తమలో ఉండే కేంద్రంలోకి వెళ్లి, అక్కడి నుంచి నారాయణుడి సంకల్పాన్ని కాలము, దేశము ప్రకారం ఏ విధంగా నిర్దేశింపబడుతుందో వ్యక్తం చేస్తుంటారన్నమాట! నారదుడు అట్లా చేస్తుంటాడు. వ్యాసుడు, అగస్త్యుడు, వసిష్టుడు అట్లా చేస్తుంటారు. కోపాలు ఆవేశాలు ఉంటె, అట్లా చేయడానికి వీలు పడదు. అందుకని అవి వచ్చినప్పుడు అది పలకదు. విశ్వామిత్రుడు, దుర్వాసుడు వీళ్ళకి పలకదు. ఎప్పుడూ ప్రశాంతంగా, పరిపూర్ణంగా, శమము నందు ఉన్నవారికి అందులోది వినబడుతుంది. ఎక్కడి నుంచి పలుకుతుందీ అంటే అది కేంద్రంనుంచే. బ్రహ్మకు కూడా కేంద్రం నుంచే. అనాది నిధనం. మొదలు తుది లేనటువంటి ఒక చైతన్య స్థితి. అదే బ్రహ్మ నుంచి వ్యక్తమవుతూంటుంది. బ్రహ్మ దాన్ని వేరే సృష్టి ఏమీ చేయడు. నువ్వు అట్లా ఉండు, నీలోంచి నేను వస్తాను అంటాడు. మన ఇంటికి municipal water రావాలంటే pipe ఉండాలి కదా! Municipal tap తిప్పితే నీళ్ళు వస్తాయి వాడిచ్చినప్పుడు. వాడు ఇవ్వకపోతే? కాబట్టి నీళ్ళిచ్చేది పంపా? పంపు ఇవ్వదు నీళ్ళు. పంపు నీళ్ళు ఇవ్వటానికి ఉపకరణం. Tube light ఉంది. అది వెలుగు ఇవ్వదు. దాంట్లోంచి వెలగడానికి electricity కి ఒక అవకాశం ఏర్పరుస్తోంది. అట్లాగే fan. దానంతట అది తిరిగి గాలి ఈయలేదుగా! దాంట్లోకి విద్యుత్తు వెళితేనే అది తిరుగుతుంది. కాబట్టి బ్రహ్మ నుంచి అన్నీ కూడా వాహికలే! Channels! బ్రహ్మ కూడా అదే చెప్తాడు. ఈ సృష్టి అంతా ఎట్లా చేయను? అంటే, నువ్వు చేసేదేమిటి? నువ్వు అట్లా వుండు, నీలోంచి నేను వెళ్తాను అంటాడు. నేను వెళుతుంటాను, దాని ప్రకారం నువ్వు follow అవుతుండు, అంటాడు. తథాగతుడు అంటే వెళుతుంటే follow అవుతుండే వాడు. బుద్ధుడు అట్లా చేస్తాడు. మహాత్ములందరూ అట్లా చేస్తారు. జరుతున్నదాన్ని అనుసరిస్తారే తప్ప వీళ్ళు ప్రత్యేకంగా programme పెట్టుకుని ఏమీ చెయ్యరు. జరుతున్నదాన్ని తమ నుండి జరగనిస్తారు. వీళ్ళ ద్వారా జరక్కపోతే ఏమవుతుంది? ఇంకొకళ్ళ నుంచి జరుగుతుంది. Municipal water వచ్చే time లో, నా పంపు కట్టేసుకుంటే నా పంపు నుంచి నీరు రాదు తప్ప, పక్క వాడి పంపు తిప్పితే అక్కడి నుంచి వస్తుంది. మనం భీష్మించుకు కూర్చుంటే మనకుండదు అంతే! బ్రహ్మకి అదే చెబుతాడు విష్ణుమూర్తి భాగవతం ద్వితీయ స్కంధంలో. ఒక్కసారి కళ్ళు తెరుస్తాడు బ్రహ్మ. చూసుకుంటాడు. ఎక్కడ ఉన్నాం? ఎట్లా

ఉన్నాం? పద్మంలో ఉన్నాం. కిందికి చూస్తే కాడ ఉంటుంది. అందులోకి దిగుతాడు. బిలంలోకి దిగిపోతుంటే పోయి, పోయి అంతు ఉండదు. అమ్మో, అని భయమేసి పైకి వచ్చేస్తాడు. అసలు నేనెట్లా ఉన్నాను? నేనెక్కడ ఉన్నాను? అనుకుంటుంటే, 'అక్కడ' అని, వినిపిస్తుంది. ఇక్కడికి ఎక్కడి నుంచి వచ్చాను? అంటే, ' నాలోంచి,' అని వినిపిస్తుంది. నేనేం చెయ్యాలి? అంటే " నేను చెప్తాను ఏం చెయ్యాలో లోపలి నుంచి" అని వినిపిస్తుంది. అంతే కదా! మంచి అయినా చెడైనా లోపలి నుంచి చెప్తే గదా బయట మనం చేస్తుంటాం. మంచి అయితే కొంచెం ఆగుతాం కాని చెడు అయితే వెంటనే చేస్తాం గదా! ఆ లోపల నుంచి వచ్చింది ఆగదు. ఎందుకంటే వాడికి సంబంధించినది అది. నువ్వు కూర్చోరా! నీతో నేను పని చేసుకుందామని తయారు చేసుకున్నానని అయన లోపల నుంచి ప్రవాహమల్లె వ్యక్తమై, అన్ని అమరికలు చేసుకుంటూ వస్తాడు. బ్రహ్మ సరస్వతిని పుట్టించి, ఆవిడ వెంట పడ్డాడు అని ఉంటుంది పురాణాల్లో. కూతురు కదా వెంట పడటమేమిటి? లౌకికమైన సంబంధాలు చూసుకుంటే తండ్రి ఒక కూతురుని కని, కూతురుని ప్రేమించుకుంటూ, ఆ అమ్మాయి వెంట పడ్డాడట అని. అర్థమైన వాళ్ళకి అర్థమవుతుంది. లేనివాళ్ళకి అట్లా ఏడుస్తారు. సరస్వతి అన్న పదానికి అర్థం 'ప్రవాహము' అని. ప్రవాహము తన నుండి municipal water లాగ వెళుతుంటే, ఈయన పంపులు పెట్టుకుంటూ, వెళ్ళిపోయాడన్నమాట. మనకి reservoir నుండి ఎన్ని lines వేస్తే అందరి ఇళ్ళలోకి నీళ్ళు వస్తున్నాయి? అట్లా ఆమె ప్రవహిస్తూ ఉంటుంది. ఈయన గొట్టాలు పెట్టుకుంటూ పోతాడు. అట్లా ప్రవాహం లేకపోతే ఈ గొట్టాలకి అర్థం ఏమీ ఉండదు. ప్రవాహాన్ని ఆధారంగా చేసుకుంటూ రావటం. సరస్వతి వెంట వెళ్ళడం అన్న మాట. సరస్వతి ఏమి చేస్తుంది? వీణ పట్టుకొని వాయిస్తూ ఉంటుంది. అంటే నాదముగా వ్యక్తమవుతుంది. వ్యక్తమై అలా dance చేసుకుంటూ వెళుతుంది. ఇదే గంగావతరణంగా కూడా చెప్తారు. అనాది నిధనం అన్నిటికీ వెన్నుపూస లాంటిది. అందుకే మనకి కూడా నేను అనే చైతన్యం 'కమలం'. మన కమలం పుర్రెలో ఉంటే దానికి కాడగా సుషుమ్న నాడీ ఉంటుంది. జీవుడుగా ఏర్పడినప్పుడు కూడా అట్లాగే ఏర్పడుతుంది. ముందు తల ఏర్పడి, తరువాత కాడ ఏర్పడి తరువాత మిగతా అవయవాలన్నీ ఏర్పడుతాయి. ఎప్పుడన్నా ఏదన్నా మ్యూజియంకి వెళ్ళి చూడండి. గర్భం ధరించిన తరువాత 3వ నెల ఎట్లా ఉంటుంది? 5వ నెల ఎట్లా ఉంటుంది? ఏడవ నెల ఎట్లా ఉంటుంది? 9

వ నెల ఎట్లా ఉంటుంది? ఏఏ అవయవాలు ఏర్పడుతాయి? ఇవన్నీ కూడా భాగవతం తృతీయ స్కంధంలో ఇచ్చారు. ఏ నెలలో ఎట్లా ఉంటుంది అనేది అందరూ చెబుతారు. అవి అట్లా ఏర్పడానికి ఏ ప్రజ్ఞలు తోడ్పడుతాయో తృతీయ స్కంధంలో ఉంది. ద్వితీయ స్కంధంలో బ్రహ్మ పుడితే, తృతీయ స్కంధంలో సృష్టి ఎట్లా పుడుతుందో చెప్పుకుంటూ వస్తారు. ఆ విధంగా అనాది నిధనం నుంచి ధాత పుట్టుకువస్తాడు.

## 46, 47. ధాత, విధాత

ధాత అంటే బ్రహ్మ. ధాత ఎవరు? విధాత ఎవరు? విధాత అంటే మనం fate అంటుంటాం చూసారా ? విధి! విధాతకి అర్థం విధానం. ఇట్లా చేస్తే ఇట్లా ఇట్లా అవుతుంది అనే విధానం సృష్టి ఏర్పరచుకుంటూ వస్తుంది. దుర్యోధనుడి లాగా ఈర్ష్య పడితే ఇట్లా నడుస్తుంది కథ. ధర్మరాజు లాగా జూదం లాంటి వ్యసనానికి బానిస అవుతే ఏమి అవుతుంది? నలుడి కథలా రోషం కలిగితే ఏమవుతుంది? దానికి ఒక కథ ఉంటుంది. పరస్త్రీ వ్యామోహం కలిగితే ఏమవుతుంది? ఇలా శాశ్వతమైన కథలవి. అందుకని సృష్టిలో ఎన్నాళ్ళయినా, ఎప్పుడూ ఉండిపోతాయి. ఎందుకంటే అదొక విధానమన్న మాట. ప్రేమగా ఉంటే ఏమవుతుంది? దయగా ఉంటె ఏమవుతుంది? మిత్రత్వం కలిగి ఉంటే ఏమవుతుంది? మాట బావుంటే ఏమవుతుంది? మాట బావుండకపోతే ఏమవుతుంది? ఎక్కువ తింటే ఏమవుతుంది? తక్కువ తింటే ఏమవుతుంది? తినకపోతే ఏమవుతుంది? ఉంటాయికదా! మనం ఇవాళ నుంచి తినడం మానేసామనుకోండి ఏమవుతుంది అనేదానికి clear గా ఒక program ఉంది. ఇవాళ నుంచి సరిగ్గా తిందామనుకున్నాం అనుకోండి. దానికి ఒక program ఉంది. ఇవాళ నుంచి ఆ program ఉండగా ఇది వరకు చేసినవి ఉంటాయి కదా! నిన్న బాగానే తినేసాం, ఇవాళ నుంచి నేను బాగానే తింటాను. Correct గా ఉంటాను అనుకున్నాననుకోండి. ఈ అనుకున్నది ముందు కాలానికి పని చేస్తుంది కాని, నిన్న తిన్నది ఇవాళ effect చూపిస్తుంది 'విధి బలీయం' అంటారు. అంటే అంతా అదే చేస్తుంది. మనం ఎలా ఉన్నా అంతా విధి ప్రకారమే జరుగుతుంది. Fatalism లేదు. పెద్దలు ఏం చెప్పారంటే నిన్నటి వరకు ఊళ్ళో వాళ్ళు అట్లా వెడుతుంటే రాళ్ళతో కొట్టే స్వభావం ఉన్నవాడు కొడుతుంటే, ఇవాళ ప్రొద్దున ఒక గురువు గారి దగ్గరకు వెళ్ళి 'తప్పయిపోయింది sir' అని శరణు పొందితే, 'నీ కేమీ పరవాలేదు' అని అభయం ఇస్తాడు. అంటే ఆ అభయం ఎందుకు పని చేస్తుందంటే, రాళ్ళు వెయ్యనీయకుండా ఉండే స్వభావం నీకు కలగడానికి పని చేస్తుంది. ఇవాళ నుంచి course మార్చడానికి, కొత్త దారి వేసుకోవడానికి చేసిన ప్రయత్నమే తప్ప అంతకు ముందు వేసిన రాళ్ళకి ఫలితాలు ఒక పద్ధతి ప్రకారం

వస్తుంటాయి. అదే మన వాళ్ళు చెప్పిన కర్మ సిద్ధాంతం. అంతే కాని ముందంతా ఇట్లాగే ఉంటుందని కాదు చెప్పేది. నిన్న తిన్న దాన్ని బట్టి ఇవాళ ఉంటుంది. ఇవాళ తిన్న దాన్ని బట్టి రేపు ఉంటుంది. What we are today is on account of what we have been in the past. ఇది వరకు మనం చేసిన చేతలు, మాట్లాడిన మాటలు, మన యొక్క ప్రవర్తన బట్టి ఇవాళ ఇట్లా ఉన్నాం మనం. ఇట్లాగే ఉందాం అనుకుంటే ఇట్లాగే చేసుకోవచ్చు. ఇంతకన్నా బావుందాం అనకుంటే శాస్త్రప్రకారం, పెద్దలు చెప్పిన ప్రకారం ఇంకొన్ని కొత్తవి అనుకున్నవి, పెద్దలు నడచి అనుభూతి పొంది మనకిచ్చినవి, ఆచరించడం వలన course మారుతుంది. Course మారినంత మాత్రాన అంతకు ముందు చేసినవన్నీ neutralize అయిపోతాయని లేదు. అవట్లా వస్తాయి. కశ్యపుడంతటి వాడిని వాళ్ళావిడ దితి, సాయం సంధ్యలో పిలుస్తుంది. ఆయనేమో prayer లో ఉంటాడు. ఈవిడేమో రమ్మంటుంది. ఆయనేమంటాడు? విధి బలీయం అని, ఆవిడతో పాటు వెళ్ళిపోతాడు. విధాత అంటే ఇదే. విధి బలీయం! ఇద్దరు మంచి గట్టివాళ్ళు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు పుడతారు. ఇక్కడ విధి బలీయం అంటే ఏమిటి? ఆవిడ అంతకన్నా ఇంకో విధంగా ప్రవర్తించ లేదు. దానికి basis ఏమిటి? అంతకు ముందు పూర్వ కథ ఒకటి ఉన్నది. జయ విజయుల కథ. జయ విజయులు విష్ణుమూర్తికి అత్యంత ప్రియులు. వాళ్ళు విష్ణుమూర్తి ఏం చెబితే అదే చేస్తారు. ఇంకొకటి చెయ్యరు. సనక సనందనాదులు వచ్చినప్పుడు గేటు దగ్గర ఆపేస్తారు. ఎందుకాపారు? విష్ణుమూర్తి instructions. వాళ్ళ సొంతం కాదు. మనకిష్టం వచ్చిన వాళ్ళని లోపలికి పంపించి, ఇష్టం లేని వాళ్ళని ఆపే స్థితిలో ఉంటే విష్ణు ద్వారం దగ్గర ఉండరు. విష్ణువు సంకల్పంలో ఉన్న దాన్ని వాళ్ళు అక్కడ నిర్వర్తిస్తుంటారు. ఈ వెళ్ళిన సనకసనందనాదులు కూడా అంత వరకు విష్ణువుని చూసుకుంటూ వెళ్ళి, గేటు దగ్గర జయవిజయులను చూస్తారు. విష్ణువుని చూడరు. మొత్తం సృష్టి అంతా విష్ణువుగా చూసే సనకసనందనాదులు ఆ చివరి ద్వారం దగ్గర జయవిజయులని చూసారు, అని ఉంటుంది భాగవతంలో. విష్ణువుని చూడలేదని అర్థం. అక్కడ వాళ్ళు కూడా "వచ్చినవాళ్లు జయవిజయులని చూసారు. విష్ణువుని చూడలేదు" అని అడ్డు పెడతారు లేకపోతే అడ్డు పెట్టరు. వాళ్ళు చాలా మహాత్ములు. ద్వారం దగ్గర నిలబడి వచ్చిన వాడి దృష్టి భగవంతుడి మీద ఉందా, తదితరంగా ఉందా అని చూస్తారు, జయవిజయులు. తిరుమల గర్భాలయంలోకి వెళ్ళినప్పుడు

బంగారు వాకిలిలో వాళ్ళిద్దరూ రెండు ప్రక్కలా ఉంటారు. ఎంతసేపూ ఆ లోపలి విగ్రహమే తప్ప, వాళ్ళని ఎవ్వరూ చూడరు. లోపలి విగ్రహం దగ్గరికి వెళ్ళినా ఆ ముందు వాళ్ళని పలకరించినప్పుడే, విష్ణువు తన భక్తులయందు ఎక్కువ ప్రీతి పొంది ఉంటాడు. తన భక్తులని ఆదరిస్తే తను చాలా ఆనందం పొందుతూంటాడు. అందరినీ తొక్కేసుకొంటూ లోపలికి వెళ్లి కూర్చున్నా, మన satisfaction తప్ప ఏమీ ఉపయోగం ఉండదు. అటునుంచి ఏమిటో మనకి తెలియదు కదా! ఇటు ఎదురుగుండా గరుత్మంతుడు దణ్ణం పెడుతుంటాడు, ఆయన్ని చూడం. ఈ జయవిజయులు మనం చేసే నానా గందరగోళం చూస్తుంటారు. అక్కడ కూడా ఈ సనకసనందనాదులు జయవిజయుల్ని చూసేసరికి రెండు ఈటెలు అడ్డంగా పెట్టేస్తారు. ఎపుడూ లేనిది కోపం వస్తుంది వీళ్ళకి. కోపం వచ్చి, మీలాంటివాళ్ళు ఇక్కడ ఉండటానికి unfit. మా గురించి మీకేం idea లేదన్నట్లు మాట్లాడి, 'కిందకి వెళ్లి పుట్టండి,' అని శాపం ఇచ్చేస్తారు. అప్పుడు పెద్దాయన వస్తాడు ఏదో గొడవ అవుతోందని. ఏమిటంటే జయవిజయులిద్దరూ తల వంచుకుంటారు, ఏమీ మాట్లాడరు. విష్ణువు వచ్చి'వాళ్ళు చాలా V.I.P లు వాళ్ళని ఎందుకట్లా అడ్డు పెట్టారు?' అంటారు. ఎందుకడ్డు పెట్టారో తెలుసు ఆయనకి. ఊరికే వాళ్ళిద్దరినీ కోప్పడుతూంటారు ఆయన కూడా. ఆ కోపంలో fun ఉంటుంది అంటే రెండర్థాలు వస్తుంటాయి. నెమ్మదిగా విష్ణుమూర్తి మాట్లాడుతుంటే సనకసనందనాదులకి doubt వస్తుంది. తప్పు చేసింది మనం గదా, వీళ్ళని కోప్పడుతున్నాడేమిటి అని. వాళ్ళు ఏదో ఆయన చెప్పిన duty చేస్తున్నారు. మనమే ఎన్నడూ లేనిది కోపం వచ్చి వీళ్ళని అన్నాం; ఈయనేమో ఇంకా వాళ్ళని కోప్పడుతున్నాడేమిటి అనుకుంటారు. "వీళ్ళందరూ కిందకి వెళ్లి బాగా work చేస్తూ ఉండబట్టి గదా, నా ప్రతిభంతా ఇన్ని లోకాలకి వ్యాపించింది. వాళ్ళ పాదధూళి నా నెత్తి మీద వేసుకుంటూ ఉంటాను. అటువంటి వాళ్ళని మీరు అడ్డు పెడతారా తప్పు కదా !" అంటుంటే సనకసనందనాదులకి లోపలినుంచి అహంకారం తగ్గి పోయి పొరపాటు చేసాం అని తెలుస్తుంది.

( ఇంతవరకు మాత్రమే మనకు record దొరికింది. గమనించ గలరు.)

## 48. ధాతుః+ఉత్తమః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

# ౪౯. అప్రమేయః

'అప్రమేయుడు' అంటే కొలతలు వేయడానికి వీలు లేనివాడు, కొలతలు లేనివాడు. Immeasurable. ప్రమేయం అంటే సంస్కృతంలో కొలత లేదా measure అని అర్థం. ఈయనకి కొలతలు లేవు కాబట్టే బలి కొలవమని అడిగితే, రెండు అడుగులతో మొత్తం అంతా కొలిచేసి 'మూడవ అడుగు ఎక్కడ పెట్టమంటావు' అంటాడు. ఈ సమస్త సృష్టిగా వ్యాప్తిచెందిన భగవంతుడికి కొలతలు ఏమున్నాయి? ఎవరు కొలుస్తారు? కొలిచేవాడు పుట్టక మునుపు నుండి ఉన్న వాడిని ఎవరు కొలుస్తారు? ఈ ఇంటిని కొలవచ్చు. ఈ ఇల్లు పుట్టక ముందు ఉన్న చోటును ఎవరు కొలుస్తారు? ఇది ఇంత చోటు అని చెప్పడానికి లేదు కదా! మొత్తం ఎంత చోటు ఉంటుంది చెప్పండి. చోటు లో ఇవన్నీ ఉన్నాయి. చోటులో ఉన్న గ్రహ గోళాలన్నీ కొలవచ్చు. భూమి కైవారం ఇంత ఉంటుంది. భూమి బరువు ఇంత ఉంటుంది. బృహస్పతి గ్రహం దీని కన్నా పెద్దది. దాని చుట్టుకొలత ఇంత ఉంటుంది. ఇక్కడ నుండి  ఇంత దూరం ఉంటుంది. అక్కడ నుండి ఇంతదూరం ఉంటుంది. ఇలా మనం కొలవవచ్చు. ఇవన్నీ ఏర్పడని చోటును కొలవడానికి ఎలా సాధ్యమవుతుంది? కొలవలేం కదా! అందుకే 'ఆకాశంలో ఉన్న తారలైన లెక్కపెట్టవచ్చు, సముద్రం ఒడ్డున ఉన్న ఇసుక రేణువులనైనా లెక్కపెట్టవచ్చు కానీ నిన్ను మాత్రం కొలవలేము, లెక్క వేయలేము' అని చెప్పేసారు ఋషులు. ఎందుకంటే కొలిచే వాడితో సహా కలిపి మొత్తం సృష్టిగా కొలిచే వాడికన్నా ముందుగా ఉన్నాడు కాబట్టి, కొలవడానికి వీలుపడదు. కొలవడానికి ఒకరు ఉండాలి కదా! కొలవడం అనే పరిస్థితి ఎప్పుడు వస్తుంది? మనకు మనసు ఉండి, మన దగ్గర implements ఉండాలి.  ఈ నామాలన్నీ కూడా ఎంతో చక్కగా భగవంతుడే రచించాడు. భీష్ముడు, తాను భగవంతుని యందు నిలబడినప్పుడు తన నుండి వ్యక్తమైనవీ నామాలు. ఊరక కూర్చొని బుర్ర గోక్కుంటూ రాసిన నామాలు కావివి. కాబట్టి వీటికి ఒక పద్ధతి ఉన్నది. ఆ పద్ధతిలో అప్రమేయుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, అమర ప్రభువు నాలుగు నిచ్చెనల్లె ఉంటాయి. మనకు మన మనస్సు ఎటువంటిదో సృష్టికి అమర ప్రభువు ఇంద్రుడు  అటువంటివాడు. ఆయన తర్వాత విషయం కొలతలు. ఎందుకంటే మనసు ఏర్పడ్డ తర్వాత కదా కొలుస్తాం! మనసు

ఏర్పడక మునుపు కొలిచేది ఏం లేదు కదా! చైతన్య స్వరూపుడిగా మనం ఉన్నప్పుడు భగవత్ తత్వము నందు అనుభూతి చెందుతూ ఉండడం తప్ప, మిగిలిన విషయాలు ఏమీ ఉండవు. ఉండడం, చైతన్య స్వరూపుడిగా అవడం, బుద్ధి కలిగి ఉండడం, స్వభావం లోకి రావడం. చైతన్యం యొక్క వెలుగే బుద్ధి. చైతన్యమునకు ఉండటమే ఆధారము. ఉండటంగా ఉండే స్థితిలో కొలిచేవారు ఎవరు ఉంటారు? కొలిచే వాళ్ళు రావాలంటే అక్కడ నుండి చైతన్యంగా మేల్కొంచాలి. చైతన్యము నుండి బుద్ధి అనే వెలుగు ప్రసారం కావాలి. బుద్ధి అనే వెలుగు లో నుండి మనసు అనే తెర మీద పడాలి. మనసు అనే తెర మీద పడ్డాక, కొలుద్దాం అన్న ఆలోచన రావాలి. కొలుద్దాం అన్న ఆలోచన వచ్చినాక, కొలబద్ద ఉండాలి. వీళ్లంతా వస్తారు తర్వాత. విశ్వకర్మ, మనువు, త్వష్ట వీళ్ళంతా engineers, architects. 'అప్రమేయుడు' అనేవాణ్ణి గురించి చెప్పినప్పుడు కొలతలు లేనివాడు అని చెప్తాము. 'నిలిచిన నిలువున నిఖిల దేవతల' అన్న అన్నమాచార్యుల కీర్తన అదే! అందరి దేవతలూ వరుసగా నిలబడితే అందరికన్నా పొడుగ్గా ఉంటాడట ఈయన. ఎందుకు? ఆయన లోంచి వచ్చిన వాళ్ళు కాబట్టి. ఆయన లోంచి వచ్చిన వాళ్ళు ఆయనను comprehend చేసుకోలేరు, కాబట్టి ఆయన్ని కొలవడం వీలుపడదు. కొలతలకు అందనివాడు. అదే బ్రహ్మ ప్రయత్నం చేస్తాడు. కొలుద్దాం అనుకున్నాడు. శివ పురాణంలో కథ ఉంది. శివలింగం మొదలు, చివర చూద్దామని ఒక పక్క బ్రహ్మ, ఒకపక్క విష్ణువు భయంకరమైన ఎత్తుల్లోకి ఒక ఆయన, భయంకరమైన లోతుల్లోకి ఒక ఆయన వెళ్లి భయమేసి తిరిగి వస్తారు. ఏమయిందయ్యా అంటే పైన ఎంతుందో నాకు అందలేదని బ్రహ్మ చెప్తే, కింద ఎంత ఉందో నాకు అందలేదు అని, విష్ణువు చెప్తాడు. ఇవన్నీ మనకెందుకు చెబుతారు? కొలతలు లేని చోటులో, కొలతలతో కూడినట్టి రూపాలు పుడతాయి. మనందరికీ కొలతలు ఉన్నాయి. పుట్టిన దానికి కొలత ఉంటుంది, పుట్టిన తర్వాత కొలత ఉంటుంది. పుట్టుక ముందు కొలతేదీ? ఓ జంట ఒక పిల్లవాడ్ని కందామనుకున్నప్పుడు వాడికి కొలత ఏమిటి? కొలత లేదు. ఒక కాలంలో, ఒక దేశంలో దిగివచ్చినప్పటినుండి కొలవవచ్చు. కాలం అంటే ఒక particular సమయం లో దిగి వస్తాడు కదా! ఆ దిగి వచ్చే సమయాన్ని బట్టి, ప్రదేశాన్ని బట్టి అంటే అక్కడ తండ్రి అనే వాహిక, తల్లి అనే వాహిక ఈ రెంటి ఆధారంగా, సమయము అనే factor కలిసి, ఈ మూడు factors తో వాడి కొలతలు వచ్చేస్తాయి. ఈ time లో జరిగింది ఈ యొక్క ప్రవేశం అనేది correct

గా తెలిస్తే, కొలత చెప్పేయచ్చు. అట్లా కొలిచే వాళ్ళు ఉన్నారు సృష్టిలో. Blueprint ఏర్పడగానే ఈ భూమి మీద రాకముందే కొలతలు తెలుస్తాయి. అసలు time అంటే? 'Time is an interval between two events'. Time అనేది in between. కాబట్టి ఆ time లో పరిమితత్వము వచ్చిందన్నమాట. రాకముందు, సంతానం పొందుదాం అనే భావం రాక ముందు అపరిమితంగా ఉంటుంది. దానికి కొలతలు ఏమీ ఉండవు. అలాగే సృష్టి చేయకముందు ఉన్న భగవంతుడు సృష్టి లో తాను దిగి వచ్చినా కూడా ఆయన్ని కొలవలేరు సృష్టి లో ఉన్నవారు. సృష్టి అంతా చేసి, దాన్ని అతిక్రమించి ఉంటాడు. అదే

'సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష స్సహస్రపాత్
స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠ ద్దశాంగులమ్'

ఈ భూమి, ఈ విశ్వం అంతా ఆవరించిన వాడు, పది అంకెలుగా దిగి వచ్చిన వాడు, పది అంకెల పైన కూడా అతిక్రమించి ఉంటాడు. దానిపైన కూర్చుంటాడు. అట్లా భగవంతుడు కొలవబడడానికి వీలైన స్థితిలో ఉండడు. మనం కూడా అంతే. భగవంతుడికి ఏ కళ్యాణ గుణాలు ఉన్నాయో మనకీ ఉన్నాయి. కాకపోతే మనలో నిద్రాణమై ఉన్నాయి. మనకు కొలత లేదు. మన శరీరానికి కొలత ఉంది. నువ్వు ఎంత బరువు అంటే ఇంత బరువు అని చెప్పాడు అంటే, ఏం తెలిసినవాడు కాదన్నమాట. వాడికి బరువు ఏంటి? ఆకాశమంత తేలిక, భూమి అంత బరువు. ఎందుకంటే కొలత నీ శరీరానికి తప్ప నీది కాదు. మనం బ్రహ్మాండం గురించి చెప్పుకుంటున్నాం. మానవుడికి సంబంధించి చెప్పుకుంటున్నాం. ఎందుకు? మానవుడు పరిపూర్ణ సృష్టి. God made man in his own image and likeness. అందుకని మనం ఆయనకి మేకై కూర్చున్నామన్నమాట. అయినా చిత్రమేమంటే మనల్ని కూడా కొలవడానికి లేదు. మనం అనుకున్నట్లుగా నీ పేరేంటి అంటే, నన్ను ఫలానా అంటారండి, అనాలే తప్ప నేను ఫలానా అనకూడదు అంటే మన identity పోయినట్లే! పప్పులో కాలేసినట్లే! నన్ను ఇట్లా పిలుస్తారని అనాలి. తెలిసిన వాళ్ళు అట్లా అంటారు. C.P. Rao గారు వద్ద నేను C.A. చదువుకున్నాను. ఆయన అట్లానే అనేవారు. ఎవరైనా 'మీ పేరు ఏంటి సార్' అంటే 'నన్ను C.P. Rao' అంటారు, అనేవారు. మా నాన్నగారు అడిగారు, 'సిపి రావు అంటారు అంటే మీరు సి.పి.రావు కాదా,' అని. 'సి పి రావు అంటారు గానీ నేను సి పి రావు ని ఎలా అవుతాను?' అనేవారు ఆయన. తెలిసినవారు అట్లా అంటారు. ఆయన చాలా

మేధావి, of a very higher order. నేను నేనైన నేను అయినప్పుడు ఇవన్నీ పెట్టుడు పేర్లే అని మనకు గుర్తు ఉన్నప్పుడు, వృత్రాసురుడుకున్న జ్ఞానం ఉంటుంది. ఇంద్రుడు కూడా మనల్ని ఏమీ చేయలేడు. అంటే మన మనస్సు మనల్ని ఏం చేయలేదు. నేను ఇంత బరువు ఉన్నాను అనుకున్న వాడు దేహంతో ఏకీభావం చెందాడు అన్న మాట. తాను దేహంలో జీవుడిగా ఉన్నాడనేది మర్చిపోయి, దేహం బరువు తన బరువు అనుకుంటాడు. తన బరువు దేహం బరువు కాదు. అందుకని కొంతమంది మహాత్ములు బరువు గురించి ఏమి worry అవ్వరు. వాళ్లని ఏం చేయదు ఆ బరువు. ఎంత worry అయితే అంత లావు అవుతుంటారు. అందుకనే మాస్టారు దగ్గరకి ఎవరైనా 'లావై పోతున్నాను మాస్టారు మందు ఇవ్వండి' అంటే, 'దాని గురించి మర్చిపో. శుభ్రంగా భోంచెయ్యి. నేను చూసుకుంటాను నీ లావు గురించి,' అనేవారు. ఎందుకని అంటే లావుతో identity తగ్గించడానికి ప్రయత్నం చేసేవారాయన. మన identity దేహంతో కాదు చేసుకోవలసింది. నేను ఈ దేహం లోకి దిగి వచ్చిన వాడిని తప్ప, దేహం నేను కాదు అనేది మాటిమాటికీ గుర్తు చేసుకోవాలి. కంద పద్యం ఉంది:-

'పురుషునికిని దేహపుంజమునకు వేరు కాని ఏకత్వంబు కానరాదు,
చెడిన దేహంబు చెడు గాని పురుషుండు చెడడు వానికి అంత చేటు లేదు.'

అంటే దేహానికి ఉన్నంత చేటు పురుషుడికి లేదు. దేహం మార్పు చెందుతూ ఉంటుంది. మనకు మార్పులు లేవు. మనం Identity ఎక్కడ పెట్టాం అనేది point. చాలా మారిపోతున్నాను నేను అని దేహం చూసుకుంటూ అనుకుంటే అది దేహంతో identity అన్నమాట. చాలా మారిపోయారండి మీరూ, అంటారనుకోండి మన దేహం ఎక్కువ మారకుండా, అంటే identity స్వభావంతో అన్నమాట. అసలు చుట్టూ మార్పులుండవచ్చు కాని మనం మారేదేం లేదు. మనం మొదటి నుండి ఒక పద్ధతి లోనే ఉంటాము. మనకు కూడా బరువు, కొలతలు లేవు సుమా! గదిలో ఉండే చోటుని కొలవవచ్చు. ఇటు 16, అటు 14, అటు 14 ఉందని చెప్పవచ్చు. దానిని బట్టి లెక్కలు వేస్తే ఎంత ఉన్నది తెలుస్తుంది. కానీ చోటుకు కొలత ఏమున్నది? ఈ గది తీసేస్తే? గోడలు దానిచుట్టూ చేర్చడం వల్ల అలా కొలతలు వచ్చినాయి తప్ప లేకపోతే కొలతలు ఏవి? దేహంలో ఉన్న వాళ్ళం కూడా గదిలో ఉండే చోటులాంటి వాళ్ళం. గదికి కిటికీలు, తలుపులు ఉన్నాయి కదా! అలాగే మనకీ కిటికీలు, తలుపులు ఉన్నాయి. గదిలో ఉండే చోటుకి, బయట ఉండే

చోటుతో connection ఉంది. మనకు కూడా అలాగే connection ఉంది. లేదనుకోవడం వల్ల లేదు తప్ప, ఉంది. తొమ్మిది రంధ్రాలు లో నుండి బయటకి connection ఉన్నది. భగవంతుడు మన చుట్టూ ఉన్నాడు. మన లోపలా ఉన్నాడు. ఎట్లా? చోటు ఇంట్లో ఉన్నట్లు, బయట ఉన్నట్లు. ఎప్పుడైతే నేను అప్రమేయుడననే భావన చేసుకుంటావో, నువ్వూ అట్లా అప్రమేయుడవు అవుతావు. అలా ఉంటారు మన పరమ గురువులు. మన మెరిగిన పరమ గురువులు ఈ దేహంలోనే ఉన్నాం కదా అనుకోరు. వ్యాపనం చెందుతారు. వ్యాపనం చెందితే కాస్త వాళ్లని వీళ్ళని పలకరించి రావచ్చు. అట్లా వ్యాపనం చెందగలిగిన వాళ్లంతా భగవత్ తత్వము ను తమ యందు పరిపూర్ణముగా అనుభూతి చెందిన వారు. వాళ్లకి వ్యాపనం ఉంటుంది. మనకు వ్యాపనం ఉండదు. మనల్ని కట్టేశారు అనుకుంటాం. లోపల ఎక్కడో జీవుడు ఉన్నాడు అని వెతుక్కుంటూ ఉంటాం. లోపల ఇంతే ఉన్నాడు అనుకుంటే అంతే ఉంటాడు. సత్యము ఏమంటే మన యందు దేహం ఉన్నది తప్ప దేహములో మనము లేము. మనం చొక్కాలాగు లో ఉన్నామా, చొక్కా లాగు వేసుకున్నామా? చొక్కా లాగు వేసుకున్నామన్న భావన తప్ప చొక్కాలాగు లో ఇరుక్కుపోయాము అన్న భావన ఉండదు కదా! ధారణ చేసినట్లుగా ఉంటుంది. అంటే చొక్కాలాగూ ధరించి ఉన్నాము తప్పా, చొక్కాలాగూలో మనం లేము కదా! అలాగే శరీరం మనం ధరించి ఉన్నాం తప్ప శరీరంలో మనం లేము. చాలా important. మనం ఉన్నాం అనుకోవడం వలన ఉండిపోతుంటాం, అదీ తమాషా! చాకలి, గాడిద కథ ఉన్నది కదా! ఓ చాకలి ప్రతి ఇంట్లో మాసిన బట్టలు తీసుకుని, ఓ గాడిద మీద మూటలు పెట్టుకుని ఊరవతలకి తీసుకు పోయి, అక్కడ సెలయేటిలో బట్టలన్నీ శుభ్రంగా ఉతికేసి సాయంత్రం ఎవరి మూటలు వాళ్ళకి కట్టేసి, గాడిద మీద పెట్టుకుని ఇంటికి వచ్చేస్తూ ఉండేవాడు. తను గాడిద మీద నుంచి బట్టలు ఉతకటానికి తీసాక, ఆ సెలయేటి ఒడ్డున సాయంత్రం వరకు గాడిద ఉండాలి కదా! అది అక్కడికి ఇక్కడికి తిరుగుతుందేమోనని దాని ముందు రెండు కాళ్ళకు ఒక బంధం వేసి, దానికి ఇంత తిండి పడేసి తను బట్టలు ఉతుక్కొనేవాడు. సాయంత్రం వచ్చిన తరువాత ఆ గాడిద మీద బట్టలన్నీ పెట్టి, ఆ బంధం తీసేసి, గాడిదను తీసుకుని ఇంటికి పోయేవాడు. ఒకరోజు సెలయేటికి వెళ్లినప్పుడు కాలికి ముడి వేయడానికి పలుపుతాడు మర్చిపోతాడు. అప్పుడు మళ్లీ వెనక్కు వెళ్లి పలుపుతాడు తీసుకోవడానికి time లేదు. వేయకపోతే గాడిద వెళ్ళిపోతే వీడు

మోయాలి. ఏం చెయ్యాలో తికమక పడుతూ ఉంటాడు. ఆ సమయంలో ఒక మహాత్ముడు అలా నడిచి వెళుతూ ఈ చాకలి వాడ్ని, గాడిదను చూస్తాడు. చూసి ఏంట్రా బాధ పడుతున్నావు అంటే, 'ఇలా తాడు మరిచిపోయాను, ఇదేమో వెళ్ళిపోతే నా పని కాదు ఇవాల్టికి. దీని దగ్గర కూర్చుంటే బట్టలుతకటం అవ్వదు. ఏం చేయాలని ఆలోచిస్తున్నాను' అంటే 'గాడిద ఎక్కడికి వెళ్ళి పోదు, నీవు వెళ్లి బట్టలు ఉతుక్కో' అంటాడు. 'లేదండి ఇది చాలా fickle minded. ఒక చోట నిలబడదు. అందుకని దానిని కట్టకపోతే కష్టం' అంటాడు. కట్టక్కర్లేదు. అది నిలబడుతుంది, నేను నిలబడేటట్లు చేస్తాను కదా నువ్వు వెళ్ళు, అని చెప్పి ఆ గాడిద కాళ్ళముందు ఊరికే అట్లా కట్టినట్లు నటిస్తాడు ఆయన. అది అక్కడే నిలబడుతుంది. వీడు వెనక్కి అట్లా చూసుకుంటూ ఉంటాడు. అది అట్లాగే నిలబడి ఉంటుంది. బాగానే ఉందని అతను బట్టలు ఉతుక్కుంటాడు. మధ్యమధ్యలో చూసుకుంటూ ఉంటాడు. అది అట్లాగే ఉంటుంది. అన్ని బట్టలు ఉతికేసిన తరువాత, మళ్లీ వచ్చిబట్టలు దానిమీద పెట్టుకునే వరకు కూడా అది అలాగే ఉంటుంది. ఇక పద అంటే, పోదు అది. చచ్చినా కదలదు. అట్లాగే ఉంటుంది. కదలకపోతే మళ్లీ ఆ మహాత్ముడు ఇటుగా వస్తాడు. 'ఇది కదలట్లేదు. మీరు ఏదో మంత్రం వేసినట్లు ఉన్నారు. పని అంతా అయిపోయింది, కదలమంటే కదలట్లేదు'అని చెప్తాడు ఆ మహాత్మునికి, చాకలివాడు. అంటే నవ్వి, మళ్లీ ఆ కాళ్ల దగ్గర ఆ ముడి విడదీసినట్టుగా కొంచెం act చేస్తాడు. చేస్తే ఆ గాడిద కదులుతుంది. అంటే తాడు అక్కర్లేకుండా భావన చేత గాడిద ఎట్లా కట్ట వేయబడ్డదో, అట్లాగే ఈ దేహం లో ఉన్నాం, అనే భావన మనకు చాలా ఎక్కువ. మనకు చెప్పే వాళ్ళు కూడా అదే చెప్తూ ఉంటారు, లోపల ఉన్నాడు దేవుడు. లోపల ఉన్నాడు దేవుడు, వాణ్ణి వెతుక్కో అని. వీడు చొక్కా చింపి చూసినా కనబడడు. లోపల ఎక్కడో ఇంత చిన్నగా ఉన్నాడనుకుంటారు. కానీ నిజానికి మనం మన దేహాన్ని మించి ఉంటాము. Aura అంటారు దానినే. ఈ మధ్య auraని photo తీయగలిగిన instruments కూడా వచ్చాయి. ఒక్కొక్కళ్ళ aura ఒక్కొక్కలా ఉంటుంది. ఒక మహర్షి యొక్క aura ఆయన ఆశ్రమ వాటిక చుట్టూ ఉండే సమస్త ప్రాణికోటియందు కూడా నిండి ఉంటుంది. మనము ఒక మహర్షి ఆశ్రమమునకు వెళ్ళినప్పుడు అక్కడ చెట్లు చేమలు, జంతువులు మొత్తము వాతావరణము అంతా చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది. అంటే ఆయన ఇన్ని రూపాలలోనూ పాకేసాడన్నమాట. ఎట్లా

పాకేసాడూ? చోటు ఇలా కిటికీలోంచి బయటకి వెళ్ళినట్లు, తలుపులోంచి బయటకి వెళ్ళిపోయినట్లూ. ఒకే చోటు. మనము కూడా ఒకళ్ళమే! ఇది prayer hall అని, kitchen అని, bedroom అని మనము అనుకోవడము తప్పా హద్దులు లేవు. హద్దులు పెట్టడము సృష్టిలో ఒక ఆట. హద్దులు పెట్టుకున్నా ఇవి మనము పెట్టుకున్నవి, దీన్ని మించి మనము ఉన్నామని గుర్తుపెట్టుకోవాలి. అదీ 'అతిక్రామత్'. అంటే మనము అతిక్రమించి ఉన్నామని గుర్తుపెట్టుకోవాలి. అంతేకానీ అతిక్రమించరాదు. అప్పుడు self imposed limitation ఉండదు. భగవంతుడికి అది ఎప్పుడూ లేదు. మనకు ఉంది. అందుకే పాపం బలిచక్రవర్తి 'ఇస్తాను తీసుకో మూడు అడుగులు' అంటే నవ్వుతాడు. నువ్వేం ఇస్తావు నాకు, అని. ఆయన లోంచి వచ్చిన సృష్టిలో ఏమాత్రం ఇవ్వగలడు ఆయనకి. Gold spot factory ఉన్నాయనకు మనం ఒక gold spot కొనిచ్చినట్లుగా ఉంటుంది. ఇస్తాను అంటే నవ్వుతాడు. పోనీలే అని తీసుకుంటాడు. అట్లా మనం కూడా అప్రమేయులమే సుమా! We must know that we are also immeasurable if we recognize ourselves as the sons of God. భగవంతుని యొక్క అంశలము. కిరణములము. జీవుడు అంటే ఎవరు? దిగి వచ్చిన వాడు జీవుడు. రూపములలో ఇమిడినవాడు. అంతమాత్రం చేత ఇరుక్కోలేదు. ఇమడటం వేరు, ఇరుక్కోవటం వేరు. ఇంట్లో ఇమిడి ఉన్నామా, ఇరుక్కు పోయామా? బయటకు వెళ్లి వస్తూ ఉంటాము కదా. అప్రమేయము అనే స్థితి. అప్పుడు ఇంత మందిలో ఉన్న ప్రజ్ఞ ఒకటే అని తెలుస్తుంది. మాస్టరు గారు ఎప్పుడూ 'గోదావరి లో పెట్టిన చెంబులాంటి వాళ్ళం' అంటుండేవారు. చాలా మంచి example అది. అందరూ గోదావరిలో చెంబులే కదా! ఎన్ని చెంబులు పెట్టండి, అన్ని చెంబుల్లోనూ గోదావరి ఉంటుంది. మన చెంబులను మించి కూడా గోదావరి ఉంటుంది కదా. ఈ చెంబు ల్లోని గోదావరి ఎవరి గోదావరి వాళ్లది అనుకోవచ్చు. అది వేరే సంగతి. అనుకున్నా గోదావరి అలా అనుకోదు. అంతా తనదే అనుకుంటుంది. అట్లా మనం కూడా ఆ స్థితిలోకి ఎగబాకడానికి ఈ నామాన్ని గుర్తు చేసుకోవాలి. ఆయన చాలా కొలతలు లేని వాడండీ, అమ్మో అని చెప్పి మనం దండం పెట్టుకుని, నేల మీద పడి సాష్టాంగ పడి పోయి ... ఇవన్నీ అక్కరలేదు. మనకు కావలసింది ఏంటంటే మనం కూడా అదే! భగవంతుడి నామం ప్రతిదీ మానవుడికి apply అవుతుంది. మనం కూడా అదే అని గుర్తు ఉండాలి. వాడే వీడు అని అంటాం కదా. అది చెప్పింది 'అసావాదిత్య

బ్రహ్మ'. అతడు అనబడే సూర్యుడు నేను. బ్రహ్మని. అది గుర్తు తెచ్చుకున్నప్పుడు అందరిలోనూ ఉన్నాడు, మనలోనూ ఉన్నాడు అనేదొకటి, అందరూ ఆయనలో ఉన్నారు మనం కూడా ఆయన లో ఉన్నాం అనేదొకటి. లోపల ఉన్నాడు అనేసరికి మనకు కొంచెం wrong ideas వచ్చేస్తుంటాయి. జిల్లెళ్ళమూడి అమ్మ దగ్గరకు ఒక ఆయన వెళ్లి, భగవంతుడు  చీమలో దోమలో ఉన్నాడని అంటాము కదమ్మా! ఎట్లా ఉన్నాడు చీమలో దోమలో? అని అడిగాడు. 'ఇప్పుడు చీమనీ దోమనీ చంపకు నువ్వు, (లోపలకు చూడటానికి చంపాలి కదా!) ముందు చీమ గానూ దోమగాను భగవంతుని చూడు నాన్న, చీమలు దోమలు తర్వాత చూద్దువు గాని' అని చెబుతుంది. అదే లోకాన్ని భగవంతుని గా చూడటం. అదే అప్రమేయం అనే స్థితి. కొలతలు లేనివాడు కొలతలు ఉన్నట్లుగా కొలతల్లోకి దిగి వచ్చాడు. అయినా తనను తాను కొలిపించుకుంటూ ఉంటాడు. చిన్నవాడవుతుంటాడు, పెద్దవాడవుతుంటాడు. పెరుగుతున్నట్లు ఉంటుంది తగ్గి పోతున్నట్లు ఉంటుంది. ఇదంతా చుట్టూ ఉన్న ప్రకృతికి గానీ ఆయనకు కాదు. మనం కూడా అంతే అని కూడా గుర్తు పెట్టుకోవాలి. మీరు లావయ్యారండీ, అంటే అమ్మో లావయ్యామా, అనుకుంటాం. మనం లావు అయ్యామని మనం ఎందుకు అనుకోము? నిజంగా 'నేను' కు లావు లేదు. ఓ కుర్రాడు పెరుగుతున్నాడు అనుకోండి,  రోజూ పెరుగుతున్నా 'పెరుగుతున్నా' అని వాడు ఏమీ అనుకోడు. మనమంతా పెరిగినప్పుడు అలా అనుకోలేదు. ఎవరైనా చెప్తే ఇందాక గాడిద కథ లాగా... పెరిగాం. ఏమిటి పెరిగింది? శరీరం పెరిగింది. కానీ మనం పెరిగామా? జుట్టు తెల్లబడిపోయిందండీ, పెద్దవారై పోతున్నారు, అంటాడు ఎవడో వచ్చి. నమ్మేస్తాం కదా. ఇంక అంతే కదా అట్లా చూస్తుంటే పెద్దవారైపోయారు అంటాడు. ముసలివాడై పోయాడు చూస్తూ ఉంటే, అంటే మనం నమ్మేస్తాం, ముసలోళ్ళయిపోయాం అని చెప్పి. శ్రీకృష్ణుడు చెప్పే మొత్తం మొదటి పాఠం అదే మనకు. వాళ్ళు చెప్పడం బట్టి మనం నమ్ముతూ ఉంటే ఇంకేంటండి... గొర్రె బ్రాహ్మణుడు కథైపోలే! చిన్నప్పుడే పాఠంలో చెప్పేశారు. వాడు మేకపిల్లను తీసుకెళ్తూ ఉంటే వచ్చే వారందరూ 'బాగుంది కుక్క' అంటే తీసి అవతల పారేశాడు. ప్రతివాడు అది కుక్క అనడం వల్ల అది కుక్క అనుకున్నాడు.

'పదుగురాడుమాట పాడియై ధరజెల్లు, ఒక్కడాడు మాట చెల్ల బోదు'. అందరూ ముసలాడు ముసలాడు ముసలాడు అనంగానే ముసలి వాడి కింద వాడు

నమ్మేస్తాడు. ఇంకెన్నాళ్లు ఉంటాడులే, అంటుంది ఇంట్లో కోడలు. ఏమో పోతాను కామోసు, అనుకుంటాడు అప్పుడు. చస్తున్నాను చెయ్యలేక వీడెప్పుడు పోతాడా అన్నట్లుగా ఇట్ట అట్ట వినబడేటట్లుగా కొంచెం వింటే, 'పోవాలి' అని ఒక భావన వస్తుంది. అట్లా మనల్ని మనం అనవసరంగా మోసం చేసుకుంటూ ఉంటాం. పోయేది దేహం. నేను ఎక్కడికి పోతాను? నేను ఎక్కడికీ పోను. ఇక్కడే ఉంటాను. ఈ ముసలివాడై పోతున్నావు అని అవతల వాళ్ళు చెప్తే నమ్మేస్తాం. ఇట్లా మన చుట్టూ ఉండే దేహం గురించి చెప్తూ ఉంటారు మిగతా వాళ్ళు. మనం దాన్ని నమ్ముతూ ఉంటాం. మీకు చాలా జబ్బు కదండి అంటాడు ఎవడో వచ్చి. వెంటనే అమ్మో అని వచ్చేస్తుంది, వాడు అన్నాడు కాబట్టి. అంతవరకు ఉండదు. జబ్బు నాకు కాదు నా శరీరానికి, అని గుర్తు ఉండాలి. శరీర ధర్మం జబ్బు. ఎందుకంటే ఈ సృష్టిలో ఆరోగ్యం అనేది ఇప్పుడున్న పరిస్థితులలో ఎవరికీ లేదు. ఏదో ఒక రకమైన బాధ ప్రతి వాడికి ఉంది. అది శరీరానికి, మనకు కాదు అనుకున్న నాడు చాలా హాయి. ఒక ఆయన ఎవరో మాస్టరు గారి దగ్గరికి వచ్చి ఇట్లా నాకు sugar సార్, అని చెప్తే మాస్టర్ గారు ఉండనీ, అన్నారు. 'ఉండనీవోయి దాన్నోపక్క. నిన్ను ఏం చేసింది? వాడెవడో చెప్పేంతవరకు నీకు తెలియలేదు. నిన్ను ఏమీ చేయలేదు. దాన్ని మర్చిపోయి వాళ్ళు చెప్పిన నియమాలు పాటించడం మాత్రము మర్చిపోకు', అన్నారు. మనము దాని ధర్మం తెలుసుకుని ప్రవర్తించాలి. శరీరానికి ఈ బాధ వచ్చింది కాబట్టి దానికి ఇట్లా ఉంటే అది మనల్ని ఇబ్బంది పెట్టకుండా ఉండనిస్తుంది. దానికి ఇంత వరకే. అంతకుమించి అది మనకు వచ్చింది అనుకోవడం వలన problem. అట్లా కదా క్రీస్తు తనకు శిలువ వేస్తే, శరీరానికి వేశారు అనుకున్నాడు. అది ఎంత పరాకాష్ట! నేను చెప్పిన దానికి పరాకాష్ట. తాను దైవకుమారుడు, అని కదా! మన భాషలో చెప్పుకోవాలంటే నేను భగవంతుని బిడ్డను గానీ, శరీరాన్ని కాను. దానికో శరీరం ఉంటుంది. వెలుగు శరీరం. అది పట్టుకుని తిరుగుతూ ఉంటాడు. మహాత్ములు కూడా అటువంటి వెలుగు శరీరాన్ని నిర్మాణం చేసుకుంటారు. దాని నుంచి వచ్చే స్థూలం అయిన పదార్థం, (వెలుగు కూడా పదార్థమే) శరీరము పడిపోయినా వాడు పెద్దగా బాధపడడు. మీచొక్కా బాగా పాత అయిపోయిందండి అంటే, ఏడిస్తే కష్టం కదా! ఇంకొక చొక్కా కొనుక్కుంటాం అన్నట్టుగా ఉంటుందట. ఎప్పుడు? Identity లో. We have given a wrong identity to us. We have to get a right identity. అందుకు ప్రతి నామం

అట్లా గుర్తు చేసుకోవటం. ఆ విధంగా మనం ఉన్నప్పుడు We become immeasurable. అప్రమేయము అనే స్థితిలోనికి పెరగడానికి వీలుంటుంది. అప్రమేయుడు హృషీకేశుడు అవుతాడు.

# 50, 51. హృషీకేశః, పద్మనాభః

భగవంతుని విషయంలో 'హృషీకేశం' అన్నది మొత్తం సృష్టికి కేంద్రం. అక్కడి నుంచి తన యొక్క ప్రజ్ఞని అందరికీ ప్రసారం చేస్తూ ఉంటాడు. తనే దిగువకు రావటానికి పద్మనాభుడుగా తయారవుతాడు. తను పద్మనాభుడుగా తయారైనప్పుడు కదా అందులో నుంచి ఒక పద్మం విచ్చుకుని ఆయనలోంచి బ్రహ్మ వచ్చింది. తను పద్మనాభుడు కాకపోతే బ్రహ్మ రావడానికి scope లేదు. బ్రహ్మ బొడ్డు లోంచి ఎందుకు రావాలి? కంఠం నుంచి రావచ్చు కదా. హృదయంలో నుంచి రావచ్చు కదా? బొడ్డు లో నుంచి బ్రహ్మ పుట్టడం అంటే నారాయణుడు బహిర్గతం అవ్వడం. అందుకనే బ్రహ్మ పుట్టిన కమలం నారాయణుడి బొడ్డు అన్నారు. మనం కూడా బహిర్గతం అవటం మణిపూరక చక్రం ద్వారానే. Mind has two faces. One is subjective, the other is objective. Our objective mind functions through the solar system. Our subjective mind can ascend into higher centers. అంతర్ముఖము, బహిర్ముఖము. అందుకనే భగవత్ సాధన చేసుకుంటున్నాం అనుకోండి, అది ఎక్కువ అంతర్ముఖమే! బహిర్ముఖం కాదు. భగవంతుడు అనే సూక్ష్మాతి సూక్ష్మము, సూక్ష్మ తరము అయిన స్థితిని చేరుకోవాలంటే బహిర్ముఖంగా చేరుకోవడానికి అవకాశం లేదు. అంతర్ముఖంగా మాత్రమే చేరుకోవడానికి అవకాశం ఉన్నది. అందుకనే భగవంతుని దర్శనం చేసుకుందాం అనుకునే వాళ్ళకి 'నిన్ను నువ్వు అవగాహన చేసుకో', అని చెబుతారు. 'Man! Know thyself' అని చెబుతారు. సృష్టిని అర్థం చేసుకోవాలి అనుకోండి బహిర్గతంగా చేయవచ్చు. మన science అంతా కూడా అట్లా చేస్తుంది. ప్రకృతి యొక్క ధర్మాలు తెలుసుకోవడానికి బహిర్గతంగా ప్రయోగాలు చేయవచ్చు. పురుషుని యొక్క అవగాహన చేసుకోవాలంటే అంతర్గతంగా ప్రయోగాలు చేసుకోవాలి. మనకి లలితా సహస్రనామం లో కూడా "అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా" అని అన్నారు. 'బయట దొరకవు తల్లి, చాలా కష్టము, లోపల చాలా సమంగా ఆరాధింపబడతావు' అని. మామూలుగా సగటు మానవుడు ఏం చేస్తాడు అంటే భగవత్ సాధన అంతా బజారులో చేసి, బహిర్గతంగా చేయవలసిన వాటి గురించి ఆలోచిస్తూ ఉంటాడు. అందుకనే రెండూ

దొరకవు. తల్లకిందులుగా చేసుకుంటూ ఉంటాడు. తలకిందులు కాకుండా ఉండాలంటే సాధన అంతర్ముఖము కావాలి. భగవత్ అన్వేషణ అంతర్ముఖము కావాలి. హృదయమునందు చూసుకోమని చెబుతుంటారు. హృదయం అంటే గుండె కాయ కాదు. హృదయం వేరు, గుండెకాయ వేరు. గుండెకాయ హృదయం యొక్క పరిధిలో పని చేస్తున్న ఒక అంగము. హృదయ కేంద్రము ఎడమ పక్క ఉండదు. గుండెకాయ ఎడమ పక్క ఉంటుంది. కానీ దానికి సంబంధించిన కేంద్రము సరిగ్గా మధ్యలో ఉంటుంది. అక్కడ ఉంటాడు నారాయణుడు. కాబట్టి హృదయ కేంద్రం నుండి వచ్చే ప్రజ్ఞ ఆధారంగా గుండె పనిచేస్తుంది. ఎలా పనిచేస్తుంది? స్పందనము కారణంగా. గుండె పని చేయటం వలన రక్త ప్రసారం మొదలైనవన్నీ మనకి అక్కడి నుంచి వస్తూ ఉంటాయి. ఈ హృదయ కేంద్రం నుండి బొడ్డు వరకు ఏర్పడిన ఇరుసు ఆధారంగా సృష్టి కొంత ఏర్పడుతుంది. ఈ నక్షత్రములు, గ్రహములు, గోళాలు అన్నీ కూడా సూక్ష్మ లోకాలలో ఏర్పడతాయి. సూక్ష్మలోకాలలో ఏర్పడిన తరువాత, స్థూలలోకంలోకి పద్మనాభుడు ద్వారా ఏర్పడతాయి. అందుకని బ్రహ్మ సూక్ష్మాతిసూక్ష్మమైన సృష్టి ధర్మాలు తన నుండి వ్యక్తం చేసుకుంటూ, సృష్టి చేస్తూ ఉంటాడు. తనకీ, నారాయణుడికి మధ్య ఒక గొట్టం ఉంది. దాన్ని పది అంగుళముల గొట్టం అంటుంటాం. 'అత్యతిష్ఠ ద్దశాంగుళం' అని. బొడ్డు నుంచి హృదయానికి అన్నమాట. ప్రతి వాళ్ళు నిలబడి వాళ్ళ బొడ్డు నుంచి హృదయానికి లెక్క వేసుకుంటే పది అంగుళాలు ఉంటుంది. అక్కడ ఉన్నది మొత్తం రహస్యం అంతాను. Heart centre వేరు, heart lotus వేరు. హృదయ చక్రం వేరు. అది ఉదరవితానం పైన ఉంటుంది. దానిని సింహము అంటారు. అది హృదయ చక్రం, హృదయ కమలం. చాలా ధ్యానం చేయవలసిన నామాలు ఇవి. ఎందుకంటే అపరిమితంగా పరుచుకుపోయిన ప్రజ్ఞ తనకు తానుగా కేంద్రంగా ఏర్పడటం హృషీకేశత్వం. మనకి ఆపాదించి చెప్పుకున్నట్లయితే, నిద్ర నుంచి లేచినప్పుడు హృదయ కేంద్రము నందు మేల్కొంచి, అక్కడ నుంచి చేయవలసిన పనుల ద్వారా బహిర్గతమవుతాము. నిజంగానే మేల్కొంచటం అంటే Stages ఉన్నాయి. హృదయమునందు మేల్కొంచడం అంటే తాను జీవుడుగా భగవంతుని యొక్క అంశగా మేల్కొంచాలి. మామూలుగా మనము మేల్కొంచడమే సరాసరి బొడ్డులో మేల్కొంచుతాము. మేల్కొంచి నప్పుడు తాను జీవుడని, జీవుడుగా భగవంతుని యొక్క అంశనని గుర్తు ఉండాలి. ఆ తర్వాత తనకి ఈ పేరు ఉందని, తనకి భార్య

పిల్లలు ఉన్నారని, ఒక ఊళ్లో ఉన్నామని నెమ్మదిగా గుర్తొస్తుంది. మనం లేవటం లేవడమే సరాసరి ఎక్కడో లేస్తాం. మనం రాత్రి నిద్ర లోకి ఎట్లా వెళ్తామో, దాన్నిబట్టి లేవటం ఉంటుంది. నిద్రలోకి వెళ్ళేటప్పుడు ఏ స్థితిలోకి వెళ్లి నిద్ర పోయామో, ఆ స్థితి నుంచి మళ్ళీ మెలకువ వస్తుంది. పోట్లాడుకుని నిద్రపోయామనుకోండి, పోట్లాట లోనే లేస్తాం. ఎందుకంటే రాత్రి పోట్లాడింది గుర్తు ఉంటుంది. భగవంతుని తలుచుకుని పడుకున్నామనుకోండి లేవగానే భగవంతుడు గుర్తుకు వస్తాడు. According to the previous order. అందుకనే రాత్రి పడుకోవటం అన్నది ఒక పెద్ద యజ్ఞం. ఒక క్రతువు. ఎట్లా పడితే అట్లా పడుకోకూడదు. భగవత్ చింతన చేసుకుంటూ హృదయంలోకి ఎగబాకి పడుకోమన్నారు. 'మిగతావి మర్చిపో, భగవంతుడ్నే గుర్తుపెట్టుకుని నిద్రలోకి పో,' అన్నారు. 'పడుకునేటప్పుడు దేవుని తల్చుకోండి' అంటుంటారు కదా. అది ఏదో మొక్కుబడిగా 'రామా!' అనుకుని పడుకున్నాము అనుకోండి, ఏమీ కాదు. మన శరీరం యొక్క సమస్త వ్యాపారమునకు కేంద్రమైన హృషీకేశం చేరి నిద్రపోవాలండీ! రోజూ రాత్రి హృషీకేశ్ వెళ్లి నిద్రపోండి. అక్కడ నిద్ర పోతే అక్కడ లేస్తాం పొద్దున్నే. బొడ్డులో నిద్రపోతే బొడ్డులో నుంచి లేస్తాం. ఎక్కడ నిద్రపోతే అక్కడ నిద్ర లేస్తాము. నిజానికి మనం గాఢమైన నిద్రలో హృషీకేశ స్థితికి చేరుకుంటాం. అందుకనే మనకు రోజు రాత్రి పడుకోవడం ఒక పెద్ద అవకాశం. పగలు కాదు. ఒక్కొక్కసారి అవసరమైనప్పుడు పడుకున్నారనుకోండి పగలు, ఎట్లాగూ పడుకున్నారు కాబట్టి ఈ విధంగా అక్కడికి వెళ్లి పడుకోండి. ఆ ప్రయత్నంలోనే నిద్ర వస్తుంది. నెమ్మది నెమ్మదిగా కేంద్రాన్ని చేరుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. నిద్రపోవడం, నిద్రలేవడం ఆధ్యాత్మిక సాధన చేసుకునే వారికి చాలా పెద్ద అవకాశాలు. రాత్రి నిద్రలోకి వెళ్ళేటప్పుడు మిగతావన్నీ మర్చిపోవాలి. అట్లా తయారుచేసుకోవాలి సమయాన్ని. అందుకని పడుకోబోయేముందు scriptures చదువుకోవాలి. పడుకున్న తర్వాత మనసుని ఉచ్వాస నిశ్వాసల యందు ఉంచాలి. దాని యందు ఉన్న మనసు, నెమ్మదిగా హృదయ కేంద్రం దగ్గరికి వెళుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు చేసుకుంటూ, ఆ స్పందన గురించి ఆలోచించుకుంటూ నిద్రలోకి వెళ్లిపోవడమే! నేను అనే చైతన్యాన్ని స్పందన అని గుర్తుపెట్టుకుని నిద్ర పోయారు అనుకోండి అక్కడ లేస్తాం. బ్రహ్మ కూడా లేవంగానే ఏమిటి, ఎక్కడ ఉన్నాము అనుకుంటాడు మనలాగే. మనలాగే అంటే మన చిన్న జీవితాలకి మనం ఎట్లాగో, బ్రహ్మకు కూడా తన సృష్టి జీవితం ఒకటి

ఉంది. ఆ సృష్టి మొత్తం 100 ఏళ్లు. ఈయన దాని యందు ఉంటాడు కాబట్టి, ఆయన కూడా అట్లా నిద్రలేస్తాడు. ఈ విధంగా అప్రమేయుడైన భగవంతుడు హృషీకేశుడైతే, హృషీకేశుడైన భగవంతుడు పద్మనాభుడైతే, పద్మనాభుడైన భగవంతుడి నుంచి అమరప్రభువు పుట్టుకు వస్తాడు.

## 52. అమరప్రభుః

అమరప్రభువు అంటే The Cosmic Administrator. C.A. అన్నమాట. He is the cosmic mind. ఆయన్ని మన భాషలో 'ఇంద్రుడు' అని చెబుతారు. ఇంద్రుడు అంటే సినిమాల్లో చూపించే ఇంద్రుడ్ని లెక్క వేసుకోకండి. వేదములలో చెప్పబడిన సమస్త దేవతా శక్తులకు అధిపతి ఇంద్రుడు. He is the hero of the divine intelligences. అమర ప్రభువులందరికీ ప్రభువైన వాడుగా దిగి వస్తాడు. అంటే సృష్టి అనే ప్రభుత్వాన్ని పరిపాలించే ప్రజ్ఞగా భగవంతుడు తనకు తానుగా దిగిరావడం అన్నమాట. చూడండి ఎట్లా ఉందో నామముల యొక్క అమరిక! అప్రమేయుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, అమర ప్రభువు. అతడినీ four armed fourth one అని అంటారు. నాలుగో వాడు. అక్కడికి వచ్చేసరికి ఒక్కడే 4 అయ్యాడు. అప్రమేయుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, అమర ప్రభువు. అదే వృత్తంలో ఉండే చతుర్భుజం! అదే మొత్తం సృష్టికి foundation, అని చెప్తారు. మనకి కూడా foundation మన mind కదా! మనం బొడ్డు లోకి వచ్చినప్పుడు localize అవుతాం. Localize అయిన తరువాత మనస్సు అనేది పనిచేయడం మొదలు పెడుతుంది. నిద్రలో మనస్సు పనిచేయదుగా! ఎప్పుడు పని చేస్తుంది మనస్సు? నిద్ర లోంచి లేచి చైతన్యవంతులమై, మనల్ని మనము గుర్తు చేసుకున్న తర్వాత కదా పనిచేస్తుంది. నేనెవరిని అని అడుగుతాడు బ్రహ్మ తనని తాను. నేనేం చెయ్యాలి? నేను ఎవరిని అంటే 'నేను నేనైన నేను' అని తెలుస్తుంది. నేను ఉదయమును, అని తెలుస్తుంది బ్రహ్మకు. ఎందుకంటే సృష్టికి ఆయనే beginning. You are the dawn, అంటారు. నేనెవరిని అని ప్రశ్న వేసుకుంటే లోపల నుండి హృషీకేశుడు 'నువ్వేరా నా ఉదయానివి' అని చెప్తాడు. ఎక్కడ ఉన్నాను నేను? అంటే 'తూర్పున ఉన్నావు.' ఎందుకున్నాను అంటే 'సృష్టి చేయడానికి'. అట్లా. చేద్దాం అని అనుకున్నప్పుడే 'మనస్సు' వస్తుంది. అది అమర ప్రభువు అంటే. మొత్తం సృష్టి ఎట్లా చేయాలో దానికి కావలసిన administrative laws అన్నీ కూడా తయారు చేస్తాడు. అంటే సృష్టి అనే ప్రభుత్వాన్ని పరిపాలించడానికి కావలసిన సమస్త సిద్ధాంతములు అప్పుడు బ్రహ్మయందు భాసిస్తాయి. ఎక్కడ నుంచి? లోపలి నుంచే, హృషీకేశుడు అన్న కేంద్రం నుంచే. 'పుస్తకాలు పోయినాయి సార్, సృష్టి ఎట్లా

చేయను' అని అడుగుతాడు. వేదాలు పోయినాయి కదా! పోతే మళ్ళీ ఇస్తాను. అంతే గాని లేవు కదా అని మానెయ్యకు, అని చెబుతాడు. Books లేవని మానేస్తే ఒప్పుకోను, అని books తెచ్చి ఇస్తాడన్నమాట. మనకు అర్థం కావాలని పుస్తకాలు అని చెప్పారు, చిన్నపిల్లలకి చెప్పినట్లు. చతుర్విధములైన శక్తులను బ్రహ్మ యందు అవతరింప చేయటమే నాలుగు వేదాల్ని మళ్లీ తెచ్చి ఇవ్వడం అంటే. గుర్తు వచ్చేటట్లు చేస్తారు కాబట్టి మర్చిపోయాను అనటానికి వీలు లేదు. మర్చిపోయాను అనుకోగానే నాలుగు వేదాలు గుర్తుకు వస్తాయి. మొత్తం సృష్టిని పరిపాలించడానికి కావాల్సిన ధర్మాలు గుర్తుకు వస్తాయి. సృష్టిని ఏర్పరిచి, దాన్ని పరిపాలించాలి కదా! మన మనస్సు కూడా అంతే. మనం లేచి పని చేద్దాం అనుకుంటే mind లేకపోతే పని చేయలేం కదా! అందుకే కదా mind బావుండని వాడిని mental అని అంటూ ఉంటాం. సరిగ్గా చేయలేడు. పిచ్చివాడు ఉంటాడు. పిచ్చివాడు కూడా నిద్ర పోతూ ఉంటాడు. పిచ్చివాడు కూడా లేస్తాడు. వాడికీ ఆకలి వేస్తుంది. అప్రమేయత్వము, హృషీకేశత్వము, పద్మనాభత్వము పిచ్చి వాడికి కూడా ఉంటాయి. అక్కడ నుండి వాడికి ఒక పద్ధతి ప్రకారం చేయటం అన్నది కుదరదు. అందుకని మనం వాడిని పిచ్చివాడు, అంటాం. సృష్టి బాగా నడవాలంటే అమర ప్రభువు ఉండాలి. మనకి కూడా బాగా జరగాలంటే ఈ మూడు ఉన్నా ఈయన లేకపోతే ఏమీ జరగదు. 'నిర్మలమైన మనస్సు', A Pure mind, అని Madam Blavatsky అందుకే అన్నది. ఈ విధంగా భగవంతుడు చతుర్భుజుడు అయినాడు. అందుకనే మన దేవతలందరికీ నాలుగు చేతులు చూపిస్తుంటారు. ఈ నాలుగు కలిగిన వాడు అని అర్థం. అంటే భగవత్ తత్వానికి సంబంధించిన ఈ నాలుగు భావములు పరిపూర్ణమైన అనుభూతి పొందిన వారు. మనకు కనబడే రెండు చేతులు కాకుండా కనపడని రెండు చేతులు ఉంటాయి వాళ్ళకి. ఆ చేతులతో అప్పుడప్పుడు వాళ్ళని, వీళ్ళని కాపాడుతూ ఉంటారు. కనపడకుండా కాపాడటానికి పనికి వస్తుంది. నాలుగు వేదాలు వారి నుంచి వ్యక్తమవుతుంటాయి. నాలుగు కాలాలలో నుంచి చక్కగా పని చేయగలరు. అంటే ఉదయం సంధ్య, సాయంత్రం సంధ్య, మిట్ట మధ్యాహ్నం, అర్ధరాత్రి. అమావాస్య, పౌర్ణమి, శుక్ల అష్టమి, కృష్ణాష్టమి. అక్కడ నుంచి నాలుగు యుగాల వరకు కూడా కృత, త్రేత, ద్వాపర, కలి. ఈ విధంగా four fold existenceలో పరిపూర్ణంగా పనిచేయగలగడానికి ఈ నాలుగు కావాలి. సృష్టికి కూడా ఈ నాలుగు basis. అందుకని దీనిని the foundation

stone, అన్నారు. It is the pillar of the temple. దాని చుట్టూ temple ఏర్పడింది అన్నమాట. దీనినే మొట్టమొదట చూపిస్తారు Madam Blavatsky కి. పవిత్రమైన పిండాండ, బ్రహ్మాండ విజ్ఞానాన్ని దర్శింప చేయడానికి Madam Blavatskyకి చూపించబడిన మొట్టమొదటి యంత్రము (నారాయణ యంత్రము) మనం ఇప్పుడు screen మీద జిగురు పెట్టి అంటించుకున్నాము. చాలా మటుకు అవి మనకి జగద్గురు పీఠం పుస్తకాల మీద, program sheets మీద, ఎక్కడపడితే అక్కడ వేసుకుంటూ ఉంటాం. దాని యొక్క తత్వం 'మహత్తత్వం'. It is the very basis of all existence, it is the centre of all creation, it is ever permeating into creation and it has a systematized approach towards the creation. ఈ నాలుగు. అదీ చతుర్భుజత్వం అంటే. ఈ నాలుగు పదాలు మనకు చక్కగా నాలుగుగా ఇచ్చేసారు. అప్రమేయుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, అమర ప్రభువు. అక్కడినుంచి మనసుకు సంబంధించిన తత్వం పరిపూర్ణంగా ఉన్నవాడు ఈ సృష్టి లోకాలను పరిపాలించడం బాగా చేయగలడు. సృష్టి లోకాలు పరిపాలించాలి అంటే మనస్సు లేనిదే పరిపాలించలేం. అక్కడి నుండి జారాము అనుకోండి, జారిన ఇంద్రుడి గురించి మనం ఎక్కువగా వింటూ ఉంటాం పురాణాలలో. జారని ఇంద్రుడు ఒకడు ఉన్నాడు. ఆయన విష్ణువుకు కూడా అన్నయ్య. ఇంద్రుడు అమరప్రభువుగా workout చేస్తుంటాడు. భగవంతుడు ఆయనకు, విష్ణువుగా  support ఇస్తుంటాడు. Working plan అంతా కూడా మనస్సు దగ్గరే ఉంటుంది. 'Mind is the plan of work' అని ఒక occult statement ఉంది. Life is the song of breath. Song of breath హంస స్వరూపుడిగా హృషీకేశుడి లో జరుగుతూ ఉంటే, అది ఆధారంగా ఏర్పడిన పద్మనాభుడి ద్వారా plan of work express అవ్వటమే, బ్రహ్మ నుండి మనస్సు పుట్టటం. అదే మానస పుత్రులు పుట్టటంగా చెప్తారు. ఆ విధమైన పద్ధతులలో మనకి అమర ప్రభువు వస్తాడు.

## 53. విశ్వకర్మ

అమర ప్రభువు వచ్చిన తర్వాత ఆయన లోంచి విశ్వకర్మ  పుట్టుకు వస్తాడు. విశ్వకర్మ అంటే సృష్టిలో ఉండే రూపాత్మకమైన ప్రజ్ఞ. The shape consciousness అంటారు. నిచ్చెన ఏ విధంగా ఉందో నామాలలో వరుసగా ఇచ్చారు. విశ్వకర్మ అనే ప్రజ్ఞగా భగవంతుడు దిగి రావటం వలన భూమి లేదా సృష్టిలో ఉండే సమస్త జీవరాసులకి వాటి వాటి రూపములు intact గా ఉంటాయి. అంటే మనిషికి మనిషే పుట్టడం confusion లేకుండా. మా ఆవిడ pregnant అండి, ఏమి పుడుతుందో తెలియదు అన్నట్లుగా ఉండదు కదా! మనిషే! ఏమిటా confidence? The intelligence that functions in creation that ensures the progeny according to the previous order. అంతకు ముందు ఉన్న రూపం నుంచి వచ్చేది అదే రూపంగా వచ్చేటట్లుగా ఉంటుంది. (అయితే కలియుగంలో ఇంకోలాగ  కూడా పుట్టవచ్చు, అని చెప్పారు. ఎందుకంటే కలియుగంలో అందరికీ కాస్తో కూస్తో దెబ్బ తగులుతుంటుంది .) ఆవు నుంచి ఆవు దూడే పుట్టడం, మామిడి చెట్టు నుంచి వేపకాయలు రాకుండా మామిడి కాయలే రావటం. మనం గమనించం ఇవన్నీ ఎట్లా జరుగుతున్నాయని. ఒక కుక్క యొక్క శుక్రం ఒక drop, ఒక మనిషి యొక్క శుక్రం ఒక drop తీసుకున్నామనుకోండి. మీకేం తెలుస్తుంది రెండింటికీ difference? రెండూ drops of liquid కదా! రెండింటినీ test tube లో పెట్టి జాగ్రత్తగా పెంచండి. ఒకటి కుక్క అవుతుంది, ఒకటి మనిషి అవుతుంది. ఎట్లా అవుతుంది? There is an intelligence functioning in the creation which is shape consciousness. చక్కటి shapes ఇవ్వటం, ఇచ్చిన shapes నిలబెట్టడం చేస్తుంటాడట ఆయన. ఆయనే విశ్వకర్మ. The great architect of the universe అంటారు ఆయన్ని. ఎందుకని? Architect కదా shapes ఇస్తుంటాడు buildings కి. ఎంత Architecture బాగా తెలిస్తే  అంత అందంగా సృష్టిని తయారుచేసుకోవచ్చు. అందంగా building కావాలంటె మంచి Architect  దగ్గరికి వెళ్తాము. ఎట్లాగో అట్లాగా కట్టుకుందాం అంటే వెళ్లనక్కర్లేదు. అందంగా కట్టుకోవాలంటే విశ్వకర్మ దగ్గరికి వెళ్ళాలి. అందుకని ఈ మొత్తం తయారు చేసే తత్వంగా తానే ఐదవ వాడుగా ఏర్పడటం విశ్వకర్మ. The great

Pymandaris అంటారు. ఆయన్ని చెప్పటానికి పంచారము లేక five pointed star అని చెబుతుంటారు. Masonic order కి భగవంతుడంటే విశ్వకర్మే! TGAOU అని రాసుకుంటారు వాళ్ళు. అంతకన్నా పలకరు. TGAOU అంటే The Great Architect Of the Universe. ఎందుకని? మొత్తం అంతా తయారు చేసే వాడు ఆయన. ఒక పద్ధతి తయారుచేసి ప్రవేశపెట్టేస్తాడు. ఇంక వాళ్ల నుంచి పుట్టుకు వచ్చే వాళ్ళు అందరూ కూడా అట్లాగే ఉంటారు. ఇంకో పద్ధతిలో రావడానికి అవకాశం లేదు. ఈ aspects గమనించాలి మనం. ఏ చెట్టు చూసినా దాని progeny ని ఆ చెట్టు తీసుకొస్తుంది. According to due and ancient form అని అంటుంటారు దాన్ని. ఆ పద్ధతి ప్రకారమే దిగి వచ్చేటట్లుగా తను ఏర్పడుతున్నాడన్నమాట. అట్లా తనని తను విస్తరించుకుంటూ ఉంటాడు. మర్రి గింజలు వేస్తే మర్రిచెట్టు వస్తుంది. రావి గింజ వేస్తే రావిచెట్టు వస్తుంది. మొత్తం plan అంతా ఎలా విచ్చుకోవాలో అంతా గింజ లోనే ఉంటుంది.

## 54. మనుః

విశ్వకర్మకి assistant గా పనిచేస్తుంటాడట మనువు.
'విశ్వకర్మా మనుస్త్వష్టా'... అంటే ఆయన అనుకున్న పద్ధతులలో రూపాలు వస్తుంటే ఆయనకి assist చేస్తూ, కాలం ప్రకారం కొంచెం దాన్ని adjust చేస్తూఉంటాడు. విశ్వకర్మ plan ఇచ్చాడు అనుకోండీ, దాన్ని అక్కడ localize చేసినప్పుడు కొంత adjust చేస్తూ ఉంటాడు. చేసి, అతను చెప్పిన పద్ధతులలో మానవుల shapes తయారుచేస్తాడు. అందుకని మానవజాతికి మనువు మూలపురుషుడు. 'వైవస్వత మన్వంతరే' అంటాం కదా! 14 మంది మనువులు. 14 తిధులు. అయితే వాళ్ళు ఏడుగురే! అంటే ఒకరు పగలు కి, ఒకరు రాత్రికి అధిపతులు. వారానికి ఏడు రోజులు అంటే, ఏడు రాత్రులు ఏడు పగళ్ళు కదా! మొత్తం సృష్టి ఏడు రోజులే వాళ్ళ లెక్కలో. మన లెక్కలో కూడా 7 రోజులు ఒక మన్వంతరమే. మనువులు 14 మంది ఉన్నట్లుగా చెప్పుకుంటాం. విశ్వకర్మకి Gold Smith అని Englishలో ఇంకో పేరు ఉంది. అందుకని మనం వాళ్లను కూడా 'విశ్వబ్రాహ్మణులు' అంటూ ఉంటాం. వాళ్ళు shapes ఇస్తుంటారు బంగారానికి. మనకున్న జీవస్థితిని కూడా 'బంగారం' అంటారు. బంగారానికి ఉన్నట్లే దానికి కాంతి ఎప్పుడూ ఉంటుంది. కాంతివంతం అయిన జీవుడ్ని ఇన్ని రూపాలుగా చేస్తుంటారు. చెట్లు, పుట్టలు, జంతువులు, పక్షులు, మనుషులు తయారు చేసే universal goldsmith విశ్వకర్మ. ఆయనే లేకపోతే ఈ సృష్టి చేయటమన్నది చాలా కష్టం. Building plan వరకు ఇంద్రుడు వేస్తే, దానికి ఒక shape ఇవ్వాలి కదా! planకి shape, elevations కావాలి కదా! కళ్ళు ముఖం లోనే ఉండాలి. కళ్ళు వీపు మీద పెట్టాడు అనుకోండి, ముఖం అందం ఎవడు చూస్తాడు? మనం వీపులు చూసి పని చేసుకోవాలి. వాడి వీపు లోంచి వాడి కళ్ళు, మన వీపులో నుంచి మన కళ్ళూనూ. మరేమో పొట్టలోకి కదా అన్నం వెళ్ళాలి, అని సరాసరి పొట్ట దగ్గర నోరు పెట్టారనుకోండి, ఎలా ఉంటుంది? ఏది ఎక్కడ ఉంటే ఇంట్లో ఉండే వాడు సౌకర్యంగా ఉంటాడో అన్నది తెలిసిన వాడు Architect. ఊరికే Architecture మీద engineering degree తీసుకుంటే అయిపోలే! ఆ ప్రదేశంలో అక్కడ ఉండే భూమి తీరు చూడాలి. ఎందుకంటే ఒక భూమికి ఒక్కొక్క తీరు ఉంటుంది. అట్లాగే భూగోళాలు కూడా. చాలా భూగోళాల

మీద పని చేస్తుంటాడు విశ్వకర్మ. అక్కడ ఉండేటి గాలి తీరు, అక్కడ ఉండేటి వెలుగు తీరు, అక్కడ ఉండేటి ఋతువులు యొక్క తీరు ఇవన్నీ చూసి ఏది ఎక్కడ ఉండాలో నిర్ణయం చేస్తాడు. Bathroom దగ్గర వంటగది, వంటగది దగ్గర bedroom, ఇట్లా కట్టడు తెలిసిన Architect. అట్లాగే సృష్టి లో ఉన్న ఈ విశ్వకర్మ ఏ ఏ మండలాలు ఎక్కడ ఎక్కడ ఏర్పడాలి అనేది చూస్తాడు. చాలా చోటు ఉంది కదా! ఏది పడితే అది, ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేయటం అనే పద్ధతి ఉండదు. Plan గురువుగారి దగ్గర ఉంటుంది. అంటే ఇంద్రుడి దగ్గర. విశ్వకర్మ దానిని ఒక పద్ధతిలో అమరుస్తాడు. Everything is well shaped. అందుకనే అన్ని గోళాలూ గుండ్రంగా ఉంటాయి. Perfect shape ఏది అంటే a globe. ఎందుకని? మీరు ఎట్లా పెట్టినా అది గుండ్రంగానే ఉంటుంది. నువ్వు బంతిని ఏమిట్రా తల పక్క కింద పెట్టావు అని చెప్పడానికి వీలు లేదు కదా! బంతి బంతే! ఎలా పెట్టినా అట్లాగే కనిపిస్తుంది. ఇంకొకటి అట్లా కనిపించదు. Cube కూడా అట్లా కనిపిస్తుంది. ఎప్పుడూ? If it is not standing on the point but if it is standing on the side. కాబట్టి Globe అంత కాదు. Cube కి ఆరు దిక్కులూ ఉంటాయి. నాలుగు పక్కల, పైన, కింద అదికూడా ఏ పక్కన పెట్టినా మొత్తం ఒకే పద్ధతిలో కనిపిస్తుంది కానీ, కొన మీద నిలబడితే? అందుకని అన్నిటికన్నా best form is a sphere. అందుకని మన వాళ్లు ఏం చెప్పారంటే రూపాన్ని ధ్యానం చేద్దామనుకుంటే గుండ్రంగా ఉండే రూపాలను ధ్యానం చేసుకోమని చెప్పారు. అది పూర్ణత్వాన్ని కలిగిస్తుంది అని చెప్పారు. అందుకని వినాయకుడు ఎక్కువ చిన్న పిల్లలకి కూడా ఆకర్షణీయంగా ఉంటాడు. గుండ్రం గుండ్రంగాను, full గాను. అసలు మనకి ఇచ్చిన ఆది యంత్రం, ఇప్పుడు మనం అక్కడ పెట్టుకున్న యంత్రమే. మనం దాని కింద రాసుకున్నది కూడా

'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవా వశిష్యతే'

అని కదా. ఎందుకంటే పూర్ణంగా ఉంటే అందులో నుంచి ఇంకొక పూర్ణం తీసినా ఈ పూర్ణానికి ఏమీ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే అసలు వస్తువు అట్లా గుండ్రంగా, నిండుగా ఉంటుంది. అందులో నుంచి నువ్వు తీసుకున్నంత మాత్రాన అది తరగదు. అట్లాగే నీ లోంచి ఇంకొకడు పుడితే కూడా నువ్వు తరగవు. మనకి ఒక అబ్బాయి పుట్టాడు అనుకోండి. వాడు మన అంతటివాడు అయ్యాడు అనుకోండి అంటే

ఆరడుగుల వాడయ్యాడనుకోండి, మనం ఆరడుగులు తగ్గిపోము కదా! మనలోంచి ఒకడు పుట్టుకొస్తే వాడు పెరిగిన కొద్దీ మనం తగ్గిపోవాలి కదా! అది displacement of matter అయితే, ఇంత తీసేస్తే అంత తగ్గాలి అని ఉంటుంది. లడ్డు మనం కొంత కొరికామనుకోండి, ఎంత కొరికితే అంత అక్కడ ఉండదు కదా! అట్లా ఉండదుట సృష్టి. తీసేస్తుంటే మళ్లీ వచ్చేస్తూ ఉంటుంది. మళ్లీ నిండి పోతూ ఉంటుంది. ఒక చెట్టు అయిపోయే లోపల ఇంకొక చెట్టు వస్తూ ఉంటుంది. అందుకని పూర్ణమదః పూర్ణమిదం! That is fulfillment. This is fulfillment. పూర్ణాత్ పూర్ణముదచ్యతే! From out of fulfillment comes fulfillment. అందుకని C.V.V. గారు ఈ పదం అంటే చాలా ఎక్కువ మక్కువగా ఉండేవారు. Fulfillment అన్న పదం అంటే ఆయనకు చాలా ఇష్టం. English వాళ్లకి మిగతా భాష ఎట్లా ఉన్నా ఈ ఒక్క పదం చాలా బాగా వేసుకున్నారు, అని చెప్పారు. ఎందుకంటే వాళ్ళకి zero అంటే శూన్యం అని అర్థం తప్ప, పూర్ణం అని అర్థం తెలీదు. అందుకని ఆయన ఈ పదం పట్టుకున్నారు. పూర్ణం అంటే ఏమి చెప్పాలి వీళ్ళకి? Fulfillment మాత్రం పూర్ణం ఎలా అవుతుంది? అంటే ఆయన అన్నారూ, There is a Fill after the full. Full fill ment. నిండి పోయిన తర్వాత కూడా ఇంకా filling ఉంటే ఏమవుతుంది? అది పొంగి, పెల్లుబికి ఇతరుల లోకి పారుతుంటుంది. చిల్లు కుండలో అయితే ఎంత పోసినా ఒకటే. కుండ నిండిన తరువాత, నువ్వు ద్రవ్యం పోస్తూ ఉంటే ఏమవుతుంది? అది పక్కలకు పారుతుంటుంది. అదిట యోగి తత్వం! అందుకనే ఆయన ఆ పదం పట్టుకున్నారు. యోగి అంటే ఎవరు అంటే 'The fulfilled one' అన్నారు. ఎందుకని? He is already full and he is being filled and hence it flows through him. కడుపు నిండిన వాడు ఇంకా వాడికి వస్తోంది అనుకోండి, ఎంత తింటాడు. వాడికీ వీడికీ పెట్టాలి. పూర్ణత్వం పొందిన వాళ్లకి ఏమవుతుందీ, వీళ్లలో నుంచి ఇతరులకు పూర్ణత్వం పొందేటి స్థితి సహజంగా జరిగిపోతూ ఉంటుంది. అట్లా తీసినా తరగని తత్వం భగవంతుడు! అక్కడి నుంచి ఏర్పడిన వాళ్లం కదా మనం. That is perfection. That is fulfillment. That is పూర్ణం అంటారు. పూర్ణ మదం అంటే మదం కాదు. That అని. పూర్ణమిదం. అందులో నుంచి వచ్చిన వాడివి నువ్వు కూడా పూర్ణమే. కాదనుకుంటే కాదు. కాబట్టి నీలో నుంచి వచ్చేవి కూడా పూర్ణంగా తయారవుతుంది నీ బట్టి. కొన్ని పనులు చాలా పరిపూర్ణంగా

జరుగుతుంటాయి వాళ్ల ద్వారా. ఎందుకని? వాళ్ళు పూర్ణంగా ఉన్నారు కాబట్టి. వీళ్ళు పూర్ణం కాకపోతే, చేసే పనులలో కొంత సొట్టలు ఉంటాయి. పూర్ణంగా ఉండదు. అందుకనే నిండిన వాడు మాత్రమే పంచగలడు. నీకు లేనిది నువ్వేం పంచుతావు?

"కాననివాని నూతగొని కానని వాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి." వీడికే ఏం తెలియకుండా, ఇంకా తెలుసుకుందాం అనుకునే వాడికి, ఈ తెలియనివాడు, తెలియని విషయం గురించి తెలిసినట్లు చెబుతూ ఉంటే అందరికీ ఏమీ అందదు. కానీ తెలిసిన వాడు చెప్తుంటే ఇంకా వస్తూ ఉంటుందట. అందుకనే teaching is the best part of learning అన్నారు. If you want to learn you teach. మనకి వచ్చింది చెప్పడం కాదు అక్కడ. చెప్తూ ఉంటే మనకి వస్తూ ఉంటుంది. అది తెలిస్తే ఇంక ఫర్వాలేదు. గొట్టం తీసుకు వెళ్లి reservoir కు పెట్టినట్లే. మన tank లో water అంటే అయిపోతుంది. అదే reservoir కి తగిలిస్తే? ఆ reservoir catchment area లో ఉంటే, అక్కడికి వర్షం భగవంతుడు ఇస్తూ ఉంటే-- ఇంక తిరుగేముంది? అట్లా ఉండాలి తప్పా, అయిపోయిందండి, ఈ పూటకి ఇక ఇంతకన్నా ఏం రావడం లేదు, time కూడా ఎంతసేపటికి కావట్లేదు, ఇంక గుర్తు రావట్లేదు, అన్నది ఎప్పుడు అవుతుంది? పూర్ణం కాకపోతే అవుతుంది. పూర్ణమయితే మీ ఓపికే. అట్లా వస్తూనే ఉంటుంది. ఏ విషయంలోనైనా సత్యం అది. డబ్బు విషయంలో సత్యం. ఎంత మహాత్కార్యాన్ని అయినా సంకల్పిస్తే అయిపోతుంది. నిన్ను నువ్వు నింపుకుంటూంటే నీ నుంచి ఇతరులకు నింప బడుతుంది. నిన్ను నువ్వు నింపుకోకపోతే ఇతరులకు నింప లేవు. గొట్టంలో నీళ్లు లేకపోతే పంపులో నుంచి రావు కదా! అది పూర్ణ మదం. అది ఎప్పుడూ fulfill గానే ఉంటుంది. నువ్వు fulfill అయితే పూర్ణమిదం. పూర్ణాత్ పూర్ణముదచ్యతే నీ నుంచి మళ్ళీ fulfillment. అదీ సృష్టి కార్యంలో పాల్గొనటం అంటే. You have become full and there is a continuous filling in you and hence it goes into others. అట్లా ఒకళ్ళ నుంచి ఒకళ్ళకి. 'జ్యోత్ సే జోత్ జలా తే చలో' అన్నారు కదా. వెలిగించని కొవ్వొత్తి తో ఇంకో కొవ్వొత్తిని ఏం వెలిగిస్తాం? దాని అంతట అది వెలిగిపోదు కదా! రెండు కొవ్వొత్తులు వెలిగించకుండా ఒక దాని తలకాయ మీద ఒకటి పెట్టాం అనుకోండి, వెలగవు. వెలిగిన కొవ్వొత్తి ఇంకొక కొవ్వొత్తిని వెలిగించగలదు. That is only sure way and simpler way. నా

అంతటా నేను వెలుగుతాను, నాకు ఎవరూ అక్కర లేదు అని అనుకున్నామనుకోండి. అట్లా కూర్చోడమే! ఎప్పుడో అక్కడ fire accident అయినప్పుడు నిన్ను కొంచెం ముట్టుకోవచ్చు. అట్లా కాకుండా 'already enlightened to enlighten' అన్నారు. Be lighted to lighten, అన్నారు. ఈ దశపల్లా రోడ్ లో ఒక church ఉంది. వాళ్ళు అక్కడ ఏం రాసుకున్నారు అంటే, lightened to lighten అన్నారు. వెలిగింప బడ్డాను ఎందుకంటే వెలిగించడానికి, అది క్రీస్తు చెప్పిన వాక్యం. నేను వెలిగిపోయానండి, అయిపోయింది, అని కాదు. ఎందుకు వెలిగించారుట, అంటే ఇతరులను వెలిగిస్తావని. లేకపోతే ఒక వెలుగు వెలిగి ఆరిపోవాల్సి ఉంటుంది. అది కాదు కదా! ఒక్క వెలుగు వెలిగి, నలుగురికి పంచి అట్లా వెలుగుతూ ఉండటమే. రెండువేల ఏళ్ళు అయినా ఇంకా వెలుగుతూనే ఉన్నాడుగా! ఐదు వేల సంవత్సరాలు అయినా ఒక ఆయన వెలుగుతూనే ఉన్నాడుట. పది లక్షల సంవత్సరాలు అయినా ఒక ఆయన వెలుగుతూనే ఉన్నాడు (రాముడు). ఎట్లా వెలుగుతున్నారు వీళ్ళు? అందరికీ అట్లా పంచారు కాబట్టి అట్లా పాకారు అందరిలోకి. వాళ్లు నిండిపోయి ఇంకా వస్తుంటే, ఇతరులలోకి పాకుతూ ఉంటారన్నమాట. ఒక ప్రవాహంలా అన్నమాట. అందుకని అది పూర్ణం, ఇది పూర్ణం. అందులోంచి వచ్చేది పూర్ణం. ఇక్కడి నుంచి వెళ్లిపోయింది కాబట్టి తగ్గిపోతుంది అనుకునే వాడు, పూర్ణతత్త్వం తెలియని వాడు. ఇస్తే అయిపోతుంది అనుకుంటాం కదా! మామిడి చెట్టు ఏమనుకోవాలి? కాపు కాయంగానే మీద పడిపోతాం కదా! కాపు మళ్లీ వస్తుందని దానికి ధైర్యం. మనకా ధైర్యం లేదు. మనకు ఏమిటంటే ఎంత ఉంటే అంత బలంగా feel అవుతూ ఉంటాం. ఉన్న కొద్దీ బరువెక్కుతుంది అని తెలియక. సద్వినియోగం జరుగుతుంది అనుకోండి ఇంకా ఇస్తారు, ఇంకా ఇస్తారు, ఇంకా ఇస్తారు. అది experiment చేయడానికి ధైర్యం కావాలి. అందుకనే ఆధ్యాత్మిక సాధనలో Master Djwalkul ఓ నాలుగు ముక్కలు చెప్పారు. First, To will అన్నారు. ముందు సత్సంకల్పం చెయ్. ఆ సంకల్పం అమలుపరచాలి అంటే నీకు చాలా దమ్ము కావాలి. దానికి To dare అన్నారు. To will, to dare. Daring గా చెయ్యాలి. మాస్టారు గారి ధైర్యం ఏమిటి, అంత మంది పిల్లల్ని పెట్టుకుని ఉద్యోగం మానేయటానికి. చాలా ధైర్యం కావాలి. ఆస్తులు ఉండి మానేయటం కాదు కదా! ఏమీ లేకుండా మానేయడానికి ధైర్యం కావద్దూ. కనీసం ఇల్లు కూడా లేదు. ఆరుగురు పిల్లలు. అందరూ ఇంకా పిల్లలే. ఎవరూ చేతికంద లేదు. ఉద్యోగం

మానేయటం ఏమిటి? మీరూ నేను చేస్తే 'irresponsible fellow' అని society మనకి ముద్ర వేస్తుంది. మనం కూడా దానికి అనుగుణంగానే తయారవుతాం, ఎందుకూ పనికి రాకుండా. కానీ ఆయనకు ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది. అక్కడ నుండి వచ్చింది.. అది daring అంటే. ఒక్కసారి సంకల్పించారు. వాళ్ళు అడుగుతారు, 'ఏమయ్యా నీ ద్వారా కొంత మంచి పని చేద్దాం అనుకుంటున్నాం. నువ్వు సహకరిస్తావా? ఆలోచించుకో సుమా! చాలా కష్టంగా ఉంటుంది' అని. Blavatsky ని కూడా అట్లానే అడిగారు. 'విన్నప్పుడు బావుంటుంది సుమా! చేస్తున్నప్పుడు తోలు తీసేస్తున్నట్లు ఉంటుంది. కాబట్టి ఆలోచించుకో. ఒకసారి ఆలోచించుకున్న తర్వాత, ఒక్కసారి సంకల్పించిన తర్వాత వెనక్కి తిరుగ కూడదు' అని. అందుకని To will, అన్నారన్నమాట. Once you have willed, you shall have to dare. ఎంత daring? Daring to the extent of being risky. అందుకనే To risk అన్నారు. To will, To dare, To risk and To remain silent. చూశావా నేనింత మంచి పనులు చేస్తున్నాను. చూశావా నేను ఉద్యోగం మానేశాను. మీరెవరు నన్ను పట్టించుకోరేంటి? ఇవన్నీ ఉండవు. నేను ఇంత risk తీసుకున్నాను నా lifeలో, మీరు ఎవరైనా ఆలోచించారా, అని అరవడం ఉండదు. వాడి మీద, వీడి మీద వెష్టపడటం ఉండదు. వాడి మీద, వీడి మీద బతకడమూ ఉండదు. ఎక్కువమంది ఆధ్యాత్మిక సాధన పేరున కుంటివాళ్ళు అయిపోయి, వాళ్ళ support మీద, వీళ్ళ support మీద బతుకుతూ ఉంటారు. శిష్యులు పోషిస్తున్నారు అనుకోండి గురువుగారిని, చంకలో కర్రల్ల లాగా తయారు అయిపోతారు వాళ్ళు. తనకు ఏమిటి ఆధారం? అంటే మనం చూసే ఆధారం కాకుండా మనకు కనబడనిది, వాళ్ళకి కనబడేది ఆధారంగా పెట్టుకుని ఉంటారు. 'ఏదిరా నీకు ఏది బలము' అని అడుగుతాడు కదా హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి. 'నాకు, నీకు ఈ మొత్తం అంతటికీ ఒకటే బలం' అని చెప్తాడు. అక్కడి బలం మాస్టారు గారికి ఉండబట్టి He could dare and he could risk and he remained silent. అది important. అది కూడా చెప్పారాయన. ప్రతి సాధకుడు జీవితంలో కూడా ఈ నాలుగు stepలు ఉన్నవాడే సాధకుడు. లేకపోతే ఏదో వేసవికాలంలో చల్లచల్లగా, చలికాలంలో వెచ్చగా సాధన చేసుకోవడంలా ఉంటుంది. సంసార పక్షంగా సాధన ఒకటి. ఇది ఒకటి. ఇది ఎక్కడ నుంచి వచ్చింది అంటే, they have the confidence in the పూర్ణత్వం of the one. అది

ఎప్పుడూ నిండుకుండగా ఉండి పెల్లుబికి వస్తూ ఉంటే మనకి రాకపోతుందా మనం కూడా అట్లా ఉంటే అనే ధైర్యం. ధీరులు వాళ్ళు. ఆ ధీరత్వం మీద పని చేస్తుంటారు. ఉన్నవన్నీ పంచేసి ఇచ్చేశారు C.V.V. గారు. ఏమిటి ధైర్యం? మనవి కాదు కదా! వాడివే కదా! వాడివే వాడికి పెట్టేస్తున్నాము అన్న స్థితి. అట్లా ఉన్నవాళ్లు They continue to remain full. It is a truth which can be experimented in life by those who have the will and who can dare and who can risk and who remain silent. పోతన చూడండి ఎట్లా dare చేశాడో. ఆయన భాగవతము రాజుగారికి ఇచ్చేస్తే తట్టడొచ్చేది. ఇక జన్మంతా సంపాదించకుండా తినచ్చు, బతకవచ్చు. మనం కూడా అంతే కదా ఏదన్నా lump sum వస్తే అది పట్టుకుని జీవితాంతం లాగేద్దాం అనుకుంటాం కదా! ఇంక retire అయిపోవచ్చు అనుకుంటాం. అంటే ఏం చేయనక్కరలేదని. కానీ వాళ్ళు అలా కాదు. ఏ initiate life తీసుకున్నా ఇలాగే ఉంటుంది బలం. వాళ్ళ అబ్బాయి జోడెద్దుల నాగలితో పొలం దున్నుతుంటే, ఒక సన్నివేశంలో శ్రీనాథుడు తన యోగశక్తితో పల్లకీకి ఒకపక్క బోయల్ని తప్పుకోమన్నా పల్లకి నడుస్తుంటే, పోతన 'నువ్వు కూడా ఒక ఎద్దు వదిలేయరా' అంటాడు. ఒక ఎద్దును వదిలేస్తే నాగలి ఎట్లా నడుస్తుంది? మనకైతే నడవదు. ఆయనకి నడుస్తుంది. శ్రీనాథుడు రెండో పక్క బోయల్ని తప్పుకోమన్నప్పుడు కూడా పల్లకి నడుస్తుంటుంది. 'ఇంకో ఎద్దుని కూడా వదిలేయ్' అంటాడు పోతన తన కొడుకుని. అయినా నాగలి నడుస్తూ ఉంటుంది. అప్పుడు శ్రీనాథుడికి అర్థమవుతుంది. ఈయనేదో చలిమిడి సుద్ద అనుకున్నాను, కాదుసుమా అని. ఏమిటి బలం నాగలి నడవటానికి? వాళ్ళ confidence levels వేరు. ఎందుకంటే వాళ్లు అట్లా అనుభూతి చెందుతుంటారు. ప్రతినిత్యం భగవంతుడితో ఉంటారు. భగవంతుడు అదృశ్యరూపుడై, దృశ్యరూపుడై ఎట్లా పని చేస్తున్నాడో వాళ్ళకి అట్లా కన్నులకు కట్టినట్లు ఉంటుంది. కాబట్టి ఎద్దు లేకపోయినా నాగలి దున్నేస్తూ ఉంటుంది. అందరికీ తెలియాలని బతకరు నిజమైన యోగులు. భగవంతుని యందు ఉండటం ముఖ్యం తప్ప అందరికీ తెలియటం ముఖ్యం కాదు. అందరికీ తెలియాలని భగవంతుడు సంకల్పిస్తే o.k. But by themselves they don't. ఏసుక్రీస్తు కూడా అట్లా దారిన పోతూ ఉంటే ఎవడో కోటు పట్టుకుని లాగాడు. చూస్తే గుడ్డివాడు. ఏమిటిరా అంటే, నువ్వు మహాత్ముడవు అని విన్నాను. అట్లా నడిచి వెళుతున్నావు. నాకు కాస్త కళ్ళివ్వవయ్యా బాబూ, అంటాడు. నవ్వి కళ్ళు

ముట్టుకుంటాడు. వెంటనే కళ్ళు వచ్చేస్తాయి. అమ్మో నువ్వు దేవుడివే, అంటాడు. "నేను దేవుడిని కాదు, దేవుడి యొక్క దూతను. నీకు కళ్ళు తెప్పించి ప్రపంచానికి ఇంతటి వాడిని అని చెప్పాలని దైవసంకల్పం కాబట్టి, ఆయన ముచ్చటకి కళ్ళు ఇచ్చాడు తప్ప, నేను ఇవ్వగలవాడను కాదు," అని చెబుతాడు. మనం మందు వేస్తే ఎవరికన్నా పొరపాటున తగ్గింది అనుకోండి, మనకి doubt వస్తుంది, మనమేమన్నా మంచి homeopath అని. కాదు. By chance తగ్గింది. Fluke గా తగ్గిపోతాయి. కొన్ని వేయకపోయినా తగ్గిపోతాయి. ఆ time లో మనం వేస్తూ ఉంటాం. ఇక్కడ గుడ్డివాడికి ముట్టుకోగానే కళ్ళు వచ్చినా కూడా అప్పుడు ఏమనుకోవాలి. నువ్వు మహాత్ముడవు. సాక్షాత్తూ భగవంతుడివి అంటే నవ్వి, ఇప్పటికైనా గుర్తించావు అని వాళ్ళను వీళ్ళను కూడా చూడాలి. Paper లో వేయించుకోవడం, కాస్త నలుగురికీ చెప్పండి రా మీ దుంప తెగా, ఇంత పని జరిగింది కదా నలుగురికి చెప్పొచ్చు కదా! అనుకోడం ఉంటుంది. కానీ ఇక్కడ చెప్పమని అడిగే దరిద్రమే లేదు. ఏమంటాడంటే ఆయన, చాలా బాగుంటుంది ఆ sentence చదువుకుంటే. 'The father in the heaven wanted to glorify the son.' అంటాడు. అసలా భావనే చాలు! 'నాదేమీ లేదు' అంటాడు. అనగలమా? అనగలిగాడు కాబట్టి ఇప్పటికీ దండం పెట్టుకుంటున్నారు మానవులు. భూమి మీద 80% దండం పెట్టుకునేది ఆయనకే! పెద్ద పార్టీ. Absolute majority. అట్లా నేర్పాడు. తను పూర్ణత్వం పొందాడు కాబట్టి తన నుండి పూర్ణత్వం పొందిన వాళ్లు ఈ భూమి మీద ఈనాడు ఒక లక్షా 44 వేల మంది ఉన్నారు. ఒకళ్ళు ఇద్దరు కాదు సుమా. In a matter of 2000 years. అంటే ఎంత మంది అయ్యారండి సంవత్సరానికి? 72 మంది అయ్యారు. 72 చాలా important number. 72 అంటే six times twelve. 72 మహా కల్పాలు పరిపాలిస్తాడు ఒక మనువు. 72 realized souls per year తయారు చేస్తున్నాడండి ఆయన. నెలకు ఎంత మంది? ఆరుగురు. ఒక నెలకు ఆరుగురు చొప్పున మహాత్ములు తయారవుతుంటే అంతకన్నా ఏం కావాలి? ఎట్లా తయారవుతున్నారు? ఎందుకంటే అటువంటి fulfillment అక్కడ ఉంది కాబట్టి. అటువంటి పరిపూర్ణత్వం అక్కడ ఉంది కాబట్టి. అందుకనే 'పరిపూర్ణ మానవుడు' అని చెబుతుంటారు క్రీస్తు గురించి. మనం భూమి మీద విషయం చెప్పుకుంటే గాని పైన విషయాలు, ఊర్ధ్వ విషయాలు అర్థం కావు. విశ్వకర్మ ఇటువంటి భూముల గుంపులు ఎన్నింటినో లెక్కలేనన్నింటిని,

సూర్యమండలాల్ని ఇట్లా full గా నింపుతుంటాడు. గోళాలు గోళాలుగా, గోళీ కాయలల్లే తయారు చేస్తుంటాడు. మట్టితో ఓ గోళీకాయల్లే చేసి పడేస్తే అక్కడ ఒక మండలం వచ్చేస్తుంది. ఏ మండలం ఎక్కడ ఉండాలో plan ప్రకారం వచ్చేస్తుంది. వాటిల్లో జీవులు, వాళ్లకు మళ్ళీ వాళ్ళే పుట్టేటట్లునూ. భూమి లోంచి భూమి పుట్టేటట్లు. ఒక గోళం అదృశ్యమైతే మరో గోళం వచ్చేస్తుంది. మనుషులు అదృశ్యము అయిపోయేలోగా మనుషులు వచ్చేస్తుంటారు. మొత్తం ఈ 84 లక్షల జీవరాసులలో ఏదీ, ఎక్కడా, ఎప్పుడూ అయిపోకుండా చూసుకుంటున్నాడండీ. అది ఆయిన architecture. దాని మీద మీరు ధ్యానం చేయండి. అది విశ్వకర్మ అంటే. విశ్వకర్మగా భగవంతుడు దిగి రావడం. అప్రమేయము అయిన స్థితినుంచి ఒక కేంద్రం ఏర్పడి, సృష్టిలో ఏర్పడిన కేంద్రాన్ని హృషీకేశుడు అంటే ఆ ఏర్పడిన కేంద్రం నుంచి మరియొక కేంద్రం ఏర్పడి ఆ కేంద్రం నుంచి సృష్టి విచ్చుకుంటే ఆ రెండో కేంద్రాన్ని పద్మనాభుడు అని అంటారు. పద్మనాభుడు అనే కేంద్రం నుంచి సృష్టి విచ్చుకోవడం మొదలైన తర్వాత విశ్వకర్మ అంటే, రూపం తయారవటం అక్కడినుండి ఏర్పడుతుంటుంది. ఈ హృషీకేశుడు, పద్మనాభుడు ఉత్తర దక్షిణ ధ్రువాలు గా ఊర్ధ్వలోకాల్లో పని చేస్తుంటే అక్కడి నుంచి మనం ఎరిగిన భువర్లోకమంతా విశ్వకర్మ తయారు చేస్తాడు. భూలోకానికి వచ్చేసరికి మనువు తయారు చేస్తాడు. అంటే విచ్చుకోవడం లో కూడా స్థితులు ఉన్నాయన్న మాట. హృషీకేశం అనే కేంద్రం మొత్తం సృష్టిని అంతా ధరించే కేంద్రం. దాన్ని మనలో హృదయ కేంద్రం అంటాం. అక్కడినుంచి వ్యక్తమైన కేంద్రం మనలో నాభి కేంద్రం. దాన్ని పద్మనాభుడు అంటారు. నాభి కేంద్రంగా విశ్వకర్మ తయారు చేసే సమస్తలోకాలు కూడా భువర్లోకాలు. అంటే ఇంగ్లీషులో చెప్పాలంటే The world of phenomenon. అంటే శక్తిమయమయిన లోకాలు అక్కడ సృష్టి చేయబడతాయి. అక్కడి నుంచి మనం ఎరిగిన ఈ భౌతికమైన లోకాలన్నీ కూడా మనువు ద్వారా తయారు చేయబడతాయి. అందుకని మొదటి దేవుడు హృషీకేశుడయితే, రెండవ దేవుడు పద్మనాభుడయితే, తరువాత విశ్వకర్మ. విశ్వకర్మ రూపాలు సూక్ష్మ లోకాల్లో తయారు చేస్తుంటే, మనువు స్థూలమైన లోకాలు తయారుచేస్తూ పని చేస్తూ ఉంటారు అన్నమాట. మనువులు 14 మంది మనువులు అని మనకు చెబుతారు. ఈ 14 మంది మనవుల తత్వము మన భూమికి 14 తిథులు గా వస్తుంటుంది. పాడ్యమి నుంచి చతుర్దశి వరకు వచ్చే ఒక్కొక్క తిథికి

ఒక్కొక్క మనువు అధిపతి అన్నమాట. మళ్ళీ అట్లాగే శుక్లపక్షం, కృష్ణపక్షం. రెండు పక్షాలలో ఉండే 14 తిథులకు 14 మనువులు ఉన్నారు అని చెబుతారు. అందుకని 28 తిధులు. పౌర్ణమి, అమావాస్య. 14 జంటలు అన్నమాట. 14 జంటలు కూడా ఇంకొంచెం సూక్ష్మంగా ఆలోచిస్తే 7 జంటలు. 7, 14 అవుతుంది. 14, 28 అవుతుంది. ఈ 7 జంటలుగా ఉండే మనువుల యొక్క కార్యక్రమాన్ని మనకి వారానికి ఏడు రోజులు గా ఇవ్వడం జరిగింది. ఈ 7 తిథులు అయిన తర్వాత అష్టమి వస్తుంది. అది ఒక junction. మళ్లీ 7 తిధులు అయిన తర్వాత పౌర్ణమి వస్తుంది. అది ఒక junction. మళ్లీ 7 తిధులు అయిన తర్వాత అష్టమి వస్తుంది. అది ఒక junction. మళ్లీ ఏడు తిధులు అయిన తర్వాత అమావాస్య వస్తుంది. అది ఒక junction. ఇట్లా 4 junctions తీసేస్తే మిగిలేవి 4×7 అన్నమాట 28. 7 గురు జంటలుగా మనువుల్ని చెబుతారు. 14 మనువుల్ని. మనువులు కృష్ణ పక్షాన్ని, శుక్లపక్షాన్ని తయారుచేసి ఇస్తుంటారు.

# 55. త్వష్ట

విశ్వకర్మ రూపాన్ని ఇస్తే, మనువు ఆ రూపాలు ఆధారంగా blueprint తీస్తుంటాడు అన్నమాట. విశ్వకర్మ architect. Architect ఏం చేస్తాడు అంటే ఇట్లా ఉంది, ఇట్లా ఉంది అని చూపిస్తుంటాడు. దీనికి blue print తయారు చేసే వాడు మనువు. మనువు blue print తయారు చేస్తే దాన్ని construct చేసే engineer త్వష్ట.

"అద్భ్య స్సంభూతః పృథివ్యై రసాచ్చ విశ్వకర్మణ
స్సమవర్తతాధి తస్య త్వష్టా విదధ ద్రూపమేతి"'

అని చెప్పి మనం పురుష సూక్తం లో చదువుకుంటూ ఉంటాం. పృథ్వి, జలము ఈ రెండింటినీ తీసుకుని తయారు చేసే ఈ సృష్టిని మనువు తయారు చేస్తూ ఉంటాడు. దానికి త్వష్ట అధిపతి అన్నమాట. త్వష్ట అంటే engineer. Engineer ఏం చేస్తాడు? ఇసుక, సిమెంటు, నీరు కలిపి కదా కడతాడు. ఆ విధంగా construct చేసే intelligence ని సృష్టిలో 'త్వష్ట' అంటారు. విశ్వకర్మ, మనుః, త్వష్ట, స్థవిష్టః అంటే ఇట్లా construct చేసుకొంస్తూ ఉంటే ఈ మొత్తంలో stable గా ఉండే ప్రజ్ఞగా భగవంతుడే వస్తుంటాడు. భగవంతుడే అప్రమేయుడుగా ఉండేవాడు హృషీకేశుడై, హృషీకేశుడిగా ఉండేవాడు పద్మనాభుడై, పద్మనాభుడు గా ఉన్న భగవంతుడు విశ్వకర్మయై, విశ్వకర్మ అయిన భగవంతుడు మనువై, మనువు అయిన తరువాత త్వష్టయై-- ఇలా భగవంతుడు వీళ్లందరి లో నుంచి దిగి వస్తున్నాడు కాబట్టి ఈ భూమి ఏర్పడుతున్నప్పుడు ఇందులో తాను స్థిరంగా ఉండి, తను ఉంచుతాడు ఈ భూమిని భూమిగా! అది మన వరాహావతారం కథ! వరాహవతారం మనకు ఏం చెబుతుంది? హిరణ్యాక్షుడు అనే వాడు ఈ భూగోళాలు అంటే ఈ భూమికి సంబంధించిన గోళాలే కాదు, ఏ గోళమైనా సరే మనకు రకరకాల గ్రహ గోళాలు ఉన్నాయి కదా! ఈ గ్రహ గోళాలు తయారయ్యే సమయాల్లో తయారు కాకుండా పనిచేస్తుంటాడు. ఎక్కడన్నా గోళం తయారవుతుంటే ఎందుకని అడుగుతాడు. ఇప్పుడు బాగానే ఉంది కదా. ఎందుకని? ఊరికే సరదాకి అంటే 'నేను ఒప్పుకోను' అంటాడు. మొత్తం ఈ సృష్టి అంతా కూడా భగవంతుడిని హుతం చేస్తే ఏర్పడుతుందని, 'తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః' అని చెప్తారు పురుష సూక్తం లో.

'అబధ్నన్ పురుషమ్ పశుమ్' ఆ పురుషుణ్ణి పశువుగా బంధించి, 'దేవా యద్యజ్ఞం తన్వానా' యజ్ఞాన్ని చేస్తారన్నమాట. అంటే భగవంతుణ్ణి పెట్టుబడిగా పెట్టి, ఆయన నుంచి పీకుతుంటే ఇవన్నీ వస్తాయన్నమాట. ఇవి చేయడం అంటే ఈ సృష్టి కర్మ అనే దాంట్లో కొంత సృష్టి ధర్మాలకు లోబడి పని చేయాల్సి వస్తుంటుంది దేవతలందరూ కూడా. మనం ఈ విష్ణు సహస్రనామం కార్యక్రమం పెట్టుకున్నాం. ఈ కార్యక్రమం అనుకున్న ప్రకారం నడవాలంటే మనం శనివారం సాయంత్రం పణం పెట్టాల్సిందే కదా! సగం దూరం వచ్చిన తరువాత అనవసరంగా పెట్టుకున్నామేమో అనిపిస్తుంటుంది. ఏ పని అయినా స్వతంత్రంగా ఉన్న వాళ్ళం, సరదాకి మనకిగా మనం మొదలు పెట్టిన తరువాత, ఇదంతా అనవసరంగా పెట్టుకున్నాం అనిపిస్తుంది. కానీ అప్పుడు అనుకుని లాభం లేదు, ముందు అనుకోవాలి. Cricket match ఆడదామనుకుని మంచి cricket players అందరినీ పోగేసి తయారు చేసిన తర్వాత, తీరా మనం bat చేయడానికి వచ్చినప్పుడు అవతలివైపు నుంచి fast bowler ఉన్నాడు అనుకోండి. మంచి bouncers వేస్తున్నాడు అనుకోండి, 'అనవసరంగా పెట్టుకున్నాము' అని అప్పుడు అనుకుంటే లాభం లేదుగా. సంకల్పం already జరిగిపోయింది కాబట్టి, ఇంక ఇప్పుడు నువ్వు చేసేది ఏం లేదు,

Co-operate చేయడం తప్ప. లేకపోతే ఏడవాలి కూర్చుని. ఏడ్చినా ఆగదు అది, ఎందుకంటే సంకల్పం అయిపోయింది కదా. అట్లాగే ఏదో మొదలు చేద్దామని పెడతాం, సగం దూరం వచ్చిన తరువాత సహజంగా ఇట్లాంటి భావాలు వస్తుంటాయి. ఏమిటిదంతా కొంచెం అనవసరంగా పెట్టుకున్నాంరా భగవంతుడా! ఇది లేకపోతేనే హాయిగా ఉండేవాళ్లం, అనేది మనకెట్లా ఏర్పడుతుందో, అట్లాగే సృష్టి శక్తులకు కూడా అనిపిస్తుంది. ముందు బ్రహ్మ సృష్టి చేసినప్పుడు, 'ఎందుకండీ ఇదంతా చాలా కష్టమైన కార్యక్రమం మళ్ళీ పెడుతున్నారు' అంటాడు. అంటే, 'సరదాకి ఆడుకుందామని' అంటాడు భగవంతుడు. సరదాకి ఆడుకుంటున్నప్పుడు కొంతమంది ఈయనలో నుంచి పుట్టుకు వస్తారు (సనక సనందనాదులు). పుట్టుకు వచ్చి, ఎందుకు ఇదంతా అంటే, సరదాకని ఆయన అంటున్నాడు అంటే, ఆయనతో direct గా మాట్లాడుతాం అంటారు. మొదలుపెట్టినప్పుడు సరదాగా ఉన్నది, కొంతదూరం వెళ్ళినప్పుడు సరదాగా ఉండవు. ఎందుకని? We have volunteered to surrender ourselves to a particular methodology or rules and regulations. కొన్ని నియమాలకు, నిబంధనలకు మనకిగా మనం

సమర్పణ చేసుకున్నాం. చేసుకోమని ఎవరూ అడగలేదు. చేసుకున్న తరువాత ఇది ఆనందం కోసం అని గుర్తు లేకపోతే బాధ వస్తుంది. హిరణ్యాక్షుడు అటువంటి వాడే. హాయిగా ఉన్నాం కదా! ఇవన్నీ బంతులు బంతులు గా ఎందుకు చేయాలి? ఇందులో మనం ఎందుకు ఇరుక్కోవాలి అన్నది వాడి point. అందుకని ఎవరన్నా బంతులు తయారు చేస్తుంటే ఆ బంతులను ధ్వంసం చేస్తూ ఉంటాడు. బంతులు ధ్వంసం చేయడానికి వీలు లేదు నాయనా! నువ్వు ఈ మాట చాలా ముందు చెప్పాలి. Process మొదలు అయిపోయింది, సువర్లోకం, భువర్లోకం తయారైపోయి భూలోకం తయారయ్యే time లో నువ్వు వచ్చి ఇదంతా ఇప్పుడు ఎందుకంటే? ఆట సగం అయిపోయిన తరువాత మధ్యలో ఎవడో ప్రేక్షకుడు వచ్చి ఇదంతా ఎందుకు అని అడిగితే, meaning less కదా! మొదలుపెట్టక ముందు ఆలోచించాలి. మొదలు పెట్టిన తరువాత ఊరికే దాని గురించి పది సార్లు వెనక్కి ముందుకు లాగీ--, లాగినా ఏమీ అవదు. ఓడ ఎక్కనే కూడదు తప్ప, ఎక్కి బయలుదేరిన తరువాత అలలు వస్తున్నాయి, కడుపు నొప్పి వస్తోంది అంటే ఏం లాభం లేదక్కడ. అట్లా కొట్టుకుపోతూ ఉండటమే. ఏడుస్తున్నా వెళ్లాలి, నవ్వుతున్నా వెళ్లాలి, అవతల ఒడ్డు ఓడ చేరేంతవరకు తప్పదు. కాబట్టి Already కొన్ని నియమ నిబంధనలతో తయారవుతున్న సృష్టి లోనికి నువ్వు దూరిన తర్వాత దాంట్లో ఉన్న నిబంధనలు పాటించినంతసేపు నీకు హాయిగా ఉంటుంది. పాటించకుండా ప్రశ్నలు వేసుకున్నంతసేపు నువ్వు బాధపడి పోవాల్సి వస్తుంది తప్ప, మొత్తం విషయం మారదు. అట్లా lifeలో మనకు చాలా ఉంటాయి. మొదలు పెట్టిన తరువాత ఇంక ఈ ఆలోచన రాకూడదు. ఆ ఆలోచన రావడమే హిరణ్యాక్ష తత్వం అన్నమాట. విశ్వకర్మ భువర్లోకాలన్నీ రూపాలు ఏర్పరుస్తూ ఉంటాడు. In the subtle plane the forms are made. Subtle plane లో forms ఏర్పడిన తరువాత gross planeలో రావటం automatic. అప్పుడు అడ్డం పడితే లాభం లేదు కదా. మనకి already ఒక భావం వచ్చింది. దానికి భాష ఏర్పడిపోయింది. కాసేపు ఇక్కడ గొంతు పిసుక్కు కూర్చున్నా, ఇంకో చోట అయినా వచ్చేస్తుంది బయటికి. మనం ఇప్పుడు వద్దులే ఈ మాట అంటే అంత బాగోదు అనిపించినా, ఆ మాట అనేంతవరకు తోచదు. ఎవరినన్నా ఏదన్నా మాట అనాలి అనిపిస్తే, అనిపించనే కూడదు కానీ, అనిపించిన తరువాత అనకుండా ఉండటం అన్నది కష్టం. విశ్వకర్మ రూపాలనిస్తే, వాటి ఆధారంగా మనువు అస్తిపంజరాలు లేక blueprints తీస్తూ

ఉంటాడు. విశ్వకర్మ architect ఇట్లా ఉంటుంది, ఇట్లా ఉంటుంది అని చూపిస్తాడు. అప్పుడు మనువు వాటి blueprints తీస్తాడు. వాటి ప్రకారం construction చేసే engineer త్వష్ట. పృథ్వి, జలము కలిపి సృష్టి మనువు తయారు చేస్తుంటాడు, దానికి త్వష్ట అధిపతి. Engineer గా ఉండి constrution చేసే ప్రజ్ఞ లన్నిటిని త్వష్ట అంటారు.

# 56. స్థవిష్ఠ

ఈ constrution జరిగిన మొత్తంలోకి భగవంతుడే stableగా ఉండే ప్రజ్ఞగా వస్తుంటాడు. అదీ స్థవిష్ఠ. అంటే భగవంతుని ప్రజ్ఞ స్థిరంగా దిగి వస్తుంది. అప్రమేయుడుగా ఉన్న భగవంతుడు హృషీకేశుడుగా, హృషీకేశుడు అయిన భగవంతుడు పద్మనాభుడుగా, పద్మనాభుడు అయిన భగవంతుడు అమర ప్రభువుగా, అమరప్రభువు అయిన భగవంతుడు విశ్వకర్మగా, విశ్వకర్మ అయిన భగవంతుడు మనువుగా, మనువు అయిన భగవంతుడు త్వష్టగా, త్వష్ట అయిన భగవంతుడు స్థవిష్టుడుగా దిగి వస్తాడు. భూమి ఏర్పడుతున్నప్పుడు తాను స్థిరంగా ఉండి, భూమిని భూమిగా స్థిరంగా ఉంచుతాడు. ఇదే వరాహావతారం కథ. మనలో సగం పనిచేశాక చేద్దామా? వద్దా? అని ఆలోచించే తత్వము పోవాలంటే వరాహావతారం చదువుకోవాలి. వరాహం భూమి పరిపూర్ణంగా తయారవ్వడానికి, స్థిరంగా నిలబడడానికి ఎలా వీలు కలిగించిందో, అలాగే మనలో సంకల్పాలు అమలు పరుస్తున్నప్పుడు సగంలో మనకి అవసరమా అనే ఆలోచనలు కలిగినప్పుడు వరాహావతారం కథ చదివితే మన సంకల్పాలు సంపూర్ణంగా అమలు జరిగి, జీవితాలు సాఫీగా జరుగుతాయి. ఈ త్వష్ట తయారు చేసేదానికి ఈ భూమి మొత్తంలో తానే స్థిరంగా ఉంటాడు. అదీ స్తవిష్టః. తయారు చేసిన దానిలో తిష్ట వేసుకు కూర్చుంటాడన్నమాట.

## 57. స్థవిరః

అన్నిట్లోను, అందరిలోను తిష్టవేసుకుని ఉన్నవాడు ఎవరయ్యా అంటే అందరికన్నా ముసలి వాడుట. అంటే అందరికన్నా పెద్దవాడని. అందరూ పుట్టక ముందు నుండి ఉన్నవాడు. అప్రమేయుడనే వాడు ఎప్పుడూ ఉంటాడు. అక్కడి నుండి హృషీకేశుడనే కేంద్రం ఏర్పడుతుంది. అందులో ఈయనే దూరి పద్మనాభుడ్ని చేస్తాడు. ఆయనలో నుండి దూరి అమరప్రభువు అయ్యి, ఆయనలో నుండి దూరి, విశ్వకర్మ గా అక్కడ నుండి తానే మనువుగా, తానే త్వష్ట గా, తానే స్థవిష్టుడుగా స్థిర పడతాడు. అలా వీళ్ళందరిగా తానే స్థిరపడతాడు. వీళ్లు ఎనిమిది మంది. ఈ 8వ వాడు ఏడు స్థితుల నుండి దిగివచ్చి తనే స్థిరంగా ఉంటాడు. 'అప్రమేయః,హృషీకేశః, పద్మనాభః, అమర ప్రభుః, విశ్వకర్మ, మనుః, త్వష్టః, స్థవిష్ఠ' ఈ నామాలు పొడిపొడిగా ఉన్న పదాలు కావు. ప్రతి దానిలో నుంచి గొలుసుకట్టు భావం ఉండేలా వేదవ్యాసుడు ఇచ్చాడు వీటిని.

## 58. ధ్రువః

స్థవిష్టుడై, స్థవిరుడై భూగోళం తయారవడానికి అడ్డు తొలగించి స్థిరంగా చేసినవాడు అతడే. గుడ్డ లోని disign చూసి, పత్తిని మరిచిపోతాం మనం. అలా కాకుండా మొదటి వాడిని మరిచిపోకుండా ఉండేలా నామాలను ఇచ్చారు. అతడు ఇలా వచ్చి ధ్రువముగా ఏర్పడుతాడు. ఆ ధ్రువం ఆధారంగా మళ్ళీ ఇవన్నీ తయారవుతాయి. మొత్తం వీటన్నిటికీ time cycle ఉంది. మనం వైవస్వత మన్వంతరంలో ఉన్నాము. ఈ సృష్టిని 'శ్వేతవరాహకల్పం' అంటారు. శ్వేతవరాహం ఈ సృష్టిని కాపాడుతూ ఉంటుంది. మనలో వెలుగు శరీరం ఎట్లా ఉన్నదో, మొత్తం సృష్టికి అంతా కూడా అటువంటి వెలుగు శరీరం ఒకటి ఉన్నది. దానిగా ఉన్న భగవంతుడిని 'శ్వేతవరాహం' అంటాం. ఆ శ్వేతవరాహకల్పంలో, వైవస్వత మన్వంతరంలో మనము ఉన్నాము. ఒక్కొక్క మనువుకి ఒక్కొక్క తిథి. దాని లెక్క ఎలా ఉంటుందో చూద్దాం:

4,32,000 మానవ సంవత్సరాలు ఒక కలియుగం గా ఏర్పడుతుంది. కలి అంటే సంస్కృతంలో ఒక  అర్ధం 1 unit అని అర్థం.

2*4,32,000-- ద్వాపర యుగం (ద్వా అంటే రెండు అని అర్థం) two times కలియుగము

3*4,32,000---త్రేతాయుగం ( త్రి అంటే 3 అని అర్థం)three times కలియుగం

4*4,32,000 ---కృతయుగం (కృత అంటే నాలుగు అని అర్థం) four times కలియుగం

ఈ నాలుగు యుగాలూ కలిపితే 10 times కలియుగమవుతుంది. 4+3 +2 +1 = 10. ఈ మొత్తాన్ని ఒక మహాయుగం అంటారు. ఇలాంటి 72 మహాయుగాలు ఒక మన్వంతరం అంటారు. ఇటువంటి 14 మన్వంతరాలు బ్రహ్మకు ఒక పగలు. One day. మరొక 14 మన్వంతరాలు బ్రహ్మకు ఒక రాత్రి. One night. ఇటువంటి 365 రోజులు ఒక బ్రహ్మ సంవత్సరం. అటువంటి 100 సంవత్సరాల తర్వాత బ్రహ్మ మారుతాడు. ఒక మనువు కాలంలో ఏడు తరాల మానవ జాతులు వచ్చి వెళ్ళిపోతాయి. అటువంటి ఏడుగురు మనువుల కాలంలో 49 తరాలు వచ్చి వెళ్లిపోతాయి. మానవులు ఒక తరం రావటానికి ఒక మనువు అధిపతి అయితే, ఆ

తరం మళ్ళీ తిరిగి వెళ్ళిపోవడానికి ఇంకొక మనువు అధిపతిగా ఉంటాడు. 14 మంది మనువులూ అధిపతులు అయినా ఒక మనువు పట్టుకుని వస్తాడు, ఆ మనువుకు counter part పట్టుకెళ్ళి పోతూంటాడు. ఒక పగలు ఒక రాత్రి కలిసి కదా, ఒక రోజు. ఒక్కొక్క మనువు జాతిని అలా పట్టుకు వస్తారు. ఇప్పుడు మనది Aryan race. అంతకుముందు Atlantian race ఉండేది. దానికి ముందు Lemorian race ఉండేది. కృతయుగం నుండి లెక్క వేసుకుంటే ప్రస్తుతం మనం ఆరవ తరం మానవజాతి. ఏడు తరాలు అయిన తర్వాత, ఒక మనువు వెళ్ళి మరో మనువు వచ్చి కూర్చుంటాడు. మనకు ఇంతకు ముందు రైవత మనువు, చాక్షుష మనువు ఉన్నారు. చాక్షుష మనువు కాలంలో మనుషులందరికీ కూడా మూడవకన్ను కనిపిస్తూ ఉండేది. అందుకని ఆయనను 'చాక్షుష' అని చెప్పారు. అంటే చక్షువులు ఉండే మానవులను తయారు చేస్తూ ఉండేవారు. ఒక్కొక్క మనువు ఒక్కొక్క model of human body తయారు చేస్తాడు. రైవత మనువు కాలంలో చాలా పెద్ద పెద్ద మానవులు ఉండేవారు. రేవతి రైవత మనువు కుమార్తె. ఆమె చాలా abnormal size లో ఉండేది. ఆవిడకు సరైన భర్త ఎవరో కనుక్కొద్దామని ఆ రైవత మనువు బ్రహ్మలోకానికి వెళ్లారు. బ్రహ్మలోకంలో time కి, మనువు లోకంలోని time కి చాలా తేడా ఉంటుంది. ఇక్కడ ఒక సంవత్సరం గడిస్తే అది ఒక్క క్షణం బ్రహ్మలోకంలో. సరే అక్కడ బ్రహ్మగారు సంగీతం వింటూ ఉంటాడు. Program అయ్యాక మాట్లాడదామని ఈయన wait చేసి, ఆయన కనులు తెరిచాక, మా అమ్మాయికి మంచి వరుడు ఎవరో సలహా ఇవ్వండి అంటే ఆయన "అదేమిటీ ఇప్పుడు భూలోకంలో మన్వంతరం మారిపోయింది, ఇంకొక మనువు వచ్చేశాడు కూడా. ఇప్పుడు వచ్చిన మానవులలో మీ అమ్మాయికి తగిన వరుడు ఉండడు" అంటాడు. మరెట్లా అంటే, "ఉన్నవాళ్ళల్లో మీ అమ్మాయికి తగిన వరుడు బలరాముడు మాత్రమే. ఆయనకి ఇచ్చి పెళ్లి చేయండి" అని చెబుతాడు. రేవతీదేవి బలరాముడు కన్నా కొంచెం పొడవుగా ఉంటుంది. కాకపోతే బలరాముడు చాలా బలవంతుడు. అందుకని పెళ్లి చేస్తారు. ఇట్లా మనకు కథ ఉంది. ఒక్కొక్క మనువు ఒక్కొక్క మన్వంతరాన్ని పరిపాలిస్తున్నప్పుడు అతని దగ్గర నుండి ఏడు తరంగాల మానవ జాతులు వచ్చి వెళుతూ ఉంటారు. ఒక తరంగం వచ్చి వాళ్ళు వెళ్ళిపోయి, ఇంకొక తరంగం వచ్చి, వాళ్ళు వెళ్ళిపోయి అలా జరుగుతూ ఉంటుంది. మన మెరిగిన అర్జునుడు, భీముడు ఆ time లో ఉన్న వాళ్లంతా 5 వ తరంగం

మానవజాతి. ఇప్పుడున్న మానవజాతి అంతా ఆరవ తరంగం మానవజాతి. మనకు ఉన్న మనువు ఆరవ మనువు. జంటలుగా మనువులు పని చేస్తూ ఉంటారు. ఒక్కొక్క మనువు కాలంలోనూ ఏడు తరంగాల మానవ జాతులు వచ్చి వెళుతూ ఉంటాయి. ఈ ఏడు తరంగాల మానవ జాతులు 7 తరంగాలుగా వచ్చే గోళాల మీదుగా నడిచి వెళ్ళి పోతూ ఉంటారు. అదీ తమాషా! బ్రహ్మకు 100 సంవత్సరాల కాలపరిమితి. అది అయ్యే వరకు ఆయన seat కదలక్కర్లేదు. ఆ seat లో ఆయనే ఉంటారు. మన బ్రహ్మకి (ఆరవ బ్రహ్మ ) 51 వ సంవత్సరం బ్రహ్మత్వం. ఇంకా 49 సంవత్సరాలు ఆయనకి service ఉంది. అంటే సగం పని పూర్తయింది అన్నమాట, ఇంకా సగం పని ఉంది. అంటే ఇక్కడి నుంచి తిరోగమనం ఉంటుంది. ఆయనకి తిరోగమనం ఉంది కాబట్టే మొత్తం సృష్టికి కూడా తిరోగమనం అయ్యే కార్యక్రమాలు మొదలు పెట్టాలి. అంటే భగవంతుడిలో ఐక్యమయ్యే కార్యక్రమాలు మొదలు పెట్టాలి. ఆయనకు 49 సంవత్సరాలు అంటే మనకు కొన్ని కోట్ల సంవత్సరాలు అయిపోతుంది. ఇవన్నీ నడుస్తూ ఉంటే ఈలోగా మానవజాతి తరంగాలు, తరంగాలుగా వచ్చి వెళుతూ ఉంటారు. ఒక్కొక్క మనువు దగ్గర ఏడు తరంగాలు వెళుతున్నప్పుడు ఏడుగురు మనువులు దగ్గర 49 తరంగాలు వెళ్తాయి. అందుకే 49 కి importance ఉంది. ఇక్కడుండే అంకెలు అన్నింటికీ importance ఉంది. 49 కు, 72 కు, 7 కు importance ఉంది. పైన 4,32,000 సున్నాలు పెట్టాం కదా! అవి symbolic. 432 సంవత్సరాలకు చిన్న cycle ఒకటి అవుతుంది. ఒక చిన్న చక్రం తిరుగుతూ ఉంటుంది. ఒక పెద్ద చక్రం లో చిన్న చక్రాలు తిరుగుతుంటాయి కదా. మనకు వారానికి ఒకసారి శనివారం వస్తుంది. ఆరోజు శని ప్రజ్ఞ చాలా ఎక్కువగా ఉంటుంది భూమిమీద. అంతమాత్రం చేత రోజూ రాదా అంటే, ప్రతి రోజు వస్తుంది, మూడు సార్లు గంట గంట చొప్పున. ప్రతి ఏడు గంటలకు ఒక గంట శనిది. మిగతా వారాల్లో మూడు గంటలు అంటే 180 నిమిషాలు ఉండే శని, శనివారం నాడు ఎక్కువగా ఉంటాడు. మొత్తం 24 గంటలు presidingగా ఆయన ఉంటే, ఆయనలో మళ్ళీ సోముడు, మంగళుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, ఆదిత్యుడు తిరుగుతుంటారు. ఆయన పెద్ద cycle, వాళ్ళు చిన్న cycle గా తిరుగుతూ ఉంటారు. అదే మన హోరా శాస్త్రం. హోరాశాస్త్రంలో ఇప్పుడు ఏమి నడుస్తోందంటే అంటే చంద్ర హోర నడుస్తోంది అంటారు. అంటే ఈ రోజుకు శని పెద్ద చట్రం అయితే చిన్న చట్రంలో చంద్రుడు ఒక గంట నడుస్తూ ఉంటాడు. ఓ గంట

అయ్యాక శని లో శని వస్తాడు, రాత్రి 8, 8.30కి. అప్పుడు శని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నమాట. ఆ timeలో discussions పెట్టుకోకూడదు. పెట్టుకుంటే అది తిట్టుకోడం, కొట్టుకోడం వరకు వెళ్ళిపోతుంది. Weaknessess బయటకి వస్తుంటాయి. అలాగే ఎంత శనివారమైనా గురుహోర వస్తుంది. శని హోర తర్వాత గురుహోర వస్తుంది, ఓ గంట తర్వాత. అదే గురువారం గురుహోర వస్తే విపరీతమైన గురుతత్వం ఉంటుందన్నమాట. పెద్ద cycle లో, చిన్న cycles లో ఈ యుగాలన్నీ repeat అవుతుంటాయి. 4 లక్షల 32 వేల సంవత్సరాలు కలియుగం అన్నప్పుడు మనం ప్రస్తుతం ఎక్కడున్నామ్? మనం కలియుగంలో దాదాపు 5000 సంవత్సరం లో ఉన్నాం. శ్రీకృష్ణుని దేహం వదలడమే కలి ప్రవేశించాడు. ఇంత కలియుగంలోనూ 4 యుగాలూ repeat అవుతుంటాయి. ఎంత శనివారమైనా అందులో గురుడొస్తాడు కదా, అలాగే! అలాగే ఇంత కలియుగంలోనూ 432 ఒక చిన్న cycle. 4320 దానికన్నా పెద్ద cycle. 4,320 సంవత్సరాలు తర్వాత కృష్ణుడు వెళ్ళాక, కృతయుగానికి కావలసిన పునాదులు పడుతున్నాయి. అంటే కలియుగంలో పెద్ద cycle లో ఒక కృతయుగం cycle రావడానికి base workout అవుతోంది. 4,320 సంవత్సరాలు తీసుకుంటే అందులో మేష రాశి చైతన్యం 2160 సంవత్సరాలు జరిగింది. అక్కడ నుండి 2,160 సంవత్సరాలు మీన యుగం జరిగింది. అక్కడ నుండి ఇప్పుడు కుంభ యుగం 2,160 సంవత్సరాలు జరుగుతుంది. భూమి తన చుట్టు తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఇలా తిరుగుతున్నప్పుడు భూమి ఇరుసు, ప్రతి 72 సంవత్సరముల కి 1 degree చొప్పున anticlockwise direction లో తిరుగుతూ ఉంటుంది. అంటే 72 ఏళ్ళ axis మారుతుంది. అట్లా 30 degree లు మారితే ఒక రాశి మారుతుంది. ఒక్కొక్క రాశిలో సూర్యుడు 30 రోజులు ఉంటాడు. 12 నెలలో 360° cycle complete చేస్తాడు. భూమి ఇరుసు 1°మారడానికి 72 సంవత్సరాలు పడుతుంది. అలా 30°జరగాలంటే 72×30=2160 ఏళ్ళు పడుతుంది. అది ఒక రాశి నుంచి ఇంకొక రాశిలోకి మారడానికి పట్టే time. వాటిని మేష యుగం, మీన యుగం అంటారు. భూమి యొక్క axis మారినప్పుడు equater కూడా మారుతుంది. దానివలన భూమి కొంతభాగం నీటిలోనికి పోవడం, నీటిలో ఉన్న భూమి పైకి రావడం జరుగుతూ ఉంటుంది, ఇలా ఇప్పటి వరకు ఆరు సార్లు భూమి ప్రళయాలకు లోనైంది. ఇన్ని జల ప్రళయాలు సంభవించినా, మహత్తరమైన విషయం ఏమంటే

భారత భూమి మాత్రం మొదటి నుంచి మునగకుండా ఉన్నది. కనుకనే దీని చరిత్ర అతి పురాతనమైనది. చరిత్ర కూడా చాలా ఎక్కువే. లెక్కలేని చరిత్ర ఉన్నది. మిగతా భూమి కొన్నాళ్ళు నీళ్ళ లోపలకి వెళ్ళి, బయటకి వచ్చి,అలా జరిగింది. ఇప్పుడు మళ్లీ ఇంకొక జలప్రళయం వచ్చే సమయం వచ్చింది. Axis మారుతుంటే కొంత భూమి నీటిలోకి వెళ్ళవలసి వస్తుంది, కొంత కొత్త భూమి బయటకి వస్తుంది. పురాణ కాలం timeకి Alphs పర్వతాలు లేవు. కొన్ని జలప్రళయాలలో కొంత భూమి బయటకి వచ్చి, కొంత భూమి నీటిలో కలిసిపోయింది. Atlantis, Roman నగరాలూ చాలా భూగర్భంలోకి వెళ్ళిపోయాయి. Atlantis లోని Bermuda Triangle కి magnetic power ఉన్నది, అటు ఏమి వెళ్ళినా నీటిలోనికి suck చేసేస్తుంది అంటారు కదా! శ్రీమద్రామాయణం సుందరకాండ లో సింహిక అనే రాక్షసి ఛాయాగ్రహిగా హనుమంతునికి సముద్ర జలాల లోనికి లాగడం చెప్పబడింది. వీటి చరిత్రలన్నీ Madam Blavatsky వ్రాసిన Secret Doctrine లో వివరంగా ఉన్నాయి. ఇందులో ఆమె ఈ 7 తరంగాల మానవజాతులు, భూమి axis మారడం ఇవన్నీ తెలియజేసింది. అందుకే మాస్టారు నక్షత్రాలను follow అయ్యేవారు కాదు. అశ్విని అని మన వాళ్ళు చెప్పినప్పటికి, ఇప్పటికీ భూమి axis 23 degrees మారిపోయింది. పూర్వీకులు మనకు ఇచ్చిన నక్షత్ర మండలాలు ఇప్పుడు ఆ ప్రదేశాల్లో లేవు. భూమి ఇరుసు 1°మారుతూ ఉండడం వలన వాటి స్థానాలు కూడా మారుతున్నాయి. అయినా నక్షత్ర మండలాలు చాలా దూరం ఉంటాయి. గ్రహాలు దగ్గరగా ఉంటాయి. అందుచేత వాటి వెలుగు ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే చంద్రుడు jupitar వద్దకు వస్తే, చంద్రుడు ఎక్కువ వెలుగుగా కనిపిస్తాడు. Jupitar మనకు చాలా దూరంలో ఉన్నది కనుక jupitar వెలుగు ఎక్కువగా మనకి కనిపించదు. మనం అనుకున్న నక్షత్రాలు మారిపోయాయి. ఉదాహరణకి మనవాళ్ళ లెక్క ప్రకారము మూలా నక్షత్రము ధనురాశిలో 0 degree తో మొదలవ్వాలి. మూలా నక్షత్రము చంద్రుడున్నప్పుడు ephimeries తీసి చూస్తే, అదిపోయి capricon లో కూర్చుంటుంది. ఎందుకంటే axis మారుతూంటుంది. అప్పుడు calculations తప్పులొస్తాయి. మారుతున్న axis ప్రకారమే మాస్టారు చూసి చెప్పేవారు. అందుకు మాస్టారుగారు నక్షత్రాలు చూడద్దని చెప్పారు. మనవారు దక్షప్రజాపతి కథ చెప్పిన కాలానికి, ఇప్పటికీ భూమి axis 23°తిరిగింది. మారుతూ మారుతూ ఉన్నప్పుడు కొంత నీళ్ళలోకి పోతూంటుంది, కొంత బయటకి

వస్తుంటుంది. ఇలా తిరిగినప్పుడు జల ప్రళయాలు సంభవిస్తాయి. యుగాంతం చాలా దూరం ఉన్నది. మన పాతవాళ్ళు ఇచ్చింది 23 degrees science. అక్కడకి adjustmentచేసి ఇచ్చారు. ఆ timeలో వాళ్ళు identify చేసినదానికి, మనకి మార్పు వచ్చిందన్నమాట. మనం సూర్యమానంలోనూ, చంద్రమానంలోనూ గ్రహాల పట్టికలు వేస్తే 23°తేడా వస్తుంది. అందుకని వాళ్ళు దానికి అయనాంశ లెక్కకట్టి సవరించుకుంటారు. మాస్టారు దీనికి ఒక ఉదాహరణ చెప్పారు. ఇదివరకు మన bus-stand పూర్ణా market దగ్గర ఉండేది. అది మన ఇంటికి 6 kilometers distance ఉన్నదనుకోండి. ఆ bus-stand తీసి jail దగ్గర పెట్టారు. అది మన ఇంటికి 4 kilometers distance లోనే ఉందనుకోండి. మన పండితులు ముందు 6 kilometers వేసుకొని తర్వాత 2 తీసేస్తుంటారు. ఎందుకూ directగా కొత్త bus stand దూరమే లెక్కవేయవచ్చుగా అంటారు మాస్టరుగారు! ఆ difference మనకి వీటిలో కనిపిస్తుంది. భూమి axis మారుతూ ఉంటుంది. దాన్ని వాళ్ళు అయానాంశతో adjust చేసేశారు. యుగాంతం కాదు, అది చాలా దూరం. భూమి 12 రాశులను చుట్టిరావడానికి 72×30×12= 25,920 సంవత్సరములు పడుతుంది. దీనినే The great year of the globe అంటారు. ఒక round తిరగడం కాదు అలా తిరుగుతూ ఉంటుంది. మన వాళ్ళు మేరు పర్వతం చుట్టూ సూర్యుడు తిరుగుతాడు, అని చెప్పేవారు. ఆ మేరుపర్వతం అంటే ఉత్తర ధ్రువం. తిరగటం అంటే సూర్యుడు చుట్టూ మనం తిరుగుతున్నప్పుడు ఈ మేరు పర్వతం North pole చుట్టుతా ఉంటుందన్నమాట. మనం చూసినప్పుడు అలా కనిపిస్తుంది. సూర్యుడు లేచాడు, సూర్యుడు దిగాడు అంటుంటాం కదా. మనం లేచి, దిగి సూర్యుడు లేచాడు, దిగాడు అంటుంటాం. మేరు పర్వతం అంటే హిమాలయాల్లో ఒకప్పుడు ఉత్తర ధ్రువం ఉండేది. హిమాలయాల్లో ఉండే ఉత్తరధ్రువం ఇప్పుడు Greece Land పైకి వెళ్ళిపోయింది. ఈ మార్పులన్నీ భూమి మారటం వలన వస్తూ ఉంటాయి. ఇట్లా ఈ భూమి మారుతూ వస్తూ ఉంటే దాని మీద జాతుల నడక నడిపిస్తుంటాడు మనువు. ఈ భూమి అనే platform మీద మానవజాతిని నడిపిస్తుంటాడు మనువు. Platform ఒక్కోసారి ఉండదు. ఇప్పుడు మనం నడుద్దాం అనుకుని earth కి ఒక shield పెట్టుకున్నాము. ఆ shield కి ఒక time span ఉంది. Globe కి ఒక time span ఉన్నది. మనకి ఒక time span ఉంది. మనకన్నా చాలా పెద్దది కదా globe. మొత్తం globe ఒక స్కూల్ కింద తీసుకుంటే,

ఆ స్కూల్లో చదువుకునే పిల్లలులాంటివాళ్ళు మానవజాతి. ఏడు classలు ఒక స్కూల్లో అనుకుంటే క్లాసులు అయిపోయిన తర్వాత ఏడోక్లాసు వాడు బయటకి వెళ్లిపోతే ఒకటోక్లాస్ వాడు వస్తున్నాడు కదా. ఎంతమంది మనువులైనా ఒకే స్కూల్లో పని చేసుకోవచ్చు. కానీ ఒక్కొక్కసారి ఏమవుతుంది? Planet life అయిపోతుంది, Planet మీద మనుషులు ఉంటారు. ఏం చేయాలప్పుడు? స్కూలు ఉంది, స్కూల్లో పిల్లలు అంతా చదువుకుంటున్నారు, pass అయ్యి వెళ్ళిపోతున్నారు... పిల్లలు ఉండగా building మార్చాలి అనుకోండి. ఇప్పుడు మనకు పిల్లలు చదువుకోవాలంటే school లేదు. చదువుకుందామని అనిపించినా కూడా bulding లేకపోతే ఏం చేయాలి ఇంకో bulding తయారు చేయాలా? ఇంకొక bulding తయారు కాకుండా ఈ bulding తీసేసారు అనుకోండి. చాలా కష్టం కదా! సృష్టిలో ఏం జరుగుతుందంటే ఈ bulding పని అయిపోతుంది, దీని lease period అయిపోతుంది అనుకున్నప్పుడు మనలాగా last minute లో మేల్కోరు వాళ్ళు. మేల్కొని, అయిపోయినా కూడా ఇంకొన్నాళ్ళు ఉంటామండీ ఇక్కడ, ఏమీ అనుకోకండి, అంటే అది జరగదు. ఇది అయిపోయే లోపల ఇంకొకటి తయారు చేసుకోవాలి. అదీ సృష్టి యజ్ఞం. ఈ భూమికి ముందు ఇంకొక భూమి ఉండేది. అదే ఇప్పటి చంద్రుడు. ఆ భూమి మీద మానవ జాతి నడుస్తూ ఉంటే దానికి time అయిపోయింది. Time అయిపోతే ఏం చేశారప్పుడు? ఆ భూమిగా పనికి రాని సమయానికి, మన భూమి తయారైపోయింది. అప్పుడు ఆ భూమి నుంచి ఈ భూమి మీదకు మనుషులను పట్టుకువచ్చారు. అదే 'పడవలో ఎక్కించి పట్టుకొచ్చారు' అని చెప్తారు. వైవస్వతమనువు కథలో ఒక మునికి చేప దొరికితే ఆ చేపను రాజైన వైవస్వతుడికి ఇస్తాడు. ఆ చేపను ఇంట్లో తొట్టెలో వేస్తే అది పెరిగి ఆ తొట్టి అంత అవుతుంది. ఇంకో పెద్ద దాంట్లో వేస్తే అంతకన్నా పెరుగుతుంది. ఇంకొంత పెద్ద దాంట్లో వేస్తే అంతకన్నా పెరుగుతుంది. ఏమిటిదని doubt వచ్చి భగవంతుడేమో అని దండం పెట్టుకుంటే, భగవంతుడని తెలుస్తుంది. తెలిసి ఏంటి స్వామి ఇలా వచ్చారు అంటే, ఈ భూమి పని అయిపోయింది. వీరందరినీ చేరవెయ్యాలి. ఈ progam అంతా నీదే! ఆ time కి నువ్వే పడవలో జంతువులను, ఓషధులను, మనుషులను వేసుకుని ఉండమని చెప్పి భగవంతుడు మత్స్యావతారంగా వాళ్లను వేరొక చోట చేర్చాడని కథ. పురాణాల్లో నీరు అంటే ఆకాశం. ఆకాశానికి ఇంకో పేరు నీరు. Electricity ని కూడా నీరు అని అంటారు.

శుక్ల యజుర్వేదంలో "ఆపోవా ఇదగ్ం సర్వం" అని వస్తుంది అంటే మొత్తం నీళ్లే అని. ఆ నీళ్ల మీద ఆయన తేలుతూ ఉంటాడు అని. దీనినే waves ఉండే విద్యుత్ అంటారు. 'ప్రజ్ఞామయమైన తరంగాలు' అంటారు. దాన్ని నీరు అంటూ ఉంటారు. ఇప్పుడిప్పుడే science కూడా electricity ని physical correspondance for water అని చెబుతున్నారు. అందుకని నీరు కనుక సరిగా అవగాహన చేసుకుంటే మనం భగవంతుని సరిగ్గా అవగాహన చేసుకోవచ్చు అనే theory ఇప్పుడు ప్రస్తుతం develop అవుతోంది. ఇప్పుడు నీళ్ళలోంచి electricity తెచ్చుకుంటున్నాం కదా! Electricity నుంచి నీళ్లు తెచ్చుకోవచ్చట. ఇక్కడ ఇప్పుడు ఏ building అయితే పాడయ్యిందో, ఆ పాత building నుండే పిల్లలని కొత్త buildingలోకి మార్చేశారు. అలాగే ఇదివరకు భూమిగా పనిచేసిన భూమి నుండి కొత్తగ సంస్కరింపబడిన భూమిలోకి shift చేశారు. ఈ భూమి మీద ఉన్న మానవజాతి కూడా సంస్కరింపబడుతూ ఉంటుంది. ఇదివరకు భూమి అంటే ఇప్పటి చంద్రుడ్ని ఈ లోపల పై వాళ్ళు ఒక satellite కింద వాడుకుంటున్నారు. వాడుకొని కొన్నికొన్ని ప్రజ్ఞామయమైన కక్ష్యల నుంచి ప్రజ్ఞని satellite ఆధారంగా భూమి మీదకు పంపిస్తున్నారు. చంద్రుడికి by itself ఏం ప్రభావం లేదు ఇప్పుడు. కానీ ఆ చంద్రుడి నుంచి Neptune (ఇంద్ర గ్రహం) అనే గ్రహం యొక్క ప్రభావం, Uranus (వరుణ గ్రహం) యొక్క ప్రభావం, శుక్ర గ్రహం యొక్క ప్రభావం చంద్రుని మీద నుంచి మనకు వస్తోంది. సోముడు అనే గంధర్వ రాజు అంతరిక్షంలో ఉంటాడు. అతని ప్రభావం ఇంద్రగ్రహం నుంచి, శుక్రగ్రహం మీద నుంచి, చంద్రుడి నుంచి భూమి మీదకు వస్తుంది. వీటి యొక్క ప్రజ్ఞలు చంద్రుడి ద్వారా మనకు వస్తున్నాయి. Satillite పెట్టుకుని TV పెట్టుకున్నట్లన్నమాట. మనవారు అంతరిక్షంలోకి చంద్రుని మీదకు వెళ్లి నప్పుడు కొన్ని మహత్తరమైన ప్రజ్ఞలు అదే space craft ద్వారా ఈ భూమి మీదకు దింప బడ్డాయి. చంద్రుని మీద కొన్ని ప్రజ్ఞలు దింపి చంద్రుని మీద నుంచి భూమి మీదకు దింపడం జరిగింది. చంద్రుడు మీదకి మనవాళ్లు వెళ్ళినప్పుడల్లా అక్కడ కొన్ని ప్రజ్ఞలు దిగి అక్కడ నుండి కొన్ని మహత్తరమైన ప్రజ్ఞలు అదే space craft ద్వారా ఈ భూమి మీదకు రావడం జరిగింది. అలా పై వాళ్ళు వాడుకున్నారు. 1977లో చంద్రుని ద్వారా చాలా మహత్తరమైన ప్రజ్ఞలు ఈ భూమి మీదకు దిగాయి. ఇప్పుడు UFO లన్నీ అక్కడ నుండి వచ్చినవే! ఆ ప్రజ్ఞలు South America, North America ఆ ప్రాంతంలో తిరుగుతున్నారు. They are all

bodies of light. వెలుగు శరీరంతో తిరుగుతుంటారు. అందులో కొన్ని సముద్రగర్భంలో దిగి, చాలా విధాలుగా భూమిని రక్షిస్తున్నారు. ఈ మానవుడు భూమినంతా పాడు చేసేస్తాడు అని అనుకుంటాము కాని, తలలోని పేనుతో సమానం మానవుడు. గట్టిగా దువ్వెన పెట్టి దువ్వితే చాలు. అదీ మానవుడు ఈ భూమి తో compare చేస్తే! మనకు అహంభావం ఎక్కువ కాబట్టి మనం భూమిని బద్దలు కొట్టేయగలం అది, ఇది అనుకుంటాము గాని బద్దలు కొట్టనివ్వరు. పేను తీసి పారేసినట్లు, ఈ భూమిని కాపాడుతున్న ప్రజ్ఞలు మానవజాతి యొక్క ఆ దుష్ట సంకల్పాన్ని అలా తీసేయగలదు. అంత సులభం. అందుకని భూమికి ఏమీ కాదు. భూమిని ఎవ్వరూ పగలగొట్టలేరు. భూమిని తయారు చేసిన ప్రజ్ఞలతో పోలిస్తే మనం వెంట్రుకవాసి కాదు. ఎందుకు చేస్తామంటే అహంభావం వల్ల అది పాడుచేస్తాను, ఇది కాల్చేస్తాను అనుకుంటాం. అవి అన్నీ మనకు సరైన అవగాహన లేక. మహత్తరమైన ప్రజ్ఞలు ఈ భూమిని కాపాడుతున్నాయి. ఇక్కడున్న వాళ్లకి సహాయం చేయటానికి అంతరిక్షంలో నుంచి విపరీతంగా దిగి వచ్చేస్తున్నారు. మనము ఎరిగిన పరమ గురువులు, వివిధ ఆశ్రమాలు, వీటన్నింటిని reinforce చేయడానికా అన్నట్లుగా అంతరిక్షం నుంచి రకరకాలుగా దిగి వస్తున్నారు. కాలం అట్లా ఉంది. అందులో భాగంగానే ఇప్పుడు వైజ్ఞానిక పరంగా ఎక్కువగా తెలుసుకుంటున్న కొద్దీ, ఈ శాస్త్రపరిశోధకులని ఆశ్చర్యంలో ముంచేటట్లుగా కొన్ని కొత్త కొత్త phenomena జరుగుతున్నాయి. జరుగుతుంటే, they are getting oriented to higher aspects of life. అంటే మనం ఎరిగిన దానికన్నా ఇంకా చాలా ఉంది అని తెలుసుకునే పరిస్థితికి ఇప్పుడు science వచ్చింది. ఇదివరకు అట్లా ఉండేది కాదు. మనకు తెలిసినంత వరకే, మిగతాది ఏదీ లేదు అనేవాళ్ళు. ఇప్పుడు మనకు తెలిసింది చాలా తక్కువ, తెలుసుకుంటున్న కొద్దీ చాలా తెలుస్తోంది అనే పరిస్థితికి వచ్చాం. ఈ భూమి కథ పర, పశ్యంతి, మధ్యమ, వైఖరీ అనే నాలుగు స్థితుల్లో ఉంటుంది. మనం ఉన్నాం, మనలోకి ఒక భావన వస్తుంది, ఆ భావనకు ఒక భాష ఇస్తాం, ఆ భాషను వ్యక్తం చేస్తాం. వ్యక్తం చేసినప్పుడే మాట్లాడామనటానికి వీలు లేదు. వ్యక్తం చేయనప్పుడు కూడా మన దగ్గర భాషలో ఉంది. భాషలో లేనప్పుడు భావనలో ఉంది. భావనలో లేనప్పుడు మనలో ఉంది. అది చెప్పటానికే వాళ్లు ఇబ్బంది పడ్డారు Bibleలో. In the beginning there was the word and the word was with God and the word was God

అని. ఇలా ఉంటుంది సృష్టిలో అంతా కూడా. మనకు ఈ మూడు కనపడవు. ఈ ఒక్కటే కనిపిస్తుంది. మీరు ఏమైనా మాట్లాడితే నాకు తెలుస్తుంది, నేను మాట్లాడితే మీకు తెలియడం సామాన్యము. మీరు మాట్లాడకుండానే మీరు చేసే ఆలోచనలు తెలియటం కొంచెం అసామాన్యం. మాట రాకుండానే వాళ్ళ భావన మనకు అర్థం అవటం అంటే మధ్యమ స్థితిలోకి మనం వచ్చాము అన్నమాట. అక్కడ అర్థం అవుతుంది. వాళ్లకు భావం వెలగగానే మనకు అర్థం అయింది అనుకోండి వాడి పశ్యంతి మనకు తెలిసిపోయిందని. అది ఎప్పుడు జరుగుతుందంటే వాడూ, మనం ఈ 'పర' స్థితిలో ఏకీభావం చెందినప్పుడు జరుగుతూ ఉంటుంది. మనం మామూలుగా 4 వ స్థితిలో తెలుసుకుంటాము. ఆ పై మూడూ తెలియవు, కనిపించవు. కనుకనే ఆ మూడింటినీ 'త్రిపాద స్యామృతందివి' అని చెప్తుంది పురుషసూక్తం. అమృతం అంటే immortal. దివి అంటే Devine. ఎంత మాట్లాడినా భాష ఉంటుందిగా! ఎంత భాష మాట్లాడినా భావం లేదూ? అయిపోవడం ఉండదు. ఏమిటి basis? అమృతత్వం! ఎంత వాడినా వస్తూనే ఉంటాయి అక్షరాలు. అది అమృతం అంటే! అ,ఆ లు ఎన్ని వేల సంవత్సరాల నుండి వాడుకొంటూ, ఎన్ని పుస్తకాలు రాసినా మిగిలి ఉన్నాయి కదా! అందుకనే అక్షరం అన్నారు దాన్ని. అవ్వదు! ఎందుకవదంటే అసలు మనం అయి పోయే వాళ్ళం కాదు కాబట్టి. ఈ మూడింటిని immortal and divine అన్నారు. Immortal అంటే అమృతత్వం. దివి నుండే divine, దేవా అనే పదాలు అన్నీ వచ్చాయి. మూడు ఎప్పుడు అలాగే ఉంటే నాలుగవది కనిపించి వెళ్ళిపోతుంటుంది. కనిపించి వెళ్లి పోయే దానికి ముందు మూడు ఉన్నాయన్నమాట! మనువు, విశ్వకర్మ, పద్మనాభుడు. Positive చింపేస్తే negative ఉందిగా, ఇంకో positive వస్తుంది అందులోంచి. కనుక nagetive state ముందున్నది. అందుకని మళ్ళీ positive కనిపిస్తుంటుంది. అందుకే positive లు ఎన్ని చింపేసినా మళ్ళీ positive వస్తుంది. 'తాని ధర్మాణి ప్రథమా న్యాసన్,' అన్నారు పురుషసూక్తంలో. According to the The and Ancient one it comes back again. ఇదివరకు ఏ పద్ధతిలో ఉందో అలాగే వస్తుందిట. మనిషి నుండి మనిషే కదా వచ్చేది! లేకపోతే లోపలినుంచి ఏం వస్తుందో అంటే పెద్ద tension కదా! మామిడిపండు వేస్తే మామిడి చెట్టు వస్తుందని మేడి చెట్టు రాదని gaurentee కదా! మనిషి వీర్యం, కుక్క వీర్యం, వీర్యం రూపంలో ఉన్నప్పుడు అన్నీ drops. మీరేమీ

distinguish చేయలేరు. దానిలో ఉన్న potencyలో formatting nature ఉంది. మనిషి మనిషి గానే వస్తాడు. కుక్క కుక్క గానే వస్తుంది. ఇలా ఎవరు చేస్తున్నారో ఎన్నడైనా ఆలోచించామా? విశ్వకర్మ అంటే అది. అక్కడ already decide అయిపోయాక, దాని ప్రకారం దిగివచ్చేసినవే ఇవన్నీ. దిగి వచ్చేవి అయినా, వాడి దగ్గర ముడి సరకు ఉంటుంది. మళ్లీ దింపుతాడు. ఈ మూడు పాదాలూ అమృతత్వానికి సంబంధించినవి. నాలుగో పాదం, ఎప్పుడూ వస్తుంది పోతూ ఉంటుంది అంటామే అది. నాలుగవ పాదానికి 3,2,1, పాదాలు అమృత తత్వాలు. మూడవ పాదానికి, 2,1 అలా. రెండవ పాదానికి 1 అలా. అలా వచ్చినవి మళ్ళీ తిరిగి వెళ్ళిపోతాయి. అదే The and Anciant form. మళ్లీ మూడు స్థితులు వెనక్కి వెళ్లిపోతాయి. మొత్తం ఎన్ని అయ్యాయి? Seven pulsations.

అలాగే తరంగాలలా భూములు ఇలా దిగి వస్తాయి. అవి కూడా ఏడు స్థితులలో వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి. జాతులు కూడా ఇలా ఏడు తరంగాలుగా వచ్చి వెళ్ళి పోతూ ఉంటాయి. అవి ఇవి కలుస్తూ ఉంటాయి. సృష్టి నిర్మాణానికి సంబంధించిన ఈ విషయం భాగవతం తృతీయ స్కంధం లో ఉంది. పురాణకాలక్షేపంగా అందరూ చెప్పవచ్చు. ధ్రువుడి తండ్రి పేరు ఉత్తానపాదుడు. ధ్రువం అంటే access of any globe. ఏ గోళానికైనా ఇరుసు ధ్రువం. అతడికి ఇంకో పుత్రుడు ప్రియవ్రతుడు. ఉత్తానపాదం అంటే సంస్కృతంలో right angle గా ఉన్న పాదం! కంచిలో చూస్తే భగవంతుని త్రివిక్రమ రూపం ఒకపాదం right angle గా లేపి ఉంటుంది. అంటే బలి చక్రవర్తి నుండి పాతాళములోనికి తొక్కిన విష్ణుమూర్తి రూపం అది. అది ఉత్తాన పాదం. పైకి లేపిన పాదం కాదు. Right angle తో లేపిన పాదం. సృష్టి అంతా right angle గా దిగి వస్తుంది. అది ఒక విజ్ఞానం. ఉత్తానపాదాన్ని ఆధారంగా చేసుకుని వచ్చే ప్రజ్ఞని తీసుకొని, ధ్రువుడు ఒక కేంద్రంగా తయారైతే, అది ఉత్తర ధ్రువం అయితే దాన్ని ఆధారంగా చేసుకొని, గోళాలు తయారవుతూ ఉంటాయి ఈ గోళాలు తయారవడానికి hierarchy ఉత్తానపాదుడు, ధ్రువుడు, అతని సంతతి. తయారైన గోళాల మీద జీవుల చరిత్రలు నడపడానికి ధ్రువుని తమ్ముడైన ప్రియవ్రతుడు, అతని సంతతి. ఇలా రెండుగా ఉంటుంది. భాగవతం సరిగ్గా చదువుకుంటే! చదువుకోకపోతే అంతా ఒకటిగానే ఉంటుంది. అంతా భగవంతుడే కదండీ, అనేయడం ఒక పద్ధతి. ఇలా తెలుసుకోవడం ఒక పద్ధతి. ఋషులు ఇచ్చిన మార్గమిది. భాగవతంలో లేని science లేదు. చదువుకునే ఓపిక

ఉండాలి. సృష్టిలో ఉత్తానపాదుడు, ధ్రువుడు గోళాలు చేస్తూ ఉంటే, ఆ గోళాల మీద జీవుల పరిణామం చూసే ప్రియవ్రతుడి ద్వారా ఈ రెండు ఒకదానితో ఒకటి అల్లుకొని జరిగిపోతూ ఉంటాయి. ఆ గోళం అయిపోతుందనే లోగా ఇంకొక గోళం తయారు చేసి సిద్ధంగా ఉంటారు. మనలా కంగారు పడరు. భూమి మీద మనము వెళ్లిపోతే మన చోట్లో ఇంకొకటి రావడం లేదూ. ఇంకొకటి పుట్టించే వెళ్తున్నాం కదా! Globe మీద ఇద్దరూ పనిచేస్తూ ఉంటారు. మనం భూమి మీద develop చేసినవి కొన్ని ఉంటాయి కదా! అవన్నీ ఉత్తానపాదుడు activity అన్నమాట. మనం వెళ్లిపోయిన తర్వాత ఎలా? అని plan చేసి, ఇంకొకడ్ని దింపి కదా వెళుతూ ఉంటాం. ఒక్కోసారి దిగివచ్చే వాడు వచ్చేటప్పటికి ఆస్తులు ఏమీ ఉండవు. వాళ్ల ముందు వాళ్లు కైంకర్యం చేసేస్తారు. ఏదిరా, అంటే నువ్వు మళ్ళీ మొదలు పెట్టు, అంటారు. అది కూడా నాలుగు స్థితుల్లో నే నడుస్తుంది. ఒకాయన పరాకాష్ట చెందితే, ఆయన మునిమనవడి సమయానికి మొత్తం అంతా నేల మీదికి వచ్చేస్తుంది. మళ్లీ వాడి కొడుకు దగ్గర మొదలై వాడికి పరాకాష్టకి వచ్చే సమయానికి మళ్ళీ వాడి మునిమనుమడు సమయానికి నేల మీదకు వస్తుంది. అలా జరుగుతూ ఉంటుంది. మళ్లీ తగ్గుతూ ఉంటుంది. కొన్ని కుటుంబాలు చూసినట్లయితే బాగా ఫెళఫెళ పైకి పోయి, తర్వాత వారికి పుట్టే వాళ్ళు అంత క్రమశిక్షణ లేక అంతా పోయి ఆ నాలుగో వాడు మళ్లీ మొదలు పెట్టి పైకి తెస్తూ ఉంటాడు. ఇలా నాలుగు తరాలు. అందుకే నాల్గవ తరం వాణ్ని, అంటే ముని-మనమణ్ణి చూస్తే వీడికి ముక్తి అంటారు. నాలుగూ తెలిసినవాడు అని అర్థం అన్నమాట. ఇలా నడిచే కథలో తెలిసినది ఒక నాలుగవ భాగం. తెలియనది మూడు భాగాలు. మొత్తం సృష్టిని గాయత్రి తత్వముగా వివరించి ఉన్నదే గాయత్రి మంత్రం. గాయత్రి మంత్రానికి 24 అక్షరాలు కదా! ఈ 24 అనే సంఖ్య పవిత్రమైనది. దీనిలో మనకు కనపడే నాలుగవ భాగమైన ఆరు తీసేయండి. కనబడేది మూడు భాగాలు 18. కనపడని 18 తత్వాలు ఆధారంగా, కనపడే 6 తత్వాల కార్యక్రమం భూమి మీద నడుస్తూ ఉంటుంది. ఇలా ఎందుకు జరుగుతోంది అని భూమి మీద కారణాలు వెతుక్కుంటే కనపడవు. కారణాలు\ తాళాలు పైన ఉంటాయి. దానినే శ్రీకృష్ణుడు భగవద్గీత పదిహేనవ అధ్యాయం లో 'ఊర్ధ్వ మూల మధశ్శాఖం' వేళ్ళు మూలం పైన, శాఖలు కింద ఉంటాయని చెప్పాడు. పైన ఉన్న కారణాలు తెలియడానికి ఆ పద్దెనిమిది తత్వాలూ తెలియాలి. అవి ఎలా ఉన్నాయో వాటిని బట్టి ఆరు

దిగుతాయి. అందుకూ ఇచ్చారు 18 పురాణాలు. ఏదో సరదాగా తోచక రాయలేదు. 18 అవగానే విసుగు పుట్టి ఆపేయడం గాని, 18 ఇది రాసి ఊరుకోవాలి అని గాని వ్రాయలేదు. 18 పురాణాలు, 18 తత్వాలకి సంబంధించినవి. భారతానికి 18 పర్వాలు. భగవద్గీత 18 అధ్యాయాలు. యుద్ధం 18 రోజులు జరిగింది. అందులో 18 అక్షౌహిణులు పాల్గొన్నాయి. 18 అనే అంకెకి అటువంటి ప్రాముఖ్యత ఉంది. కనుక 18 traits తెలిస్తే traits which are in three preceeding planes తెలిస్తే ఈ ఆరు ఎందుకిలా జరుగుతున్నాయో తెలుస్తుంది. కనుక అవి తెలిసినవాడికి ఇక్కడ ఎలా జరుగుతుందో తెలుస్తుంది. Already చపాతీ పిండి కలియబెట్టిన తరువాత చేసేది చపాతి అని తెలియదూ? దొండకాయలు తరిగి, బాణలిలో నూనె వేస్తే, దొండకాయ వేపుడేగా చేసేది. It is so invitable. The happening of the physical plane can be well predicted if you know the preceding order that precipitates a Physical act. అది ఋషుల దర్శనం. కనుక వారు ఏం చెప్పారంటే ఈ పద్దెనిమిది ఎవరికైతే తెలుస్తాయో వాళ్ళకి ఎప్పుడూ జయమే నని. ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క సంఖ్యా బలం, number potency ఉంటుంది. Number కి potency, sound కి quality ఉంటుంది. య sound కి numerical potency 1. "జ"sound కి numerical potency 8, it is also one because it repeats after 7. ఏడు తర్వాత మళ్లీ అదే వస్తూ ఉంటుంది కదా! కనుకనే 8వ వాడన్నా మొదటి వాడన్నా వాడే. అందరికన్నా పెద్ద వాడు నెంబర్ వన్ వాడే. వాడే 8వ వాడున్నూ. ఎందుకంటే మధ్యలో 7 ఉంటాయి. కనుకనే 'య' అన్నా,'జ' అన్నా ఒకటే. యమునా అన్నా, జమున అన్నా ఒకటే. య, జ గా – జ, య గా మారుతూ ఉంటుంది. ఈ మొత్తం అంతా యజము లేక యజ్ఞము. య జ ములో 'య మ' లో ఉన్న numerical potency 18 అర్థమైతే, అంతా జయం అవుతుంది. పూర్వం 'అంకానాం వామతో గతిః' అని అంకెలని ఎడమ వైపు నుంచి లెక్కించారు. సరదాకి పెట్టలేదు వేదవ్యాసుడు జయ అనే పేరు. ఎందుకు పెట్టాడూ జయ అనీ అంటే మహాభారతంలో యజము ఎలా జరుగుతోందో explain చేశాడు. ఆదిపర్వము నుండి చదువుకుంటే మొత్తం సృష్టి క్రమమంతా అందులో ఉంది. వృషభరాశి నుండి వృశ్చికరాశి వరకు దిగివచ్చే ధర్మాలు అన్నీ ఉంటాయి. ఈ దిగివచ్చిన యజ్ఞమును సరిగ్గా అవగాహన చేసుకొని, దానధర్మాలు తెలుసుకుంటే జయము తథ్యము. 18 అనే అంకెకి అలా

ప్రాముఖ్యత ఏర్పడింది. 18 అన్నా 81 అన్నా ఒకటి అని గుర్తు పెట్టుకుంటే 27×3=81 అది ఒక science. 6×3=18 అది ఒక science. ఒకటి దిగి రావడానికి పనికొచ్చే science. ఇంకొకటి ఎక్కి వెళ్లడానికి పనికొచ్చే science. ఇవి ఇప్పుడు మీకు అర్థం కాకపోయినా లోపల పని చేస్తాయి. ఆ తర్వాత విచ్చుకుంటాయి.

ఇంత కార్యక్రమంలో భాగంగా మనువు మూడవ globe లో పనిచేస్తున్నాడు. మొదటి globe కేంద్రం ఏర్పడ్డాక దాని చుట్టూ పద్మనాభుడు ఏర్పడతాడు. ఆయన పొట్టలో నుంచి పుట్టుకొచ్చిన వారి నుండి రెండవ globe విశ్వకర్మ తయారు చేస్తాడు. Masonic order లో ఈ విశ్వకర్మని 'The great architect of universe' అని చెప్తారు. అందుచేత చాలామందికి దేవుడంటే విశ్వకర్మ. ఒక స్థితిలో లోకానికి ఈయన బ్రహ్మ. ఈయన కన్నా పై బ్రహ్మ పద్మనాభుడు. విశ్వకర్మ తరువాతి బ్రహ్మగా మనువు వస్తాడు, మన భూమి వరకు దిగి రావడానికి. అక్కడి నుంచి engineer త్వష్ట వచ్చేస్తాడు. ఇంత మంది నుంచి చూసుకుంటూ, వాడే వీటన్నిటి గా మారాడు అనేది మర్చిపోతాం. Detail లోకి వెళ్లి అసలు వాడిని మర్చిపోతే అంతా confusion. అందుకే గీత నాలుగవ అధ్యాయంలో కృష్ణుడు 'విజ్ఞానం చదువుకో, కానీ నన్ను మరిచిపోకు', అంటాడు. అంటే కృష్ణుడ్ని మరచిపోవడం కాదు. 'నేనుని'. మనలో ఉన్న స్థితిని మర్చిపోకుండా ఉన్నంతసేపు ఎంత అల్లికైనా అర్థమవుతుంది. ఎంత పెద్ద పట్టణంలో అయినా Central లో ఉంటే periphery కి వెళ్లడం సులభం. Perephery లో ఉండి center కి రావడం కష్టం. పురుషోత్తమ ప్రాప్తి యోగంలో center లో నిలబడడమే చెప్తాడు శ్రీకృష్ణుడు," ఆకులు, రెమ్మలు, కొమ్మలు, పువ్వులు, ఇవన్నీ చూసి, ఆ గందరగోళంలో ఇరుక్కుంటే బయటికి రాలేవు. ఎందుకంటే కొమ్మలన్నీ మూలాలు, మూలాలన్నీ కొమ్మలు అయిపోతూ అంతా గజిబిజిగా ఉంటుంది. అలా కాక నువ్వు ఎక్కడున్నా అక్కడే లోపలికి ఉపసంహరించుకుంటే, withdraw అయిపోతే, నాలోకి వచ్చేస్తావు" అన్నాడు. ఉన్నచోట ఉన్నట్లుగా లోపలికెళిపోతే హృషీకేశుడక్కడే ఉన్నాడు. పద్మనాభుడున్నాడు. విశ్వకర్మ అంటే form making nature మన దగ్గరా ఉంది. మన forms మనలో విశ్వకర్మ ఉన్న తీరును బట్టి ఉంటుంది. కొంతమంది వికారంగా ఉంటారంటే form making nature బాగా పని చేయడం లేదన్న మాట. ముసలివాడవై పోతున్నావా? రసాయనిక చర్య chemical action ద్వారా మళ్లీ ఇరవై ఐదు సంవత్సరాల వయసు కుర్రాడిలా

తయారుచేసే science ఉంది ఆయుర్వేదంలో. అవన్నీ విశ్వకర్మ అనే తత్వం ఎలా పని చేస్తుందో తెలిసినప్పుడు వీలుపడుతుంది. ఆ hierarchie లో తర్వాతి step మనువు. మనువు నుండి  జాతులు, మనుషులు ఇలాగ పుట్టలుగ బయటకి వచ్చేస్తాయి. అదేమిటయ్యా అంటే  నేనే దిగివచ్చి ఆడుకుంటుంటే నీకు ఏమిటి మధ్య? నేనే నీ రూపంలో వచ్చాను. నాకు గుర్తుంది, అందుకే నాకు problem లేదు. నీకు గుర్తు లేదు కనుక నీకు problem. ఎనిమిది తత్వాలు ఎనిమిది రకాలుగా ఒకడే దిగి వచ్చినప్పుడు వాడే అందులో స్థిరంగా ఉంటాడు. ఉండేవాడు అందరికన్నా పెద్ద వాడు. 'స్థవిష్ఠ స్థవిరో ధ్రువః' ధ్రువుడంటే స్థిరంగా stable గా ఉండే స్థితి. సృష్టిలో ఉంటాడు. సృష్టి బయట ఉంటాడు. సృష్టి గా కూడా ఉంటాడు. కనక ఒక్కడినే చూడమంటుంది అద్వైతం. నేనే అంతా అనుకోవడం కన్నా భగవంతుడే అంతా అనుకుంటే ఎక్కువ ఆనందంగా ఉంటుంది కనుక అలా అనుకుంటాను అంటాడు అర్జునుడు విశ్వరూపాన్ని చూసినప్పుడు. 'పశ్యామి తే సుందర మందహాసం' అంటాడు భగవద్గీతలో. ఈ మొత్తం సృష్టి భగవంతుని సృష్టి గా చూస్తాను అంటాడు అర్జునుడు.  అది ఎక్కువ బావుంటుంది కదా! ఇంకొంచెం రసవత్తరంగా ఉండడానికి తాను భక్తుడిగా నిలబడి మొత్తం అంతా భగవంతుడిగా చూడడాన్ని విశిష్టాద్వైతం అంటారు. అది అద్వైతమే. రెండు కానిది ఒకటి. అద్వైతం. ఒకటే ఉన్నా, అన్నా , తాను ఆనంద అనుభూతి చెందడానికి శంకరాచార్యుల వారిచ్చినన్ని స్తోత్రాలు ఇంకెవరు వ్రాయలేదు. ఎందుకు రాశారు? అలా రాస్తే ఆనందంగా ఉంటుందని వ్రాశారు. ఇవన్నీ ఎందుకు? అనేవాడు పిచ్చివాడు. వాడికి ఆ వైభవం ఉండదు.  కాశీలో అమ్మవారిని చూడగానే "తల్లీ నేనూ, నువ్వు ఒకటే అయినా, నా ఆనందం కొద్దీ కొద్దిసేపు అలా ఎదురుగుండా ఉంచుకొని స్తోత్రం చేస్తున్నాను వినమ్మా," అని  స్తోత్రాలు చేస్తారు శంకరులు. ఇప్పుడు ఉన్న  అద్వైత సిద్ధాంతులు వాళ్ల master ని అనుసరించరు. ఎప్పుడూ అంతే. ఎప్పుడూ, ఎవరూ వాళ్ళ master ని follow అవ్వరు. వాళ్ల master చెప్పింది చెబుతూ, వీళ్ళకి తోచింది చేస్తుంటారు. అలా మొత్తంగా తనే సృష్టిలోనూ, సృష్టి బయట, సృష్టి గాను ఉంటాడు. ఇంక వాడు కానిదేముంది? చూసేవాడు సృష్టిగా వాణ్ణి చూస్తూ ఉంటే అనుభూతి ఎక్కువగా ఉంటుంది. సృష్టిగా చూసినప్పుడు  కనబడిన వాడిని సృష్టిగా చూడడం సులభం అవుతుంది. కనుక ముందు మన గురించి తెలుసుకొని, అక్కడి

నుండి సృష్టిలోకి వ్యాపనమైన భగవంతుణ్ణి తెలుసుకొని, ఆ భగవంతుని విభూతిని అనుభూతి చెందుతూ ఉండడం ఏర్పడుతుంది.

## 59. అగ్రాహ్యః 60. శాశ్వతః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## 61, 62, 63 కృష్ణః, లోహితాక్షః, 63. ప్రతర్దనః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## 64. ప్రభూతః

ప్రభూతః అనే నామం. ''త్రికకుద్ధామ పవిత్రం మంగళం పరం'' అన్నీ కూడా ఒకదానికొకటి సంబంధించిన నామములే. చక్కగా రూపములుగా వ్యక్తమైన భగవంతుడిని "ప్రభూతుడు" అంటారు. తన నుండి పుట్టిన ప్రకృతిని, తననుండి పుట్టిన శక్తిచే పరిణామం చెందిస్తూ వుంటాడు. తన నుండే ప్రకృతి అంటే పదార్థం పుడుతుంది. పుట్టిన పదార్థం అతి సూక్ష్మంగా వుంటుంది. మనమెరిగిన పదార్థంగా వుండదు. తననుంచే మరియొక ఉద్భవం శక్తిగా వస్తుంది. తన నుండి వచ్చిన శక్తి, తన నుండి వచ్చిన ప్రకృతిని అవరోహణం చెందిస్తుంది. అదీ సృష్టి ఏర్పడటం అంటే. ఈ అవరోహణం పూర్తి అయిన తరువాత ఇపుడు మనం వున్న భౌతికమైన స్థితివరకు పదార్థం తయారుచేయబడుతుంది. ఈ తయారుచేయబడటంలో రకరకములైన రూపములు ఏర్పడతాయి. 'ప్రతర్దనుడు' అనగా నిరోధకశక్తిగా పనిచేస్తూ, తానే తననుంచి వ్యక్తమవుతున్న రూపములన్నీ కూడా మళ్ళీ తనలో అభ్యాసవశాత్తు ఐక్యమైపోకుండా నిలబడిపోయేటట్లు చేసే ఒక ప్రజ్ఞ. అది తన శక్తి నుండి వచ్చిన ఒక శక్తియే. అట్లా నిరోధించుకుంటూ ప్రకృతి చేత, శక్తి చేత రూపాలను తయారుచేసుకుంటూ, చక్కటి రూపాలను తయారుచేసుకుంటూ సృష్టి కార్యక్రమం అంతా నిర్వర్తించే విధానం ఏదైతే వున్నదో దానిని 'ప్రభూత' అని పిలుస్తారు. అంటే ''well formed'' అని అర్థం దానికి. Well formed అంటే చక్కగా రూపించబడిన అని. ఈ రూపములన్నీ కూడా పదార్థముతో చేయబడినవే కదా! సూక్ష్మము నుండి స్థూలము వరకు రకరకములైన పదార్థముల యొక్క మేళవింపు చేత కోటానుకోట్ల రూపాలు తయారవుతూ వస్తున్నాయి కదా! ఈ రూపములు సూక్ష్మము నుండి స్థూలము వరకు తయారవుతాయి. మళ్ళీ ఆరోహణ క్రమంలో స్థూలము నుండి సూక్ష్మమునకు తిరోధానం చేస్తాయి. సూక్ష్మము నుంచి స్థూలానికి వచ్చాము మనం అంతా కూడా. ఒక సంకల్పం కారణంగా తండ్రి శిరస్సు మీద aeroplane లాగ landing చేసి, అక్కడ నుంచి ఆయనలోకి దిగి, అక్కడ నుంచి తల్లి కడుపులోకి కేవలం ఒక బిందువుగా దిగితే, అక్కడ నుంచి ఒక రూపం కట్టుకొని, ఇంకొంచెం పెరిగి, ఇంకొంచెం పెరిగి, ఇంకొంచెం పెరిగి ఇపుడు ఇంతగా కనిపిస్తున్నాం కదా! ఇదంతా సూక్ష్మం నుంచి స్థూలానికి దిగి రావటమే.

మనిషి యొక్క ఈ ఏర్పడటం కనక మనం అర్థం చేసుకున్నట్లయితే, ఇందులో ఎన్ని లక్షల పరిణామములు వున్నాయో మనకి తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఒక్క సంకల్పాన్ని ఇంత రూపంగా అంటే మానవరూపంగానే తీసుకువచ్చి, దానికి లోపల వుండే అవయవములు, వాటియొక్క సంఖ్య, వాటియొక్క ప్రవర్తన అదే పద్ధతిలో వుండేటట్లుగా తీసుకువచ్చి, రూపం తయారుచేయడం అంటే ఒక కుండ తయారుచేసినట్లు, ఒక బల్ల తయారుచేసినట్లు కాకుండా ఎంత లోపల దీనికి సంబంధించిన వైజ్ఞానికచర్య జరక్కపోతే, శాస్త్రీయమైన పద్ధతుల్లో జరక్కపోతే, ఈ రూపాలన్నీ అదే పద్ధతుల్లో, అట్లాగే ఎలా వస్తున్నాయి? దానిమీద కొంత ధ్యానం చేయాలి. మననే మనం తీసుకున్నట్లయితే, ఒక శిశువు యొక్క జననం ఒక సృష్టి యొక్క జననంగా మనం అవగాహన చేసుకోవచ్చు. అదే మనకి కపిలుడు దేవహూతికి ఇచ్చిన విజ్ఞానంగా తృతీయస్కంధము భాగవతంలో ఇచ్చి వుంచారు. చిన్న సంకల్పం ఇంత రూపంగా తయారైందంటే అందులో వున్న శాస్త్రీయమైన విజ్ఞానం మనం అవగాహన చేసుకోవటం మొదలుపెడితే, ఆ పరిపూర్ణమైన అవగాహన ఎవరి కేర్పడుతుందో వారికి కపిలుని యొక్క శాస్త్రం అర్థమైనట్లు లెక్క. కపిలుని యొక్క సాంఖ్య యోగము అని చెప్పినది ఏదైతే వున్నదో, భక్తి వున్నవారికి మాత్రమే అది అవగాహన అవుతుంది. భక్తి లేనివారికి అవగాహన కాదు. తృతీయస్కంధము పుస్తకం మనింట్లో వుండచ్చు. దానికి సంబంధిచిన వివరణము మాస్టరుగారు ఇచ్చి వుండచ్చు. దాన్ని పరిపూర్ణంగా అవగాహన చేసుకొని, దానియందు జీవించడం మాత్రం మనకి భక్తి లేకపోతే ఏర్పడదు. మీరు కావాలంటే ప్రయత్నం చేయండి ఒక్కసారి. కపిలుడు దేవహూతికి ఇచ్చిన జ్ఞానము పఠించడానికి ప్రయత్నం చేయండి. చేసే ప్రయత్నంలో ఏ రోజు మన భక్తి యందు కాస్త తరుగుదల వుంటుందో, ఆ రోజు పఠనం ఆగిపోతుంది. పూర్తిగా చదవటమనేది వీలుపడదు. ఎందుకంటే అక్కడ సృష్టికి సంబంధించిన సమస్త శాస్త్రాన్ని ఇచ్చి తల్లితో కపిలుడు చెప్తాడు. "తల్లీ! ఈ జ్ఞానము భక్తి వున్న వాళ్ళకి మాత్రమే అబ్బుతుంది సుమా!" అని. సాంఖ్యమును, భక్తితో యోగము చేస్తే తప్ప సాంఖ్యయోగము అవదని చెప్తాడు. జ్ఞానము, భక్తి ఎక్కడ కలిసివుంటుందో, అక్కడ భగవంతుని యొక్క అనుగ్రహం పరిపూర్ణంగా వుంటుంది. ఉత్తజ్ఞానం వుండేవాళ్ళు పొగరబోతుగా తయారవుతారు. ఉత్తభక్తి వుండటం మంచిది ఉత్తజ్ఞానం వుండటం కన్నా! ఉత్తభక్తి వాళ్ళు

నిరహంకారులై వుంటారు కాబట్టి భగవంతుని యొక్క అనుగ్రహానికి ఎక్కువ పాత్రులై వుంటారు. భక్తిలేని జ్ఞానం వున్న వాళ్ళు అహంకారులై వుంటారు కాబట్టి భగవంతునికి దూరంగా వుంటారు. అందుకని ఇంత జ్ఞానం ఇచ్చి తల్లికి కపిలుడు ఏం చెప్తాడంటే, భక్తిలేని చోట ఇది వికసించదమ్మా! అవగాహన కాదు. కాబట్టి భక్తి గురించి చెప్తానంటాడు ముందు. భక్తి గురించి ప్రవచించిన తరువాత కొంత మౌనాన్ని ప్రసాదించి ఆ తర్వాత జ్ఞానాన్నిస్తాడు. మనం భక్తి గురించి చదువుకున్న తర్వాత భక్తి ఏర్పడకపోవటం వలన, జ్ఞానం కోసం ముందుకు వెళ్ళటానికి అవకాశం వుండదు. జ్ఞానం భక్తిలేనిదే అబ్బదు. అబ్బిన తర్వాత భక్తి తగ్గితే, జ్ఞానం మాయమైపోతుంది. అహంకారం మాత్రం మిగులుతుంది. ఎందుకు చెప్తున్నానంటే ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ సృష్టికార్యాన్ని నిర్వర్తిస్తూ వున్న దేవతలందరూ కూడా ఈ 'ప్రభూత' అనే భగవన్నామానికి సంబంధించిన కార్యక్రమంలో ఇమిడి వున్న వారన్నమాట! అందుకని భక్తి, శ్రద్ధ వుంది కాబట్టి చేయబడే ప్రతి రూపాన్నీ అదే పద్ధతిలో తు.చ. తప్పకుండా చేస్తారు. పొరపాట్లు ఎక్కడో గానీ రావు. అందుకని చక్కగా రూపముతో వుండినట్టి, కుదుటపడే శక్తి కలవాడు అనే ఒక భావనతో మనకి ఈ నామాన్నిచ్చారు 'ప్రభూత'. ఈ విధంగా రూపాలు చేసుకుంటూ, చేసుకుంటూ స్థూలం వరకు రావటం జరుగుతుంది. ఈ స్థూలం వరకు రావటం మూడు మెట్లలో లేక మూడు అంచెలుగా జరుగుతుంది. లేక మూడు భాగాలుగా జరుగుతుంది అని చెప్తారు. లేకపోతే ఏడు అంచెలలో జరుగుతుందని చెప్తారు. లేకపోతే తొమ్మిది అంచెలలో జరుగుతుందని చెప్తారు. కొంతమంది నాలుగు అంచెలలో జరుగుతుందని చెప్తారు. మరికొంతమంది ఐదు అంచెలలో జరుగుతుందని చెప్తారు. విజ్ఞానం ఒకటే అయినప్పటికీ దృక్పథాన్ని బట్టి ఎన్ని అంచెలుగా అనేది, ఎంత విశదంగా తెలిస్తే అన్ని అంచెలుగా కనిపిస్తూ వుంటుంది. ఈ ఇల్లు కట్టడం అనేది ఒక item కింద తీసుకోవచ్చు మనం. పదిళ్ళు కట్టేవాళ్ళకి ఒక ఇల్లు కట్టడం ఒక item అవుతుంది. కానీ ఒక ఇల్లు కట్టడంలో ఎన్ని items వున్నాయి? చాలా items వున్నాయి కదా! ఉదాహరణకి ఇటుక, ఇసుక, చెక్క, సిమెంట్ అని అనుకున్నాం అనుకోండి. ఈ నాలుగూ as it is గా అట్లా మనము తెచ్చేసుకొని కట్టేసుకోవడము కాదుకదా! మళ్ళీ చెక్క తయారవడానికి అందులో ఎన్ని అంశాలున్నాయో! ఆ చెక్క మనింటికి తలుపుగానో, కిటికీగానో రావటానికి దాంట్లో ఎంతో పరిశ్రమ వున్నది. మట్టి ఇసుకగా రావటానికి, మట్టి ఇటుకగా

రావటానికి ఎంతో పరిశ్రమ వున్నది. అసలు మట్టిగా ఏర్పడటానికి ఎంతో పరిశ్రమ వున్నది. మట్టి available కాబట్టి మనం మట్టి ఒక item గా తీసుకుంటున్నాం గానీ, మట్టిగా తయారవడానికి కొన్నికోట్ల సంవత్సరాలు పడుతుంది. సూక్ష్మం నుంచి స్థూలానికి పదార్థం తయారవడానికి కొన్నికోట్ల సంవత్సరాలు పడుతుంది. ఈ మట్టి ఏర్పడిందంటే అట్లా ఏర్పడింది. ఈ ఏర్పడిన వాటిని మనం మనకి కావలసిన పద్ధతిలో ఏర్పరచుకొని, ఇల్లు తయారుచేసుకుంటాము. కానీ ఒక్కొక్క item కి దానియొక్క detail లోకి మనం వెళ్ళామనుకోండి, పరిశీలించామనుకోండి. ఉదాహరణకి ఇంటికి కావలసిన చెక్క చెట్టు నుండి వచ్చింది. ఆ చెట్టు ఎట్లా పెరిగింది? మనం పెంచితే పెరిగిందా? విత్తనం అంత పెద్ద చెట్టు ఎట్లా అయింది? భూమిలోంచి ఏమేమిటి సారంగా తను తీసుకుంటే ఈ గూడుగానో, ఇంకో గూడుగానో వచ్చింది? మరి ఇవన్నీ well formed and available కాబట్టి కదా మనం ఈ గృహాన్ని తయారు చేసుకోగలిగాము. కానీ దాంట్లో వుండే పరిశ్రమ మనం చూడం. పరిప్రశ్న లాంటిదే పరిశ్రమ కూడా. మనం పరిశ్రమ అనే పదం బాగా వాడేస్తాం కాబట్టి, పరిశ్రమ అంటే industry కదా అనేస్తాం అంతే! శ్రద్ధతో కూడిన శ్రమని 'పరిశ్రమ' అన్నారు. పరిప్రశ్న అన్నట్లుగానే. ఎంతో శ్రద్ధతో ఎన్నో కోట్ల దేవతలు ఈ రూపాన్ని నిర్మాణం చేసే కార్యక్రమాన్ని భగవత్ చైతన్యం ఆధారంగా చేస్తూ వుంటే, రకరకాల రకరకాల రూపాలు వస్తున్నాయి. ఎట్లా వస్తున్నాయంటే "తాని ధర్మాని ప్రధమాన్యాసన్" according to the previous order. దాన్నే Masonic system లో according to the new and ancient form అన్నారు. కొబ్బరిచెట్టు కొబ్బరిచెట్టుగానే రావటం. ఆ కొబ్బరి విత్తనం వేస్తే, అటువంటి కొబ్బరికాయలే మళ్ళీ రావటం. ఇంకొక కొబ్బరి విత్తనం వేస్తే దానిలాగానే రావటం. మామిడిచెట్టు మామిడిచెట్టుగా రావటం. ఈ detail ని మనం చూసినట్లయితే, ఈ 'ప్రభూత" అనే నామానికి వున్న విశ్వరూపం చాలా బాగా అవగాహన అవుతుంది. దానిమీద ఎక్కువ ధ్యానం చేయాలి. ఒక్కొక్క నామం మీద ఒక్కొక్క రోజు మనం పెట్టినా, ఒక జన్మ చాలదు. ఒక్కొక్క రోజు మనం దానిమీద ధ్యానం లగ్నం చేస్తే ఎంత detail వుందో! ఎంత planning వుందో, ఎంత designing వుందో, ఎంత engineering వుందో! Basic design వుంది. దానికి సంబంధించిన engineering data వుంది. దానికి సంబంధించిన layout వుంది. దాని ప్రకారం తయారుచేసే వాళ్ళున్నారు. "విశ్వకర్మా మనుస్త్వష్టా

స్థవిష్ఠ'' వాళ్ళందరూ ఆ పద్ధతి ప్రకారం అంతకు ముందున్నట్లుగా ఈ రూపాలు తయారుచేస్తూ వుంటారు. పెట్టిన పేరు మనకి confusion లేకుండా తాడిచెట్టు అంటే మళ్ళీ తాడిచెట్టుని చూస్తే తాడిచెట్టే మనకి గుర్తొచ్చేటట్లు, మనం ఏదన్నా బొమ్మ గీసి పట్టుకొచ్చామనుకోండి మీది ఎవరిదన్నా, నేను క్రింద పేరు రాయాలి కె. శివశంకర్ అని. రాస్తే ఎవరూ ఒప్పుకోరు కూడాను. కాదు శివశంకర్ అని నేను చెప్పాలి. ఎందుకంటే గీసిన బొమ్మకి, వున్న బొమ్మకి ఏం పొంతన వుండదు. సృష్టిలో అట్లా వుండదు. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, 'ప్రభూత' అనే పదానికి ఎంతైనా చెప్పుకోవచ్చు. నా ఉద్దేశ్యం ఏమిటంటే మీకు, నాకు తెలిసినది చాలా కొంత. ఆ కొంతలో మీకు కొంత అవగాహన చేస్తే అది పట్టుకొని మీరు వికసింపచేసుకుంటారని. ఇక్కడ కూర్చుని మనం మూర్తిగారిని చూస్తున్నామనుకోండి. నిన్న మూర్తిగారిని చూసాం. ఇవాళ మూర్తిగారిని చూసాం. మొన్న మూర్తిగారిని చూసాం. మూర్తిగారే అని మనకి ఎట్లా దృఢంగా అనిపిస్తోంది ఆయన్ని చూడంగానే. Because the form is well kept. కానీ నిన్న చూసిన మూర్తిగారికి, ఇవాళ చూసిన మూర్తిగారికి అణువులు అవే అణువులు కావు. ప్రతీ సెకండుకి కొన్ని అణువులు కట్టుకుంటూ, అదే సెకండులో కొన్ని అణువులు లయమైపోతూవుంటే మధ్యలో మనం వున్నట్లుగా కనిపిస్తూ వుంటాము. అదీ సృష్టిలో వుండే ఒక ప్రక్రియ. మనలో వుండే రజస్సు కారణంగా ఒక ప్రక్క అణువులు కట్టుకుంటూ వుంటాయి. మనలో వుండే తమస్సు కారణంగా కొన్ని కొన్ని అణువులు లయమైపోతూ వుంటాయి. ఈ మధ్యలో మనం వున్నట్టుగా, రూపంగా వుంటాము. ఈ వున్నట్టుగా కనిపించేది ఏదైతే వున్నదో, అది అట్లాగే అదే form లో మనకి, identity కి ఎక్కడా లోపం లేకుండా ఉంచుతున్నాడు కదా! రోజుకో identity, ఒక form వేసుకొని పుట్టామనుకోండి మనం. నేనేనండి మూర్తిగారినంటే, ఎక్కడ నమ్ముతాం మనం. నమ్మం కదా! అక్కడుంది నిజమైన అవగాహన ''ప్రభూత'' అన్నదానికి. ''So well formed that you are''. అటు చూడగానే అది మామిడిచెట్టు, ఆ ప్రక్కన చూడగానే అది కొబ్బరిచెట్టు అని అంత రూఢిగా ఎట్లా చెప్పగలుగుతున్నావు? Because అదే form లో వస్తోంది కాబట్టి. అట్లాగే మనుషులు కూడా. అన్నయ్య, తమ్ముడు, భార్య, భర్త ఇవన్నీ ఎట్లా గుర్తుకు తెలుస్తున్నాయంటే, because the forms are well made and well kept. మాస్టరుగారు చాలాసార్లు రాస్తూంటారు పుస్తకాల్లో. ఉప్పు ఉప్పుగానే

ఎందుకుండాలి? ఉంటుంది అది దాని ధర్మం. పంచదార పంచదారగానే ఎందుకుండాలి? సముద్రం నీరు ఉప్పగానే ఎందుకుండాలి? గోదావరి నీరు గోదావరి నీరులాగాను, కృష్ణానీరు కృష్ణా నీరులాగాను; దానివెనకాల అట్లా వుండటానికి ఎంతో శ్రమ వున్నది. ఎంతో work వున్నది. ఎంతో detail వున్నది. ఆ detail అంతా అట్లాగే workout అవుతూ వుంటుంది. అదీ తమాషా. ఇక్కడ మందకొడిగా జీర్ణశక్తి వుండేవాళ్ళు బెజవాడ వెడితే, మూడురోజులు అక్కడ మంచినీళ్ళు తాగితే జీర్ణశక్తి బావుంటుంది. ఇక్కడ మందకొడితనం ఎక్కువ. అక్కడ చురుకుదనం ఎక్కువ నీళ్ళల్లో. ఇక్కడ నేల ఎర్రగా వుంటుంది. అక్కడ నేల నల్లగా వుంటుంది. నల్లటి నేల మీద పారే నీళ్ళు కాబట్టి నల్లగా కనిపిస్తాయి కాబట్టి ''కృష్ణా'' అన్నారు. ఇవి ఏ నీళ్ళకి ఆ నీళ్ళ భావం అట్లాగే వుండటానికి, అదే తత్త్వం కలిగి వుండటానికి. ఎన్ని కోట్ల సంవత్సరాలైనా ఉప్పు ఉప్పుగా వుండటానికి, పంచదార పంచదారగానే వుండటానికి, కారం కారంగానే వుండటానికి, కర్పూరం కర్పూరంలాగానే వుండటానికి ఏమిటి basis? అదీ 'ప్రభూత' అంటే. మూడు అక్షరాలు కలిపేసి ఇచ్చేసేరు. 'ప్రభూత' అనగానే ఓహో! అంతేకదా! Well formed అనిపిస్తుంది. Such a form with so much of detail, which cannot be explained in total. సివివి గారు దీనికో భాష్యం చెప్పారు. ''ఈ well formed creation ఏర్పడటానికి భగవంతుడు ఒక పద్ధతిచ్చాడట. ఎందుకంటే మళ్ళీ తిరోధానం చెందకుండా నిరోధించడానికి. తననించి ఒక అణువు వ్యక్తం కాంగానే, ఒక జీవి వ్యక్తం కాంగానే వాణ్ణి తోసేయ్యటానికి ఇంకోటి వీడినించే వ్యక్తం అవుతుందిట. ఈ జీవికి చోటు కావాలి కాబట్టి ఆ జీవిని నెట్టుతూ వుంటాడు. నెట్టిన జీవిని నెట్టడానికి ఇంకొకడొస్తూ వుంటాడు. ఇట్లా నెట్టుకుంటూ, నెట్టుకుంటూ తయారుచేసుకొచ్చాడు ఇదంతా'' అంటారు. ఈ నెట్టుకున్న తర్వాత కొంతదూరం వెళ్ళిన తర్వాత ఈ మొత్తం మేరలో కొంత మేరే కదా సృష్టి అణువులతో చేసాడని చెప్తూ వుంటాను. ఆ పరిధి వరకు వెళ్ళిన తరువాత ఇహ అక్కడ నించి వెళ్ళడానికి చోటులేక మళ్ళీ తిరిగొస్తూ వుంటుందిట. తిరిగొచ్చి తనలో ఐక్యం అయిపోతూ వుంటాయిట ఈ జీవులన్నీ. తనలోంచి వ్యక్తం అవుతూ వుంటాయిట. మొత్తం వున్నది ఒకటే చోటు! ఆ చోటులోనే కొన్ని తిరోధానం చెందుతూ వుంటాయి. కొన్ని పురోగమనం చెందుతూ వుంటాయి. కొన్ని అవరోహణం చెందుతూ వుంటాయి. కొన్ని ఆరోహణం చెందుతూ వుంటాయి. అట్లా చక్రం తిప్పుతూ వుంటాడు. అదే

మనకి సినిమాలో విశ్వరూప సందర్శనం చూపించడానికి ప్రయత్నం చేస్తుంటారు. ఒకప్రక్క నుంచి పుట్టుకొస్తుంటే ఇంకోప్రక్క నుంచి వెళ్ళిపోతున్నారని. కానీ వాళ్ళ మధ్య ఏమీ gap వుండదు. ఎందుకంటే అణువణువుకి అట్లా gap లేకుండా atom by atom అట్లా work out చేసుకుంటూ వచ్చాడు అని సివివి గారు తనయొక్క నోట్సులో ఒకచోట రాసుకున్నారు. 'ప్రభూత' అనే భావం బాగా మనకి స్థిరపడాలి.

# 65. త్రికకుత్

అంచెలంచెలుగా అన్నారు. లేకపోతే మూడు లోకాలన్నారు. లేకపోతే మూడు నామాలన్నారు భగవంతుడు. అదీ 'త్రికకుత్' అంటే. భూర్భువత్సువర్లోకాలంటూ వుంటాం కదా! శ్రీకృష్ణుడు 'ఈ మూడు లోకాల్లో నేను చేయవలసిందంటూ ఏమీలేదు, అయినప్పటికీ చేస్తూ వుంటాను' అంటాడు. మూడు లోకాలు, మూడు లోకాలకూ అని refer చేస్తూంటారు. ఈ మూడు లోకాల్లో నన్ను జయించేవాడెవరూ వుండకూడదని కోరుతూ వుంటారు కొంతమంది. ఎవరు చెప్పినా మూడు లోకాలే. అంటే the simplest presentation of the whole creation is as three. ఈ మూడు లోకాలూ ఆయనే. ఈ మూడు భవనాలు ఆయనే. అందులో మెదటి భవనాన్ని 'వెలుగు భవనము' లేక 'ప్రజ్ఞా భవనము' లేక 'చైతన్య భవనము' అంటారు. రెండో భవనాన్ని 'శక్తి భవనము' అంటారు. మూడో భవనాన్ని 'పదార్థ మయమైన భవనం'గా చెప్తారు. ఒకటేమో కాంతి. రెండోది కాంతితో అల్లబడిన లోకము. మూడు కాంతితో అల్లబడిన లోకము ఆధారంగా ఏర్పడిన భౌతికమైన లోకము. ఈ భౌతికమైన లోకాన్ని 'material appearance' అంటారు. కాంతితో అల్లబడిన లోకాన్ని 'phenomenal appearance' అంటారు. Phenomenal appearance కి basis కాంతి. కాంతికి basis చీకటి. అది ఆయన. అంటే మనం వున్నాం. మనం ప్రొద్దున్నే లేవంగానే తెలివి వచ్చిందంటూ వుంటాం కదా! అంటే వెలిగాం అన్నమాట! అంతకుముందు వున్నాం కానీ వెలిగి లేము. మనం వెలగడం లాంటిదే ఆకాశం వెలగడంకూడా. ఉన్నవాడు వెలిగాట్ట ఆయన్నించి. ఆయన చైతన్యం వ్యక్తం అవటమే ఈ ఆకాశం ఏర్పడటం. 'ఆకాశము' అంటే అర్థం ఏమిటంటే 'వెలిగింపబడినంత మేర'. కాశము అంటే వెలుగు. 'ఆకాశము' అంటే 'the memorandum of light' అన్నమాట! అంటే ఎంతమేర వెలిగింపబడ్డదో దాన్ని 'ఆకాశము' అంటారు. మనకు కూడా లేవంగానే ఎంతమేర వెలిగింపబడతాం? దేహం వున్నంతమేర వెలిగింపబడతాం. అందుకనే లేచిన తరువాత వెళ్ళబోతూ క్రిందపెట్టుకున్న నీళ్ళగ్లాసు తన్నుకున్నాం అనుకోండి. వెంటనే చెవులకు, చేతికి, కాళ్ళకి అన్నిటికీ తెలుస్తుంది. ఎందుకనంటే ఆవరించి వున్నాం కాబట్టి. లేవంగానే first thing ఏమిటయ్యా అంటే మంచం

క్రింద పెట్టుకున్న గ్లాసు తన్నుకున్నాడు. తరువాత లేచినవాళ్లు ఆ నీళ్ళల్లో జారిపడ్డారు ఇట్లా వుంటుంది. So లేవటం అంటే ఏమిటంటే వెలిగింపబడటం అన్నమాట! మనం వున్నాం. మనం వెలిగింపబడ్డాము. మనం ఎప్పుడూ వుంటాం కాబట్టి మనం సత్యం. వెలిగింపబడతాం కాబట్టి 'చైతన్యము' అన్నారు. 'చిత్' అంటారు దాన్ని. వెలిగింపబడి అలా ఊరుకుంటామేమిటి? ఊరుకోము కదా! లేచి మంచం మీద పడుకుని కాసేపు అసలు నేను ఎందుకు నిద్ర లేచాను? అని తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. నిద్ర లేవటం అనేది ఓ పెద్ద సమస్య. లేచిన దగ్గర్నుంచి మనకు సమస్యలే! అసలు నిద్ర ఎట్లా లేచాము? అనేది అద్భుతమైన విషయం. ఎవరికి వారుగా దానికి సాధన చేసుకోవాలి. మనం సంకల్పిస్తే నిద్ర లేవలేదు. సంకల్పమే నిద్ర లేపింది మనల్ని. అదీ అమ్మవారంటే! ఇహ లే! అని అంటే కళ్ళు తెరుస్తాం. టైం చూసుకుంటాం. ఇంకొంచెం టైం వుందని మళ్ళీ పడుకుంటాం. మళ్ళీ లేపుతుంది. అయినా పడుకుంటాం. మళ్ళీ లేపుతుంది. ఎట్లా లేపుతుందంటే చివరికి తలకాయ నొప్పి వస్తుంది ఎక్కువ నిద్రపోతే. అప్పుడు పడుకుందామనుకుంటే, పడుకోడానికి తలకాయ నొప్పి అడ్డుగా వుంటుంది. అంటే మనం పడుకుందామనుకుంటే నిద్ర రావటం, మనం లేద్దామనుకుంటే నిద్ర లేవటం కాదు. నిద్ర పుచ్చేది, నిద్ర నుంచి మేల్కొల్పేది రెండూ కూడా చైతన్యమే. ఆ చైతన్యాన్ని ఒక భవనం అంటారు. అది మన first mansion. చైతన్యం మనయొక్క first house అన్నమాట! అక్కడనుంచి ఏం చేస్తామంటే, కదలకపోయినా కూర్చుని ఆలోచిస్తాం. ఇవాళ శనివారం, పౌర్ణమి, మాఘపౌర్ణమి, పనులు, cricket match, office, పౌర్ణమి meditation, సాయంత్రం class ఇటువంటివన్నీ వచ్చేస్తాయి కదా! అది phenomenal appearance. Already cricket match అనంగానే ground, players మనం అక్కడికి వెళ్ళటం ఇవన్నీ phenomenal గా mind లో వచ్చేస్తాయి. Office అనుకోండి. ఆఫీసంతా mind లోకి వచ్చేస్తుంది. ఎవడి పనిబట్టి వాడి phenomenal appearance వేసేస్తాడక్కడ. కదా! పెళ్ళనుకోండి పెళ్ళి భోజనం అనుకోండి. వాడది వేసేస్తాడు. Phenomenal appearance వచ్చిన తరువాత ఆ వెలుగు basis మనకి. ఆ రోజు programme మనకి వెలుగు. దాన్ని పట్టుకొని పోతూంటాం. ఎవడు దేనికి వెళ్ళాలో వాడు దానికి వెళ్తుంటాడు. ప్రొద్దున్న వాడి లోపలకి వెలుగు ఆధారంగా వచ్చిన భావనలున్నాయే, ఆ భావనామయమైన లోకం రెండోది. ఇహ అక్కడ్నించి వాడు తప్పించుకోవడానికి

వీలులేదు. తోమేస్తుంది లోపల్నించి అయ్యేవరకూను. అయిన తర్వాత కొంచెం ఒక్కొక్కసారి వెళ్ళకుంటే బావుండేది ఇటువంటివన్నీ అనిపిస్తుంది. అయ్యేప్పుడు మాత్రం అది తోముతూ వుంటుంది. ఇది శక్తిమయమైన లోకం. అందుకని దాన్ని దాటడం కొంచెం కష్టం. కొంచెం నిదానించి మళ్ళీ చైతన్యంలోకి, అంటే వెనక గదిలోకి అనుకో, వెళ్తే ఇవి disappear అవుతాయి. మళ్ళీ fresh గా ప్రొద్దున్నే ఒక plan వచ్చిందనుకోండి mind లోకి. ఆ plan as it is గా నడిపించెయ్యడానికి చూస్తూంటుంది. Plan మన్ని నడిపిద్దామని చూస్తూంటుంది. మళ్ళీ ఆ plan ని తీసుకుపోయి వెనక గదిలో ఒకసారి ఆ light లో verify చేసుకోవాలి. ఇట్లాగేనా ఇవాళ మనం వున్నాం, ఏమిటని. చీకట్లో plan కన్నా, light లో తీసుకెళ్ళి ఇట్లా వుంటే బావుంటుందని మళ్ళీ ఓసారి ఆ వెనక గదిలో concentration చేసామనుకోండి. చేస్తే కొన్ని మార్పులు రావడానికి అవకాశం వుంటుంది light ని బట్టి. Off చేసుకొని మళ్ళీ ఆ గదిలోకి వస్తే, ఇహ అక్కడ్నించి material appearance. మనం అనుకోకుండా అక్కడ వుండం కదా! గుడికెడదామని అనుకోకుండా గుడిలో వుండం. ముందు అనుకోవడం లేకుండా తర్వాత వుండటం అనేది దేంట్లోనూ వుండదు. కదా! జిమ్ కావచ్చు, సినిమాహాలు కావచ్చు, బీచ్ రోడ్డు కావచ్చు, ఏదైనా కావచ్చు. ఏదైనా ముందు అనుకున్న తర్వాతే కదా అక్కడికి తీసుకెళుతోంది. ఏమిటి తీసుకెళుతోంది? మనలో వున్న వెలుగే. మనలో వున్న మనమే మన చైతన్యంగా మారి, అక్కడ్నించి భావనగా మారి, భావన మన్ని ఇట్లా దూసుకు తీసుకెళ్ళిపోతూ వుంటుందండి. ఇట్లా ఈ మూడు లోకాల్లో తిరుగుతూ వుంటాం మనం. ఏవా మూడు లోకాలు? ఒకటి చైతన్యం. రెండు భావన. మూడు బహిర్గతమైన ప్రపంచం. చైతన్యాన్నేమో 'సువర్లోక' మంటారు. భావనామయమైన ప్రపంచాన్ని'భువర్లోక' మంటారు. బయట చేసే పనులన్నీ కూడా 'భూలోకం' అవుతుంది. ఇట్లా ఈ మూడు లోకాల్లోనూ ఆయన వెలుగులు తిరుగుతూ వుంటాయిట. ఆయనా తిరుగుతూనే వున్నాడు అట్లా. మనమూ తిరుగుతూనే వున్నాం. కానీ మనం నాలుగో వాళ్ళం. ఈ మూడిటి వెనకాల వుండేవాళ్ళమన్నమాట! ఈ మూడు మన mansion. ఈ మూడు మనకివ్వబడిన భవనాలు. భావనలు చేసుకునే చోట్లన్నమాట! అక్కడుండే భావనను బట్టి ఆ రోజు జరిగిపోతూ వుంటుంది. ఈ మూడు మనకెట్లా వుంటాయో దాన్నిబట్టి వాటికి పేర్లు కూడా వుంటాయి. ప్రజ్ఞ, శక్తి, పదార్ధము అని మనకి పెద్దలు చెప్పిన పేర్లు.

Consciousness, Source and Matter అని దాన్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసుకోవచ్చు. దాన్నే శుద్ధ తెలుగులో తెలివి, ఆలోచన, పని అనుకోవచ్చు. తెలివిలోకి మనమే దిగితున్నాం. తెలివిలోంచి ఆలోచన లోకి మనమే దిగుతున్నాం. ఆలోచన లోంచి పనిలోకి మనమే దిగుతున్నాం. అంటే మనమే వ్యాపనం చెందుతున్నాం అన్నమాట! చెంది ఏం చేస్తాం? అంతా అయిపోయిన తర్వాత మళ్ళీ retrain చేస్తాం సాయంత్రం. బయట పనులయ్యి ఇంటికొస్తాం కదా! ఇంటికొచ్చిన తర్వాత ఇంట్లో పనులు కూడా తర్వాత కాస్సేపటికి ఆగిపోతాయి. ఏవి? స్నానం చేయటం, బట్టలు మార్చుకోవటం, భోజనం చేయటం అంటే withdrawl కి predecessors అన్నమాట ఇవి. కాసేపు ఓపిక వుంటే కబుర్లు చెప్పటం లేకపోతే నిద్రపోవటం. ఎట్లాగో అట్లా మొత్తానికి withdrawal అయిపోతాము. పనుల్లోంచి ఆలోచనలోకి withdrawl. ఆలోచనతో మంచం ఎక్కుతాం. ఆ చేసిన పనులు బాగుండకపోతే నిద్రపట్టదు. అక్కడ ఆగుతాం. ఆ రోజు చేసిన పనులు బాగా జరగలేదనుకోండి, మంచం మీద కాసేపు అక్కడుండరా అంటుంది. ఎందుకనంటే ఈ భావమయమైన లోకం నించి చైతన్యమయమైన లోకం, అక్కడ్నించి వుండటం అనే అసలు స్థితికి రావటానికి ఆ భావం దగ్గర కొంచెం పీకులాటగా వుంటుంది. నిద్ర పట్టలేదు అంటే అర్థం అది. లేకపోతే ఆరోగ్యంలో తేడా లొచ్చినాయనుకోండి, నిద్ర పట్టలేదు. ఆలోచనల్లో తేడా వచ్చిందనుకోండి, నిద్ర పట్టలేదు. ఏదో మొత్తానికి కొంత జరుగుతుంది. కొంతమంది ఇట్లా మంచం ఎక్కగానే నిద్రపోయే వాళ్ళుంటారు. వాళ్ళకి లోపల conflict చాలా తక్కువుంటుంది చేసే పనులు ఎటువంటివైనా. Conflict లేకపోవడం గొప్ప విషయమేనా? గొప్ప విషయం. గొప్ప విషయం గానీ, చేసిన పని గొప్పదా? అంటే అక్కడ నాకు పరిశీలన చేయగా ఏం తెలిసిందంటే, చేసిన పనిలో వాడికి doubt లేకపోతే వాడికి నిద్రపడుతుంది. ఓ వేటగాడు వున్నాడనుకోండి. అరణ్యంలోకి వెళ్ళి వాటిని వీటిని చెండాడేసి, చంపేసి పట్టుకొచ్చాడనుకోండి. వాడికి దానిమీద ఇది మంచిది కాదేమో అన్న భావన లేకపోతే హాయిగా నిద్రపోతాడు. లేకపోతే నలుగుర్ని కొట్టి వచ్చి హాయిగా నిద్రపోయే వాళ్ళు కూడా వుంటారు. అట్లాగే పవిత్రమైన కార్యక్రమాలు చేస్తూ సంఘర్షణ లేనివాళ్ళుంటారు. సంఘర్షణ అసలు లేకపోవడం అన్నది పరిపూర్ణమైన మానవత్వం వచ్చిన వాళ్ళకే! కొంత మందికి చేసే పని బాగుండకపోయినా acceptable. లంచం తీసుకొని నిద్రపోయే వాళ్ళుండరూ? మామూలుగా అయితే

నిద్రపట్టకూడదు. ఎందుకు నిద్రపోతున్నారంటే, ఇంక వాళ్ళకి అది acceptable. Conflict లేదు. అబద్ధం ఆడుతూ మనం నిద్రపోవట్లా? సత్య హరిశ్చంద్రులు ఎవరున్నారు? లేరుకదా! అబద్ధం ఆడుతున్నాం కదా! నిద్రపోతున్నాం కదా! అంటే మనకి అబద్ధం ఆడటం యందు పెద్ద చుర్రు లేదన్నమాట! చుర్రు కలిగినప్పుడు నిద్రరాదు. అంటే నీ లోపల ధర్మములు మేల్కొంచినపుడు నువ్వుగా కావాలి కాబట్టి నిద్రరాదు. అలాగే నిద్ర రాకపోవడానికి ఘర్షణ వచ్చిందనుకోండి. వెధవ పనులు చేసారు అందుకనే నిద్రరాలేదు అనబోకండి. వెధవ పనుల వల్ల కాదు, నీ లోపల నీకు తెలిసిన మంచి, ఇంకా నీకు తెలియని మంచి వీటిమధ్య ఘర్షణ జరుగుతున్నప్పుడు నిద్రరాదు. కాస్సేపు అట్లా ఇట్లా ఊపి, అంటే నిన్ను కొంచెం introspection కి time ఇస్తుంది ప్రకృతి తల్లి. ఏమైనా కొంచెం బాగుపడతాడేమోనని! Main issue ఏమిటంటే మళ్ళీ మనం పనుల్లోంచి ఆలోచనల్లోకి, ఆలోచనల్లోంచి నిద్రలోకి వెడతాం. దిగి వచ్చేటప్పుడు నిద్రలోంచి ఆలోచనల్లోకి, ఆలోచనల్లోంచి పనుల్లోకి వెడతాం. మధ్యలో ఒక భవనం miss అయిపోతూ వుంటాం ఎప్పుడూ. లేవంగానే ఆలోచనల్లోకే తప్ప, చైతన్యవంతులం అయ్యాం, కాస్సేపు ఇట్లా వుందాం. భావనల్లోకి తర్వాత దిగుదాం అని అనుకుంటామా? అనుకుంటే చాలా అదృష్టం. ప్రతిరోజూ ప్రొద్దున్నే మనం చైతన్యవంతులం అయినప్పుడు అట్లా కాస్సేపు వుండటం. ఏది? Mind లో ఆ రోజు programme పడకుండా. అది పడతా పడతా అంటూ వుంటుంది. అది పడతా పడతా అనేదాన్ని పడనీయకుండా వుంచగలిగితే చాలా గొప్ప విషయం. అదే 'ధ్యానం'అంటే. 'ధ్యానం' అంటే ఈ పడే ఆలోచనలు పడకుండా కాసేపు వుండమని, పగలంతా నీదే time, కాసేపు ఇట్లా వుండనివ్వండని అడగటమన్నమాట! మనం వున్నాము. మనం కాంతివంతులము అయినాము. ఇంతకుమించి భావన వుండదన్నమాట. కాంతికి సంబంధించిన భావన తప్ప, ఇంకోటి లేని స్థితిలో వుండటాన్నే ''awareness'' అంటారు. లేకపోతే ''consciousness'' అంటారు. లేకపోతే ''చైతన్య స్థితి'' అంటారు. మనము చాలా తొందరగా split second లో ఆ room దాటేస్తాం. ఆ భవనం దాటేస్తాం. దాటేసి సరాసరి జర్రున జారి ఆలోచనల్లోకి వస్తాం. ఉండటం నించి చైతన్యవంతులం అయి ఆలోచనలు మనం చేస్తున్నపటికీ, సరాసరి జారిపోయి ఆలోచనల్లో పడిపోతాం. మధ్యలో కాస్సేపు మనకి అవకాశం వుంటే, ఆ అవకాశాన్ని బట్టి పనుల మధ్య

కాసేపు ఇందులో నించి మొదటి ఇంట్లోకి వెళ్ళటానికి ప్రయత్నం చేయాలి. ఇప్పుడు చెప్పే డొక్కు భాషలో చెప్పాలంటే ‘relaxation technique’ అని చెప్పచ్చు దాన్ని. చేస్తున్న పనిలోంచి ఓ 5 నిముషాలు withdraw అయిపోయి, అట్లా వున్న వాటిని let them wait, let things wait అన్న భావనకొచ్చి, మన గురించి కళ్ళు మూసుకొని లోపల మొత్తం అంతా మనం జ్యోతి స్వరూపులము అనే భావన చేసుకున్నామనుకోండి. మళ్ళీ fresh గా తయారవుతాము. నిద్రలో జరిగేది అదే. అదే freshness మళ్ళీ వస్తుంది. దానికి time ఎక్కువ ఇస్తూ వుండాలి. ప్రొద్దున్న 15 నిముషాలు, సాయంత్రం 15 నిముషాలు అనేది ఓ పద్ధతి. ప్రతి గంటకి కనీసం ఒక 2 minutes off చేసామనుకోండి. చూడండి చాలా బావుంటుంది effect. అందరికి electronic watches, గోడ గడియారాలు వున్నాయి కాబట్టి అది గంట కొట్టినప్పుడో, టిక్ టిక్ మన్నప్పుడో గంటకి ఓ 2 minutes off చేయండి. Actual గా ఒక 2 minutes అంటే మనం పెద్ద కోల్పోయేది వుండదు. Off చేసి మళ్ళీ on చేసుకోండి. Freshness ఎట్లా వుంటుందో గోచరిస్తుంది. చాలా ఎక్కువగా వుంటుంది. అట్లా  మనకి రోజుకి కనీసం 14 సార్లు off చేసి మళ్ళీ on  చేయటం అనే ఒక practice వస్తే, ఈ thinking process ని off చేసే ఒక technique మనలో develop అవుతుంది. దాన్ని కావాలంటే మీరు ప్రొద్దున్న, సాయంత్రం కొంచెం విరామ సమయంలో ఎక్కువగా prolong చేసుకోవచ్చు. నిజానికి మనం కళ్ళు మూసుకుంటాం గానీ ప్రొద్దున్న, సాయంత్రం ఆలోచన లేకుండా ఒక్క నిముషం వుంటుందా? కొన్ని సెకండ్లు వుంటే ధన్యుడు. ఏదో గంభీరంగా మూసుకు కూర్చుంటాం తప్ప, మాటిమాటికీ పోతూ వుంటుంది. పట్టుకొచ్చి పెడుతూ వుంటాం. పోతూ వుంటుంది. పట్టుకొచ్చి పెడుతూ వుంటాం. ఇదే కదా జరిగేది. అసలు పట్టుకొచ్చి పెట్టాలన్న భావన లేకుండా మొత్తం ఒకే ఆలోచనలో 15 నిముషాలు అయిపోయి, గాయత్రికి హమ్మయ్య అనుకొనే ఒక పద్ధతి కూడా వుంది. చాలా పద్ధతులు వుంటాయి ఇందులో. ఇవన్నీ అతి రహస్యములు. ఎందుకంటే ఎవరికి వారికి సంబంధించినవి కాబట్టి. ప్రతివాడికీ ప్రక్క వాడిమీద doubt గా వుంటుంది. నిజంగా వీడు 15 నిముషాలు ఆలోచన లేకుండా కూర్చున్నాడా? 15 నిముషాలు కూర్చోవటం అనేది మహర్షులకు మాత్రమే సాధ్యం. మనం 15 నిముషాలు ఎందుకు కూర్చుంటాం అంటే ఈ 15 నిముషాల్లో కనీసం వందసార్లు అయినా వెనక్కి పీకావా లేదా? అసలు ఒక్కసారేనా పీకావా? ‘ఇది వస్తూనే

వుంటుందిరా దాన్ని ఆపబోక. నీ సంగతి నాకు తెలుసు కదా' అని చెప్పారు సి.వీ.వీ. గారు. ఆ వచ్చేదాన్ని ఆపక. ఎట్లా వస్తుందో చూడన్నారు. ఎట్లా వస్తుందో కనక నువ్వు చూసినట్లయితే అది ఆగిపోతుంది. మనం చూస్తూండగానే అది మనల్ని లాగేస్తుంది ఏడిశావులేరా అని. దాంతో వెళ్ళిపోతాం. వెళ్ళి వెళ్ళి ఒక్కొక్కసారి అసలు ''ఓం భూర్భువత్సువ:'' అనేంతవరకు తిరిగిరాం. మధ్యలో మూడుసార్లు తిరిగి వచ్చినవాడు ధన్యుడు నా లెక్కలో. ముప్పై సార్లు తిరిగి వచ్చాడనుకోండి 15 నిముషాల్లో, అబ్బో చాలా గొప్ప. ఒక్క నిముషం అందులో వున్నాడనుకోండి. He is something very great. ఇది సత్యం. మనం రోజూ చేసే కార్యక్రమాల్లో ఒక గంటలో, ఒకసారి ఒక one minute withdraw అయిపోతున్నామనుకోండి. నా ఉద్దేశ్యంలో అది చాలా help చేస్తుంది మనకి. ఏది? ఈ మొదటి భవనంలో వుండటానికి. ఎందుకంటే ఆ భవనంలో ఎక్కువ కూర్చుంటే ఈ భావనలు మీదపడవు. అక్కడనుంచి భావనల్లోకి వెళ్ళినా, మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళి verify చేసుకోవాలి. అందుకనే బుద్ధిని ఉపయోగించమంటారు మాటిమాటికీ. బుద్ధి అంటే తెలివే. తెలివి అంటే వెలుగు. ఆ బుద్ధి అనే వెలుగును బాగా నాలో పెంపొందించమని అడగటమే ''గాయత్రీ మంత్రం''. మన యొక్క వెలుగుని బుద్ధి అంటారు. ఆ బుద్ధి ఎంత పెరిగితే, దాన్నిబట్టి వుంటుంది వచ్చే ఆలోచన. అందుకని దాన్ని పెంచు, దాన్ని పెంచు అని ఎవర్ని అడుగుతున్నాం అంటే మొత్తం వెలిగింపబడి వుందే ఆకాశం, అదే 'గాయత్రి' అంటే. భగవంతుని యొక్క వెలుగుని 'గాయత్రి' అంటాం. అది మనలో కొంచెం మేర అయినా పెరిగితే, అంత మేర కాస్త మనకి సులభంగా వుంటుంది. అందుకని గాయత్రీ మంత్రం చేసుకోవాలని చెప్పారు. కాబట్టి ఈ మూడు mansions లోకి మనం ఈ విధంగా అవతరణం చెందుతూ వుంటాం. మళ్ళీ ఆరోహణము చేస్తూ వుంటాం. అది రోజూ జరుగుతూనే వుంటుంది. జరుగుతుందని తెలియటం వలన కొంచెం ఎక్కువగా చూడగలుగుతాం. లేకపోతే అంతా mechanical. లేచాం, తిన్నాం, తిరిగాం, తిట్టాం, ఇంటికొచ్చాం, పడుకున్నాం అయిపోయింది. మళ్ళీ మర్నాడు మామూలే. అదో పద్ధతి. ఇక్కడ extra ఏమిటయ్యా అంటే ఈ స్థితులు తెలుసుకోవడం అన్నమాట. ఈ మూడు స్థితులు తెలుసుకుంటే ఎక్కువసేపు మనం చైతన్యంలో వుండగలిగామనుకోండి, అప్పుడు ఆయన చాలా సాధన చేసాడండి. ఆయన మహాత్ముడండి. ఇలా చాలా వస్తూంటాయి కదా! మహాత్ములకి సంబంధించిన పేర్లు

ఎన్నున్నాయో! స్వామీజీ అంటుంటారు. గురువుగారు అంటుంటారు. మాస్టర్ అంటుంటారు. ఇవన్నీ నామాలేగా. So మూడు variety of నామాలు వచ్చేస్తాయి మనకి. ఆ నామాలు పంగనామాల్లాంటివి కాదు. ఇంకొకడు బాగా రెండో అంతస్తులో ఆలోచనల్లో ఎక్కువ వున్నాడనుకోండి. 'అబ్బో చాలా IQ అండి ఆయనకి' అంటూ వుంటారు. ఇట్లా మూడు లోకాల్లో వుండేవాళ్ళకి ఏ ఏ పేర్లున్నాయో అవన్నీ భగవంతుడి పేర్లే. అసలు పేరు తెలివిలో వున్నప్పుడు. 'సువ:' అన్నప్పుడు, శక్తిలో వున్నప్పుడు 'భువ:' అన్నప్పుడు, పదార్ధమయమైనప్పుడు 'భూ:' అన్నట్టుగా ఇందులో జీవించే జీవులకు కూడా రకరకాల పేర్లు వస్తూంటాయి. వీటన్నిటిలోకి దిగివచ్చేది ఎవరు? మనమే కదా! నిద్రలోంచి బయటకి వచ్చి, అక్కడ్నించి తెలివిలోకి వచ్చి, తెలివి లోంచి ఆలోచనలోకి వచ్చి, ఆలోచన లోంచి పనిలోకి వచ్చి ఇట్లా మనమే కదా వస్తున్నాం. ఎట్లా వస్తున్నామంటే కిరణమల్లే వ్యాపించుకుంటూ వస్తున్నాం అట్లా దూసుకుంటూనూ. అదెవరూ? మనమే! అదే భగవంతుడంటే కూడానూ. భగవంతుడు కూడా సృష్టిలోకి అట్లాగే దుసుకుంటూ వస్తూ వుంటాడు కిరణాల రూపంలో. అంటే ఏమీ లేని ఒక స్థితి నించి ఆకాశాన్ని ఏర్పరచుకొని, ఆకాశం నించి దూసుకు రావటానికి ఒక కేంద్రం పెట్టుకుంటాడు. దూసుకెళ్ళాలంటే ఒక కేంద్రం వుండాలి. కేంద్రంలో నించి బహిర్గతం అవుతూ వుంటాడు. అదే 'పద్మనాభుడు'. ఏదో ఒక centre. అక్కడ పొడుచుకొని బయటకు వస్తాడన్నమాట. బయటకు వచ్చినప్పుడు భళ్ళున వెలుగు వచ్చి కిరణాలేర్పడతాయి. Light వేయంగానే వేలకువేలు కిరణాలు పుట్టి అన్ని ప్రక్కలకి వ్యాపనం చెందుతుంది, దాని వెనకాల తప్ప కదా! ఏ light కైనా దానికో ఛాయ వున్నది. ఒక shade వున్నది. అందుకనే ''ముక్తా విద్రుమ హేమ నీల ధవళ చ్ఛాయై'' అన్నారు. ఛాయ కూడా ఒక face అమ్మవారిది. అంటే ఏమిటి? Background అన్నమాట. అటుమాత్రం పడదు. ఎందుకంటే అటు గురువు వుంటాడు. అటు వేయటానికి వీలులేదు. ఎందుకంటే అక్కడ 'నా మీద ప్రయోగించక' అన్నట్టుగా వుంటుంది. మాస్టరుగారు 'ప్రపంచంలో మోసపోతారేమో మీరు. తెలివిగా బ్రతకాలని మీకు నేను తెలివితేటలు నేర్పితే, అవన్నీ నామీద వాడుతున్నారు మీరు. ప్రయోజకులు అవకుండా పాడైపోతారు' అని చెప్పుండేవారు. అట్లాగే వెలుగు తన పుట్టిన చోటుకి వెనకాల అంటే, ఎవరైతే తనకి మూలమో అటుపోదు. అందుకనే దీపం వెలిగిస్తే క్రింద మాత్రం పుట్టిన చోట మర్యాద ఇచ్చి అట్లా వుంటుందన్న మాట.

ఆ ఛాయాముఖం ఎందుకయ్యా అంటే వెనకాల వున్నది ఆయన కాబట్టి. మనం కూడా అంతే. నిద్రలో అట్లా వుంటాం. నిద్ర లేవంగానే మొత్తం వెలుగంతా అయిపోతుంది. అయిపోయి అందులో నించి దూసుకొని బయటకు వచ్చి, అక్కడ్నించి భావమయ మైన లోకాల్లోకి, ఇంకో కేంద్రంలో నించి మళ్ళీ దూసుకొచ్చి, అక్కడ్నించి ఇంద్రియమయ మైన లోకాల్లోకి, అక్కడ్నించి భౌతికమైన లోకాల్లోకి దూసుకొచ్చి, దూసుకొచ్చి, దూసుకొచ్చి వ్యాపనం చెందుతుంటాం. ఇట్లా సృష్టి మొత్తం అంతాకూడా భగవంతుడు ఉంటాడు. మనకి, మన సృష్టి అంటే, మన పరిధి ఎంతో మనకి తెలీదు. మహాత్ముల పరిధి శరీరాన్ని మించి వుంటుంది. సామాన్యులకి శరీరం అంతా కూడా వుండదు. అందుకనే శరీరంలో కొన్ని కొన్ని పనిచేస్తూ వుండవు. ఎందుకంటే అక్కడ లేదన్నమాట. తిమ్మిరెక్కిం దనుకోండి కాసేపు అక్కడ లేనని చెప్పడానికి తిమ్మిరెక్కుతూ వుంటుంది. భగవంతుడట్లా ఒక cosmic centre. అక్కడ్నించి further proceed అన్నారు. Proceed అనంగానే వేలకువేల కోటానుకోట్ల కిరణాలు పుట్టి, అక్కడ్నించి కొన్ని కోట్ల సవితృ మండలాలు. అందులోంచి మళ్ళీ సూర్యమండలాలు. అందులోంచి మళ్ళీ గ్రహాలు, గోళాలు. ఆ గోళాల మీద జనాలు ఇట్లా...ఆయనే ఇన్ని కిరణాలు కిరణాలుగా తనే దూసుకుంటూ వస్తున్నాడు. అంటే గడప లేర్పరచి, గడపలు దాటుకుంటూ వస్తూ వుంటాడన్నమాట. ఆవరణ లేర్పరచి ఆవరణల్లోంచి బయటకి వెళ్ళటానికి మళ్ళీ ద్వారాలు పెట్టుకొని, ఆ ద్వారాల్లోంచి తనే వ్యక్తమవుతూ వుంటాడు. ఒక్కొక్క ద్వారం దాటినప్పుడల్లా ఒక్కొక్క ముసుగు పడుతూ వుంటుంది. ఈ బయల్దేరినవాడు ఏడు ద్వారాలో, తొమ్మిది ద్వారాలో, మూడు ద్వారాలో మన లెక్క పట్టి ఎట్లా అయినా పెట్టుకోవచ్చు. బయటకు వచ్చేసరికి ఇవన్నీ వేసేసుకొని వస్తాడన్నమాట. Bathroom లో వున్నాం. బయటకు వచ్చినప్పుడు టవల్ కట్టుకొని వస్తున్నాం. (మామూలుగా పెద్దవాళ్ళు ఏం చెప్తారంటే బట్టల్లేకుండా స్నానం చేయక అని.) వచ్చిన తర్వాత ఏం చేస్తాం? ఓ బట్టవేస్తాం. ఏదో బనీను, డ్రాయిరు. ఆ తర్వాత ఇంకో బట్టవేస్తాం. ఇంట్లో వున్నప్పుడు ఒక పద్ధతి. బయటకు వెడుతుంటే ఇంకొన్ని బట్టలువేస్తాం. పెళ్ళికి వెడుతుంటే షర్ట్ పైన కోటువేస్తాం. ఇవన్నీ మరి వేసుకొస్తున్నవే కదా! అంటే బహిర్గతమైన కొద్దీ ఇట్లా covers వేసుకొస్తూ బయటకు వస్తారు. అందుకనే ఈ సృష్టి అంతా కూడా ఇన్ని రూపాలుగా వున్నా,

కేంద్రంలో వుండే చైతన్యం ఒకటే అని గుర్తు తెచ్చుకోవడానికి కొంచెం ఇబ్బంది అవుతుంది. కారణం ఏమిటంటే ఇన్ని ఆవరణలు వున్నాయి కాబట్టి.

## 66. ధామ

ఇన్ని ఆవరణలను దాటుకుంటూ, వీటినన్నిటినీ చొచ్చుకుంటూ వచ్చి వ్యాపనం అయ్యే కిరణం ఏదైతే వుందో దాని పేరు 'ధామ'. 'ప్రభూత త్రికకుత్ ధామ'. 'ధామ' అంటే అట్లా చొచ్చుకుపోయి వ్యాపనం చెందుతున్న కిరణం. దానికి ఇంకొక పేరు అశ్వము. 'అశ్నుతే ఇది గమన: అశ్వ:' అనిచెప్పి మనకి ఒక సూక్తము వున్నది. ఏమిట్ట అది? కొంతదూరం పరిగెడితే వెనకాల ground కూడా glow అవదుట. మనం మెట్లెక్కి పైకి వచ్చేమనుకోండి. క్రింద గేట్ దగ్గర లేంగా. కానీ కిరణం అట్లాకాదు. కిరణం ఆ light దగ్గర్నుంచి మన దగ్గరకి వస్తూంటే మొత్తం అంతా కూడా బయల్దేరిన చోటు దగ్గర్నుంచి వెలిగించే చోటు వరకు మొత్తం అనుస్యూతంగా వుంటుంది. ఎక్కడా మధ్యలో అంతరాయం ఉండదు. అదీ కిరణానికీను, కిరణం కానివాళ్ళకి తేడా. అట్లా వుండేవాళ్ళు కిరణ్ అని పేరు పెట్టుకోవాలి. అంటే వ్యాపనం చెందుతూ వుంటుదన్నమాట. ఎంత జరిగితే అంత వ్యాపనం. ఇపుడు సూర్యుడు దగ్గర్నుంచి వచ్చిన కిరణం ఎంత వ్యాపనం చెంది, సాగి మన భూమి వరకూ వచ్చింది. మధ్యలో ఎక్కడా అది బ్రేక్ వుండదు దానికి. బ్రేక్ వుంటే ఇంక ఎక్కడ్నించీ ప్రసరించటం అనేది వుండదు. అదీ ధామ.

# ౬౭. పవిత్రమ్

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

# ౬౮, ౬౯, ౭౦. మంగళం, పరమ్, ఈశానః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## 71, 72, 73, 74. ప్రాణదః, ప్రాణః, జ్యేష్ఠః, శ్రేష్ఠః

**( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)**

# 75, 76, 77.ప్రజాపతిః, హిరణ్యగర్భః, భూగర్భః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## ౭౮, ౭౯. మాధవః, మధుసూదనః

**( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)**

## 80. ఈశ్వరః

'ఈశ్వర' అనే శబ్దానికి ఒక ప్రత్యేకమైన స్థానం వున్నది. 'అన్నిటికన్నా పెద్ద' అనే ఒక భావన, 'అన్నిటికి కేంద్రము' అనే ఒక భావన! 'అందరియందు కేంద్రము' అనే ఒక భావన. ఈశ్వరుడు ఒకడుంటే, పరమేశ్వరుడు ఒకడుంటాడు. సృష్టికి అతీతంగా వున్న భగవత్ తత్వాన్ని 'పరమేశ్వరుడు' అంటారు. సృష్టి యందు, సృష్టికి కేంద్రంగా ఉన్న తత్వాన్ని 'ఈశ్వరుడు' అంటారు. ఆ కేంద్రమే లేకపోతె సృష్టి లేదు. అలాగే మనం ఎరిగిన ఈ కోటానుకోట్ల జీవరాసులన్నింటికీ కూడా కేంద్రంగా వుండే వాడిని 'ఈశ్వరుడు' అంటారు. ఏ వస్తువుకైనా, ఏ ప్రాణి కైనా, ఏది లేకపోతే అది వుండదో, దాన్ని 'ఈశ్వరుడు' అంటారు. అంటే మనవరకూ ఆయన లేడనుకోండి, మనం ఇవన్నీ చెప్పుకోడానికి ఏమీ లేదు. అంటే అణువులో కేంద్రంగా ఉంటాడు. అన్నిటియందు కేంద్రంగా ఉంటాడు. ఈ మొత్తం విశ్వవ్యాప్తంగా ఏర్పడిన సృష్టి యందు, సృష్టికి కేంద్రంగ ఉంటాడు. ఎక్కడెక్కడ ఈ కేంద్రం withdraw అవుతుందో, అక్కడల్లా ఆ రూపం పడిపోతూ వుంటుంది లేక నశించిపోతుంది. మనయందు కూడా హృదయమునందు భగవంతుడు ఈశ్వరుడై నిలిచి ఉండటం వలన, మనం ఈ కార్యకలాపాలన్నీ చేసుకోడానికి, ఈ జీవితాన్ని అనుభూతి చెందడానికి అవకాశము ఏర్పడింది. ఈశ్వరుని యొక్క అస్థిత్వము మన యందు లేనట్లయితే ఏంలేదు.

'ఈశ్వరః సర్వ భూతానాం హృద్దేశేర్జునా తిష్ఠతి'

అంటే, ఓ అర్జునా! సర్వ భూతములయందు ఈశ్వరుడు హృద్దేశము యందు అనగా హృదయముల యందు తిష్ట వేసుకొని కూర్చొని వున్నాడు లేక ఆసీనుడై ఉన్నాడు,అని చెప్తాడు గీతలో. ఆయన లేకపోతే మన ఈ శరీర వ్యాపారమేది జరగదు. అంటే మన బుద్ధి, మన మనస్సు, మన ఇంద్రియములు వీటన్నిటి కదలికకి కేంద్రం ఏది అయితే వున్నదో, అదియే జీవునికి కేంద్రం. దాన్నే మన జగద్గురుపీఠంలో మన మాస్టరుగారు మనకి ఒక పవిత్రమైన యంత్రం ఒకటి ఇచ్చి ఉన్నారు. 'ఒక చుక్క దాని చుట్టూ ఒక వృత్తము'. అందులో చుక్కని ఈశ్వరుడిగా భావన చేయాలి, దాని చుట్టూ ఉన్న వృత్తమును జీవుడిగా భావన చేయాలి. చుక్కకి మొదటి ఆవరణ జీవుడు. అక్కడ నుంచి మిగతా ఆవరణలు జీవుడి నుండి వెలుగు

అంటే బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము  ఇట్లా ఆవరణలు వస్తాయి. ఎన్ని ఆవరణలు పెంచుకుంటే అన్ని వృత్తములు అంటారు. ఈ వృత్తములన్నిటికి కేంద్రముగా ఉన్న ఒకే ఒక తత్వాన్ని 'ఈశ్వరుడు' అంటారు.  మనలో ఈశ్వర తత్త్వం withdraw అయితే ఏవిధంగా పడిపోతామో, అలాగే ప్రతి అణువుకీ కేంద్రమున్నది. Nucleus, దానిచుట్టూ electrons వుండటం, దాన్ని ఆసరా చేసుకొని protons వుండటం, ఇవన్నీ మనకి అణువు గురించి తెలిసిన వాళ్ళు చెప్తుంటారు. ఏది మనం అణువుగా గ్రహిస్తున్నామో అదే మనం సూర్యమండలంగా కూడా గ్రహించవచ్చు. సూర్యుడు ఆధారంగా ఎన్నో గోళాలు తిరుగుతున్నాయి కదా! సూర్యుడు లేకపోతే, ఈ గోళాలన్నీ తమ చుట్టూ తాము తిరుగుతూ, సూర్యుడి  చుట్టూ తిరిగే స్థితి లేదు. అంటే ఏమిటీ? ఈశ్వర అనే కేంద్రము సూర్యుని యందు ఉన్నది. మనుషులకి సూర్యుడు అనే కేంద్రము హృదయమునకు సంకేతముగా మనకి జ్యోతిర్విద్య చెప్తుంది. హృదయకేంద్రమునందు వున్నవాడిని ఈశ్వరుడుగా మనం భావన చేసుకోవాలి. అందుకనే ధ్యానము సమయములో హృదయము నందు ఆ కేంద్రమును ఒక 'విద్యుత్ బిందువు'గా దర్శనము చేయమని చెప్తారు .

'నీవారశూకవర్తన్వీ   పీతాభాస్వత్యణూపమా
తస్యా  శిఖయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః'

సబ్రహ్మ సశివ  స్సహరి..... వున్నాయి కదా  పరమస్వరాట్ వరకు!  అక్కడ ఒక చిన్న బియ్యపు గింజ మొన అంత బిందువుగా electric blue light లో బిందువుంటుంది. దాన్నే 'ఓంకార బిందు సంయుక్తం' అన్నారు. ఈ బిందు ఆధారంగా  జీవుడి యొక్క ఆవరణ, జీవుని ఆవరణ చుట్టూ మిగతా మనస్సు, బుద్ధి, అహంకారాలు ఏర్పడతాయి. అంటే జీవకోటిలో ప్రతి జీవరాశి యందు, చీమ నుంచి బ్రహ్మ వరకు, ప్రతి దానికీ ఒక కేంద్రం వుంటుంది. ఆ కేంద్రమునే 'ఈశ్వరుడు' అంటారన్నమాట! ఆ కేంద్రం అక్కడ నుంచి తిరోధానం చెందినట్లైతే ఇహ అక్కడ ఆ జీవుడు ఉండడు. భగవంతుడియందు ఐక్యం చెందిపోతాడు. అది మనకి మన వరకు సత్యం. ప్రతి ప్రాణికోటికి సత్యం. మన భూమికి కూడా అటువంటి కేంద్రం ఒకటి ఉన్నది. ఆ కేంద్రాన్ని భూమికి ఈశ్వరకేంద్రంగా చెప్తారు, దాన్నే పెద్దలు 'శంబళ' అనే గ్రామము నందు వున్నది అని చెప్తారు. ఈ శంబళ అనే గ్రామము, మన హిమాలయమునకు ఉత్తరముగా ఉన్న ఒక ప్రదేశములో, ఈ

భూమికి ఈశ్వర కేంద్రముగా వున్నట్టుగా పెద్దలు చెప్తారు. ఆ కేంద్రం యొక్క అస్థిత్వము వలన భూమి యొక్క అస్థిత్వము ఉన్నది. ఆ కేంద్రము కనుక తిరోధానం చెందితే భూమి, చుట్టూ వుండే చోటులోకి, పంచభూతములలో కలిసి పోతుంది. అది వుండబట్టే గోళంగా వున్నప్పటికీ నీరు, భూమి చుట్టూ అట్లా అంటిపెట్టుకు వున్నది. అది ఉండబట్టే భూమితన చుట్టూ తానూ తిరుగుతూ ఉన్నది. ఇట్లా ప్రతి గోళానికి ఒక కేంద్రము వున్నది. మూడు ఒంతులు నీళ్లు, ఒక ఒంతు భూమిగా ఉన్నది ఈ భూగోళం. ఈ గోళంలో ఆ నీరు అట్లా ఎలా ఇమిడి ఉన్నదనేది అత్యాశ్చర్యకర మైన విషయం! నీళ్ళు లోపల కేంద్రం యొక్క ఆకర్షణశక్తి వల్ల వున్నాయి. లేకపోతె ఉండవు. అది భూమికి సంబంధించిన ఈశ్వర తత్త్వం. అలాగే ప్రతి గోళానికి ఒక కేంద్రమున్నది. ఇలా ఎక్కడకి అక్కడ ఒక అవతరణ చెందితే, ఒక రూపం కానీ ఏర్పడినట్లైతే, ఆ రూపానికి ఒక కేంద్రంగా ఉన్నవాడు ఈశ్వరుడు. సృష్టి లోపల, మొత్తం సృష్టికి ఒక కేంద్రంవుంటే, అక్కడ నుంచి సృష్టి విచ్చుకుంటున్నప్పుడు ఒక్కొక్క కేంద్రంగా మళ్ళీ తానే దిగివస్తూ వుంటాడు. ఎట్లా వుంటుందంటే, ఒక పెద్ద వ్యాపారం మనం ఏ Delhi లోనో పెట్టుకున్నామనుకోండి. అది HQ/ Head quarters/ కేంద్రం అంటారు. దానికి branches అన్ని వూళ్ళలోనూ పెట్టామనుకోండి, వూరుకో Manager ని పెడతాము కదా! వీళ్ళందరికీ ఓ General Manager వుంటాడు కదా! అట్లా ఒకే Manager ఇన్నింటిల్లోనూ పని చేస్తున్న management principle, administrative principle క్రింద పని చేస్తున్న సృష్టిలో ఉన్న ఈ తత్త్వాన్ని 'ఈశ్వరుడు' అంటారు. అంటే అది లేకపోతె సృష్టి లేదు. దాన్ని ఆవరించుకొని మనమనుకున్న మిగతావన్నీ కూడా ఏర్పడుతూ వుంటాయి. అవి ఆవరణాలుగా ఏర్పడతాయి. మనం చూసే వెలుగు ఆవరణ కూడా ఒక కేంద్రం ఆధారంగా వ్యాపన చెందుతున్నట్టు కనిపిస్తుంటుంది. ఈ వెలుగు యొక్క ఆవరణకి కేంద్రం ఒకటి ఉన్నది. అందుకనే దేన్ని చూసినా దాని యొక్క కేంద్రమును గుర్తు తెచ్చుకోడం అనేదే ఈశ్వరుని యొక్క ధ్యానము చేయుట, అన్నారు. పతంజలి మహర్షి ఏమి చెప్పారంటే :-

'తపస్స్వాధ్యాయేశ్వర ఈశ్వర ప్రణిధానాని క్రియా యోగః'

క్రియాయోగః అంటే తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము. ఇంకో చోట 'ఈశ్వర ప్రణిధానద్వా ' అని కూడా ఇచ్చారు. 'జ్యోతిష్మతివా' అని కూడా ఇచ్చారు.

అంటే ఏవిధంగా భగవంతుని అనుభూతి చెందవచ్చంటే, ఈ ఈశ్వరతత్వాన్ని అన్నిటి యందు గమనిస్తూ వుండు. అంటే The pivot of any creation. ఒక కారు తీసుకున్నామనుకోండి! ఆ కారులో అతి ముఖ్యమైనదీ, ఏది లేకపోతే కారు పనిచేయదో, అది దానికి ఈశ్వర స్థానం. మనలో ఎన్నో రకములైన శక్తులు వున్నప్పటికి కూడా, ప్రాణస్పందనం వుంటేనే మిగతావన్నీ పని చేస్తాయి. ప్రాణస్పందనం లేకుండా మిగతావన్నీ పని చేయడానికి వీలులేదు, కాబట్టి ప్రాణమును అధిష్టించి ఈశ్వరుడు మనయందు ఉన్నట్టు మనం ఒక అవగాహన చేసుకోవాలి. తెలివితేటలు లేవనుకోండి, పర్వాలేదు. కొన్ని ఇంద్రియాలు పని చేయటం లేదనుకోండి, పర్వాలేదు. మిగతావి ఏమి పని చేయక పోయినా పర్వాలేదు కానీ, మనలో వుండే ఈ ప్రాణమునకు కేంద్రము అయిన నాదం ఏదైతే వుందో, ఆ నాదానికి పుట్టుకస్థానం ఏదైతే ఉన్నదో అది లేకపోతే ఈ మిగతావన్నీ పడుకుంటాయి. మనకది చిన్నప్పుడు కథలు కథలుగా చెప్పేవారు. కాళ్ళు, చేతులు, ముక్కు, కళ్ళు, పొట్ట, నోరు, కాలేయం, పెద్ద ప్రేగులు, చిన్న ప్రేగులు ఇవన్నీ ఒక రోజు సమావేశం పెట్టుకొనీ, మనందరిలో ఎవరు ఎక్కువ గొప్ప? అని చాల విచికిత్స చేస్తుంటే, లోపల వున్న స్పందనం కొద్దిగా withdraw అయ్యిందిట! Withdraw అయితే వాళ్ళకే వాళ్ళు తెలివిలేని స్థితిలో పడిపోయారుట. అసలు మనం ఉండటానికి కారణం అయిన వాడు ఒకడుఉన్నాడు. దాన్ని మన ఈ కళ్ళతో గమనించడానికి వీలు లేదు. ఎందుకంటే దాని లోంచి మనం అందరం బయటకి వచ్చిన వాళ్ళం గనక. పెద్ద చిక్కు ఎక్కడ వచ్చిందంటే, మనం చూడటం అంటే మనకి ఈ కళ్ళతో చూడటం అలవాటైన పద్ధతి. ఆ కళ్ళతో కాదు చూడడం అంటే! ఇక్కడ చూడడమంటే అవగాహనే ! అవగాహన చేసుకొని ఆ కేంద్రం లో ఉన్న ఈశ్వరుడితో మనం అనుసంధానం చెందటమే ధ్యానం! కళ్ళు మూసుకుని మనలో మనసుని ఉఛ్వాస నిశ్వాసల మీద వుంచి, ఉఛ్వాస నిశ్వాసల మీద మనసు హృదయముకి వెళ్తే, హృదయమునకు చేరిన మనసు స్పందనము యందు లగ్నమైతే, స్పందమున లగ్నమైన మనసు ఉఛ్వాసనిశ్వాస కార్యక్రమము లేక, చంచలత్వము లేక, ఆలోచన కార్యక్రమములు బాగా తగ్గించుకుంటూ స్పందనం దగ్గరకి వెళ్తే, స్పందనము నుండి సూక్ష్మ స్పందనములోకి వెడితే, అక్కడ కేవలం ఒక నిరామయమైన, నిశ్చలమైన, నిర్మలమైన ఒక స్థితి ఉంటుంది. అక్కడ ఏమీ ఉన్నట్టుండదు. ఏమీ లేనట్టూ ఉండదు. ఆ స్థితిలో ఉన్న చోటులో మనం కూర్చోడం

అన్నమాట. అంటే దగ్గరగా, భగవంతుడికి దగ్గరగా కూర్చోటం అంటే అదే! ప్రతీ రోజు మనం ధ్యానాది కార్యక్రమములు చేస్తున్నప్పుడు అట్లా వెళ్ళటానికి ప్రయత్నం చేయాలి. లేదూ అంటే రాత్రి నిద్రలోకి వెళ్ళేటప్పుడు కూడా పెద్దలు మనకి చెప్పిన ఈ మార్గంలో అక్కడికి withdraw అవుతూ నిద్రపొండి. ఆ విధంగా నిద్రపోయినా ఈశ్వరుడికి మనం దగ్గర అవటానికి అవకాశం వుంది. ఈశ్వరత్వం అన్నిటికి మించినది. దాన్ని మించినది ఏదీ లేదు. దాని చుట్టూ ఏర్పడిందే మిగతా సృష్టి అంతా! అంటే అన్నిటికి ఏది కేంద్రమో అది ఈశ్వరుడిగా మనం భావన చేయాలి.

## 81. విక్రమి

"విక్రమి" అంటే పరాక్రమం కలిగిన, ధైర్య సాహసాలు కలిగినవాడని. కొంత మందికి శరీరబలం బాగా వుంటుంది. మరి కొంత మందికి మనోబలం బాగా వుంటుంది. మరి కొంతమందికి బుద్ధిబలం బాగా వుంటుంది. చాల కొద్ది మందికి ఆత్మబలం వుంటుంది. ఈ శరీరబలం, మనోబలం, బుద్ధిబలం కన్నా మించి పని చేసేది ఆత్మ బలం! శరీరబలం ఉన్నవాళ్ళు కూడా దుఃఖానికి కృంగిపోవచ్చు. సుఖాలకి పొంగిపోవచ్చు. రెపరెపలాడుతూ ఉండవచ్చు. మనోబలం ఉన్నవాళ్ళు కూడా రెపరెప లాడుతూ ఉండవచ్చు. బుద్ధిబలం ఉన్న వాళ్ళు ఎంత బుద్ధి ఉన్నప్పటికీ కూడా, పరిస్థితులు తారుమారు అయితే బాధ పడిన వాళ్ళని మనం చూస్తూ వుంటాము. మహాత్ముల జీవితాలు చూసినప్పుడు, చాల ఉత్తమం అయిన సాధన ఉన్నప్పటికీ కూడా కష్టములకు కృంగిన సన్నివేశాలు కనిపిస్తుంటాయి. కాబట్టి మనం పెద్దలెఖ్ఖ కాదు. అయినప్పటికీ అటువంటివారి యొక్క స్మరణ ద్వారా ఆ స్థితికి చేరుకోడానికి ఒకరకమైన ఉత్సాహము, స్ఫూర్తి మనకి లభిస్తుంది కాబట్టి వారి గురించి చెప్పుకుంటూ ఉండాలి. సత్య హరిశ్చంద్రుడు ఉన్నాడకోండి! సినిమా చూస్తుంటేనే మనకి బాధగా ఉంటుంది. అట్లా ఒక్కొక్కటి, ఒక్కొక్కటి ఆయన దగ్గరినుండి లాగేస్తుంటే, చివరికి ఎక్కడకి చేరుతాడు ఆయన? నల దమయంతులలో నలుడి పరిస్థితి చూసుకోండి! భారతంలో ధర్మరాజు పరిస్థితి తీసుకోండి! ఇందులో హరిశ్చంద్రుడు క్రుంగడు. నలుడు క్రుంగడు. వారు ఏకాకిగా మొత్తం సన్నివేశంలో నిలబడి వున్నవాళ్ళు. ధర్మరాజు అన్నదమ్ముల యొక్క అండదండలు, పురోహితుని యొక్క సలహా సంపత్తి, ఇవన్నీ వుంచుకొని కూడా అప్పుడప్పుడు క్రుంగుతూ మళ్లీ పైకి లేస్తూ ఉంటాడు. భగవంతుడి యొక్క పరాక్రమం అంటే, ఆత్మ యొక్క బలమే పరాక్రమంగా ఉన్నవాడు నిజమైన విక్రముడు! అది అత్యుత్తమమైన విక్రమత్వం! అది సాధన చేసిన వారి యొక్క చరిత్ర మనకి ఋషులు కారణంగా అందింపబడి వున్నాయి. వాళ్ళయొక్క జీవిత చరిత్రలు మనం చదువుకోవాలి. చదువుకుంటూ వుంటే వారు కష్టములయందు కొట్టుకు పోకుండా, లొంగి పోకుండా ఏ విధంగా స్థితప్రజ్ఞులై నిలబడి ఉన్నారో తెలుస్తుంది. నిజమైన విక్రమత్వం ఏదయ్యా అంటే లొంగిపోకుండా ఉండడమే! దేనికైనా లొంగాడుట

అంటే విక్రముడు కాదని. డబ్బుకి లొంగేవాళ్లు, పదవికి లొంగేవాళ్ళు వీళ్ళందరూ మరీ చిల్లరగా వస్తారు. బుద్ధికి కూడా లొంగిపోయే వాళ్ళు ఉంటారు. మనం చాల జ్ఞానం కలిగిన వాళ్ళం అని లొంగిపోయే వాళ్ళు ఉంటారు. కేవలం భగంతుని యొక్క అస్థిత్వము యందు మాత్రమే మేల్కొంచి, ఇక మిగతా విషయముల యందు నిద్ర పోయే వాళ్ళు ఇక కొందరున్నారు. వారిని మనం 'భాగవత ఉత్తములు' అంటాము. లేక 'భాగవతోత్తములు' అంటాము. వారి జీవిత చరిత్రలు మనం చదువుకున్నప్పుడు వాళ్ళు కష్టముల యందు, భయంకరమైన సన్నివేశములయందు, ఏ విధముగా స్థిరచిత్తులై నిలబడ్డారో గమనిస్తే, అక్కడ మనకి కనిపించేది భగవంతుని యొక్క విక్రమత్వం! ప్రహ్లాదుడు వున్నాడనుకోండి, భగవంతుని యొక్క విక్రమత్వం అవతరించినట్టుగా అక్కడ మనం గుర్తించాలి. అంబరీషుడు వున్నాడనుకోండి, భగవంతుని యొక్క విక్రమత్వం అక్కడ అవతరించి నట్లుగా మనం చూడవచ్చు. హరిశ్చంద్రుడే వున్నాడనుకోండి, భగవంతుని విక్రమత్వం అవతరించినట్టుగా మనం చూడవచ్చు. అంటే హరిశ్చంద్రుని గురించి చదివినప్పుడు హరిశ్చంద్రుడు గురించి చదువుతున్నాం అనుకోబోకండి! భగవంతుని యొక్క కల్యాణ గుణములు ఆ వ్యక్తి రూపంలో ఏవిధంగా భాసించి అతన్ని నిలబెట్టినాయియా, దేని యందు అతను ఆరాధన చేసి ఉపాసన చేసి నిలబడగలిగాడు, ఇవి అవగాహన చేసుకోవాలి. సత్య పరాక్రముడు కదా రాముడు! హరిశ్చంద్రుడు కూడా అంతే ! ఏమిటి వాళ్ళయొక్క పరాక్రమం అంటే 'సత్యము.' అంటే అక్కడ ఉన్న దానియందు నిలబడినవాళ్ళు! ఉన్నదేమిటయ్యా అంటే, 'ఆత్మతత్వము'. అంటే ఆత్మ యందు నిలబడి వున్నవాళ్ళు కాబట్టి, అది అవిచ్ఛిన్నం కాబట్టి, నాశనము లేనిది కాబట్టి మనం ఎన్నటికీ నాశనం చెందము. ఎన్ని వచ్చినా సరే! కాలం కూడా దానికి లోబడే వున్నది కాబట్టి అలా వుంటారు తప్ప, లొంగి పోరు, క్రుంగి పోరు. అలా ఎవరుండ గలిగితే వాళ్ళు "విక్రమ్" అని పేరు పెట్టుకోవచ్చు. ఊరికే విక్రమ్ అని పేరు పెట్టుకొని, బొద్దింకని చూసి భయపడుతుంటే బాగుండదు. ఇతరులలో ధైర్య సాహసాలు చూచినప్పుడు, మనం చూడవలసింది ఏంటంటే, ఈ విక్రముడు అనే భగవంతుని యొక్క ప్రవర్తనం. కొంత మంది చాల ధైర్య సాహసములు కలిగి వుంటారు, అప్పుడు మనం వాళ్ళని చూసి ఆశ్చర్యంపోవడం కాకుండా, 'ఓహో ! భగవంతుని యొక్క అస్థిత్వము ఈ రూపమునందు ఈ విధముగా వున్నది,' అని భావన చేయాలి. భగవంతుడిని చూడడం అంటే అట్లా

చూడాల్సిందే! అలా చూస్తూ చూస్తూ వుంటే, ఇవన్నీ కలిపిన ఒకే ఒక భగవంతుడు మనకి కనిపిస్తాడు. అంత వరకు మనం భగవంతుడిని గుణాలలో చూడాలి. అది కూడా వ్యక్తుల ప్రవర్తన లో వుండే కల్యాణ గుణాలని చూడాలి. పిచ్చిగుణాలను చూడకూడదు. మంచి గుణాలు! చెడులో చూడకూడదు. వారియొక్క పిచ్చి చేష్టలలో దేవుడిని చూడ్డం, ఆరాధించడము అనేది మామూలుగా సగటు మానవులు చేసే సాధారణమైన పని. ఎదుటి మనిషిలో ఉండే మంచి గుణాలయందు మాత్రమే మేల్కొంచి, మిగతా వాటియందు మనం నిద్ర పోయామనుకోండి, నెమ్మదిగా మనలో మంచి గుణాలే మేల్కొంచుతాయి, మిగతావి నిద్రపోతాయి. మనం ఈశ్వరుడిని దర్శనం చేయటం అంటే కేంద్రముగా దర్శనం చేయాలి. ఈ మొత్తానికి ఎవరండీ కేంద్రం? ఆయన! ఎవరో గురువుగారు, వారిదో ఆశ్రమం ఉందనుకోండి, ఏమి చేస్తాం? గురువుగారిని చూశాక గాని ఆశ్రమం వదలి వెళ్ళంగా! ఎందుకనీ? ఆయన కేంద్రం కాబట్టి! ఎక్కడ ఏది కేంద్రం లో వుంటే అది చూసి రావటం అనేది సహజం అయిన విషయం. అట్లా ఈశ్వరధ్యానం చేసుకుంటూ, ఎక్కడా లౌకిక విషయములకి లొంగకుండా జీవించేవాళ్ళు కొంత మంది వుంటారు. మొండివాళ్లుగా కనిపిస్తారు వాళ్ళు. ఎన్నికష్టాలు వచ్చిన సరే, లెఖ్ఖ చేయకుండా జీవిస్తూ వుంటారు. అన్నీ భగవంతుడికి వదిలేసి జీవిస్తూ వుంటారు. అన్నిటియందు భగవంతుని యొక్క ప్రవర్తనం మాత్రమే చూస్తూ వుంటారు. పెళ్ళాన్ని, కొడుకుని అమ్మేయటం అంత సులభమైన విషయం కాదు. కదా! అమ్మేశాడే అనుకొండీ, వాడెవడికో తానూ అమ్ముడుపోవడం మరీ కష్టం! అంటే తనకి పూర్తిగా అహంకారం పోయిన విషయం. వాడు తీసుకుపోయి ఈయన్ని శ్మశానంలో పెడితే, అక్కడ ఆ కాలుస్తూ వున్న శవాలలో భగవంతుడిని చూస్తుండడం అనేది మరీ కష్టం! అలా చూస్తూ వుంటూ వుంటె, తన స్వంత కొడుకే అక్కడికి సర్పము కరిచి చచ్చి, కాల్చబడ్డానికి వస్తే మరీ కష్టం! అంతకు మించి అదే పరిస్థితులలో తన భార్యయే ఒక దొంగగా చిత్రీకరించబడి, తనచే ఖండించబడ్డానికి తీసుకువచ్చినప్పుడు కూడా నిలబడి వుండడం మనం ఊహించలేం! మనం ఈ లోపే మూర్ఛపోతాం. అంత వరకు అక్కర్లేదు మనకి. ఉన్నది పోయిందంటే మనం ముందే మూర్ఛ పోతాము. ‘Unconscious అయిపోయాడండీ, లాభం లేదు, brain దెబ్బ తింది’ అని చెప్తే, అప్పటికే మన కథ పరిసమాప్తం అయిపోతుంది. హరిశ్చంద్రుడి కథ ఎందుకని చదువుకోవాలంటే,

ఆయన కష్టాలు పడ్డ పద్ధతుల్లో మనం జీవిస్తుంటే మనలో కూడా ద్రవీకరించి, ఒక విధమైన చైతన్యం ఉద్భవిస్తుంది. అందుకు చదువుకోవాలి నలుడు కథ. రాజ్యం పోయింది, భార్య పోయింది, ఒంటిమీద బట్ట పోయింది, మొహం మీద రంగు పోయింది, నల్ల బడిపోయాడు. ఎవరూ గుర్తించను కూడా గుర్తించరు. అట్లా అయిపోతుంది. అయినప్పటికీ ఈ కథలు ఎందుకు చదువుకోవాలంటే, మనకి ఏవి ఆధారము అని జీవిస్తున్నామో అవన్నీ తీసేస్తే కూడా మనం వుండవచ్చు అని తెలుసుకోవడానికి. ఎందుకంటే, మనం ఆత్మవంతులం కనుక! మనం, మనకి ఉండే దారిద్ర్యము వలన, అంటే మనో దారిద్ర్యము అనండీ, అజ్ఞానం వలన అనండీ, మిగతా విషయాల మీద ఆశ పెంచుకొని జీవిస్తుంటాము. ఆశ పడడానికికి ఇతరమైన విషయములందు ఎక్కువ ఆధారం చేసుకు నిలబడతాం. అదే ఆధారం మనకి. అందుకని అవి తీసేస్తే ఏడుస్తాము మనం. కాలు fracture అయ్యిందనుకోండి! ముందు చంకలో కర్ర ఇస్తారు నడవటానికి. కొంచం నడుస్తూ వుంటే కర్ర తీసేస్తారా! ఎందుకని? వాడు బాగా నడవాలనే కదా! తీసేసినప్పుడు ఏడుస్తూ వుంటే? అట్లా మనం పెట్టుకున్నవన్నీ కూడా కాళ్ళు చేతులు విరిగిపోయిన వాళ్లు పెట్టుకున్నలాంటి supports. ఏది? మనం అనుకునే ఆస్తి. మనం అనుకొనే విలువలు, అనుకొనే పేరు ప్రతిష్టలు. మనం అనుకొనే స్థితి గతులు, మనం అనుకునే మంది మార్బలం. ఒక మహాత్ముడు తన చుట్టూ ఉన్న మనుషులు మీద ఆధార పడడు. తన మీద తాను ఆధార పడతాడు. ఓ గురువు గారు ఓ వెయ్యి మందిని పోగేసుకున్నాడనుకోండి. ఇహ అక్కడ నుంచి వాళ్ళ మీద బతికేయవచ్చు, అనుకునేవాడు గురువుగారు కాడు. లఘువు అయిపోతాడు. తన మీద తాను ఆధారపడి తన ఆత్మతత్త్వంలో జీవించాడు కాబట్టి వీళ్ళందరూ చేరారు! కాబట్టి ఏమి చేయాలంటే ఇంకా ఎక్కువ ఆత్మతత్వం లోనే కూర్చోవాలి. దాన్నే మనకి లలితా సహస్రనామ స్తోత్రంలో 'నిరాలంబ' అని ఇస్తారు. నిరాలంబ యోగం! ఒక్క భగవంతుడ్ని తప్ప ఇంక దేన్నీ ఆధారం చేసుకొని జీవించరుటండీ యోగులు,! భక్తుడు కూడా అంతే! భక్తులు, సిద్ధులు, యోగులు, ఋషులు వాళ్ళు ఒక్క భగవంతుడే ఆధారంగా జీవిస్తూ ఉంటారు. మిగతా ఆధారాలు పెట్టుకోరు, అందుకని వారి పరాక్రమము చాల విపరీతమైన పరాక్రమము. ఎందుకంటే ఆత్మతత్వమే వారి నుంచి వ్యక్తము అవుతూ వుంటుంది కాబట్టి. వాళ్ళు ఎట్లా వుంటారు అంటే, గాలిలో దీపము పెట్టినా, ఆ దీపం అట్లా వెలుగుతూ నిశ్చలంగా

వుంటుందిట. అంటే అలా వారు స్థితప్రజ్ఞులై వుంటారు. దేనికీ చలించరు. అట్లా ఉండటం కష్టం. ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు ప్రతివాడినీ చావగొడుతూనే వుంటాడు. అలా మనకి దేనికీ చలించకుండా కనిపించేది, మొత్తం మనం ఎరిగిన గ్రంధాలు, పురాణాలు తీసుకుంటే 'శ్రీ కృష్ణుడు' ఒక్కడే అలా కనిపిస్తాడు. అంటే బొత్తిగా ఒక ఎండు కట్టెలా అనిపించేలా వుంటుంది. అంతా తానే అయిన స్థితిలో నిలబడినవాడు కాబట్టి, భగవంతుడు కాబట్టి, నిజమైన విక్రముడు భగవంతుడే! విక్రమత్వము నందు వుండే వాళ్ళు స్థిరత్వం లో వుండే అవకాశము వుంటుంది. కానీ ఆ కల్యాణ గుణములో వున్నంత సేపే వుంటుంది. ఆ కల్యాణ గుణము నుంచి జారిపోతే బాధ పడతారు. రాముడంతటి వాడు బాధ పడతాడు. సీతా వియోగం అప్పుడు రాముడు బాధ పడితే, లక్ష్మణుడు వలన రాముడు మళ్ళీ స్వస్థితి చేరుకుంటాడు. స్వస్థితి అంటే అయన ఎవరో ఆయనకీ మామూలుగా తెలుసు. ఎందుకంటే మానవుడుగా ప్రవర్తించినప్పటికీ కూడా, ఎప్పుడూ ఆత్మతత్వం లో జీవిస్తూ, ధర్మమును పరిపాలించిన వాడు రాముడు. అటువంటి రాముడు కూడా సత్యపరాక్రముడు అయినప్పటికీ కూడా, ఒక్కొక్కప్పుడు బాధపడినప్పుడు లక్ష్మణుడి ఓదార్పురాముడిని నిలబెడుతుంది. అందుకని మహాత్ములు కూడా ఒక్కోసారి ఒక్కో సన్నివేశములో తాత్కాలికంగా బాధ పడడం వుంటుంది. అస్సలు ఎప్పుడూ ఏ బాధా పడనివాళ్ళు కొంత మంది ఉన్నారు. అందులో మనం మొట్టమొదట చెప్పుకోవలసిన పేరు శ్రీకృష్ణుడు! తరువాత హరిశ్చంద్రుడు, అంబరీషుడు. అలాగే అందులో పూర్తిగా లయం అయిపోయిన ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు చరిత్ర చదువుతుంటే వూరికే superman లాగా కనిపిస్తుంది మనకి. అలా మనలో కలగటానికి అంత అవకాశము లేదు. ఎందుకంటే, ప్రహ్లాదుడిని ఏమి చేసిన పర్వాలేదు, విష్ణు మూర్తి వచ్చేస్తుంటాడు instant గ. మన పరిస్థితి అది కాదు కదా! మనకి instant relief లేదు కదా! బావిలో పడ్డామే అనుకోండి, instant relief ఉందా? 'ఒక రెండు kilometers ఈ జలం లోంచి వెళ్ళరా!' అంటారు. ఆ రెండు kilometers ప్రయాణం కొంచెం బాధ కరంగా వుంటుంది కదా! అక్కడ మనకి ధర్మరాజు కన్నా నలుడి చరిత్ర ఉపయోగపడుతుంది. నలుడు ఏకాకి ! ధర్మరాజు బాధ పడుతూ వుంటె నలుడు గురించి చెప్తారు. 'నువ్వేంట్రా ఇంతమందిని వెంటపెట్టుకొని ఏడుస్తావు? ఒక్కడే అయిపోయాడు ఆయన అయితే' అని. ధర్మరాజుకి బ్రహ్మాండమైన తమ్ముళ్లు ఉన్నారు, కాయడానికి. పెళ్ళాం పక్కనే వుంది,

వండి పెట్టడానికి, మిగతా సౌకర్యాలకూ. పురోహితుడు వున్నాడు, ఇంకొంత మంది మార్బలం వుంది. ఎక్కడికి వెళ్లినా సుఖంగా జరిగిపోతోంది. పేరుకు అరణ్యం తప్ప హాయిగానే బతికాడనిపిస్తుంది చదువుకుంటే. రాముడు అనుకున్నామనుకోండి లక్ష్మణుడున్నాడు, సీత వుంది పదమూడేళ్లపాటు. పదునాలుగవఏడు సీత లేక పోయినప్పుడు పక్కన లక్ష్మణుడున్నాడు. లక్ష్మణుడు చేసిన సేవ ఎవరూ చేయలేరు. మనము రామాయణం చదువుతున్నప్పుడు వీరి అందరిలో భగవంతుడి తత్త్వం ఎట్లా పని చేసిందో చూసుకోవాలి. సీతాపహరణం అప్పుడు రావణాసురుడు, లక్ష్మణుడిని చూసి ఎక్కువ భయ పడతాడు 'అమ్మో! వీడు ఇంతలా ఉన్నాడేమిటి? వీడు తమ్ముడు. వీడే ఇట్లా ఉంటే ఆయన ఎట్లా వుంటాడో?' అని అనుకొని భయపడి పోతాడు. లక్ష్మణుడు నిప్పు! ఒక్కోసారి ఆయన కోపము లోంచి వచ్చిన అగ్ని, ఆ చుట్టూ ఉన్న ప్రదేశాలన్నిటిని కూడా దగ్ధం చేయగల పరాక్రమం గలదుట! రాముడికి లక్ష్మణుడి యొక్క అండ ఉన్నది. నలుడో ? Nil. హరిశ్చంద్రుడు కూడా అంతే. కాబట్టి ఈ చరిత్రలు చదువుకోవాలి. చదువుకోడం అంటే వాళ్ళు వీళ్ళు ఏదో simple గా రాసిందీ, అమరచిత్ర కథలు చదవకండి! సరాసరి భారతము తీసుకొని చదువుకుంటే విపులంగా వుంటుంది. వాళ్లతో పాటు మనం కూడా సమానంగా బాధ పడతాము. అదేంటి సార్ మనం ఏడవడానికేనా, అని అడగకండి. దానిలోంచి మనకు ఒక స్థిరత్వమూ, చైతన్యము, పరాక్రమత్వము, స్థితప్రజ్ఞత్వము పుట్టుకొస్తాయి. అందుకనే సుందరకాండ చదువుకోమంటారు. సీతాదేవికి వచ్చిన కష్టాన్ని మించిన కష్టం స్త్రీకి ఏదీలేదు కదా! ఎట్లా నిలబడ్డది? మన పురాణాలన్నీ ఎందుకు ఇచ్చారని ఆలోచించి చూచినట్లయితే, సుఖంలో కన్నా కష్టంలో నిబడ్డానికి పనికొస్తాయి. నీకు వచ్చిన కష్టం బోడికష్టం, అన్నట్లుంటుంది. మనకి వచ్చేవి నిజంగా చాల చిన్నవి, అందుకే ధర్మరాజు యుద్ధమంతా అయ్యాక అందరూ పోయారని ఏడుస్తూ వుంటే, కృష్ణుడు నవ్వుతాడు. నారదుని పిలిచి 'ఇంతకన్నా పరమ దరిద్రమైన జీవితాలు జీవించిన మహాత్ముల కథలు చెప్పేసేయి, వీళ్ళు line లోకి వచ్చేస్తారు' అని చెప్పి వెళ్ళిపోతాడు. అంటే మనకి గుండు సూది గుచ్చుకుంటేనే ఇహ ఆఫీసు మానేసి, ante tetanus injection తీసుకుని, భయం భయంగా ఇంట్లోవాళ్ళని సాధిస్తూ ఆ రోజంతా గడుపుతాం కదా! అవస్సలు కష్టాలు కావు. అవి మనకి తెలీడానికి 'మహాత్ములే పడ్డారురా కష్టాలు, నువ్వెంత బోడి' అని చెప్తుంటారు. మనకు గురువుల జీవిత చరిత్రలు చదివినా కూడ ఇవన్నీ తెలుస్తాయి.

వాళ్ళు ఎటువంటి పరిస్థితులలో ఏ విధముగా భగవంతుడే ఆధారముగా నిలబడ్డారు? వాళ్ళూ విక్రమము కలిగిన వారని మాస్టరుగారి అవగాహన. విష్ణు సహస్రనామములో 'విక్రముడు' అంటే, ఎటువంటి పరిస్థితి వచ్చినా సరే రెపరెపలాడని చైతన్యము కలిగిన వాడని, మాస్టారుగారు ఒక వాక్యము రాసారు. ఒక్క కండబలం వుండేవాడు వుండొచ్చు, ఒక్క మనోబలం వుండే వాడుండచ్చు, బుద్ధిబలం ఉండే వాడుండచ్చు. కానీ వీరందరూ మించిన సన్నివేశము వచ్చినప్పుడు 'బేర్' మంటారు. మనకి ఒక పరిమితి ఉంది. ఆ పరిమితి దాటి మనకి ఏదైనా వస్తే వెంటనే 'బేర్' మంటాము. ఎంత భయంకరమైన పరిస్థితులలో కూడా నిలబడిన వారు వున్నారు చూడు సుమా ! అని చూపించడానికి మనకి కథలు ఇచ్చారు. వారి కథల్లో, వారి యొక్క స్థిరత్వంలో మనం గమనించ వలసిందేమిటంటే, 'భగవంతుని యొక్క అస్థిత్వము నందు వారు ఏ విధముగా మేల్కొంచి ఆ పరిస్థితిల్లో, ఆ కాలాన్ని ఎట్లా జాగ్రత్తగా దాటారు' అని. అది మనకి చాల important message. అది తీసుకోవాలి. అందుకని రామాయణం చదవాలి. అరణ్యకాండ రాంగానే పుస్తకము మూసేయకూడదు. అరణ్యకాండ చదివితే మనకి ఏదో వచ్చేస్తుందనే వాళ్ళు, ఏవో రకరకాలు వుంటారు. మనకి ఏవి రావు, మనకు స్థిరత్వం వస్తుంది. భగవంతుని యొక్క విక్రమము అంటే అన్నిటిని మించి ఆయనదే విక్రమము. అది మనం భక్తులయందు చూసినప్పుడు మనకి ఎక్కువ అవగాహన అవుతుంది. భగవంతుడికేమి? All powerful, All Pervading, Omniscient, Omnipresent! సర్వాంతర్యామి, సర్వ శక్తి సంపన్నుడు. ఆయన తానే ఈ సృష్టిగా వ్యక్తం అయినప్పుడు, ఈ జీవుల రూపంలో ఏవిధంగా ఈ గుణములతో వున్నాడో మనం గమనించడం మనకు సాధన! అట్లా గమనిస్తూవుంటే ఈ నామాలు మనకి ఎక్కువ అనుభూతి లోకి వస్తాయి.

## ౮౨. ధన్వి

'ధన్వి' అంటే ధనుస్సు ధరించిన వాడు అని. ధనుస్సు ధరించిన వాడు అంటే మనకి ముందుగా గుర్తు వచ్చేది రాముడే ! ఎప్పుడూ ధనుర్ధారి అయి శిష్ట రక్షణ కోసం, దుష్ట శిక్షణ కోసం అప్రమత్తుడైన భగవంతుడుగ మనం భావన చేసుకోవాలండీ! ఎవరైనా, ఎవరినైనా ఆపదలో ఆదుకున్నారనుకోండి, వాడి దగ్గర విల్లు లేకపోయినా వాడు'ధన్వి', అని గుర్తు పెట్టుకోవాలి. శ్రీకృష్ణుడు ధన్వి కాదా? బాణం లేదు కదా! ఐనా ధన్వే! విష్ణు మూర్తికి బాణం లేదు, ధన్వే ! భగవంతుడు ఎప్పుడూ అప్రమత్తుడై రక్షిస్తాడు సుమా! అదే మనకి రుద్రసూక్తంలో కూడా వస్తుంది, 'నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవే నమః'. ఆయన వేసే బాణాలు వేరే ఉన్నాయి. ఇక్కడ మనం విష్ణుమూర్తిని ధనుస్సు పట్టుకున్న వాడిగాను, వెంటనే రక్షించేవాడిగాను ధ్యానం చేసుకుంటాము. రుద్రసూక్తంలో మనం ఏమని అడుగుతాం తెలుసా? 'బాబూ, నీ వింటికి వున్న త్రాడు కొంచెం తీసేసి పక్కన పెట్టు,' అని. ఎందుకంటే ఆయన బాణం వేస్తే మనం బ్రతకము. ఆయన ఎవరి మీద బాణాలు వేస్తారూ అంటే, వెధవ పనులు చేసే వారి మీద వేస్తాడుట. చేయని వాళ్ళు ఎవరు కనుకా? నువ్వు వేస్తే బ్రతకలేము కాబట్టి, నీ విల్లు కొంచెం పక్కన పెట్టు, అని చెప్పే పద్ధతి అక్కడ ! ఈయననేమో పట్టుకొని ఉండు మాకు రక్షణ కావాలి, అని చెప్పే పద్ధతి ఇక్కడ. రెండూ భగవంతుని యొక్క వివిధమైన అవతరణములు, తత్వములు. ఇక్కడ ధన్వి అంటే రక్షణ ఇచ్చేవాడు.

'నమః కోదండ హస్తాయ సంధీ కృతశరాయాచ
ఖండితాఖిల దైత్యాయ రామా అపన్నివారిణే '

అంటే ఊరికే ఉత్తి బాణం పట్టుకొని అలా భుజంమీద వేసుకుని తిరగడం కాదు. బాణాన్ని సంధించి readyగా ఉంటాడుట. 'సంధీకృత శరాయచ', అంటే కోదండం పట్టుకొని బాణం ఎక్కుపెట్టి ready గ వుంటాడుట. అంటే relief చాల instant. అదీ రామతత్త్వం! రామా! అని పిలుస్తే వెంటనే action లోకి దిగేవాడు రాముడన్నమాట. కృష్ణా! అని పిలిస్తే, వస్తున్నా వుండని, మనం with stand అయ్యేంత వరకు చూస్తాడు కృష్ణుడు. 'నీ అంతట నువ్వు నిలబడరా వస్తాను, మరీ పడిపోతూ వుంటే వస్తాను' అనేవాడు కృష్ణుడు. పిలిస్తే వచ్చేవాడు రాముడు. ప్రతి

వారు ముందు రాముడితో మొదలుపెట్టి కృష్ణుడుతో తేలుతూ వుంటారు. From dependency, to self dependency. రాముడు ఎక్కుపెట్టిన ధనస్సుతో కాస్తూ వుంటాడు. రక్షణ ఎక్కడ వుందో అక్కడంతా కూడా ఈ తత్త్వం యొక్క అవతరణం మనము చూడాలి. కొంత మంది మొక్కలని రక్షిస్తూ వుంటారు. కొంత మంది జంతువులను రక్షిస్తుంటారు. కొంత మంది మనుషులను రక్షిస్తుంటారు. ఐతే ఈ రక్షణ ఎవరి ద్వారా జరుగుతూ వుంటుందో, వారందరిలో కూడా మనం ఈ భగవంతుని యొక్క తత్వాన్ని గుర్తిస్తూ వుండాలి. 'ప్రాణం పోతుందిటండి, ఆపరేషన్ కి పదివేలు కావాలిటండీ!' అంటే, లేవండీ, అని అన్నామనుకోండి, మన చుట్టూ ఉండే వాళ్ళకి మన శక్తి మేరకు మనం రక్షణ ఇవ్వలేదనుకోండి? ఈ ధన్వి తత్త్వం మనకు వృద్ధి చెందనట్టు, లేనట్టు. మనకు అవసరము వచ్చినప్పుడు మనకూ అట్లాగే జరుగుతుంది. అత్యవసర పరిస్థితిలో సహాయం పొందని వాళ్ళు, సహాయం అందని వాళ్ళు కొందరు వుంటారు. సమయానికి సహాయం అందేవాళ్ళు కొందరు వుంటారు. సమయానికి సహాయం ఎవరికి అందుతుందంటే, సమయానికి సహాయము అందించేవారికి అందుతుంది. Postpone చేసే వాళ్లకి, వాళ్ళకి కూడా postpone అవుతుంది. రేపిస్తా! ఎల్లుండిస్తా! ఇవ్వాళ శుక్రవారం కదా! మర్నాడు ఏకాదశి కదా! పౌర్ణమి కదా! అని మన కన్నా తక్కువ వున్నవాళ్ళకి postpone చేస్తూ వచ్చామనుకోండి, మనకీ postpone అవుతుంది. అంటే నువ్వేం పెద్ద గొప్ప కాదు. మనం కూడా పుచ్చుకొనేవాళ్ళం కదా! మనం ఇచ్చే చోట postpone చేస్తుంటే, మనకి అందవలసిన చోట postpone అవుతుంటుంది. నీ దృష్టితోటే కదా! అట్లాగే రక్షణ విషయములో కూడా! నువ్వు ఎంత రక్షిస్తావో నీకంత రక్షణ! అదే కదా 'ధర్మో రక్షతి రక్షితః'. ఆపదలో వున్నవాడిని రక్షించడం ధర్మం. దానిని నువ్వు రక్షించావనుకో నువ్వు రక్షించబడతావు. రాముడు అట్లా రక్షణ ఇచ్చాడు. ఎటువంటి రక్షణ ఇచ్చాడు ఋషులకి అంటే, ఋషులందరు ఒక మాట చెప్తారు, 'నాయనా అంతా బానేవుంది. కేవలం అయోధ్యకే కాదు ఈ భూమికే నువ్వు ప్రభువు. 'కౌసల్యా సుప్రజా రామ' అని వూరికే అక్కడికే limit చేసుకోక. ఈ భూమిని బాధిస్తున్న రాక్షసులను నువ్వు limit లో పెట్టాలి' అంటారు. ఎప్పుడూ ఋషులు కూడా అందరిని చంపేయమని అడగరు. తెలియని వాళ్ళు అలానే అడుగుతుంటారు, మనలాంటి వాళ్ళు. ఏమని? దుష్టులు అందరు చచ్చిపోవాలి, అని. సృష్టిలో రెండూ ఉంటేనే సృష్టి అవుతుంది. అంటే మానవులు, దానవులు, దైత్యులు ఆదిత్యులు ఇంత

మంది ఉంటేనే! ఒకటి ఇట్లా, ఒకటి అట్లా అయితేనే మధ్యలో ఆ మందర పర్వతం సరిగ్గా నిలబడి వుంటుంది. The left and right forces రెండూ ఉండాలి. ఒకదానిని ఒకటి మించకూడదు. రెండూ సమంగా ఆడాలి ఆట. Cricket match లో ఒకరు bowling, ఒకరు batting చేయాలికదా! వాళ్లిద్దరూ అతిక్రమించకుండా ఉండటానికి ఒక umpire. అతిక్రమించిన వాడిని మళ్ళీ వాడి యొక్క హద్దుల్లో వుంచడం, ఒక పరిధిలో వుంచడం umpire చేసినట్టుగనే, భగవంతుడు కూడా ధర్మానికి దెబ్బ తగిలినప్పుడు తాను అవతరించి మళ్ళీ వాటికి ఒక balance ఏర్పరుస్తాడు తప్ప ఒకటి తీసేయడు. రాక్షసులు మితిమీరి ప్రవర్తించినప్పుడు, వాళ్ళతో దేవతలు పోట్లాడలేరు కాబట్టి, తను దిగి వస్తాడు. దిగి వచ్చి ఏమి చేసాడు? రాక్షసులందరిని తీసేసాడా? వాళ్ళ హద్దులలో వాళ్ళని ఉంచాడు. వాళ్ళు ఉంటేనే పని జరుగుతుంది. రాత్రిపూట పనులన్నీ వాళ్ళు చేయాలి. అమావాస్య పనులన్నీ వాళ్ళు చేయాలి. White collared jobs అన్నీ దేవతలు చేస్తుంటె, challenging jobs అన్ని రాక్షసులు చేస్తుంటారు. ఇద్దరూ కావాలి ఆయనకు. ఎవ్వరినీ పూర్తిగా తీసేయడు. నల్లగడి, తెల్లగడి రెండూ వుండాలి చదరంగానికి. అన్ని తెల్లగళ్ళే పెట్టేస్తే చదరంగం ఆడలేము కదా! నల్లగళ్ళ వాళ్లూ వుండాలి, తెల్లగళ్ళు వాళ్ళు వుండాలి, ఆడుకుంటూ ఉండాలి. అన్యాయం జరగకుండా చూస్తుండాలి ఆటలో. అదన్నమాట ! అట్లా హద్దుల్లో ఉంచడమే తప్ప తీసేయడం ఏమి ఉండదు. ఒక్కోసారి దేవతలు కూడా మితిమీరి ప్రవర్తిస్తారు. దేవతలు మితి మీరు ప్రవర్తిస్తే రాక్షసుల చేత కొట్టిస్తాడు. తాను రానఖ్ఖర్లే, ఎందుకంటే వీళ్ళు వాళ్లకు లోకువ! వాళ్లు వచ్చి ఓ రెండో వేస్తే, వీళ్ళు కుయ్యోమొర్రో! మళ్ళీ rectify చేసుకుని వీళ్ళు బాగుపడ్డారు ఫరవాలేదు, అని అనుకున్నప్పుడు ఆ రాక్షసులను మళ్ళి ఇతను వెళ్లి, 'ఇహ ఆపండిరా!' అని చెప్తుంటాడు. ఎవరూ ఈ రాక్షసులూ? మనము ఎరిగిన వాళ్లే! జయ విజయులే! వీళ్లిద్దరు ఆయన బంటులే! వీళ్ళు దేవతలకు checks and balances పెడుతూ వుంటారు. బొడ్డులో ఎన్నో కోరికలు ఉంటాయి మనకి. బొడ్డు లోంచి గుండెలోకి ఎగపాకుతోంది gas అన్నట్టుగా, ఇంతకీ ఋషులు వచ్చి, రాక్షసులు జనస్థానాన్ని పాడుచేస్తున్నారు కాబట్టి, రక్షించమని అడుగుతారు. అడిగితే, రాముడు వెంటనే చాలా భీకరమైన ప్రతిజ్ఞ చేస్తాడు. ఏంటి ఇంత ప్రతిజ్ఞ చేయాలా? అనిపిస్తుంది. ఎంత భీకరంగా ప్రతిజ్ఞ చేస్తాడంటే, అక్కడ రాక్షసులతో ఓ రకమైన వైరం స్వతహా

ఉన్నట్టుగా మాట్లాడి రక్షణ ఇస్తే, సీతాదేవి 'అంత కోపం చూపించాలా రాక్షసుల మీద' అంటుంది. అంటే చూపించాలంటాడు. 'మితిమీరి ప్రవర్తించిన వారియందు ప్రభువు అట్లాగే ఉండాలి' అంటాడు. అక్కడ నుంచి ఆయనకీ కార్యక్రమము మొదలౌతుంది. ఎప్పుడైతే ఈయన ప్రతిజ్ఞ పుచ్చుకుంటాడో ఇహ అక్కడ నుంచి వరుసగా జనస్థానం, ఆ తరువాత మారీచుడు, రావణాసురుడు, ఇలా అందరినీ వేసేస్తాడు! ఎక్కడా సందేహించడు. మొత్తం యుద్ధం అంతా చేసిన తరువాత, రామాయణం లో సీతాదేవిని తెచ్చి రామునితో కలపడం అనే సన్నివేశంలో మన బోటి వారికి చాల పెద్ద climax. కానీ, ఆయనకి కాదు. అది లక్ష్మణుడికి కూడా అనిపించింది. 'ఏమైనా కొంచెం తేడా పడ్డదా, అన్నయ్యకీ? ఈ యుద్ధం అంతా వదిన కోసం కదా మనం చేసింది, మరి వదిన వస్తే ఇట్లా ఉన్నాడేంటీ?' అని. కానీ అసలు అక్కడ సీతాదేవి point కాదు ఆయనకు. అక్కడ ఆయన ఆ రోజు ఋషులకి ఇచ్చిన మాటకి జరిగిన consequences ఇవన్నీ. ధర్మ సంస్థాపనకి రావణాసురుడిని సంహరించడం తప్ప, తన భార్యని తాను తెచ్చుకోడం నిమిత్తకారణం. అందుకని సీతాదేవి తన దగ్గరకి రావడం ఆయనకి excitement ఏమి ఉండదు. ఎందుకంటే ఎలాగూ వస్తుంది, సీత గురించి తనకి తెలుసు. సీతకీ తన గురించి తెలుసు. రాముడు కాస్తో కూస్తో అప్పుడప్పుడు సీతను గురించి ఏమైపోయిందో అనుకొని, బాధతో నేలమీద పడి పొర్లిన సన్నివేశాలు ఉన్నాయి. సీతాదేవి అక్కడ కూర్చొని డొక్కచీల్చేస్తుంటుంది రావణాసురుడికి. వాడికి అట్లా జరగాలి. సీతాదేవి చాల ఆత్మస్థైర్యం కలిగినది. ఒక్కక్షణం తేడా పడింది. ఎప్పుడూ? మాయ లేడి చూసినప్పుడు. అదీ జగత్కల్యాణానికి! రావణాసురుడు, ఆమె దగ్గరకి రావడానికి కూడా ఎప్పుడూ సాహసించలేదు. రాముడు ఇంత కార్యం చేసి, సీత వచ్చిన తరువాత ఏమిటి ఇట్లా ప్రవర్తించాడు, అని మనకి అనిపిస్తుంది. ఎందుకంటే మనం ఎక్కడికక్కడ conventions పెట్టుకుంటూ కథ చదువుతాము. అయిపోవాలి కదా! పుస్తకం అయిపోవాలని పెట్టుకుంటే అసలు కథ బోధపడదు. అలా కాకుండా చదవడం పెట్టుకోవాలి. అసలు రాముడు కార్యము అంతా కూడ అరణ్యవాసంలో, ఆఖరి సంవత్సరములో అంటే, పధ్నాలుగో సంవత్సరములోనే ఉంది. అయన అరణ్యవాసం పద్నాల్గవ ఏడు మొత్తం ఆయన అవతరణ చెందిన కార్యక్రమం. సీత వియోగము కన్నా లక్ష్మణుడి యొక్క మూర్ఛ ఎక్కువ బాధ పెడుతుంది రాముడిని. చాల బాధ పడతాడు. 'ఏమి చెప్పుకోను తల్లితో. సుమిత్రాదేవికి తన వెంట వచ్చిన

తమ్ముడు లేడు అనేది ఎట్లా చెప్పగలను? ఇక నా రక్షణ ఎందుకూ, నా పరాక్రమము ఎందుకు?' అని బాధ పడతాడు. లక్ష్మణుడి యందు రాముడి ప్రేమ మనం అక్కడ బాగా చదువుకోవాలి. పరాక్రమము యందు రాముడే! రక్షణ యందూ రాముడే! కాబట్టి రక్షణ ఇవ్వాలి మనం కూడా. రక్షణ ఇచ్చేవారి యందు రక్షణ ఇస్తున్న అవతరణము భగవంతుని యొక్క కల్యాణ గుణముగా చూస్తుండాలి. ధనుస్సుకి ఇంకొక అర్థం ఉన్నది. ఓంకారానికి కూడా 'ధనుస్సు' అని పేరు. మనలో జరిగే ఓంకారం కూడా ధనుస్సే! అది సరాసరి వెళ్ళి, అక్కడ ఆ వింటి నుంచి పైకి వెళ్లి కొట్టిందంటే మనిషి ఆత్మవంతుడు అవుతాడు. అందుకు యోగులు సాధన చేస్తుంటారు. యోగులు ఊర్ధ్వగతి కోసం ఈ ప్రాణాయామాలు అవీ చేస్తూ, కుండలిని ఊర్ధ్వగతి అంటే, ఈ నాదాన్ని ఒక్కొక్క కేంద్రము నుండి దాటించుకుంటూ, భ్రూమధ్యాన్ని దాటినప్పుడు భగవంతుని తో అనుసంధానం ఏర్పడుతుంది. సీతారామ పరిణయం కథలో కూడా మనకి ఇదే రహస్యం ఉన్నది. వీళ్ళంతా వచ్చి ఆ విల్లు యెత్తి, ఎక్కుపెట్టాలి కదా ఆమెని పెళ్ళి చేసుకోవాలంటే! సీతాదేవి భ్రుకుటికీను, అక్కడున్న శివుడి విల్లుకీను ఒక రకమైన correspondence వుంది. వచ్చినవాడు ఈవిడకు నచ్చకపోతే ఆవిడ భృకుటి ముడి విడవడదన్నమాట! అట్లా చూస్తూ ఉంటుంది. ఇట్లా ఉన్నంత సేపు ఆ విల్లు ఎవడూ ఎత్తలేడు. ప్రతివాడు వచ్చి విల్లు ఎత్తుదామని చూస్తాడు తప్ప, 'సీత అనుమతి వుందా లేదా' అని చూడడు. అక్కడే మహాత్ములకి, మామూలు వాళ్ళకి చాల తేడా వుంది. చదువుకోండి మళ్ళీ రామాయణము. అందరు విల్లు ఎత్తిన పద్ధతి చూడండి, రాముడు విల్లెతిన పద్ధతి చూడండి. రాముడు విల్లు ఎత్తే ముందు సీతను చూస్తాడు, నీకు అనుమతేనా! అని. ఆవిడ చిరునవ్వు నవ్వుతుంది. భ్రుకుటి విడివడుతుంది, విల్లు ఎక్కు పెడతాడు. విల్లు ఊరికే ఎండిపోయిన బెండకాయలా విరిగిపోతుంది చేతిలో. సీతాకళ్యాణము అని మనకో సినిమా తీశారు. అందులో మనకి ఇది చాల చక్కగా చూపించారు. వాళ్లకి ఈ సత్యం తెలుసా? అన్నట్టుగా చూపించారు. అలా పట్టుకొని వుంటుంది దండ. చిరు దరహాసం కూడా వుండదు మిగతా వాళ్లు విల్లు ఎత్తినప్పుడు. రాముడు తన పక్క చూసి తన అనుమతి కోరినట్లుగా, 'నీకు ఇష్టమైతే తరువాత కార్యక్రమం. లేకపోతె ఎందుకు?' అన్నట్లుగా చూస్తే, చక్కటి ఒక చిరునవ్వు ఆమె మొహంలో నుంచి వ్యక్తం అవడం, ఆయన విల్లు ఎత్తడం, అది విరిగిపోవటం ఇవన్నీ జరుగుతాయి.

మనకి కూడా అలాంటి విల్లు యొక్క arrangement ఉన్నది. ఓంకారం అనే నాదాన్ని మూలాధారం నుంచి సహస్రారం వరకు తీసుకువెళ్ళే ప్రయత్నములో ఈ భ్రూమధ్యలో వున్న విల్లుని దాటివెళ్లిన వాళ్ళు, వారు నిజమైన ధనుస్సుని కలిగిన వాళ్ళు అనే ఒక రహస్యార్థం, యోగపరంగా ఇందులో ఇవ్వబడి వున్నది. భగవంతుడు అది దాటి ఉన్నవాడే ! అటువంటి వ్యక్తులలో నుంచి వ్యక్తమౌతున్న వాడు కూడా భగవంతుడే! అందుకనే వారి రక్షణ కూడా బాగా జరుగుతుంది. యోగులందరూ కూడా చక్కటి దర్శనము ఇవ్వగలరు. గురువులందరూ కూడా చక్కటి దర్శనము ఇవ్వగలరు. ఎందుకంటే ఈ ధనుస్సును పొందియున్నవారు, కలిగియున్నవారు కాబట్టి. అక్కడ ధన్వి, అనే పదానికి ఈ విధమైన అర్ధము వచ్చింది. మన బోటి సాధకులకోసం కూడా 'ధన్వి' గురించి మాస్టరుగారు ఇక్కడ ఒక అర్ధం ఇచ్చారు. ఓంకారం చేసేప్పుడు, ఒక్కొక్క ఓంకారం ఒక్కొక్క ఇంద్రియానికి గురిపెట్టి చేయమన్నారు. ఒక్కొక్క ఓంకారం ఒక్కొక్క ఇంద్రియానికి గురి పెట్టి చేస్తే, ఐదు ఓంకారాలు కదా! అంటే ఏమిటి? మన చూపులను పవిత్రం చేసుకోవడానికి ఒక ఓంకారం. అది మనకి చూసేటప్పుడు గుర్తుండాలి, మనం ఎటువంటి చూపులు చూస్తున్నామో అని. ఎందుకంటే, ఒకసారి clean చేసిన తరువాత బురద రాయము కదా! రాసినా మళ్ళీ clean చేసుకోటం. ఒక ఓంకారం వినటం గురించి. పిచ్చిపిచ్చివన్నీ వినం. విన్నాం కాబట్టే clean చేసుకోవాలి. మరో ఓంకారం నోట్లో వేసే ముద్ద. రుచి కోసం చేసే పనులు వుంటాయి కదా. అక్కడ ఒక ఓంకారం వదలాలిట. హృదయం నుంచి ఐదు బాణాలు వదలాలి. ఒకబాణం మనం చూపులకు సంబంధించిన ప్రవర్తనల మీదకు, ఇంకో బాణం మనం వినే విషయములయందు మనం చూపే ప్రవర్తన మీదకి, మరియొక బాణం మనం రుచి చూసే విషయముల మీదకి, మన నుండి వ్యక్తమయ్యే సంభాషణల మీదకు. నాలుక అంటే రెండు పనులు చేస్తుంటుంది కదా. లోపలకి పంపిస్తుంటుంది, బయటకు పట్టుకొస్తుంటుంది, కదా! తరువాత వాసన చూసేది, స్పర్శ. అడ్డమైనవి మనం ముట్టుకోకుండా, అడ్డమైన స్పర్శలు కోరకుండా అతి పవిత్రముగా మన శరీరాన్ని వుంచుకోడానికి. ఇట్లా ఐదు ఓంకారముల ద్వారా ఐదు ఇంద్రియములను ప్రతినిత్యం శుభ్రపరచుకోడం అనే పద్ధతి ఒకటి వున్నది. ఈ ఐదు ఓంకారాలతో పరిపూర్ణంగా ఎవరైతే శుభ్రపరచుకొని ఉంటారో, వారికి మనసు యందు పరిపూర్ణమైన ఆధిపత్యం ఉంటుంది. మనసంటే ఈ ఐదు ఇంద్రియముల యొక్క

సమీకరణ శక్తే కాబట్టి ఈ ఐదు ఇంద్రయాలని ప్రతి పొద్దున్నా, ప్రతి సాయంత్రం clean చేసుకుంటూ, between morning and evening వాడుకోటంలో ఎక్కువ బురద కాకుండా చూసుకోవాలి. కొంత మంది ఏదైనా వస్తువు వాడితే సాయంత్రానికి మట్టెక్కిపోతుంది. కొంత మంది మట్టి పట్టకుండా చక్కగా చూసుకుంటారు. ఏదైనా సరే ఇద్దరూ clean చేసుకోవాలి పొద్దున్నా సాయంత్రం. పొద్దున్న, సాయంత్రం cleaning process కి మనకి ఓంకారం ఇవ్వబడినదన్నమాట. ఈ ఓంకారం అనే విల్లు ఆధారంగా ఐదు బాణాలూ, ఐదు ఇంద్రియములకు సంధించి సాధన చేసుకుంటూ, పవిత్రీకరించుకుంటూ వెళ్తూ వుంటె, మనసు మీద ఒక రకమైన ఆధిపత్యం వస్తుంది. అట్లా వచ్చిన వాడే అర్జునుడు. ఇంద్రుడు కొడుకు కదా! ఇంద్రుడంటే మనసు. కాబట్టి ఆయనకి ఐదు బాణాలు ఇస్తారు. దేన్ని కొట్టడానికి? మత్స్య యంత్రం కొట్టడానికి. మత్స్య యంత్రం కొట్టడానికి ఏమి చేయాలి ఆయన? కింద నీళ్ళల్లో చూడమన్నారు. కింద నీటిలో చూడడం, అంటే reflected world లో ఈ ఐదు ఇంద్రియముల యొక్క ప్రవర్తన బట్టి మత్స్య యంత్రం కొట్టడం, కొట్టలేకపోవడం ఉంటుంది. ఈ ఐదు ఇంద్రియముల యందు స్వామిత్వం ఎవరికి కలదో వారు మాత్రమే కొట్ట గలరు మత్స్య యంత్రం. దానికి ఇంకా చాలా చాల symbolisms ఉన్నాయి. ఇది ఒక dimension. ఈ ఐదు ఇంద్రియములును శుభ్రపరచుకున్నవారు మాత్రమే దానిని కొట్టగలరు అంటే మనసుని జయించిన వారు మాత్రమే ద్రౌపదిని పెళ్లి చేసుకోగలరు. దానికి ఇద్దరు రెడీగ ఉంటారు. ఒకడు కర్ణుడు, ఇంకోడు అర్జునుడు. కొన్ని కారణాలవల్ల కర్ణుడ్ని పక్కన పెట్టేస్తారు. అర్జునుడు కూడా కర్ణుడు లాగానే, కర్ణుడు కూడా అర్జునుడు లాగానే. కర్ణుడిని చూసి అర్జునుడు భయపడిన సన్నివేశాలున్నాయి. కాకపొతే కర్ణుడియొక్క ఉద్దేశములలో పవిత్రత తక్కువ, దైవానుగ్రహం తక్కువ, దైవ ఆగ్రహం ఎక్కువ ఆయనకి. ఈయనకి, దైవ అనుగ్రహము ఎక్కువ. అందుకనే గట్టెక్కేస్తాడు! ఈ పంచేంద్రియములని మనం బాగు చేసుకోడానికి ఈ ఐదు ఓంకారములు చేసుకొని, ఈ విల్లుని మనం తయారుచేసుకుంటే, ఏది? ఉఛ్చారణ అనే విల్లుని తయారు చేసుకోవాలి. ఓంకారం ఉచ్చరించడం, అది వింటూ వుంటే, వింటూ వున్న ఓంకారంలోంచి జరుగుతున్న ఓంకారం లోకి ప్రవేశిస్తాం. ఓంకారం జరుగుతూ వుంటుంది లోపల సుషుమ్నలో! జరిగే ఓంకారాన్ని మనం బయటకి ఉచ్చరించడం ఎందుకంటే, దీన్ని ఉచ్చరించడం

ద్వారా ఈ జరుగుతున్న దానితో మనం అనుసంధానం చెందడానికి. యోగులు, జరిగే ఓంకారాన్ని ఎప్పుడూ వింటారుట! 'నిత్యం ధ్యాయన్తి యోగినః!' దానియందు జరుగుతున్న ఓంకారంతో మనసు లగ్నం చేసిన వారు యోగులు. జరుగుతున్న ఓంకారాన్ని వినటానికి మనం ఓంకారం అనాలి. అంటూ వినాలి. వింటూ ఉన్న ఓంకారం ఆపాక, జరుగుతూ ఉన్న ఓంకారాన్ని గమనించాలి. ఇది ఒక సాధన. ఇట్లా ఈ ఓంకారాన్ని మనం బాగా పెంపొందించుకుంటూ వెళ్తుంటే మనకి ఒక్కొక్కటి, ఒక్కొక్కటి చ్ఛేదనం జరిగి, అజ్ఞానం లోంచి జ్ఞానం లోకి ప్రవేశించడానికి అవకాశం ఏర్పడుతుంది. మొట్టమొదటి చ్ఛేదనము జరగడమే 'గణపతి అనుగ్రహించడము' అంటారు. ఓంకారం అన్నా, గణపతి అన్నా ఒకటే! అందులో మొట్టమొదట చ్ఛేదనం జరిగి, భౌతికమైన విషయములయందు వాంఛ తగ్గటం అనేది గణపతి ఇచ్చే సిద్ధి. భౌతికమైన విషయముల యందు, అది వస్తువులవ్వవచ్చు, మనుషులవ్వవచ్చు, వాటి యందు వాంఛ cut-off ఇస్తాడన్నమాట! అక్కడ నుంచి బాధ ఇక ఉండదు. దీని కోసం దాని కోసం వెంపర్లాట వుండదు. అదీ గణపతి ఇచ్చే మొట్ట మొదటి సిద్ధి. అందుకని మొట్టమొదట గణపతి అనుగ్రహం లేనిదే మనం ఈ ప్రాపంచికమైన సృష్టి నుండి విముక్తి పొందడం జరగదని, పెద్దలు చెప్తారు. ఓంకారం చేస్తే అది గణపతి ప్రార్థన అవుతుంది. అది మనకి ప్రాపంచిక విషయముల నుంచి విముక్తి యిస్తుంది. 'వస్తుదృష్టి చేసి వాంఛ ఇడడు' అని చెప్పి మనకి ప్రహ్లాదచరిత్ర లో ఒక పద్యము వుంది. ఎన్నో వున్నాయిట ప్రహ్లాదుడికి! మొత్తం సృష్టికే అధిపతిగా తన తండ్రి వున్నప్పుడు రాజకుమారుడుకి లేనిదేమున్నది! కానీ దేనిమీద కూడా దృష్టి లేదుట. అన్నీ ఉన్నాయిట! అన్నీ చూసి ఆనందిస్తూ ఉంటాడుట కానీ, వస్తు దృష్టి లేదుట. ఇది VCR ఇది Car, ఇది TV, అట్లా వుండదు. అవన్నీ కూడా భగవంతుడి యొక్క అస్థిత్వంగా చూస్తాడు తప్ప, వాటిని వేరుగా చూడడు. వాటికి వేరే value లేదాయనకి.'అమ్మో! అలా ఐతే ఎలా అండీ?' అని అనిపిస్తుంది. వీటన్నిటి మీద value పోతే ఎలా? అనిపిస్తుంది మనకి. చెప్పుకోడానికి బాగుంటుంది. గురువుగారికి మట్టి, బంగారము రెండూ సమానమేనండి, అని. అది ఎవరి గురించో చెప్పుకుంటే బాగుంటుంది తప్ప, మనం అట్లా అయిపోతే ఎట్లా? అని కొంచెం భయం వేస్తుంది. గణపతి సిద్ధి ఇవ్వటం అంటే అది. ఇంక అక్కడ నుంచి గొడవుండదు. సమృద్ధి అంటే ఏమిటి? ఇది కావాలనీ, అది కావాలనీ అనే బుద్ధి

పోవడమే సమృద్ధి. అంతేకానీ, మనము కోరుకున్నవన్నీ మన దగ్గరకి రావటం కాదు సమృద్ధి. మనకి ఇది కావాలి, అది పోవాలి అనేది పోయిందనుకోండి! అంతా సమృద్ధే! వాళ్ళకి ఏది కావాలంటే అది అవసరాన్ని బట్టి ప్రకృతి యిస్తూ వుంటుంది. ఇప్పుడు షిరిడి సాయిబాబా ఉన్నారనుకోండి, అంతా సమృద్ధే! రమణ మహర్షి వున్నారనుకోండి, అంతా సమృద్ధి! ఇవన్నీ చేర్చుకోడం వల్ల వాటికి మళ్లా చాల తతంగం వుంటుంది కాబట్టి, లేకుండా వుంచుకున్నారు. అవసరం అయితే వస్తాయి. ఒక రకమైన విదేహ స్థితియందు వుంటారు వాళ్లు. అంటే భౌతికమైన దేహముతో విడిపడినట్టుగా వుంటారు. సీతాదేవి అదే స్థితి. విదేహస్థితే ! ఇట్లా ఈ స్థితికి చేరుకోడానికి గణపతి, లేక ఓంకారం మనకి వుపయోగిస్తుంది. మనవరకు ఈ 'ధన్వి' అనే పదానికి అర్ధం చెప్పుకోడానికి ఈ ఓంకారాన్ని ఈ విధముగా వాడుకునే పద్ధతి వున్నది. మనం ఓంకారం regular గా ఒక సమయములో వాతావరణం పవిత్రీకరించుకొని చేసుకుంటూ వుంటె, అంతకన్నా తరించడానికి ఇంకో మార్గం లేదు. ఇది simplest method. మనకి కోటానుకోట్ల methods యిచ్చారు. అందులో ఓంకారం అనేదాన్ని మించి మార్గం ఇంకోటి లేనట్లుగా ఉంటుంది. అన్ని మంత్రాలూ ఓంకారం లోనే ఉన్నాయి. అన్ని సాధనాలూ ఓంకారం లోనే ఉన్నాయి. అన్ని క్రతువులూ ఓంకారం లోనే ఉన్నాయి. అన్ని పూజలూ ఓంకారం లోనే ఉన్నాయి. ఓంకారం చేయకుండా చేసేది ఏదీ కూడా సత్ఫలితాన్ని ఇవ్వదు, అని చెప్పారు ఋషులు. ఈ 'ధనుస్సు' మనం పెంపొందించుకోవాలి. ధన్వి పదానికి రక్షణ ఒక quality. దాన్ని మనం పెంచుకొనే సాధన వున్నది. అలాగే మనలో ఓంకారాన్ని బాగా వృద్ధి చేసుకుని, దానియందు మనం వ్యక్తీభావం చెందటం అనే సాధన వున్నది. ఇదే ఓంకారాన్ని దేహశుద్ధికి, అంటే మనసు, ఇంద్రియములు, శరీరాన్ని పరిశుద్ధి పరచుకోడానికి ఒక సాధన వున్నది. ఇవన్నీ కూడా భగవంతుడి యొక్క అస్తిత్వాన్ని మనయందు ఏర్పరచుకోడానికి మనం చేస్తున్న పనులే! అప్పుడూ, ధనుర్ధారియై భగవంతుడు మన యందు నిలబడి వుంటాడు. అలా ధనుస్సు 'భగవంతుడు'! ఎక్కడ ధనుస్సు వచ్చినా సరే ఈ విధమైన అవగాహన చేసుకోవాలి. ఓంకారం అని గుర్తు పెట్టుకోవాలి ఇది ఒక అవగాహన!

## 83. మేధావి

మేధస్సు అంటే మనలో నుండే, మన నుంచి పని చేస్తున్న, మన నుంచి వ్యక్తమౌతున్న, మనది కాని Intelligent Activity. కొంత మంది పుట్టుకతోనే తెలివిగా పుడతారు. కొంత మంది సానపట్టుకుంటారు. కొంతమందికి ఏమి చేసినా, ఏడాది వుతికినా అన్నట్టుగానే వుంటుంది కదా! ఎందుకనీ? అంటే కొంత మందిలో ఎక్కువ వ్యక్తము అవుతోంది. కొంత మందిలో ఓ మోస్తరు గా వ్యక్తమౌతోంది. కొంత మందిలో వ్యక్తం కావటం లేదు. వ్యక్తము అవ్వాలంటే ఏమి చేయాలో అది చేస్తుంటే వ్యక్తం అవుతుంది. మహాత్ములలో పరిపూర్ణముగా వ్యక్తము అవుతుంది. ఇది కూడా భగవంతుని యొక్క అవతరణముగా తీసుకోవాలి. ఒకడు బాగా తెలివితేటలు చూపించాడనుకోండి, భగవంతుడి ఒక విభూతి, అని చూడాలి. ఏడవ కూడదు. వాడి తెలివితేటలలో మనం భగవంతుడిని చూడగలిగినప్పుడు మనకి ఏడుపు రాదు. లేకపోతె ఏమిటనిపిస్తుందంటే, 'మనకి లేకపోయింది' అని ఏడుపొస్తుంది. 'వాడికి ఎందుకు వుండాలని' ఇంకో ఏడుపొస్తుంది. వాడు తెలివైన వాడని ఒక ఏడుపు, మనకి లేదని ఇంకో ఏడుపు. రెండు ఏడుపులైపోతాయి. ఇంత మందిలో తెలివిగా వ్యక్తము అవుతున్నది భగవంతుడు. భగవంతుడిని మనం సముద్రంగా అవగాహన చేసుకుంటే, సముద్రము అంత తెలివన్నమాట. అందులోంచి ఒక్కొక్కళ్లు వ్యక్తం చేసే తెలివి ఒక తరంగం లాంటిది. లేక ఒక అల లాంటిది. వాడి స్వంత తెలివితేటలూ వాడికి వుపయోగిస్తాయా, ఉపయోగించవా అనేది కూడా వాడి యొక్క ఉద్దేశాన్ని బట్టి ఉంటుంది. తెలివి తేటలు ఎలా వాడబడ్డవి అనేది ప్రతి వ్యక్తి బాగుపడడానికి అని చెప్పటానికి వీలు లేదు. తెలివితేటల వలన జీవితాన్ని complicate చేసుకున్నవాళ్ళు ఎక్కువ మంది కనిపిస్తారు. చాలా మంది వారి తెలివితేటలతో బాగా తీయలేని, విడువడని ముడులు వేసుకొనేవాళ్ళు! అదేమిటి? అదే తెలివితేటలతో వృద్ధి చెందిన వాళ్ళుంటారు, అదే తెలివితేటలతో నాశనము అయిపోయిన వాళ్ళు వుంటారు. ఏమిటి ఇద్దరికీ తేడా అంటే? దానియొక్క వినియోగంలో తేడా. అది నీది కాదు, నీకు ఇచ్చాడు భగవంతుడు. నీకు ఇచ్చింది నువ్వు వినియోగం చేసుకోడంలో ఎట్లా వున్నావు అనేది తేడా. శకుని తెలివితేటలు ఎలా వాడాడో చూస్తే మనకి బాగా

అవగాహన అవుతుంది. రావణాసురుడు తెలివితేటలు ఎట్లా వాడాడో చూసుకుంటే మనకి బాగా అవగాహన వస్తుంది. రాముడితో రావణుడు యుద్ధము చేస్తున్నప్పుడు, రోజూ రాక్షసులు ఎక్కువమంది చచ్చిపోతూవుంటారు. కోతులు తక్కువ చచ్చిపోతూ వుంటాయి. రోజూ count చూస్తే వాళ్ళపార్టీలో చచ్చిపోయినవాళ్ళు పదింతలు ఎక్కువుంటారు, రాముడి సైన్యములో చచ్చిపోయినవాళ్ళ కన్నా! రాముడి సైన్యము అంటం కన్నా సుగ్రీవుడి సైన్యము అనాలనుకోండి. చచ్చిపోతూ వుంటే దానితో ఏమౌతుంది? వాళ్ళకి వేగులవాళ్ళు వుంటారు. ఎంత మంది పోయారు అటు పక్క, ఎంత మంది పోయారు ఇటు పక్క, ఇంకా ఎంతమంది మిగిలారూ, ఇంకా ఎన్నాళ్ళు జరుగుతుంది యుద్ధం? ఇవన్నీ వుంటాయి కదా లెఖ్ఖలు! చాల తెలివైనవాడు రావణాసురుడు, అందులో ఏమి సందేహము లేదు. అయన ఏమి చేస్తాడంటే, 'ఇంతమంది మనవాళ్ళు పోతున్నారని వాళ్ళకి తెలిస్తే, అసలే కోతులు, రెట్టించిన ఉత్సాహముతో మళ్ళీ యుద్ధం చేసి, మళ్ళీ ఎక్కువ మందిని చంపుతారు మరునాటికి. కాబట్టీ, మన వాళ్ళు ఎంత మంది చచ్చిపోయారో వీళ్ళకి తెలియకూడదు కనుక, చచ్చినవాళ్ళని చచ్చినట్టుగా సముద్రములో పారేయండి' అని చెప్తాడు. పారేస్తే ఏమౌతుంది? ఇంత మంది పోయారు, ఇంత మంది మిగిలారు, ఇహ ఇన్నాళ్లు పడుతుంది యుద్ధం అనే అవగాహన రాదు. అవగాహన రాకపోతే, ఈ కోతులు ఎటువంటివంటే కొంచెం positivity చూపిస్తే పులిలా వెళ్ళిపోతారు, కొంచెం నిరుత్సాహం కల్పిస్తే మళ్ళీ పిల్లుల్లా అయిపోతారు. రామాయణంలో, యుద్ధ కాండలో ఇది కనిపిస్తూ వుంటుంది. వీళ్లందరినీ బాగా ఉబ్బేసి పంపిస్తే, ధన్ ధన్ లాడించేస్తారు. అటునించి ఏ కుంభకర్ణుడి లాంటి వాడో ఒకడు కనబడితే ఘోరంగా పారిపోయి వచ్చేస్తారు. వాళ్ళకి ఆ చపలత్వం వున్నది. అలా చెప్పడానికి కోతుల కథ మంచి ఉదాహరణం, monkeybrand అంటాం కదా! రావణాసురుడు చెప్పినట్లు అందరిని అట్లా సముద్రములో పారేసుకుంటూ వస్తారు. వీళ్ళకి అసలు లెఖ్ఖే తెలీదు. లెఖ్ఖ తెలిస్తేనేమి తెలియకపోతేనేమి, మన ధర్మం మనం చేస్తూనే వుండాలి అని చేస్తుంటారు యుద్ధం. వీళ్ళవాళ్లూ చచ్చిపోతూ ఉంటారు. వీళ్ళవైపు చచ్చిపోయిన వాళ్ళు ఆ యుద్ధభూమిలోనే పడి ఉంటారు. వాళ్ళ వాళ్ళంతా సముద్రము లో కలిసి పోతారు. కలిసిపోతే ఏమౌతుంది? హనుమంతుడు సంజీవని పర్వతం తీసుకు వచ్చి పెట్టినప్పుడు దాని ప్రభావము ఒక్క లక్ష్మణునికే గాక, అందరికీ ఒకేలా పని

చేస్తుంది. ఆ సంజీవని యొక్క ప్రభావము వల్ల చచ్చిన వాళ్ళు అందరూ లేచి కూర్చుంటారు. ఈ సముద్రములో పడిపోయిన వారు లేవరు. అందుకే మనకీ Let virtue be the strength of my intelligence, అన్నారు. 'తెలివికిని సద్గుణంబులు బలిమి జేర్చు' అని. సద్గుణాల బలిమి లేకపోతే ఈ తెలివితేటలు ఎందుకూ పని చేయవు. రావణాసురుడు అంత తెలివైనవాడు, ఎంత strategic గ వున్నాడు? కాని, అతని ఉద్దేశములో పెద్ద సొట్ట కాబట్టి, భగవంతుడి అనుగ్రహం వచ్చే సమయములో ఈ విధముగా అయిపోయింది. అదే కర్ణుడికి కూడా! ఉద్దేశ్యాల్లో తేడాలుండే సరికి తప్పులు పడిపోతుంటాయి. అదే శకునికి కూడా! శకునికి మొత్తం ఎవరన్నా respect లేదు. ఒక్క కృష్ణుడు అంటేనే భయం. భయంతో కూడిన respect. ఎందుకంటే ఆయన మేధస్సు అటువంటిది. శకుని యొక్క మేధస్సు ఎటువంటిది అంటే ఆయనకి భీష్ముడు లెఖ్ఖ కాదు. భీష్ముడిని గెలవగలడు తన మేధస్సుతో ఎదురుకొని. విదురుడో లెఖ్ఖ కాదు. ద్రోణుడు లెఖ్ఖ కాదు. యుద్ధం చేసి గెలవలేడు కానీ మేధస్సుతో గెలవగలడు. అంటే plans వేసి ఎక్కడో అక్కడ ఇరుకుపెట్టేస్తాడు. మెలికలు పెట్టేసి మనిషిని ఆడించగలిగే శక్తి సామర్ధ్యములు కలిగిన వాడు శకుని. అందుకని ధర్మరాజు లెఖ్ఖ కాదు. అర్జునుడు అసలే లెఖ్ఖ కాదు. అసలు ఈ యుద్ధాలు అవీ ఎందుకు? అంటాడు. అదే కదా అతని బోధ దుర్యోధనునికి. యుద్ధం చేసి గెలుస్తానంటావేంటి, పిచ్చివెధవా? హాయిగా ఇంట్లో కూర్చుని, breakfast, lunch ఏవీ miss కాకుండా, ఎండ పొడ పడకుండా మనం రాజ్యం చేసే పద్ధతులున్నాయిరా, అని చెప్తూ వుంటాడు. ఆయన వేసే పాచికలన్నిటికీ భయం ఒక్క కృష్ణుడు కోసమే! మిగిలిన వాళ్ళని ఆడించేయగలడు. ఎందుకంటే తన మేధస్సు మీద అంత నమ్మకం. ఊరికే బండ బలం వుంటే ఏమి లాభం? యుక్తి ఉన్న వాడు శక్తి ఉన్నవాడి కన్నా ఎక్కువ ఉత్తీర్ణుడు అవుతూ వుంటాడు. అది శకుని యొక్క ఆలోచన! అటువంటి శకునికి, ఉద్దేశాలు బాగుండకపోవడం వల్ల కృష్ణుడి యొక్క మేధా సంపత్తి అంత కిట్టదు. ధర్మరాజు మేధా సంపత్తి పెద్ద లెఖ్ఖ కాదు. ఇంకెవరైనా లెఖ్ఖ కాదు! ఎందుకయ్యా అంటే కృష్ణుడి యొక్క మేధస్సు అల లాంటిది కాదు, సముద్రంలాంటిది. అంటే వ్యక్తిగతమైన మేధస్సు వున్నవాడు కాదు కృష్ణుడు. మనం ఏం చేస్తూంటామంటే మన స్వంత తెలివితేటలతో ఏదో నెట్టుకొస్తూ వుంటాము. మనం ఒకటి అనుకుంటే ఇంకోటి అయిపోతుంది. శ్రీకృష్ణుడికి స్వంత plan లేదు. స్వంత తెలివితేటల

question లేదు. కృష్ణుడు నుండే మేధస్సు వ్యక్తం అవుతూ వుంటుంది, అంతే! జగత్ కళ్యాణానికి లేక సృష్టి ప్రణాళికకు సంబంధించిన మేధస్సు ఒకటుంది. అదీ భగవంతుడు అంటే! అదీ కృష్ణుడు అంటే! వ్యక్తిగతమైన మేధస్సులు కూడా మనవనుకోవడం మన అజ్ఞానం. అవి కూడా మనకి ఇవ్వబడినవి! మనకి ఇవ్వబడిన మేధస్సులో, అంటే మన పిల్లి బుఱ్ఱతో మనం చేసే ఆలోచనలతో, మన జీవితం మనం నిర్మాణం చేసుకుంటాం. అదో పద్ధతి వున్నది కదా! దానికి పరిధి వుంది. చాలా limited life. పరిమితత్వంతో బాగా కుంచించుకుపోయి, సంకుచితమైన ఆలోచనలతో, చిన్న జీవితాన్ని తయారు చేసుకొని, అందులోనే ఏదో గుద్దుకుంటూ, తన్నుకుంటూ, బతికేసే పద్ధతి ఒకటుంది. ఎందుకనీ? మనది అనుకోవడం వల్ల, మన తెలివితేటలు మనవి అని పరిధి కట్టుకోవడం వల్ల. యోగులు, మహాత్ములు, గురువులు వాళ్లకు వుండే ఈ అల లాంటి మేధస్సును తీసుకెళ్లి సముద్రములో కలిపేస్తారు. నాకెందుకీ మేధస్సు? నాకెందుకీ గోల? భగవంతుని యొక్క మేధస్సు ఇక్కడ నుండి వ్యక్తమవుతుంటే అవుతూంటుంది అని. భగవంతుడి యొక్క మేధస్సు మన నుంచి వ్యక్తం అవుతోందనుకోండి, you can see far. వేల సంవత్సరాలు చూసేయగలరు. వేదవ్యాసుడు మొత్తం సృష్టి అంతా అలా చూపించాడు. ఋషులు అట్లా చూపించారు. ఎట్లా చూపించారంటే అంటే అది వ్యక్తిగతము అయిన మేధస్సు కాదు, అసలు మేధస్సు భగవంతునిదే, మనది ఏమి లేదు. మన నుంచి వ్యక్తం అవుతోంది. ప్రాణం కూడా భగవంతుడే, మన నుంచి వ్యక్తం అవుతోంది. ప్రకృతి, పృధ్వీతత్త్వం అన్నీ ఆయనవే! అన్నీ మన నుంచి వ్యక్తం అవుతున్నాయి తప్ప, మనము అంటూ ఒకటి తయారు చేసి మన నుంచి వ్యక్తం చేస్తున్నట్లయితే, pump feel అయ్యినట్లు! Pump నుంచి పంపుతుంటే pump అనుకుంటుందిట, నీళ్లు నేనే ఇస్తున్నాను కదా అని! Pump నీళ్లు ఇవ్వదు, wire current ఇవ్వదు ! అయితే pump, wire లేకపోతె నీళ్లు, current రావు, మనవరకు. అంత వరకు వాటికి ఒక ప్రాముఖ్యత ఉన్నది. అంతే కానీ వాటివి కావు యివి. Municipality pipe line cannot claim that Iam the owner of the water. ఏ electric wire కూడా electricity నాది, అనడానికి వీలు లేదు. అట్లాగే intelligent activity ఏదైతే ఉన్నదో భగవంతునిదే! ఏ మేధస్సు అయితే పై నుంచి ఒక పద్ధతిలో, ఈ సృష్టి కార్యక్రమాలన్నీ నిర్వర్తిస్తున్నదో, ఏ మేధస్సయితే జంతువుని కూడా నడుపుతున్నదో, ఏ మేధస్సయితే వృక్షములను

పెంపొందింప జేస్తున్నదో అది భగవంతుడే. పిల్లి మేధస్సు పిల్లికి వుంటే, కుక్క మేధస్సు కుక్కకి వుంటే, పిల్లి, పిల్లి లాగానే ప్రవర్తిస్తుంటుంది. కుక్క, కుక్క లాగానే ప్రవర్తిస్తుంటుంది. గుర్రం, గుర్రం లాగానే ప్రవర్తిస్తుంది. మనం కూడా అంతేగా! మానవుడు మానవుడి లాగ ప్రవర్తిస్తాడు! ఇవన్నీ ఒకే మేధస్సు నుంచి వచ్చే వివిధమైన అలలుగా భావన చేసుకున్నప్పుడు, మనది అనుకున్న మేధస్సును తీసుకెళ్లి అందులో కలిపేసి భగవంతుని యొక్క మేధస్సు పనిచేస్తే మనం ఉన్నాం. Let it function through; let me be a witness to HIS functioning through me. అని అనుకున్నవాడు గురువు అవుతాడు. అదీ 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' అంటే! ఇక నువ్వేమి స్వంత కొట్టు పెట్టుకోకురా వదిలేసేయి, అక్కడ నుంచే వచ్చేస్తుంది. అల ఎక్కడ నుంచి వస్తోంది? సముద్రము నుంచేగా? సముద్రము లేకపోతె అల ఏదీ? సముద్రమే అలగా వస్తుంటే, నువ్వేమో నీ స్వంత కార్యక్రమము అల అనుకుంటావేమిటి? నువ్వు ఉండటమే వాడు ఉండటం కదా! ఆ పరిస్థితులలో ఈ మేధస్సుని ఆ మేధస్సులో కలిపెయ్యడం అంటే, ఏమి లేదు, మనది కాదూ అని అంటే, మనవి అనుకోటం వల్ల వచ్చే బాధలు మనవి కాదని గుర్తు చేసుకోవటం వల్ల కలిసిపోతుంది. కలిసిపోతే ఏమౌతుందంటే అటు నుంచి మేధస్సు workout చేస్తూంటుంది. ఇంక అక్కడ దానికి అంతు లేదు. నీ పరిమితత్వం నీకు లేకపోయేసరికి, భగవంతుని ప్రణాళిక నీ నుంచి వ్యక్తం అవుతూ వుంటుంది. అప్పుడు జగత్ కళ్యాణమైన కార్యములు విపరీతముగా జరిగిపోతుంటాయి. చూసే వారికి అత్యాశ్చర్యకరముగా వుంటూ వుంటుంది. ఏంటిరా, వీడు ఇట్లా చేస్తున్నాడు, అని. వాళ్లూ మహాత్ములు! స్వంత తెలివి అంటూ పెట్టుకోకుండా భగవంతుడి తెలివే వ్యక్తము అవుతూ వుంటే చూసి ఆనందించే వాళ్ళు. వాళ్ళు అసలైన మేధావులు. న్యూటన్ మనకి, ఈ శాస్త్రవేత్తలలో చాల ముఖ్యమైన వాడు కదా! ఆయన భూమి ఆకర్షణ శక్తి ఇత్యాదులు కనిపెట్టిన సందర్భములో అతనిని పొగిడి, పూల మాలలు వేసి, అశ్వారోహణం, గజారోహణం చేయిస్తుంటే, ఆయన్ని అడుగుతారు 'మీది ఏం మేధస్సు సార్! బ్రహ్మాండం అంత వున్నది' అని. అతనంటాడు నా మేధస్సా? మరి ఇవ్వాళే ఎందుకు తట్టిందీ? అంతకు ముందు ఎందుకు తట్టలేదూ? అప్పుడూ ఉందిగా నా ఈ మేధస్సు! రేపు ఎందుకు తట్టలేదు? మన మేధస్సని విర్రవీగాల్సింది ఏమి లేదు. జ్ఞానమనే సముద్రపు ఒడ్డున వుండే మన beach ఎంత పొడుగుందీ? మొత్తం భూగోళం మేర వుంది కదా! ఎంత ఇసుక వుంటుంది? ఇసుకలో ఎన్ని

రేణువులున్నాయి అటువంటి రేణువుల్లో ఒక రేణువుని నేను,'' అని చెప్తాడు, న్యూటన్. 'భూమి మీదవుండే సముద్రపు ఒడ్డులో ఉండే ఇసుక రేణువుల లెక్క చెప్పలేము కదా! నా జ్ఞానం, సృష్టి జ్ఞానంతో compare చేస్తే, అటువంటి ఇసుక రేణువుల్లో ఒక రేణువు నేను, అని అనుకోండి. అంతకు మించి ఇక్కడ జ్ఞానమేం లేదు' అని చెప్తాడు. మరి అటువంటి ఆయన అలా చెప్పాడంటే, ఇక మిగతా వాళ్ళ మేధస్సు గురించి ఏమి చెప్పాలి? స్వంత మేధస్సు అని విర్రవీగిన ప్రతి వాడు కంపు చేసుకున్న వాడే. అందుకని మన తెలివి కాదు, ఆయన తెలివి మన నుంచి వ్యక్తము అవుతూ వుంది, అని తెలుసుకుంటే బాగుంటుంది.

## 84. విక్రమః

మేధావీ విక్రమః ఈ మొత్తం creation అంతా భగవంతుని యొక్క intelligent network. భగవంతుని యొక్క మేధస్సు యొక్క అల్లిక వలన ఈ సృష్టి అంతా ఏర్పడినట్లు గానే, భగవంతుని మేధస్సే మనలోంచి కూడా పనిచేస్తూ ఉంటుంది. అది మన స్వంత తెలివి అని మనం అనుకోవటం వలన దానికి పరిమితత్వం కల్పించుకున్న వాళ్ళమవుతాం. ఈ సమస్తమూ భగవంతునిదే! మనము కూడా భగవంతుని యొక్క అంశలమే! దిగివచ్చి జీవులుగా ఈ దేహమునందు ఉన్నాం కాబట్టి సమస్తమూ భగవంతునిగా గుర్తుపెట్టుకుని జీవించినట్లయితే, పరిమితమైన మన తత్త్వము అపరిమితత్వంతో అనుసంధానం చెంది, తద్వారా మనం కూడా పరిమితత్వం యొక్క బంధనాలనించి విమోచనం చెందటానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రతి నామమూ భగవంతుని యొక్క అపరిమితమైన గుణతత్వాన్ని మనకి తెలుపుతూ ఉంటుంది. మనలో అవన్నీ పరిమితంగా పరిణితి చెంది ఉంటాయి. భగవంతుని యొక్క రుచి వలన మనయందు ఈ పరిమితత్వం అనేది కొంత కొంతగా సడలి, అపరిమితత్వంతో అనుసంధానం చెంది, అపరిమితత్వమే పరిమితమైన మన దేహ వ్యూహము నుండి వ్యక్తమవడానికి అవకాశం ఏర్పడుతంది. భగవంతుని మేధస్సు ఎవరినించైతే వ్యక్తం అవుతూ ఉంటుందో వారంతా కూడా మహాత్ములు. స్వంత మేధస్సు అనుకునేవారు, (భగవంతుని మేధస్సు నుంచి భగవంతుని మేధస్సే వాడుకుంటున్నప్పటికీ కూడా) దొంగతనము చేసినవారితో సమానము. అందుకనే వారికి అది పరిమితంగా పనిచేస్తుంది. స్వంత తెలివితేటలతో కార్యక్రమాలు నిర్వర్తించుకునే వారందరికీ కూడా ఒక రకమైన పరిమితత్వం, వారికి తెలియకుండానే వారి చుట్టూ ఏర్పడుతూ ఉంటుంది. భగవత్ కైంకర్యంగా పనులు చేసే వారికి పరిమితి అనేది లేకుండా భగవంతుని సంకల్పం ప్రకారం కార్యక్రమాలన్నీ జరిగిపోతూ ఉంటాయి. మేధస్సు భగవంతునిది అని, అది మననుండి వ్యక్తమవుతోంది అని గనక మనకి గుర్తున్నట్లయితే, మేధావీ అనే నామానికి మనం ఎక్కువ చేరువగా ఉండటానికి అవకాశం ఏర్పడుతుంది. మనకేదైనా ఒక పరిస్థితిలో ఒక నిర్ణయం చేసుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు, నిర్ణయం చేయడానికి రకరకములైన పరిష్కారములు

ఉన్నట్లుగా కనపడి, ఏ రకమైన పరిష్కారాన్ని మనం చేసుకోవాలి అనే సందిగ్ధంలో ఉన్నప్పుడు, మొత్తం సమస్యను మనలో ఉన్న భగవంతునికి సమర్పణ చేసుకున్నట్లయితే, మన మేధస్సు నుండి భగవంతుని యొక్క సంకల్పం మనకి అందడానికి అవకాశం ఏర్పడుతుంది. దీన్ని 'బుద్ధి యోగం' అంటారు. బుద్ధిని మేల్కొల్పాలంటే మనకు వచ్చిన సమస్యని మనలో ఉన్న భగవంతునికి అర్పణ చేయాలి. అర్పణ చేస్తే, భగవత్ సంకల్పం మనకి, మన బుద్ధి ద్వారా అంటే మనలో ఉన్న మేధస్సు ద్వారా సమాధానం అందుతూ ఉంటుంది. సృష్టిలో అతి క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు మహాత్ములు ఆ విధంగా చేసినట్లుగా మనకి మన పురాణాల్లో కనిపిస్తూ ఉంటుంది. ఒక హిరణ్యకశిపుడు, ఒక హిరణ్యాక్షుడు, రావణ కుంభకర్ణులు, తారకాసురుడు ఇలా వీరందరూ సృష్టినంతా సంక్షోభం కలిగించే సన్నివేశం ఉన్నది. అలాగే మన జీవితాల్లో కూడా మనకి సంక్షోభం కలిగే సన్నివేశాలు ఉంటాయి. వ్యక్తిగత జీవితంలో ఉంటాయి, సామూహిక జీవితంలో ఉంటాయి, అలాగే రాష్ట్రానికి ఉంటాయి, దేశానికి ఉంటాయి, భూగోళానికి ఉంటాయి. సమస్యలు రేకెత్తినప్పుడు, ఆ సమస్యల లోంచి సమాధానం పొందటానికి చేసే ప్రయత్నంలో బుద్ధిమంతులు చేసే పని ఏమిటయ్యా అంటే, ఈ సమస్తమునూ భగవంతునికి సమర్పణ చేసి, వానినుండి వచ్చే సంకల్పాన్ని ఆధారంగా ప్రవర్తించటం. దేవతలు, ఇంద్రాది దేవతలు, దిక్పాలకులు, వసువులు, రుద్రులు, అందరూ కలిసి సృష్టికి సంక్షోభం కలిగినప్పుడు, బ్రహ్మ దగ్గరకు వెళ్లి, బ్రహ్మను సంప్రదిస్తారు. "ఏం చేయాలి ఇప్పుడు ఉన్న ఈ పరిస్థితుల్లో? మనకి శక్తికి మించిన, దుష్కర్మమైన, దుష్టమైన శక్తులు మితిమీరి పనిచేస్తూ సృష్టి విధానానికే దెబ్బతీస్తున్నాయి. ఇప్పుడు మేమేం చేయాలి" అని బ్రహ్మని అడిగితే, బ్రహ్మ కూడా, తనయొక్క సంకల్పాన్ని చెప్పకుండా, తను నారాయణుని యొక్క ధ్యానమందు నిలచి, అక్కడ నించి తనకు వచ్చిన సమాధానాన్ని దేవతలకు అందించినట్టుగా మనకి ప్రతి పురాణంలోనూ కనిపిస్తుంది. అప్పుడు బ్రహ్మ నుండి వ్యక్తమైనది మేధావీ అనే భగవంతుని యొక్క బుద్ధి బలం! భగవంతుడు కాలమునెరిగిన వాడు, దేశము నెరిగిన వాడు కాబట్టి ఈ పరిస్థితి నించి బయటపడడానికి ఒక సమాధానాన్ని బ్రహ్మకు వ్యక్తం చేస్తాడు. బ్రహ్మ నారాయణుని ఏ విధంగా అడిగి తెలుసుకుని పరిష్కారాన్ని దేవతలకి ఇస్తాడో, అలాగే మనం కూడా నిర్మలమైన ప్రదేశంలో, శుచియైన మనసుతోను, శరీరంతోను కూర్చుని, మనకొచ్చిన

సన్నివేశాన్ని భగవంతుని యొక్క పాదములందు ఉంచినట్లైతే, అక్కడనించి మనకొచ్చిన సంకల్పం ఏదో మనయందే భాసిస్తుంది. భాసిస్తే మామూలుగా ఏం జరుగుతుందంటే, మనకి భాసించినవన్నీ మనవే అనుకుంటూ ఉంటాం. మనకు ఆలోచనలు, మంచిమంచి మెరుపులాంటి ఆలోచనలు వచ్చినప్పుడు మనవనుకుంటూ ఉంటాం. కానీ అవి మనవి కాదు, మనయందు మెరిసినాయవి. చాలామందికి చాలా రకములైన మెరుపులావిధంగా వచ్చి, జగత్కళ్యాణమైన కార్యక్రమములు వారి నుండి జరిగిన సన్నివేశాలు ఉన్నాయి. చిన్నా పొన్నా విషయాల్లో మనకి అభ్యాసం వలన భగవంతుని సంప్రదించి చేయవలసిన పరిస్థితి రాదు. మన శక్తికి మించిన సన్నివేశంలో మనం ఉన్నప్పుడు, ఈ విధమైన గుర్తు మనకి భగవంతుడు తీసుకొస్తూ ఉంటాడు. జీవితం మామూలుగా సాఫీగా జరిగిపోతోందనుకోండీ సంప్రదించి చేయవలసినవంటూ ఏమీ ఉండవు. భోజనం చేయాలి, సంప్రదించనక్కర లేదు. సినిమాకి వెళ్ళాలి, సంప్రదించనక్కర లేదు. ఆకలేస్తోంది, అన్నం తినాలి. పెద్ద సంప్రదించాల్సింది ఏముండదు. చొక్కా, లాగూ వేసుకోవాలి. ఇవాళ ఇవి వేసుకుందామనిపిస్తుంది. అప్పుడప్పుడు బీరువా తెరిస్తే ఎక్కువ బట్టలున్నపుడు ఏం వేసుకోవాలో తెలియక, సంప్రదించాల్సి వస్తుంది అనుకోండి. (అంటే where there is more than one alternative) అదేం పెద్ద విషయం కాదు. ఒక్కోసారి మన శక్తికి మించి కొన్ని సమస్యలు వస్తాయి. వచ్చినప్పుడు పెద్దలని సంప్రదించమంటారు. పెద్దలని సంప్రదించటం, గ్రంధములను సంప్రదించటం, శుచియైన, పుణ్యమైన ప్రదేశములలో సమాలోచన చేయటం--, ఇవన్నీ కూడా భగవంతుని యొక్క మేధావీ తత్వమునకు చేరువలోకి వెళ్ళటమే! అంటే, పుణ్యక్షేత్రాల్లో భగవంతుని యొక్క మేధస్సు మనకి ఎక్కువగా మనయందు ఆవిర్భావం చెందుతూ ఉంటుంది. అలాగే మహాత్ముల సన్నిధిలో అది ఎక్కువగా ఉంటుంది. అందుకని మనం పెద్దవాళ్ళనడగటం అనే ఒక పద్ధతికి అలవాటు పడ్డాం. అట్లాగే, సద్గ్రంధములయందు కూడా నిక్షిప్తమై ఉంటుంది. ప్రదేశములు, గ్రంధములు, మహాత్ములు. వీరందరియందు ఈ మేధస్సు ఎక్కువగా అవతరణం చెంది ఉంటుంది. కాబట్టి వాటిని సంప్రదించవచ్చు. లేదా, మనమే ఏకాంతంగా కూర్చుని సంకల్పం చేయవచ్చు. అలా సంకల్పం చేస్తే, అందులోంచి మనకొచ్చే సమాధానం, మనకి మార్గంని సుగమము చేసే పద్ధతుల్లో ఉంటుంది. ఇదంతా కూడా మేధస్సుని సంప్రదించి పని చేసుకునే పద్ధతి. ఈ మేధస్సును

సంప్రదించకుండా పని చేసుకునే జీవితం సామాన్యంగా జరుగుతూ ఉంటుంది. మహాత్ములకి మేధస్సుని సంప్రదించటం అనేది అప్రయత్నంగా ఉంటుంది. వారికీ మేధస్సుని సంప్రదించవలసిన ఆవశ్యకత ఏర్పడుతూ ఉంటుంది. సాధన చేసుకునే వాళ్ళకి మామూలుగా ఎక్కువసార్లు మేధస్సుని సంప్రదించవలసిన పరిస్థితులు ఏర్పడుతూ ఉంటాయి. అంటే వారికి శక్తికి మించిన పరిస్థితి ఒకటి, వారికెప్పుడూ సన్నివేశం రూపంలో వస్తూ ఉంటుంది. అందుకని ఆ పద్ధతుల్లో సాధన చేసుకునే వాళ్ళని, భగవంతునికి చేరువగా ఉండటానికి, ఇది ఒక విధానంగా కనిపిస్తూ ఉంటుంది. అందుకనే ప్రతినిత్యం, భగవంతుని యొక్క సంకల్పంలో తన సంకల్పం భాగమయ్యే పద్ధతుల్లో సాధకుడు సాధన చేసుకుంటూ ఉంటాడు. అంటే తన నుంచి వ్యక్తమవుతున్నది ప్రతిదీ కూడా భగవత్సంకల్పంగా తయారవటానికి ఒక మార్గంగా అది ఏర్పడుతూ ఉంటుంది. అందుకని మామూలుగా సాఫీగా జీవితం నడిచిపోయే వాళ్ళు కొంతమంది ఉంటే, వాళ్ళని మించి వచ్చే సమస్యలు ఉన్నవాళ్ళు కొంతమంది ఉంటారు. ఆర్థికమైనవి కానీ, సాంఘికమైనవి కానీ, కుటుంబ విషయంలో కానీ, ఏదో ఒకటి కొంచెం మించిన పద్ధతి ఉంటుంది. దాన్ని భరిస్తూ ఉండాలి. ఆ భరించటంలో భగవంతుని వైపు మళ్ళటానికి ప్రయత్నం చేస్తాడు. ఎందుకంటే దాని బాధనించి విముక్తి పొందటానికి కానీ, దానిని భరించటానికి కానీ, దానిని జయించటానికి కానీ, దానిని పరిష్కరించటానికి కానీ భగవంతుని యొక్క సంకల్పాన్ని, తనయందు భాసించుకోవటానికి ఎక్కువ ప్రయత్నం చేయటం వలన! ఆ కార్యక్రమంలో ఇతనికి భగవంతునితో ఎక్కువ అనుసంధానం చెందటం జరిగి, కార్యక్రమం పూర్తయ్యి, భగవంతుని యొక్క మేధస్సు ఇతని నించి వ్యక్తమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. అదలా ఉండగా భగవంతుని యొక్క మేధస్సు వ్యక్తమవటానికి కొంతమంది ఎన్నుకొనబడతారు. ఎప్పుడు ఎన్నుకొనబడతారంటే, వారి యొక్క జీవితములలో ఒక రకమైన శ్రద్ధ, భక్తి, త్యాగము, సేవ కనిపిస్తే! అలా చూపిస్తున్న వారి జీవితములయందు ఇవి సాధ్యపడతాయి. మనం ఉపమానంగా తీసుకోవాలనుకుంటే మాస్టరు E.K.గారి జీవితం తీసుకోవచ్చు. వారికి జీవితంలో అటువంటి సన్నివేశాలు చాలా ఎక్కువగా వచ్చాయి. ప్రతినిత్యం భగవంతుని యందు తను నిలబడక తప్పని పరిస్థితులేర్పడి, అది అభ్యాసమైపోయి, చివరికి భగవంతుని సంకల్పమే ఆయన నుండి వ్యక్తమై జీవించిన పద్ధతి కనిపిస్తుంది. ఒక భక్తుడి యొక్క జీవితంలో ఈ రకములైన సన్నివేశాలు ఉంటాయి.

అందుకనీ, కోరి భక్తుల యొక్క జీవిత చరిత్రలు చదువుకుంటూ ఉండాలి. అదొక instruction. భక్తుల యొక్క జీవిత చరిత్రలు మనం చదువుకుంటూ ఉంటే, అందులో ఆ భక్తుడిగా మనని భావన చేసుకొని, చదువుకోవాలి. అంటీ ముట్టనట్టుగా, కథ చదివినట్టుగా చదవటం కాకుండా, ఆ భక్తుడి స్థానంలో మనని నిలుపుకోవాలి. ఆ భక్తుడు పడుతున్న ఆవేదన మనం పడాలి. ఆ భక్తుడు ఎదుర్కొన్న క్లిష్టమైన సన్నివేశాలు మనం కూడా ఎదుర్కొంటున్నట్లుగా, ఆ పుస్తకం చదువుతున్నంత సేపూ ఆ రకమైన సాధన చేసుకుంటూ ఆ భక్తుని యొక్క చరిత్ర చదువుకున్నప్పుడు, ఆ భక్తుడికి ఏ విధమైన సిద్ధి కలిగిందో, మనకి కూడా ఆ సిద్ధి కలగటానికి అవకాశం ఉంటుంది. భక్తుల జీవిత చరిత్రలు మనం చదువుకోవాలి. భక్తవిజయం అనే పుస్తకం మనకి, తెలుగులో అచ్చు వేయబడి ఉన్నది. అది చూసుకోవచ్చు. లేకపోతే, యోగ వాశిష్ఠము అనే గ్రంథం ఉన్నది. వశిష్ఠుడు శ్రీరామునికి ఇచ్చిన విజ్ఞానమది. శ్రీరాముడు ఆశ్రమంలో విద్య పూర్తిచేసుకుని అయోధ్యా నగరానికి వచ్చి, తల్లిదండ్రుల సమక్షంలో జీవిస్తూ, సకల సౌభాగ్యాలు అనుభవిస్తున్న సందర్భంలో ఒక రకమైన విచారం వస్తుంది రామునికి. ఏమిటా విచారం అంటే, ఏమి చేయటానికీ మనసు పుట్టదు. అంతా వికారంగా ఉంటుంది. సృష్టంతా కూడా వికారంగా ఉంటుంది. ఎందుకు వచ్చాడు ఈ భూమి మీదకి అనిపిస్తూ ఉంటుంది. ఈ మనుషులందరూ కూడా ఎందుకు, ఏ ఉద్దేశాలకై పొద్దున్నే లేచి ఇంత వెంపర్లాడుతున్నారో చూస్తే, అందులో పస ఏమీ ఉండదు. మామూలుగా సగటు మానవుడి జీవితంలో పెద్ద పస ఉండదు. మహా అయితే కీర్తి కోసం, మహా అయితే ధనం కోసం వెంపర్లాడుతూ జీవితమంతా అయిపోతూ ఉంటుంది. ఎందుకు తిరుగుతున్నారో తెలియకుండా జీవితాన్ని ఖర్చు పెట్టేసుకుంటూ ఉంటారు. ఇలా ఉన్న జీవితాల మీద, కాస్త ఆలోచనాపరుడైన వ్యక్తి ఎవరికైనా సరే వెగటు పుడుతుంది. అంటే దేనికోసమో పరిగెడుతూ, సృష్టిలో ఉన్న భగవత్ వైభవాన్ని అనుభూతి చెందకుండా చిన్న చిన్న విషయాలకి వెంపర్లాడుతూ, అట్లా తిరుగుతూ తిరుగుతూ, తిరుగుతూ, ఏదో ఒక రోజున చచ్చిపోయే జీవితాలే ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ చూసి రాముడికి విరక్తి కలిగింది. ఎందుకు అనవసరంగా ఇట్లా వచ్చాన్నేను? ఎందుకు పుట్టాను? అని ఆయనకి అనిపించింది. జగత్కళ్యాణమైన కార్యములు చేయవలసిన దానికి ముందు, "A calm before the storm" అన్నట్టుగా! ఆయనకి తోచకపోతే, అప్పుడు వశిష్ఠుడు చాలా

ఉపాఖ్యానాలు చెప్తాడు. అదే మనకి యోగ వాశిష్ఠము, జ్ఞాన వాశిష్ఠము అని ఇచ్చారు. అందులో ఉండే కథలు చదువుకోవాలి. ఎందుకు చదువుకోవాలంటే, మనని మనం అందులో ఒక character గా, ఆ భక్తుడు మనమే అన్న భావన చేసి చదువుకుంటే, మనకి చాలా రకములైన ముడులు విడి వడి, ముక్తికి దారి దొరుకుతుంది. ముక్తి అంటే, బంధనాల నుంచి బయటపడటమే! మనమే వేసుకున్నాం ముడులు. వేసుకున్న ముడులు విడివడిపోతూ ఉంటాయి. ఒక్కొక్కడికి ఒక్కొక్క చోట ముడి ఉంటుంది. ఆ ముడి విప్పటానికి భగవంతుడు ప్రయత్నం చేస్తూ ఉంటే మనం గోలపెడుతూ ఉంటాం. ఈ ముడులు మనకి విడివడాలంటే, ఈ చరిత్రలు మనం చదువుకోవాలి. ఈ చరిత్రలు చదువుకున్న కొద్దీ ఏమవుతుందంటే, ఆ సన్నివేశంలో ఆ భక్తుడు అడుగడుగునా భగవంతుని యొక్క మేధస్సు ఆధారంగా ఏ విధంగా యుక్తిగా , బుద్ధిబలం చేత, అనుగ్రహం చేత బయటపడ్డాడో మనకి కనిపిస్తుంది. ధర్మరాజు ఉన్నాడనుకోండీ. ఒక నహుషుడి లేక ఒక యక్షుడి వంటి సన్నివేశాలొచ్చినప్పుడు ఎట్లా బయటపడ్డాడు? అక్కడ ధర్మరాజు పరిస్థితుల్లో మనం ఉన్నట్లుగా భావన చేసుకోవాలి. భక్తుల జీవితాలలో కూడా, ఈ విధమైన క్లిష్టమైన, దాటరాని, అశక్యమైన, తమ శక్తికి మించిన సన్నివేశాల్లో ఏ విధంగా భగవంతుని యొక్క అనుగ్రహానికి పాత్రులై దాటగలిగారో, వాటిని మననం చేసుకోవటం ద్వారా అభ్యాసవశమున, భగవత్ మేధస్సు మననుండి వ్యక్తమవటానికి కావలసిన యంత్రాంగాన్ని, instrument ని, పనిముట్టుగా మనం మనస్సుని, ఇంద్రియాలని, శరీరాన్ని తయారు చేసుకోవటానికి వీలుపడుతుంది. ఆ విధంగా చేసుకున్నట్లయితే నిజంగా మనకి సత్యం గోచరిస్తుంది. అసలు మననుండి వ్యక్తమవుతున్నది భగవంతుడే! భగవంతుడు కొంత కార్యక్రమం మనలో జరుపుతూ ఉంటే, దానిని మరచి మనం వేరుగా భావన చేసుకుని, మన కార్యక్రమాన్ని మనం నడుపుతున్నాం. మనలో జరుగుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసలు కానీ, మనలో జరుగుతున్న ఇంద్రియ వ్యాపారములు కానీ, మన జీర్ణ కోశములలోనూ, మిగతా అవయవములలోనూ జరుగుతున్న సమస్త వృత్తి, కదలిక, మొత్తం అంతా కూడా భగవంతుడే చేస్తూ ఉంటే, అది ఆధారంగా మనం ఏదో మన సొంత జీవితమనుకుంటూ కొంత అల్లిక చేసుకొని, అందులో ఎక్కువ ఇబ్బందిపడుతూ ఉంటాం. ఆ స్థితి నుండి దాటించటానికి ఈ మేధావీ అనే నామాన్ని గుర్తుపెట్టుకోవాలి. మేధావీ అంటే

మనలో ఉండే మేధస్సు మొత్తం ఆయనదే అని గుర్తుపెట్టుకోవాలి. మనలోంచి వచ్చే ఆలోచనలు ఆయనవే అని గుర్తుపెట్టుకోవాలి. వంకర ఆలోచనలు ఎందుకు వస్తాయంటే, మనయొక్క పనిముట్టు యొక్క నిర్మలత్వం తగ్గటం వల్ల. 'కంపితాంతరంగమందు కదులు చంద్రుని భంగి' అన్నారు. అంటే, చంద్రుడు ఆకాశంలో కంపించకుండా ఉన్నప్పటికీ కూడా, సముద్రంలో మనం చూసినప్పుడు, కదిలిపోతూ ఉన్నట్లుగా ఉంటుంది. ఎందుకంటే కదలిక సముద్రానికి సంబంధించినది, చంద్రుడికి సంబంధించింది కాదు కదా! కదిలే నీళ్లలో పడే ప్రతిబింబము, బింబానికి సంబంధించినది కాదు. దేనిమీద ప్రతిబింబించినదో దానికి ఉండే కదలిక వలన అంతా చిందర వందరగా ఉంటుంది. అలాగే మనయొక్క పనిముట్టు కూడా చిందర వందరగా ఉండటం వలన, వ్యక్తమయ్యే సంకల్పములు వంకర్లు తిరిగి, అవి మననే బంధిస్తూ ఉంటాయి. అందుకని భగవంతుడిచ్చిన ఈ మేధస్సుని మనయందు అనుసంధానం చేసుకోవటానికి, ఏదో ఒక భక్తుని జీవిత చరిత్ర నడుస్తూ ఉండాలి మనకి. అది అయిపోతే ఇంకొకటి. ఆ నడిచే కాసేపూ చక్కగా దాని గురించి ఏదన్నా notes రాసుకోవాలి. లేకపోతే మర్చిపోతాం. ఆ సన్నివేశంలో ఆ భక్తుడి నించి కానీ, భగవంతుడి నుంచి గానీ వ్యక్తమైన సంభాషణలో మనకి instructions ఉంటాయి. ఆ instructions note చేసుకోవాలి. అందుకనే, చదువుకునేటప్పుడు శ్రద్ధ కావాలి. శ్రద్ధ ఉన్నట్లయితే, చక్కగా అవి మనయందు భాసిస్తాయి. లేకపోతే మర్చిపోతాం. ఆ విధంగా మనం భక్తుల జీవిత చరిత్ర ప్రతినిత్యం కనీసం ఒక  ఘట్టం చదువుకోవాలి. చదవడం అయిపోవలన్న point ఏం లేదు. ఆ భక్తుని జీవితం అయిపోతే ఇంకో భక్తుని జీవితచరిత్ర చదువుకోవచ్చు. రాముని చరిత్ర చదువుకోవచ్చు. భారతం, భాగవతం చదువుకోవచ్చు. ఈ గ్రంథాలన్నిట్లోనూ చాలా రకములైన కథలు కథలుగా భక్తుల జీవితాలుంటాయి. చదువుకున్నప్పుడు, అక్కడ భక్తునికి వచ్చిన సమస్య, అందులో అతను ప్రవర్తించిన తీరు, అతనికి అందిన సమాధానము, దానియందు అతను ప్రవర్తించిన తీరు ----ఇలా ఆ భక్తుని పాత్ర పోషణ మనమే చేయాలి. అది గుర్తుపెట్టుకోండి. అప్పుడు మనకి మేధావీ అన్న పదానికి అవగాహన ఎక్కువ జరుగుతుంది.

## 85. క్రమః.

క్రమము అంటే 'ఒక అమరిక'. Arrangement అన్నమాట. ఈ మొత్తం సృష్టి అంతా కూడా ఒక పద్ధతిగా చేయబడ్డది. మన మానవ శరీర నిర్మాణం కూడా ఒక పద్ధతిగా చేయబడ్డది. సృష్టి ఏ పద్ధతిలో చేయబడ్డదో, మానవ శరీర నిర్మాణం కూడా, అదే పద్ధతిలో చేయబడ్డది. సృష్టిలో ఉన్న లోకములన్నీ కూడా మానవుని యందు ఉన్నాయి. సృష్టిలో ఉన్న శక్తులన్నీ కూడా మానవునిలో ఉన్నాయి. సృష్టికి భర్త, మానవుని యందు కూడా ఉన్నాడు. కాబట్టే 'క్రమము' మనం అవగాహన చేసుకోవటం. The order of things అన్నమాట. The arrangement of things in creation. సృష్టిలో ఉన్న క్రమం ఏమిటి, మనలో ఏర్పడవలసిన క్రమము ఏమిటి? మనకి ఇవ్వబడింది క్రమము. క్రమమైన పద్ధతిని మొట్టమొదటి నుంచి పాడు చేసుకుంటూ ఉన్నాం. చిన్న ఉదాహరణ చెప్పాలంటే పుట్టిన పిల్ల నాలుక మీద ఒక చుక్క strong కాఫీయో, టీయో వేయండి. ఒక చుక్క తేనె వేయండి, ఆపిల్ల మొహం చూడండి. మనమేం చేస్తామంటే నెమ్మది నెమ్మదిగా కాఫీ తాగకపోతే ఎలాగని, అది తాగకపోతే ఎలా, ఇది తినకపోతే ఎలా అని కొన్ని అలవాట్లు, కష్టమైనా చేస్తుంటాం మొదట్లో. అంటే సహజమైనవి కాకుండా అసహజమైనవి బలవంతంగా నేర్పుతాం. అది ఆ చుట్టుపక్కల ఉండే వాళ్ళ మూలంగాను, మనలో కూడా దానికి సంబంధించిన విత్తనములు ఉండటం మూలంగాను జరుగుతుంది. జరిగినప్పుడు క్రమము దెబ్బతింటుంది. క్రమము దెబ్బతిన్న తరువాత దాని యొక్క repercussions అన్ని లోకముల యందు వ్యాపిస్తాయి. మనలో ఉన్న భౌతికము, ప్రాణమయము, మనోమయమైన లోకాలన్నిట్లో కూడా ఈ క్రమము దెబ్బతినటం వలన బుద్ధి భాసించదు. బుద్ధి మనలో ఉన్నప్పటికీ ఈ లోకములలో బుద్ధి అనే వెలుగు భాసించటానికి అవకాశం లేకుండా పోతుంది. భగవంతుని సృష్టి అంతా ఒక క్రమ పద్ధతిలో ఉంటుంది. కొబ్బరిచెట్టు మొదలుపెట్టి పెరగటం మొదలుపెడితే, ఒక పద్ధతిలో పెరుగుతుంది. మనం ఇవాళ మొదలుపెడితే results రేపటికి వచ్చేయాలి. ఏమిటో ఇన్నాళ్లు చేశాం ఏమీ కాలేదనిపిస్తుంది. సృష్టిలో ఏది చూసినా చాలా నెమ్మదిగా, క్రమముగా, ఒక పద్ధతిలో, వృద్ధి చెంది, సిద్ధి పొందుతూ ఉంటుంది. మామిడి చెట్టు తీసుకోండి,

కొబ్బరిచెట్టు తీసుకోండి, మనిషి తీసుకోండి, జంతువు తీసుకోండి, దేన్ని తీసుకున్నా సరే. మనకి order of things అనేది కనిపిస్తూ ఉంటుంది. మనకే order of things లేదు. మనిషికొక్కడికే లేదు, మిగతా వాళ్ళందరికీ ఉన్నాయి. జంతువుకి, వృక్షానికి ప్రకృతే బుద్ధిగా పనిచేస్తూ ఉంటుంది. ఖనిజానికి కూడా ప్రకృతే బుద్ధిగా పనిచేస్తూ ఉంటుంది. మనలో కూడా ప్రకృతే బుద్ధిగా పని చేస్తుంది. చైతన్యం యొక్క అవతరణమే, బుద్ధి అంటే! బుద్ధి, దానియందు భగవంతుని యొక్క తత్వం కూడా మనయందు పరిపూర్ణంగా ఉండటంవల్ల, 'నువ్వే వాడుకుని చూడు ఎట్లా ఉంటుందో' అని ఇచ్చారు. అది వాడుకోవటంలో మనకి తేడా ఏర్పడి, క్రమాన్ని దెబ్బతీసుకుంటూ ఉంటాం. "క్రమమే భగవంతుడు" అని గుర్తు ఉండాలి. ఏ పని చేసినా ఒక పద్ధతిగా చేయటం, ఏ పని చేసినా ఆ క్రమాన్ని తప్పకుండా చేయటం. దీన్ని ఒక పెద్ద శిక్షణగా ఇస్తారు. భగవంతుడు క్రమమునకు పరాకాష్ఠ. ఆయన్ని మించి క్రమము ఏం లేదు. అంత క్రమంగా ఉంటుంది చేసే ప్రతి పనికూడా. మనం క్రమం తప్పినప్పుడల్లా, మనని క్రమంలో పెట్టడానికి భగవంతుడు సన్నివేశాలు ఏర్పాటు చేస్తాడు. మనకే సన్నివేశాలు వస్తూ ఉంటాయి. అంటే మనకి Boomerang అనేది ఒకటి ఉంటుంది. మనం విసిరితే అది మళ్లీ తిరిగి మన దగ్గరకి వస్తుంది. అట్లాగే మనం చేసిన క్రమము లేని పని అంతా కూడా తిరిగి తిరిగి తిరిగి మళ్లీ మన దగ్గరకి వస్తుందన్నమాట. అదీ కర్మ అంటే! ఈ రావటం వచ్చినప్పుడు, ఏలినాటి శని వచ్చేసిందండీ అంటాం. శని, మనం ఇదివరకు చేసిన పనులన్నీ పట్టుకొస్తూ ఉంటాడు మనదగ్గరకి. అంతకుమించి ఏం లేదు. So క్రమంగా మనం మంచివే చేసుకుంటూ వెళ్ళినప్పుడు, మంచి పట్టుకొస్తూ ఉంటాడు, చెడు చేసినప్పుడు చెడు పట్టుకొస్తూ ఉంటాడు, నువ్వు చేసినదాన్ని పట్టుకొస్తూ ఉంటాడు. నువ్వు ఎక్కడ క్రమాన్ని తప్పావో అవన్నీ పట్టుకొచ్చి, సవరణ చేయటానికి ప్రయత్నం చేస్తాడు. అది మనకి శనిగ్రహం చేసేది కానీ, ఒక గురువు సాన్నిధ్యం మనకి ఇచ్చే శిక్షణ కానీ, ఒక మహాత్ముని యొక్క సాన్నిధ్యం మనకు ఇచ్చే శిక్షణ కానీ, ఒక పుణ్యక్షేత్రం మనకి ఇచ్చే సన్నివేశం కానీ, ఒక పుణ్యపురుషుడు మనకి ఇచ్చే సన్నివేశం కానీ. కొంత మందికి పుణ్యక్షేత్రానికి వెళ్ళొస్తే, రాంగానే ఇబ్బందులొస్తాయి. కొంతమందికి, పుణ్యపురుషుని దర్శనం చేసి వస్తే ఇబ్బందులొస్తాయి. కొంతమందికి గట్టిగా పూజ చేస్తే ఇబ్బందులొస్తాయి. అంటే వాళ్ళని పిలిచినట్లవుతుంది. పిలిస్తే వాళ్ళు మనలో ఉండే order ని set చేయటానికి

ప్రయత్నం చేస్తూ ఉంటారు. Set చేస్తున్నప్పుడు మనకి, అది కొంచెం ఇబ్బందిగా అనిపిస్తూ ఉంటుంది. కానీ, ఇదంతా మన మంచి కోరే జరుగుతున్నది అన్న భావన ఉన్న వాళ్ళకి దాన్ని భరించే శక్తి క్రమశః అబ్బుతుంది. అబ్బి, దాన్ని భరించటం అనేది ఏర్పడి, అందులోంచి మనం ఉత్తీర్ణులై , ఎక్కువ చైతన్యవంతులమై, బయటపడటానికి వీలుపడుతుంది. మనకి క్రమము సహజంగా ఉన్నది, దాన్ని మనం స్వభావంచేత తప్పిస్తూ ఉంటాం . ఆ స్వభావంచేత తప్పించిన క్రమాన్ని మళ్లీ క్రమముగా తయారు చేయటానికి, మనకొచ్చే సన్నివేశాలని "విక్రమి" అన్నారు. "విక్రమః క్రమః". విక్రమము అంటే 'peculiar arrangement of things to set us into order.' భగవంతుడు ఒక్కొక్కడిని సవరించాలంటే, సర్దాలంటే, ఒక్కొక్కళ్ళ మీద ఒక్కొక్క technique వాడుతుంటాడట. ఎట్లా చేస్తే వీడు దారిలోకి వస్తాడో దానికి తగ్గట్టు సన్నివేశాలు వస్తాయి. అందుకనే కొంతమంది మహాత్ముల జీవితాలు తీసుకుంటే విపరీతము, విపత్కరము అయిన సన్నివేశాలు కనిపిస్తూ ఉంటాయి. ఈ సన్నివేశం వచ్చినప్పుడు, 'ఏమిటోనండీ మంచివాళ్ళకే కష్టాలు,' అన్నట్టుగా మనం మాట్లాడుకోమూ? మంచివాళ్ళకే అన్ని కష్టాలూ వస్తూ ఉంటాయి, మంచి వాళ్ళకి కష్టాలు అనే point కాదు. 'ఈ కష్టంలోంచి భగవంతుడు ఏదో నేర్పటానికి ప్రయత్నం చేస్తున్నాడు,' అని భావన చేసుకోవాలి. కష్టాన్ని అధిగమించాలంటే బుద్ధిని పెంచుకోవాలి. బుద్ధిబలం పెరగాలంటే మేధావీ తత్వంలోకి ఎగబాకాలి. వీడు ఆ తత్వంలోకి ఎగబాకటానికి అన్నిపక్కలా తలుపులు వేసేసి, ఒకే తలుపు తెరిచి ఉంచి, ఆ సన్నివేశంలోంచి, ఆ తలుపులోంచి అతను బయటికి వెళ్లేట్టుగా కొంత ప్రయత్నం జరుగుతుంది. ఈ dimension మీరు భగవంతుని భక్తులయొక్క జీవితాల్లో బాగా గుర్తించవచ్చు. వాళ్ళకి ఉత్తిపుణ్యానికి కష్టాలొస్తూ ఉంటాయి. పోనీ ఎవడో రాక్షసుడొచ్చి కష్టంపెట్టాడంటే సరే! కాదుట, ఋషులు కూడా వచ్చి కష్టాలుపెడుతూ ఉంటారు. ఒక దుర్వాసుడులాంటి వాడో, ఒక విశ్వామిత్రుడులాంటి వాడో వచ్చి, ఇటువంటివి చేస్తూ ఉంటారు. ఎందుకు చేస్తూ ఉంటారంటే, ఆ భక్తుడ్ని లేదా ఆ సాధకుడ్ని ఇంకొంచెం ఉద్ధరించడానికి! ఎప్పుడూ కూడా మనిషి తను సాధించటానికి ఏమీలేని స్థితిలో ఉన్నప్పుడు, లక్ష్యం అనేది లేనప్పుడు పెరగటానికి అవకాశం ఉండదు. లక్ష్యం ఉంటే దాని కోసం ఎగబాకటం ఉంటుంది. బాగా settled గా ఉన్నాడనుకోండీ, improvement కి scope ఉండదు. అందుకని ఎప్పుడూ పరిపూర్ణత ఎడల పనిచేసుకుంటూ వృద్ధి

పొందాలంటే  హాయిగా, సుఖంగా ఉన్నాడనుకునే సమయంలో ఒకటి పట్టుకొస్తారు. పట్టుకొస్తే మళ్ళీ సాధన మొదలవుతుంది. ధర్మరాజు జీవితం తీసుకున్నా మనకి అదే కనిపిస్తుంది. రాముని జీవితం తీసుకున్నా అదే కనిపిస్తుంది. హరిశ్చంద్రుని జీవితం కూడా. అన్ని కథల్లోనూ తనకి మించిన సన్నివేశాన్ని తనయందు ఉంచి, దాన్ని అధిగమించడానికి,  చైతన్యవంతుడుగా పెరగటానికి సన్నివేశాలు వస్తూ ఉంటాయి. ఇది విక్రమ అనే పదానికి అర్థం. అంటే, peculiar arrangement of or peculiar sequence of events. అవి వస్తూ ఉంటాయి. మన మాస్టరుగారి  జీవితం తీసుకుంటే,  పరమగురువుల యొక్క దర్శనం జరిగిన తరువాత చాలా ఆనంద, ఉత్సాహ అతిశయంతో వారు కార్యక్రమాలు నిర్వర్తిస్తూ ఉండగా, ఆయనకి పుట్టిన ఒక బిడ్డకి, మూర్ఛ జబ్బు రావటం మొదలుపెట్టింది. మూర్ఛ జబ్బువస్తే, దాన్నించి పిల్లవాడిని రక్షించుకోవటానికి, రకరకములైన ప్రయత్నాలు చేసారు మాస్టరు గారు. వాళ్ళ చుట్టూ తిరిగి, వీళ్ళ చుట్టూ తిరిగి, అక్కడ తిరిగి, ఇక్కడ తిరిగి, ఎక్కడ తిరిగినా పరిష్కారం రాకపోతే తనే సొంతగా హోమియో వైద్యం చదువుకుని, తన కుమారుని మీద తనే మందులు వేసుకుంటూ, ప్రాణాపాయ స్థితిలో కూడా తనయందు భగవంతుడిచ్చిన మేధస్సుని ఆధారంగా చేసుకుని, అతని మీద మందులు వేసుకుంటూ, అతన్ని బతికించుకోవటంలో మాస్టరుగారు మహత్తరమైన హోమియో వైద్యులయ్యారు. మామూలుగా హోమియో వైద్యులు అవుతామని మనం hobby గా నేర్చుకున్నాం అనుకోండి, హోమియో వైద్యం అంత లోతుల్లో రాదు. లోతుల్లో ఎప్పుడొస్తుంది? ఇటువంటి సన్నివేశం ఒకటి కలిగించినప్పుడు, దాని కొరకు మనం చేసే సాధనలోంచి లోతుల్లోకి వెళ్ళటం అనేది జరుగుతుంది. అందుకని మనిషికి లోతులెప్పుడొస్తాయంటే, ఒక కష్టం వచ్చినప్పుడు వస్తాయి. మనకి ఏది కష్టం అనిపిస్తుంది? మనకి మించిన సన్నివేశం మనకి కష్టంగా ఉంటుంది. భక్తుని జీవితంలో ఈ మించిన సన్నివేశాలు విచిత్రంగా ప్రవేశపెట్టి, దానివలన ఇంకొంచెం లోతైన మనిషినిగా తయారు చేస్తూ, వానియందు నిద్రాణమైన కొన్ని శక్తుల్ని వెలికి తీయటానికి ప్రయత్నం చేసే ఒక తత్వం భగవంతుని యందు ఉందిట. దానికి 'విక్రమః' అనే పేరు. దేవతలు పరీక్షలు పెడుతున్నట్టుగా కథల్లో వస్తూ ఉంటుంది. ఉట్టి పుణ్యానికి మంచివాడికి కూడా ఏవో పరీక్షలు పెడుతూ ఉంటారు. హరిశ్చంద్రుడు రాజ్యం చేసుకుంటూ ఉంటే, ఇంద్ర సభలో సరదాగా కూర్చున్నవాళ్లు,

ఇప్పుడు భూమి మీద ఉన్న వాళ్ళలో ఎవరు best అని అడగటం, అడిగితే ఫలానా హరిశ్చంద్రుడు అని చెప్పటం, అవునో కాదో చూద్దాం అని వాళ్ళు అనుకోవటం. అంతే! ఇక ఈయనకి మొదలై పోతుంది. అట్లాగే హనుమంతుడు సముద్రం మీద ఎగిరి వెళ్తూ ఉంటే దేవతలు చూసి సరదాగా పరీక్ష పెడదామని, ఓ మైనాకుడిని పైకి లేపి, లేకపోతే ఇంకొక సురస అనే నాగకన్యను అడ్డం పంపించి ఇట్లా చేస్తూంటారు. ఎందుకంటే అధిగమిస్తాడా, లోబడిపోతాడా? తెలుసుకోడానికి. మానవమాత్రుడుగా చూసుకున్నట్లయితే లక్ష్మణుని మూర్ఛ రామునికి చాలా విపత్కరమైన సన్నివేశం. రాముడు సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకుపోయినప్పుడు పడిన బాధకన్నా, లక్ష్మణుని యొక్క మరణం ఎక్కువ బాధపెడుతుంది. ఆ సన్నివేశంలో రాముడు బాధపడుతూ బుద్ధి బలాన్ని వినియోగిస్తాడు. అలాగే వసుదేవుడు. అప్పుడే పెళ్లి చేసుకున్న తన భార్యను సంహరించటానికి బావమరిది ready అయిపోతుంటే, ఆ సన్నివేశంలో ఏ విధంగా ప్రవర్తించాడో మనకి తెలిసినదే! ఇవన్నీ విచిత్రమైన సన్నివేశాలు. అవి వచ్చినప్పుడు మనం ఏ విధంగా వాటియందు ప్రవర్తిస్తాం అనేచోటే ఒక విధమైన ఉద్ధరింపు ఉంటుంది. అది మనకి ' విక్రమ ' అన్న పదంలో వస్తుంది. 'విక్రమి' అంటే భగవంతుని యొక్క పరాక్రమము, అది మనయందు ఎట్లా పనిచేస్తుంది? స్థిరత్వం కింద, స్థిరప్రజ్ఞత్వం కింద, పనిచేస్తుంది. ఇది క్రమము, విక్రమము. 'వి ' అన్న పదానికి opposite అనే meaning కూడా ఉంది, సంస్కృతంలో. అంటే, opposite of order అన్నమాట. Order ని మారుస్తారు. తారుమారు చేస్తారు. తారుమారు జరిగినప్పుడు తలకిందులైపోకుండా, నిలబడటానికి. 'భూమి తలకిందులైనా, వారి తలలు క్రిందు కావు' అని, ఒక వాక్యం మంద్రజాలం పుస్తకంలో మాస్టరుగారు రాస్తారు. శ్వేత ద్వీపం అనేది ఈ భూమి మీద ఉంది. 'The Great White Lodge' అంటారు. దాని Headquarters 'Sirius' అనే ఒక మహత్తరమైన సూర్యమండలంలో ఉన్నది. దాన్నే మనం 'దత్తాత్రేయ మండలం' అంటాం. ఈ శ్వేత ద్వీపంలో ఉండే మహాత్ములకుటా, ఈ భూమి తలక్రిందులైనా వాళ్ళ తలలు క్రిందులు కావుట. ఎందుచేతనంటే, పరిస్థితి ఎంత విపత్కరమైనప్పటికీ కూడా వాళ్ళు చలించకుండా, ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో అది చేస్తారు. కర్తవ్యనిర్వహణమే తప్ప కంగారుపడటం ఉండదు. అలా మనం కూడా ఉండాలనే కదా మనం అనుకుంటూ ఉంటాం. దానికి సంబంధించి కొంచెం అట్లా

అట్లా కదిలిస్తూ ఉంటాడట. సన్నివేశం రాంగానే కంగారుపడటం కన్నా, సన్నివేశం రాంగానే మనయందు ఉన్న భగవంతుని సంప్రదించటం, మనచుట్టూ ఉండేవాళ్లలో భగవత్ సాన్నిధ్యం ఉన్న వాళ్ళని సంప్రదించటం, పుణ్యక్షేత్రములు దర్శించటం, పుణ్యపురుషులని దర్శించటం ఎక్కువ చేస్తూ ఉంటే  అక్కడ నించి hints బాగా వస్తాయి. కూర్చుని ఏడుస్తుంటే ఏమీ రావు. ధర్మరాజు అంతటివాడు సమస్త భూమండలానికి చక్రవర్తి అయ్యి ఒక్కరోజులో మళ్లీ బికారి అయిపోతాడు కదా! బికారి అయిపోయి అరణ్యంలో చాలా సంక్షోభం చెందుతూ ఉంటే అప్పుడు బ్రాహ్మణులు సలహా ఇస్తారు. 'ఇలా కూర్చుంటే ఆ రోజు ఆడిన జూదం, అక్కడ జరిగిన అవమానం, ఈ పోయిన సంపద, ఎప్పుడూ అదే గుర్తొస్తుంది. అందుకని ఈ సంక్షోభం నించి బయటపడాలంటే నువ్వు పుణ్యక్షేత్ర దర్శనం చేయాలి' అని చెప్తారు. అట్లా సంక్షోభం కలిగినప్పుడు, కూర్చుని ఏడవటం, లేకపోతే భగవంతుని తిట్టటం కాకుండా ఎక్కువ భగవంతుని మేధస్సులోకి ఎగబాకటానికి ప్రయత్నం చేసినట్లయితే, ఈ ఇవ్వబడిన సన్నివేశంలోంచి ఒక కొత్త మంచి మనకి వస్తుంది. వైభవం ఆపద తీసుకు వచ్చినట్లే, ఆపద మళ్లీ వైభవాన్ని తీసుకొస్తూ ఉంటుంది.

## 86. అనుత్తమః

ఒక వైభవం నించి ఆపదలోకి వెళ్లి, మళ్లీ వైభవంలోకి వస్తే , ఇదివరకటి వైభవం కన్నా ఇది ఎక్కువ బావుంటుంది. అది, "అనుత్తమ" అనే పదానికి అర్థం. ఉత్తమము అనేది మనకి తెలుసు కదా! ఉత్తముడు భగవంతుడు. అనుత్తమము అంటే, ప్రతివిషయంలో కూడా అంతకన్నా బావుండేదొకటి ఉంటుందంటారు. "అను" అంటే తీగలాంటిదట. అనూరాధ అంటారు కదా! అది అట్లా అల్లుకుంటూ అల్లుకుంటూ, పైకి వెళ్తూనే ఉంటుంది కదా! తీగ ఒక్కొక్కసారి ఒక round తిరిగినప్పుడు, ముందు round కన్నా తరువాత round లో ఇంకొంచెం పైకి వెళ్లి ఉంటుంది. అక్కడనించి ఇంకొంచెం పైకి వెళ్తూ ఉంటుంది. అక్కడనించి ప్రతి round లోనూ it covers some more. సృష్టిలో కూడా ప్రతి విషయంలో కూడా ఒకదానిని మించి బాగుండే పద్ధతిలో అమరిక చేయబడి ఉన్నదిట. లోకములన్నీ అట్లా అమరిక చేయబడి ఉన్నాయి. భూర్భువః సువః, మహః జనః , తపః, సత్యలోకాలున్నాయి, కదా! ఈ లోకాలన్నీ ఒక దాన్ని మించి ఒకటి, ఒక దాన్ని మించి ఒకటి, అట్లా arrangement చేసి ఉన్నాయట. అట్లాగే గుణములలో కూడా ఒక్కొక్కళ్ళలో కనిపించే గుణాల్లో, ఇక ఇదే పరాకాష్ఠ అనటానికి ఏం లేదుట. అంతకన్నా అని ఇంకోడుంటాడు. అంతకన్నా ఇంకోడు, అంతకన్నా, అందరికన్నా అనే చోట భగవంతుడు ఉంటాడన్నమాట! ఏ concept అయినా సరే, ఇంకా betterment అనేది మనం చూసుకుంటూ వెళ్తే, దానియొక్క culmination భగవంతుని యందు ఉంటుంది. ఎందుకంటే భగవంతుడు అని మనం చెప్పుకునే తత్త్వము పరిపూర్ణమైన తత్త్వం కాబట్టి. So in everything HE is the ultimate best. అక్కడనించి gradations ఉంటాయి. ఈ ultimate best కి, మనకి మధ్యలో gradations ఉంటాయి తప్ప, ఇక్కడనుంచి ఇంక అదే అని ఏం ఉండదు. మెట్లుంటాయి. దాన్నే సువర్ణ సోపానములు అన్నారు. సోపానములుగా ఉంటాయి. నువ్వు ఒక మెట్టు ఎక్కంగానే ఇంక అయిపోయిందని ఉండదు. దానికి పైమెట్టు ఉంటుంది. దానికి పైమెట్టు ఉంటుంది. దానికి పైమెట్టు ఉంటుంది, దానికి పైమెట్టు ఉంటుంది, దానికి పై మెట్టు. ఒకళ్ళడిగారు జ్వాలకూల్ మహర్షిని, 'ఇప్పుడు మీరేమిటి సార్, మీ పరిస్థితి' అని. ఏం తోచకపోతే అడిగే question ఇవి.

ఆయనకీ వేరే కర్తవ్యాలు లేనప్పుడు సరదాగా శిష్యునియందు వాత్సల్యం కలిగి ఉన్న సమయంలో చెప్తారు. లేకపోతే చెప్పరు. మా తమ్ముడికి, వడదెబ్బ కొట్టి పడుకుంటే, మాస్టరుగారు పక్కన కూర్చుని, మందులేస్తుంటే, మాస్టరుగారిని అడిగాడట 'సమర్పణ అంటే ఏమిటి మాస్టారు' అని. అంటే, మాస్టారు 'ముందు వడదెబ్బ తగ్గనీ, తరువాత సమర్పణ సంగతి చూద్దాం' అని అన్నారు. అట్లాగే జ్వాలకూల్ మహర్షిని ఒకళ్ళడిగారుట. ఎందుకంటే అది ఆ శిష్యుడికి most ideal. ఇక అంతకుమించి అతనికి ఏమీ భావన లేదు. అడిగితే అప్పుడు జ్వాలకూల్ మహర్షి చెప్తున్నారు. 'ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో ఈ పంచభూతాలన్నీ కూడా నేను చెప్పినట్టు వింటాయి. నేను చెప్పినట్టు గాలి వింటుంది, నేను చెప్పినట్టు అగ్ని వింటుంది, నేను చెప్పినట్టు నీరు వింటుంది, నేను చెప్పినట్టు భూమి వింటుంది, నేను చెప్పినట్టు ఆకాశం పలుకుతుంది. అది నా పరిస్థితి.' అని. చెప్తే అప్పుడు శిష్యుడంటాడు, 'ఇక ఇది ultimate కదా , ఇంతకన్నా కావలసినదేంముంది' అంటే, 'కాదన్నారు.' కాదంటే, 'కాదేమిటి సార్' అంటే, 'నీకు గురువుని తప్ప, నేను కూడా శిష్యుడినే' అని. 'ఎవరికి మీరు శిష్యుడు' అంటే 'నా గురువుగారు దేవాపి మహర్షికి' అన్నారు. 'మరి ఆయన?' అంటే, 'ఆయన పంచభూతాలను నియమించడమనేదే కాకుండా, ఈ సూర్యమండలంలో ఉండే మిగతా గ్రహముల సహకారము కూడా ఆయన పొందగలిగిన స్థితిలో ఉన్న మహాత్ములు' అని చెప్పారు. 'అయితే ఆయన అన్నమాట' అన్నాడు. 'లేదు ఆయన కూడా శిష్యుడే' అని. 'ఎవరికి శిష్యుడు?' అంటే 'మైత్రేయుడికి శిష్యుడు.' 'అయితే మైత్రేయుడు highest' అంటే, 'మైత్రేయుడు కూడా highest కాదు' అంటారు. 'ఎవరన్నాడు.' 'మైత్రేయుడికి కూడా ఆయన గురువుగారు ఉన్నారు. ఈ భూమికే ఆయన గురువు. మనదొక చిన్న సూర్య మండలం. ఆ సూర్య మండలానికి ఒక గురువు ఉన్నాడు. ఇన్ని సూర్య మండలాలు కలిపితే అయిదు సూర్య మండలాలకి ఒక గురువు ఉన్నాడు, ఈ అయిదు సూర్య మండలాలు, ఇంకొక ఏడు సూర్య మండలాలకీ చెల్లెళ్ళలాంటివి. కాబట్టి పన్నెండు సూర్య మండలాలకు ఒక గురువున్నాడు. పన్నెండు సూర్యమండలాలకు గుంపులుగుంపులుగా గురువులందరూ కలిపి ఒక చోట కేంద్రం ఉంది. ఆ కేంద్రంలో గురువున్నాడు. ఇట్లా గురువులు ఉంటూనే ఉంటారయ్యా' అని చెప్పారు. అంటే, దీనికి అంతేమిటి? అంతు పరబ్రహ్మ తత్త్వమునందు మనము నిబిడీకృతమయ్యేంత వరకు 'అంతు' అనే సమస్యే లేదు. అట్లా మెట్లెక్కుతూ

ఉండటమే! పైమెట్టెక్కినప్పుడు, కింద మెట్టు వాడి సంగతి చూసుకుంటే, ఇంకో మెట్టు పైకి ఎక్కుతాంట. మనం పైకి ఎక్కేద్దాం అనుకుంటూ పైకి ఎక్కుతూ ఉంటే, ఆ మెట్టు మీదే ఉంటాము. మనం కాలు వేయగానే మెట్టు కూడా పైకి లేస్తూ ఉంటుంది. మెట్టు ఎప్పుడు మనం ఎక్కుతామంటే, కింద మెట్టు వాడి సంగతి ఆలోచించి వాడిని పైమెట్టు, మనమెట్టు మీదకి తెచ్చేసరికి మనం తెలియకుండానే అప్రయత్నంగానే ఇంకో మెట్టు మీద ఉంటాంట. అది జ్వాలకూల్ మహర్షి చెప్పిన ఒక రహస్యం. అంటే మనకన్నా తక్కువ వాళ్ళ సంగతి మనం చూసుకున్నప్పుడు, మనకన్నా ఎక్కువగా ఉండేవాళ్ళు (మనం వాళ్ళకి తక్కువ వాళ్ళం కదా.) మన సంగతి చూసుకుంటారు. నువ్వు పై మెట్టెక్కుదాం కింద వాడిని కింద కొదిలేసి అంటే, పైవాడు కూడా నిన్ను వదిలేస్తాడు. అందుకని ఒక సులభమైన మార్గం పరమగురువులిచ్చారు. ఏమని? దీనులకు, దళితులకు, నిస్సహాయులకు చేసే సేవ నించి పొందే సిద్ధి, ఎన్ని రకాలైన క్రతువులు, వ్రతములు, చేసినా కూడా దక్కదు అని. చేస్తూ ఉంటే ఏమవుతుంది ఒక్కొక్క మెట్టు, ఒక్కొక్క మెట్టు, ఒక్కొక్క మెట్టు ఎక్కి వెళ్తూ ఉంటావు. వెళ్తూ ఉంటే దీనికి అయిపోవటం అంటూ ఉండదు. అదీ 'అనుత్తమము' అంటే! మనమెరిగిన సూర్యుడు అంతకన్నా పై system కి పుత్ర సమానుడు. అక్కడుండే సూర్యుడికన్నా ముందున్న వాళ్ళున్నారు. ఎప్పట్నుంచో, మనకి ముత్తాత దగ్గరనించి ఉన్నారు. ముత్తాత, తాత, తండ్రి, మనము, అట్లా. మనకన్నా ముందున్నవాళ్ళు బోలెడుమంది ఉన్నారు. వాళ్ళ లాగా మనం తయారవుతూ ఉంటే, అట్లా వెళ్ళి వెళ్ళి ఎక్కడవరకు వెళ్తామయ్యా అంటే, ఆయన వరకు వెళ్ళి ఆగుతాం. దేంట్లో అయినా సరే. ఏ గుణం తీసుకున్నా, ఆయన దగ్గరకి వెళ్ళి ఆగవలసిందే. విష్ణు సహస్రనామం class చెప్పుకుంటున్నామనుకోండి ఈ పరిసరాలు మనం ఎంత పరిశుభ్రం చేసుకుంటూ ఉంటే, అంత మనకి వృద్ధి జరుగుతూ ఉంటుంది. ఇంట్లో కూడా అంతే! మనం ఈ class చెప్పుకుంటున్నాం కాబట్టి , ఈ class ని ఇంకా అందంగా ఎట్లా చేసుకోవచ్చు, ఇంకా అందంగా ఎట్లా చెప్పుకోవచ్చు. ఇక్కడుండే పరిసరాలు ఎట్లా చేసుకోవచ్చు ఇలా ఉండాలి. "A constant eye upon perfection" అన్నది Madam Blavatsky. Constant eye, నిరంతరంగా, continuous గా improve చేయటానికి ఎప్పుడూ ఒక ప్రయత్నం చూడాలి. అంతేగానీ, ఉన్నది పాడైపోయి, ఉన్నవి మాసిపోయి ఉండకూడదు. మనం వేసుకునే బట్టల దగ్గర్నించి, ప్రతివిషయంలోనూ ఏదైనా,

anything that we do we should do better than yesterday. వాడికీ వృద్ధి. అది మనకి సందేశం.

అనుత్తమం అంటె ఇదివరకటి కన్నా ఇంకా ఉత్తమంగా ఉన్నది. నిన్న పూజ చేశాం. నిన్నటికన్నా ఇవాళ పూజ ఇంకా ఎక్కువ కళగా, కళ వచ్చేట్టుగా చేయగలిగామా, ఏడుస్తూ చేశామా? ఏది చేసినా అంతకన్నా better గా చేయాలి. అప్పుడు వృద్ధి వస్తుంది. మనలో betterment ఉండబట్టే కదా చేసే పనుల్లో అది కనిపిస్తుంది. మనం చేసే పనుల్లో అశ్రద్ధ పెరుగుతూ ఉందనుకోండి. మనలో కూడా అశ్రద్ధ పెరుగుతున్నట్లు అర్థం. మనలో అశ్రద్ధ లేకపోతే చేసే పనిలోకి ఎట్లా వస్తుంది? మనలో లేని అశ్రద్ధ, మనం చేసే పనుల్లోకి రాదు కదా. అందుకని మనం సాధన చేయటానికి, మనని మనం బాగు చేసుకుంటూ భగవంతుని అనుగ్రహానికి పాత్రులవటానికి చేసే ప్రయత్నం తప్ప, ఇది పురాణ కాలక్షేపం కాదు. ఎందుకంటే పురాణ కాలక్షేపం ఎన్నిసార్లు విన్నా ఉపయోగం లేదు. ఈ ప్రవచనాల్లో ఉండే విషయాలు నేను, మీరు ఆచరణలోకి, ప్రవర్తనలోకి తీసుకొస్తే improvement రావటానికి అవకాశం ఉంది. ప్రవర్తనలోకి తీసుకు వచ్చినప్పుడు ఎన్ని అడ్డంకులు మనలో ఉన్నాయో మనకి తెలుస్తాయి. అందుకని let us work for improvement. ఇక్కడ మనం ప్రవచనంకి మీరొచ్చేటప్పటికి ఇదంతా ఎవరు తుడుస్తున్నారు? ప్రతి శనివారం ఎవరో ఒకళ్ళు తుడుస్తున్నారు కదా. వాళ్ళ గురించి ఎప్పుడన్నా మనం గుర్తించామా? మీరొచ్చేసరికి జంపాకానాలు ఎవరు వేస్తున్నారిక్కడ? జంపకానాలు వేయటంకన్నా తుడవటం కష్టం కదా! వాటికోసం పనిమనుషులని పెట్టుకొని చేయట్లేదు కదా. అట్లా పనిమనుషులని పెట్టుకొని చేస్తుంటే సాధన అవదు. కాబట్టి అవి చేస్తున్నవాళ్ళు సాధన చేస్తున్నట్టు. ఇక్కడ చేసుకునే arrangement లో మనం ఎంత participate చేస్తున్నాం అనే చోట, మనకి ఈ విష్ణు సహస్రనామము యొక్క గ్రహణములో భగవంతుని యొక్క అనుగ్రహం ఇమిడి ఉంటుంది. రాంగానే పుస్తకంలో సంతకం పెట్టేసి కూర్చుని, అయిపోంగానే వెళ్లిపోయే వాళ్ళు ఒక పద్ధతి. మర్చిపోయే వాళ్ళు తరువాత. వచ్చి కూర్చుని పుస్తకాల్లో రాసుకుని, పుస్తకాలు మళ్లీ తెరవని వాళ్ళు ఒక పద్ధతి. వచ్చి కూర్చుని పుస్తకాల్లో రాసుకుని, రాసుకున్నది మళ్లీ చూసుకునే వాళ్ళు ఇంకొంచెం better. అంతకన్నా better వాటిని ఆచరణలో పెట్టిన వాళ్ళు. ఇట్లా మనకి ఎక్కడికక్కడ betterment కి scope ఉంది. దీనికేమీ డబ్బుతో సంబంధమేం లేదు.

డబ్బు ఖర్చైపోతుందన్న point ఏం లేదు. It's an attitude which we have to develop. So ఈ development ఎక్కడ ఉంటుందంటే in our attitude towards perfection. అక్కడుంటుంది. అదేదో ఆయన పని, ఇదేదో ఇంకొకరి పని అని అనుకున్నామనుకోండి, ఉపయోగం లేదు. ఎవరికివారు అంటే, ఇప్పుడు మీరంతా ఇక్కడికొచ్చి పని చేయమని నేను చెప్పట్లేదు, చేయటం, చేయకపోవటం, అది మీకు సంబంధించింది. నాకు సంబంధించింది కాదు. చేసేది బాగా చేసుకోవటం అనేది మాత్రం మనకి జరగాలి. అది ఇక్కడా, ప్రతిచోట, ప్రతివిషయమునందు, ప్రతి సన్నివేశమునందు, అది ఎంత పెరుగుతూ వస్తే అంత మనకి త్వరగా simultaneous development వస్తుంది. వెంటనే development అనుకోబోకండి. ప్రవర్తించటం వల్లనే development వస్తుంది కాబట్టి, అట్లా ప్రవర్తిస్తూ వెళ్తూ ఉంటే కొంత దూరం తర్వాత మనం ఇట్నించి ఎంత వెళ్తూ ఉంటే అట్నించి అంతా వస్తూ ఉంటుంది. అనుగ్రహము, పురుషప్రయత్నం, రెండూ కూడా నువ్వు ఇక్కడ ఎంత కదిల్తే అట్నించి అంతా కదులుతారాయన (భగవంతుడు). మీరు నిర్లక్ష్యంగా ఉంటే ఆయనసలు కదలడు. మీరు శ్రద్ధ చూపించి ఒక అడుగు వేస్తే అట్నించి ఒక మెట్టు దిగి వస్తాడు. నువ్వు మూడు మెట్లెక్కి వెళ్ళేసరికి ఆయన మూడు మెట్లు దిగి వస్తారు. నువ్వు నాలుగో మెట్టు దగ్గర ఉండేసరికి ఆయన నాలుగో మెట్టుదగ్గరుంటారు. అది సత్యం. అదే బుద్ధిలోకం అంటారు. మనం బుద్ధిలోకి ఎగబాకేసరికి భగవంతుడు బుద్ధిలో దిగి వస్తాడు. అంతకుమించి కిందికి దిగిరాడు. అంతవరకు మనం పెరగాలి. మనం పెరగటం, ఆయన దిగిరావటం, రెండూ simultaneous తప్ప, they are not two different things. పురుష ప్రయత్నము, దైవానుగ్రహము, రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న విషయాలు తప్ప, పురుష ప్రయత్నం అంతా అయిన తరువాత భగవంతుని అనుగ్రహం, అలా కాదు. అది culmination. అంతా అయిపోయిందని, కనిపించాడు, వినిపించాడు, అనిపించాడు, ఆనందం పొందాననేది culmination. ఈ culmination కి ముందు నువ్వు ఎంత ఎక్కివెళ్తున్నావో ఆయనంత దిగి వస్తూ ఉంటాడు. అందుకని మనం ఎక్కి వెళ్ళటం అనేది ప్రవర్తన బట్టి ఉంటుంది తప్ప, కేవలం ప్రవచనాలబట్టి ఉండదు. ఇది మీకు నేను చెప్పినా, ఇందులో ఒక percent ఆచరిస్తే చాలా గొప్ప, నేనైనాను. కానీ మనకి పెద్దలిచ్చిన విషయాలు మనని మనం గుర్తు తెచ్చుకోవడానికి ఇక్కడ

చేరుతున్నాం. గుర్తుతెచ్చుకుని మళ్లీ రేపట్నించి fresh గా కొత్త week startచేద్దాం. కొత్తవారం ఎల్లుండినించి కాదు రేపట్నుంచి మొదలు. శనివారం సాయంత్రం class ఎందుకు పెట్టుకుంటామంటే, ఈ వారాంతానికి ఒక స్ఫూర్తి తెచ్చుకుంటే, రేప్పొద్దున ఆ స్ఫూర్తితో మనం లేవచ్చని. అందుకని పనులు ఆదివారం నించి మొదలు పెట్టుకోవాలి. ఆదివారం నించి మొదలు పెట్టుకుని శనివారానికి పూర్తి చేసుకుంటూ ఉండాలి. ఇప్పుడు మనం తీసుకున్న స్ఫూర్తి, రేపు మర్చిపోకుండా ఉంటే బావుంటుంది., రేపు Sunday కదా, enjoy చేయాలి కదా అని మర్చిపోయామనుకోండి, సోమవారం వచ్చినా గుర్తురావు. మళ్లీ పుస్తకం తీద్దామని కూడా అనిపించదు. కాబట్టి

We should better ourselves from day to day
We should better ourselves from week to week
We should better ourselves from month to month
We should better ourselves from year to year.

అట్లా betterment తీసుకొచ్చుకుంటూ ఉండాలి. అంతే కానీ 'నేనిట్లాగే ఉంటాను, ఆయన అంతా చూసుకుంటాడు' అనేది మెట్టవేదాంతం అవుతుంది. ఆయన కూడా 'అట్లాగే ఉంటాను, అన్నీ నువ్వు చూసుకో' అంటాడు. 'భగవంతుడే అన్నీ చూసుకుంటాడు కదండీ', అని తింటానికి dining table దగ్గరకి నువ్వే వెళ్తున్నావు కదా! భగవంతుడే చూసుకుంటాడు, అవి నీ దగ్గరకే వస్తాయని కూర్చోవే? 'అది సత్యమే' అని నిజంగా నీ యందు భాసించినప్పుడు, అక్కడే కూర్చోవాలి. పొద్దున్నే toothpaste, tooth brush నీ దగ్గరకి రావాలి. కాఫీ కప్పు నీ దగ్గరకి రావాలి. Breakfast నీ దగ్గరకి రావాలి. Lunch నీ దగ్గరకి రావాలి. వాటికి మాత్రం వెళ్తావు, మిగతావన్నీ కూడా వాడు చూసుకోవాలిట. కాఫీ కప్పు దగ్గరకి నువ్వు వెళ్ళినప్పుడు, భోజనం table దగ్గరకి నువ్వెళ్ళినప్పుడు, నీలో నిన్ను నడిపించేది వాడే. ఆయనే చూసుకున్నాడు. కానీ, మనమేం చేస్తున్నామంటే, మనకి సోమరితనం బలిసి, అంతా మాస్టరుగారు చూసుకుంటారు మనదేముంది అనుకుంటాం. అట్లా జరగదు. మాస్టరుగారికిట్లా జరగలేదు. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని చెప్పి శ్రీకృష్ణుడు చెప్పాడు. సమస్తం ఆయనకి సమర్పణ చేసుకుంటే అన్నీ ఆయనే చూసుకుంటాడు. అర్జునుడదే చేశాడు. అక్కడినించి అర్జునుడు ఎట్లా చేయాలో చెప్పి, చేయించాడు, కృష్ణుడు. భగవద్గీత అయిన

తరువాత యుద్ధమంతా కూడా కృష్ణుడు చేసి పెట్టలేదు కదా! అర్జునుడు, కృష్ణుడికి సమర్పణ చెందాడు. పద్దెనిమిది అధ్యాయాల తరువాత, 'సరే ఈయన చెప్పినట్టు విందాం, ఎందుకొచ్చిన గొడవ? మనకేం తెలియట్లేదు, confusing గా ఉంది, ఈయన ఎట్లా చెప్తే అట్లా చేద్దాం అనుకుంటాడు'. ఆయన చెప్పాడు అంటే, మనకీ కృష్ణుడు చెప్పాడు. అంటే మన మేధస్సులో భాసించటమే కృష్ణుడు చెప్పటం. 'ఒక మంచిపని చేద్దాం' అని మనకి అనిపించిందనుకోండీ, ఇంక దాన్ని మొదలు పెట్టేయటమే. అట్లా చేయించి, చేయించి అన్ని పనులు ఆ పద్దెనిమిది రోజులు ఈయన చేతే చేయించాడా? 'నా కొదిలేయి, నేను చూసుకుంటా కదా నీ యోగం, క్షేమం' అని కృష్ణుడు అన్నాడు కదా! అంటే ఇక అక్కడ నించి ఇతడ్ని వెనకాల కూర్చోపెట్టి, ఆయన బాణం పట్టుకుని పోట్లాడాడా అందరితో? Message ఏమిటి మనకి? అంటే 'నీ బుద్ధి నా చేతిలో పెట్టు, నేను నడిపిస్తాను దాన్ని. నువ్వు నడుస్తూ ఉండు. నడక నీదే! నువ్వు నడవకపోతే నేనేం చేయలేను' అని అన్నాడని కదా అర్థం. భగవంతుడు అన్నీ చేస్తాడంటే, మన నుంచే చేస్తాడు. అదీ తమాషా! అందుకని మనం పడుకుంటే చేస్తాడనుకోవటం బాగా అజ్ఞానానికి పరాకాష్ఠ. మన భారతదేశంలో ఆ రకమైన వేదాంతం ఎక్కువై పోవడం వలనే మనమిలా అయిపోయాం. మనం బాగా చేస్తున్నామనుకోండి, మనమే చేస్తున్నామని విర్ర వీగుతాం. అది అహంకారం. ఇప్పుడు పాశ్చాత్య దేశాల్లో problem అది. మనం చేయకుండా దేవుడు చేస్తాడనుకుని బాధపడుతున్నాం. వాళ్ళు చేసేసి భగవంతుడేం చేస్తున్నాడు? నేను చేస్తున్నానుకోవటం వల్ల బాధపడుతున్నారు. సత్యమేమిటంటే, మనం చేస్తుంటే మనలోంచి చేయించేది భగవంతుడు. అది తెలిసిన వాడు ఋషి, లేక యోగి. అట్లాగే అర్జునుడు శరణువేడినప్పుడు, సమర్పణ చేసుకున్నప్పుడు, కృష్ణుడు అన్నీ అర్జునుడి చేతే చేయించాడు తప్ప, ఎక్కడా ఈయన చేసిందేముండదు. సలహా మాత్రం ఇస్తాడు. అదీ శ్రీకృష్ణుడి తత్త్వం. మనకది ప్రతినిత్యం దేహంలో జరిగే ఒక కార్యము, ఒక కర్మ. ఒక దివ్యమైన కర్మ. మనకి ఒక మంచి ఆలోచనగా వస్తాడు. మనకి ఎప్పుడు మంచి ఆలోచన వచ్చినా, గుర్తుపెట్టుకోండి, అది భగవంతుడు మనకిచ్చిన సలహా. 'ఇప్పుడు కొట్టేసెయ్ వాడిని', అని కృష్ణుడు చెప్పాడు. 'ఇప్పుడిట్లా చెయ్, అప్పుడట్లా చెయ్' అని చెప్పాడు యుద్ధంలో కృష్ణుడు అర్జునుడికి, కదా! మన యుద్ధంలో కూడా మనకొచ్చే ప్రతి మంచి ఆలోచన కూడా భగవంతుడిచ్చినదే కాబట్టి వెంటనే దాన్ని చేయటానికి

ప్రయత్నం చేయాలి. మనం ముఖ్య అతిథిని అడుగుతుంటామే సందేశం, అట్లా రావణాసురుడు వెళ్లిపోతుంటే 'చాలా అనుభవం ఉంది నీకు జీవితం మీద, నీ message ఏమిటి' అని అడిగితే, ' నీకు మంచి అని అనిపించిన ఆలోచన వెంటనే put it into action. నీకు చెడు అనిపించింది postpone it' అన్నాడు. కనీసం ఇరవైనాలుగు గంటలు postpone చేయమన్నారు. Postpone చేస్తే, నెమ్మదిగా వివేకం prevail అయి నీ చేత చేయనివ్వదు. మంచికి time gap ఇచ్చామంటే నీ స్వభావం దాని మీదకి దూకేసి దాన్ని మూత పెట్టేస్తుంది. ఆయనకి కూడా చాలా సార్లు అంతరంగంలో అనిపించిందిట, 'ఈ సీతాదేవిని తీసుకెళ్ళి ఆ రాముడికి ఇచ్చేస్తే బావుంటుందేమో' అని. ఎందుకంటే మరి జనస్థానంలో అంతమందిని అట్లా కొట్టేశాడు. ఎప్పుడూ జరగలేదు. ఏ మానవుడూ అట్లా చేయలేదు. మారీచుడు చెప్పినప్పుడు, చాలా ఆశ్చర్యపోతాడు రావణాసురుడు. మారీచుడు మాయలేడిగా రాకముందు రావణాసురుడికి చాలా ఉపదేశం ఇస్తాడు. 'వద్దయ్యా బాబూ, ఆయనతో పెట్టుకోబోక, ఆయన భగవంతుడు, దిగివచ్చాడు, నువ్వు ఆయనతో పెట్టుకుంటే మూడుతుందీ' అని చెప్తాడు. ఒక పక్క బంగారులేడిగా మారీచుడు మారి ఆ ఆశ్రమ ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటే, సీతాదేవి నోటినుంచి వచ్చిన మాటలు, లక్ష్మణుడి నోటినుంచి వచ్చిన మాటలు, రాముని నోటినుండి వచ్చిన మాటలు అక్కడే ఉండి విన్న రావణాసురుడి గుండె గుభేల్ మంటూ ఉంటుంది ప్రతిక్షణం. ఆ వాక్యాలొకసారి ఇవాళ తెరిచి చదువుకోండి అరణ్యకాండలో. రావణుడికి భయమేస్తుంది. అంటే ఈవిడని ఎత్తుకెళ్తే వచ్చే consequences వాళ్ళ నోటినుండి అప్రయత్నంగా వచ్చేస్తాయి. సీతాదేవి నోటినుండి వచ్చేస్తాయి ముందే. 'నాకేదన్నా ఆపద చేద్దామనుకునేవాళ్ళ సంగతి ఏమవుతుందో' చెప్పేస్తుంది. 'రాముణ్ణి మోసం చేద్దామనుకునే వాడికి ఏమవుతుందో', లక్ష్మణుడు చెప్పేస్తూ ఉంటాడు. రావణాసురుడికి ఎట్లా ఉంటుందంటే వీళ్ళకసలు తెలుసేమో ఈ మొత్తం అంతా అనిపిస్తుంది. ఎవరికీ తెలియదు. తెలుసని వాడికనిపిస్తుంది. ( దొంగతనము చేసినవాడికి ఇద్దరు మాట్లాడుకుంటుంటే, వీడి గురించే మాట్లాడుకున్నట్టుంటుంది.) వాళ్లట్లా ఉద్దేశించి మాట్లాడరు. తెలిసుంటే మాయలేడి గురించి సీతాదేవి అడగనే అడగదు, రాముడు వెళ్ళనూ వెళ్ళడు. రాముడు వెళ్ళినా ఇన్ని మాటలని లక్ష్మణుని పంపించనూ పంపించదు సీతాదేవి. తెలియటం కాదది. మహాత్ములైన వాళ్ళ నోటి నుంచి వాక్యాలట్లా వస్తూ ఉంటాయి. అవి జరిగిపోతూ ఉంటాయి. అవతలవాడికది

warning అన్నమాట. భయపడతాడు. ఆ తరువాత హనుమంతుడు సముద్రలంఘనం చేయటమనేది చాలా అపూర్వమైన విషయం. అప్పుడు భయపడతాడు. లంకిణిని చంపడంతో మరీ భయపడతాడు. లంక చుట్టూ ఏర్పరచిన రక్ష అనే శక్తిని హనుమంతుడు ముందు ఛేదించాడు. అంటే ఏమిటీ, ఇంక లంకకి protection పోయింది. అది ఇంతవరకు ఎప్పుడూ జరగలేదు. ఇవన్నీ లోపల మరుగుతూ ఉంటాయి. విభీషణుడు అక్కడికి వెళ్ళిపోయాడు. వాడొక్కడే మంచివాడు ఉన్నవాళ్ళలో. ఇవన్నీ జరుగుతున్నప్పుడు అతనికి లోపల 'పొరపాటు, పొరపాటు' అని అనిపించి, ఎప్పటికప్పుడు conflict వస్తుంటుంది. పోనీ ఇచ్చేయకూడదా ఎందుకొచ్చిన గోల అని. ఇంకోపక్క అహంకారం వస్తూ ఉంటుంది. 'ఆ! ఎంత మందిని కొట్టలేదు, వీడు పెద్ద మగాడా' అనిపిస్తుంది. ఆయన రాముని యొక్క రూపాన్ని ఆలోచించినప్పుడు, చాలా సామాన్యంగా ఉంటుంది రూపం అనుకుంటాడు. ఆ! అన్నట్టుగా ఉంటుంది. రాముని సహచరుల వల్ల జరుగుతున్న కార్యములు చూస్తుంటే భయమేస్తుంది. ఆ సందిగ్ధంలో ఉండి చివరికి చెప్తాడు. 'మంచనిపించింది వెంటనే చేసెయ్, చెడు ఆలోచనలు వచ్చినప్పుడు కొంచెం ఆ file ని pending పెట్టు ' అని. ఎందుకిది చెప్తున్నానంటే, మనలోంచి ఉద్భవించే మంచి అంటే, అదంతా కూడా ఆయన నమ్మిన శివము. శివుడు కదా! ఆయన పంపించే ఆలోచనలు వినడు. చివరికి రావణాసురుడు గ్రహిస్తాడు. శివుడు కూడా రాముడి పక్కే ఉన్నాడు, అయినప్పటికీ, ఇంత దూరం వచ్చిన తరువాత మనం ఇప్పుడు లొంగిపోయినా ఏం బావుంటుందని, యుద్ధం చేసి చచ్చిపోతాడు. అట్లా ఆలోచనలు మంచివైనవి, చక్కగా ఆచరణలో పెట్టాలి. సమర్పణ చెందిన ఏ శిష్యుడికీ గురువు అంతా ధారపోసి ఇచ్చేసిందేముండదు. సమర్పణ అయిన దగ్గర నించి, నిజమైన సాధన మొదలవుతుంది. అంతకుముందు సాధన ఏముండదు. దూరంగా ఉంచుతారు. మర్యాదగా ఉంచుతారు. 'ఏం సార్' అని పలకరిస్తూ ఉంటాడు, గురువుగారు శిష్యుణ్ణి. ఎందుకంటే ఇంకా, శిక్షణకు ready కాదు కాబట్టి. సమర్పణ చెందిన దగ్గర నించి ఇట్లా చెయ్, అట్లా చెయ్ అని చెప్తారు. Instructions ఉంటాయి. Instructions పుచ్చుకుని అర్జునుడు మధ్యమధ్యలో ఎగ్గొడుతూ ఉంటాడు. ఎప్పుడు instruction ఎగ్గొట్టాడో అప్పుడల్లా అర్జునుడు దెబ్బతింటూ ఉంటాడు. అభిమన్యుడు చచ్చిపోవటానికి కారణం అర్జునుడే! ఇవన్నీ ఎందుకొస్తాయంటే, చెప్పింది చెప్పినట్టు వినకపోవటం వల్ల. సమర్పణ అనేది

అంత సులభమైన విషయం కాదు, సమర్పణ చెందిన వాళ్ళకి కూడా! సమర్పణ చెందటం అంటే ఏంటంటే 'తన బుద్ధిని భగవత్తత్త్వమునందు ప్రవేశింపచేయటం'. అంటే బుద్ధి భగవంతుడిదే అని గుర్తించటం వలన ప్రవేశం వస్తుంది. మనలో ఉండే బుద్ధి భగవంతుడిది, మనలో ఉంచాడని గుర్తుపెట్టుకోవాలి. అది మనదనుకుంటూ ఉంటాం. మనలో బుద్ధి భగవంతుడుంచినది అని గుర్తురాగానే, మనకి భగవంతుని బుద్ధిలోకి ప్రవేశం వస్తుంది. వచ్చినప్పుడు, అక్కడనించి వచ్చిన సంకల్పాన్ని ఆచరించుకుంటూ ఉండాలి. ఆచరించుకుంటూ ఉంటే మెట్లెక్కి వెళ్తూ ఉంటాం. ఎక్కి వెళ్లి, ఎక్కి వెళ్లి, చివరికి అందులో స్థిరపడతాం. అట్లా స్థిరపడిన వాళ్ళు ఋషులు. అట్లా స్థిరపడిన వాళ్ళు పరమగురువులు. సిద్ధి పొందిన వాళ్ళ కన్నా కూడా అట్లా సాధన చేసే వాళ్ళ యొక్క జీవిత చరిత్రలే మనకి ఎక్కువ ఇస్తారు. ఎందుకంటే మనకవి, ideal. అర్జునుడిని ఒక సాధకుడిగా చూడండి. ధర్మరాజుని ఒక సాధకుడిగా చూడండి. అర్జునుడు అన్నీ చచ్చినట్టు సంపాదించుకున్నాడు. పాశుపతాస్త్రం అట్లా తెచ్చి ఎవరూ ఇచ్చేయలేదు కదా! మాస్టరుగారిని కూడా నేను అడిగా, 'ఇన్ని విద్యలు మీకెట్లావచ్చినాయి, గురువనుగ్రహమా' అని. 'పురుష ప్రయత్నం లేనిదే దేంట్లోనూ గురువనుగ్రహం రాదు నాయనా' అని చెప్పారు. నీ ప్రయత్నం యందుండే శ్రద్ధ, భక్తి, నీకున్న ఓర్పు వలన నువ్వు నేర్చుకుంటున్న కొద్దీ నీకు సరియైన పద్ధతుల్లో విద్య అందుతూ ఉంటుంది. ఎందుకంటే లోపల ఉద్దేశము పవిత్రమైంది కాబట్టి. This effort is to improve, to perfect ourselves, on a daily basis in every walk of our life. It is the sure way to improve year after year. ఇంకో పద్ధతి లేదు. మనం ఎన్ని మంచి విషయాలు ఎన్ని సంవత్సరాలనించి postpone చేసుకుంటూ వస్తున్నాం? మనమంతా మన self-study చేసుకుంటే చాలా విషయాలు మంచివి, మనకి తట్టినవి, మనం చేద్దాం అనుకుంటున్నవి, మనం అట్లా పుట్టలు పుట్టలుగా files pending పెట్టి, postpone చేసుకుంటూ వస్తున్నవి, ప్రతివారియందూ ఉంటాయి. చేద్దామనుకుని చేయకుండా వదిలేసినవి అన్నీ ఎట్లాగూ చేయలేం కాబట్టి ఒక్కటి తీసుకుని ఒక్కొక్కటి, ఒక్కొక్కటి, చేస్తూ ఉంటే, we tend towards perfection. Tending towards perfection is the greatest virtue that brings all virtues into our fold or into our being and they will give their presence to us, by which we experience life better. అందుకని, అన్ని

గుణములయందు, అన్ని శక్తులయందు, ఉత్తమమైన వాడు భగవంతుడు. మనయందు అవన్నీ ఉన్నాయి. మననించి భగవంతుడు వరకు చేరటంలో, ఈ రకమైన సోపానములు ఉన్నాయి. ఈ సోపానాలు అట్లా, spiralic గా ఉంటాయి. తీగ అల్లికలాగా. ఒక లత ఎట్లా అల్లుకుంటుంది? అది ఒక round కొట్టేసరికి ఇంకోమెట్టు పైనుంటుంది. ఇంకో round కొట్టేసరికి ఇంకో మెట్టు పైనుంటుంది. ఆ పద్ధతుల్లో పైకి ఎక్కబాకటం అనే సాధన మనకి సంబంధించింది. భగవంతుని వరకు ఈ నామంలో ఉన్నదేంటయ్యా అంటే, అమరిక! మొత్తం సృష్టి అంతా ప్రతి విషయంలో కూడా అట్లా arrange చేశాడట. ఖనిజాలన్నిటికీ ఒక అమరిక ఉన్నది. అది చివరికి బంగారమవుతూ ఉంటుంది. అట్లాగే జంతువుల్లో కూడా ఒక అమరిక ఉన్నది. చివరికి ఒక గోవు అవుతుంది. జాతి ఒకటిగా కనిపించినప్పటికీ గాడిదకి, గుర్రానికి చాలా difference ఉంది. పిల్లికి, పులికి difference ఉంది. ఈ మధ్య gradations అన్నీ కూడా ఉంటాయి. అట్లా మొత్తం సృష్టి పరిణామం లో gradations వచ్చి మానవ శరీరం దొరకటం అనేది, among forms, it is considered to be the best. అందుకని భగవంతుడు అది ఎన్నుకుంటూ ఉంటాడట ఎక్కువగా. ఉన్న రూపాలన్నిట్లో కూడా భగవంతునికి మిక్కిలి ప్రియము అయిన రూపము మానవ రూపము, అని శ్రీ కృష్ణుడు ఉద్ధవగీతలో చెప్తాడు ఉద్ధవుడికి. 'అందుకని ఈ రూపంలో ఎక్కువగా నేను భాసిస్తూ ఉంటాను, ఈ రూపంలోకి ఎక్కువగా దిగి వస్తూ ఉంటాను' అని చెప్పాడు. అది మనకి opportunity కాబట్టి, ఇక్కడ నుండి మనం భగవంతుని వరకు మధ్య ఉండే సోపానములను, ఆరోహణం చేయటం అనే ప్రయత్నం చేసిన జీవితం సఫలం. అలా కాని జీవితం, వ్యర్థమైపోతూ ఉంటుంది. మళ్లీ ఇటువంటిదే ఇస్తారని guarantee లేదు. అది మన పురాణాల్లో చాలా clear గా చెప్పి ఉంచారు. Theosophy లో మనకేం చెప్తారంటే సామాన్యంగా మళ్లీ మానవ దేహమే వస్తుంది, ఎందుకంటే ఇంత దూరం వచ్చావు కాబట్టి. విపరీతమైన దుష్కార్యాలేమైనా చేస్తే తప్ప మానవ దేహమే వస్తుంది అంటారు. మన పురాణమేం చెప్తుందంటే, నువ్వు ఎంత కొమ్ములు తిరిగినవాడివైనా, దీని యొక్క సద్వినియోగం బట్టి ఉంటుందని చెప్తారు. ఇప్పుడు గజేంద్రుడంతటివాడు ఉన్నాడనుకోండీ, అంతకుముందు పెద్ద మహాత్ముడు, తరువాత ఏనుగైపోయాడు. ఒక గంధర్వుడు మొసలైపోయాడు. కూహూ నామ గంధర్వుడు మొసలైపోతాడు కదా! అట్లా ఎవరు ఏదైనా అయిపోవచ్చు. మన

వాళ్ళిది ఎందుకు చెప్పారంటే, so that we behave better. మనకి అంటే భారతీయులకి భక్తికన్నా కొంచెం భయం ఎక్కువ పెడితే, పనులవుతాయి. There is no surity. పనసపండు దొరికినప్పుడే పండగ చేసుకోమని మనకి సామెత ఉంటుంది కదా. అట్లాగే మానవ శరీరం దొరికినప్పుడే ఏ మాత్రమూ అశ్రద్ధ చేయకుండా, వ్యర్థం చేసుకోకుండా ఉత్తమమైన గుణములనన్నిటినీ కూడా మనం సాధన చేసుకుంటూ ఉండాలి. ఆ సాధన, భగవంతునియందు లత వలె అల్లుకుంటూ ఉండాలిట. వదలకూడదు. 'రాధ' అనే ఒక పదం ఉన్నది. 'అనూరాధ' అనే ఒక పదమున్నది. అనూరాధ, రాధ కన్నా ఇంకా గొప్ప. ఆ 'అనూ' అనే పదానికి అంత విశిష్ఠత ఉన్నది సంస్కృతంలో. 'అను' అంటే ఇంక అంటిపెట్టుకునే ఉంటుందన్నమాట, లత చూడండి ఆధారాన్ని ఎట్లా అంటిపెట్టుకుని ఉంటుందో! ఈ సమస్తానికి ఆధారం ఏమిటి? భగవంతుడే! కాబట్టి ఆ భగవంతుడినే ఎల్ల వేళలయందు అంటిపెట్టుకున్న మనసు ఎవరికైతే ఉంటుందో వాళ్ళు, రాధ, లేక అనూరాధ. అట్లా అంటిపెట్టుకుంటే ఏమవుతుందంటే అప్రయత్నంగా మనలో betterment వస్తూ ఉంటుంది. అది పద్ధతి. అందుకనే భగవంతుని గుర్తుపెట్టుకోవటం వలన, మంచి పెరుగుతూ ఉంటుంది. లేదూ, మంచి గుణాలు improve చేసుకుంటూ ఉండటంవలన భగవంతుడిని గుర్తుపెట్టకోవటం, అంటిపెట్టుకోవటం ఉంటుంది. ఒక్కొక్క జీవలక్షణం బట్టి, ఒక్కొక్క పద్ధతి పెట్టుకోవచ్చు. ఏదైనా రెండూ ఒకటే. ఒకటి పుర్రచేయి అంటే ఇంకోటి ఎడంచేయి అన్నట్టుగా ఉంటుంది. ఇది చేస్తుంటే అది వస్తూ ఉంటుంది, అది చేస్తుంటే ఇది వస్తూ ఉంటుంది. మనం ఎంత భగవంతుని యందు ఉన్నాం అనే దానికి మనకి litmus test ఏంటయ్యా అంటే మనం చేసే పనుల్లో ఎంత improvement వచ్చింది? అనేచోట ఉంటుంది. కబుర్లు పెద్దవి చెప్పి, చేసే పనులన్నీ చెత్తగా ఉన్నాయంటే చాలా భయంకరమైన మనుషులుగా మనం తయారవుతున్నాం అని అర్థం. భగవద్భక్తి సాధనలో ఇటువంటి సమాజాల్లో, సంస్థల్లోనూ ఉంటూ normal fundamental aspects లో, చిన్న చిన్న విషయాల్లో అబద్ధాలాడటం, చెప్పింది చేయలేకపోవటం, చెప్పినమాట నిలబెట్టుకోలేకపోవటం, ఇటువంటివన్నీ మనకుంటాయి కదా! అంటే మనం చాలా మరీ ప్రాథమికమైన దశలో మనం ఉన్నట్లు. అక్కడనించి ముందు మనం, ఒక మాట చెప్పాంట అంటే ఆ మాటకి నిలబడి ఉండటానికి, ప్రాణంపోయినా సరే నిలబెట్టుకోవాలి. ఇంకో మాట

చెప్పాడుట అంటే నాలుక తీసేయాలి అనిపించాలి. లేకపోతే ఆ మాటే చెప్పకూడదు. అట్లా ఉంటుంది మరి రాధ అంటే! ఒక ప్రయత్నం చేసినా, ఏదైనా సరే, మొదలుపెడితే శ్రద్ధ కావాలి, భక్తి కావాలి. ప్రవర్తనయందు అది కనపడాలి. కనపడితే ఉన్నట్టు తప్ప, లేకపోతే ఉన్నట్టు కాదు. ఇట్లా ఉంటుంది. 'అనుత్తమము' అనే విషయానికి, అంటిపెట్టుకుని, continuous betterment culminating in HIM. అందుకని భగవంతునికి అనుత్తముడు అనే పేరు. ఇంకొక అవగాహన ఏమిటంటే, అనుత్తముడు అనటానికి, ఉత్తముడంటే, ప్రథమపురుషలో వస్తుంది కదా! ఉత్తముడంటే ఉత్తమ పురుషుడు. అంటే 'నేను' అనేది First person కదా! So అనుత్తముడు అంటే, దానికి మించినవాడు. అంటే మనలో నేనుగా మనం గుర్తించే అది కూడా కాదుట, ఇంకా పైనున్నవాడుట అని ఇంకొక అవగాహన ఉన్నది. ఈ అవగాహన మనము పై నామాలన్నిటికీ కూడా తీసుకోవచ్చు.

## ౮౭. దురాధర్షః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## ౮౮, ౮౯, ౯౦. కృతజ్ఞ్యః, కృతిః, ఆత్మవాన్

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## ౯1. సురేశః:

సురులకు ఈశ్వరుడు. అంటే దేవతలకు దేవుడు. ఆయనను 'దేవదేవుడు' అంటారు. ఈ సృష్టి మొత్తం కార్యక్రమాలన్నిటిలో కూడా కేంద్ర స్థానముల యందు నిలబడి నడిపిస్తూ వుంటాడు. మనలో కూడా నాడీ కేంద్రాలు 16,౦౦౦ గ చెప్తారు. ఈ 16 వేల కేంద్రములలో 16 వేల రకముల ప్రజ్ఞలు పని చేస్తుంటే, ఈ మానవ శరీరం పని చేస్తున్నట్లుగా, మనం ఏదో చేయించుకుంటున్నట్లుగా, అది మన క్రింద పని చేస్తున్నట్లుగా మనం భావన చేస్తుంటాము. 16 వేల నాడీ కేంద్రములు సృష్టిలో గాని, మానవ దేహములో గాని సరైన పద్ధతిలో ప్రవర్తించటానికి, పని చేయటానికి కారణభూతమైన భగవంతునికి నమస్కారం అని "సురేశః" నామానికి అర్థం. మనలో మెదడు నుంచి మూలాధార చక్రం వరకు వెన్నెముకలో వున్న సుషుమ్నలో కేంద్రములు ప్రధానంగా వున్నాయి. అవి నాడీమండలంగా భౌతికంగా కనిపిస్తుంటాయి. ఆ నాడిమండలంలో మళ్ళీ చిలవలుపలవలుగా కేంద్రములు వుంటాయి. ఈ కేంద్రములన్నింటిలో సరైన ప్రవర్తన వున్నపుడు మనిషికి సరైన ఆరోగ్యం వుండటానికి అవకాశం వుంటుంది. కాబట్టి,'సురేశః' అనే శబ్దం మన దేహములో వుండే నాడీ కేంద్రముల యొక్క పనితనము మెరుగు పరచే శబ్దముగా వ్యాస మహర్షి మనకిచ్చారు.

## ౨౨. శరణం:

మనకు భయం వేస్తున్నపుడల్లా శరణం కావాలనిపిస్తుంది. కొన్ని రకాల జీవులకు భయం అనేది జీవ లక్షణం. కొంతమందికి భయం అంటే ఏమిటో తెలియదు. కొంతమందికి మాత్రం భయం బాగా వేస్తూ వుంటుంది. ఈ భయం వేసే వారికి ఇక్కడ చెప్పబడిన రహస్యమేమిటంటే, మనకు ఏ సన్నివేశమైతే భయం కల్పిస్తుందో, ఆ సన్నివేశంలో భగవంతుడున్నాడని ధ్యానం చేసుకోవాలి. మనమొక ఆపదలో వుంటే, ఆ ఆపద స్వరూపాన్ని కూడా భగవంతుని అస్తిత్వంగా భావన చేయుట వలన భయం పోతుంది తప్ప, ఇంకొక పద్ధతిలో పోదు. జ్వాలకూల్ మహర్షి గారిని భయమెట్లా పోగొట్టు కోవాలి అని అడిగితే, "భయం వున్నచోట భగవంతుని ప్రతిపాదన చేసుకో" అని చెప్పారు. అది విష్ణుసహస్రనామం లో వున్న రహస్యమే. ఆ రహస్యమేమిటంటే మొత్తమంతా భగవంతుడే అయినపుడు, ఈ సన్నివేశం మాత్రం భగవంతుడు కాదా? ఈ సన్నివేశం ఆయనను మించినదా? "ఈ సన్నివేశం నీవే కాబట్టి, నీ నిర్ణయం ఏదైతే అది శిరసావహిస్తాను. నా కర్తవ్యం మేరకు నిర్వహిస్తాను. నీ నిర్ణయం మేరకు నేను తల ఒగ్గుతాను. ఈ మొత్తం సన్నివేశం నీవు కాబట్టి, నీవు నాకు ఏదిస్తే దానిని ఒడిసిపట్టుటకు సిద్ధంగా వున్నాననే భావన" మన యందు కల్గి, కర్తవ్యం మేరకు పని చేస్తున్నట్లయితే, పరిష్కారాలు కాలం రూపంలో భగవంతుడు తానే అందిస్తాడు. క్లిష్టమైన పరిస్థితులు, దుర్ఘటమైన సన్నివేశములలో భగవంతుని శరణు జొచ్చివుండుట, కాలం రూపంలో భగవంతుడే పరిష్కారం ఇవ్వటం మనకు భగవద్భక్తుల జీవితాలలో కనిపిస్తూ వుంటుంది. అందుకని మనకి ఎప్పుడు భయం వేసినా సరే, ఆ భయం కలిగిస్తున్న సన్నివేశం మొత్తం కూడా అతడే అని భావన చేసుకోవటం వల్ల భయం పోతుంది. మరొక పద్ధతి ఏమిటంటే, భయం వేసినపుడు ఆంజనేయ దండకం చదువుకోవడం. అది చదువుతున్నంత సేపు భయం వుండదు. ఆంజనేయ దండకం చదవడమైపోయిన తర్వాత మళ్ళీ భయం వస్తుంది. లేదా మరొక స్తోత్రం. ఆ స్తోత్రం చదువుతున్నంతసేపు, భయం ఆ కాసేపు ఆగుతుంది. స్తోత్రం అయిపోయిన తర్వాత నేనున్నానంటూ మళ్ళీ మీద పడుతుంది. ప్రత్యేకంగా ఈ శతాబ్దంలో భారతీయులు చాలా పిరికి వాళ్ళుగా వుంటుంటారు. ప్రతిదానికి

భయమెక్కువ. కాబట్టి ఈ భయం తొలిగించే సన్నివేశం కోసం, మరొక దానిలో పూరట పొందటానికి స్తోత్రములు, నామములు, పూజలు ఎంత శ్రద్ధగా చేసినా, అవి అయ్యాక మళ్ళీ మనము, మన భయము సిద్ధంగానే వుంటాము. కనుక ఇక్కడ చెప్పిన రహస్యమేమిటంటే, నీకు భయాన్ని ఏది కలిగిస్తుందో, ఆ సన్నివేశం మొత్తం కూడా వాసుదేవుని స్వరూపంగా భావన చేయి. దేవుడే మనకు పాఠాలు నేర్పటానికి రకరకాలుగా సన్నివేశాలు కల్పిస్తుంటాడు. కొన్ని కొన్ని సన్నివేశాల ద్వారా కొంత కొంత వికాసం కలుగుతుంది. కనుకనే అనుభవాన్ని మించిన జ్ఞానం లేదు. ఆ అనుభవం మనకి దక్కాలంటే భక్తుల జీవిత కథలను చదువుకోవాలి. భయంకరమైన సన్నివేశాలు భగవంతుడి గా ధ్యానం చేయడమనేది ఇక్కడున్న ఒక రహస్యం. అది జరిగినట్లయితే లోపల, బయట భయం పోతుంది. భయపడే వారు రెండు రకాలు. బయట ఏదో సన్నివేశం భయంకరంగా వుండడం వల్ల మనలో భయం కలగటం ఒకటి, బయట సన్నివేశాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ భయపడుతూ వుండడం రెండవది. లోపల భయముంటే ప్రతిదానికి భయపడుతూ వుంటాము. అలా కాకుండా మహా ధైర్యవంతుడనుకునే వాడికి కూడా భయంకరమయిన సన్నివేశం రావచ్చు. మనం భయం నుండి బయట పడాలంటే ఆ సన్నివేశాన్ని భగవంతుని అస్తిత్వంగా గమనించాలి తప్ప, దాని నుంచి తప్పించుకోటానికి ఇంకోదాంట్లో దూరితే రాదు. అదీ భాగవత్సాధన. నిజమైన సాధనలో అలా భగవంతునిగా భావన చేయటం వలన, కాల రూపంలో భగవంతుడే పరిష్కారాన్ని చూపించడానికి అవకాశమేర్పడుతుంది.

## ౯౩. శర్మ:

మనకంటూ కొన్ని కష్టాలు వస్తుంటాయి. పీత కష్టాలు పీతవంటారు. అలాగే ఎవరి కష్టాలు వారివి. పెద్ద తుఫాను వచ్చిందనుకోండి, గడ్డిపోచను తుఫానేమీ చేయలేదు. గడ్డిపోచకన్నా పెద్ద చెట్టుకే బాధ ఎక్కువ. అందుకని పెద్ద చెట్లకు పెద్ద బాధలు, చిన్నచెట్లకు చిన్న బాధలు. అలా అని గడ్డిపోచకు బాధ లేదా అంటే వుంది. ప్రతి వాడూ దాని మీద కాలు వేస్తూ వుంటాడు. మర్రి చెట్టు మీద, రావి చెట్టు మీద ఎవరూ కాలు పెట్టే అవకాశం లేదు. 'మీ పని బావుంది, మీ మీద ఎవరూ కాలు పెట్టరు. మా నెత్తి మీద రోజూ కాళ్ళు పెడుతూ వుంటారు,' అని గడ్డిపోచ అంటూ వుంటే, రావి చెట్టూ, వేపచెట్టూ, మఱ్ఱి చెట్టూ-"నీకేం తెలుసు మా బాధ? గాలి వచ్చినపుడు నానా బాధ పడుతుంటాము. ఎవరి బాధలు వారికుంటాయి కదా" అని అంటాయి. పడుతున్న బాధలో కూడా భగవతత్త్వాన్నే దర్శనం చేయటం, మన బాధలకు ఇంకెవరో కారణమని వెతుక్కోకుండా వుండడం చేయాలి. మనం correct, మన చుట్టూ సన్నివేశాలు సరిగా లేకపోవటం వలన మనం ఇలా వున్నాము అని ఉండదు. బయట కారణం అని అనుకోవటమున్నదే, అది ఆధ్యాత్మిక మార్గంలో వున్న సత్యాన్వేషకునికి సత్యం కాదు. ఆ కష్టం నీకే ఎందుకు వచ్చింది అని ప్రశ్న వేసుకోవాలి. నీకు కష్టం వచ్చినప్పుడు, కారణాలు బయట వెతక్కుండా కర్తవ్యాలు నిర్వహించే వాడిని 'శర్మ' అంటారు. మనకొచ్చే ఒడిదుడుకులు, లోటుపాట్లు, వీటికి కారణాలు బయట వెతికితే సర్దుకోవు. లోపల సర్దుకుంటే బయట సర్దుకుంటాయి. వీటన్నిటికి కారణం నేనే కాబట్టి, నన్ను నేను మార్చుకుంటాను, అనేది సాధనా మార్గం. అప్పుడు భారత యుద్ధానికంతా దుర్యోధనుడు కారణం అని అనుకోవడం వుండదు. జరగాల్సింది జరుగుతూ వుంటే మనం కర్తవ్యం నిర్వహించడంగా వుంటుంది. రామాయణానికంతా రావణాసురుడు కారణం- ఇలా మాట్లాడరు మహాత్ములు.కారణం, మొత్తానికి జరగాల్సిన శిక్షణ బట్టి, ఉపదేశాన్ని బట్టి వుంటుంది. కాబట్టి కారణాలు బయట వెతక్కుండా, అందులో మనం చేయాల్సిన కర్తవ్యాలను గుర్తిస్తూ జీవించాలి. మనకెప్పుడూ మనం మంచి వాళ్ళమే అనిపిస్తూ ఉంటుంది. మన చుట్టూ వుండే వాళ్ళే బాలేరనిపిస్తూ వుంటుంది. నీ చుట్టూ వుండే వాళ్ళు బాలేని స్థితిలో

నీవెందుకున్నావు? కొంత మనలో కూడా ఆ స్థితి వుంది గనుక! అందుకని మన చుట్టూ ఏది ఎక్కడ జరుగుతున్నా అనుభవిస్తున్న దాంట్లో మన భాగం కూడా వుంది. We are one of the share holders. కాబట్టి మన వరకు వస్తుంది. ఆరోపణలు చేయటం మానేసిన వానికి 'క్షమ'అనేది అబ్బుతుంది. క్షమ లేనివాడు ఎదుటి వ్యక్తిలో తప్పులు, కారణాలు చూస్తూ వుంటాడు. మాస్టరుగారు దేహం విడిచే ముందు, ఏమిటి మీకు ఈ జబ్బు వచ్చింది? అంటే, ఏదో ఒక నిమిత్త కారణం వుండాలి కదా! అన్నారు. అంతేకాని 'నిర్వాహకులు, చెప్పినా వినకుండా మోతు గూడెం తీసుకుని వెళ్లారు, అందుకనే జబ్బు పడ్డాను' అనలేదు. మహాత్ములు ఎప్పుడూ మామూలు మనుషులు మాట్లాడినట్లు మాట్లాడరు. 'అక్కడకు వెళ్లకపోయి ఉంటే ఇలా అయుండేది కాదండీ', అని కొంతమంది చెబుతూ వుంటారు. అయిపోయిన తర్వాత దాని గురించి మాట్లాడి ఏమి ఉపయోగం? ప్రతి సన్నివేశానికి నిమిత్త కారణం, సత్యమైన కారణమొకటి వుంటుంది. సత్యాన్ని దర్శించిన వాడు నిమిత్తాన్ని ఆధారంగా తీసుకుంటాడు. కృష్ణుడి యొక్క బ్రొటన వేలుకి గురిపెట్టి బోయపిల్లవాడు బాణం కొడితే, బాణం తగిలి కృష్ణుడు చనిపోయాడు అనేది ఒక పద్ధతి. కృష్ణుడు వెళ్ళిపోదామని నిర్ణయం చేసుకున్నాడు కాబట్టి, పిల్లవాడు బాణంతో కొట్టడం జరిగింది అనేది వేరొక పద్ధతి. సత్యమైన, నిత్యమైన కారణాలు రెండూ వేరువేరుగా వుంటాయి. దివ్య ప్రణాళికకు సంబంధించి జరిగే పనులలో భాగంగా పనిచేసే వారికి నిమిత్త కారణాల ద్వారా నిజమైన సందేశాలు అందుతూ వుంటాయి. 'జూడా' అనే శిష్యుడు తన విరోధులకు తనను అప్పజెబుతాడని తెలిసిన ఏసుక్రీస్తు, తాను వెళ్ళిపోయే సమయం వచ్చిందని గుర్తిస్తాడు. అంతేగాని వాడు పట్టించకపోతే నేనుండేవాడినని అనుకోడు. ఆరోజు రాత్రి అందరూ కలసి భోజనం చేస్తూ వుంటే, వాడికి చెబుతాడు. అప్పటికే జూడా విరోధులతో, 'మీకెందుకు క్రీస్తుని నేను అప్పగిస్తాను,' అని మాటిస్తాడు. ఎందుకంటే వాడు తన గురువుగారి యందు విసిగిపోయి వున్నాడు. గురువుయందు విసుగొచ్చి, గురువునే హత్య చేద్దామనే దుస్థితి ఎందుకు కలుగుతుంది అంటే, గురువు అర్థం కాకపోతే! వ్యక్తిగతమైన కారణాలు మహాత్ములకుండవు. వారి దగ్గరకు చేరిన వారికి వ్యక్తిగతమైన కారణాలుండవచ్చు. వ్యక్తిగతమైన కారణాలు లేకుండా గురువు దగ్గరకు చేరిన వారికి గురువు యొక్క సందర్శనము, అనుగ్రహము, సామీప్యము, సాయుజ్యము ఇవన్నీ సహజంగా జరుగుతాయి. ఒక గురువు వద్దకు ఒక శిష్యుడు

వ్యక్తిగతమైన కారణాలు లేకుండానే చేరాడనుకోండి, ఎందుకయ్యా అక్కడకు చేరావంటే, నాకిష్టం కాబట్టి అనేదొక్కటే సమాధానం. మనం చేసే ప్రతి పనికి, 'ఎందువలనా అంటే అందువలన' అని ఒకటుంటుంది. "కారణము లేకయే ఇతరులను సుఖ పెట్టువాడు, కారణము లేకయే సుఖపడును" అని మాస్టరు ఇ.కె అన్నారు. చాలామంది వారి వ్యక్తిగత కారణాల వల్ల ఏదో ఆశించి ఒక గురువు వద్దకు చేరతారు. వీరు అలా వచ్చినపుడు మహాత్ములు నిరాదరించరు. దగ్గరకు చేర్చుకుని వారికి ఎక్కువ కాంతిని ప్రసాదిస్తారు. మన సమస్యలన్నిటికీ పరిష్కారం కోసం గురువులు నడుము కట్టుకుని పనిచేసి పెట్టరు. సమస్యలయందు ఎక్కువ అవగాహనా కాంతిని బుద్ధి రూపంలో ప్రసాదిస్తారు. శ్రీకృష్ణుడంతటి వాడు అర్జునుని చేత యుద్ధం చేయించాడు తప్ప, చేసి పెట్టలేదు. రక్షణ ఇస్తుంటాడు. మనకి ఏదైనా కష్టం వచ్చిందనుకోండి, భగవంతుడినో, గురువునో తలచుకుంటే ఏమౌతుందంటే, ఆ కష్టంలో మనం చేయవలసిన కర్తవ్యం మనకి తెలిసే పద్ధతిలో ఇంకొంచెం వెలుగునిస్తారు. వెలుగివ్వటమే గురువు యొక్క కర్తవ్యం. వెలుగులో మనం ఏమి చేసుకుంటామనేది మనకు సంబంధించినది. వెలుగులో పేకాడుకోవచ్చు, వెలుగులో విష్ణుసహస్రనామము చదువుకోనూవచ్చు. మంచి మాటలు మాట్లాడుకోవచ్చు, పిచ్చిమాటలు మాట్లాడుకోవచ్చు. అన్నింటికీ వెలుగు సాక్షీభూతంగా వుంటుంది. అలా వుంటాడు గురువు. గురువునకు భగవంతుని చేత నిర్దేశింపబడిన ప్రణాళిక ఒకటి వుంటుంది. దాన్ని చాల ప్రశాంతంగా నిర్వర్తిస్తూ వుంటాడు. అట్లా నిర్వహిస్తూ ఉండే ఆ గురువు దగ్గర, ఆ కాంతి, ఆ ఆకర్షణ కారణంగా ఆయనలో వుండే దివ్యప్రభావం కారణంగా, సామాన్య మానవులు చేరుతూ వుంటారు. చేరి, వారి వారి యొక్క వ్యక్తిగతమైన కోరికలను నేరవేర్చుకుంటూ వుంటారు. కొన్ని నేరవేరుతాయి, మరికొన్ని నేరవేరవు. నెరవేరని వాళ్ళు, ఈయన చేయగలడు కాని చేయడం లేదు, అని కోపము ద్వేషము వచ్చి, వాళ్ళని ఏదో విధముగా ఇబ్బంది పెట్టటానికి ప్రయత్నం చేస్తారు. మాములుగా గురువు దగ్గర చేరి గురువు యందు వ్యష్ఠ పడ్డ వారందరికీ వ్యష్ఠ ఎందుకు కలుగుతుందంటే, శిష్యులనుకునే పద్ధతుల్లో గురువుండడు కనుక. Jesus Christ భగవంతుని తలచుకుని తన కుడి చేయి రెండు కళ్ళ మీద పెడితే కళ్ళు వస్తాయి. అలా జరిగితే, భగవంతుడనే అనుకుంటారు ఎవరైనా. నీవే భగవంతుడివి అన్నారు."నేను భగవంతుడ్ని కాదు, భగవంతుడు ఒక్కడే. ఆయనకు నామము

లేదు, రూపము లేదు. కాని ఏ నామములోనైనా, ఏరూపములోనైనా, ఏ కాలములోనైనా, ఏ ప్రదేశములోనైనా కూడా తాను ప్రత్యక్షం కాగలడు. నేను కల్పిచ్చాననేది అబద్ధం. భగవంతుడు నీకు కల్పిచ్చాడనేది నిజం. ఈ విధంగా నన్ను వాడుకుని, మీఅందరి మధ్య నా యొక్క పేరు ప్రతిష్టలు పెంచాడనేది నిజం. ఇది ఆయన యొక్క లీల. భగవంతుడు తన లీలను నా ద్వారా చూపించాడు. నన్ను భగవంతుని గా నమ్మబోకు" అని చెబుతాడు. ఇట్లా చెబుతుంటే, ఈయన అన్ని చేయగలడు అనే భావన జూడా అనే శిష్యునికి కలుగుతుంది. జూడా యూదులందరికి స్వాతంత్ర్యం తీసుకుని రావాలని పనిచేస్తూ వుంటాడు. దేశభక్తి కలవాడు. ఈయన బానిసత్వం నుంచి రక్షిస్తాడు, అని ఒక నమ్మకం పెట్టుకుంటాడు. ఆ నమ్మకంతోనే ఆయన దగ్గర చేరి పని చేస్తుంటాడు. Christ బోధనలలో తాను రాజాధిరాజు, అని చెబుతూ వుంటాడు. రాజధిరాజు అంటే రాజులకన్న గొప్పవాడని అర్ధం వుంది. ఈ రాజులందరికీ రాజుననే అర్ధం వుంది. కాబట్టి మనల్ని పరిపాలిస్తున్న ఈ రోమను రాజులను కూలగొట్టి తమకు స్వాతంత్ర్యాన్నిస్తాడని గట్టిగ నమ్ముతాడు. కాని Christ మాట్లాడిన భాష యొక్క భావన వేరు. దానితో ఇతనికి ఒక విధమైన నిరాశ, నిస్పృహ కలిగి, Christ ను విరోధులకు అప్పజెబుతాడు. అంతవరకు Christ కొఱకు ఎన్నో విధాలుగా ప్రయత్నించిన ఈ అధికారులకు Christ దొరకడు. కాని తన కర్తవ్యం పూర్తయిందనే సందర్భంలో ఈ శిష్యుడెప్పుడైతే మాటిచ్చి వస్తాడో ఆ రోజున 'నేను వెళ్ళి పోయే సమయం వచ్చింది, మీలోనే ఒకరు నన్ను అప్పజెప్పటం వలన వెళ్ళిపోవడం జరుగుతుంది' అని చెప్పి జూడా వైపు ఒకసారి చూస్తాడు. అలా చూసినపుడు ఆ శిష్యునికి గుండె పగిలిపోయినంత పనౌతుంది. అయినప్పటికీ నిందారోపణ చేయడు. అలాగే తనని శిలువ వేస్తున్నపుడు కుడా నిందారోపణ చేయడు. అందరూ మాట్లాడతారు. 'నీవు రాజాధిరాజువి కదా, రక్షించుకో చూద్దాం' అని. వాళ్ళలా మాట్లాడుతుంటే, భగవంతుడికి కోపం వస్తుందేమో అని ఆయనంటాడు, "తండ్రీ వీరంతా తెలియని వారు. వీరి మీద కోపం వద్దు. వాళ్ళకు తెలియక నాకిలా మేకులు కొడుతున్నారంటాడు". మనల్ని ఎవరైనా ఒక మాటంటే తిరిగి పది మాటలు అనటానికి సిద్ధంగా వుంటాము, అలా అనకపోతే తప్ప మన మనస్సు శాంతించదు. అలాంటిది సరాసరి నిన్ను హింస పెడుతున్న వాళ్ళ విషయంలో నీవు చూపిస్తున్న ఆదరణ ఉందే అది'శర్మ' అంటే! మనకు కలిగిన

కష్టానికి కారణం మనలో వెతుక్కోవటమే తప్ప బయట ప్రపంచంలో వెతకని వాడిని, ఓర్పుతో తనకున్న కష్టాన్ని భరించేవాడిని 'శర్మ' అంటారు. అందుకని ఈ శర్మ అనే పదం మనయందు సత్యమవ్వాలంటే, మనలో క్షమ పెరగాలి. మనలో క్షమ పెరగాలంటే, మనకు జరుగుతున్న వాటికి కారణం మనలో వుందని గ్రహించాలి, ప్రపంచం మీదే వుందని అనుకోవటం కాదు. ప్రతివాళ్ళు ప్రపంచాన్నే దుయ్యబడుతూ వుంటారు, అలా చేసే వాళ్ళు నిజమైన సాధకులు కాదు. మనలో కూడా దీనికి కారణం వుంది కాబట్టి మనలో వుండే కారణాన్ని తీసేసుకోవాలి. అలా చేస్తే బయట కూడా మారుతుంది. ఇలా జరుగుతున్న ప్రతిదానికి కారణం మనలోనే వెతుక్కుని వాటిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించేవాడు శర్మ. కారణం బయట చూసి, నెపం ఎంచేవాడు 'కర్మ'. వాడి కర్మ ఇప్పటికి, ఎప్పటికి బాగుపడదు. మాస్టరుఇ.కె గారు ఎప్పుడూ ఒక సిద్ధాంతం చెబుతూ వుండేవారు. అతిగా గారెలు తిని, కడుపు నొప్పితో బాధ పడుతుంటే, పక్కవాడు ENO fruit salt తాగితే పోతుంది అని సలహా ఇస్తాడు. ఐతే ENO fruit salt న్నూ, మరొక అర డజను గారెలు తెమ్మని చెబుతాడు. అనారోగ్యానికి మందు వేసుకుంటూ, ఆరోగ్యంగా వుండటానికి ప్రయత్నమేమీ చేయకుండా వుండే వాళ్ళకు ఆరోగ్యం రాదు కదా! నీవు అనారోగ్యంగా వుండటానికి కారణం నీ ప్రవర్తనా లోపం. దానికేమీ rectificationకి inclination లేదు mind లో. అదలాగే జరుగుతుండాలి, దానిని తీసేయటానికి మందులు వేసుకుంటూ వుండాలి. నీవు మందులు వేసుకుంటే ఏం లాభం? ఒకప్రక్క నుంచి చీపురుతో తుడుస్తున్నావు, రెండోపక్క నుంచి మురికి నీరు బక్కెట్టుతో పోస్తున్నావు. ఇలా పోసుకోవడం, తుడుచుకోవడంగా జరిగిపోతూ వుంటుంది. అందుకని నిజమైన ఉద్ధారణ మనకి కలగాలంటే మన జీవితంలో మనకు జరుగుతున్న సన్నివేశాలలో ఎక్కడెక్కడ మనలో లోటుపాట్లు అనిపిస్తున్నాయో, అక్కడక్కడ మనలో సరిదిద్దుకోవాలి. అలా చూసుకుంటూ వెళ్ళే వాడికే 'శర్మ' అని పేరు.

## ౯4. విశ్వరేతః

( పూజ్య గురువుగారు ఈ నామానికి ఇచ్చిన వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

## ౯౫. ప్రజాభవః

ఈ ప్రజలందరినీ ధరించే వాడు. మనలో వుండే ధారణ శక్తి కారణంగా అన్ని ప్రజ్ఞలు పని చేస్తున్నాయి . సూర్య మండలంలో సూర్యుని యందున్న ధారణ శక్తి కారణంగా ఇన్నిగోళాలు ఏ ఆధారం లేనట్టుగ వెలాడుతున్నట్టుగా, పడిపోకుండా వున్నాయి. ఈ ధారణ శక్తి కలిగిన భగవంతుని "ప్రజాభవుడు" అంటారు. అంటే తనయందు పుట్టుకొచ్చిన వాళ్ళందరిని తాను ధరించి ఉంటాడు. ధరించి వుండటం వేరు, భరించి వుండటం వేరు. ధరించి వున్నపుడు మోస్తున్నట్టుగా వుండదు. అన్నిటికీ కేంద్రమై వుండటాన్ని 'ప్రజాభవ' అనే స్థితి అంటారు. మనలో కూడా అటువంటి స్థితి వుంది. అదే 'ధారణ' అను స్థితి. మనం దేహంలో లేము, దేహం ధరించి వున్నాము. దేహం ధరించి వున్నవాడు దేహం లోకి వచ్చి పోతుంటాడు. దేహంలో ఉన్నామని అనుకునేవాడు బంధింపబడి వుంటాడు. దేహాన్ని ధరించివున్నాననుకునే వాడు చొక్కాను ధరించినట్లుగా వుంటాడు. మనం చొక్కాలో బంధింపబడి వున్నామని అనుకోము కదా! అలాగే వాడు దేహంలో బంధింపబడడు.

## ౨౬. అహః

అహః' అను శబ్దానికి అర్థం పగలు వెలుగు. పగలు వెలుగుని మనం చూసినపుడు అది భగవంతుని యొక్క అస్తిత్వముగా గుర్తుంచుకోవాలి. దేవుని దర్శించడానికి ఎక్కడెక్కడో తిరగక్కర్లేదు. ప్రొద్దున్నే మనకి సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కనిపిస్తున్న వెలుగే దేవుడు. అలా దేవుడ్ని చూడగలవా? అలా చూట్టానికి నీకేమైనా అభ్యంతరం వుందా? వెలుగులో పని చేసుకుంటుంటాం తప్ప, వెలుగు వుండటం వలన మనం పని చేసుకుంటున్నామనే భావన కలుగదు కదా! తెల్లవారింది కాబట్టి ఇక గబగబా పనులు మొదలుపెట్టుకోవటమే తప్ప, అసలు ఈ తెల్లవారి ఇంత చక్కగా వెలుగుగా వున్నది కదా, అనే భావన వున్నపుడు భగవంతుని యొక్క అస్తిత్వాన్ని సరాసరి అనుభూతి చెందటానికి అవకాశం వుంటుంది. 'అహః' అనే శబ్దం లో 'అ' అనేది అయ్యవారు, 'హః' అనేది అమ్మవారు. అయ్యవారు అమ్మవారి తో కూడి వచ్చినపుడు వచ్చిన చైతన్యమే వెలుగుగా వస్తుంది.

## ౨౮. సంవత్సరః

ఒక సెకను నుంచి, ఒక నిమిషం నుంచి, ఒక గంట నుంచి ఇన్ని యుగాలుగా కాలం ఏ విధంగా వుందో, ఆ కాల స్వరూపంగా వున్న భగవంతుడు 'సంవత్సర పురుషుడు' అని అర్థం.

## ౨౩. వ్యాలః

అంటే పాము చర్మం మీద వుండే పొలుసులుగా ఈ కాల చక్రం లో విషయాలన్నీ జరుగుతూ వుంటాయి.

## ౯౯, 100. ప్రత్యయః, సర్వదర్శనః

'ప్రత్యయః' అనే శబ్దానికి 'నమ్మకం' అని అర్థం. భగవంతుని యందు నమ్మకం కలవారికి నిశ్చలత్వమే సహజమైన స్థితి. Fair weather faith ఒకటి, rough weather faith ఒకటి రెండు రకాలుగా వుంటాయి. అన్నీ బావున్నప్పుడు భగవంతుని కొలవడం ఒక పద్ధతి. విపరీతమైన కష్టం వచ్చినప్పుడు గిలగిలలాడిపోవటం ఒక పద్ధతి. ఎప్పుడైనా గిలగిల్లాడామంటే అర్థం నమ్మకం లేదు అని. దేవుడున్నాడని ఎవరో చెప్పటం వలన, ఏదో మనం కూడా నమ్ముకుంటే కాస్త జరుగుబాటవుతుందని, ఈ కష్టాల్లో నుండి బయట పడతాం అని అనుకునే పద్ధతి ఒకటి వుంది."ఈ కనిపిస్తున్నదంతా కూడా భగవంతుడే అనే సత్యం మనయందు స్థిర పడటమే నమ్మకం" అని కపిలుడు దేవహూతికి నిర్వచించాడు. ఈ కనపడుతున్నదంతా, జరుగుతున్నదంతా భగవంతుని సంకల్పం వలననే జరుగుతుంది. ఇందులో మన కర్తవ్యాన్ని మాత్రం మనం నిర్వర్తిస్తూ వుండాలి అనే విషయాలు మాత్రమే గుర్తుండి, ఇంకేమీ గుర్తుండకపోవటమే నమ్మకం అంటే. అందరి రూపంలో భగవంతుడు వున్నాడని అంటాం కాని మనకి ఇష్టం లేని వాడి రూపంలో భగవంతుడు ఉన్నాడంటే అది ఒప్పుకోవటానికి చాలా కష్టంగా, అభ్యంతరం గా వుంటుంది. భగవంతునికి ఆ అభ్యంతరాలు వుండవు. మనం కొంతమందిని మంచివారని, కొంతమందిని చెడ్డవారని నిర్ణయాలు చేసుకుంటూ వుంటాము. కానీ, ఇద్దరిలో కూడా హృదయ స్పందన జరుగుతూనే వుంటుంది. అంటే భగవంతుడున్నాడనేకదా! మనకి ఎంత ఇష్టం లేక పోయినా తేలులో, నల్లిలో, పాములో కూడా భగవంతుడున్నాడు. అందులోవున్న చైతన్యాన్ని చూడగల్గిన వాడికి కొన్నిటి యందు చూడటం, కొన్నిటి యందు చూడకపోవటం వుండదు. ఒకరు శివుడని పేరు పెట్టుకున్నారు, ఒకరు విష్ణువని పేరు పెట్టుకున్నారు. ఒక రూపానికి, ఒక నామానికి పరిమితమైనపుడు మతాలు పుట్టుకొస్తాయి, పరిమితత్వం వున్నచోట నమ్మకము పరిపూర్ణము కాదు. ఏ రూపంలో వున్న భగవంతుడినైనా ధ్యానం చేసుకోవటానికి సంసిద్ధత వుందా లేక అభ్యంతరం వుందా? సాధనకు నీకు ఒక రూపం వున్నప్పటికీ, మిగతారూపాలను అగౌరవపరచకుండా, రూపం, నామం, కాలం విషయంలో ఒక సమభావం

కలిగి యుండటమనేది ముఖ్యం. సంవత్సరంలో 24 ఏకాదశులు వుంటే, ఒకటో, రెండో ఏకాదశులకు హడావుడి చేసేసి, emotional గా feel అయ్యి, మిగతావాటిని మరచిపోతూనే వుంటాం. కొన్ని రోజులకు importance ఇవ్వటం, కొన్నిరోజులకు importance ఇవ్వకపోవటం వుంటుంది. అందుకని ఈ కాలం, ఆ కాలం అని కాకుండా అన్ని కాలాల్లోను, అన్ని నామాల్లోనూ, అన్ని రూపాల్లోనూ, అన్ని ప్రదేశాల్లోనూ ఆయన్ని చూడగలగడం వుండాలి. అలా చూడగలిగిన వాడికి చుట్టూ భగవంతుడు వున్న భావన వుంటుంది. వాడూ నమ్మకస్తుడు! మనకేమీ పని లేనపుడు దేవుడు గుర్తుండి, మనం కష్టాల్లో వున్నపుడు వాడిని మరచిపోతూ వుంటే నమ్మకముండదు. ఈ 4 dimensions లో భగవంతుడ్ని చూసినవాడికి, అన్నీ వాడే నడిపిస్తున్నాడనే భావన ఎప్పుడూ కలుగుతుంది. అదీ కపిలుడు చెప్పిన నమ్మకం. అంతటా వాడే వున్నాడు కాబట్టి, అన్నిటా వాడ్నే చూస్తున్నవాడు నమ్మకస్తుడు. తనకంటూ ఒక concept పెట్టుకుని, ఆ concept ని చూసుకుంటూ, దానికొచ్చే అంతరాయములనన్నిటిని చీల్చి చండాడే వాడు నమ్మకస్తుడు కావటానికి వీలులేదు. మనకి instituting the original in the place of the substitute అని చెప్తారు. మనకు కనిపించేదంతా కూడా మాయ అని కొంతమంది చెబుతూ వుంటారు. ఎలా 'మాయ' అవుతుందంటే, ఒక వ్యక్తిని చూసినపుడు అతనితో నీకున్న లౌకికమైన సంబంధం మాయ. కాని, అతనియందు ప్రవహిస్తున్న చైతన్యము సత్యము. ఒక భర్త భార్యను చూసినపుడు, తన భార్యగా చూస్తాడు. కాని భార్య అవక మునుపు కూడా ఆవిడ వుంది. అపుడు స్త్రీ! భార్య కాదు. స్త్రీ అనేది ఎక్కువ సత్యము. భార్య అనేది ఒక మనిషికే సత్యము. ఒక పురుషునికే ఆమె భార్య. మిగతావారందరికి స్త్రీ. కాబట్టి రెండిట్లో ఏది ఎక్కువ సత్యం? నాభార్య అనేదానికంటే, ఆమె స్త్రీ అనేది ఎక్కువ సత్యం. ఎందుకంటే ఎక్కువమందికి ఆవిడ స్త్రీ కాబట్టి. స్త్రీ అనేది కూడా కొంతవరకే సత్యం తప్ప అంతా సత్యము కాదు. స్త్రీ పురుష శబ్దము దేహమునకే పరిమితమై వుంటుంది. దేహమునకు అతీతముగా స్పందనత్మకముగా పనిచేయుచున్న ప్రజ్ఞ, అదే చైతన్యము అది సత్యము! పొద్దుటే నిద్ర లేపేది, రాత్రి నిద్రలోకి తీసుకుని వెళ్ళే చైతన్యము, ఆ చైతన్యము ఆధారంగా వచ్చే ఆలోచనలు, వీటికి స్త్రీ పురుష భేదాలు లేవు. ఆలోచనలను అనుసరించి మాట్లాడడం, పనులు చేయడం మగవాళ్ళకు, ఆడవాళ్లకు సత్యమే! కాబట్టి స్త్రీ

పురుష బేధమనేది కొంతవరకు సత్యం. ఈ పడుకోవడం, లేవడం, యోచనలు, మాటలు, చేతలు వీటన్నిటికి basis ఏమిటి? అది కూడా అందరికి common కదా! అందువలన దానిని ముందు గుర్తుంచుకుని, అక్కడి నుండి మిగతావన్నీ కూడా గుర్తుపెట్టుకోవడమనేది యోగము. ఇందులో మొదటిది గుర్తు పెట్టుకుని తర్వాతది గుర్తుపెట్టుకోకపోయినా, తర్వాతది గుర్తు పెట్టుకుని మొదటిది గుర్తుపెట్టుకోకపోయినా అవగాహన సమత్వము వుండదు. ఈ సత్యానికి levels ఉన్నాయన్న మాట. ఒక పురుషుడికి ఒక భార్య అనేది సత్యం. ఇంకొంచెం level పెరిగితే స్త్రీ గా ఆమె అందరికీ స్త్రీ యే అనేది మరొక సత్యం. ఇంకా కొంచెం అవగాహన పెరిగితే జీవుడు లింగ భేదములేని స్థితిని అనుభవిస్తున్న భగవంతుని యొక్క ఒక కిరణము అనేది ఇంకొక సత్యం. సత్యానికి ఇన్ని levels వున్నాయి. Truth levels అన్నారు కదా Master C.V.V గారు. మనయొక్క అవగాహన పెరుగుతున్న కొలదీ మనకు అవే ఎక్కువగా కనిపిస్తూ వుంటాయి. కాబట్టి ఆ మొదటి సత్యం పరిపూర్ణమైన సత్యం! అక్కడ నుంచి దిగివచ్చిన సత్యాలన్నీ తెలిసి వుండడాన్ని మనం ఏర్పరచుకుని, అందరిలో ఒకే చైతన్యము వివిధములుగా పనిచేస్తున్నదని, వాటికి వివిధములైన స్వభావములున్నాయని తెలుసుకోవడం వలన, అందరిలో వున్న భగవంతునితో మనం అనుసంధానం చెంది, వాటి స్వభావాలతో అనుసంధానం చెందని ఒక స్థితి ఒకటి కలుగుతుంది . శ్రీ ఆది శంకరాచార్యుల వారు చెప్పింది కూడా అదే అద్వైతం! ఈ కనిపించే చెట్టు, పుట్టతో సహా అంతా భగవంతుడే, రెండోదేమీ లేదు అని చెప్పారు. వారికి కూడా ఒక సన్నివేశం ఎదురవుతుంది. ఒకసారి అరణ్యంలో శిష్యగణంతో నడచివెళ్తుంటే అటువైపు పులి వస్తుంది. వెంటనే అయన చెట్టు ఎక్కుతారు, మిగతావాళ్ళు కూడా చెట్టెక్కుతారు. పులి వెళ్ళిపోతుంది. అందరూ చెట్టు దిగుతారు, వారిలో ఒక శిష్యుడు అడుగుతాడు, అంతా భగవంతుడే అయినపుడు, పులి రాగానే ఎందుకు చెట్టెక్కారని. అందుకు సమాధానంగా "పులి భగవంతుడే కాబట్టి నాకు కంగారేమీ కలుగలేదు, పులి స్వభావం మనుషుల్ని తినడం. నాకింకా చేయవలసిన పని వుంది. అందుకని దాని స్వభావాన్ని గౌరవించి చెట్టెక్కాను. ఇది నేను చెప్తున్న తత్త్వం లోని రెండవ భాగం" అని చెప్తారు. పాఠంలోని రెండవ భాగమేమిటంటే, వారి స్వభావాన్ని గుర్తించి, వారితో ప్రవర్తించడం. అలా అని వారి యందు ద్వేషం కలుగకుండ వుండుట. ఇది చాలా ముఖ్యం. మనం ఎలా వుంటామంటే wholesale గా

either acceptance or rejection గా వుంటుంది. స్వభావం నచ్చితే accept చేస్తాము, కొంచెం తేడా వస్తే నిరాకరించేస్తాము. అంతా emotions మీద ప్రవర్తిస్తుంటాము. చెట్లన్నీ ఒకే విధంగా వుండవు, జంతువులన్నీ ఒక విధంగా వుండవు, మనషులందరూ కూడా ఒకే విధంగా వుండరు. ఈ సత్యం గుర్తించి వాడు మొదట మనిషి, తరువాత వాడి స్వభావం, ఆ కేంద్రం అందర్లోనూ common కాబట్టి, అక్కడినుంచి వచ్చే precipitation వేరుగా వున్నా, ఆ కేంద్రం యందు మనకు లగ్నం కుదిరినపుడు అంతా ఒకటే అని తెలుస్తుంది. తెలిసినప్పటికీ వ్యవహారం వచ్చేటప్పటికి వాడు ఎట్లా ప్రవర్తిస్తున్నాడో దాని ప్రకారం మనం హింసించకుండా జాగ్రత్తగా యుక్తియుక్తంగా ప్రవర్తించడమనేది పెద్దలు చూపిన మార్గం. మనకందరూ దేవుడే, కాని కొడుకుతోనూ, తండ్రితోను, పెళ్ళాం తోనూ, తల్లితోను ఒకే విధంగా ప్రవర్తించము కదా! ఒకరికి మనం తండ్రి, ఒకరికి కొడుకు, మరొకరికి తమ్ముడు, మరొకరికి అన్నయ్య, వేరొకరికి స్నేహితుడు వారితో ప్రవర్తించేటపుడు ప్రవర్తన అనేది ప్రపంచానికి సంబంధించినది. కొడుకుతో తండ్రి లాగా, తండ్రితో కొడుకు వలె ప్రవర్తించాలి. స్నేహితులతో స్నేహితునివలె ప్రవర్తించాలి. అన్నతో తమ్ముడి లాగా , తమ్ముడితో అన్న వలె ప్రవర్తించాలి. ఇవన్నీ ఒక విజ్ఞానము. అన్నిట్లో వీళ్ళందరితో ఎలాగ ప్రవర్తిస్తున్నా, వీరందరిలో ఉన్నవాడు ఒక్కడే అని గుర్తుంచుకొని ప్రవర్తించేవాడు సమభావంతో ప్రవర్తిస్తుంటాడు. అదీ' ఆ ఒక్క దాన్ని తెలుసుకోవడం'. అది లేకపోతే మిగతావన్నీ సత్యం కాదు కాబట్టి, దాన్ని గుర్తించి, దాని స్వభావాన్ని కూడా గుర్తించి ప్రవర్తించడమనేది చేయాలి. కృష్ణుడు, రాముడు అలా చేసి చూపించారు కాబట్టి మనకు వాళ్ళు ఆదర్శం. వాళ్ళ యందు పూజ్య భావం కలగడం జరిగింది. మనబోటి వారికి మనకి ఇష్టం లేని వారు ఎవరైనా కనిపిస్తే మొహం కుంచించుకుపోతుంది. అది కనబడకుండా ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది, కానీ మొహం చూపించేస్తూ ఉంటుంది ఇష్టం లేదని. రాముడికి, కృష్ణుడికి వాళ్లతో యుద్ధం చేసే వాళ్ళ యందు ప్రేమ తప్ప, ద్వేషం ఉండదు. రావణాసురుని తో రాముడు యుద్ధం చేసేటప్పుడు నవ్వుతూ యుద్ధం చేస్తాడు. కృష్ణుడు ఎవరితో యుద్ధం చేస్తున్నా నవ్వుతూనే చేస్తాడు. ఎందుకంటే లోపల కేంద్రంలో ఇద్దరం ఒకటే అనే భావన పరిపూర్ణంగా ఉన్నా, అవతలి వాడు యుద్ధం కోరాడు కాబట్టి యుద్ధం చేస్తారు. అవతలివాడు ప్రేమ కోరితే ప్రేమిస్తాం. అవతలి వాడు ఏది కోరితే అది. అవతలివాడు tricks వేస్తుంటే మనంtricks

వేస్తుంటాము. అదీ కృష్ణుడు! అవతలి వాడు ఎట్లా ఉంటే మనం అలా ఉంటాం. అది స్వభావానికి సంబంధించినది. స్వభావం దాటి అవతల ఉన్న భగవంతుణ్ణి అనుసంధానం చేసుకుని ఉన్నట్లయితే, మనకు ఇష్టం లేనివాడు కనిపిస్తే ముందు గుర్తొచ్చేదేమిటి? వాడు భగవంతుని స్వరూపమే అని! ఇష్టం లేని ప్రదేశానికి వెళ్ళినప్పుడు కూడా, అది కూడా భగవంతుని యొక్క ప్రదేశం అని గుర్తొస్తుంది. మనకిష్టం లేని రూపం, మనకిష్టం లేని కాలం, మనకిష్టం లేని నామం, మనకిష్టం లేని ప్రదేశంలో కూడా భగవంతుడు గుర్తు ఉన్నప్పుడు అదేనమ్మా నమ్మకం, అని కపిలుడు దేవహూతికి చెబుతాడు. అట్లా నమ్మకం ఏర్పడిన వాడికి జరుగుతున్నదంతా భగవంతుని యొక్క కార్యక్రమంగా భావన చేసుకొని, అందులో తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ వుంటాడు. మాస్టరుగారు కూడా నమ్మకమంటే అదే ఇచ్చారు. ప్రత్యయమంటే మాస్టరుగారంటారూ "భగవంతుణ్ణి నమ్మడమంటే, భగవంతుడు మనకు నచ్చటమోయ్," అని. మనకు నచ్చని situation లేకుండా వుంటే భగవంతుడు దగ్గరవుతాడని చెప్పారు. భగవంతుణ్ణి నమ్మటమంటే, మాములుగా మనకిష్టమైన వన్ని భగవంతుడు చేసిపెడ్తుంటే, మనం నమ్మకం పెంచుకుంటూ వుంటాం. అది కాదు నమ్మకం. జీవితంలో సన్నివేశాలు, వ్యక్తులు, ప్రదేశాలు, పరిస్థితులు, ముందుగ acceptability and then working with them. అది కలిగిన వాడికి నిజమైన నమ్మకం ఏర్పడుతుంది. అలా ఏర్పడినపుడు "సర్వదర్శనః" అనేశబ్దం సత్యమౌతుంది. అందరి యందు వాడే కనిపిస్తుంటాడు. అందరిలోనూ భగవంతుడు కనిపించడం అనేది ఎప్పుడు జరుగుతుందంటే, ఈ నమ్మకం ఏర్పడిన వాడికి కనిపిస్తుంది. లేకపోతే కనిపించదు. అట్లా అన్నిట్లో దర్శనం చేసిన భక్తుల చరిత్రలు భాగవతంలో ఇచ్చారు. అందుకని భాగవతమూర్తులు భగవంతునికి అతి సన్నిహితులు లేక భగవంతుని యొక్క ప్రత్యామ్నాయమైన రూపములు. భగవంతుడు కనిపిస్తే ఒక భాగవతుడౌతాడు. రూపు కట్టుకుంటే ఒక భాగవతుడు అవుతాడు. అన్నిట్లోనూ వాడినే దర్శనం చేస్తూ, వారితో ప్రవర్తించేటప్పుడు మాత్రం అవతలి వారి ప్రవర్తన కనుగుణంగా ప్రవర్తించడముంటుంది. నొప్పించడం ఉండదు. యుక్తి ఉంటుంది. సమయస్ఫూర్తి ఉంటుంది. బుద్ధి ఉంటుంది. ద్వేషం ఉండదు. ప్రేమ కలిగి ఉంటుంది. భగవంతుని దర్శిస్తూ ఉండడం అనేది ఉంటుంది. అందుకనే 'ప్రత్యయః' అన్న పదం తర్వాత 'సర్వదర్శనః' అన్న పదం వచ్చింది. ఈ నమ్మకం కుదరనివారికి ఆ దర్శనం

జరుగదు. అన్నీ భగవంతుని రూపాలే అయినపుడు నీకు కొన్ని రూపముల యందు objection వుంటే, నీకు కనపడాలంటే భగవంతునికి కూడా objection వుంటుంది. Christ భగవంతుని ప్రార్థించాలనే ప్రయత్నం చేయకండి వృథా, అని చెబుతాడు. భగవంతుడు సృష్టి రూపంలో, జీవుల రూపంలో వున్నాడు. జీవుల రూపంలో ఉన్న భగవంతుని ఆరాధన చేసుకుంటూ వున్నకొద్దీ, భగవంతుడు సత్యం అవుతాడు. సర్వదర్శనమనే స్థితి ఎప్పుడు కలుగుతుందంటే, అందరిలో వున్న ఆ చైతన్యాన్ని దర్శనం చేస్తూ, వాళ్ళ స్వభావం మనకు నచ్చకపోవచ్చును గాని, వాడు నచ్చకపోవడం జరగకూడదు. స్వభావము విరుద్ధముగా ఉన్నంత మాత్రాన వ్యక్తిని నిరాదరణ చేయకండి. వ్యక్తిని ఆదరిస్తూ స్వభావాన్ని కావాలంటే ఎదుర్కొని మలుచుకో, లేకపోతే తప్పించుకో, ఏమైనా చేసుకో. నిరాదరణ వద్దు, నిరాకరణ వద్దు. అట్లాగే మనకి నిరాకరణ ఎలా వస్తుందంటే, మనకు తేలో, పామో కనిపించిందనుకోండి. భయం ఎందుకు వస్తుంది అంటే అందులో కూడా భగవంతుడున్నాడని గుర్తురాదు మనకి. గుర్తు వస్తే ఏం చేస్తే ఆ తేలో పామో కుట్టకుండా, చావకుండా చేయొచ్చు అనే భావన మన బుద్ధిలో నుంచి వికసిస్తుంది. పాము కనపడగానే చావకొట్టాలనే కదా immediate instinct. ఎందుకు వస్తుంది అంటే భయం వల్ల వస్తుంది. అది మనల్ని కాటేస్తుందని. కానీ సత్యానికి పాము మనల్ని కాటు వేయడానికి రాదు. దానికి ఆ program ఏమీ లేదు. ఈ వేళ వీణ్ణి  కాటేద్దాం, రేపు వాణ్ణి కాటేద్దామనే ఆలోచన మనిషి కుంది తప్ప పాముకు లేదు. పాముకు అదొక రక్షణగా భగవంతుడు దానికి ఏర్పాటు చేశాడు. మనల్ని కాటేద్దాం అనే program లేని దాన్ని మనం కాటేస్తుంటాము. చూడగానే మనం భయపడి కంగారు పడుతుంటే, అది దానికి ఏమైనా చేయబోతున్నామేమో  అని భ్రమించి పడగ విప్పుతుంది. తేలు కూడా అంతే. అందుకని మన భయం వల్ల మనం వాటిని నిరాకరించడం అనేది ఒక పద్ధతిలో ఉంటే, మరొక పద్ధతిలో నమ్మకం ఉన్నవాడు వాటిలో ముందు భగవంతుని యొక్క అస్తిత్వాన్ని చూస్తాడు. తరువాత దాని స్వభావాన్ని తెలిసి ఉంటాడు కాబట్టి దానికీ అపకారం జరక్కుండా, మనకీ అపకారం జరగకుండా పరిష్కారం చూస్తాడు. కుదరడం లేదనుకోండి భగవంతుని పేరు మీద వాడు దాన్ని తీసేయడం ఉంటుంది. అదే శ్రీ కృష్ణుడు చివరకు చేసింది. ౧౦ ఏళ్ళ పాటు వీళ్ళందరినీ రకరకాలుగా బాగుచేద్దాం అని ఎంత ప్రయత్నించినా వాళ్ళు లొంగకపోతే, సరే ఈసారికి ఈ దేహం తీసేద్దాం మళ్ళీ వస్తారు

ఎక్కడికిపోతారు అన్నట్టుగా తప్పక, యుద్ధానికి సంసిద్ధుడవుతాడు. అది ultimate step. ఎందుకంటే to remove from the body is also healing, అన్నారు. ఒక మనిషి అందులోనూ అసూయతోనూ, ద్వేషంతోనూ, బాధపడి దేహాన్నంతా పాడు చేసుకున్నాడు. సరే ఇందులో నుంచి తీసేసి వీడికి కొత్త దేహాన్నిద్దాం అనే dimension కూడా శ్రీకృష్ణుడు చూపించాడు . ఎప్పుడు చూపించాడు? ౯౦ ఏళ్ల క్షమ తరువాత చూపించాడు. యుద్ధం చేసే సమయానికి శ్రీకృష్ణునకు ౯౦ ఏళ్లు అప్పుడే యవ్వనంలోకి అడుగు పెట్టినప్పుడు చేసిన యుద్ధాలు కావవి. అర్జునుడికి ౯౦ ఏళ్లు, కృష్ణునికి ౯౦ ఏళ్లు, ధర్మరాజు ఇంకా ముసలివాడు. చిన్నప్పట్నుంచి, అంటే ఐదేళ్ల నుంచి వీళ్లకు మొదలైనాయి. ౮౦-౮౫ ఏళ్ళు భరించి ఇంక అప్పుడు ఆ నిర్ణయానికి వచ్చాడు. మహాత్ముల జీవితాలలో సన్నివేశాలు తీసుకుంటే ఆ విధంగా దర్శనమిస్తాయి. అలా చూసుకుంటూ ఉంటే నెమ్మదిగా అన్నిటి యందు భగవంతుని చూడడమనేది సాధనగా ఏర్పడుతుంది. ముందు 'ఉన్నాడు' అనేది ఈ విధంగా తెలుస్తుంది. తర్వాత ఏది చూస్తుంటే అది 'అదే' అనిపిస్తుంది. అన్నీ అదే! మనం divide చేసేస్తూ వుంటాం. మాస్టర్ గారు అలా చూస్తూ ఉండేవారు. ఒకసారి బెజవాడలో ఆయనను మధ్యాహ్నం రెండు గంటలకు ఒక ఇద్దరు interview చేయడానికి వచ్చారు. వచ్చిన వారు "మీరు ఆధ్యాత్మికంగా చాలా advance కదా, హోమియో మందు ఎందుకు ఇస్తున్నారు? హోమియో మందులు ఇవ్వకుండానే మీరు చికిత్స చేయొచ్చు కదా, ఆరోగ్యం ఇవ్వచ్చు కదా" అని అడిగారు. ఇవ్వచ్చు, అన్నారు. మరెందుకు హోమియో ద్వారా ఇస్తున్నారు? అన్నారు. అంటే మాస్టారు, 'నా దృష్టిలో హోమియోపతి కూడా ఆధ్యాత్మికతే!' అన్నారు.

Homeopathy non-spiritual అయితే కదా! హోమియోపతి ఎలా సార్ Spiritual? అని వాళ్ళు అడిగారు. అప్పుడు మాస్టర్ గారు Allopathy కూడా spiritual, అని అన్నారు. వాళ్లకు ఇంకొంచెం మతిపోయింది. అదేమిటండీ? అన్నారు వాళ్లు. మాస్టర్ గారు నవ్వుతూ ప్రపంచంలో Spiritual కానిదేమిటసలు? అని అడిగారు. What is it that is non-spiritual? భగవత్తత్వం తో తయారు కానిది సృష్టిలో ఏముంటుంది? గోధుమ పిండితో వేసినవి పూరీలు, చపాతీలు అవుతాయి. గోధుమ పిండి లేకుండా పూరి రాదు కదా. ముడి పదార్థం లేకుండా సృష్టి లేదు కాబట్టి ముడిపదార్థం అన్నిటిలోనూ వుంది కాబట్టి, what is it that is not spiritual, It is only your own classification, అని చెప్పారు, చాలా

పెద్ద ఉపదేశం! ఇది spiritual, ఇది non-spiritual, అనే divisions అన్నీ కూడా మనం చేసుకుంటాము. వెలుగు spiritual, చీకటి కాదు, అలా వుండదు. ఒకటి లేకపోతే రెండవది లేదు. పగలు లేకపోతే రాత్రి లేదు. పౌర్ణమి లేకపోతే అమావాస్య లేదు. నిద్ర పోవడం లేకపోతే నిద్ర లేవడంలేదు. ఉఛ్ఛ్వాస లేకపోతె నిశ్వాస లేదు. అన్నీ alternating currents గా వుండడం వలన ఈ సృష్టి బయటకు వచ్చింది. Negative current లేకుండా positive current తో మాత్రమే light రాదు. ఒక ఉత్తరాయణం లేకపోతే ఒక దక్షిణాయణం లేదు. నీళ్లు పైకే వెళ్ళిపోయి, ఇక కిందకి రాకపోతే వర్షమేమున్నది, మనం కూడా వాటితో పాటు పోవడమే! ఉత్తర-దక్షిణాయణాలు ఉండబట్టి కదా మనం ఉంటున్నాము. గాలి పీల్చడం వదలడం బట్టి కదా ఉంటున్నాము. పగలు రాత్రి ఉండబట్టే కదా ఉంటున్నాము. కొన్ని negate చేస్తావేమిటి? రూపాయి బిళ్ళ కావాలి కానీ దాని మీద బొమ్మే కావాలి బొరుసు అక్కర్లేదంటే? బొమ్మ కావాలి అంటే బొరుసు కూడా తీసుకోవాలి కదా! పుట్టుక కావాలంటే చావు కూడా బొరుసల్లె వెనకాలే ఉంటుంది. ఏదో ఒక రోజు నేనున్నాన్రా అని చెబుతూ ఉంటుంది. ఈ అవగాహన, that everything is spiritual, nothing is non-spiritual and everything has it’s own fitness. నిజానికి పామెందుకుండాలి సృష్టి లో అని అడగవచ్చు. నువ్వు ఎందుకు ఉండాలి? ఇలాటి ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి అంటే కొన్ని accept చేస్తూ, కొన్ని reject చేసే బుద్ధి మనలో ఉండబట్టే! భగవంతుని దృష్టిలో అలా ఉండదు. అందుకనే ‘సర్వ దర్శనః’ ఇచ్చారు. అన్నిట్లోనూ చూడరా అని. ప్రతి దాంట్లోనూ చూడగలగాలి. అది ఎప్పుడు వస్తుంది? అన్నిట్లోనూ ఉన్నాడనే 'ప్రత్యయః' అనే పదం చెప్పానే, Substitute లో Original చూడాలని. Institute the original in the place of the substitute. నా భార్య అన్న చోట మొట్టమొదట తెలుసుకోవలసింది ఏమిటంటే చైతన్యము యొక్క ఒక స్వరూపము అని గుర్తుండి, స్త్రీ అని గుర్తుండి, నీ భార్య అని గుర్తుంచుకోవాలి. నీ భార్య అని మరచి పోయినా కష్టమే! చైతన్యం ఇటువంటి స్వరూపం అని గుర్తుంచుకోకపోయినా కష్టమే! నా భార్య నా ఇష్టం వచ్చినట్లు నేను ప్రవర్తిస్తాను, అంటే నీ భార్య అంటే కొట్టుకోవడానికా? భార్య అనేది మనతో బాటుగా ఆరు రకాలైన కార్యక్రమములను నిర్వర్తించడానికి వచ్చింది. శక్తిస్వరూపిణి. ఇవన్నీ గుర్తుండాలి. అట్లా అన్ని పొరలు గుర్తుంటే 'సర్వదర్శనః' అనేది జరుగుతుంది . లేకపోతే జరుగదు. మనకి

భాగవతంలో విష్ణూపాసనగా మొట్టమొదట్లో ఇస్తారు. నీకు ఇష్టమైనవి, నీకు ఇష్టం లేనివి, సన్నివేశములు గాని, మనుషులు గాని, ప్రదేశాలు గాని, అన్నిటిలోను చూడగలవా? చూడలేనంటే తర్వాత రా, అని చెబుతారు. ఇప్పుడు కాదు, అంటారు. నీవు సృష్టించుకున్న దేవుడు, నీ మానవ సృష్టి తప్ప, నిజమైన దేవుడు కాదు. ఈ అంగీకారం లేని వాళ్ళు సృష్టించుకున్న దేవుడు, వాళ్ల మనసు నుండి పుట్టిన దేవుడు తప్ప అసలు దేవుడు కాదు. అసలు దేవుడు ఉన్నచోట అన్నిటి యందు అంగీకారం ఉంటుంది. స్వభావాలతో మనం ఏ విధంగా ప్రవర్తించాలనేది ఉంటుంది. కొన్ని స్వభావాలకు దూరంగా ఉండడం మంచిది. కాబట్టే దూరంగా ఉండడం. అంత మాత్రం చేత వాడి యందు ద్వేషం ఉండనక్కర్లేదు. వాడి యందు నిరాకరణ ఉండనక్కర్లేదు, వాణ్ని నిరాకరించనక్కర్లేదు. వాడొచ్చాడనుకోండి మనం నవ్వచ్చు. అంటే వాడి స్వభావాన్ని మనం tackle చేయకుండా, వాడి కేంద్రంతో మనం అనుసంధానం జరగడం అనేది జరుగుతూ ఉంటుంది. ఇలా జరుగుతూ ఉంటే అన్నిటి యందు భగవంతుడే కనిపిస్తుండే పరిస్థితి వస్తుంది. అది చాలా పరాకాష్ట . ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, అంబరీషుడు ఇత్యాది మహర్షులు మాత్రమే చూపించిన స్థితి. ఎదురుగా నిలబెట్టి నిన్ను చంపటానికి రెడీగా ఉన్న వాడిలో కూడా భగవంతుడినే చూడడం అనేది పరాకాష్ట. వృత్రాసురుడ్ని ఇంద్రుడు చంపలేక పోతాడు. ఎందుకంటే, వృత్రాసురుడు ఇంద్రుని నారాయణ స్వరూపునిగా చూస్తుంటాడు. ఇంద్రుడేమో వృత్రాసురుడిని శత్రువుగా చూస్తాడు. వృత్రాసురుణ్ణి చంపడానికి ఇంద్రుడు విష్ణువు గురించి తపస్సు చేసి, విష్ణువు యొక్క వరం పొంది, మళ్ళీ వస్తాడు. అయినా చంప లేడు. ఇదేమిటి విష్ణువు యొక్క వరం పొంది కూడా చంప లేకపోవడమేమిటి? ఏమిట్రా నీవు చావవేమిటి? అని అడిగితే, నన్ను నీవు చంప లేవు, అని చెబుతాడు. ఎందుకంటే నేనేమో నీలో దేవుడ్ని చూస్తున్నాను. నీవేమో నాలో చూస్తున్నావ్. ఎలా చంపగలవు? అని అడుగుతాడు. అలా ఉంటుంది ఆ 'సర్వదర్శనః' అనే సాధన. రాముడి జీవితం చదువుకునేటప్పుడు రాముడు దేవుడని చదువుకుంటే అర్థం కాదు. రాముడు మనలాంటి మనిషే అని చదువుకుంటే అర్థమవుతుంది. ఒక శత్రువు యందు, ఇష్టంలేని ప్రదేశమందు, కష్టమైన సన్నివేశంలోనూ వీరెలా ప్రవర్తించారో గమనించాలి. ప్రహ్లాదుడు, అంబరీషుడు కూడా అట్లానే ప్రవర్తిస్తారు. నారదుడు, పరాశరుడు కూడా అలాగే ప్రవర్తిస్తారు. అందుకని వారందర్నీ భాగవతోత్తములు, అన్నారు. రాముని చరిత్ర

కూడా అందులో పెట్టడంలో ఉద్దేశం అదే! రావణాసురుడు అంటే ఆయనకు ద్వేషమేమీ లేదు. ప్రకృతి ధర్మాలను అనుసరించడం లేదు కాబట్టి తీసేయాల్సి వచ్చింది తప్ప! అందుకనే మనకు రాముడు మాట్లాడేవి కొన్ని చికాకుగా అనిపిస్తాయి, మన understanding బాగుండక. యుద్ధం అయిపోయిన తరువాత సీతాదేవి వస్తున్న సన్నివేశంలో, సీతాదేవి వస్తోందని మిగతావారంతా ఆనంద పడిపోతుంటారు. అయితే ఏమిటిట? అంటాడు, రాముడు. అదేమిటండీ అందరికంటే ఎక్కువగా నిజానికి రాముడికి excitement ఉండొద్దు? ఎందుకని? తన భార్య! అది మిగతా వారి ఉద్దేశం కానీ, అది తన ఉద్దేశం కాదు. ఆయన అవగాహన అది కానేకాదు. అది తెలియటానికి మనకి బాగా సమయం పడుతుంది. మనలో బాగా అవగాహన పెరిగితే గాని రాముడు అర్థం కాడు. లక్ష్మణుడికే అవగాహన కాలేదు కదా! అదేమిట్రా అన్నయ్యా వదిన వస్తుంటే నీలో ఏమి ఉత్సాహం లేదు? అంటే 'రానీవయ్యా! అయితే ఏమిటి?' అంటాడు. అదేమిటి ఇంత యుద్ధం చేసి అంటే, యుద్ధం నేను సీతకోసం చేయలేదని చెబుతాడు. చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. సీత అంటే రాముడికిష్టం లేదా, సీత అంటే ఇష్టం లేకపోవడం కాదక్కడ. సీత తనని తాను రక్షించుకోగలిగిన శక్తి స్వరూపిణి. సీత కోసం యుద్ధం చేయనక్కర్లేదు. సీతను రావణాసురుడెప్పుడు ముట్టుకోలేడు. ముట్టుకునే పరిస్థితీ లేదు. కాబట్టి సీత కోసం యుద్ధం చేయడం కాదక్కడ. ధర్మం కోసం చేయడం. అంటే ధర్మం కోసం రావణాసురుణ్ణి చంపాల్సి వచ్చింది. చంపినా కూడా, రావణాసురుడి యందు మిగిలిన వారందరికంటే రామునికే ఎక్కువ అభిమానం. వాలిని చంపినా కూడా, మిగతా వారందరి కంటే వాలి మీద రాముడికే ఎక్కువ అభిమానం. ఎందుకని? అందరిలో ఉండే తత్వాన్ని ఎప్పుడూ చూస్తూ, స్వభావం చేత ప్రజ్ఞ బంధింపబడి ఉంది కాబట్టి. ఆ బానిసత్వం లో ఉన్న ప్రజ్ఞని విడుదల చేయడానికి చేసే కార్యక్రమమే తప్ప, వాణ్ణి చంపాలనే భావన ఉన్న వాడు కాదు. సీతాదేవి విషయంలో రాముడేమని చెప్తాడంటే, ఏది ధర్మమో రాజుగా అది చేయాలి కాబట్టి నేను చేశాను. కానీ, సీతను రక్షించడమేమిటి పిచ్చి మాట, అంటాడు. సీతామహాలక్ష్మి, ఆవిడ గురించి రామునికి, రాముని గురించి సీతకే తెలియాలి తప్ప, మిగతా వారు అంచనా వేయలేరు. అందుకని సీత ఏమైపోతుందో అనే బాధ లేదు ఆయనకి. ఇంకా భరతుడి యందు కాస్తో కూస్తో ఉంటుంది. సమయానికి వెళ్లకపోతే భరతుడు అక్కడ ప్రాయోపవేశం చేస్తాను,

అంటాడు కాబట్టి. కానీ సీత విషయంలో అట్లా ఉండదు. చూశారా? రాముడికి, సీతకి ఎడబాటంటూ ఏమీ లేదు. మనకి మొత్తం కథంతా ఎడబాటు గానే ఉంటుంది. ఎందుకుంటుందంటే మనకా స్థితి తెలియక. ఇవాల్టికి కూడా ఆదర్శ దంపతులెవరయ్యారు? అంటే 'సీతారాములు' అంటాము. సీత పేరు పెట్టుకుంటే కష్టాలవీ వస్తుంటాయి, అని అంటుంటారు. కానీ సత్యం ఏమిటంటే రామునియందెప్పుడు సీత ఉంటుంది, సీతయందెప్పుడు రాముడు ఉంటాడు. కావున వారికి వియోగమనే ప్రసక్తే లేదు. ఒకళ్ళకొకళ్ళు ఉండడమే! భౌతికంగా విడిగా ఉన్నంత మాత్రాన మానసికంగా విడి ఉన్నట్లు కాదు. సీత హృదయమునందు రాముడు ఎప్పుడూ ఉంటాడు. రాముని హృదయమందు సీత ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి వారికి వియోగము లేదు. ఒకరి శక్తి సామర్థ్యములు ఇంకొకరికి తెలుసు. సీతాదేవి కావాలనుకుంటే రావణాసురుణ్ణి అక్కడే భస్మము చేయగలిగిన స్థితి వున్నప్పటికీ, రాముని కోసం wait చేస్తూ ఉంటుంది. ఎందుకంటే ధర్మం ప్రకారం రాముడు ఆ పని చేయాలి కాబట్టి! అలాగే హనుమంతుడే చేసెయ్య గలడు ఆ పని, కానీ ధర్మం ప్రకారం రాముడు చేయాలి. ఇట్లా ఉంటాయి. ధర్మాన్ననుసరించడం అనే కార్యక్రమంలో వాళ్ళు చూపించిన ప్రవర్తన మనకు ఆధారం, చదువుకునేటప్పుడు. అంతేగాని ఊరికే పొగుడు కోవటం కోసం చదువుకుంటే అవ్వదు. ఇట్లా ప్రతి విషయంలోనూ వారు దర్శించి, జీవించారు. మనం కూడా అట్లా దర్శించి జీవించటానికి ప్రయత్నం చేయాలి. ఇది నిత్యజీవితంలో ఎంత practice చేసుకుంటే మనలో అంత విచ్చుకుంటుంది. ఈ విషయం మనకు కొత్త కాదు. To see in all, అనేది తప్పదు. ఎందుకంటే మొత్తం picture అంతా అదే! నీవు ఎన్ని చదువుకున్నా waste రా, అని చెబుతాడు శ్రీకృష్ణుడు జ్ఞానయోగంలో. నన్ను మర్చిపోయి నీవు చదువుకుంటే ఏం ఉపయోగం లేదు, అని చెబుతాడు. నన్ను గుర్తుపెట్టుకో! నేను దగ్గరుండి అన్ని చదివిస్తాను. నన్ను మర్చిపోయిన వాడికన్నీ సమస్యలే అవుతాయని. కాబట్టి ఈ సర్వదర్శనః అనే పదంలో మనం ముందు ఈ పెద్దలు చెప్పిన గ్రంథస్థమైన పద్ధతుల్లో నమ్మకం ఏర్పరుచుకుని, సర్వదర్శనం చేయడానికి ప్రయత్నించాలి. అలా అయితే మనకు 'శమము' అనేది చాలా చక్కగా అబ్బుతుంది. చీటికి మాటికి చిరాకు పడని స్థితి వస్తుంది. దానిని 'ఆసనము' అన్నారు పతంజలి మహర్షి. ఆసనం స్థిరంగా, సుఖంగా ఉండాలని చెప్పారు. అంటే స్థిరంగా ఉండాలి కాబట్టి మంచి కుర్చీ, సుఖంగా ఉండాలి కాబట్టి

అందులో Dunlop pillow అలా కుదరదు. ఇక్కడ చిత్తము స్థిరంగా ఉండాలి. ఆసనం సుఖంగా ఉండాలి. మనకు దాంతో కథ అయిపోయిందనిపిస్తుంది. కానీ నిజంగా అసలు కథ అక్కడ నుంచే మొదలు. ఈ మూడవ step చేరేసరికి కథ అయిపోయినట్లనిపిస్తుంది. కానీ అక్కడ నుంచి ఉంటుంది. ఏ విధంగా అంటే నిశ్చలంగా వుండే కోనేటిలో ఆకాశంలో వుండేవి ఏవిధంగా ప్రతిబింబిస్తాయో అలా. నిర్మలమైన నీళ్ళలో అడుగున వుండే రాళ్ళు, బెడ్డలు దగ్గర నుంచి కనిపిస్తాయి కదా! అంటే లోపల బయట వున్న నిశ్చలమైన సరస్సులో ఏ విధంగా దృగ్గోచరమవుతాయో, నిశ్చలముగా చేయబడిన మనస్సునందు అన్నీ భాసిస్తాయి. లేకపోతే ఏమీ భాసించదు. Stable mind and comfortable attitude వుండాలి. Comfortable attitude అంటే వాడియందు మిగిలిన వారికి comfort కనబడాలి. అంత ఉంటుంది. వాడి దగ్గరకు చేరేసరికి మిగతా వారికి వారి కష్టం తొలగినట్లు అనిపిస్తుంది అన్నమాట. ఏమిటో నుండి గురువుగారి దగ్గరకు వెళితే మన కష్టాలు చెప్పుకోవడానికి, కష్టాలేవి గుర్తుండవు. అని చెప్పే వాళ్ళు ఎంతమంది లేరు? ఎందుకని? ఆయన అందరికీ తన సాన్నిధ్యంలో కష్టమనేది మరిపింపచేస్తాడు. వెంకటేశ్వర స్వామి కోవెలకు వెళ్ళినపుడు, గుడిలో దేవుణ్ణి చూసే సమయానికి మన కోరికలు గుర్తురావు. ఆ ప్రక్కవాడు తోసేస్తూ ఉంటే చూడడానికి time సరిపోదు. చెప్పుకోడానికి time ఏది? అట్లా ఒక మహాత్ముడు యొక్క సాన్నిధ్యంలో సుఖం ఉంటుంది. మనసు స్థిరంగా ఉంటుంది. మనక్కూడా స్థిరము, సుఖము అనే స్థితి అబ్బాలంటే ఇది base అన్నమాట. అక్కడకి మూడు మెట్లు ఎక్కినట్టే. ఆ తర్వాతే ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానం, సమాధి. ఇవన్నీ లేకుండా నేను ధ్యానంలో కుర్చున్నానంటే ఏమిటి అర్థం? ఎవరి కోసం కూర్చున్నట్లు? అందుకని మనస్సు స్థిరం, సుఖము పొందాలంటే, అన్ని సన్నివేశాల్లోనూ, అన్ని పరిస్థితుల్లోనూ, అన్ని చోట్ల, అందరిలోనూ ఆయన్ని/భగవంతుడ్ని గుర్తించడం అనే ఒక కార్యక్రమం పెట్టుకుంటే అక్కడ నుంచి next step.

స్వస్తి

భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడటం అనేది, మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకొని భగవత్ అనుభూతిని పొందటానికి ఒక సులభమైన మార్గం, మనకి కలియుగంలో భగవంతుడైన శ్రీకృష్ణుడు ఇచ్చిన మార్గం. ఏకాదశ స్కంధం చూసుకున్నట్లైతే కలియుగంలో అతి సులభమైన పద్ధతిలో భగవంతుడి అనుభూతి పొందటానికి అవకాశం ఎక్కువగా వున్నదని తెలుస్తోంది. కారణం ఏమిటంటే, ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్థ్యములు కలియుగంలో మానవుడికి ఉండదు కాబట్టి కొంత అలసత్వం కొంత మంద బుద్ధి వుండటం వలన, స్తోత్రాదుల ద్వారా భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకోడం ద్వారా, సులభముగా తన్నుతాను పవిత్రీకరించుకొని, భగవంతుని యందు నిలబడడానికి అవకాశము ఏర్పడుతుంది, అని శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చెప్పడం జరిగింది. ఆ మార్గంలోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు మనకి భగవతి పేరున, భగవంతుని పేరున యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ వున్నట్లయితే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికంగా భగవంతుని నామ పారాయణం చేసుకోడం ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి.

దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకుంటూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించడానికి భక్తి శ్రద్ధలతో ప్రయత్నం చేయాలి. భగవంతుని ఈ మార్గంలో అనుభూతి చెందడానికి శ్రద్ధ, ఓర్పు బాగా కావాలి. ఓర్పు చాల అవసరమైన విషయము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ వుంటుంది. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుంటుంది. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకుంటూ మనం మనని పవిత్రీకరించుకుంటూ, కాలం యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించడానికి అవకాశం కల్పించుకోవాలి.

-కంభంపాటి పార్వతి కుమార్